# అశుద్ధ భారత్

భాషా సింగ్

# కనపడ(నివ్వ)నిది భారతదేశం

## పాకీ పనివారి వాస్తవ స్థితిగతులు

భాషా సింగ్

తెలుగు అనువాదం :

సజయ

హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర : రూ. 100/-

మొదటి ముద్రణ : మే 2016

వెనుక అట్ట మీద బొమ్మ :

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006.
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్ – 28 ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# విషయసూచిక


ముందుమాట –బెజవాడ విల్సన్ v

పరిచయ వాక్యాలు –కాథరినా డె అల్బ్యూకెర్క్యూ x

కృతజ్ఞతలు xii

ప్రారంభం –నేను పాకీ జర్నలిస్టుని ఎలా అయ్యాను xiii

**మొదటి భాగం**

**కనిపించని భారతదేశం**

**కశ్మీర్ :** మా దుస్థితి గురించి పట్టించుకోవటానికి ప్రభుత్వానికి అసలు సమయమే వుండదు. దాని ప్రాధాన్యతల ముందు మా సమస్య ఒక విషయంగా కూడా అనిపించదు' 1

**ఢిల్లీ :** 'మేము మా కుల గుర్తింపును ఎంతగా వదిలించుకోవాలనుకుంటున్నామో, అది మరింతగా కమ్ముకుంటోంది' 23

**బీహార్ :** 'ఏదో ఒక మత్తుమందు ప్రభావం వుంటే గానీ ఈ మురికి పని చేయలేరు' 33

**పశ్చిమ బెంగాల్ :** 'ఎక్కువ డబ్బులిస్తే మీరు ఈ పని చేస్తారా?' 44

**హర్యానా :** 'సంవత్సరం క్రితమే నేను ఈ పనిని వదిలేశాను, కానీ ఆ కంపు మాత్రం నన్నొదిలి పోలేదు' 56

**ఉత్తరప్రదేశ్ :** 'తప్పంతా ప్రభుత్వానిదే. ఒకపక్క మురుక్కాలువలూ (సివర్స్) ఏర్పాటు చేయదు. ఇంకోపక్క మాకు ఏవిధమైన పునరావాసం కల్పించదు' 67

**గుజరాత్ :** 'అరవయ్యేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా పాఠశాలల్లో పాకీదొడ్లు కడగమని ఇంకా మమ్మల్ని అంటూనే వున్నారు' 75

**రాజస్థాన్ :** 'నీకు పాకీపని చేయాలని లేకపోతే, మరి ఈ ఇంట్లో నువ్వెందుకుంటున్నట్లు?' 91

**మధ్యప్రదేశ్ :** 'వివక్ష ప్రతిచోటా వుంది. మదర్సాలలో, మసీదుల్లో, చివరకు మా స్మశానాలు కూడా వేరుగా వుంటాయి' 101

**ఆంధ్రప్రదేశ్ :** 'వారంతా నాకు బాగా తెలుసు, అందుకే
నా అంటరానితనాన్నే ఆయుధంగా మలుచుకుని వారికి సవాలు విసిరాను' 119

**కర్నాటక :** 'నరకం కూడా దీనికన్నా ఘోరంగా వుండి వుండదు.
నేను బతుకుతున్నందుకు సిగ్గుపడుతున్నాను' 132

**తమిళనాడు :** పాకీగుంటల్లో హత్యలు! అసలు నేరస్థులు ఎవరు?

**రెండో భాగం**

అధికారం తలుపుల్ని తట్టడం గడప వరకూ వచ్చిన పాదాలు 157

భారతీయ రైల్వేలూ పాకీపని రైలుకట్టల మీద మురికి
పియ్యిపెంటలు, మురికి హృదయాలు 165

ప్రభుత్వం చెప్పే అసత్యాలను బహిర్గతం చేయడం 176

పేరులో ఏముంది! 185

**జతపరిచినవి**

పాకీపనికి ఇచ్చే నిర్వచనం 194

కనిపించని పాకీవాళ్ళను గుర్తించటం 195

పాకీపనిపై చారిత్రిక దృక్పథం 196

ఎత్తుడుదొడ్లు (డ్రై లెట్రిన్లు) 197

2013, అశుభ్రమైన వృత్తుల్లో వున్న మొత్తం వ్యక్తుల సంఖ్య 201

భారతదేశంలో పాకీ సమూహంతో కలిసి పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థలు

**తెలంగాణ :** పియ్యిపెంటల నరకంలో పడేసి చంపేయాలనే కుట్ర 203

ఉపయుక్త గ్రంథాలు

## ముందుమాట

# మరుగున వున్నవారిని వెలికితీసే ప్రయత్నం

పాకీపని విధానం గురించి చర్చించిన ఎన్నో పుస్తకాలను నేను చూశాను, చదివాను కూడా. అది ఒక అమానవీయమైన విధానం కావటంతో చాలామంది అందులోని క్రూరత్వం గురించి రాయటానికే ఎక్కువ ఆసక్తి చూపించారు. అలాంటి అనేక పుస్తకాలలో దృష్టంతా కూడా ఎత్తుడుదొడ్ల (డ్రై లెట్రిన్లు)ను ఏవిధంగా ఆధునీకరించడం అనే దానిపైనే కేంద్రీకృతమై వుండేది. 'అన్‌సీన్: ది ట్రూత్ అబౌట్ ఇండియాస్ మాన్యువల్ స్కావెంజింగ్' మాత్రం మిగతా అన్ని పుస్తకాల కంటే కూడా ఎంతో విభిన్నమైంది. ఎందుకంటే – ఈ పుస్తకం ముఖ్యంగా పాకీపని విధానంలో వున్న మనుషుల గురించి చర్చిస్తుంది. తరాల తరబడి ఈ అమానవీయమైన విధానానికి బలైన పాకీ సమూహానికి చెందిన వారి గురించి మాట్లాడుతుంది. ఈ పుస్తకం మా జీవితాలను, పోరాటాలను ఎత్తి చూపింది. అలాగే మా జీవితాల్లోని రెండు ముఖ్యమైన అంశాలను ఈ పుస్తకం బలంగా ముందుకు తెచ్చింది. మొదటిది: మా జీవితాలను, ఆలోచనలను ఈ కులపరమైన విధానం ఎంత బలంగా నియంత్రించగలదో కళ్ళకు కట్టించింది. రెండు: ఈ పని నుంచి మేము విముక్తమవ్వాలని ఎంత బలంగా కోరుకుంటున్నామనే ఆకాంక్షను వెలికితీసింది. మరీ ముఖ్యంగా మా సమూహంలోని ఆడవాళ్ళు ఈ నరకం నుంచి బయటపడాలని ఎంతగా కోరుకుంటున్నారో, తమ చేతులతో ఎత్తుడుదొడ్లను కూలగొట్టడానికి ఏ విధంగా ముందుకువచ్చారో, పియ్యిపెంటలతో నిరంతరం నిండే బుట్టలను ఎలా తగులబెట్టారో, ఈ క్రమంలో వారి జీవిత సహచరులైన మగవాళ్ళు కూడా ఏరీతిగా వారికి సహాయపడ్డారో ఈ పుస్తకం విస్పష్టంగా వెలుగులోకి తీసుకువచ్చింది.

నేటికీ కొనసాగుతున్న పాకీపని విధానం ఈ సమూహంలోని మనుషులను ఏ విధంగా ధ్వంసంచేసిందో, ఒక తీవ్రమైన జీవన అభద్రతకు ఎంతలా గురిచేసిందో మనమెవ్వరమూ గుర్తించను కూడా గుర్తించలేకపోతున్నామని 'అన్‌సీన్' పుస్తకం స్పష్టంగా చెప్పింది. తోటి మనుషుల పియ్యిపెంటలను తమ చేతులతో ప్రతిరోజూ ఎత్తవలసి రావటం అనే అసహ్యకరమైన విధానం ఒక ఫ్యూడల్ అణిచివేతకు చిహ్నం. ఈ క్రమంలోనే అత్తలు కొత్త కోడళ్ళకు మొదటి బహుమతిగా తమ భాగంలోని కొంత 'జజ్‌మని' ని అప్పగిస్తారు. దీనర్థం ఏమిటంటే తాము శుభ్రంచేసే ఎత్తుడుదొడ్లలో కొన్నిటిని తమ కోడళ్ళకు వారసత్వంగా అందజేయటం అన్నమాట! ఈ పరంపరలో భాగంగా తమ కోడళ్ళకు పాకీబుట్టను, చీపురును ప్రథమ కానుకగా ఇవ్వటాన్ని చాలా గర్వంగా భావిస్తారు అత్తలు. ఇలాంటి ఎన్నో సంఘటనలను నేను కళ్ళారా చూశాను. ఒక సాధారణ కుటుంబంలో అత్తలు ఏ విధంగా అయితే కొత్తగా వచ్చిన కోడళ్ళకు బాధ్యతలను అప్పగిస్తారో

ఇది కూడా అలాంటిదే. పాకీ పని చేసే కుటుంబాలలో ఈ అణిచివేత ఒక తరం నుంచి ఇంకో తరానికి సంక్రమిస్తూ మొత్తం సమూహాన్నే బాధితులుగా మారుస్తుంది. పితృస్వామ్య కులపీడన కావాలనే వారిని ఈ ఊబిలోకి తోసిందనే వాస్తవం వీళ్ళకు తెలిసే అవకాశం లేదు. ఇలాంటి ఎన్నో మరుగునపడిన అంశాలను ఈ పుస్తకం బహిర్గతం చేసి విస్పష్టంగా చర్చించింది.

నేను నా జనం దగ్గరికి వెళ్ళి వాళ్ళు ఏం పని చేస్తున్నారని అడిగితే వచ్చే సమాధానం ఏమిటో తెలుసా? 'మా పని మేం చేస్తున్నాం' అనే. మళ్ళీ అదే ప్రశ్న వేస్తే వారి నుంచి వచ్చే తిరుగు సమాధానం 'నీకు తెలీదా మేం ఏం చేస్తున్నామో? మేము పాకీపని చేస్తామని నీకు తెలుసు కదా!' అంటారు. మొత్తం సమూహమంతా కూడా ఇతరుల పియ్యిపెంటలను ఎత్తటమే తమ పని అని ఎలా అంగీకరించగలిగారని నాలో ఆలోచన రేకెత్తింది. ఈ ఆలోచనే ఎంతో బాధాకరమైంది. తరాలతరబడి తమమీద జరుగుతున్న అణిచివేతను కనీసం ప్రశ్నించను కూడా ప్రశ్నించకుండా ఈ ప్రజలు దానికి తలొగ్గి పనిచేయడమనేదే ఒక పెద్ద కుట్రలో భాగం. ఈ కుట్రకు ప్రాణంపోసింది కులవ్యవస్థ. అది పాకీవాళ్ళను నిరంతరం అణిచివేతలో వుంచుతుంది. 'పాకీ సమూహం తలరాత అలావుంది, ఈ పియ్యిపెంటలను ఎత్తిపోసే బాధ్యత వారిదే అని మిగిలిన సమాజం అంతా భావిస్తే, పాకీ సమూహమేమో ఇతరుల పియ్యిపెంటను ఎత్తివేయటం తమ బాధ్యత అని భావిస్తారు!' సంక్లిష్టమైన ఈ పరిస్థితిని ఏ విధంగా అర్థం చేసుకుంటాం? ఈ చిక్కుముడిని ఎవరు విప్పగలుగుతారు? ఎవరు దీన్ని బద్ధలుకొడతారు? ఈ బాధ్యత వేరేవాళ్ళదని పాకీసమూహం భావిస్తే, కాదు ఈ బాధ్యత పాకీ సమూహానిదే అని సమాజమూ, ప్రభుత్వము భావిస్తున్నాయి. మేము ఏమను కుంటున్నామంటే రెండువైపుల నుంచి ఆ ప్రయత్నం జరగాల్సిన అవసరం వుందని! ఇక్కడే భాషాసింగ్ పుస్తకం మొదలవుతుంది. ఈ కుట్రను ఛేదించే క్రమంలో నిరంతరం నా ప్రజలు ఈ దుర్మార్గమైన వాస్తవాన్ని ఏ విధంగా సహించుకుంటూ వస్తున్నారో 'అన్‌సీన్' విపులంగా అర్థం చేయిస్తుంది.

అమానవీయమైన, చట్టవిరుద్ధమైన ఈ పనిని అంతమొందించటానికి అట్టడుగుస్థాయి నుంచి మొదలైన మా చైతన్యాన్ని ఈ వ్యవస్థ గుర్తించనప్పటికీ, విముక్తి కోసం సాగుతున్న మా పోరాటాన్ని విస్మరించటం మాత్రం అసాధ్యం. ఎన్నో తరాలపాటు మేము ఇళ్ళ వెనుకవైపు నుంచి మాత్రమే వెళ్ళి పియ్యిపెంటలను ఎత్తి, పాకీదొడ్లను శుభ్రం చేశాం. ముఖద్వారం నుంచి ప్రవేశం మాకు నిషిద్ధం. మమ్మల్ని ఎంతో కాలంపాటు అలా వుంచేసిన ఆ కనిపించని గోడల్ని గుర్తించి బద్ధలు కొడుతున్నాం. మాకు సానుభూతి అవసరం లేదు. ఆత్మగౌరవం, స్వావలంబన కోసం మా పోరాటం కొనసాగుతుంది. మా ఈ పోరాటానికి సహకరించాల్సింది పోయి ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, సమాజం అందరూ కూడా మా దారిలో ఎన్నో అవరోధాలు సృష్టిస్తున్నారు. పాకీపని విధానాన్ని సంపూర్ణంగా

నిర్మూలిస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఈ రోజుకి కూడా తాము పెట్టిన కాలపరిమితుల్ని తామే ఉల్లంఘిస్తున్నాయి. గత ఇరవై సంవత్సరాలుగా కనీసం తొమ్మిదిసార్లు ఈ విధంగా జరిగింది. కానీ, కామన్‌వెల్త్ క్రీడల కోసం పెట్టిన గడువుని అవి ఆ విధంగా ఉల్లంఘించ గలుగుతాయా? ఢిల్లీ మెట్రోప్రాజెక్టుని అలా సంవత్సరాల తరబడి వాయిదా వెయ్యగలరా? కామన్‌వెల్త్ క్రీడలప్పుడు చోటుచేసుకున్న అవినీతి వల్ల ఏర్పాట్లలో రోజుల తరబడి జాప్యం జరిగినప్పటికీ, అనుకున్న సమయానికే ఆ పోటీలను నిర్వహించారు. అలాంటి వాటికి ఏ విధమైన అడ్డంకులూ లేవు. జరిగిన లోపాల కారణంగా తాము పోటీలను నిర్వహించలేమని ప్రభుత్వం ఎక్కడా ప్రకటించలేదు కూడా. మరి పాకీపనిని అంతమొందించటానికి సంవత్సరాల తరబడి వాయిదాలు వేసుకుంటూ ఎందుకు వెళ్తున్నారు?

1993లో పాకీ పనిని నిషేధిస్తూ చట్టం వచ్చింది. మరి, ఈ ఇరవై రెండేళ్ళలో 625 మంది జిల్లా కలెక్టర్లలో ఒక్కరంటే ఒక్కరు కూడా చట్టాన్ని ఉల్లంఘించిన వారి మీద కేసు నమోదు చేయలేదు. ఈ రెండున్నర దశాబ్దాలలో సఫాయి కర్మచారి ఆయోగీ నివేదికను పార్లమెంటులో ఎందుకని ప్రవేశపెట్టలేదు? ప్రస్తుతం వున్న 750 మంది లోక్‌సభ సభ్యులు, అంతకు ముందు పనిచేసిన వందలాది మంది సభ్యులుకానీ ఈ విషయమై తమ సహానుభూతిని వ్యక్తంచేస్తూ నిరంతరం ఒక వత్తిడిని లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేక పోయారు? ఈ అనాగరికమైన విధానానికి నిర్ణీత కాలవ్యవధిలో చరమగీతం పాడాలని ఒక్కరంటే ఒక్కరు కూడా ఎందుకని నినదించలేకపోయారు? దీనిమీద చర్య తీసుకోవాలని ప్రభుత్వంపై ఎందుకని వత్తిడి పెట్టలేక పోయారు?

1993 లో చట్టంవస్తే ఆ తర్వాత పదేళ్ళనుంచీ ఈ అమానవీయ విధానాన్ని అంతంచేయమని, ఎత్తుడు దొడ్లను కూల్చమని అడుగుతూ ఇప్పటికీ మేము అధికారుల తలుపులు తడుతూనే వున్నాం. ఈ విధంగా అనేక సంవత్సరాలు గడిచిన తర్వాత 'ఏ చట్టమూ కూడా తనంతట తాను పనిచేయదు. దాన్ని ముందుకు తోయటానికి ప్రజాబలం ఎంతో అవసరం' అన్న డా. బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన మాటలు మా గ్రహింపుకి వచ్చాయి. మేమంతా సమష్టిగా 2003లో సుప్రీంకోర్టు తలుపుల్ని తట్టాం. కానీ కోర్టు మాకు న్యాయం అందించాల్సింది పోయి, మా భారాన్ని మరింత పెంచింది. ముందుగా అబద్ధపు అఫిడవిట్లను సమర్పిస్తున్న అధికారులను శిక్షించకపోగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్న అసత్యాలను నిరూపించాల్సిన బాధ్యతను కూడా మా మీదే మోపింది. దశాబ్దం పాటు సాగిన విచారణ తర్వాత మాకు న్యాయం చేయటానికి తనకు సమయం లేదని కోర్టు తేల్చి చెప్పింది. ఈ విధంగా సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన బలహీనవర్గాలకు సాయంచేయటానికి న్యాయవ్యవస్థ పూనుకోవడానికి న్యాయమూర్తులు ఎందుకని అంగీకరించం లేదు...?

ఈ సమూహం ఎదుర్కొంటున్న కష్టాల గురించి సమాజానికి కనీసమైన అవగాహన లేదు. 'ఈ పాకీపని ఏమిటసలు? ఎక్కడుంది?' అని ఈ రోజుకి కూడా చాలామంది

నన్నడుగుతుంటారు. ప్రతిరోజూ సఫాయి పని వాళ్ళు శుభ్రంచేయటం, పియ్యిపెంటలను ఎత్తిపోయటం వారు చూస్తూనే వుంటారు. ఆ పని చేస్తున్నవాళ్ళు కనిపించగానే ముక్కు మూసుకుని, పక్కకు తిరిగి దూరంగా నడుచుకుంటూ వెళ్ళిపోతారు. ఒక సమూహం తరాల తరబడి ఈ భారాన్ని ఎందుకు మోయాల్సివస్తోందని, వారు ఊపిరి కూడా స్వేచ్ఛగా ఎందుకు తీసుకోలేక పోతున్నారని వీళ్ళు కనీసం ఆలోచించడం గానీ, ప్రశ్నించుకోవటం గానీ చేసివుండరు. ఈ ప్రశ్న వారినెందుకు ఇబ్బంది పెట్టడం లేదు?

అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే మిగిలిన దళిత సమూహాల్లో ఈ అంశం పట్ల కనీసమైన సహానుభూతి, సున్నితత్వం లేకపోవటం. పాకీ పనివాళ్ళు దళిత సమూహానికే చెందినప్పటికీ దళిత ఉద్యమాలు ఎప్పుడూ పాకీపని వాళ్ళ విముక్తి కోసం ముందుండి పోరాడలేదు. ఎందుకని? సమాధానం ఒక్కటే ! అదేమిటంటే పితృస్వామ్య కులస్వభావ ఆలోచనా ధోరణులు. విషయాలను కులస్వభావంతో కూడిన ఆలోచనా ధోరణితో చూసినప్పుడు మనకు ఏ సమస్యా అనిపించదు. ఈ పుస్తకంలో భాషాసింగ్ వాటి ముసుగు తీయటానికి ప్రయత్నించారు. పొరలు పొరలుగా ఉండి పైకి కనిపించని అనేక విషయాలు ఈ పాకీపని కొనసాగే క్రమంలో ఎలా దాగివున్నాయో ఈ పుస్తకం బహిర్గతం చేసింది.

ఈ పుస్తకం పేరే దీనికి ఒక నిదర్శనం. ఈ దేశంలో మరుగునపడిపోయి కనిపించకుండా వున్న ఒక సమూహపు ప్రజల గురించి మనం మాట్లాడుతున్నాం. అయితే, ఇతర ప్రజలు ఈ పాకీ పనివాళ్ళను చూడటం లేదా అంటే, కళ్ళతో చూస్తూనే వున్నారు. కానీ వాళ్ళ ఉనికిని గుర్తించాలనుకోవటం లేదు. మతం, కులం, అధికార యంత్రాంగం, ప్రణాళికలు, రాజకీయాలు ప్రతిచోటా వాళ్ళ ఉనికిని నిర్లక్ష్యంచేయటం వెనుక ఒక కుట్ర దాగివుంది. అందుకే భాషాసింగ్ లాంటి వాళ్ళు కనిపించని భారతదేశమనే ఈ చేదువాస్తవాన్ని వెలికితీయటానికి చేసే ప్రయత్నాలకు ఈ వ్యవస్థ తనదైన వ్యతిరేకతతోనే ప్రతిస్పందిస్తుంది. ఈ విషయాలపై సున్నితంగా స్పందించి పనిచేసే వాళ్ళు, ఈ ప్రజల విముక్తి గురించి ఆందోళన చెందేవాళ్ళని కూడా ఈ వర్గానికి, ఈ కులానికి చెందిన వారిగానే తలచి అదే ముద్ర వేస్తారు. ఎవరైనా ఒకరు ఒక అంటరాని వ్యక్తి దగ్గరికి వెళ్తే వారిని కూడా అంటరాని వ్యక్తిగానే పరిగణిస్తారు. ఇదీ కులవ్యవస్థకున్న క్రూరమైన అనాగరిక స్వభావం. ఇలాంటి జర్నలిస్టులను ఎగతాళిచేయటం, వాళ్ళ పనిని, రాతలను తక్కువచేసి చూడటం, వాళ్ళని 'పాకీ జర్నలిస్టులుగా' ముద్రవేయటం – ఇదంతా కూడా ఆ క్రూరమైన స్వభావం వల్లే జరుగుతుంది. ఈ క్రమంలో భాషాసింగ్ ఎంత ఒత్తిడికి గురయ్యారో, వృత్తిపరమైన ఎన్నో సవాళ్ళను ఎలా ఎదుర్కోవాల్సి వచ్చిందో నాకు బాగా తెలుసు. అయినప్పటికీ ఆమె పాకీపనిని నిర్మూలించడం కోసం సాగుతున్న ఉద్యమంతోనే కలిసి నిలబడింది. కేవలం ఈ దృఢసంకల్పంతోనే ఆమె ఈ అంశం మీద ఎన్నెన్నో విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ ఈ పుస్తకాన్ని పూర్తిచేయగలిగారు.

పుస్తకం రాసే క్రమంలో భాషాసింగ్ పాకీపని నిర్మూలనా ఉద్యమంలో భాగమైపోయారు. శ్రమ అనుకోకుండా ఆమె చేసిన ప్రయత్నాల వల్లనే సఫాయి కర్మచారి ఆందోళన ఉత్తర భారతదేశంలో తన పోరాటాన్ని విస్తరించగలిగింది. ఇంతకాలం మరుగునపడిపోయిన ఎన్నో అంశాలను ఈ పుస్తకం బహిర్గతం చేసినందుకు నేను చాలా సంతోషపడుతున్నాను. ఇది ఇంగ్లీషులో రావటం వల్ల విధాన నిర్ణేతలను, వాటిని అమలు పరిచేవారిని ప్రభావితం చేయగలుగుతుందని, ఈ సమూహపు జనుల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటంలో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. అలాగే అత్యధికులకు ఈ పుస్తకం చేరుతుందని, ఈ అమానవీయ విధానం పట్ల వారిలో చైతన్యం కలిగిస్తుందని ఆశిస్తున్నాను. అంతకంటే మించి ఈ ప్రజల ఆకాంక్షలను ఒకచోట కూర్చి పాకీపనికి వ్యతిరేకంగా మరిన్ని ఉద్యమాలకు ప్రేరణకావాలని, ఒక మంచి మార్పుకు ఇదొక పనిముట్టుగా మారాలని కోరుకుంటున్నాను. ఒక అసాధారణ అఖిల భారతాన్ని ఆవిష్కరించటంలో మార్గదర్శిగా ఈ పుస్తకం వుంటుందని నమ్ముతున్నాను, సంపూర్తిగా విశ్వసిస్తున్నాను.

ఆగస్టు 2013

**బెజవాడ విల్సన్**
సఫాయి కర్మచారి ఆందోళన్

# పరిచయ వాక్యాలు

నిశ్శబ్దాన్ని బద్ధలుకొట్టిన అతిముఖ్యమైన ఈ 'అన్‌సీన్' పుస్తకాన్ని పరిచయం చేసే అవకాశం కలిగినందుకు నేను సంతోషపడుతున్నాను. గౌరవంగా భావిస్తున్నాను. అణగారిన వర్గంగా సమాజంలో దూరానికి నెట్టివేయబడటమే కాక, పాకీ పనివాళ్ళు అనే సమూహంగా ముద్రవేయబడిన వారి అనుభవాలు, వారి దుస్థితి గురించి ఆలోచించటం అనేక సంవత్సరాలుగా నా వృత్తిలో ఒక భాగంగా వుంది.

ఈ తరహా ముద్రవేయబడిన పాకీవాళ్ళు ఒక ప్రతికూలమైన నిశ్శబ్దంతో వుంటారు. దీనితో ఈ సమూహంమీద వెలివేత అమలవుతూ వారి అవసరాలనేవి సమాజంలో కనిపించకుండా పోతాయి. కాలక్రమంలో ఈ ముద్రలు వారి లోలోపలికి జీర్ణమైపోగా, గడ్డకట్టిన నిశ్శబ్దం మరింత విస్తృతమవుతూ తమ సమస్యలను వెలికి తీసుకురాలేని నిస్సహాయత ఏర్పడటం ఒక వాస్తవం. ఈ నిశ్శబ్దం ఫలితమే, వాళ్ళ ఉనికి కనిపించక పోవడం. వారి గురించి ఆలోచన మొలకెత్తకపోవడం. వారి సమస్యలను ఎవ్వరూ పట్టించుకోరు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇదంతా కూడా మానవ హక్కుల ఉల్లంఘనే.

చాలామంది పాకీపనివాళ్ళు వ్యక్తులుగా ఇదే ముద్రలను మౌనంగా భరిస్తుంటారు. ఒక వెలివేతతో పాటు నిర్లక్ష్యం చేయడం, తిరస్కారం, ఏకాకితనం, కలుపుకోకపోవటం, గుర్తించకపోవటం, నిందలువేయటం, అణిచివేత, శారీరక హింస - ఇలాంటివి ఎన్నో అనుభవిస్తారు. 'ఏదన్నా ఒక ముద్రతో వున్న వ్యక్తి పరిపూర్ణ మానవుడు కాదు' అనే అభిప్రాయంతో సమాజం వారిని విలువలేని వారిగా పరిగణిస్తుంది. వారిపట్ల, ఆ సమూహం పట్ల అమానవీయంగా వ్యవహరిస్తుంది. వారిపైవున్న ముద్రరీత్యా మనుషులుగా వారికి ఇవ్వవలసిన గౌరవాన్ని కూడా ఇవ్వదు.

వ్యవహారంలోకి వచ్చేసరికి-తమపైవున్న ముద్రలవల్ల సామాజిక అధికారంలో వీరికి సమవాటా దక్కదు. ఈ అంశమే వ్యవస్థాపరంగాను, సామాజిక అంశాలపరంగానూ వివక్షని మరింత పెంచిపోషించి-చివరికది ఈ సమూహంపట్ల తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనగా పరిణమిస్తుంది.

ఈ ముద్రల విషయానికి వస్తే....మొదటగా జరగాల్సిన పని చైతన్యాన్ని పెంచిపోషించడం. ఏ అంశమైతే 'మాట్లాడకూడనిదిగా' వుందో అదే అంశం గురించి బహిరంగంగా నోరు తెరిచి మాట్లాడటమే కనువిప్పును కలిగిస్తుంది. ఎందుకంటే 'ముద్ర' అనేది లోలోపలి నిశ్శబ్దాన్ని మరింత పెంచుతూ, కనిపించనితనాన్ని, అవమానాన్ని ఒక సంస్కృతిగా మార్చేస్తుంటుంది. చట్టపరమైన ఏ శిక్షలూ లేకుండా, నిరంతరం మానవ హక్కుల ఉల్లంఘన జరగటానికి ఇదే కారణం.

అందుకే ఈ పుస్తకం ఎంతో విలువైనది, బలమైనది కూడా! పాకీపని గురించిన వాస్తవాలను భారతదేశంతో పాటు అంతర్జాతీయ సమాజం ముందు ఉంచటానికి, చైతన్యాన్ని పెంచటానికి ఈ పుస్తకం ఒక పనిముట్టుగా ఉపకరిస్తుంది. అలానే పాకీ పనివాళ్ళు తమంతట తాము ఒక కూటమిగా ఏర్పడటానికి, సమష్టిగా ఉద్యమంలోకి రావటానికి, తమ గొంతులను గట్టిగా వినిపించడానికి, తమ అవసరాలను, హక్కులను స్పష్టంగా చెప్పుకోగలగటానికి ఉపయోగపడుతుంది. పాకీపనికి మూలాధారంగా వున్న అంశాలను అర్థం చేసుకోవటానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. పాకీపనిని అంతమొందించటానికి తీసుకోవాల్సిన విధాననిర్ణయాలు, ఆలోచనలకు బీజం వేసే క్రమంలో ఇదొక ముఖ్యమైన అంకం. కేవలం చైతన్యపరిచే ఉద్యమాలతో సరిపోదు– బలమైన రాజకీయ నిర్ణయాలు, చిత్తశుద్ధి కూడా ఎంతో అవసరం. ఈ రెండింటినీ తట్టిలేపడంలో ఈ పుస్తకం అత్యంత బలమైన సాధనం అనటంలో సందేహం లేదు.

**-కాథరినా డె అల్బూకెర్‌క్యూ**
యుఎన్ స్పెషల్ రపోర్టియర్ ఆన్ ది హ్యూమన్ రైట్ టు
సేఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ సానిటేషన్

# కృతజ్ఞతలు

ముందుగా పాకీపని చేస్తున్న మహిళలు, వారి కుటుంబాలకు నా కృతజ్ఞతలు. మిగతా దేశమంతా అసలు పట్టించుకోని ఒక కనిపించని భారతదేశాన్ని, తాము జీవిస్తున్న, అనుభవిస్తున్న ఈ నరకాన్ని నాకు వారే ప్రత్యక్షంగా చూపించారు.

నేనెవరో పూర్తిగా తెలియకుండానే, ఏ ఇబ్బందులూ కలుగకుండా నాకు సహాయపడిన అన్ని సంస్థలకు, కార్యకర్తలకు, పాకీపని అనే ప్రపంచాన్ని, విముక్తికోసం వారు చేస్తున్న పోరాటాన్ని తెలుసుకోవటానికి నాకు అవకాశం కల్పించిన అందరికీ నా మన:పూర్వక కృతజ్ఞతలు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాలలోని భాట్‌పర ప్రాంత మానవ హక్కుల కార్యకర్త దేబశిష్; రాజు (కాన్పూర్); గజేంద్ర మాఝ్వి (పాట్నా); మధుస్మిత (ఒడిషా); సీమ (హర్యానా); ఉష, మీనా (ఢిలీ); మాహెజబీన్ (కశ్మీర్); కాలూ, సోహన్‌లాల్ (రాజస్థాన్) లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలానే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు యువ కార్యకర్త కమల్ కుమార్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు. కామెర్ల వ్యాధితో బాధపడుతూ కూడా నాతోపాటు తిరిగాడు. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్దికాలానికే చనిపోయాడు.

ఈ కనిపించని ప్రపంచం గురించి నాకు ముందుగా చెప్పిన ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ అసోసియేషన్‌కు చెందిన శ్రీలత స్వామినాథన్; నాకు మార్గం చూపిన ప్రభుత్వాధికారి, మానవహక్కుల కార్యకర్త ఎస్.ఆర్. శంకరన్; గుజరాత్ రాష్ట్రంలోని ఈ విధానంలో దాగివున్న సంక్లిష్టమైన వాస్తవికతను నాకు ఎంతో ప్రేమతో, అభిమానంతో వివరించిన నవసర్జన్ సంస్థకు చెందిన మంజులాప్రదీప్, మార్టిన్ మక్వాన్, అలానే దళితశక్తి కేంద్రం; ఎన్నో సంవత్సరాల నుంచీ ఈ సమూహపు కష్టాలకు ఒక గొంతు నిచ్చిన సంస్థ మధ్యప్రదేశ్‌లోని గరిమా అభియాన్–ఆసిఫ్ షేక్; సఫాయి కర్మచారి ఆందోళన నాయకుడు బెజవాడ విల్సన్ – అతను లేకుండా అసలు ఈ పుస్తకం వెలువడి వుండేది కాదు. అతనికీ నాకు మధ్య జరిగిన అనేక సుదీర్ఘమైన చర్చలు, వాదోపవాదాలు– కుళ్ళిపోయి, మురిగిపోయిన ఈ కులవ్యవస్థ తాలూకు అణిచివేత విధానాలను, ధోరణులను అర్థం చేసుకోవటానికి నాకెంతో ఉపయోగపడ్డాయి. వీరందరికీ కూడా నేను చాలా ఋణపడి వున్నాను. అలానే అనేక కష్టసమయాల్లో నాకు తోడుగా నిలిచిన సఫాయి కర్మచారి ఆందోళన కార్యకర్తలందరికీ నా మన:పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

నాకంటే ఎక్కువగా ఈ పుస్తకం బరువు బాధ్యతలను మోసిన నా జీవిత సహచరుడు ఉపేంద్రకు అనేక ధన్యవాదాలు. అతని సహాయమే లేకపోతే నేను ఎంతో కష్టపడి తిరిగి, సేకరించిన సమాచారాన్ని ఒక దగ్గరకు చేర్చగలిగివుండే దానిని కాదు. ఈ అంశం మీద పుస్తకం రాయమని ముందుగా నన్ను ప్రేరేపించి, నిరంతరం ఉత్సాహపరిచిన మా నాన్న అజయ్‌సింగ్; పాకీ పనిని అంతమొందించే ఉద్యమంలో తానూ భాగంగా మారిన నా కూతురు ఖిల్‌ఖిల్; తన సృజనాత్మకతతో నాకు ఆలంబనగా నిలిచిన మా అమ్మ శోభాసింగ్; నన్ను నిరంతరం ప్రోత్సహించే నా స్నేహితుడు ముకుల్ సరల్; నా ఇంటిపనిలో నాకు దన్నుగా నిలబడిన సుసన్నాలకు నేను సదా ఋణపడే వుంటాను.

## ప్రారంభం

# నేను పాకీ జర్నలిస్టుని ఎలా అయ్యాను?

'మీ కులం ఏమిటి? నువ్వు మా కులం మనిషిలాగా కనిపించటం లేదే!'

మొదటిసారి ఒక తీవ్రస్వరంతో నన్ను ఈ ప్రశ్న అడిగినప్పుడు ఎంతో అసహనానికి గురయ్యాను. తిరుగు సమాధానం ఏంచెప్పాలో నాకు తెలియలేదు. ఎందుకంటే చెప్పటానికి ఏమీ లేదుగనుక. నేను పాకీ సమూహపు కులానికి చెందినదాన్ని కాదనేది స్పష్టం. కానీ ఆ ప్రశ్న ద్వారా నన్ను నిలదీసినట్లుగా, వేలెత్తి చూపినట్లుగా భావించాను. వెంటనే ఆత్మరక్షణలోకి జారుకోవటం అనేది ఆ క్షణంలో సహజంగా కలిగే ప్రతిస్పందన. అయినా నేను అదేతీరుగా స్పందించదల్చుకోలేదు. ఏదయితేనేం, కులవ్యవస్థ ఎంత బలీయమైనదో ఈ ఒక్క ప్రశ్న మరో కోణంలో నా ముందుంచింది. సాధారణంగా ఈ ప్రశ్న ఆధిపత్య కులాలవారిచే అప్పటివరకూ సంధించబడుతూ వుండేది. ఆధిపత్యకులాలు చేసే అణిచివేత, దోపిడి, వారు అమలుపరిచే వివక్ష నాకు అర్థమైంది అప్పుడే! కానీ, తరాల తరబడి అంటరానితనానికి బాధితులుగా వుండి శతాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురయ్యి, సమాజపు అంచులకు నెట్టేయ్యబడిన సమూహం నుంచి కులానికి సంబంధించిన ఈ ప్రశ్న నాకెదురైంది.

కులం అంటే ఏమిటి? ఒక వ్యక్తిని అంచనావేసే ప్రమాణంగా అది ఎలా మారింది? పునాదివర్గాల్లో కులం అనేది ఎంత లోతుగా పాతుకుపోయిందనే విషయం తెలుసు కుంటుంటే అది నా మధ్యతరగతి భావాజాలాన్ని పటాపంచలు చేసింది. హిందూయిజంలో కులవ్యవస్థ తాలూకూ వాస్తవిక రూపాన్ని నేను మొదటిసారి చూశాను. దళితుల్లో కూడా అనేక ఉపకులాలున్నాయని, ఈ వైరుధ్యాలను పాదుకొల్పడం ద్వారా, వాటి మధ్య సయోధ్యకు ఆస్కారం లేకుండా చేశారన్న సంగతి నాకు మొదటిసారి గ్రహింపుకు వచ్చింది.

'మా గురించి నువ్వేం తెలుసుకోవాలనుకుంటున్నావు, నీ సమయాన్ని, శ్రమను దీనిమీద ఎందుకు వృధా చేస్తావు?' అనేది నేను తుపాకి గుండులాగా ఎదుర్కొన్న రెండోప్రశ్న. ఈ ప్రశ్న ఎలాంటిదంటే, ఆ దెబ్బతో నా నోటికి తాళం పడిపోయింది. నేను చేయగల్గింది కేవలం ఒక నవ్వు నవ్వి ఊరుకోవటమే. ఆ సమయంలో మాటలు నిరర్థకమని రుజువయిపోయింది.

గుజరాత్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు, హర్యానా నుంచి కశ్మీర్–ఇలా నా పరిశోధనలో భాగంగా ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక రూపంలో ఈ ప్రశ్నలు నన్ను వెంటాడాయి. కొన్నిసార్లు సూటిగానూ, మరి కొన్నిసార్లు తిప్పితిప్పి వాటినే అడిగేవారు. వర్గరహితంగా వుండటం ఎందుకు ముఖ్యమో మార్క్సిజం మాకు నేర్పింది. అంటే

ఎవరికివాళ్ళం స్వీయ వర్గస్వభావాన్ని విడిచి పెట్టేయటం. కానీ, అనాదిగా అణగారిపోయిన పాకీసమూహం నుంచి వచ్చిన ఈ అసాధారణమైన స్త్రీలు భారతీయవ్యవస్థలో కులరహితం కావడం–అంటే ఒక వ్యక్తి తన కుల గుర్తింపును వదులుకోవడం అంటే ఏమిటో నాకు నేర్పించారు. హిందూయిజంలోని కులవ్యవస్థ ఒక విషపు సెలైన్ లాంటిది. అది మతం మారినా లేదా కులపరమైన వృత్తిని మానేసినా గానీ అది మనసును అంటిపెట్టుకుని వేలాడుతూనే వుంటుంది. అందుకే కులరహితం కావడం అనేది సంక్లిష్టమైన విషయం. మరీముఖ్యంగా ఏకులమైనా సరే, దాన్ని అంగీకరిస్తామా లేక తిరస్కరిస్తామా అనే దాని మీద ఆధాపడివుండదు. దీనికి సజీవ సాక్ష్యమే పాకీస్త్రీల జీవితాలు. కులవ్యవస్థ ఇలాంటి ఎన్నో వైరుధ్యాలను సృష్టిస్తుంది. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో పాకీ స్త్రీలు 'జాగిర్దారీలు'. నిజానికి దీని అసలు అర్థం ఫ్యూడల్ యజమాని అని. ఇక్కడ జాగీర్ అనేది ఫ్యూడల్ ఆస్థి. అంటే కొన్ని ఇళ్ళను కలిగివుండి, అక్కడి మనుషుల పియ్యిపెంటను ఎత్తి పారబోయటం. దీనికి 'జాగిర్దార్' అనే పేరు వుండటమే ఒక విధమైన భీతిని కల్గిస్తుంది. నిజానికి ఈ ఆడవాళ్ళు హానికరమైన వ్యవస్థ బాధితులుగా వుండి తమ తర్వాతి తరానికి వారసత్వంగా ఈ 'జాగిర్' లేదా 'జజ్‌మనీ'లను అందజేస్తున్నారు. పాకీపనిలో జాగిర్దారీని చూసిన తర్వాత అలాగే ఈ జాగిర్‌లను కుదవపెట్టుకున్న లేదా అమ్మిన దస్తావేజులను చూసిన తర్వాత ఎవరికైనా అర్థమయ్యే విషయమేమంటే, నరకకూపం లాంటి పాకీపనిని ఒక పటిష్టమైన వ్యవస్థగా మలిచి ఈ సమూహాన్ని అందులో ఖైదు చేశారని!

కొన్ని విషయాలను నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ఇందులో మొదటి అంశం ఏమిటంటే ఈ ప్రపంచాన్ని నేను మొదట్లో ఎలా ఏవిధంగా ఎదుర్కొన్నానో, ఇందులోంచి బయటపడకుండా, నేను ఏ విధంగా ఒక క్రమంలో దీనిలో ఎలా భాగమయ్యానో అనేది. నేను వృత్తిరీత్యా విలేఖరిని కావటంతో, మొదటిసారి ఈ పాకీపని ఇంకా కొనసాగుతోందనే విషయం గురించి విన్నప్పుడు, నేను చేసే మిగతా కథనాల్లాగే ఇది కూడా ఒక వార్తా కథనంలాగే ముగిస్తానని అనుకున్నాను. అయితే సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ఇది నాతోనే సావాసం చేస్తూ వుండిపోయింది. మరుగున వుండి కంపుగొడ్తున్న ఈ ప్రపంచంలోకి నా ప్రయాణం 2003లో ప్రారంభమయింది. ఇప్పటికీ ఈ మురికి విధానం సజీవంగా కొనసాగుతుండటం అనే బాధను నేను మోస్తూనే వున్నాను. రోజుకో రొట్టి, నెలకు కొంత డబ్బు–కేవలం వీటితో జీవించటం కోసం ఈ ఆడవాళ్ళు ఎంతో బలవంతం మీద తోటి మనుషుల పియ్యిపెంటను నెత్తిమీద మోయటం చూస్తుంటే నాకు ఇప్పటికీ చాలా భయమేస్తుంది. కుళ్ళికంపు కొడుతున్న ఈ ప్రపంచాన్ని నాకు మొట్టమొదట పరిచయం చేసింది శ్రీలత స్వామినాథన్. తను కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్–లెనినిస్ట్) గ్రూపుకి చెందిన ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్ (ఎఐపిడబ్ల్యూఏ) నాయకురాలు. అప్పట్లో నేను హిందీ ఔట్‌లుక్ వారపత్రికకు పనిచేసేదాన్ని. రాజస్థాన్‌లో

ఆడపిల్లల భ్రూణహత్యల కథనం కోసం ఆమెని కలిశాను. ఆ సమయంలో రాజస్థాన్‌లో ఝున్‌ఝును జిల్లాలో పాకీపని ఇంకా కొనసాగుతున్న సంగతి ఆమె నా దృష్టికి తెచ్చింది.

ఈ ఆడవాళ్ళు తమకు కావల్సిన డబ్బుని రొట్టెల రూపంలో తీసుకోవాలని, ఇంటి వెనుక భాగంలో మోకాళ్ళు వంచి నిలబడితే పైనుంచి రొట్టెలు వారి మీదకు ఎలా విసిరివేస్తారో నాకు ఆమె వివరించి చెప్పింది. ఈ పేదస్త్రీలు తమ జీవితమంతా కూడా మనుషులు ఏరిగిన పియ్యిపెంటలను ఒట్టిచేతులతో ఎత్తి, నెత్తిమీద పెట్టుకొని మోయటమనేది ఘోరమైన విషయం. ఈ అనాగరిక విధానంతో సమాజం ఏవిధమైన అసౌకర్యానికీ గురికావడం లేదన్న మాటమాత్రం వాస్తవం. అదే నాకు కోపాన్ని తెప్పిస్తోంది. బాధ కలిగిస్తోంది. శ్రీలత చెప్పిన మాటలకు నేను ఎంతో ప్రభావితమయ్యాను. ఈ విధానంపట్ల వున్న అసహ్యమంతా ఆమె మొహంలో స్పష్టాతిస్పష్టంగా కనిపించింది. అదే నన్ను ఈ అంశంపై మరింత పరిశోధనకు పురిగొల్పింది. ఈ కనిపించని ప్రపంచాన్ని తెలుసుకోవాలనే ఆరాటం నన్ను తీవ్రమైన అశాంతికి గురిచేసింది.

ఈ ప్రపంచం ఎంతగా పాతుకుపోయి కనిపించదంటే, నేను నా ముప్పై మూడేళ్ళ వయస్సులో ఏనాడూ ఈ కులపరమైన దురాచారాన్ని గమనించలేకపోయాను. అంటే ఇన్ని సంవత్సరాలుగా అది నా చుట్టూ లేనేలేదని కాదు. లక్నో (నేను పుట్టి పెరిగిన ఊరు) నుంచి కాన్పూరు, అలహాబాద్, పాట్నా – ఇలా ప్రతీచోటా ఆడవాళ్ళు పాకీపని చేస్తూనే వున్నారు. కానీ వారి ఉనికి గురించి నాకు ఏమాత్రం అవగాహన అనేది లేదు. మొదటిసారి అలహాబాద్‌లోని మా నిర్మలా అత్త, దూద్‌నాథ్ సింగ్ మామయ్య వాళ్ళింట్లో వీళ్ళని చూశాను. మామయ్య వాళ్ళు అలహాబాద్ హైకోర్టుకి దగ్గర్లోని శంభు బారాక్స్ లో వుండేవారు. అక్కడ మురుగునీటి కాల్వల ఏర్పాటులేకపోవటంతో దాదాపు అందరి ఇళ్ళలోనూ ఎత్తుడుదొడ్లే (డ్రై లెట్రిన్లు) వుండేవి. అప్పుడు నేను మరీ చిన్నపిల్లనేం కాదు. మా అత్త ఇంట్లో నేను అలాంటి పాకీదొడ్డిని చూసినప్పుడు నాకు పది, పన్నెండేళ్ళ వయసు వుంటుంది. ఒక ముసలావిడ దాన్ని చేతులతో శుభ్రం చేయటానికి రోజుకి రెండు పూటలా వచ్చేది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి. మా ఇంటి వెనుకవైపు నుంచే ఆమె లోపలికి రావాలి. ఆ సమయంలో నాకంతవరకే గుర్తుంది. అప్పటికి ఈ మొత్తం వ్యవస్థ గురించి, దాని విస్తృతి గురించి నాకంతకంటే తెలిసే అవకాశం లేదు. వెనక్కి తిరిగి చూసినప్పుడు, పాకీదొడ్డి ఉపయోగించే వారి దృష్టి కోణం నుంచే తొలుత ఆలోచించాను. అలాంటి పాకీదొడ్డిని ఉపయోగించటంలో నాకున్న ఇబ్బందులే నాకు ఎక్కువగా గుర్తున్నాయి. నిజానికి, అలాంటి పాకీదొడ్డిని ఉపయోగించామన్న ఎరుకే నాకు ఎంతో భయాన్ని కలిగించింది. ప్రతిరోజూ దాన్ని శుభ్రంచేయటానికి వచ్చే ముసలామె ఎంత భయంకరమైన పరిస్థితిలో వుంటుందనేది అప్పటి నా ఆలోచనకు తట్టలేదు.

ఇప్పుడు ఆలోచిస్తుంటే ఏమనిపిస్తోందంటే, నా లాగానే అలాంటి పాకీదొడ్లను ఇళ్ళలో ఉపయోగించిన వారందరూ కూడా ఆ పియ్యిపెంటను ఎత్తటానికి వచ్చే మనిషి గురించి

ఏ కొంచెమైనా ఆలోచించి వుండరని! ఈ మురికి పియ్యిపెంటలతో ముడిపడిన పనులన్నీ దళితులకి సంబంధించినవే అని ఈ కులవ్యవస్థ బలంగా నమ్ముతుంది. ఈ కారణంగానే, ఫ్యూడల్ స్వభావంతో వుండే అగ్రకులాలే కాక, పాకీపని చేయని ఇతర దళిత కులాలవారు పాకీ పనిచేసే వాళ్ళని మనుషులుగా కూడా గుర్తించటం మానేశారు. హిందూధర్మంలో వున్న నాలుగంచెల వర్ణవ్యవస్థలో కేవలం అగ్రవర్ణాలే కాక కింది వర్ణాలు కూడా ఇదే విధమైన బ్రాహ్మణీయ ఫ్యూడల్ ఆలోచనా ధోరణితోనే వుంటాయి. ఈ భావజాలాన్నే మొత్తం భారతీయ సమాజమంతా వ్యాపింపజేస్తాయి. వేరువేరు గుడులు, గురుద్వారాలు, చర్చిలు, మసీదులు–ఇవన్నీ కూడా విభజనకు చిహ్నాలు. ఇవన్నీ ఆత్మన్యూనతను మరింత పెంచడమే కాక ఈ కుళ్ళులో బతుకుతున్న వారి వాస్తవ పరిస్థితికి అద్దంపడతాయి. పైకి కనిపించని ఈ ప్రపంచాన్ని వెతుకుతున్న సమయంలో ఇలాంటి ఎన్నో కఠోర వాస్తవాలు నాకు అవగతమయ్యాయి.

ఈ అంశం మీద నేను పనిచేయటం మొదలుపెట్టినప్పుడు దేశమంతటా కూడా ఈ సమూహాలకు చెందిన స్త్రీలు కనీసం తాము మనుషులమనే గుర్తింపుకు నోచుకోని ఒక దుస్థితిలో బతుకుతున్నారు. అది పశ్చిమబెంగాల్ 24 పరగణాల జిల్లా, భాట్‌పరకి చెందిన లక్ష్మణియా హారి కావొచ్చు లేదా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కి చెందిన పల్లవి కావొచ్చు లేదా రాజస్థాన్‌లో టోంక్ నుంచి వచ్చిన ఇందిర, కశ్మీర్‌లోని రఫీఖా లేదా ఆంధ్రప్రదేశ్‌లో నారాయణమ్మ – వీరు తమ జీవితకాలమంతా ఈ పాకీపనిలోనే గడిపారు. జనం తమని కనీసం మనుషులుగా కూడా గుర్తించరనీ, అందుకే ప్రభుత్వం కూడా తమవైపు చూడదనీ, తమని చూడాలని కూడా అది అనుకోవటం లేదనే నిశ్చయానికి ప్రతి ఒక్కరూ వచ్చారు. వాళ్ళు ఇప్పుడు మరుగున వున్నారు. కానీ జరుగుతున్న దుర్మార్గమైన అన్యాయానికి వ్యతిరేకంగా వారు దిక్కులు పిక్కటిల్లేలా గొంతెత్తనంతకాలం వాళ్ళు ఎప్పటికీ మరుగునే వుండిపోతారు.

మొట్టమొదట శ్రీలత పాకీపని గురించి నాకు వివరిస్తే, ఎస్.ఆర్. శంకరన్ గారి ద్వారా ఈ సమూహంలో మార్పు కోసం జరుగుతున్న పోరాటాన్ని తెలుసుకున్నాను. ఈ మార్పుకు మూలకారణమైన బెజవాడ విల్సన్‌ను ఆయనే నాకు పరిచయం చేశారు. ఒక ఐఏఎస్ అధికారిగా ఎన్నో బాధ్యతాయుతమైన పదవుల్లో పని చేశారు కీ.శే. ఎస్.ఆర్. శంకరన్ గారు. ఆయన ఎంతో అనుభవం వున్న మానవహక్కుల కార్యకర్త, 1994లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమయిన సఫాయి కర్మచారి ఆందోళన (ఎస్‌కెఏ) వ్యవస్థాపక సభ్యులు.

నేను ఢిల్లీ నుండి పదేపదే ఫోన్లు చేసినా ఎంతో గౌరవంగా, మర్యాదతో మాట్లాడే వారు. ఈ అంశంపై బెజవాడ విల్సన్‌కు చాలా అవగాహన వుందని ఆయనే నాకు

చెప్పారు. ఫోన్ ద్వారా అతనితో మాట్లాడమని సలహా ఇచ్చారు. నేను నా మొదటి కథనం కోసం పరిశోధన చేస్తున్నప్పుడే ఇదంతా జరిగింది. 2003 నవంబరులో విల్సన్‌తో మాట్లాడాను. ఆ రోజుల్లో అతని సంస్థ కేవలం ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లోనే చురుకుగా పనిచేస్తూ వుండేది. ఈ విషయం తాలూకూ తీవ్రతను నేను అర్థంచేసుకోవటంలో భాగంగా విల్సన్‌తో అడపాదడపా సాగించిన చర్చలు ఎంతో ప్రభావితం చేశాయి. వీటన్నిటికీ అనుగుణంగా అమానవీయమైన జీవితం నుంచి బయటపడాలనే ఆకాంక్ష ఈ సమూహంలో బలంగా నాటుకుని అది అఖల భారత పోరాటంగా ఎలా విస్తరించిందో నేను అర్థంచేసుకున్నాను.

బెజవాడ విల్సన్, ఎస్‌కెఏ సహాయం లేకుండా పాకీపనిలో దాగివున్న అనేక పొరలను ఛేదించటం నాకు అసాధ్యమయిన విషయమే. 1993లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమయిన వారి ఉద్యమం, ఈ రోజున 21 రాష్ట్రాల్లో విస్తరించి వుంది. అంతకంటే మించి, 1993లో పార్లమెంటులో ఆమోదించబడిన – పాకీ పనివాళ్ళ నియామకం, ఎత్తుడుదొడ్ల (డ్రైలెట్రిన్) నిర్మాణ నిషేధచట్టం (1993) అమలుచేయాలని సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలుచేసి సుదీర్ఘ పోరాటానికి సమాయత్తమయ్యారు. ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలను ఎదుర్కోవటం కోసం, అసంబద్ధ ప్రణాళికలను సరిచేయటం కోసం, తప్పుడు పునరావాస ప్రణాళికలను సరిదిద్దటం కోసం, చట్టంలో వున్న లొసుగులను సవరించి ఈ అంశాలపై భారత రాజకీయసౌధాల తలుపులను తట్టి తెరిపించటం కోసం, ఈ సమూహాన్ని సంఘటితపరచటం కోసం ఎస్‌కెఏ ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తోంది. కనిపించని ఈ భారతదేశాన్ని పట్టిచూపించే సంక్లిష్ట క్రమంలో ఎస్‌కెఏది ఎంతో ముఖ్యమైన పాత్ర అని చెప్పుకోక తప్పదు. ఈ సంస్థ పాత్రను కేంద్రప్రభుత్వం కూడా గుర్తించకుండా వుండలేని పరిస్థితి వచ్చింది.

నా ప్రయాణం 2004 తర్వాతే వేగం పుంజుకుంది. అప్పటికే నేను అన్ని రాష్ట్రాలు, నగరాలు తిరిగి పాకీసమూహానికి చెందిన ఆడవాళ్ళని కలిసి వారిలో లోలోపల దావానలంలా మండుతున్న వారి ఆగ్రహాన్ని అక్షరబద్ధం చేయటానికి సంసిద్ధమైపోయాను. ప్రతి సమావేశం కూడా హిందూయిజంలో కుళ్ళికంపు కొడుతున్న కులవ్యవస్థ అధికార దొంతర్ల గురించి మరింత అర్థంచేసుకోవటానికి ఉపయోగపడింది. ఈ కులవ్యవస్థ అంతరాలు వేరే మతాలలోకి పాకాయి. మొదట్లో, ఈ అంశం మీద చర్చించటానికి నాకు రెండు వేదికలు చాలా సహాయ పడ్డాయి. ఒకటి హిందీ ఔట్‌లుక్ (ముఖ్యంగా అప్పటి సంపాదకులు అలోక్ మెహతా సహకారం)– రెండోది సంస్కృతి ఫౌండేషన్ నుంచి అభించిన ప్రభాదత్ ఫెలోషిప్. ఈ ఫెలోషిప్ కాలపరిమితి కేవలం ఒక సంవత్సరమే అయినప్పటికీ, పరిశోధన నిమిత్తమై చాలా రాష్ట్రాలకు వెళ్ళటానికి అవకాశం కల్పించింది. ఔట్‌లుక్‌తో పనిచేయటం వల్ల ఈ అంశం పట్ల అందరిలో చైతన్యం కలగజేయటానికి, నేను చేస్తున్న

పని అందరి దృష్టికి వెళ్ళటానికి ఎంతో ఉపకరించింది. అప్పటివరకూ కూడా నెత్తిమీద పియ్యిపెంటల బుట్టలను మోస్తున్న ఆడవాళ్ళ ఫొటోలతో కూడిన ఒక్క వ్యాసం ప్రసార సాధనాల్లో రావటమంటే గగనం. తమ చుట్టూనే వున్నప్పటికీ ఈ దుర్మార్గాన్ని చూడాలని ఎవరూ అనుకోరు. ప్రతి ఒక్కరూ తమ కళ్ళు మూసుకుని, జేబురుమాళ్ళతో ముక్కులు మూసుకుని, పాకీపని అనే ఈ కనిపించని ప్రపంచాన్ని గుర్తించటానికి సైతం అంగీక రించరు. నిజానికి అది ఎప్పటికీ అలా కనిపించకుండానే వుండాలని కోరుకుంటారు.

కానీ ఒకసారి ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టాక ఇంక నేను వెనుదిరిగి చూడలేదు. నా ఈ ప్రయాణంలో నాకు నిరంతరం స్ఫూర్తినిచ్చింది ఈ ఆడవాళ్ళ అద్భుతమైన క్రియాశీలత, జీవించాలనే బలమైన వారి ఆకాంక్ష, వారి నవ్వులు, బాధలు, చెక్కుచెదరని వారి అంతర్గత శక్తి, వీటికి తోడు వాళ్ళు తయారుచేసే అద్భుతమైన వేడి వేడి వంటకాలు! వాళ్ళ దగ్గర నుంచి నేర్చుకోవలసింది ఎంతో వుంది. అందుకే వివిధ నగరాల్లో వున్న ఈ అసాధారణ మహిళాలోకాన్ని కలవటానికి ప్రతిసారీ నేను చాలా ఉత్సాహపడేదాన్ని.

దళిత్ శక్తి కేంద్ర, నవసర్జన్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు మార్టిన్ మక్వాన్ (ఈ రెండు సంస్థలూ గుజరాత్‌లో ఎంతో కాలం నుంచి ఇదే అంశం మీద పనిచేస్తున్నాయి.) మార్టిన్ మక్వాన్, ఆయన సహోద్యోగి మంజులా ప్రదీప్ –ఇద్దరు కూడా ముఖ్యమంత్రి నరేంద్రమోడీ హింసాత్మక హిందూత్వ పరిపాలనపై ఈ నిస్సహాయులైన ఆడవాళ్ళు ఎలా సవాలు విసిరారో వివరించి చెప్పారు. పాకీపని నుంచి విముక్తి కోసం చదువు, వృత్తి, చైతన్యం అనే అంశాలను ఏ విధంగా మార్టిన్ అనుసంధానించారనేది పరిశీలించటం కూడా ఒక విలువైన అనుభవం. మంజుల ప్రదర్శించిన నైపుణ్యమే దీనికి నిదర్శనం.

ఒకసారి గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పాకీపని విముక్తి అంశం మీద ప్రజాభిప్రాయ సేకరణసభ జరిగింది. ఆ సమయంలో అందులో పాల్గొన్న పల్లవిబెన్ అనే మహిళ స్టేజిమీద నుంచి నన్ను చూపిస్తూ 'ఈ అక్క పాకీపని గురించి రాసే విలేఖరి' అని చెప్పటం నాకింకా గుర్తుంది. నా పక్కనే కూర్చున్న మంజుల వేదికపై పల్లవిబెన్ గుజరాతీలో చేసిన ప్రసంగాన్ని నాకు హిందీలోకి అనువాదం చేసి చెప్పింది. పాకీ సమూహం నుంచి వచ్చిన నాలాంటి అమ్మాయి జర్నలిస్టు అయిన తర్వాత కూడా విముక్తి కోసం రాయటం సంతోషం కలిగిస్తోందని ఆమె చెప్పిందని మంజుల నాతో అన్నది. నేను కొంచెం ఆశ్చర్యపోయాను. 'ఆమె పొరపాటు పడింది; ఆమెకెవరు అలా చెప్పారూ' అని నేనన్నాను.

అయితే మంజుల నన్ను మధ్యలోనే ఆపి, 'మీరు ఇప్పుడు పాకీపని విలేఖరి అయ్యారు. మీరు నమ్మినా నమ్మకపోయినా అందరూ దీన్ని నమ్ముతున్నారు' అని అన్నది. వృత్తిపరంగా ఇది నాకు కొత్త నామకరణం. తమ కులానికి చెందనివారు సైతం వారికి సంబంధించిన బాధల్ని, కష్టాల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారన్న అంశాన్ని ఈ ఆడవాళ్ళు ఎందుకు గుర్తించటం లేదు అనే విషయం నన్ను కొంత బాధపెడ్తూనే

వుండేది. బయటకు కనిపించని ఈ పాకీపని గురించి అర్థం చేసుకోవటం, తెలుసుకోవటం అనేవి ఆ సమూహం నుంచి వచ్చిన వారే చేయగలరనేది వారి ప్రగాఢ నమ్మకం. ఈ నమ్మకాన్ని పోగొట్టటం సులభం కాదు. ప్రభుత్వ ఉన్నతాధికారి, కవి అయిన కీ.శే. సుదీప్ బెనర్జీ నా పనిని నిశితంగా గమనిస్తూ నన్ను చాలా ప్రోత్సహించేవారు. "కుల రహితంగా మారటమనేది నీలో మొదలయింది. దానికి నువ్వు సంతోషించాలి గానీ బాధపడ కూడదు' అని చెప్పేవారాయన.

పాకీ పనిచేసే ఆడవారికి ఎదుటి వ్యక్తులు తమపట్ల ఏ విధమైన ధోరణులతో వున్నారు, కులవివక్ష చూపిస్తున్నారా లేక కులాతీతంగా వుంటున్నారా అనేది నిర్ధారించ టానికి– వారి ఇళ్ళల్లో మీరు నీళ్ళు తాగుతున్నారా లేక వారిచ్చిన టీని మీరు స్వీకరిస్తున్నారా లేదా మిమ్మల్ని వాళ్ళింటికి భోజనానికి ఆహ్వానించినప్పుడు మీ ప్రతిస్పందన ఎలావుంది వంటి అంశాల ద్వారా ఇట్టే గ్రహించగలుగుతారు – ఇలా వారివైన పద్ధతులు వారికి వున్నాయి.

కులవివక్షత గురించి వారికి లోతైన అవగాహన వుంది. శతాబ్దాల తరబడి దానికింద వారు నలిగిపోయారు. బ్రాహ్మణీయ భావజాల ప్రభావంతో అబ్బే అలవాట్లు, ఎదురయ్యే సవాళ్ళు వారికి తెలుసు. వీటన్నింటి పట్లా వారు చాలా నిశిత దృష్టితో వుంటారు. వారిలో ఉదయించిన ఈ చైతన్యానికి నిజంగా వారిని ఎంతగానో అభినందించాలి. వర్గరహితంగా వుండటానికి భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీలు ఎంచుకున్న మార్గానికి వీరి ఈ పద్ధతులు ఎంతో దగ్గరగా అనిపిస్తాయి. వర్గరహితంగా మారేందుకు, మార్క్సిస్ట్ సాహిత్యాన్ని విపరీతంగా చదవటంతో పాటు వర్గమూలాల్ని అర్థం చేసుకోవటం కోసం నిరంతరం పోరాటాలలో పాల్గొంటే సరిపోదు. సామాన్య ప్రజల ఇళ్ళల్లో తినటం అనేదికూడా ఒక ముఖ్యమైన అంశం. (సాధారణంగా వీరిలో ఎక్కువగా దళితుల ఇళ్ళే వుంటాయి). ఆహారవ్యవహారాలు మొదలు కులం, వర్గం వంటి వాటి మూలాల్ని దెబ్బతీయటం కోసం ఈ పాకీఆడవాళ్ళు కూడా అదేవిధమైన కిటుకుని ఉపయోగించారనిపిస్తుంది. కుల, వర్గమూలాల్ని ధ్వంసంచేసి కుల, వర్గరహితంగా మారే క్రమంలో ఆహారం విషయంలోవున్న ఈ నిషేధాల్ని బద్ధలు కొట్టాలి. అప్పుడే అది కీలకమైన అనుసంధానంగా పనిచేస్తుంది. దీన్ని సరైన పంథాలో కొనసాగించినట్టయితే, ఎన్నో రాజకీయ ప్రయోజనాలు కలుగుతాయి. కమ్యూనిస్టు పార్టీలు దైనందిన వ్యవహారాలతోపాటు సాంస్కృతిక స్థాయిలో ఈ అంశం గురించి మరింత ఎక్కువగా ఆలోచించాలి. ఏమైతేనేం మంచి నీళ్ళు, టీ, తిండి –ఈ పరిమితుల పరీక్షల్ని దాటిన తర్వాతే ఈ సమూహపు గుమ్మంలోకి, వారి జీవితాల్లోకి మిమ్మల్ని ఆహ్వానించటం జరుగుతుంది. ఆ తర్వాతే వాళ్ళు మిమ్మల్ని తమలో ఒకరుగా భావిస్తారు. తమ బాధల్ని, సంతోషాల్ని మీతో పంచుకుంటారు. వారి దగ్గరకు వెళ్ళాలంటే మీ మనసు, ఆలోచనలు రెండూ కూడా విశాలంగా వుండటం అనేది అత్యవసరం.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వారి జీవితాలు చాలా నిరాశగా, రోజువారీ పని పియ్యిపెంటల మురికితో నిండివున్నప్పటికీ, వారి భోజనం మాత్రం ఎంతో రుచిగా, చాలా ఘాటుగా వుంటుంది. బహుశా మంచి సువాసన కలిగించే మసాలాలతో వండే ఆహారమే వారి జీవితాల్లో ఒక ఉత్సాహాన్ని తెస్తుందనుకుంటున్నాను. నా ప్రయాణమంతటా ఇది నాకు అనుభవమవుతూనే వచ్చింది. అది భాట్‌పరలో లక్ష్మనియా వండిన చేపల కూర, కోడిగుడ్ల పకోడీలు; ఆంధ్రప్రదేశ్‌లో నారాయణమ్మ నోరూరేలా వండిన మేకమాంసం బిర్యాని; కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో సారా వండిన పాలకూర–మాంసం; లేదా హర్యానాలోని అంబాలాలో సరోజ్ అద్భుతంగా వండిన సెనగపిండి కూర –ఏదైనా కావొచ్చు. ఈ సమూహపు ఆడవాళ్ళు తమ వంటల్లో పసుపు దాదాపుగా వాడరనే విషయం అతి కొద్ది మందికే తెలిసి వుంటుంది. అలాగే పసుపురంగులో వుండే పప్పుని తినటం వారికెంతో కష్టం. 'మేము ఈ పియ్యిపెంటలను ఎత్తేటప్పుడు చూడకండి, చూస్తే ఆ తర్వాత మీరు పప్పు తినటం అనేది అసాధ్యం' అని వారు మిమ్మల్ని హెచ్చరిస్తారు కూడా. నిజానికి పప్పు ఎవరికైనా ఆహారంలో ఒక ప్రాథమిక భాగం. కానీ దానిని ఈ ఆడవాళ్ళుగానీ, వారి కుటుంబాలుగానీ తీసుకోవు. ఎందుకంటే ప్రతిరోజూ వారు శుభ్రంచేసే పియ్యిపెంట దానిలాగే వుంటుంది కాబట్టి. ఇది చాలా స్వల్పవిషయమే కావొచ్చు గానీ, పియ్యిపెంటల రంగు, దుర్వాసనే వారిని తాము మాములు మనుషులమే అన్న భావన నుంచి దూరం చేస్తాయి.

నేను పూర్తిగా కులరహితంగా మారానా లేదా అనేది నాకు తెలియదు. కానీ, నన్ను నేను ఆత్మపరిశీలన చేసుకుంటే నేను పాకీపని విలేఖరిగా మారాననేది మాత్రం వాస్తవం. నా గుర్తింపులో దీనికి సింహభాగమే వుంది. నాతో పనిచేసే వారందరూ కూడా 'మళ్ళీ నువ్వు పాకీపని స్టోరీనే చేస్తున్నావు కదా? ఎప్పటివరకూ దీనిమీదే పని చేస్తూవుంటావు? అని సరదాగా ఎప్పుడూ అంటుంటారు. నేను ఈ విషయమై ఏదో ప్రాజెక్టు పని చేస్తున్నానని బయటివాళ్ళు అనుకుంటూ వుంటారు. ఇలాంటి వ్యాఖ్యానాలన్నీ నన్ను తీవ్రంగానే బాధ పెడ్తాయి, అదే సమయంలో చాలా ప్రోత్సాహాన్ని కూడా ఇస్తాయి. అందమైన కశ్మీర్‌లోయ నుంచి గుజరాత్, మహారాష్ట్రల దాకా వేలాది మంది జీవితాలు ఈ కంపుగొట్టే నరకంలో నాశనమయిపోతూ వుంటే ఎవ్వరికీ ఏ రకమైన బాధా వుండక పోవటమే అత్యంత విషాదం. పాకీపని అనేది వారి ఆత్మగౌరవాన్ని, వారిలోని మానవత్వ మూలాల్ని చిదిమేస్తోంది. ఏమి జరిగినా సరే, చారిత్రాత్మక పోరాటంలో నేను కూడా వారితో వుండాలనుకుంటున్నాను. దీన్ని వదిలేయాలనుకోవడం అనేది కనీసం నా ఆలోచనల్లో కూడా మెదలని అంశం.

నేను పాకీపని గురించి రాయటం ప్రారంభించేనాటికీ, ఇప్పటికీ ఎన్నో మార్పులు జరిగాయి. ఈరోజు ఈ విషయం మీద కనీసం బహిరంగంగా చర్చిస్తున్నారు. ప్రచార ప్రసార సాధనాల్లో కనిపిస్తూ వుంది. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మొదలు కాంగ్రెస్

అధ్యక్షురాలు సోనియాగాంధీ వరకూ ప్రతిఒక్కరూ ఈ అంశంపై ప్రకటన చేయాల్సివచ్చింది. అధికార పీఠాల్లో దీని నిర్మూలన కోసం చర్చలు జరిగాయి. అంటే దీనర్థం ఇప్పటివరకూ మరుగునే వుండిపోయిన ఈ భారతదేశం అధికార సౌధాల గుమ్మాల దగ్గర వరకూ నడుచుకుంటూ వెళ్ళి విజయం సాధించింది. ఈ అమానవీయమైన, క్రూరమైన విధానాన్ని అంతంచేయాలనే అంశంలో పాలకులు, అధికార యంత్రాంగం, న్యాయ వ్యవస్థల చిత్త శుద్ధిపై నాకు చాలా అనుమానమైతే వుంది. దీనికొక ప్రత్యక్ష ఉదాహరణ ఏమిటంటే, భారత ప్రభుత్వం 2011-12; 2012-13 ఆర్థిక సంవత్సరాలలో రెండుసార్లూ తన కేంద్రబడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలను ఈ పథకానికి కేటాయించింది. అయితే, దీనిలోంచి ఒక్క పైసా కూడా ఖర్చుపెట్టలేదు. ఈ వందకోట్లు పాకీపనివారి పునరావాసం కోసం కేటాయించినవి. 2011 భారత జనాభా లెక్కల ప్రకారం మొత్తం దేశమంతటా 26,06,278 పాకీదొడ్లు వున్నాయని, వాటిలో మనుషులు తమ చేతులతో పియ్యిపెంటలను ఎత్తిపోసే దొడ్లు 7,94,390 వున్నాయని ఘనత వహించిన ప్రభుత్వమే ప్రకటించింది మరి!

ఇప్పుడు ఈ సమస్యను ఎవ్వరూ నిర్లక్ష్యం చేసేందుకు లేదు. ఏదో ఒక రూపంలో ప్రతిఒక్కరూ దీని గురించి మాట్లాడవలసిందే. కిందిస్థాయి నుంచీ వచ్చిన వత్తిడితో ప్రభుత్వం ఒక కొత్త బిల్లుని తీసుకురావలసి వచ్చింది. అదే పాకీపని వారి ఉపాధి, పునరావసం బిల్లు, 2012. దీనిలో అనేక లొసుగులు వున్నప్పటికీ, అతి ముఖ్యమైన విషయమేమిటంటే మొదటిసారిగా పాకీ పనివారు అనే పదానికి ఉన్న నిర్వచనాన్ని విస్తరించటం జరిగింది. ఎత్తుడు దొడ్లు (డ్రై లెట్రిన్లు), సెప్టిక్ ట్యాంకులు, బహిరంగ కాల్వలు, రైల్వే కట్టలు శుభ్రం చేసేవారు ఈ పరిధిలోకి వచ్చారు. అంటే ఎవరైతే మనుషుల విసర్జితాలను శారీరకమైన శ్రమద్వారా శుభ్రంచేసే పనిలో వుంటారో వారందరూ పాకీ పనివారికిందే పరిగణింప బడతారు. గౌరవంగా, మర్యాదగా జీవించటం కోసం వారు చేస్తున్న పోరాటాన్ని అక్షరబద్ధం చేయటానికి నా పరిమిత దృష్టికోణం నుంచే ప్రయత్నించాను. ఆ పోరాటాన్ని రూపుగట్టించే విషయంలో ఈ పుస్తకం సఫలీకృతం అయింది.

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, భీమ్‌రావ్ అంబేద్కర్‌లు వివిధ సంధర్భాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రస్తావించకుండా పాకీ పని గురించి రాయటం అనేది పూర్తి కాదు. పాకీ పనిని గౌరవప్రదమైన చర్యగా చూపించటానికే గాంధీ ప్రయత్నించారు తప్పించి, దానిని నిర్మూలించాలని ఎప్పుడూ మాట్లాడలేదు. అమానవీయమైన ఈ పనిని తప్పనిసరిగా నిర్మూలించి తీరాలని అంబేద్కర్ గట్టిగా వాదించారు. 'నన్ను పాకీ పనివాడుగా పిలిపించుకోవటానికి నేను ఏమాత్రం సిగ్గుపడను, అలానే నేను ప్రతి పాకీవానికి చెప్తాను, అలా పిలిస్తే సిగ్గుపడవద్దని' అని పదేపదే గాంధీ అంటుండేవారు. 'ఈ సమాజం ఎన్నో సేవల మీద ఆధారపడి వుంది. పాకీ పనివాడు అట్టడుగున అన్ని సేవలు చేయటానికి

వున్న వ్యక్తి' అని గాంధీ నమ్మేవారు. (హరిజన్, 28 నవంబరు, 1936). 'ఈ శుభ్రం చేయటమనే పని ఎంత పవిత్రమైనది! ఆ పని కేవలం ఒక బ్రాహ్మణుడు లేదా ఒక భంగినో మాత్రమే చేయగలుగుతారు. బ్రాహ్మణుడు తన తెలివి, విజ్ఞానంతో చేస్తే, భంగి ఒక అజ్ఞానం నుంచి చేస్తాడు. నేను ఇద్దరినీ గౌరవిస్తాను. ఆరాధిస్తాను. ఒకవేళ ఈ ఇద్దర్లో ఏ ఒక్కరైనా హిందూయిజం నుంచి కనిపించకుండాపోతే, అప్పుడు హిందూయిజమే అంతరించిపోతుంది'. (భావ్‌నగర్, 8 జనవరి 1925, కథియవాడ్ రాజకీయ సభకు అధ్యక్షునిగా ఎన్నికయిన సందర్భంగా ఇచ్చిన ఉపన్యాసం). 'ఈ జన్మలో కావల్సినంత పుణ్యాన్ని నేను సంపాదించుకోలేకపోయానంటే, వచ్చే జన్మలో నేను ఒక భంగిగా పుట్టాలనేది నా కోరిక అయ్యింటుంది' అని 1925, జనవరి 11 నవజీవన్ సంచికలో గాంధీ దీని గురించి రాశారు కూడా.

అంబేద్కర్ ఆలోచనలు గాంధీ ఆలోచనలకు పూర్తి విరుద్ధం. అంబేద్కర్ ఆలోచనా సరళి ప్రకారం చూస్తే 'పాకీ పని నిర్మూలనలో వున్న అనేక సవాళ్ళను ఎవరైనా అర్థం చేసుకోగలుగుతారు. సామాజిక నిర్మాణంలో అశుభ్రమైన పని అనే దాన్ని బానిసలతోనే చేయిస్తారు. బానిసత్వానికి చిహ్నమే ఈ పాకీ పని'. దీనినే అంబేద్కర్ బలంగా విశ్వసించారు. 'పాకీ పనిని ఒక గౌరవప్రదమైన వృత్తిగా గాంధీయిజం అభివర్ణిస్తూ దాని కొనసాగింపు కోసం ప్రచారం చేస్తుంది. భారతదేశంలో వృత్తిరీత్యా ఎవ్వరూ పాకీపని వారుగా వుండరు. పుట్టుక రీత్యా పాకీపనివారుగా మారతారు. అంటరానివాళ్ళకు పాకీపని చాలా మంచిదని ఉపదేశిస్తూ మానవసేవకి ఈ పని విధానాన్ని అనుసంధానం చేయటమనేది ఈ కులానికి చెందిన అసహాయ ప్రజలపై సాగుతున్న క్రూరమైన పరిహాసం. గాంధీ మాత్రమే ఇలాంటి ప్రకటనను చేయగలుగుతారు' అని ఆయన అభిప్రాయాలను చాలా తీవ్రంగా ఖండించారు అంబేద్కర్.

ఈ రెండు దృక్కోణాల మధ్య వున్న తేడాలను గమనిస్తే సంఘసంస్కరణ, దానం, ఉదారతలు ఒకవైపు వుంటే మరోవైపు హక్కుల కోసం పోరాటం, మార్పు, విముక్తి వుంటాయి. కేవలం పాకీ పనివాళ్ళ గురించే కాకుండా దళితులందరి గురించీ కూడా అంబేద్కర్ నిర్ద్వంద్వంగా మాట్లాడినప్పుడు ఈ తేడాలు మరింతగా స్పష్టంగా బయటికి కనిపించాయి. గాంధీ ఇచ్చిన వివరణలను ఆయన విచక్షణకే వదిలేయటం జరిగింది. దీనికి కారణం స్పష్టమే. పాకీపని చేసే ఆడవాళ్ళెవరూ కూడా తమ వచ్చే జన్మలో కూడా ఇతరుల పియ్యిపెంటలను ఎత్తుతూ సమాజాన్ని శుభ్రం చేయాలని కోరుకోవటం లేదు. ఏ రకమైన మూల్యం చెల్లించి అయినా సరే, తాము తమ తర్వాతి తరాలు ఈ నరకంలోకి వెళ్ళకూడదని బలంగా కోరుకుంటున్నారు.

అయితే ఈ రెండు దృక్కోణాలు ఈ రోజుకీ ప్రతిఫలిస్తూనే వున్నాయి. ప్రచార, ప్రసారసాధనాల ద్వారా మరింత విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. తామే సొంతంగా డిజైన్ చేసుకున్న నీలిరంగు చీరల్తో ఐక్యరాజ్యసమితి వరకూ వెళ్ళి రాగలిగిన అల్వార్

రాజకుమార్తెలు (పాకీపని నుంచి విముక్తమయిన స్త్రీలు) ఇప్పుడు మనమధ్య వున్నారు. వీరికి ఈ మధ్య ప్రతి గుడి, చర్చి, మసీదు, గురుద్వారాలలో సత్కారాలు జరుగుతున్నాయి. నాడు అసహాయులైన స్త్రీలు నేడు ఈ స్థాయికి చేరడానికి తాము ఎంత సహాయపడ్డామో, ఎన్ని ప్రయత్నాలు చేశామో చెప్పటానికి వీరిని ఉద్ధరించినవారు పోటీలు పడుతున్నారు. అలాగే, బ్రాహ్మణుల సహపంక్తిలో ఈ స్త్రీలు కూడా భోజనంచేసేలా చేయటం వల్ల అంటరానితనం ఏ విధంగా రూపుమాసిపోతోందో చెప్పటానికి కూడా బోలెడంత సమయాన్ని వెచ్చించారు.

ఇక మరోకోణంలోకి వస్తే విముక్తి అంటే ఫ్లష్ టాయిలెట్ల వ్యాపారం వల్ల రాదు. నీళ్ళువుండి, ఫ్లష్ టాయిలెట్లు వుండటం ద్వారా పాకీ పని విధానం అనేది అంతర్ధానమై పోతుందనుకోవటానికి లేదు. ఆ టాయిలెట్లు కడుగుతున్న వ్యక్తి ఈ సమూహం నుంచి వచ్చినవారే అని అక్కడ తిరుగాడే ప్రతి ఒక్కరికీ తెలిసే వుంటుంది. కలిసి భోంచేస్తేనే పటాపంచలవటానికి కులం అనేది ఊహా ప్రపంచానికి సంబంధించిన అంశం ఎంత మాత్రం కాదు. కుల–మతసంకెళ్ళు బద్ధలవటం మాట అటుంచి, ఆర్థికాభివృద్ధి ఫలితంగా ఈ సంకెళ్ళు మరింత బలంగా తయారవుతున్నాయి. కులం అనేది ఒక రాజకీయ ప్రశ్న, దీనికీ వర్గస్పృహకు చాలా దగ్గరి సంబంధం వుంది. అందుకే రెండో విధానంలో ఎన్నో పరిమితులు వున్నప్పటికీ ఫలితాల కోసం సుదీర్ఘ పోరాటాలు చేయాల్సివుంటుంది. ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలను బట్టబయలు చేయడానికి ఎంతో ధైర్యంగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో అఫిడవిట్లు దాఖలుచేయడం, పోస్టర్లువేయడం, కొత్త పాటలను రూపొందించటం, పాకీపనిని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం మీద వత్తిడి తెస్తూ ధర్నాలు చేపట్టడం, సామాజిక పరివర్తన కోసం ఊరేగింపులు నిర్వహించటం, మనుషుల ఆత్మగౌరవం అనే ప్రశ్నను బలంగా ముందుకి తీసుకురావటం, ఎత్తుడుదొడ్లను కూలగొట్టటం, పాకీబుట్టలను తగల బెట్టే స్త్రీల సంఖ్య పెరిగేందుకు దోహదపడటం–ఈ క్రమంలో ఈ ఉద్యమం ఒక శక్తిగా, చైతన్యంగా, ఆగ్రహంగా మారుతుంది.

మొలకలెత్తిన ఈ చైతన్యాన్ని, ఆగ్రహాన్ని అణిచివేయడానికి ప్రభుత్వం ఏ విధంగా ప్రయత్నిస్తుందో ఈ మధ్య చేపట్టిన చర్యలనుబట్టి గమనించవచ్చు. కులపరమైన ఈ దోపిడిని ఇంకా కొనసాగించటానికి, పాకీ పనివారి గౌరవమర్యాదలను కాపాడే ఏ విధమైన రక్షణ వ్యవస్థలు లేకుండానే పార్లమెంటు ఒక కొత్త చట్టాన్ని ఆమోదించింది. పాకీపని ఉద్యోగ నియామకాల నిషేధం, వారి పునరావాస చట్టం–2013ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే ఇందులో ఘోరమైన లొసుగులున్నాయి. అసత్యాలతో కూడిన వివరణలున్నాయి–అంతేకాదు అనాగరికమైన ఈ పని కొనసాగేందుకు పలు వెసులుబాట్లు కూడా కల్పించబడ్డాయి. ఈ కొత్తచట్టంలోని సెక్షన్ 2(ఐ) (జి) (బి)ల ప్రకారం మనుషుల పియ్యిపెంటలను ఎత్తటానికి ఆధునిక పరికరాలు, రక్షణ కల్పించే సాధనాల సహాయంతో

ఎవరైనా పనిచేస్తున్నట్లయితే వారిని పాకీపనివారుగా గుర్తించనవసరంలేదని కేంద్రప్రభుత్వం ప్రకటించవచ్చు. దీన్ని అడ్డుపెట్టుకుని చీపుర్లు, చేతి తొడుగులు, బూట్లు, ముఖానికి తొడుగులు, ఇనుప పళ్ళాలు లేదా గంటెలు మొదలైనవి వాడుతున్నామని చెప్పి తప్పించుకు పోవడానికి ఈ చట్టంలోని క్లాజులు వెసులుబాటు ఇస్తున్నాయి. దీని అర్థం ఏమిటంటే చట్టంవున్నా పాకీ పని కొనసాగుతూనే వుంటుంది. ఈ చట్టం కేవలం పునరావాసం గురించే మాట్లాడుతుంది అంతే! దాన్ని అమలుపరచటంలో కూడా దారుణంగా విఫలమైంది. ఈ పని గురించి ప్రభుత్వం ప్రదర్శించే ఉపేక్ష వర్ణనాతీతం.

2013లో కూడా పాకీపని నిర్మూలనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన కాల పరిమితి ప్రకటించలేదు. దీనినిబట్టి ప్రభుత్వ ఉపేక్షను అర్థం చేసుకోవచ్చు. అంటే అనుకున్న గమ్యం చేరాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి వుందనేది స్పష్టం.

పదకొండు రాష్ట్రాల్లో ఈ అంశంపై చేపడుతున్న చర్యలు, వస్తున్న మార్పులను పట్టిచూపడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం. గత తొమ్మిది సంవత్సరాలుగా వీటికి నేను ప్రత్యక్ష సాక్షిగా వున్నాను. అరవైఏళ్ళ స్వతంత్ర భారతంలో నేటికీ ఈ అమానవీయమైన పనివిధానం కొనసాగుతూనే వుండటానికి గల రాజకీయ, సాంఘిక, న్యాయపరమైన అంశాలను విశ్లేషించేందుకు ఈ పుస్తకం ప్రయత్నించింది. అలాగే, జాగిర్దారీ అనే భ్రమలో జండర్ వివక్ష ఎలా చుట్టముట్టివుందో, ఒకతరం నుంచి ఇంకో తరానికి పాకీబుట్ట వారసత్వంగా ఎలా కొనసాగుతూ వస్తుందో చెప్పటానికి చేసిన చిరుయత్నం ఈ పుస్తకం.

చిన్నదే అయినప్పటికీ నాకూ ఒక కోరిక వుంది. ఈ పుస్తకం లేవనెత్తే ప్రశ్నలు మీ ఆలోచనలను, నమ్మకాలను చెల్లాచెదురు చేసి మీ సౌకర్యవంతమైన అనువుల నుంచి బయటకు లాగాలనీ, ఈ అమానవీయమైన విధానం గురించి మీరు తప్పనిసరిగా ఆలోచించాలనీ, తద్వారా దీనిని శాశ్వతంగా రూపుమాపేలా చర్యలు బలోపేతమవుతాయనీ ఆశిస్తున్నాను.

డిసెంబరు 2013 **భాషాసింగ్**

## మొదటి భాగం

# కనిపించని భారతదేశం




**జమ్ము -కశ్మీర్**

1. షోపియన్, 2. బండిపోర, 3. గన్‌డెర్‌బల్, 4. పుల్వామ, 5. కుప్వారా, 6. కుల్గం, 7. బారాముల్లా, 8. శ్రీనగర్, 9. అనంత్‌నాగ్ కశ్మీర్‌లో పాకీపనివారు జీవిస్తున్న ప్రాంతాలు

**కశ్మీర్**

***'మా దుస్థితి గురించి పట్టించుకోవటానికి ప్రభుత్వానికి అసలు సమయమే వుండదు. దాని ప్రాధాన్యతల ముందు మా సమస్య ఒక విషయంగా కూడా అనిపించదు.'***

ఈ శరీరమంతా ధూళిమయమే .....దీనిమీద నువ్వు ఎలా ఆధారపడతావు ?
ఇదంతా కేవలం ధూళి మాత్రమే....
గురువైన ద్రోణ వెళ్ళిపోయాడు....అలానే గర్విష్టి రావణ కూడా....
ప్రతిఒక్కరికీ తమదైన రోజు తప్పకుండా వస్తుంది....

మసక వెన్నెల్లో చినార్ చెట్లను దాటుతూ వెళ్తున్న సమయంలో ఈ చత్తీస్‌ఘడీ జానపద గీతం మా చెవులలో ప్రతిధ్వనించింది. కశ్మీర్ లోయలో – అన్యాయానికి వ్యతిరేకంగా ఎగిసిపడుతున్న పోరాటంలో ఒక సవాలుగా ఈ పాట వినిపిస్తోంది.

ప్రభుత్వ పాఠశాల కంటే ముందే వున్న పెద్ద మైదానంలో ఏడేళ్ళ సమీర్ ఫుట్‌బాల్ ఆడుతున్నాడు. పల్చటి ఫెరన్ (కోటు) తొడుక్కుని, ఆపకుండా తనలో తానే ఏదో మాట్లాడుకుంటూ ఆ మైదానం చుట్టూ పరుగులు పెడుతూనే వున్నాడు. బాగా దగ్గరికెళ్ళిన

తర్వాతే అతనంటున్నదేమిటో నేను అర్థం చేసుకోగలిగాను. 'ఆజాది, బోలో ఆజాది'. నేను నా కెమెరా తెరచి, తను అంటున్న మాటలని తిరిగి చెప్పమని అడిగాను. అతని కళ్ళల్లో ఒక గట్టి వ్యతిరేకత. అస్సలేం మాట్లాడలేదు. నెమ్మదిగా ఆ పాఠశాల వరండాలోకి వెళ్ళి పోయాడు. అక్కడ పాఠశాల యూనిఫారమ్‌లో వున్న పిల్లలు క్యారమ్‌బోర్డు ఆడు కుంటున్నారు.

నేను నా కెమెరాని వారి వైపుగా తిప్పాను. ఒక్కసారిగా అందరూ ఏకకంఠంతో అరిచారు. 'ఆజాది! మాకు తప్పనిసరిగా భారతదేశం నుంచి స్వతంత్రం కావాలి ! వెళ్ళిపో, ఇండియా, వెనక్కి వెళ్ళిపో!'

ఎవరి నుంచి స్వతంత్రం కావాలని నేను వాళ్ళని అడిగాను. అందరూ ఒకే గొంతుతో 'భారత సైన్యం నుంచి' అంటూ వెంటనే గట్టిగా నవ్వేస్తూ 'పుస్తకాల నుంచి కూడా' అన్నారు.

సైన్యం నుంచి స్వతంత్రం కావాలని ఎందుకు కోరుకుంటున్నారు?

"వాళ్ళు మమ్మల్ని చంపేస్తున్నారు. వీధుల్లో మమ్మల్ని తరుముతున్నారు. కాల్చి చంపుతున్నారు.... వాళ్ళు ఆడవాళ్ళను ఎత్తుకుపోతున్నారు...వాళ్ళు మమ్మల్ని ద్వేషిస్తారు, మేం కూడా వాళ్ళని ద్వేషిస్తున్నాం...మేమూ వాళ్ళ మీద రాళ్ళు విసురుతాం" అని కోపంగా సమాధానమిచ్చారు.

ఏడవ తరగతి చదువుతున్న డానిష్ అష్రఫ్ ఒక తీవ్ర నిరసనతో ఖాండ్రించి నేలమీద ఉమ్మేసి దానిని తన బూటుకాలుతో గట్టిగా తొక్కి రుద్దుతున్నాడు. వేరే అబ్బాయిలు కూడా దానికి తగ్గట్టుగానే అనుకరించారు. ఈ పిల్లల వయస్సులు ఆరేళ్ళ నుంచి పద్నాలుగేళ్ళ వరకూ వుంటాయి. వాళ్ళు తిరిగి ఈ నినాదాలను ప్రారంభించి, వాటిని తమ ఆటలో భాగంగా చేసుకున్నారు. ఒక్క నిమిషం సేపు నేను కెమెరాని పక్కనున్న గోడమీదకు తిప్పి, అక్కడ ఉర్దూలో రాసివున్న పంక్తుల మీద దృష్టి నిలిపాను.

***అప్నాతో కామ్ హై జలాతె రహె చిరాగ్,***
***రాస్తేమే దుష్మన్ యా దోస్త్ కా ఘర్ మిలే.***

(మా పని దీపాలు వెలిగించుకుంటూపోవటమే, దారిలో వచ్చే ఇల్లు శత్రువుదైనా కావొచ్చు లేదా మిత్రునిదైనా కావొచ్చు.)

మాతోపాటు వచ్చిన మాహెజబీన్ దానిని గట్టిగా చదువుతూ, అది ఇక్బాల్ రాసిన కవితగా మాకు చెప్పింది.

మూడురోజుల పాటు (2010 నవంబరు 15-17 వరకూ) కశ్మీర్‌లో గడపటం వల్ల, బక్రీద్ పండుగకు ఉత్సాహంగా జరిపే ఏర్పాట్లు, చుట్టుపక్కల పరిసరాలను, భిన్నభావాల 'కశ్మీరియత్' ను మరింత అర్థం చేసుకోవటానికి నాకు చాలా ఉపయోగపడింది.

మాహెజబీన్ నాకు కొంతకాలం నుంచి పరిచయం. బక్రీద్ పండుగకు ముందు ప్రభుత్వం నుంచి లేదా హురియత్ నుంచి నిషేధాజ్ఞలు వుండవు కాబట్టి, సులభంగా మూడు లేక నాలుగురోజులు తిరగ్గలుగుతామని చెప్పింది. నాకు ఈ విషయం చెప్పటానికి ముందే మాహెజబీన్ హురియత్ క్యాలెండర్ ను పరిశీలించి ఏ విధమైన సమ్మెలు గానీ లేదా గత ఆరునెలలుగా ఏ మాత్రం వెసులుబాటు లేకుండా ప్రభుత్వం విధిస్తున్న కర్ఫ్యూగానీ వుండబోవని, అక్కడి వాతావరణం కొంతలోకొంతైనా టెన్షన్ లేకుండా వుండబోతోందని నిర్ధారించుకోవాల్సి వచ్చింది. వాస్తవానికి పరిస్థితి కూడా అలానే వుంది.

కశ్మీర్‌లోని కుల్‌గామ్ జిల్లాలోని ఛావల్‌గావ్ ప్రాంతంలో వున్న మాధ్యమిక పాఠశాల గురించి నేను ఇక్కడ ప్రస్తావించదలచుకున్నాను. కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌కు డభ్భై లేదా ఎనభై కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం వుంది. ఇరవై నివాసాలతో వున్న చిన్న ప్రాంతం ఇది. దీనిని షేక్ మొహల్లా అంటారు. ఈ మొహల్లా ను ఆనుకునే ఈ పాఠశాల వుంది. ఈ షేక్‌ల పిల్లలు కూడా దీనిలో చదువుకుంటూ వుంటారు. మొహల్లాకు మేము ఈ పాఠశాల ప్రాంగణం నుంచే వెళ్ళాం. ఇక్కడ ఎక్కువ మంది వాతల్ కుటుంబాల నుంచే వస్తారని అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాకు చెప్పారు. అందుకే స్థానికంగా దీనిని వాతల్ పాఠశాల అనే పిలుస్తారు. కశ్మీర్ లో సఫాయి కార్మికులంటే షేక్ లేదా మోచీ లేదా వాతల్ అని అందరికీ తెలుసు. సాంప్రదాయికంగా వీరి పని చెప్పులు కుట్టటం లేదా సఫాయి పని చేయటం.

ఒకపక్క కశ్మీర్ అంతా స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం నినదిస్తుంటే అదే సందర్భంలో మరోపక్క ఈ ప్రత్యేకమైన మొహల్లాలను, అందులో నివశిస్తున్న వారిని  సందర్శించటం విభిన్నమైన అనుభవంగా చెప్పుకోవాలి. రాష్ట్రానికి సంబంధించిన ఏ ప్రధాన వార్తల్లోనూ ఈ మొహల్లాలు చోటుచేసుకోవు. అలాగే ఈ మొహల్లాలు తమ కష్టాలను కష్టాలుగా భావించే పరిస్థితిలో కూడా లేవు. కశ్మీర్‌లోని మరో కోణమైన ఈ కనిపించని, వినిపించని ప్రపంచంతో సంభాషించాలనేది నాకున్న బలీయమైన కోరిక. ఎట్టకేలకు ఈ ప్రయాణం సిద్ధించడంతో నా లోపలి భారం తగ్గింది.

ఈ షేక్ మొహల్లాకు నేను మాహెజబీన్‌తోనూ, సఫాయి కర్మచారి ఆందోళన్ నాయకుడు బెజవాడ విల్సన్‌తోనూ కలిసి వెళ్ళాను. కశ్మీర్‌కు చెందిన మాహెజబీన్ అదృశ్యమైపోయిన వ్యక్తుల కుటుంబాలకు, స్త్రీలకు సలహాలందించే కేంద్రం (కౌన్సిలింగ్ సెంటర్)లో చాలాకాలంగా పనిచేస్తోంది. ఆమెకు సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థ కూడా వుంది. అలాగే సఫాయి కర్మచారి అందోళన (ఎస్‌కెఏ)  రాష్ట్ర కన్వీనర్‌గా వుంటూ చాలా కాలం నుంచీ సఫాయి కార్మికుల సమూహాలతోనూ పనిచేస్తోంది. జాతీయస్థాయిలో సఫాయి పని నిర్మూలన కోసం విల్సన్ చాలా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీనితో మొహల్లాలోని వ్యక్తులతో సంభాషణ ఏ విధమైన సమస్యా లేని సుహృద్భావ వాతావరణంలో జరిగింది.

అక్కడ భాష ఒక్కటే సమస్య. ఆ గదిలో సమావేశమయిన కొందరు హిందీ అర్థం చేసుకోగలుగుతారు, కానీ మాలో ఒక్క మాహెజబీన్‌కి మాత్రమే కశ్మీరీ తెలుసు.

నేను ఇంతకు ముందు సందర్శించిన ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడ పరిస్థితి భిన్నంగా వుంది. ఉదాహరణకు ఇక్కడ మేము కలిసిన చాలామంది తాము చేస్తున్న పనిని ఒక సమస్యగా భావించటం లేదు. నిజానికి, సఫాయి పని తప్పించి తాము వేరే పని చేయొచ్చు అనే ఆలోచన కూడా వారిలో లేదు. పీరు గా కూడా పనిచేస్తున్న ఒక పెద్దాయన, 'బిడ్డా, మేము ఈ పనిని తరతరాలుగా చేస్తున్నాము, ఇది తప్పించి వేరే పని అన్న అలోచనే మేమెప్పుడూ చేయలేదు. కశ్మీర్‌లో ఎక్కడైనా సరే మీరు ఇలాంటి ఎత్తుడుదొడ్ల (డ్రై లెట్రిన్)నే చూస్తారు. మా ఇళ్ళలో కూడా ఇవే వుంటాయి. ఇళ్ళలో వుండే ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటం పెద్ద కష్టమనిపించదు. కానీ మిలటరీ క్యాంపుల్లో వుండే ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటమనేది చాలా కష్టతరమైనది.'

ఎందుకని?

'అక్కడ రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇరవైనాలుగ్గంటలూ శుభ్రం చేస్తుండవలసిందే. అదే ఇళ్ళల్లో అయితే నెలకు రెండు లేదా మూడుసార్లు వెళితే సరి పోతుంది.'

ఆడవాళ్ళు కూడా ఈ పని చేస్తారా?

'లేదు. మా మొహల్లాలో చేయరు, కానీ వేరే మొహల్లాల వాళ్ళు చేస్తారు.'

ఈ అంశంలో కూడా కశ్మీర్ దేశంలోని ఇతర ప్రాంతాల కంటే భిన్నమైనది. ఇతర ప్రాంతాల్లో పాకీపని మొత్తం ఆడవాళ్ళకే కేటాయించటం జరిగింది.

దేశంలో మిగతాచోట్ల కంటే కశ్మీర్‌లోనే అత్యధికంగా ఎత్తుడుదొడ్లను ఉపయోగిస్తున్నారని, మురుగుకాల్వల పంపులు అసలు వేయనేలేదని ఈ ప్రయాణంలోనే నాకు తెలిసివచ్చింది. నగరాలలో సెప్టిక్ ట్యాంకులను ఉపయోగించినా గానీ వాటిని చాలా వరకు చేతులతోనే శుభ్రం చేస్తారు. ఇక్కడ చేతులతో మనుషుల పియ్యిపెంటలను ఎత్తి శుభ్రం చేసే వ్యక్తులు భారతదేశంలోని ఇతర ప్రాంతాలమాదిరిగానే ప్రధాన నగరాలు లేదా పట్టణాల శివారుల్లో వున్న మొహల్లాలలో వుంటారు. అవి అపరిశుభ్రతకు మారుపేరుగా, అత్యంత దుర్గంధంతో కూడిన ప్రాంతాలుగా వుంటాయి. ఇక్కడున్న వాతల్, షేక్ లేదా మోచీ మొహల్లాలు కూడా అత్యంత మురికి, పేదరికం వ్యాపించిన ప్రాంతాలుగానే వున్నాయి. దేశంలోని ఇతర దళిత సమూహాలు వున్నట్లుగానే ఇవి కూడా వున్నాయి.

కశ్మీర్ అంతటా ఉన్నట్టే ఇక్కడ కూడా స్వతంత్రం కావాలన్న కోరిక బలంగా వుంది. కానీ, మురికి ఆవాసాలుగా పేరుబడ్డ ప్రాంతాల నుంచి విముక్తం కావాలనే ఆలోచన ఇప్పటికీ ఇక్కడ రాలేదు. లేదా నిప్పుని కప్పిపెట్టివుంచే కాంగ్రీల్లాగా, పైకి కనిపించకుండా వుండి వుండొచ్చు.

షేక్ మొహల్లాలోని ఆ చిన్న ఇంట్లో కూర్చోవడానికి ఒక చిన్న గది వుంది. గచ్చుమీద అతుకులతో వున్న బొంతతో పాటు గోడకు ఆనుకుని కూర్చోవడానికి వీలుగా కొన్ని దిండ్లు అక్కడ వేసి వున్నాయి. మేము అక్కడ కూర్చున్న మరుక్షణమే కాలుతున్న బొగ్గులు వేసిన కాంగ్రీ లు మా ముగ్గురికీ ఇచ్చారు. అక్కడ విపరీతమైన చలిగా వుంది. పిసరంతైనా సూర్యరశ్మి సోకడం లేదు. మేము సన్నగా వణుకుతుండటాన్ని వాళ్ళు గమనించారు. ప్లాస్టిక్ సంచిలో చుట్టిపెట్టి వుంచిన మంచి రగ్గునొకదాన్ని తీసుకువచ్చి మా ముగ్గురి కాళ్ళ మీద కప్పుకోమని ఇచ్చారు. బహుశా ఆ ఇంటి మొత్తానికీ అదే మంచి రగ్గు అయివుంటుంది. తర్వాత వాళ్ళు ఒక్కరొక్కరిగా తమ అనుభవాలను మాతో పంచుకున్నారు.

ఆ గదిలో మొత్తం పది మంది పాకీ కార్మికులు తమ భార్యా పిల్లలతో వున్నారు. పాకీపని విముక్తి దగ్గరి నుంచి కశ్మీరీ స్వతంత్రం వరకూ మాట్లాడటానికి ఆ స్త్రీలు ప్రదర్శించిన ఆసక్తి చాలా బాగనిపించింది. ముందుగా మాట్లాడిన ఆమె పేరు ఫాతిమా. సఫాయి పని చేస్తుండటం వలన పాఠశాలలో తన పిల్లలు ఎగతాళికి, చిన్నచూపుకు గురవుతున్నారని చెప్పిందామె. 'వీళ్ళు వాతల్ పిల్లలని, మోచీ పిల్లలని, మురికిగా వుంటారనీ, 'టాచ్ పాజిన్' పని చేస్తారనీ ప్రతిఒక్కళ్ళూ అంటారు'. కశ్మీరీ భాషలో 'టాచ్ పాజిన్' అంటే చేతులతో పియ్యిపెంటలను ఎత్తివేసే పాకీపని అని అర్థం.

తర్వాత ఆ గదిలో కూర్చున్న మగవాళ్ళు మాట్లాడటం మొదలుపెట్టారు. మొహమ్మద్ జబ్బార్ షేక్ తాను ఎనిమిదో తరగతి వరకే చదివానని, ఎందుకంటే ఆ తర్వాత తన తండ్రితో కలిసి టాచ్‌పాజిన్ పని మొదలుపెట్టానని మాకు చెప్పాడు. నలుగురు పిల్లల తండ్రైన బిలాల్ అహ్మద్ షేక్‌కి ఇరవై రెండు లేదా ఇరవై మూడు సంవత్సరాల వయస్సు వుంటుంది. తొమ్మిదో తరగతి వరకు చదివి పైచదువుల కెళ్ళాలన్న కోరిక వున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మానేశాడు. ఇప్పటికైనా చదువుకొనసాగించాలనే అనుకుంటున్నాడు. మొదట్లో టాచ్‌పాజిన్ పని చేయటానికి చాలా ఇబ్బంది పడి రోజు కూలీగా పనిచేశాడు. కళ్ళనిండా నీళ్ళు కారుతుంటే, గొంతు జీరపోతుండగా, తాను మొదటి సారి మనుషుల పియ్యిపెంటలను బక్కెట్‌లోకి ఎత్తి ఎత్తుడుదొడ్లను ఎలా శుభ్ర పరిచాడో గుర్తుచేసుకున్నాడు. అతను అప్పుడు చూడగలిగింది కేవలం కళ్ళ ముందు కదలాడుతున్న పుస్తకాలనే. దానితో అతని తల గిరగిర తిరిగిపోయింది. తన పదిహేడో ఏట నుంచీ అతను ఈ పని ప్రారంభించాడు. అందుకే అతనికి ఆ పనితో రాజీపడటం చాలా కష్టమయిపోయింది. నెమ్మదిగా దానికి అలవాటు పడిపోయాడు. మేము అతనిని కలిసే సమయానికి, తన కుటుంబ ఖర్చుల కోసం అతను ప్రతిరోజు నాలుగు లేదా ఐదు ఇళ్ళల్లో పాకీదొడ్లను శుభ్ర పరచటమే కాక వేరే కూలి పని కూడా చేస్తున్నాడు. తన పిల్లలు కూడా ఇదే పని చేయవలసివస్తే గనుక తాను వాళ్ళను మాత్రం ఎక్కువ చదివించనని

అతను నిర్మొహమాటంగా చెప్పేశాడు. లేకపోతే పుస్తకాలు చదువుకోగలిగిన శక్తి వుండి కూడా టాచ్‌పాజిన్ పని చేస్తున్నందుకు తనలాగే వాళ్ళు కూడా జీవితాంతం కుమిలిపోతారని అన్నాడు.

మేము కూర్చున్న గదిలో గోడ మీద ఒక ఫోటోగ్రాఫ్ వుంది. దానికిందనే దిండ్లకి ఆనుకుని కూర్చున్నాం. ఆ ఫొటో ఎవరిదని మేము అడిగినప్పుడు అది బిలాల్ తండ్రి గులామ్ హసన్ షేక్ దని, ఆయన ఒక పీరు కూడా అని తెలిసింది. షేక్ సమూహాల్లో కూడా పీర్‌లు బాగా పెరగటం కనిపిస్తుంది. 'కష్టాలు చాలా ఎక్కువవుతున్నాయి. పొద్దున ఇంటి నుంచి బయటకు వెళ్ళిన వ్యక్తి సాయంత్రానికి ఏ ప్రమాదమూ జరగకుండా భార్యా పిల్లలను చేరుకుంటాడనే నమ్మకం లేదు' అని గులామ్ అన్నాడు. ఒకవైపు భయంకరమైన ఈ మురికి కంపు, మరోవైపు రాజ్యం కురిపించే బులెట్ల వర్షం. ఇలాంటి పరిస్థితుల్లో, ఒక పీర్ ఆలంబనగా వుంటాడు. కశ్మీర్‌లోని వివిధ సమూహాల్లో గత పదేళ్ళలో పీర్ల సంస్కృతి బాగా విస్తరించింది. చెదురుమదురుగా షేక్ మొహల్లాలలో కూడా వీళ్ళు కనిపిస్తారు.

మొహల్లా పక్కనే వున్న రాష్ట్ర మత్స్యవిభాగంలో కూడా ఎత్తుడుదొడ్డి వుందని షహజాద్ అనే వ్యక్తి మాకు చెప్పాడు. మేమందరం అక్కడికి వెళ్ళాం. ఆ ఆఫీసు భవనంలో ఒక మూలగా ఆ దొడ్డి వుంది. దానిని కింది స్థాయి ఉద్యోగులు ఉపయోగిస్తారు. ఆఫీసర్లకు ఫ్లష్ లెట్రిన్ వుంది. ఇక్కడ ఎత్తుడుదొడ్లు (డ్రైలెట్రిన్లు) రెండు రకాలుగా వున్నాయి. ఒకదాంట్లో బూడిద జల్లుతారు. మనుషుల పియ్యిపెంట దానితో పాటు మట్టిలో కలిసిపోతుంది. ఇంకోదాంట్లో బక్కెట్‌ని గానీ ఒక ట్యాంక్ గానీ వుంచుతారు. టాచ్‌పాజిన్‌లు వాటిని బయటికి తీసి తమ బక్కెట్లలోకి ఆ పియ్యిపెంటను చేతిలో ఏదన్నా రేకును ఉపయోగించి ఎత్తుతారు. ఆ తర్వాత వాటిని శుభ్రపరుస్తారు. ఈ దొడ్లు చెక్కతో ఒక నిర్ణీత ఎత్తులో నిర్మిస్తారు. విసర్జిత పదార్థాన్ని కింది నుంచి బయటకు తీస్తారు. ఆ పని ఎలా చేస్తారో మాకు చూపించటానికి షహజాద్ ముందుకు వచ్చాడు. అతను తన పారను కూడా తీసుకువచ్చాడు. కానీ ఆ పని ఎలా చేస్తారో మాకు చేసి చూపించమని అడగటానికి మేమెవ్వరం ఇష్టపడలేదు. 'ఫర్వాలేదు మేడమ్, మీకు పెన్ను పట్టుకోవటం ఎలాంటిదో మాకు పార పట్టుకోవటం కూడా అంతే' అని షహజాద్ అన్నాడు. అందరం నవ్వేశాం. నవ్వులు, నవ్వులాటలు (చమత్కారాలు) కశ్మీరీ జీవితంలో ఒక విడదీయరాని భాగం.

అప్పటికి మాకు వేడి ఉప్పు తేనీటికి ఆహ్వానం అందింది. అందరం ఇంటివైపుగా కదిలాం. అక్కడికి చేరుకున్న వెంటనే ఈ అమానవీయమైన పని నుంచి వారు ఎలా తప్పించుకోగలుగుతారనే దృష్టితో రెండో విడత చర్చ మొదలయింది. కొంత మంది ఈ పని నుంచి తప్పుకోవాలన్నారు కానీ, ఈ రోజు కశ్మీర్ ఎదుర్కొంటున్న సవాళ్ళలో, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక అత్యాచారాల ఘటనల్లో ఈ సమస్యకు అంత ప్రాధాన్యం లభించే

అవకాశం లేదని కూడా వారు అన్నారు. తమ పిల్లలు ఈ రొంపిలోకి రావటం ఎవ్వరికీ ఎంత మాత్రం ఇష్టం లేదు. ఈ అమానవీయమైన పని నుంచి వారి పిల్లలను తప్పించటానికి ఏం చేయడానికైనా వారు సిద్ధమే. చేతులతో పియ్యిపెంటలను ఎత్తివేసే పాకీ పని నుంచి విముక్తం అనే అంశం మొదటిసారిగా వారి దృష్టికి వచ్చింది. ఇది పూర్తిగా వారి మనసుల్లోకి ఇంకటానికి కాస్త సమయం అవసరమనేది స్పష్టం.

ఆ తర్వాత అక్కడి నుంచి మేము షోపియన్ వైపుగా బయలుదేరాం. నేను ఈ నగరాన్ని చూడాలని కుతూహలపడ్డాను. 2009 మే నెలలో సెక్యూరిటీ దళసభ్యులు ఆసియా జాన్‌ను, ఆమె వదిన నిలోఫర్‌ను సామూహిక అత్యాచారం చేసి చంపేశారు. షోపియన్‌లో నివశించే ప్రతిఒక్కరికీ ఏం జరిగిందనేది తెలుసు. కేవలం సెక్యూరిటీ దళాలు, సిబిఐ మాత్రం భిన్నవాదన వినిపిస్తున్నాయి. మొత్తం కశ్మీర్ లోయ అంతా ఈ సంఘటన తర్వాత తగలబడిపోయింది. ఆ కుటుంబాన్ని, అలానే ఈ సమస్య మీద న్యాయం కోసం సుదీర్ఘ కాలం నుంచి నిర్భయంగా పోరాడుతున్న మజ్లిస్ ఏ ముషావరత్ కార్యకర్తలను కూడా కలుసుకోవాలని నేను అనుకున్నాను. న్యాయపోరాటంలో అడుగడుగునా మోసపోతున్నా గానీ వారు ఇంకా ఆ సమస్యను భుజాన వేసుకునే వున్నారు.

ఈ గ్రూపుని కలవటానికి శ్రీనగర్ లోని మానవహక్కుల కార్యకర్త కుర్రం పర్వేజ్ మాకు సహకరించాడు. ఇతనే మాకు మజ్లిస్ ఏ ముషావరత్  సభ్యుడు ఫయాజ్ ఫోన్ నంబరుని ఇచ్చి అతనికి మేము వస్తున్నట్లుగా కబురు చెప్పాడు. అయితే వీళ్ళని కలవటానికంటే ముందే షోపియన్‌లోని వాతల్ మొహల్లాలోని ప్రజలు చాలా మంది మమ్మల్ని కలవటానికి చాలా సేపటి నుంచి ఎదురు చూస్తుండటంతో వారిని ముందుగా కలవాల్సి వచ్చింది. చావల్‌గావ్ నుంచి అక్కడి చేరటానికి మాకు రెండు గంటలు పట్టింది. అప్పటికే సూర్యుడు అస్తమిస్తున్నాడు. చినార్ చెట్లు చాలా స్థబ్దుగా వున్నాయి. అలసిపోయిన పక్షులు వాటి గూళ్ళకు చేరుకుంటున్నాయి. వాటి సందడి సద్దుమణిగింది.

తాహిర్, షఫిక్ లు ఇద్దరూ వాతల్ మొహల్లా బయట మమ్మల్ని కలిశారు . ఇక్కడ మేం కూర్చున్న గది కూడా చావల్‌గావ్ లో వున్నట్లుగానే వుంది. ఒక్క తేడా ఏమిటంటే ఇది ఇంకొంచెం పెద్దదిగా రెండతస్తులతో వుంది. మొదటి అంతస్తులో కూర్చునే గది వుంది. మేం మెట్ల వైపుగా వెళుతున్నప్పుడు వినిపించిన ప్రెషర్ కుక్కర్ ఈల  మాకు మా ఆకలిని గుర్తుచేసింది. ఆ రోజంతా మేమేమీ తినలేదు.  వీస్తున్న ఆ మంచి సువాసన నుంచి ఏం వండుతున్నారో గ్రహించటానికి ఒక్క క్షణం ప్రయత్నం చేశాను. మా ఎదురుగా కూర్చున్న సారా అనే అమ్మాయి అది మాంసం అని చెప్పింది.

'కశ్మీరీ'నా అని నేను అడిగాను?

'అవును, పాలకూరతో' అని ఆమె చెప్పింది.

మేము నవ్వేసి మెట్లెక్కడం మొదలుపెట్టాం.

అక్కడ అప్పటికే జనం కూర్చుని వున్నారు. దుప్పట్లు, కాంగ్రీలు అన్నీ పరిచి వున్నాయి. పాకీ పని నుంచి విముక్తం కోసం 2010 లో సామాజిక పరివర్తన పేరుతో జరిగిన జాతీయ స్థాయి పాదయాత్రలో ఆ గదిలో వున్న చాలామంది పాల్గొన్నారని తాహిర్ మాకు చెప్పాడు. వాళ్ళు ఆ పత్రాల్ని నింపినప్పటికీ, పాకీపని నుంచి విముక్తం అవుతామన్న నమ్మకం కలగలేదనే చెప్పాలి. ఇక్కడ కూడా వారెదుర్కొంటున్న అతి పెద్ద సమస్య వారి పిల్లలు పాఠశాల్లో వివక్షకు గురికావటం. ఉపాధ్యాయులు కూడా, 'వీడు వాతల్ పిల్లవాడు, మోచీ పిల్ల, వాళ్ళతో కూర్చోకండి' అని చెప్తారు. సమాజం లోతుల్లోకి చొచ్చుకుపోయిన ఈ వివక్షలో తమ పిల్లల భవిష్యత్తు గురించి వాళ్ళు తీవ్రంగానే ఆలోచిస్తున్నారు. ఈ అమానవీయ పరిస్థితుల నుంచి వారి పిల్లలు విముక్తం కాగలుగుతారా? కాకపోవచ్చు. ఈ మొహల్లా పక్కన వున్న ప్రభుత్వ పాఠశాలని వాతల్ పాఠశాలగా ప్రజలు ముద్రవేశారని, దీనిలో చదువుకోటానికి వచ్చే ఇతర కులాల పిల్లలు వేరే అవకాశం లేక తప్పనిసరి పరిస్థితుల్లోనే వస్తున్నారని నలభైయేళ్ళ సాబిర్ చెప్పాడు. ఈ మొహల్లాలో వుండే చాలా మంది మున్సిపల్ కమిటీ కోసం శాశ్వత ప్రాతిపదికన కొంత మంది, తాత్కాలికంగా మరి కొంత మంది పనిచేస్తారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేవారికి నెలకు 3000 రూపాయలు, శాశ్వత ప్రాతిపదికన చేసేవారికి నెలకు 10,000 నుంచి 12,000 వరకూ వేతనం వస్తుంది. చాలా మంది తాత్కాలిక ఉద్యోగులే.

మాటల మధ్యలోనే మా ముగ్గురికోసం టీతో పాటు మూడు ప్లేట్లలో బిస్కట్లు వచ్చాయి. కశ్మీర్‌లో బేకరీలు సర్వసాధారణం. బక్రీద్ పండుగ సందర్భంగా బేకరీలు జనసమ్మర్దంగా వున్నాయి. రకరకాల బిస్కెట్లు, పేస్టరీలతో పాటు కాల్చి తయారుగా వున్న రొట్టెలను కూడా జనం బాగా కొంటారు. నా ముందు పెట్టిన బిస్కెట్లు కూడా ఈ ఏర్పాట్లలో భాగంలానే కనిపిస్తున్నాయి. అందులో ఐదు రకాల బిస్కెట్లు వున్నాయి. నేను అన్నింటినీ రుచి చూడాలనుకున్నాను. టీ ఉప్పు లేకుండా వుంది. మెట్లు దిగి కిందికి వెళుతున్నప్పుడు పొగలు కక్కుతున్న ఒక సమొవార్ (టీ కాచే ఒక ప్రత్యేక పాత్ర)ను నేను చూశాను. టీ తాగిన తర్వాత నేను, మాహెజబీన్ కలిసి పాకీదొడ్డి వైపు వెళుతున్నప్పుడు కూడా నేను మళ్ళీ దానిని గమనించాను. కొన్ని వివరాలు అడిగిన తర్వాత, దానిలో కశ్మీరీ ఉప్పు టీ వుందని నా కర్థమయింది.

'కొంచెం రుచి చూస్తారా' అని సారా అడిగింది.

వద్దని చెప్పటం సాధ్యపడక 'తప్పకుండా' అన్నాం.

మేము పాకీదొడ్డి వైపు వెళుతున్నప్పుడు ఆమె టీని వేడిచేయటం మొదలుపెట్టింది. అది ఎత్తుడుదొడ్డి. దానిని వాడటం నిజంగా ఎంత నరకమనేది నాకు అప్పుడే అనుభవం లోకి వచ్చింది. అప్పటివరకూ నేను ఈ ఎత్తుడుదొడ్ల గురించి రాయటమో లేదా వాటిని బయటినుంచి ఫొటోలు తీయటమో తప్పించి నాకు నేనుగా వాటిని ఎప్పుడూ ఉపయోగించ

లేదు. ఇక్కడ ఇవి తప్ప మరో గత్యంతరం లేదు. ఈ మొహల్లాలో వేరే స్థలం అంటూ ఏమీ లేకపోవటంతో బయటకు వెళ్ళి ఎక్కడో ఒకచోట ఆరుబయల్లో ఆ పని కానిచ్చేసే అవకాశం లేదు. పియ్యిపెంటలతో, మురుగుతో ఆ దొడ్డి చాలా ఘోరంగా వుంది. గొంతులో నుంచి వస్తున్న వాంతిని ఆపటం నాకు అసాధ్యమైపోయింది. హు! వాడటమే ఇంత కష్టంగా వుంటే, ఇంక దీనిని శుభ్రపరచటమనేది నరకంతో సమానమే. అసలు ఇంత అమానవీయమైన ఈ పనిని మనుషులు ఎలా చేయగలుగుతున్నారు? అసలు మన వ్యవస్థ ఇంత దుర్మార్గమైన పనిని కులం పేరుతో ఎలా కొనసాగించ గలుగుతోంది?

నేను బయటకు వచ్చిన తర్వాత, నా ముఖంలో వున్న అసహ్యాన్ని కనిపెట్టిన సారా 'ఇక్కడ అన్ని ఇళ్ళల్లోనూ ఇలానే వుంటాయి. వాటిని మేమే శుభ్రం చేసుకుంటాం. మా కష్టాలు పట్టించుకోవటానికి ప్రభుత్వానికి సమయం లేదు. అది పట్టించుకునే విషయాల ముందు మా సమస్య చిన్నదిగా కనిపిస్తుంది' అని అంది. ఆ తర్వాత పెద్దగా నవ్వుతూ, 'అయితే, నువ్వు దీని గురించి ఆలోచిస్తూ ఎలా బయటకు వచ్చావో, అలానే వాళ్ళు కూడా తప్పకుండా ఆలోచించాల్సిందే. ఇది రోజువారీ చేయాల్సిన పనే. తిండి, నీళ్ళు, కరెంటు, అలానే తుపాకి, బులెట్లు, స్వాతంత్ర్యం– ఇలా అన్నిటి గురించి ఇక్కడ చర్చలు జరుగుతున్నాయి కానీ ఈ సమస్య గురించి లేదు! ఈ అంశం ప్రస్తావించటానికి అందరూ సిగ్గుపడతారు. ఇది మన రోజువారీ జీవితంలో భాగం కాదా? ఏం మనం దొడ్డికి వెళ్ళమా?' అని అంటూంటే సారా మొహం కోపంతో మరింత ఎరుపెక్కింది.

'నీకు పెళ్ళి కుదిరిందా' అని నేను చాలా మామూలుగా అడిగాను. నాకెలా తెలిసిందా అని ఆమె తుళ్ళిపడుతూ చూసింది. 'అది నీ మొహం మీద కనిపిస్తోంది' అని నేను నవ్వులాటగా అన్నాను.

తను చాలా సిగ్గుపడిపోయింది. 'అవును' అంటూ ' శ్రీనగర్ దగ్గర....వాళ్ళకు ఈ టాచ్‌పాజిన్ పని వుందా అని ముందు అదే అడిగాను. లేదు అని తెలిసిన తర్వాతే మా వాళ్ళు సరే అని చెప్పటానికి ఒప్పుకున్నాను. నా కాబోయే భర్త టైలర్. అతను పేదవాడే, అయినా ఫర్వాలేదు. కనీసం నేనన్నా ఈ భయంకరమైన పని నుంచి బయటపడతాను' అని చెప్తూ, రెండు గాజు గిన్నెల్లో గులాబీ రంగులో వున్న ఉప్పటి టీని పోసింది. దాని రుచి పూర్తిగా అదో రకంగా ఉండటంతో తాగటం నాకు చాలా ఇబ్బందిగానే అనిపించింది. అయితే నేను దానిని పూర్తిగా తాగుతున్నానా లేదా అని సారా నన్ను నిశితంగా పరిశీలిస్తూనే వుంది. దానితో పూర్తిగా తాగకుండా ఒదిలిపెట్టేయడం అనే ముచ్చటే లేకుండా పోయింది. దాని తర్వాత కశ్మీరీ ఘోష్ ని రుచి చూడాల్సిందే అని ఆమె బలవంతపెట్టింది. ఆ ఎత్తుడుదొడ్డి వాడినప్పుడు కలిగిన వికారంతో నాకేదన్నా వెంటనే తినడానికి ఇబ్బందిగా మారింది. కానీ, మాహెజబీన్ ఏదైనా తినాలనుకుంటూ వుంది. మేము తినాలా వద్దా అని ఊగిసలాడుతుండగానే సారా పళ్ళాల్లో కొంచెం పెట్టేసింది.

దాని వాసన చాలా అద్భుతంగా వుండి నోట్లో నీళ్ళు ఊరేలా చేస్తోంది. అయితే కొద్ది నిముషాల ముందు ఆమె మాట్లాడిన మాటలే నా ఆలోచనల్లో చిక్కుపడిపోయాయి. నా నాలుకకి ఏమీ సయించడం లేదు. దానితో నేను కొంచెమే రుచి చూసి, దాని రుచిని మెచ్చుకుంటూ మెట్ల మీదుగా పైన కూర్చునే గదిలోకి వెళ్ళిపోయాను. షోపియన్ లోని ఇంకోభాగాన్ని కూడా నేను చూడాలి. చీకటిపడుతుండటంతో నాకు కొంచెం ఆందోళన మొదలయింది. నేను మెట్ల మీదికి చేరుకునేసరికి, అక్కడ చర్చ ఒక కొలిక్కి వస్తోంది. అమానవీయమైన ఈ మురికి పనిని వదిలేయాలని, తాత తండ్రులు ఈ పని చేసేవారని, తమ పిల్లలు మరిచిపోయేలా చేయాలని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. పక్కనే వున్న ప్రాంతంలోని ఎత్తుడుదొడ్లను చూసిన తర్వాత మేము అందరికీ వీడ్కోలు చెప్పి అక్కడి నుంచి బయలుదేరాం.

ఆ తర్వాత మేము ఫయాజ్‌కు ఫోన్ చేశాం. అప్పుడే అతను నమాజ్ కోసం మసీదులోకి వెళుతున్నాడు. మేము అక్కడికి ఎలా చేరుకోవాలో డ్రైవర్‌కి వివరించి ఒక నిర్ణీత ప్రాంతంలో మమ్మల్ని వుండమని చెప్పాడు.

సూర్యకాంతి క్రమక్రమంగా తగ్గుతూ చీకటి ముసురుకుంటోంది. కశ్మీర్‌లో చీకటిపడిన తర్వాత వాతావరణం చాలా గంభీరంగా భారంగా వుంటుంది. యూనిఫారం వేసుకున్న సైనిక బలగాలు ప్రతిచోటా కనిపిస్తుంటే మనకి లోలోపల ఒక భయం కమ్ము కుంటుంది. అకస్మాత్తుగా ఎవరికో మనం ఒక లక్ష్యంగా, పేలబోయే ఒక తుపాకీ తూటాకు దగ్గరలో వున్నామనిపిస్తుంది. ఫయాజ్ రావటానికి కొంత సమయం పట్టడంతో యువకుడైన డ్రైవర్‌లో చాలా ఆందోళన పెరిగింది. తన పేరు జావెద్. అతను అప్పటికే చాలా కోపంగా వున్నాడు. ఆ సమయంలో అతని కోపం, ఆందోళనను అర్థం చేసుకోవచ్చు. ఇంకా మేం చేయాల్సిన ప్రయాణం చాలా వుంది. మేం కశ్మీర్‌కు వచ్చి కశ్మీర్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న వాళ్ళని కాకుండా ఈ మురికి ఓడుతున్న ప్రాంతాలని, మనుషులను కలవటానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చామని కూడా డ్రైవర్ కోపానికి ఇంకో కారణం అయి వుండచ్చునిపించింది. ఒక సమయంలో షోపియన్ నుంచి వెళ్ళిపోదామని డ్రైవర్ చాలా ప్రయత్నించాడు. కానీ ఫయాజ్‌ని, నిలోఫర్ కుటుంబాన్ని కలవకుండా అక్కడి నుంచి కదిలేది లేదని నేను గట్టిగా చెప్పాల్సివచ్చింది. ఈ గందరగోళంలో వుండగానే ఒక వ్యక్తి కారు అద్దాల మీద చేతితో తడుతూ కనిపించాడు. అతనే ఫయాజ్. 'మీరు చాలా ఆలస్యంగా వచ్చారు, ఇప్పటికే చాలా చీకటి పడింది, మీరు ఈ రాత్రికి ఇక్కడే వుంటారా?' అని అతను మమ్మల్ని కలిసిన వెంటనే మొదటి ప్రశ్న వేశాడు. మేం లేదని చెప్పడంతో 'రక్షణ దళాలు ఈ ప్రాంతమంతా వున్నాయి. మీరు సురక్షితంగా వెళ్ళాలంటే తొందరగా కదలండి' అని అన్నాడతను.

మా కారు ఒక లైను ముందు ఆగింది. ఆ చీకట్లోనే మేమొక ఇంట్లోకి వెళ్ళాం. ఎవరో మాకు తోడుగా లాంతరును పట్టుకుని మొదటి అంతస్తులో ఎడమవైపు వున్న గదిలోకి తీసుకెళ్ళారు. మాకు పరిచయం లేని ఆ ఇంట్లో మసక చీకట్లో ఎత్తుగా వున్న ఆ మెట్లను ఎక్కి వెళ్ళాం. ఆ తర్వాత షకీల్ అహ్మద్ అహంగర్ లోపలికి వచ్చాడు. అతను పదిహేడేళ్ళ ఆశియా జాన్‌కి అన్నయ్య. ఇరవైరెండేళ్ళ నీలోఫర్ కి భర్త. వాళ్ళిద్దరూ హత్యకు గురయ్యారు. కూర్చున్న వెంటనే అతను 'ఈ విషాదంలో నాకు ఇప్పుడేమీ చెప్పాలని గానీ, మాట్లాడాలని గానీ లేదు. నా గొంతు కూడా సహకరించటం లేదు' అన్నాడు. కొద్దిసేపటి తర్వాత, 'ఇంతకు ముందు పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం మీద కొద్దిగా నమ్మకం వుండేది. ఇప్పుడు సిబిఐ, న్యాయవ్యవస్థ మీద కూడా నాకు నమ్మకం పూర్తిగా పోయింది. గత సంవత్సర కాలంగా ప్రజాస్వామ్యంలో వున్న అన్ని వ్యవస్థల నుంచి న్యాయాన్ని కోరుకున్నాం. మేం చాలా శాంతియుతంగా పోరాటం చేశాం–ఆ సందర్భంగా షోపియన్‌లో ఒక్క చావు కూడా జరగలేదు. కానీ ఈ లోయ అంతా తగలబడిపోయినప్పుడు పద్నాలుగు మంది తమ ప్రాణాలు కోల్పోయారు. సిబిఐ మమ్మల్ని మోసం చేసింది. న్యాయమైన తీర్పు ఇచ్చే సమయానికి జమ్ము కశ్మీర్ హైకోర్టు జడ్జి ఒకరికి సిక్కిం రాష్ట్రానికి బదిలీ అయింది. ఎక్కడా ఏమీ జరగదు....' షకీల్ గొంతు తడబడుతోంది. 'ఇప్పుడు మీరు చెప్పండి, మేం ఏం చేయాలి?.... ఎక్కడికి వెళ్ళాలి?....' అతని కళ్ళ నుంచి నీళ్ళు కారడానికి సిద్ధంగా వున్నాయి; అతను నెమ్మదిగా లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ గదిలో వెలుతురు అకస్మాత్తుగా తగ్గిపోవడంతో, ముఖాలు మసక మసకగా కనిపిస్తున్నాయి. షోపియన్ సంఘటనలో న్యాయం జరగటం కోసం ఒక ప్రజాసంఘటనను నిర్మించామని ఫయాజ్ చెప్పాడు. ఇందులో ఏ రాజకీయ పార్టీకి గానీ, గ్రూపుకి గానీ చెందని వారే సభ్యులుగా వుండేలా జాగ్రత్త తీసుకున్నారు. మజ్లిస్ ఎలా మొదలయింది, మొదటి నుంచీ ఆ రోజు వరకూ దాని ప్రయాణం ఎలా కొనసాగుతోందో ఫయాజ్ చెప్పటం మొదలు పెట్టాడు. స్వతంత్రం కావాలనే నినాదాన్ని ఉద్దేశపూర్వకంగా మజ్లిస్ పక్కకు పెట్టిందని కూడా అతను వివరించాడు. దీనిలో వున్న ఒకే ఒక్క డిమాండ్ ఆశియా, నిలోఫర్‌లకు న్యాయం జరగాలని మాత్రమే వుంది. 'మేము సిబిఐకి సహాయం కూడా చేశాం' అని చెప్తూ అతను కొనసాగించాడు. 'వారికి పూర్తిగా సహకరించాం..... దీనివలన మేం విమర్శలకు కూడా గురయ్యాం. మాకు న్యాయం జరగాలనే మేమన్నాం....కానీ చాలా మోసపోయాం. ఇప్పుడు మేము ఏ ఒక్కరినీ నమ్మలేం'.

షకీల్ తన మూడేళ్ళ కొడుకు సుజెన్ షకీల్‌తో కలిసి వెనక్కి తిరిగి వచ్చాడు. సంభాషణ వేరే వైపుకు మరలింది. 'ఈ రోజు ఈ అబ్బాయి పదే పదే "ఆజాది అని వల్లెవేస్తూ మాకు భారతదేశం నుంచి స్వతంత్రం కావాలి" అంటుంటే నేను ఇప్పుడేమీ అనలేకపోతున్నాను. అలా అని అతన్ని ఆపలేను కూడా' అని షకీల్ అన్నాడు. ఆ బాబు

చిర్నవ్వు నవ్వుతూ 'ఆజాది..' అన్నాడు. తన మొబైల్ ఫోన్‌లో వున్న సుజెన్ వీడియో నొకదాన్ని షకీల్ మాకు చూపించాడు. దానిలో ఆ బాబు ఆ వాక్యాన్ని పదే పదే పలుకుతూ డాన్స్ చేస్తున్నాడు. ఆ గదిలో ఆశియా నిలోఫర్‌ల ఫొటో ఒకటి వుంది. సుజెన్ ఆ ఫొటో వంక చూస్తూ 'అమ్మి!' అన్నాడు. నా గుండెల్లో కత్తి దింపి మెలిపెట్టినట్లుగా అనిపించింది. ఎవరికీ ఏం మాట్లాడటానికి లేదు. కళ్ళు చెమర్చాయి. రాత్రవుతున్న కొద్దీ చలి బాగా పెరుగుతోంది. మా ఎముకల్లోంచి వస్తున్న వణుకు మాకు తెలుస్తోంది.

అప్పటికే చాలా ఆలస్యమయింది. మా సంభాషణ ఒక ముగింపుకి వచ్చేట్లు కనిపించటం లేదు. మాటల మధ్యలో వాళ్ళు మమ్మల్ని ఆ రాత్రికి వుండిపొమ్మని, మర్నాడు పొద్దునే వెళ్ళొచ్చని చెప్తూనే వున్నారు. 'కొద్దిరోజుల క్రితం, భారత ప్రభుత్వం తరఫున చర్చల కోసం దిలీప్ పడ్‌గోంకర్, రాధాకుమార్ వచ్చారు. మేము వారిని కలవటానికి ఇష్టపడలేదు. అయినప్పటికీ, కశ్మీర్‌లో అతిథులపట్ల చాలా గౌరవం వుంటుంది. సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్, చిదంబరంగార్లు షోపియన్ సంఘటనని, మా బాధని తెలుసుకోవటం కోసం తమని పంపించారని దిలీప్‌గారు చెప్పారు. "భారతదేశ ప్రధానికి ఇప్పటికీ ఈ సంఘటన గురించి తెలియదా! ఇది జరిగి చాలా రోజులయి పోయింది. ఆయన మిమ్మల్ని ఇన్ని రోజుల తర్వాత ఏం జరిగిందో తెలుసుకురమ్మని పంపించాడా" అని మా అమ్మ అడిగింది. ఏదేమైనా, మేం వారితో మాట్లాడాము. వారికి అన్ని పేపర్లను, ఫొటోలను చూపించాము. మేం ఇదంతా చెప్తున్నపుడు "అతి త్వరలోనే ఏదన్నా చేయాలి; ఇంత అన్యాయాన్ని ఎవరూ భరించకూడదు" అని దిలీప్ దాదాపు ఏడుస్తూ మాతో అన్నారు'. షకీల్ బాధ పదే పదే వ్యక్తమవుతూనే వుంది.

ఫయాజ్ మధ్యలోనే అతనికి అడ్డువస్తూ, 'మేం చర్చల కోసం వచ్చిన వారిని కలవలేదు. మాకు భారత ప్రభుత్వం మీద నమ్మకం లేదు. మమ్మల్ని మోసం చేయటానికే చర్చల పేరుతో వారిని పంపించారు. భారత ప్రభుత్వానికి కశ్మీర్‌లో జరుగుతున్నదాని గురించి ఏమీ తెలియదనటం, చర్చల పేరుతో వచ్చిన వారి ద్వారా తెలుసుకోవాలనటం అంతా అబద్ధం. ఇంత పెద్ద అబద్ధాన్ని ఆడుతున్నందుకు భారత ప్రభుత్వం నిజంగా సిగ్గుపడాలి. ఈ మాత్రం అడుగు ముందుకు వేయటానికి కూడా 104 మంది పిల్లలు చనిపోయేవరకూ స్పందించలేదు....'

అప్పుడు షకీల్ మాట్లాడుతూ, 'దిలీప్ చాలా విషయాలు చెప్పారు? కానీ ఫలితం ఏమిటి?.....ఆ సాయంత్రం టీవీలో భారత ప్రభుత్వం తరఫున వచ్చినవారు నీళ్ళల్లో మునిగి చనిపోయిన ఆ ఇద్దరు మహిళల కుటుంబాలను వెళ్ళి కలిసారని చెప్పారు. దానర్థం, వాళ్ళు మమ్మల్ని కలిసి మాట్లాడిన తర్వాత కూడా ఈ ఇద్దరు ఆడవాళ్ళు కేవలం నీళ్ళలో మునిగి చనిపోయారని నిర్ధారించటమేగా? వీళ్ళు ఎక్కడైతే మునిగిపోయారని చెప్తున్నారో అక్కడ కనీసం నడుము లోతు నీళ్ళు కూడా వుండవు. ఈ ప్రభుత్వం, వారి ప్రతినిధులు

ఇద్దరూ కూడా మమ్మల్ని మోసం చేశారని మేం అనుకుంటున్నాం. వారికి నిజాయితీ లేదు. మమ్మల్ని కలిసింది కూడా వాళ్ళు తమ ప్రయోజనాలకే ఉపయోగించుకున్నారు. అన్ని రోజుల తరబడి జరిగిన పోరాటం తర్వాత కూడా పరిస్థితి యథాతథంగానే వుంది......మేం ఎవరి నుంచైనా ఎందుకు న్యాయం ఆశించాలి?....మా మొహం మీదే భారత ప్రభుత్వం అన్ని దారులనూ మూసేసింది. మాకు ఇంక వేరే దారేమీ లేదు ఒక్క ఆజాది తప్ప. ఇప్పటివరకూ కూడా మేం న్యాయం కోసం జరిగిన షోపియన్ పోరాటాన్ని ఈ అనుభవం తర్వాత పూర్తిగా దూరం పెట్టాం....'

అక్కడ కొద్దిసేపు మాట్లాడటం ఆపిన అతను, మళ్ళీ మాతో 'ఇప్పుడు మీరు వెంటనే వెళ్ళనన్నా వెళ్ళండి లేదా వుండిపోండి. ఇది మీ ఇల్లే అని, ఇక్కడ మీరు సురక్షితంగా వుంటారని గుర్తుంచుకోండి' అని అన్నాడు. నాకు వుండిపోవాలనే వుంది కానీ కుదరదు. నాతో పాటు వచ్చినవారు కూడా ఇంకా వున్నారు. మా ముందు నిలోఫర్, ఆశియా అందరితో కలిసి దిగిన ఫొటోలు పరిచి వున్నాయి. వాటిని ఒక దగ్గరకు సర్దుతూ, 'మరోసారి తప్పకుండా' అన్నాన్నేను.

కిందికి దిగి వెళ్తూ, మేం వాతల్ సమూహాన్ని కలవటానికి వచ్చామని, ఇక్కడ వారి పరిస్థితులను తెలుసుకుని అవమానకరమైన వారి జీవితాల నుంచి విముక్తి కల్పించేందుకు సహాయపడటం కోసం వచ్చామని చెప్పాం. ఈ విషయంలో కూడా సహాయపడమని మాహెజబీన్ వారిని అడిగింది. వాతల్ సమూహం వివరాలు ఇవ్వమని ఫయాజ్ అడిగాడు, ఇస్తామని చెప్పాం. నిలోఫర్, ఆశియాల జ్ఞాపకార్థం ఒక సమాధి నిర్మించామని, దాన్ని మేం చూస్తే బాగుంటుందని షకీల్ అన్నాడు. మేం వెళ్ళేదారిలో వున్న దాని గుర్తులు చెప్పి మాకు చూపించటానికి తోడుగా వెళ్ళమని అక్కడ వున్న అబ్బాయిలకు కూడా చెప్పాడు. వారికి వీడ్కోలు పలుకుతూ, 'భారతదేశంలో వున్న ఒక స్నేహితురాలుగా నన్ను భావించండి, అక్కడ మీ అనుభవాలు పంచుకోవటం చాలా ముఖ్యం, మీకు సంబంధించిన వార్తలు తెలియజేస్తుండండి' అన్నాను. అంతకు మించి నేను ఇంకేమీ చెప్పే పరిస్థితిలో లేను. నేను విన్నది, చూసింది యథాతథంగా పూర్తిగా ప్రచురించగలుగుతామనే నమ్మకం నాకేమీ లేదు గానీ, కనీసం ఏదో ఒక విధంగా ఈ సమాచారం ప్రజలకు తెలియజేయటం మాత్రం అవసరం.

'భారతదేశంలో ధైర్యవంతురాలైన ఒక యువతి మీద మాకు నమ్మకం వుంది, మాకు మీలాంటి స్నేహితులు చాలా అవసరం. దేవుని దయవల్ల ఈ చీకటి రోజుల్లో కూడా మా స్నేహితుల సంఖ్య పెరుగుతోంది, అందులో మీరొకరని మాకు తెలుసు' అని అంటూ ఫయాజ్ నా రెండు అరచేతులూ తన చేతుల్తో పట్టుకుని ఊపాడు. వారు చెప్పిన ధైర్యవంతురాలైన యువతి అరుంధతీరాయ్. కశ్మీర్‌కి వచ్చినప్పటి నుండి అరుంధతిరాయ్ గురించి సామాన్య ప్రజలు – అంటే ఆటోడ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, హొటళ్ళలోని వెయిటర్లు,

బేకరీ షాపులవాళ్ళు, యూత్ హాస్టళ్ళలో వుండే విద్యార్థులు – ఇలా సమాజంలోని అన్ని వర్గాల వారు ప్రతిచోటా చర్చించుకోవటం గమనించాను.

మేము కారులో కూర్చుని దగ్గరలోనే వున్న ఆ సమాధి వైపుగా బయలుదేరాం. అక్కడ కేవలం ఒక పెద్దబోర్డు వుంది. దానిమీద వున్న అక్షరాలను కేవలం కెమెరా ఫ్లాష్ వెలుగులోనే చదవగలిగాం: 'నిలోఫర్, ఆశియాల జ్ఞాపకార్థం' అని దాని మీద రాసివుంది. ఆ అక్షరాల కింద, క్రూర నిరంకుశ కశ్మీర్ ప్రభుత్వ ధోరణితో మానప్రాణాలు కోల్పోయిన తల్లులు, అక్కచెల్లెళ్ళు, కూతుళ్ళను ఎప్పటికీ మరచిపోమని, ఈ సమాధి దానికి గుర్తుగా వుంటుందని, ఇది ప్రజల ప్రమాణం అని రాసివుంది. అన్నిటికంటే కింద జమ్ము కశ్మీర్‌లో అత్యాచారాలకు, హత్యలకు గురైన అరవై ఆరుమంది గురించి ప్రస్తావించారు. షోపియన్‌లోని మజ్లిస్ గ్రూపు ఇక్కడ పెద్ద సమాధిని నిర్మించాలని అనుకుంటోంది. మేము ఆ బోర్డుకు శాల్యూట్ చేసి, ఒక ఫోటో తీసుకుని అక్కడి నుంచి బయలుదేరాం.

మా చుట్టూ అంతా కటికచీకటి. అది ఎంత దట్టంగా వుందంటే పెద్ద టార్చిలైటు వెలుతురుగానీ, లాంతరు దీపపు కాంతి గానీ ఏ మాత్రం దాన్ని ఛేధించలేవు. కశ్మీర్ అంతా కటిక చీకటి పరుచుకున్నట్లుగానే వుంది. మా కారు డ్రైవరు యాక్సిలేటర్ మీద కాలువత్తిపెట్టి వేగంగా కారును పరిగెత్తిస్తున్నాడు.

బయటవున్న చీకటి లోపలవున్న మాలోకి కూడా చొరబడింది. ఎవ్వరూ ఏమీ మాట్లాడే పరిస్థితిలో లేరు. నా బుర్ర అంతా విపరీతమైన గందరగోళంగా వుండి, ఆలోచనలు ఒకదానిమీద ఇంకోటి పరుచుకుంటున్నాయి. ఆశ్చర్యకరంగా రోడ్డు చాలా బాగుంది. ఇదే విషయాన్ని మా డ్రైవర్ జావేద్‌ని అడిగితే, ఆర్మీ కోసం ప్రభుత్వం ఏమైనా చేస్తుందని చాలా పదునుగా సమాధానం ఇచ్చాడు. మాహెజబీన్ తప్పనిసరిగా ఇంటికి చేరుకోవాలి. అప్పటికే నాకు చాలా పిచ్చిగా వుంది కానీ, ముందు శ్రీనగర్ క్షేమంగా చేరుకోవటం ముఖ్యం.

శ్రీనగర్ చేరుకున్నాక ఏదైనా తినే ప్రదేశం వెతకటానికి తీవ్ర ప్రయత్నమే చేశాం. ఒక ఆటో అతను సహాయపడి మమ్మల్ని మొగల్ దర్బార్ అనే హొటల్ కి తీసుకువెళ్ళాడు. నేను అప్పటికే నిశ్శబ్దంగా, జనసంచారం లేకుండా వున్న రోడ్లను చూస్తూ ఆందోళనతో వున్నాను. ఈ ప్రదేశాన్ని మహమ్మారిలా చుట్టుకున్న ఈ అస్థిరత నన్ను స్థిమితంగా వుండనీయటం లేదు. అది ఎముకలు కొరికే చలిరాత్రి. ఒక పరదా లాంటి అనిశ్చితి మా చుట్టూ అల్లుకుంది. మమ్మల్ని తీసుకువచ్చిన ఆటో డ్రైవర్‌తో మేము తినేవరకూ వుండి మమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళమని, డబ్బులు ఎక్కువిస్తానని చెప్పాను. దానికతను సరేనని తల ఊపాడు. అతని పేరు జాకిర్. మేం ఆటో దిగుతున్నపుడు 'మేడమ్, మీరు మా అతిథులు. మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకోవటం మా బాధ్యత. మేము భారత సైన్యాన్ని అసహ్యించుకుంటాము కానీ భారతీయులను కాదు. మీరు నిశ్చింతగా వెళ్ళి భోజనం చేసి

రండి. మిమ్మల్ని తిరిగి మీ హోటల్ దగ్గర దించిన తర్వాతే నేను ఇంటికి వెళతాను' అని అతనన్న మాటలు నా హృదయానికి సూటిగా తాకాయి.

మాతో తినటానికి రమ్మని అతన్ని కూడా ఆహ్వానించినపుడు సున్నితంగానే తిరస్కరిస్తూ, కశ్మీరీ వ్యక్తులు సాయంత్రాలు సాధారణంగా కుటుంబంతో కలిసి భోంచేస్తారని, మరీ ముఖ్యంగా బక్రీద్ సమయంలో రాత్రి భోజనానికి ఇంట్లోవాళ్ళు ఎదురుచూస్తుంటారని జాకిర్ అన్నాడు. అతని కుటుంబం అతని కోసం ఎదురుచూస్తూ వుండి వుంటుంది.

మర్నాడు పొద్దున్నే మేము కుప్వారాకు బయలుదేరాం. అది శ్రీనగర్ నుంచి 100 కిలోమీటర్ల దూరంలో సరిహద్దుకు అతి సమీపంలో వుంది. దారిలో చూడటానికి రెండే విషయాలు వున్నాయి. ఆర్మీ సమూహాలు, ఆపిల్ తోటలు. సైనికులు పహారా కాస్తున్నారు. ఆ ప్రదేశం మొత్తం ఆపిల్ తోటలతోనే నిండి వుంది. అంతా నిర్మానుష్యంగా వుంది. శరత్కాలం వచ్చేయటంతో కశ్మీర్‌లో ఆపిల్ పండ్లు కోయటం, వాటిని అట్టపెట్టెల్లో సర్దటం, లారీలకు ఎత్తడం దాదాపు పూర్తికావొచ్చింది. మేం వెళ్ళే దారిలో సోపోర్‌లో హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు సయ్యద్ అలీషా గిలానీ వున్నారు. ఇక్కడి నుంచే కశ్మీర్ లోయ అంతా తన ప్రచారం జరిగేటట్లు గిలానీ చూస్తారని జావేద్ మాతో చాలా ఉత్సాహంగా చెప్పాడు. మేం అక్కడ ఆగి ప్రజలతో మాట్లాడాలని బలంగా అనిపించింది కానీ, అలాంటి వేలాది కోరికలు తీరకుండానే మిగిలిపోయాయి.

కుప్వారా చేరిన వెంటనే సల్కూట్ లో వున్న షేక్ మొహల్లాకు వెళ్ళాం. కశ్మీర్‌లో వున్న పాకీ పనిచేసే స్త్రీలను కలవాలని నేను చాలా అనుకున్నాను. ఆ చిన్న ఇంట్లోని గదిలోకి ప్రవేశించగానే అక్కడ దాదాపు పదిహేనుమంది వున్నారని అనిపించింది. అందులో ఏడుగురు ఆడవాళ్ళు. కొంత మంది వారి పిల్లలకు పాలు ఇస్తున్నారు. ముప్పైఐదు సంవత్సరాల రఫీఖా తన ఏడునెలల పాపకి పాలు ఇస్తూ ముందుగా మాట్లాడటం మొదలుపెట్టింది. సర్కారీ దవాఖానలోని ఎత్తుడుదొడ్డిని శుభ్రం చేయటానికి నియమించ బడింది రఫీఖా. ఆసుపత్రుల్లో రోగులతో పాటు వచ్చే వారి బంధువుల వల్ల పని ఎక్కువగా వుంటుందని ఆమె మాకు చెప్పింది. ఆమె పని ఎత్తుడుదొడ్ల మీద బూడిద జల్లుతూ, ఆ పెంటను డబ్బాలలోకి ఎత్తి దగ్గరలోని పొలాల్లో పోసిరావటం. ఈ పని చేసినందుకుగానూ ఆమెకు కేవలం వంద రూపాయలు మాత్రమే ఇస్తారని చెప్పినపుడు నన్ను నేను నమ్మలేకపోయాను. బహుశా దేశంలో ఇక్కడ మాత్రమే పాకీ పని వారికి ఇంత తక్కువ వేతనం వుంది. తన తల్లిదండ్రులు కూడా ఇదే పని చేసేవారని, అయితే తాను ఇంతకు ముందు చేయలేదని రఫీఖా చెప్పింది. ఆర్థికంగా సమస్యలు పెరగటంతో తన తల్లితో పాటు అయిష్టంగానే ఈ పనిలోకి వచ్చింది. రఫీఖా మామ కూడా ఆసుపత్రిలో ఇదే పని చేసేవాడు. ఆయన జబ్బుపడటంతో రఫీఖా ఈ టాచ్‌పాజిన్ పనిని మళ్ళీ మొదలుపెట్టాల్సి వచ్చింది.

'ఏదో ఒకరోజు మమ్మల్ని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తారని మా ఆశ' అని ఇంత తక్కువ వేతనాలకు ఎందుకు పనిచేస్తున్నామో మునీరా వివరించింది. ఈమె కూడా కుప్వారా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పనిచేస్తుంది. అందుకే వీళ్ళు సంవత్సరాల తరబడి అతి తక్కువ వేతనాలకు పనిచేస్తూ, ఏదో ఒకరోజు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లభిస్తుందని ఎదురుచూస్తున్నారు. అది సాధ్యమయితే గనుక మంచి జీతాలతో పాటు వారి జీవితం కూడా మారుతుంది. అప్పటివరకూ వాళ్ళు ఆసుపత్రి పనితో పాటు వేరే ఇళ్ళల్లో కూడా డ్రై లెట్రిన్లు కడుగుతూనే వుంటారు. అక్కడ వున్న ఇతర మహిళలు – హాజిరా, రజియా, ఆల్తాఫ్ బానో మొదలయిన వాళ్ళు కూడా ఇలాంటి పరిస్థితుల్లోనే వున్నారు. అన్నిటికంటే వారిని బాధించే విషయం పాఠశాలల్లో వారి పిల్లలు ఎదుర్కొనే వేధింపులు, వివక్ష. ప్రతి ఒక్కరూ వారిని 'వాతల్ పిల్లలు' అని పిలుస్తూ వారిని చిన్నచూపు చూస్తుంటారని చెప్పారు.

ఈ లోపల, ఇరవైయ్యేడు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా పాకీపని చేస్తున్న మొహమ్మద్ రంజాన్ మోచీ మాట్లాడుతూ, 'ఇప్పుడు కశ్మీర్ ఎదుర్కొంటున్న ఎన్నో ముఖ్యమైన సమస్యల ముందు ఈ అంశం ఒక అర్థం లేనిదిగా వారికి కనిపిస్తుంది. ఈ పని తరతరాల నుంచి జరుగుతోంది. ప్రతి ఇంట్లోనూ ఒక ఎత్తుడుదొడ్డి వుంది. ఇలాంటి పరిస్థితుల్లో, ఈ పనివారల విముక్తి గురించి మాట్లాడటం అనేది నిజంగా అర్థంలేనిది' అన్నాడు. తనకి ఈ పని చేసినందుకు నెలకు పదకొండువేల రూపాయలు వస్తాయని, చదువులు అయిపోయిన తర్వాత తన పిల్లలకు ఉద్యోగాలు రాకపోతే, వారు ఈ టాచ్‌పాజిన్ పనినే చేపట్టినాగానీ తాను తప్పుపట్టనని కూడా అన్నాడు. మరిన్ని వివరాలు అడిగిన తర్వాత, తన పిల్లల్ని 'వాతల్ పిల్లలు' అన్నప్పుడు, పెళ్ళిళ్ళల్లోనూ, విందుల్లోనూ ఇతర సమూహాలకు చెందిన వారు తమతో కూర్చుని తినకపోవటం తనకు చాలా బాధ కలిగిస్తుందని ఒప్పుకున్నాడు.

స్వీపర్లయిన వాతల్ కుటుంబాలకు ఇళ్ళు కట్టుకోవడం కోసం జిల్లా కమిషనర్ ఇళ్ళ స్థలాలు కేటాయించారని మాకు చెప్పారు. అయితే, ఈ జనం గనుక ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుంటే ఈ ప్రదేశమంతా కంపెత్తిపోతుందనే వాదనతో ఆ నిర్ణయాన్ని ఇతర అధికారులు తీవ్రంగా వ్యతిరేకించారు. భూమి కేటాయింపుకు సంబంధించిన అన్ని పేపర్లను వీళ్ళు మాకు చూపించారు. ఇప్పుడు ఈ సమస్య కోర్టులో వుంది. అన్ని సాక్ష్యాధారాలతో కేసు బలంగానే వుంది కానీ, న్యాయం జరుగుతుందనే నమ్మకం వీరికి అంతగా లేదు. పేదలకు డబ్బు వుండదు కాబట్టి కోర్టుల్లో న్యాయం దొరకదని నాతో పదే పదే చెబుతూనే వున్నారు. అయినప్పటికీ కనీసం వారు ఇప్పటికీ పోరాటం కొనసాగిస్తున్నారు.

'మీరు మాతో రండి, మేము మరుగుదొడ్లను ఎలా శుభ్రం చేస్తామో చూపిస్తాము. ఇక్కడ అన్ని ఇళ్ళల్లోను మరుగుదొడ్లు ఒకేలా వుంటాయి. పేదవాళ్ళు వాళ్ళ మరుగుదొడ్డిని

వారే శుభ్రం చేసుకుంటారు. డబ్బులున్నవాళ్ళు మాతో చేయించుకుంటారు' అని మునీరా మాతో అంది. మునీరా, అల్తాఫ్ బానో, రఫీఖా ముగ్గురూ కూడా కశ్మీరీలుగా కనిపించలేదు. వారి రూపురేఖలు వేరుగా వున్నాయి. 'మీరెక్కడి నుంచి వచ్చారని' నేను వాళ్ళను అడిగాను.

వాళ్ళు నవ్వేసి, కొంచెం సిగ్గుపడుతూ ఒకేసారి 'బంగ్లాదేశ్' అని చెప్పారు. కానీ వెంటనే సర్దుకుని 'కాదు కాదు, మేము వచ్చింది పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ నుంచి' అన్నారు.

అక్కడి నుంచి ఈ ప్రాంతానికి ఎలా వచ్చారు వీళ్ళు?

'అదో పెద్ద కథ. ఇలాంటి వాళ్ళు చాలామందే వున్నారు ఇక్కడ. పేదరికం వల్ల వీరికి ఇక్కడివారితో పెళ్ళి చేస్తారు. అలా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వస్తూనే వుంటారు. ఇది ఒక గొలుసుకట్టు వ్యవహారంలా తయారయింది. ఇక్కడ అత్యంత పేదరికంతో వుండేది వాతల్ సమూహమే. వీరికి పెళ్ళి చేసుకోవడానికి ఆడపిల్లలు సులభంగా దొరకరు. అందుకే వాళ్ళు ఆ ప్రాంతం (పశ్చిమ బెంగాల్) నుంచి ఆడపిల్లల్ని తెచ్చుకుంటారు. కొందరికి అలా ఇద్దరు భార్యలు కూడా వుంటారు' అని మహెజబీన్ వివరించింది.

ఉదాహరణకు మునీరా, అల్తాఫ్ బానో ఇద్దరూ కూడా ఒకే వ్యక్తిని పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరూ కూడా కడు పేదరికంతో చాలా సమస్యలను ఎదుర్కొన్నారు.

మేము ఆ ఎత్తుడుదొడ్ల దగ్గరకు వెళ్ళేంతవరకూ ఈ సంభాషణ సాగుతూనే వుంది. వాళ్ళు ఆ మరుగుదొడ్లను శుభ్రం చేస్తుంటే చూడటం చాలా కష్టమనిపించింది. 'మేం పనిచేస్తుంటే చూడటమే మీకు ఇబ్బందిగా వుంది కదా' అని మునీరా దాదాపు మాకు ఒక సవాలు విసిరింది. ఇలాంటివి రోజుకి కనీసం నాలుగైదు శుభ్రం చేస్తామని వాళ్ళు చెప్పారు. తెరచివున్న మురికి కాలవ మీదుగా ఇరుకుగా, అశుభ్రంగా వున్న ఆ సందులోంచి మునీరా ప్రతిరోజూ శుభ్రంచేసే మరుగుదొడ్ల దగ్గరకు వెళ్ళాం. అక్కడ మరుగుదొడ్డి వెనుకవున్న కంతలోంచి ఆ పెంటనంతా బయటకు తీస్తారు. మొదట దానిమీద బూడిద జల్లుతారు. మునీరా పార తీసుకుని మరుగుదొడ్డి వెనుకకు వెళ్ళి ఆ పార నిండుగా పెంటను ఎత్తటం ప్రారంభించింది. మామూలుగా అయితే ఈ పెంటనంతా దగ్గరలోని పొలాల్లో పారవేస్తే అది ఎరువుగా మారుతుంది. పొలాలు లేనిచోట పెద్దపెద్ద గుంటల్లోకి గానీ, మురికికాల్వల్లోకి గానీ వేస్తారు. అయితే, కశ్మీర్‌లో తప్పించి దేశంలో మరెక్కడా కూడా మనుషుల పియ్యిపెంటను ఇలా పొలాల్లోకి పారేసే విధానం లేదు. వేరే రాష్ట్రాల్లో మురికికాల్వల్లోకి వేస్తారు.

భూతల స్వర్గంగా పిలవబడే కశ్మీర్‌లో ఒకవైపు విద్రోహచర్యలు, తీవ్రవాదంతో పాటు మానవ మలమూత్రాలను చేతులతో ఎత్తివేసే అవమానకరమైన పాకీ పని కూడా వర్ధిల్లటమే విషాదకరం. మునీరా పారతో పెంటను ఎత్తి కాలవలోకి వేస్తున్నపుడు, ఇంకోవైపు నేను నిల్చుని రొంపిలో కూరుకుపోయిన వారి జీవితాలు ఈ భూతలస్వర్గంలో ఎలా

కునారిల్లిపోతున్నాయో, అదంతా నా కెమెరాతో రికార్డ్ చేస్తూ వున్నాను. ఆ ప్రదేశమంతా కూడా చిత్తడి చిత్తడిగా వుంది. నా బూట్లు దాదాపు ఆ బురదలో కూరుకుపోయాయి. ఏ రకమైన హావభావాలు లేకుండా మునీరా పనిచేస్తూనే వుంది. ఆమె కొడుకు కూడా చిన్న పార పట్టుకుని అక్కడే నిలబడ్డాడు.

ఇంత దారుణమైన పని వారి రోజువారీ జీవితాల్లో భాగం. మేము తిరిగి వచ్చేస్తున్నపుడు, ఆ మొహల్లా పీర్ నా చేతికి రెండు బాదంపప్పులు, ఒక వక్కపోకను ఇస్తూ, 'ఇక్కడంతా చాలా బాధాకరమైన పరిస్థితి వుంది. కానీ ఏమీ చేయలేని అసహాయ పరిస్థితిలో ఎవరైనా కళ్ళు మూసుకుని వుండాల్సిందే. లేదంటే.....'

ఆ తర్వాత, భవిష్యత్తుకు ప్రతీకలైన పిల్లలతో కలిపి మొహల్లా బయట అందరిదీ ఒక గ్రూప్ ఫొటో తీశాము. పిల్లల బుగ్గలు, పెదాలు చలికి పగిలిపోయి గాయాలతో వున్నాయి.

మేము బయలుదేరేటప్పుడు, అక్కడ వున్న మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న సామూహిక ఎత్తుడు దొడ్లను తప్పకుండా చూసి వెళ్ళాలని ప్రతిఒక్కరూ చెప్పారు. నలభై అయిదేళ్ళ అబ్దుల్ రషీద్ షేక్ మమ్మల్ని అక్కడికి తీసుకువెళ్ళాడు. గత ఇరవైఆరేళ్ళుగా అతను పాకీ పని చేస్తున్నాడు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో చూసిన సామూహిక మరుగుదొడ్ల కన్నా ఇవి చాలా భిన్నంగా వున్నాయి. బయట నుంచి చూస్తే ఇవి ఎత్తుడు దొడ్లలాగా కనిపించవు. మరుగుదొడ్ల వెనుకవైపు నుంచి ట్యాంకులలోకి ఆ పెంటంతా వచ్చేట్లు చేస్తారు. ఆ ట్యాంకు నిండిన వెంటనే దానిని బయటవున్న తొట్లలోకి వేస్తారు. ఈ ట్యాంకులను శుభ్రం చేయటం, బయట తొట్లలోని పెంటను తీయటం రషీద్ షేక్ ఇంకా ఇతర కార్మికుల పని. శాశ్వత ఉద్యోగిగా పనిచేస్తున్న రషీద్‌కు నెలకు పన్నెండువేల రూపాయల వేతనం వస్తుంది.

మనుషులు దొడ్డికి వెళితే, ఆ పియ్యిపెంటను బక్కెట్లలోకి ఎత్తి, ఆ బక్కెట్లను నెత్తి మీద మోసుకుంటూ దూరంగా వున్న కాల్వల్లోకి పారేయటం–అతను ప్రతిరోజు ఈ పనిని ఎంత గాఢమైన నిమగ్నతతో చేస్తున్నాడో చూస్తుంటే నా తల పగిలిపోసాగింది. నిజానికి అక్కడ వుండే పియ్యిపెంట, దానిద్వారా వచ్చే దుర్వాసనకు అసలు అక్కడ నిలబడటమే అసాధ్యంగా వుంది. మనుషుల పియ్యిపెంటను చూడటమే చాలా ఇబ్బందనుకుంటే, దానిని చేతులతో శుభ్రంచేయటం ఎంత అసహ్యకరమో నేను అర్థం చేసుకోగలను. ఎవరైతే ఈ పనిని చేస్తున్నారో అతను ఆ పనిని సమర్థిస్తూ మాట్లాడటం అనేది అత్యంత ఆశ్చర్యకర విషయం. అసలు ఎవరైనా సమర్థించగలగటం అనేది ఊహకు అందని అంశం. నేను అతనికి చాలాసార్లు చెప్పాను ఈ పని నుంచి బయటకు వచ్చెయ్యమని. కానీ అతను తన ధోరణిలో 'అల్లాకు ఈ పనిచేయటం ఇష్టం; దీనికి చాలా సహనం వుండాలి' అంటూ ఇంకా ఇలా కొనసాగించాడు. 'నేను ఈ పని చేస్తున్నందుకు ఏమీ బాధపడటం

లేదు; ఇతర పనులు చేసేముందుగానే వీటిని శుభ్రం చేయటం అవసరం. మేము ఈ పనిని తరతరాల నుండి చేస్తున్నాము. అల్లా ఈ పని చేయాలనుకోకపోతే, ఎవరైనా దీనిని ఎలా చేస్తారు!' తాను మోసుకువచ్చిన దాన్ని కాల్వలోకి వొంపేసి, చాలా జాగ్రత్తగా మట్టితో తన తట్టను తోమాడు. అది తన వంటింట్లోని గిన్నెలను జాగ్రత్తగా తోమినట్లే వుంది. ఆ కాల్వ అసలు ఒక ఎండిపోయిన నది అని, వర్షాకాలంలో నీళ్ళతో నిండుతుందని మాకు తెలిసింది. ఆ తర్వాత అతను తన తట్టను ఒక పద్ధతిలో నీళ్ళతో జాగ్రత్తగా కడిగాడు. దాన్ని ఒకసారి తిరగేసి లోపల ఇంకా ఏదన్నా శేషం మిగిలిపోయి వుందా అని చూశాడు. తర్వాత అతను తన బూట్లను ఉతికాడు. మోచేయి వరకూ తన చేతులను, అరిచేతులను శుభ్రం చేసుకున్నాడు. ఇది ఇతని రోజువారీ దినచర్య.

అతను ఈ పని కానిచ్చేసమయానికి మా చర్చ కూడా ముగిసింది. ఈ పనిని అతను తప్పనిసరిగా చేయాలనుకోవటం మేమెందుకు సరైనది కాదనుకుంటున్నామో చెప్పటానికి చాలా ప్రయత్నం చేశాము. ఈ పనే గనుక అంత పవిత్రమయినదయితే, తరాల తరబడి కొంతమంది మనుషులు ఇతరుల చేత వివక్ష, అవమానాలకు గురవుతూ ఎందుకు దీనినే చేస్తున్నారు? అలాగే అతని పిల్లలు ఇతరుల చేత ఎందుకు అవమానాల పాలవుతున్నారు?ఈ ఒకే ఒక్క వాదన అతన్ని ఆలోచింపజేసింది. అంగీకారంగా అబ్దుల్ రషీద్ తల ఊపాడు. తర్వాత అతని గొంతు పూర్తిగా మారిపోయింది. ఆ మురికి రొంపి నుంచి బయటకు వచ్చి విముక్తమవటం అనే అంశాన్ని అతను అర్థం చేసుకోవటం ప్రారంభించాడు. అద్దంలో అతని ప్రతిబింబంలాగే, మా వెనుక వున్న ప్రవాహం కూడా ముందున్న నదిలో కలిసిపోవటానికా అన్నట్లు కనిపిస్తోంది అక్కడి పరిస్థితి.

తిరిగి వచ్చేస్తున్నప్పుడు గుంపుగా వున్న కొందరు పిల్లలు బక్రీద్ పండుగ కోసం కోళ్ళను ఇళ్ళకు తీసుకుపోవడం చూశాం. అక్కడే మేము సఫాయి పనిచేస్తున్న రషీద్ స్నేహితుడ్ని కలిశాము. అయితే నా కెమెరాను చూడగానే చర్చ ఆగిపోయింది. అయితే, ఆ వెంటనే రషీద్‌తో చేస్తున్న ఇద్దరు ముగ్గురు కార్మికులు మాతో వచ్చి కలిసి నిజంగా ఈ అమానవీయమైన పని నుంచి విముక్తం కాగలుగుతామా లేదా అనే అంశంపై మాట్లాడటం మొదలుపెట్టారు. అందరూ తమ అనుభవాలను ఈ అంశంతో సరిపోల్చుకుంటూవున్నారు. అందరి అభిప్రాయం ఒకటే–ఇది అల్లా ఇష్టం. నిజానికి ఈ సమూహానికి దీనినుంచి విముక్తం సాధ్యమే అనే మాట అత్యంత కష్టసాధ్యంగా అనిపిస్తూండవచ్చు. ఇది తమ నుదిటిరాతగా అందరూ అంగీకరించేశారు– ఇది సహజంగా కనిపిస్తుంది కూడ–కశ్మీర్‌లో పరిస్థితి లానే.

ఎట్టకేలకి మేము తెచ్చిన కాగితాలను నింపటానికి, దానికోసం మాహెజబీన్ వారి పేర్లను, అడ్రసులను, ఫోన్ నెంబర్లను తీసుకోవటానికి అంగీకరించారు. వారు మలమూత్రాలను ఎత్తే పాకీపని చేస్తున్నట్లుగా నిర్ధారిస్తూ, వారు దాని నుంచి బయట

పడటానికి సిద్ధంగా వున్నరని తెలిపే కాగితాలు అవి. అంతేకాకుండా 1993 నాటి చట్టం ప్రకారం వీరు పునరావాసాన్ని కోరుకుంటున్నట్లుగా వుంటుంది. ఒకసారి పూర్తిచేసిన తర్వాత అక్కడి జిల్లా అధికార యంత్రాంగానికి అందజేయటం, వాటి కాపీలను సుప్రీంకోర్టులో వున్న ప్రజావ్యాజ్యానికి జతచేయటం జరుగుతుంది. ఫలానా రాష్ట్రంలోని ఫలాని ప్రాంతంలో ఇంత మంది వ్యక్తులు ఈ అమానవీయమైన, అవమానకరమైన వృత్తిలో కొనసాగుతున్నారని, దాని నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నారన్న దానికి ఈ కాగితాలు రుజువులుగా వుంటాయి.

వారి అడ్రసులు, ఫోన్ నెంబర్లు తీసుకున్న తర్వాత మేము కొంచెం ఆశావహ దృక్పథంతోనే కుప్వారా నుంచి బయలుదేరాం. మేము హొటల్‌లో బస చేశాం. మా పక్కనే వున్న బేకరీలో చాలా మంది జనం వున్నారు. అక్కడే మేము కశ్మీరీ ఘోస్ట్, యాక్ని, మిర్చి కుర్మాలతో ప్రత్యేక కశ్మీరీ విందు రుచి చూశాం. ఉత్తర భారతదేశంలో వలే మాంసాన్ని మెత్తగా కాక కశ్మీర్‌లో మేకమాంసం ప్రత్యేకపద్ధతిలో వండుతారని మాహెజబీన్ మాకు చెప్పింది. ఆ రెస్టారెంట్ ఎక్కువమంది అబ్బాయిలతో, పండుగ వాతావరణం నెలకొని వుంది. ఒకరినొకరు నవ్వుకుంటూ బిగ్గరగా పలకరించుకుంటూ తిరిగి ఉత్సాహంగా వుండటమనేది ఎంతో భరోసాగా అనిపించింది. ఈ ప్రాంతమే ఒక బీభత్సమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ వుందని ఎవరైనా అన్నా నమ్మేటట్లుగా లేదు అక్కడి పరిస్థితి. శ్రీనగర్‌తో పోలిస్తే ఇక్కడ కొద్దిమంది స్త్రీలే వుండటాన్ని కూడా నేను గమనించాను. శ్రీనగర్‌లో అన్ని వేళలా స్త్రీలు ఒంటరిగా, జంటలుగా, కుటుంబాలతో ఎప్పుడూ బహిరంగ ప్రదేశాల్లో తినటం సర్వసాధారణం. పర్దా అనేది ఇక్కడ చాలా నిర్బంధంగా అమలులో వుండటంతో రెస్టారెంట్లు, బేకరీలు వంటి వాటిలో స్త్రీలు కనిపించటం చాలా తక్కువే. మేము హొటల్ నుంచి వచ్చేసిన వెంటనే, ప్రతిచోటా ఆర్మీ తమ భారీ వాహనాల్లో తిరుగుతూ డేగకళ్ళతో పర్యవేక్షిస్తోందనే స్పృహ మాకు వచ్చింది.

2010 నవంబర్ 17, బక్రీద్ పండుగ రోజు నేను కశ్మీర్‌లో గడిపిన చివరి రోజు. ఆ రోజు అందరూ నమాజ్ దగ్గర వున్నారు. ఒక్క షాపు కూడా తెరిచిలేదు. పొద్దుటి నుంచి మాకు కప్పు ఛాయ్ కూడా దొరకలేదు. కొద్దిదూరం నడిచి వెళ్ళిన తరువాత ఒక ఆటో అతను మమ్మల్ని దాల్‌లేక్ ఒడ్డు దగ్గర వున్న పంజాబీ దాభాకు తీసుకువెళ్ళాడు. నమాజ్ అయిపోయిన తర్వాత పెద్ద సంఖ్యలో కశ్మీరీ యువకులు ఛాయ్ తాగడానికి అక్కడికి వచ్చారు. ఒకరినొకరు అప్యాయంగా హత్తుకోవటం, మాటల మధ్యలో మనస్ఫూర్తిగా గట్టిగా నవ్వుకోవటం, పాటల గురించి చర్చించుకోవటం, కప్పుల కొద్దీ ఛాయ్‌ని తీసుకుంటూ ఛోళే సమోసాలను తినటం చూస్తుంటే, పండుగ కోలాహలం ఇక్కడి వాతావరణాన్ని ఎంతగా మార్చింది అని మరోమారు అనుకున్నాను. 'మేడమ్, ఇక్కడ నివసించే వారందరూ మనుషులే. నిజాయితీగా, సంతోషంగా వుండటానికి అన్ని

ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే వీళ్ళు ఏ రకమైన తప్పుని కానీ, బాధని కానీ ఒప్పుకోవటం లేదు. కశ్మీర్ లోయ అంటేనే హాస్య చమత్కారాలకు పెట్టింది పేరు' అని ఆ దాభా యజమాని సుందర్ నాతో అన్నాడు.

దాల్ సరస్సులో ఒకసారి తిరిగి వచ్చేసరికి, అక్కడి వాతావరణమంతా మారి పోయింది. 'మీరు వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, సమస్యలు తలెత్తవచ్చు' అని ఆటో అతను చెప్పాడు. నమాజ్ అయిన తర్వాత లాల్‌చౌక్ దగ్గర ఏదో సంఘటన జరిగిందని అతను మేము ఆటోలో కూర్చున్న తర్వాత చెప్పాడు. అది ఒకరకమైన అలజడి. కానీ నిర్ధారణగా ఏం జరిగిందనేది ఎవరికీ తెలియదు. 'అనంతనాగ్‌లో కూడా ఏదో జరిగింది. మీరు వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళిపోండి. మీరు జాగ్రత్తగా వెళ్ళిపోగలిగితే మేము కొంచెం మనశ్శాంతిగా వుంటాం' అని అన్నాడు.

కశ్మీర్‌కు సంబంధించిన ప్రతి అంశమూ ఒక అశాంతితో, కోపంతో ఒకదానిని మించి ఒకటి వున్నాయి. వేలాది ఇళ్ళు మాయమైపోయిన తమ మగవారిని తలుచుకుంటూ దు:ఖాన్ని దిగమింగుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నాయి. మరోపక్క తరాల తరబడి మానవ విసర్జితాలను తమ చేతులతో ఎత్తి, నెత్తిమీద మోస్తూ వందలాది మంది జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏ ఒక్కరితో మాట్లాడినా గానీ పరిస్థితి మొత్తం అర్థమయిపోతుంది. స్వాతంత్ర్యం కోసం వారి ఆకాంక్ష విభిన్న వర్గాల ప్రజలను ఒక్కతాటి మీద వుంచుతోంది. అది శ్రీనగర్ విమానాశ్రయంలోని కాఫీషాప్‌లో టీ, కాఫీలు అందించే ఇమ్రోజ్ కావొచ్చు, లేదా అక్కడి నుంచి యూత్ హాస్టల్‌కు మమ్మల్ని తీసుకెళ్ళిన టాక్సీడ్రైవర్ కావొచ్చు, లేదా రాత్రి తొమ్మిదిగంటలప్పుడు హజరత్‌బల్ దర్గా దగ్గర పకోడీలు, ఇతర చిరుతిండ్లు అమ్మే ఖాలిద్ కావొచ్చు.

కశ్మీర్ ముఖాకృతి మరింత కోపంతో ఎరుపెక్కుతున్నప్పటికీ నవ్వులతోనూ, సంతోషంతో కూడా మరింత ఎర్రనవుతోంది. బక్రీద్ పండుగ కోసం కశ్మీర్‌లో కనిపించిన ఉత్సాహం, మార్కెట్ ప్రదేశాల్లో కనిపించిన భారీ జనసందోహం, దేవుని పేరు మీద అర్పించటానికి తీసుకువచ్చిన పశువులు, అక్కడి బేకరీల్లో నుంచి వస్తున్న బిస్కెట్లు, రొట్టెలు, పేస్ట్రీలు - ఇవన్నీ కూడా రాష్ట్రంలో నెలకొనివున్న భయంకరమైన నిర్బంధంతో పాటు అక్కడి స్నేహపూర్వక వాతావరణాన్ని, ఎలాంటి పరిస్థితినైనా తట్టుకుని నిలబడే వాస్తవాన్ని చూపిస్తాయి.

శ్రీనగర్, ఛావల్‌గావ్, షోపియన్, కుప్వారాల మధ్య విషాదంగా బారులు తీరి చీనార్ చెట్లు వున్నాయి. కుంకుమ సాగు, ఆపిల్, ఆర్చిడ్ తోటలు- అన్నీ రాబోతున్న చలికాలానికి తగ్గట్లుగా తమను తాము సిద్ధం చేసుకుంటున్నట్టుగా వున్నాయి. ఈ నిర్జనమైన ఒంటరి వాతావరణం కొత్తదేమీ కాదు. 1947 నుంచి కశ్మీర్ ఈ పరిస్థితులను ఎదుర్కొంటూనే వుంది. మా ప్రయాణం ముగింపుకు వచ్చే సమయంలో మాహెజబీన్

పాడిన ఒక పాట అందమైన కశ్మీర్ ప్రస్తుతం ఏ విధంగా విధ్వంసమయివుందో తెలియజేస్తూ ఢిల్లీ వరకూ మమ్మల్ని వెంటాడుతూ వచ్చింది.

"ప్రియతమా, నిన్ను చూడగానే
నా గుండెల్లో అలజడి సద్దుమణుగుతుంది
సూర్యుడివలె కాంతివంతం నీ ముఖారవిందం
నేను మంచులా కరుగుతుంటాను..."

(2010లో కశ్మీర్‌కు వెళ్ళివచ్చిన వెంటనే రాసిన వ్యాసం)

# ఢిల్లీ




**'మేము మా కుల గుర్తింపును ఎంతగా వదిలించుకోవాలనుకుంటున్నామో, అది మరింతగా కమ్ముకుంటోంది.'**

జూలై 2006లో నేను మీనాను కలిసేనాటికి ఆమెకు ఇరవై ఒక్క ఏళ్ళు. 'మా కుటుంబం మొత్తం ఎమ్మెస్' అని మేము కలిసిన వెంటనే చెప్పిందామె. ఎమ్మెస్ అంటే మాన్యువల్ స్కావెంజర్.

మీనా చాలా సరదా మనిషి. ఆమె మణికట్టుకి తెల్లబట్టతో చుట్టివున్న ఒక రక్ష కట్టివుంది. దానిగురించి నేను ఆమెను అడిగితే, 'ఇది నా కూతురు కోసం, రండి తనను చూద్దురుగాని' అంది. ఇరుకైన ఆ చిన్న గదికి వున్న పరదాను తొలగించగానే నా చూపులకి రెండు కళ్ళు కనిపించాయి. ఒకలాంటి అశక్తత, బాధ, దు:ఖం కలగలసిన ఆ కళ్ళు గాఢంగా నాలో ముద్రపడ్డాయి.. మీనా ఆరేళ్ళ కూతురు మానసిక, శారీరిక వికలాంగురాలు. చూపులకి మాత్రం ఆరు నెలల పాపలా వుంది.

భారతదేశానికే గుండెకాయలాంటి రాజధాని నగరం న్యూఢిల్లీలోని పరిస్థితి ఇది. శరవేగంగా విస్తరిస్తున్న ఈ నగరంలో ఎన్నో అపకీర్తులు కూడా మూటగట్టుకుని వుంటాయి. ఈ నగరం గురించి మీకు బాగా తెలిసినప్పుడే దీన్ని అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది. కానీ, స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా కూడా అమానవీయమైన, చట్టవిరుద్ధమైన పాకీపనిని–కొంత మంది వ్యక్తులు నిర్బంధ జీవనంగా కొనసాగిస్తున్నారని, మానవ

విసర్జితాలను చేతులతో ఎత్తుతూ, నెత్తిన పెట్టి మోసే విధానం ఇంకా అమలవుతుందనే విషయం మీకు తెలుసా? ఢిల్లీలో కొలువుతీరిన భారతదేశ పార్లమెంటు 1993లో ఈ పాకీ పనిని నిర్మూలిస్తూ, ఈ పనిలో వున్నవారికి పునరావాసం కల్పిస్తూ చట్టం చేసిందనే విషయం మీకు తెలుసా? వాస్తవానికి, ఈ పాకీపనిలో వున్నవారి విముక్తి కోసం వారి పునరావాస పథకాల కోసం 2007లో 747కోట్ల రూపాయలు దేశవ్యాప్తంగా ఖర్చుపెట్టటం జరిగింది. కోట్ల రూపాయలైతే ఖర్చు చేశారు కానీ, వాస్తవ పరిస్థితిలో ఏ మార్పూ లేదు. దేశంలో మారుమూల ప్రాంతాల గురించి వదిలేద్దాం, ఢిల్లీలోనూ ఆ చుట్టుపక్కల వుండే నగరాలైన ఘజియాబాద్, మీరట్‌లలో కూడా ఈ పని బహిరంగంగానే జరుగుతోంది. అయితే, ఈ ప్రాంతాలలోని పాకీ పని వారికి తాము చేసే ఈ దుర్భరమైన వృత్తి నుంచి విముక్తి కోసం ఉద్దేశించిన ఈ పథకాల గురించి కానీ, ఆ పేరు మీద ఖర్చుపెట్టిన నిధుల గురించి కానీ నామమాత్రపు అవగాహన కూడా లేదు.

ఢిల్లీలోని నంద్‌నాగ్రి, సీలమ్‌పూర్, సుందర్‌నాగ్రి, సీమాపురి, గోకుల్‌పురి, భజన్‌పుర, వెల్‌కమ్, మండోలి గ్రామం, షేరాపూర్ చౌక్, ఛాందినిచౌక్ మొదలైన అన్ని ప్రాంతాల్లోనూ పాకీ వృత్తి నడుస్తోంది. తూర్పు ఢిల్లీలో ఆనంద్ విహార్ బస్‌స్టాండ్‌లో వరుసగా వున్న వ్యాపార సముదాయాలను చూస్తే మనం ఏదన్నా విదేశంలో వున్నామా అనే అనుమానాన్ని కలిగిస్తాయి. కానీ కేవలం ఐదు పది కిలోమీటర్ల లోపలే పాకీపని చేస్తూ రోజూవారీ జీవితాన్ని గడుపుతున్నవారి ఆవాసాలు కనిపిస్తాయి. అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను పక్కనపెడితే, ఈ మనుషులు ఇంకా ఎందుకు ఇదే వృత్తిలోనే జీవిస్తున్నారనేది అక్కడికి వెళ్ళి చూడకుండా మాత్రం అర్థంకాదు.

నేను నందనాగ్రిలో మీనాక్షిని, ఆమె కుటుంబాన్ని, సహచరులను కలిశాను. కనిపించని, కంపుకొడుతున్న ఈ అభివృద్ధి దృశ్యాన్ని వారు నాకు అక్కడే చూపించారు. మీనా కూతురు ఇంత బాధాకరమైన స్థితిలో ఎందుకు వుందంటే, ఆమె కడుపులో వున్నన్ని రోజులు మీనా 'రోత' కలిగించే ఈ పాకీపని చేస్తూ వుండటమే అని మీనా, ఆమె కుటుంబ సభ్యులు విశ్వసిస్తున్నారు. అందుకే మీనా తన జీవన విధానాన్ని మార్చుకుంది. తన కూతురిని రక్షించుకోవటానికి ఎంత ప్రయత్నం చేస్తోందో అంతే స్థాయిలో ఈ రోతపనిని కూడా వ్యతిరేకిస్తోంది. ఇతర పిల్లలెవరూ ఇలాంటి బాధ అనుభవించకూడదని, ఏ తల్లిదండ్రులకు తన లాగా గుండెపగిలే పరిస్థితికి రాకూడదని మీనా కంకణం కట్టుకుంది. అందుకే ఈ అమానవీయమైన పనిని నిర్మూలించాలనే ధ్యేయంతో సాగుతున్న ఉద్యమంలో భాగమైంది.

మాటల మధ్యలో మీనా, 'నేను ఈ రోతపనిని చేయకుండా వుండివుంటే, నా కూతురు ఏ సమస్యా లేకుండా మామూలుగా పుట్టేది కదా అక్కా, కాదంటావా?' అంది.

'లేదు, చాలా మంది ఇలాంటి పిల్లలకు జన్మనిస్తుంటారు' అని నేను సమాధానమిచ్చాను.

మీనా ఏడుస్తూనే 'నేనూ అలానే అనుకునేదాన్నే కానీ, నేను చేసే ఈ మురికి పని వల్ల నా గర్భాశయానికి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని మా డాక్టరు స్పష్టంగా నాతో చెప్పింది. ఐదో నెలలోనో, ఆరో నెలలోనో అనుకుంటా ఈ పని మానేయమని సలహా ఇచ్చింది. కానీ నేను ఆపలేదు. ఇప్పుడు పనిచేస్తే, పాప పుట్టేసరికి మరికొంత డబ్బు జమచేసుకోవచ్చని ఆశపడ్డాను. నా ఈ ఆశ వల్లనే నా కూతురి జీవితం నాశనం అయిందని ఇప్పటికీ నాకెంతో బాధగా వుంటుంది. ఆ రోజుల్లో నేను కేవలం ఇళ్ళల్లో పాకీదొడ్లే కాదు, సెప్టిక్ ట్యాంక్‌లను కూడా శుభ్రం చేయటానికి వెళ్ళేదాన్ని. అలా చేస్తున్నప్పుడే ఇన్‌ఫెక్షన్ పెరుగుతూ వచ్చి నేను బాగా జబ్బుపడ్డాను. చికిత్స చేయించుకున్నాను గానీ జబ్బు తగ్గలేదు. అప్పుడు నాకు ఎనిమిదో నెల. ఈ ఇన్‌ఫెక్షన్ వల్ల కడుపులో ఉన్న బిడ్డకు చాలా ప్రమాదమని డాక్టర్ చెప్పింది. ఆ సమయంలో నాకు వేరే దారేమీ లేదు. నిజం చెప్పాలంటే, కడుపులో వున్న బిడ్డకు ఇది ఏ స్థాయిలో ప్రమాదం చేస్తుందనేది నాకు తెలియదు. నా కొక్కదానికే కాదు, నాలా ఈ పాకీపని చేస్తున్న చాలా మంది ఆడవాళ్ళకి ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయని నాకు తర్వాత తెలిసింది. నాలాంటివారి బాధను అర్థం చేసుకునేవారు చాలా మంది వున్నారన్న వాస్తవం నాకు చాలా ధైర్యాన్నిచ్చింది' అని చెప్పింది.

'టీ తీసుకుంటారా?' అని నన్ను ఒకింత సంశయంగానే అడిగింది మీనా. అయితే నా సమాధానం కోసం వేచిచూడకుండానే లోపలికి వెళ్ళి టీ తయారు చేసింది. టీ తాగుతున్నప్పుడు తాను రకరకాల డిజైన్లతో బొట్టుబిళ్ళలు తయారు చేస్తున్నానని చెప్పింది. కొద్దిసేపైన తర్వాత, 'నేను ఇప్పుడు ఆ పాకీ పనిని వదిలేశాను గానీ, మా అమ్మ, నా భర్త ఇప్పటికీ అదే పని చేస్తున్నారు. అయితే వాళ్ళు కూడా తొందరలోనే వదిలేస్తారు' అంటూ 'రండి, అమ్మకు మిమ్మల్ని పరిచయం చేసి, ఈ చుట్టు పక్కల అంతా చూపిస్తాను' అంది.

నాకు ఆ కాలనీ అంతటినీ ఒక గైడ్ లాగా తిప్పి చూపించింది మీనా. వాళ్ళ అమ్మ పేరు శారద. సల్వార్ కమీజ్ వేసుకొని సైకిల్ రిక్షా నడుపుతూ, నందనగ్రిలోని రామ్‌నగర్‌లో చెత్తను ఎత్తుకుంటూ వస్తోంది. ఆమె ఇప్పటికే చెత్తఎత్తే పనిలోకి వచ్చింది కనుక, ఇంకా ఆ పాకీపని చేయాల్సిన అవసరమేమిటని నేను చాలా ఆశ్యర్యపోయాను?

తాను పని ఒత్తిడిలో వున్నాననీ, తనతో మాట్లాడాలనుకుంటే కూడా నడవమని శారద నిర్మొహమాటంగా చెప్పేసింది. చెత్తతో నిండుగా వున్న ఆ సైకిల్‌రిక్షా ఆమె నడుపుతూ వుంటే తనతో పాటు నడుస్తూ ప్రశ్నలడగటం మొదలుపెట్టాం.

'ఎప్పటి నుంచి ఎత్తుడుదొడ్లను శుభ్రం చేస్తున్నారు'?

'నా జీవితమంతా ఈ పాకీపని చేయటంలోనే గడిపాను' అంటూనే ఆమె బండి ఆపి కిందకి దిగింది. జుట్టు ముడి ఒకసారివిప్పి, సవరించుకుని మళ్ళీ వేసుకుంటూ ఆమె తన మాటల్ని కొనసాగించింది. 'ఇది భరించలేనంత కంపు కొడుతుంది. నేను

వయసులో వున్నప్పుడు నా జట్టు ముడివిప్పాలంటే చాలా భయపడేదాన్ని. నా పక్కన కూర్చున్నవాళ్ళకు ఆ పియ్యిపెంట కంపు వస్తుందేమో అని ఆలోచించేదాన్ని. నా పెళ్ళయిన వారం రోజులకే మా అత్త నన్ను తనవెంట తీసుకెళ్ళి నాతో ఈ పని చేయించటం మొదలుపెట్టింది. నా తల్లిదండ్రుల ఇంట్లో ఈ పని చేసేవాళ్ళం కాదు. మొట్టమొదటిసారి మా అత్త ఊర్లోనే చేశాను. అప్పటికి నా చేతులకున్న గోరింటాకు కూడా వెలిసిపోలేదు. మేము పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వెళ్ళిన ఇళ్ళల్లోని వారు, తన చేతులకున్న గోరింటాకు పోయేదాకా అన్నా ఆగొచ్చుకదా అని మా అత్తతో అనేవారు. దానికి మా అత్త వెంటనే, కోడలికి కనీసం ఐదు రోజులపాటు విశ్రాంతి ఇచ్చామనీ, తానయితే పెళ్ళయిన మర్నాడే పని మొదలుపెట్టాననీ చెప్పేది. నేను పని మొదలుపెట్టిన రోజు ఎంత ఘోరంగా అనిపించిదో నాకిప్పటికీ గుర్తుంది. మేము ఇంటికి తిరిగివేళ్ళే సమయానికి నేను కనీసం పదిసార్లు పడిపోయివుంటాను. నా జీవితంలో నేను ఇలాంటి మురికిపని చేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ, నా నుదిటి మీద ఈ రాత రాసివుంది..... ఈ కులంలో పుట్టినందుకు వచ్చిన శిక్ష ఇది. కానీ, ఇదంతా అర్ధం కావటానికి చాలా సమయం పడుతుంది. అవునా కాదా? చిన్నతనంలోనే ఈ పని నీ కోసం కేటాయించింది అని నీకు అర్ధం అవటం మంచిది. లేకపోతే ఈ పనికి అలవాటు కావటానికి చాలా కష్టపడవలసి వస్తుంది. అందుకే మా కుటుంబాలలో చాలా చిన్నప్పుడే పెళ్ళిళ్ళు అవుతుంటాయి'.

ఇదంతా చెబుతూనే, శారద తన కొంగు చివర కట్టివున్న బీడీ తీసి వెలిగించి రెండు మూడు దమ్ములు పీల్చింది. 'నా జీవితమంతా ఇలానే గడిపాను కానీ ఇప్పుడు ఈమె' అంటూ కూతురు మీనా వేపు వేలుపెట్టి చూపిస్తూ 'మనమిదంతా మార్చాల్సిందే అంటుంది. ఆమె కూతురికి జరిగిన దానికి నేను కూడా చాలా బాధపడుతున్నాను. కానీ అలా చాలా మందికి కూడా జరిగింది. నా పిల్లల్లో ముగ్గురికి ఇలానే అయ్యింది. కొన్ని క్రిముల వల్ల అలా జరుగుతుందని డాక్టరు చెప్పారు. ఏమయినా, ఆడవాళ్ళందరిదీ ఇదే కథ....కానీ నేను నా జుట్టు నుంచి వచ్చే వాసనతో చాలా ఇబ్బందులు పడ్డాను. నా జీవిత కాలంలో నేను దీనినుంచి బయటపడగలిగితే అప్పుడే నేను తిరిగి శుభ్రంగా జన్మించినట్లుగా భావిస్తాను.'

తాను ఇప్పటికీ ప్రతిరోజూ శుభ్రంచేస్తున్న మట్టి పాకీదొడ్ల దగ్గరికి మమ్మల్ని తీసుకెళ్ళి వాటిని మాకు చూపిస్తూ తన లోపలి బాధంతా వెళ్ళగక్కింది ఆమె. ఇంటి వెనకవైపు భాగాన ఆ పియ్యిపెంటంతా బయటకు రావటానికి వేరే మార్గం ఏర్పాటు చేశారు. అంటే దానర్ధం పాకీదొడ్లు శుభ్రం చేసేవాళ్ళు ఇంట్లోకి రాకుండా చేయటమే. ఈ ప్రాంతాల్లో ఈ మట్టి పాకీదొడ్లు చాలా వరకు తగ్గిపోయాయి కానీ పూర్తిగా పోలేదు. అయితే వాటికి కొత్త రూపం ఇస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలలో నడుస్తూ వుంటే మీకెవ్వరికీ కూడా బహిరంగంగా అలా పియ్యిపెంటను మోసుకుంటూ వెళ్ళేవాళ్ళు

కనిపించకపోవచ్చు. కారణమేమంటే ప్రతిఒక్కరూ కూడా ట్యాంకులను కట్టుకున్నారు. అయితే ఆ ట్యాంకులేవీ కూడా నీటిని పీల్చుకునే గుంటలు కాదు. భారతదేశపు చాలా పట్టణాలలో, మరీముఖ్యంగా వెనుకబడిన పట్టణాలలో మురుగు వెళ్ళటానికి కాల్వలను వెయ్యకపోవటమో లేదా వేసినా గానీ వాటి నిర్మాణం సరిగ్గా ఉండకపోవటమో జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ట్యాంకులను చేతులతోనే శుభ్రం చేయవలసి వస్తుంది. ఆ ట్యాంకు విస్తీర్ణాన్ని బట్టి, ఆ పాకీదొడ్డిని ఎంతమంది వాడుతున్నారు అనేదాన్ని బట్టి అది ఎన్నిరోజులకు శుభ్రం చేయవలసివస్తుందో తెలిసిపోతుంది. ఈ ట్యాంకులను శుభ్రం చేసే పని కూడా వీళ్ళ మీదే పడుతుంది.

యాభైఐదేళ్ళ మున్నాలాల్ మాకు ఈ విషయాన్ని చెప్పాడు. ప్రతిరోజూ పాకీపని చేయటం కన్నా ఈ ట్యాంకులను శుభ్రం చేయటం మరింత ప్రమాదమని అతను చెప్పాడు. ఈ పని రాత్రంతా సాగుతూనే వుంటుంది. నెల రెండునెలల నుంచి కుళ్ళి పేరుకుపోయిన పియ్యిపెంట దుర్గంధంలోకి ఒక మనిషి దిగి విరామం కూడా లేకుండా పనిచేస్తూనే వుండాలి. అంతా శుభ్రంచేసిన తర్వాత, తాను నిజంగా మనిషినేనా అనే అనుమానం ప్రతి ఒక్కరికీ వస్తుంది. 'నిషా తలకెక్కేలా తాగిన తర్వాతే ఎవరైనా ఈ పని చేయటానికి దిగుతారు. తాగకుండా ఆ దుర్గంధం భరిస్తూ చేయటమనేది అసలు సాధ్యమే కాదు. నిజానికి ఎవరైనా పూర్తి స్పృహలో వుండి ఈ పని చేయగలుగుతారా!' అని అతనన్నాడు.

ఈ నరకంలో ఇదొక్కటే బాధాకరమైన కథనం కాదు. మనలో చాలామంది వీళ్ళెందుకు ఈ పని మానేయట్లేదు? అని తేలికగా అడగొచ్చు. నందనగ్రిలో మేము ఇతర పాకీపని వారితో కలిసి షర్మిలను కలిశాం. ఈ పనెందుకు మానేయట్లేదు అని నేను ఆమెను సూటిగానే ప్రశ్నించాను. 'ఇంకో పనా?' అని ఎదురుప్రశ్నతో సమాధానమిస్తూ, 'మేం వాళ్ళింట్లోకి ప్రవేశించకముందే ప్రతిఒక్కరూ మా కులమేమిటని అడుగుతారు? అప్పుడు గనుక మేము అబద్ధం చెబితే, అది ఎప్పుడు తెలిసిపోతుందో అనే భయంతోనే మేము ఎల్లప్పుడూ వుండాలి. మేముండే ప్రాంతానికి ఎంతో దూరంగా వుండే ఇంకో ప్రాంతంలో ఇల్లు ఊడవటానికి, తుడవటానికి మా వదిన పనిలో జేరింది. ఆరునెలలు బాగానే గడిచాయి. మా వదిన పనిచేసే ఇంటికి ఒకరోజు ఒక అతిథి వచ్చింది. ఇంతకు ముందు మా వదిన పాకీదొడ్లు శుభ్రంచేయటం, ఆ పియ్యిపెంట ఎత్తుకెళ్ళి పారెయ్యటం చూసిన మనిషి ఆమె. మా వదినతో వాళ్ళు చాలా ఘోరంగా ప్రవర్తించారు. ఆమె చీరంతా లాగేసి ఇంటి నుంచి బయటకు వెళ్ళగొట్టారు. ఇప్పుడు చెప్పండి, మేం ఏం చేయాలి? ఎవరి ఆత్మగౌరవం వారికి వుంటుంది! మేం ఎంత తీవ్రంగా మా కులాన్ని వదిలించుకుందామనుకుంటే అది తిరిగి అంతకంటే ఎక్కువగా కమ్ముకుంటూవస్తోంది. అందుకే ఇప్పుడు ఒక విషయం మాకు బాగా అర్థమవుతోంది. కులాన్ని దాచిపెట్టటమో లేదా దానినుంచి పారిపోవటం వల్లో ఏ ప్రయోజనమూ లేదు. మేం చెప్పేది ఇదే: "అవును,

మేం పాకీవాళ్ళమే. మేం చేతులతో పెంటను ఎత్తిపోసిన వాళ్ళమే. ఇప్పుడు మాకు చేయటానికి వేరే పని ఇవ్వండి".

ముఖేష్ సహా అక్కడ వున్న ఇతర పాకీపనివారందరూ షర్మిల చెప్పేదానికి అంగీకారంగా తలవూపుతూ నిలబడ్డారు. ఈ సమూహం నుంచే వచ్చిన ఇరవైమూడేళ్ళ ముఖేష్ గత పదిహేనేళ్ళుగా ఈ పనే చేస్తున్నాడు. ఈ చుట్టుపక్కల ప్రాంతాలలోని 'ప్రయివేటు సులభ్' మరుగుదొడ్లలో వీరందరూ పనిచేస్తున్నారు. మీనా ఈ 'ప్రయివేటు సులభ్ ' మరుగుదొడ్ల గురించి చెప్పింది. 'మొదట్లో ఈ కమ్యూనిటీ మరుగుదొడ్లన్నీ సులభ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో నడిచేవి. ఇప్పుడు అన్నీ ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పజెప్పారు. ఈ మరుగుదొడ్లకు నాలుగు గోడలయితే వున్నాయి గానీ అందులో ఒక పద్ధతిలో కూర్చోవటానికి అవకాశం గానీ, నీరుగానీ లేదు.' అంటే దీనర్థం ఏమిటంటే దొడ్డికి పోయేవారు అక్కడ ఎక్కడైనా కూర్చోవచ్చు. ఇలాంటి పరిస్థితిలో అక్కడ లోపల ఎంత అధ్వాన్నంగా చెత్తగా వుంటుందో ఎవరైనా ఊహించవచ్చు. ఇలాంటివి దాదాపు పదహారు వరకూ నందనగ్రిలోనే వున్నాయి. వీటిని రోజుకు రెండుసార్లు శుభ్రం చేయాలి. ఒకేరకమైన పని అయినప్పటికీ, వీటిని శుభ్రం చేసినందుకు గానూ నెలకు మగవారికి 1000 రూపాయలు, ఆడవారికి 500 రూపాయలు ఇస్తారు. వీటిని శుభ్రం చేయటానికి వీళ్ళు బయట దుర్గంధంతో వున్న కాలువ నుంచి బక్కెట్లలో నీళ్ళు మోసుకుని రావాలి. ఇలాంటి ప్రయివేటు సులభ్ కాంప్లెక్స్‌లు దేశ రాజధానిలోని పేదవర్గాలుండే అనేక ప్రాంతాల్లో చూడొచ్చు.

గత కొన్ని సంవత్సరాల నుంచి, నగరాలలో పెరుగుతున్న కాలుష్యం గురించి ప్రభుత్వం చాలా ఆందోళన చెందుతోంది. అయితే మానవ విసర్జితాల కాలుష్యాన్ని ఎలా పరిష్కరించాలన్న దానిపై ఏ మాత్రం శ్రద్ధ, ఆలోచన లేవు. ఏ ప్రభుత్వ పథకమూ ఈ ప్రజలను జేరలేదు. నిజానికి, ఇక్కడ మీనా లాంటి స్త్రీలు మార్పుకోసం ముందుకు సాగుతున్నారు. మీనా ఇప్పుడు డిజైన్లతో కూడిన బొట్టు బిళ్ళలను తయారుచేస్తోంది. అలాగే అమానవీయమైన ఈ పాకీవృత్తి నిర్మూలన కోసం అనేక సంవత్సరాలుగా దేశవ్యాపితంగా ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్న సఫాయి కర్మచారీ ఆందోళనతో కలిసి పనిచేస్తోంది. 'ఈ నరకప్రాయమైన పాకీ పని నుంచి విముక్తమయ్యాక ఒక స్త్రీ ఎంత ఆనందిస్తుందో మీరు అస్సలు ఊహించలేరు! మా గౌరవాన్ని తిరిగి పొందటానికి మాకు మిగిలింది ఇదొక్కటే మార్గం' అని మీనా చెప్పింది.

దేశంలోని ఇతర రాష్ట్రాలలో మాదిరే ఢిల్లీలోని ఈ స్త్రీలకి కూడా పాకీపని నిర్మూలన కోసం ప్రతిపాదించిన ఏ జాతీయ పథకమూ ఉపయోగపడలేదు. వీరిలో చాలామంది అసలు అటువంటి పథకాల గురించి వినను కూడా లేదు. వివిధ సామాజిక సంస్థల ద్వారా కొద్దిమందికి తెలిసినా అవినీతి, రాజకీయ కారణాల ఫలితంగా వాటి వల్ల ఏ మాత్రం ప్రయోజనం పొందలేకపోతున్నారు.

నిజానికి, సఫాయి కర్మచారీలకు సంబంధించి వున్న జాతీయ కమిషన్ కార్యాలయం ఢిల్లీలోనే వుండటం అత్యంత బాధాకరమైన విషయం. 1993లో ఏర్పాటుచేసిన ఈ సంస్థ లక్ష్యం దేశమంతటా కూడా పాకీపనిని నిర్మూలించి, ఈ పనిచేస్తున్న వాళ్ళకు ఇతర గౌరవప్రదమైన జీవనోపాధులను కల్పించటం. చట్టవిరుద్ధమైన, అమానవీయమైన ఈ పని నిర్మూలన కోసం, ఈ పనిచేస్తున్న వాళ్ళ సంక్షేమం కోసం పెద్దమొత్తంలో నిధులు కేటాయించటం జరిగిందని అప్పటి ఛైర్‌పర్సన్‌గా వున్న సంతోష్ ఛౌదరి సుదీర్ఘమైన చర్చ తర్వాత అంగీకరించారు. 'అధికారులందరూ ఎయిర్ కండిషన్డ్ గదుల్లో కూర్చుని వాస్తవ పరిస్థితిని పూర్తిగా విస్మరించారు. ఈ సమస్య వారికి ఒక లెక్కకిందే రాదు. లేకపోతే 747 కోట్ల రూపాయలు అంటే తేలికైన విషయమా? అది కూడా కేవలం పట్టణ ప్రాంతాలకే?' అని ఆయన అన్నాడు. ఈ పునరావాస కార్యక్రమం కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమయింది. ఒక్క రాత్రికి రాత్రే ఫ్లై ఓవర్లు కట్టేసి మహానగరాలను నిర్మించగలుగుతున్నప్పుడు మరుగదొడ్లు, వాటికి సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థని నిర్మించ లేరా?

ప్రతి మూడు నెలల కొకసారి ప్రధానమంత్రి కార్యాలయానికి తమ కమిషన్ సిఫార్సులను పంపిస్తుందని సంతోష్ ఛౌదరి నాతో చెప్పారు. తన మొట్టమొదటి రిపోర్టులోనే కమిషన్ నాలుగైదు కీలకమైన సిఫార్సులను పంపించిందనే విషయం గుర్తుంచుకోవాలి. దీనిలో పాకీపని నిర్వచనంతో పాటు, ఈ పనిలో కాంట్రాక్టర్ల వ్యవస్థను రద్దు చేయటం, పునరావాసం కోసం రుణసౌకర్యం కాకుండా నేరుగా ఉద్యోగాలు కల్పించటం. ఈ సిఫార్సులను ఆధారం చేసుకుని కనీసం కొన్ని అంశాలనైనా నిర్దిష్టంగా అమలుచేసి వుంటే ఈ రోజు మీనా లాంటి మహిళల జీవితాల్లో కనీసం కొంచెమైన ఉపశమనం వచ్చి వుండేది. చివరికి ఇప్పుడు ఒక యూనియన్‌గా సమీకృతమైన తర్వాతే మీనా బొట్టుబిళ్ళలను డిజైన్ చేసే పనిలో వుంది. ముఖేష్ ఒక ఆటోరిక్షా నడుపుకోవాలను కుంటున్నాడు.

ఢిల్లీలాంటి మహానగరంలో అభివృద్ధికి నిర్వచనంలా ఉండే వెలుగు జిలుగుల షాపింగ్‌మాల్స్ నడుమ మధ్యయుగాల నాటి ఈ ఆటవిక వృత్తులు ఇంకా కొనసాగుతున్నా యంటే ఎవ్వరికీ నమ్మాలనిపించకపోవచ్చు. కానీ ఇది వాస్తవం. ఈ రెండు భిన్నమైన ప్రపంచాలు, జాతీయ రాజధానిలో ఒకదాని పక్కనే ఒకటి పరుచుకుని వున్నాయి. నిజానికి లోతుల్లోకి వెళ్ళి తరచిచూస్తే, ఈ వెలుగుజిలుగుల పెట్టుబడిదారీ అభివృద్ధికి, మధ్యయుగాల నాటి ఈ ఆటవిక కులవృత్తులకి మధ్య పైకి కనిపించని ఒక అవినాభావ సంబంధం వుంది. వాస్తవానికి, ఈ రెండూ కూడా చివరికి ఒక మనిషికి (ఆడ, మగ ఎవరైనా కావొచ్చు) ఇచ్చే గౌరవం అనే తాను మీదే నిలబడి వుంటాయి. మొదటిది ధనిక, పేద అనే తారతమ్యం మీద ఆధారపడితే, రెండోది మనుషులను బలవంతంగా నరక

ప్రాయమైన జీవితాల్లోకి నెడుతుంది. ఢిల్లీలోని ఇరుకు సందుల్లో ఈ కఠోర వాస్తవం నాకు అన్ని సూక్ష్మాంశాలతో సహా అనుభవంలోకి వచ్చింది.

ఒక విషబీజంలాగా, కాస్మోపాలిటన్ నగరమైన ఢిల్లీలో కూడా ఈ పాకీపని పాతుకుపోయింది. అభివృద్ధి జపం చేసేవాళ్ళు ఈ వాస్తవాన్ని అంగీకరించలేరు. జాతీయ స్థూలఉత్పత్తి (జిడిపి) గురించి విపరీతంగా జపంచేస్తున్న ఈ రోజుల్లో ఒకవైపు ఆశావహమైన ఉత్పత్తి అంచనాలు, మరోవైపు పార్లమెంటు సాక్షిగా దళిత వర్గానికి చెందిన ఒక సమూహపు మనుషులు మానవ విసర్జితాలను నెత్తిమీద మోస్తూ వున్నారు. పాకీపని అనే ఈ దుర్మార్గపు కులరక్కసి నుంచి తప్పించుకోవటానికి మీనా మరికొంత మంది చేస్తున్న పోరాటాన్ని నేను 2006లో ప్రత్యక్షంగా చూశాను. ఈ పోరాటం ఇప్పుడు మరింత బలోపేతమయింది. ఈ పోరాటంలో భాగంగా సఫాయి కర్మచారీ ఆందోళనతో మమేకమయిన ఉష తన స్నేహితులతో కలిసి ఇంటింటికీ తిరిగి విస్తృతమయిన సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో వెల్లడయిన విషయాల ప్రకారం ఢిల్లీలోని నందనగ్రి, మండోలి, హర్ష విహార్, సుందర్‌నగ్రి, చాందినీ చౌక్, కరవాల్ నగర్, రామ్‌నగర్, సీమాపురి, ప్రతాప్‌నగర్, ఖజురి, గోకుల్‌పురి, మంగోల్‌పురి, రాజీవ్‌నగర్ మొదలైన ప్రాంతాల్లో పాకీపని వారు వుంటున్నారని, దానికి రుజువుగా ఇరవైమూడు మంది పాకీ పనివాళ్ళ పూర్తి వివరాలను సేకరించారు. ఇది ఒక నమూనా సర్వే మాత్రమే. చాలా సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న పాకీపనివారు ఈ సర్వేలో వెల్లడయిన విషయాలన్నీ మళ్ళీ కోర్టుకి నివేదించటం జరిగింది. దేశ అత్యున్నత చట్టసభ ఈ వృత్తిని మానవ వ్యతిరేకమయిన వృత్తిగా ప్రకటించి చట్టంచేస్తే, దానిని అమలుచేయమని దేశ సర్వోన్నత న్యాయస్థానంలో పోరాటం చేయడమనేది ఆసక్తికరమైన విషయం. ఈ సర్వే ఆధారంగా సుప్రీంకోర్టు 2009 ఏప్రిల్ 30న ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది. సుప్రీంకోర్టు నుంచి నోటీసు వచ్చిన తర్వాతే ఢిల్లీ ప్రభుత్వం ఆందోళనతో కొన్ని చర్యలను చేపట్టింది. స్వయంగా ఢిల్లీ పోలీసులే కొన్ని మొహల్లాలకు వెళ్ళి అక్కడ వున్న ఎత్తుడుదొడ్లను కూలగొట్టారు. ఈ చర్యకు అర్థం ఏమిటంటే, ఇలాంటి పాకీదొడ్లు అసలు ఉనికిలోనే లేవని సుప్రీంకోర్టుకి అధికార యంత్రాంగం చెప్పదలిచింది. ఇవి ఉనికిలోనే లేవని చెప్పాలనుకోవడానికి బదులుగా ఈ అమానవీయ, దుర్మార్గపు వృత్తిని సమూలంగా నిర్మూలించే విధంగా అధికార యంత్రాంగం ఆలోచించలేక పోవటమే విషాదం. కేవలం ఈ చర్యతోనే సరిపెట్టుకోకుండా యుద్ధప్రాతిపదికన ఎత్తుడుదొడ్ల స్థానంలో నీరు అవసరం వుండే ఫ్లష్ టాయిలెట్లను అధికార యంత్రాంగం కట్టించింది.

'మంచిదే! మనల్ని తప్పు అని నిరూపించటానికైనా సరే వీళ్ళు కనీసం ఈ మాత్రం పని చేశారు. ఇంతకు ముందు కనీసం వీటి గురించి ఆలోచించలేదు. మురికి కూపమైన ఈ పనిని పూర్తిగా నిర్మూలించాలన్నదే మా ఉద్దేశం. అలాంటి అబద్ధాల పునాది మీదే

ఇది జరుగుతుందంటే వాటి మీద మాకెలాంటి అభ్యంతరం లేదు' అని హాస్య ప్రియత్వం వున్న ఉష చాలా హూషారుగా అధికార యంత్రాంగ స్వభావం గురించి వ్యాఖ్యానించింది. ఇది ఉష, మీనాల విజయాన్ని తక్కువ జేయటం ఎంత మాత్రం కాదు. కనీసం ఇప్పటికైనా వారి ప్రాంతాలల్లో తోటి మనుషుల పియ్యిపెంటను చేతులతో ఎత్తిపోసే పాకీ పనికి గుర్తుగా వున్న చిహ్నాలన్నీ ధ్వంసం అయ్యాయి. దీనర్థం ఇంక ఎవ్వరూ కూడా ఈ మురికి పనే చేసి తీరాలని వీళ్ళని నిర్బంధించరు. మీనా అన్నట్లు, 'ఎత్తుడుదొడ్లే లేకపోతే, వాటిని శుభ్రం చేసే పని కూడా ఎవ్వరికీ వుండదు.'

అయితే ఈ సమస్య ఇక్కడితో పూర్తయిపోయినట్లు కాదు. తమ పునరావాసం కోసం, ఆత్మగౌరవం కోసం వాళ్ళ ముందు ఇంకా సుదీర్ఘమైన పోరాటం వుంది. ఈ వృత్తితో పెనవేసుకుపోయి వున్న కులవివక్ష తమ పిల్లల అనుభవంలోకి రాకూడదని ఈ స్త్రీలు భావిస్తున్నారు. అందుకే వారు పాకీపనిలో వున్న ఆడవాళ్ళందరికీ పునరావాసం తప్పనిసరి హామీగా వుండాలని కోరుకుంటున్నారు. పునరావాసం కోసం ప్రభుత్వం కేటాయించిన కోట్లాది రూపాయలు వాస్తవ రూపంలో అందరికీ అందాలి. దేశ రాజధానిలోనే ఈ పరిస్థితి వుంటే, మిగిలిన చోట్ల పరిస్థితి ఎంత దారుణంగా వుండి ఉంటుందో తేలికగానే ఊహించవచ్చు.

2008లో సుప్రీంకోర్టు జోక్యం అనే చరిత్రాత్మక ఘటనతో, ఆ అఫిడవిట్‌లో పేర్కొన్న ఎత్తుడుదొడ్ల సమాచారాన్ని తీసుకుని ఢిల్లీ పోలీసులు ఒక రోజు రాత్రిపూట వెళ్ళి కేవలం వాటిని మాత్రమే కూలగొట్టారు. దీనితో పాకీపనికి సంబంధించి తమ చేతులను కడిగేసుకుంది నాటి ఢిల్లీ ప్రభుత్వం, ఇంకా ముఖ్యమంత్రి షీలాదీక్షిత్. పాకీపనివారల పునరావాసం గురించి నయాపైసా కూడా ఖర్చు పెట్టకుండానే వాళ్ళు ఢిల్లీని పాకీపనిలేని రాష్ట్రంగా ప్రకటించేశారు. కూల్చివేతకు ముందుగానీ లేదా ఆ తర్వాత గానీ వీళ్ళెవరినీ పాకీపని చేసేవారుగా గుర్తించలేదు. అధికార యంత్రాంగం దృష్టిలో మీనా, ఆమె తల్లి శారద ఇంకా అనేకమంది కనిపించకుండాపోయారు. అయినా మీనా, శారద తమ పోరాటాన్ని వదిలిపెట్టలేదు. వాళ్ళ ధైర్యాన్ని మెచ్చుకోవాలి. వాళ్ళు ఒక ఆశావహ దృక్పథంతో గౌరవప్రదమైన జీవనోపాధి కోసం జిల్లా న్యాయాధికారిని, షెడ్యూలు కులాల కార్పొరేషన్‌ని, స్థానిక శాసనసభ్యుణ్ణి, ఇంకా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని తమ సంస్థల ద్వారా సంప్రదించారు. దుర్భేధ్యమైన ఈ కార్యాలయాల తలుపుల్ని విసుగులేకుండా వాళ్ళు తడుతూనే వున్నారు కానీ వారి గోడు అక్కడ వినిపించుకునేవారే కరువయ్యారు.

అదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వం నుంచి పునరావాసం కింద ఒక ఆటోరిక్షా వస్తుందనే ఆశతో మీనా దాన్ని ఎలా నడపాలో నేర్చుకుంది. 2012లో షెడ్యూలు కులాల కార్పొరేషన్ అధికారులు ఆమెకు ఏ విధమైన స్థిర చరాస్థులు లేవని, హామీదారులెవరూ లేరని ఆమె అప్లికేషన్‌ను తిరస్కరించారు. ఇరవైవేలు లేదా పాతికవేలకు పరిమితమైన

చిన్నపాటి రుణం కోసం మళ్ళీ అప్లికేషన్ పెట్టుకోమని ఆమెకు సూచించారు. కానీ, ధైర్యస్తురాలైన మీనా తన కలను చిన్నాభిన్నం చేసే అవకాశాన్ని ఈ అధికారులకు ఎన్నడూ ఇవ్వలేదు.

చివరికి సఫాయి కర్మచారీ ఆందోళన సహాయంతో ఆమె ఇ-రిక్షాను కొనుక్కో గలిగింది. చరిత్రను ఆమె ఎలా తిరగరాసిందో ఎవరైనా చూడొచ్చు. ఒకప్పుడు తోటి మనుషుల పియ్యిపెంటను నెత్తిన మోసిన రోడ్ల మీదే ఆమె ఇప్పుడు బ్యాటరీ సహాయంతో నడిచే రిక్షాను నడుపుతోంది. కానీ ఆటోరిక్షా వుండాలనే తన కలను ఆమె విడిచిపెట్టలేదు. రిక్షా నడుపుతున్నపుడు, 'ఇప్పుడు దాచుకుంటున్న డబ్బులతో ఏదో ఒకరోజు తప్పకుండా నేను ఆటోరిక్షా కొంటాను' అని ఆత్మవిశ్వాసంతో, చిరునవ్వుతో చెప్పిందామె. ఇది విచిత్రంగా లేదూ! ప్రభుత్వం ఇప్పటికీ కూడా అలాంటి పరిస్థితుల్లో వున్న ఆమెకు గానీ ఆమె లాంటి ఇతర స్త్రీలకు గానీ సహాయం చేయటానికి ముందుకు రావడం లేదు. అయినప్పటికీ ఆత్మగౌరవం కోసం ఈ స్త్రీలు ముందుకు సాగుతూనే వున్నారు. దేశంలో వున్న మీనా లాంటి స్త్రీలందరికీ అభినందనలు.

(దీనిని 2006 జూలై నెలలో ముందుగా రాసినా, ఆ తర్వాత మార్పులు చేర్పులు చేయటం జరిగింది. తూర్పు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో మేము పర్యటించిన అనుభవాల అధారంగా రాసిన వ్యాసం ఇది.)

# బీహార్




1. సివాన్ 2. ఛాప్రా 3. గోపాల్‌గంజ్ 4. బుక్సర్ 5. ఔరంగాబాద్ 6. జాముయ్ 7.సహర్స 8. ఈస్ట్ చంపరన్ 9. మధేపుర 10. వైశాలి 11. సీతామర్హి 12. మధుబని 13. రోహ్‌తాస్ 14.కతిహార్ 15. నవాడా 16. ముంగేర్ 17. ఖగారియా 18. బంక 19. సమస్థిపూర్ 20. జెహనబాద్ 21. పట్నా 22. పూర్ణియా 23. ఖైమూర్ 24. ముజఫర్‌పూర్ 25. గయ 26. భోజ్‌పూర్ 27. అరారియా

బీహార్ లోని ఈ ప్రదేశాల్లో ఇప్పటికీ చేతులతో మానవ విసర్జితాలను ఎత్తిపారవేసే పని నడుస్తోంది.

## బీహార్

**'ఏదో ఒక మత్తుమందు ప్రభావం వుంటే గానీ ఈ మురికి పని చేయలేరు'.**

ఇక్కడ నేను కలిసిన వ్యక్తి పేరు గాంధీ! 1948 జనవరి 30న మహాత్మాగాంధీ చనిపోయిన రోజు సాయంత్రం 5 గంటలకు ఇతను పుట్టటం కేవలం యాదృచ్ఛికమే. గాంధీగారి ఆత్మ ఈ బిడ్డలోకి వచ్చి వుంటుందని ప్రతి ఒక్కరూ అనుకున్నారు. అందుకే అంత గొప్పవ్యక్తి పేరు పెట్టారు. జాతిపిత గాంధీ జీవితానికి ఈ గాంధీ జీవితానికి ఎక్కడైనా ఏమైనా సారూప్యాలు వున్నాయా? ఇది మాత్రం ఎవరూ చెప్పలేరు. కానీ ఇతని జీవితకాలంలో (నేను 2006లో కలిసినప్పుడు ఇతనికి 58 ఏళ్ళు) బాల్యం మొదలు యవ్వనం, ముసలితనం వరకు ఆపకుండా ఒకే పని చేస్తున్నాడు. దానికి వ్యతిరేకంగానే గాంధీజీ కూడా ప్రచారాన్ని నిర్వహించారు.

మానవ విసర్జితాలైన పియ్యిపెంటలను నెత్తి మీద మోసుకెళ్ళటం లేదా టీనా అనే పనితోనే ఇతను పెరిగాడు.

ఈ రోజు ఇతని కుటుంబంలో తర్వాతి రెండు తరాలు కూడా ఇదే పనిలో బలవంతంగా కొనసాగుతున్నారు.

ఇతని కొడుకు, కోడలు, పద్దెనిమిదేళ్ళ మనమడు–అందరూ కూడా పాకీపనే చేస్తున్నారు. నెత్తిమీద మానవ విసర్జిత పియ్యిపెంటను మోస్తూనే వున్నారు. ఇదీ స్వతంత్ర భారతంలోని గాంధీ కథ.

స్వతంత్ర భారతంలోని ఈ 'గాంధీ కుటుంబాన్ని' నేను పుల్వారి షరీఫ్‌లోని సాంఘి మసీదు సమీపంలోని 'తోలా' అనే ప్రాంతంలో కలిశాను. ఇది బీహార్ రాజధాని పాట్నాకు చేరువలోనే వుంటుంది. ఇక్కడి సన్నటి ఇరుకు సందుల్లో నడుస్తూ, ఈ కుటుంబాన్ని వెతుకుతున్నప్పుడు చివరికి వారిని, వారితో పాటు ఇదేపని చేస్తున్న వారిని కలిసిన తర్వాత – స్వాతంత్ర్యం, అభివృద్ధి అనే అంశాలు దేశంలోని ఒక భాగాన్ని కనీసమాత్రంగా కూడా స్పృశించలేదని నాకనిపించింది. స్వాతంత్ర్యం కేవలం ఒక్క మార్పునే తీసుకువచ్చింది. గతంలో ఈ పని చట్టవిరుద్ధమైనది కాదు. కానీ ఈ రోజు అలా కాదు. అయితే ఇప్పటికీ పాకీపని కొనసాగుతూనే వుంది.

కానీ రహస్యంగా!? ఎవరైనా ఆ పని చేస్తూ పట్టుబడితే, పోలీసుల నుంచి హింస తప్పదు.

వారి ప్రాంతంలోకి అడుగుపెట్టేంత వరకూ కూడా ఇక్కడ నివశిస్తున్న ప్రజల జీవితాలు ఎంత దుర్భరంగా వున్నాయో నాకు అర్థం కాలేదు. నయాతోలాలోని జనం కెమెరాని చూస్తూనే, ఏదో సమస్య రాబోతోందని అనుమానించారు. పరిస్థితిని నేను పూర్తిగా అర్థం చేసుకునేలోపలే, గాంధీ కోడలు కుసుమి నా మెడలోని కెమెరాని లాక్కొని ఒక గదిలోకి విసిరేసి, ఆ గదికి బయట నుంచి తాళమేసేసింది. మాట్లాడుతున్నంతసేపూ కిళ్ళీని నములుతూనే వున్న ఆమె 'మీరు మాకు వేరే పని ఏమి కల్పించలేరు గానీ, మేమిప్పుడు చేస్తున్న పని నుంచి మాత్రం బయటకు తోసేస్తారు. మీరు మీ కెమెరాని ఉపయోగించే ప్రయత్నం చేస్తే మేం దాన్ని బద్ధలుకొట్టేస్తాం! మమ్మల్ని మూర్ఖులుగా భావించకండి.

ఇంతకుముందు కూడా ఈ ఫోటోల వల్లే మేం చాలా హింసలపాలయ్యాం. ఇప్పుడు మమ్మల్ని ఫొటో తీయటానికి ఒప్పుకోం' అని తీవ్రమైన స్వరంతో చెప్పింది.

ఈ స్థాయిలో వ్యతిరేకతను నేనస్సలు ఊహించలేదు. పాట్నా నుంచి ఇక్కడికి రావటానికి నేను చాలా సమస్యలనెదుర్కొన్నాను. కుసుమి చిరునామా తెలుసుకోవటానికి నాకు దాదాపు రెండు రోజులపైనే పట్టింది. అలాగే నన్ను కలవటానికి కూడా ఆమె అంత తొందరగా ఇష్టపడలేదు. నా కష్టమంతా విఫలమవుతోందా అని ఒక క్షణం

అనిపించింది. నేను కొంచెం ధైర్యాన్ని కూడదీసుకుని ఆమెతో మాట్లాడటం మొదలు పెట్టాను. నిజానికి నాకు వేరే దారి కూడా లేదు. రెండు నిమిషాల పాటు కుసుమి మాట్లాడినదంతా విన్న తర్వాత, ఈ సమస్యకున్న కొత్తకోణం నా ముందు పరుచుకుంది. ఇంతకు ముందు నా దృష్టికి రాని విషయం అది. ఈ పని చేస్తున్న వారి బాధ, పడుతున్న హింస అది వారు ఇష్టపూర్వకంగా చేస్తున్నాగానీ లేదా బలవంతంగా ఈ అమానవీయమైన కులవ్యవస్థ వల్ల చేస్తున్నాగానీ, అది ఇప్పుడు తీవ్రమైన ఆగ్రహంగా మారింది. కిళ్ళీ నములుతూనే ఆచరణ సాధ్యంకాని ప్రభుత్వ పథకాల డొల్లతనాన్ని గుక్కతిప్పుకోకుండా బట్టబయలు చేసింది కుసుమి.

ఆ మొహల్లాలో వున్న కుసుమి ఇల్లు చూస్తూనే ఆమె ఆ ప్రాంతంలో ఏ వివాదమూ లేని నాయకురాలని నాకర్థమయింది. 'ఈ పని చట్టవిరుద్ధమని మాకు తెలుసు. కానీ చట్టం మా కడుపులు నింపదు. ఈ పని కూడా లేకపోతే మాకు జీవనోపాధి లేదు. మమ్మల్ని రుణాలు తీసుకోమని ప్రభుత్వం చెప్తుంది. కానీ వాటిని తీర్చాలి కదా? వాటిని తిరిగి ఎలా తీర్చగలుగుతాం? మేం ముట్టుకున్న దేనినీ ఇతరులు తినరు. ఇంక వేరేపని మేం ఏం చేయగలుగుతాం? ఒకసారి నేను టీకొట్టు పెట్టాను. ఎవరూ వచ్చి టీ తాగలేదు. "ఈ టీనావాలికి మతిపోయింది. టీ కొట్టుపెట్టి బాపనోళ్ల లాగా మారిపోదామని చూస్తోంది. పాకీపని చేసే ఆమె దగ్గర టీ తాగుతారా ఎవరైనా?

కలియుగం (హిందూపురాణాల ప్రకారం, పాపం బాగా పెరుగుతుంది) కూడా ఇంకా అంత పాడైపోలేదు. ఎవరైనా తమ కులాన్ని వదులుకోవచ్చు కానీ టీ తయారుచేసి తన కులాన్ని దాచేయాలని ఈ కథానాయకురాలు భావిస్తోంది. కానీ అది నీ తలరాత. దానిని తుడిచి వేయటం ఈ జన్మకయితే సాధ్యపడేదికాదు" అని ప్రతిఒక్కళ్ళు అన్నారు. ఇది నిజం! ఇది నా నుదుటి మీద రాసి వుంది. నేను చనిపోయిన తర్వాతే నా తలరాత పోతుంది' అని ఆమె నాతో చెప్పింది.

ఇదంతా చెబుతూనే, ఆమె నోట్లోవున్న కిళ్ళీని బయటకు ఊసేసి ఇత్తడి బిందెలో వున్న నీళ్ళతో నోరు పుక్కిలించి ఊసింది. ఆ తర్వాత తన చీర కొంగుకు కట్టివున్న సుత్రి (ఎండిన పొగాకు)ని బయటకు తీసింది. తన అరచేతుల్తో కొద్దిసేపు నలిపి, కొంత తన మామకు ఇచ్చింది. ఆ పక్కనే నిలబడివున్న ఇంకొకామెకు కూడా ఇచ్చి తన నోట్లో కొంచెం పెట్టుకుంది. ఇదంతా ఆమె ఒక ప్రత్యేకమైన పద్ధతితో చేసింది. 'ఇక్కడి జనమంతా తనను "కథానాయకురాలు" అంటారని, తాను మరీ నల్లగా, పొట్టిగా వుండనని' సరదాగా చెప్పింది.

కాసేపటికి కుసుమి కోపం తగ్గింది. నేను ఇంకా నిలబడే వున్నానని గ్రహించిన ఆమె చప్పున నవారు మంచమొకటి వేసి, దానిమీద ఒక దుప్పటి పరిచి నన్ను కూర్చోమని చెప్పింది. పక్క ఇళ్ళల్లోంచి జనం తొంగి తొంగి చూస్తున్నారు. అవన్నీ కూడా మట్టితో

కట్టిన ఇళ్ళే. సన్నగా ఇరుగ్గా మురికిగా వున్న వీధుల్లో పందులు విహరించటంపై నేను దృష్టి నిలిపాను.

కుసుమి బయటకు వచ్చింది. ఆమె చేతుల్లో నీళ్ళతో నిండుగా వున్న బిందె, ప్లాస్టిక్ గ్లాసు, కొంచెం బెల్లం వున్నాయి. నాకు నీళ్ళు ఇస్తూ, “ఈ విషయమైతే చాలా స్పష్టం. మాకు అప్పులు కాదు, ఉద్యోగాలు కావాలి. మా చేతులు పని చేయటానికి సిద్ధంగానే వున్నాయి గానీ, మాకు పని ఇవ్వటానికి ప్రభుత్వమే సంసిద్ధంగా లేదు. మాకు డబ్బులు ఇచ్చి చేతులు దులిపేసుకోవాలని అది భావిస్తోంది. అయితే మేము ఆ ఉచ్చులో పడదలచుకో లేదు’ అని అంటూనే కుసుమి హఠాత్తుగా నన్ను ప్రశ్నించడం మొదలుపెట్టింది. ‘మీ కులమేమిటి?’

“ఎందుకు? నా కులం నువ్వెందుకు తెలుసుకోవాలనుకుంటున్నావు?” అని నేను ఎదురు ప్రశ్నించాను.

‘కేవలం అగ్రకులాల వారే ఇలా అంటుంటారు. నువ్వైతే మా కులానికి సంబంధించిన దానివా, కాదు కదా?’ అని అసహనంగా నిలదీసినట్టు అడిగింది కుసుమి.

‘ఏం నేను కాకూడదా?’

‘కానీ నువ్వు కాదు! మాకులమే అయితే గనుక నువ్వెందుకు మా గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు? మేము పాకీపని చేసినా చేయకపోయినా గానీ మీ ప్రపంచానికి ఏమీ కాదు. నువ్వు మా గురించి ఎందుకు తెలుసుకోవాలనుకుంటున్నావనేది మాకు తెలియాలి కదా?’ అని స్థిరమైన గొంతుతో కుసుమి అడిగింది.

నిజానికి కుసుమి ప్రశ్నలు చెంప మీద చెళ్ళున కొట్టినట్లున్నా, అవి చాలా ముఖ్యమైనవి. కేవలం బీహార్ గడ్డమీద నుంచే ఎవరైనా అంత పదునుగా, సూటిగా ప్రశ్నించగలరు. ఆ మట్టిలో ఒక రాజకీయ చైతన్యం మిళితమయి వుంది. ఈ పరిస్థితి గురించి నా అవగాహన మేరకు సమాధానాలు ఇవ్వటం మొదలుపెట్టాను. రెండు నిమిషాలు కూడా గడిచాయో లేదో, నన్ను మధ్యలోనే ఆపి కుసుమి మరో మాట అడిగింది. ‘నువ్వు టీ తాగుతావా? నీకేమీ ఇబ్బంది వుండదనే అనుకుంటున్నాను? మేము చాలా శుభ్రంగా కడిగిన గిన్నెల్లోనే తయారు చేస్తాము’. నేను నవ్వేసి తాగుతానన్నట్టుగా తల వూపాను. వద్దని తిరస్కరిస్తే సూటిగా ఆ కులం పట్ల వ్యతిరేక భావనతో ఉన్నట్టుగా అర్థం చేసుకునే అవకాశం వుంది. పాలతో తెల్లగావున్న టీని అప్పటికే తయారుచేసి పెద్ద ట్రేలో ఉప్పు బిసట్లతో సహా మాముందుకి తెచ్చింది.

కొన్ని సంవత్సరాల క్రితం ఒక ఇంగ్లీషు జర్నలిస్టు ఆమె గురించి ఒక వ్యాసం రాసినట్లుగా టీ తాగుతున్నప్పుడు కుసుమి నాకు చెప్పింది. ఆ పత్రిక కాపీని ఇన్ని సంవత్సరాలుగా ఆమె దాచిపెట్టింది కూడా. తన భర్త ఘనేశ్యామ్‌ను బయటకు రమ్మని కేకేసి, పెద్ద ట్రంకుపెట్టిలో వున్న ఆ వ్యాసాన్ని తీసుకురమ్మని చెప్పింది. కొద్దిసేపటిలోనే

ఆ వ్యాసం మా ముందు వుంది. ఔట్‌లుక్ ఇంగ్లీషు ఎడిషన్‌లోని కాగితాలు అవి. వాటినే లామినేట్ చేసి వుంచారు. ఇళ్ళల్లో పెద్దవాళ్ళయిన ఆడవాళ్ళు ఖరీదైన చీరెల్ని ఏవిధంగా భద్రపరుస్తారో, అంతకంటే ఎక్కువ భద్రంగా, చక్కగా మడత పెట్టి వుంచారు ఆ వ్యాసాన్ని. అది నాకు చూపిస్తూ, దానివల్ల తానెదుర్కొన్న పోలీసు ఆగడాలను ఆగ్రహం నిండిన స్వరంతో చెప్పటం మొదలుపెట్టింది. 'ఒకళ్ళు నిన్ను వెనుక నుంచి తంతూ మరోవైపు డబ్బులు అడుగుతూ వుంటారు. ఈ ఫోటో అచ్చయినప్పుడు ఒక పోలీసాయన లాఠీకర్ర పట్టుకుని వచ్చాడు. ఈ వ్యాసం అచ్చయినందుకు తన పైఅధికారులు చాలా ఇబ్బంది పడ్డారని, వాళ్ళకు వివరించి చెప్పడం కష్టమయిందని అతను కోపంతో చెప్పాడు. మా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా అయిపోయింది. అతను మా దగ్గర నుంచి డబ్బులు గుంజి వెళ్ళిపోయాడు. వెళ్ళబోయే ముందు లాఠీకర్రను మామీద ఝుళిపిస్తూ, మేం చట్ట విరుద్ధమైన పని చేస్తున్నాం కాబట్టి మాకు శిక్ష పడుతుందని బెదిరించి మరీ వెళ్ళాడు. ఇదీ ప్రపంచం వ్యవహరించే తీరు.... మీ చట్టాలు అమలవుతున్న తీరు' అంటూ తిరస్కార ధోరణితో నోట్లోవున్న కిళ్ళీని ఖాండ్రించి వుమ్మేసింది కుసుమి.

ఆ ప్రాంతంలో వున్న ఇంకొకామె కూడా కాస్త అటూఇటుగా ఇవే విషయాల్ని చెప్పింది. మాయాదేవి, నాన్‌కోదేవి, మున్నాదేవి, గుడియాదేవి, జీవా, వినోద్‌రామ్, మన్‌దేవి, గుంజాదేవి, రింకీదేవి, సుమిత్రాదేవి, అనితాదేవి, శోభాదేవి, మీనాదేవి, గిరిజాదేవి – ఈ తోలాలో వున్న ఎవ్వరూ కూడా రుణాలు తీసుకోవటానికి సిద్ధంగా లేరు. దేశంలోని ఇతర ప్రాంతాలలో మాదిరిగానే బీహార్‌లో కూడా పాకీ పనిచేసే వారి పునరావాసం కోసం పథకాలు వున్నాయి. వాటి నుంచే వీరికి రుణసౌకర్యం కల్పిస్తారు. ఆ డబ్బుని ఉపయోగించి ప్రత్యామ్నాయ వృత్తుల వైపు వెళ్ళాలనేది ఈ పథకాల ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వ పథకంలో తమకు ఉపయోగపడేది ఏమి లేదని వీరి ఉద్దేశం. దేశవ్యాపితంగా ఈ చట్ట విరుద్ధమైన పని చేస్తున్న ప్రజలలో దగ్గర దగ్గర 96–98 శాతం మంది స్త్రీలే. ఇదే పరిస్థితి బీహార్‌లోనూ వుంది. సాధారణంగా మగవారందరూ దాదాపు తాగుబోతులై వుంటారు. అంతే కాకుండా వీరందరూ కూడా మురుగు కాల్వలు, మురుగు ట్యాంకులను మాత్రమే శుభ్రం చేస్తారు. ఇలాంటి పరిస్థితిలో కుటుంబ భారమంతా స్త్రీల భుజస్కంధాల మీదే పడుతుంది. రుణాలు తీసుకోవటమంటే వీరందరికీ భయం. మరీ ముఖ్యంగా పెద్ద మొత్తాలలో. భయానికి కారణమేమిటంటే వచ్చిన ఆ డబ్బంతా మగవాళ్ళు పూర్తిగా తాగుడికి ఖర్చు పెట్టేస్తారని. కానీ, ఆ రుణం తీర్చే బాధ్యత మాత్రం ఆడవారిపైనే పడుతుంది.

'నిజానికి తోటి మనుషుల పియ్యిపెంటను నెత్తి మీద మోయాలంటే అది పూర్తి స్పృహతో చేయగలిగే పని కాదు. బాగా మత్తెక్కి వుంటేనే ఎవరైనా చేయగలుగుతారు. నేను నా కిళ్ళీలో ఎప్పుడూ పొగాకు పెట్టుకుని నములుతూనే వుంటాను. నా భర్త ఎప్పుడూ సారామత్తులోనే వుంటాడు' అని కుసుమి చెప్పుకొచ్చింది.

కుసుమి ఇంట్లోవున్న ఇద్దరు మగవాళ్ళు ఈ పాకీపనే (టీనా పని) చేస్తుంటారు. అయితే అందరి ఇళ్లలోనూ ఇలాగే వుంటుందని చెప్పడానికి లేదు. కొన్ని ఇళ్ళల్లో పియ్యిపెంటను పారవేయటం అనేది కేవలం స్త్రీలే చేస్తే, మరికొన్ని ఇళ్ళల్లో పిల్లలు, మగవాళ్ళు కూడా ఈ పని చేస్తుంటారు. సాంఘి మసీదు ప్రాంతంలో పాకీ పనిచేస్తున్న పద్నాలుగు లేదా పదిహేనేళ్ళ షివ్‌పూజన్ వానాకాలంలో పెంటను మోయటం చాలా కష్టమని పదేపదే చెప్పాడు. ఎవరికైనా సరే కడుపులో తిప్పేసి వాంతయిపోతుంది. షివ్‌పూజన్ మాట్లాడుతున్నప్పుడు అతని ముఖం చాలా బాధతో ముడుచుకుపోయింది. కాలం గడిచేకొద్దీ ఈ బాధ మరింత ఎక్కువవుతూనే వుంటుంది. షివ్‌పూజన్ తన చేతులను ముందుకు చాచి వేళ్ళను, గోళ్ళను చూపిస్తూ, 'ఇది చాలా అసహ్యమనిపిస్తుంది. గోళ్ళల్లో పురుగులు చేరిపోతాయి. తిండి తినటమనేది అసాధ్యం' అన్నాడు.

అరవయ్యేళ్ళ ఉమ తన కోపాన్ని బయటికి వెళ్ళగక్కింది. 'మేం చాలా అలసిపోయాం! మేమింకా ఈ 'టీనా'ను ఎత్తలేం....... కానీ మా పరిస్థితేం మారదు. మేం చాలా మందిని చూశాం. ఇలా వస్తారు. మమ్మల్ని ఫోటోలు తీస్తారు. ఆ తర్వాత వెళ్ళిపోతారు. దానివల్ల వచ్చే ప్రయోజనమేమీ లేదు. నువ్వు కూడా అలానే ఫోటో క్లిక్ మనిపించి వెళ్ళిపోతావు. అప్పుడు పోలీసాయన వచ్చి వాళ్ళ లాఠీలతో మమ్మల్ని కుళ్ళబొడుస్తాడు. మా జీతాల్ని ఖాళీచేస్తాడు. చివరికి మేమే నేరస్థులుగా వుంటాం. మేం చేసిన నేరమల్లా మేము ఈ కులంలో పుట్టడమే.'

మాట్లాడుతున్న ఉమని మధ్యలో ఆపి, గత నాలుగైదు సంవత్సరాల నుంచీ ప్రభుత్వం పాకీ పనివాళ్ళ గురించి వార్తలు గానీ, ఫోటోలు గానీ రానివ్వకుండా చాలా చర్యలు తీసుకుంటోందని గాంధీ చెప్పాడు. ఎందుకంటే ఈ రకమైన కథనాలు ప్రభుత్వంలో పైస్థాయి అధికారులకు సమస్యాత్మకంగా మారుతున్నాయి. పాకీపని వారిని ఆ వృత్తి నుంచి విముక్తి చేసి పునరావాసం కల్పించామని వాళ్ళు చెప్తున్న అబద్ధపు ప్రచారానికి తిరిగి వాళ్ళు సంజాయిషీలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. అవి బహిరంగమవుతున్నాయి. ఇదే వారిని చాలా ఇబ్బందికి గురిచేస్తోంది. భావోద్వేగంతో ఉమ చెప్పిన దానికంటే భిన్నంగా గాంధీ వివరించాడు. అతను నిశ్శబ్దంగానే వున్నాడు కానీ పరమ గంభీరంగా వున్నాడు. లోపల గదిలోకి కుసుమి విసిరేసిన నా కెమెరాను తీసుకొచ్చి నాచేతికిచ్చాడు. 'మీరు ఈ 'టీనా' ను మేము ఎలా ఎత్తుతామో, ఎలా పారేస్తామో చూడాలనుకుంటున్నారా? నాతోరండి' అన్నాడు.

అతను తయారవుతున్నాడు. కానీ కుసుమి, గణేష్‌రామ్ ఇద్దరూ అతన్ని ఆపి, 'మేం వెళతాం' అన్నారు. తన చీపురు, ఇనుపరేకు డబ్బాను తీసుకునే ముందు కుసుమి పెద్ద కిళ్ళీ ఒకదాన్ని తన నోట్లో కుక్కుకుంది. చీర కొంగుని నడుముకి చుట్టి ఆ మొహల్లా నుంచి మమ్మల్ని బయటకు తీసుకువెళ్ళింది. ఆ పక్కనే వున్న ఇరుకు సందుల్లోకి మేము చేరుకున్నాం.

చాలా ఇళ్ళల్లో ఈ పియ్యీపెంట బయటకు వచ్చేందుకు ఏర్పాట్లు వున్నాయని కుసుమి మాకు వివరించింది. మరికొన్ని ఇళ్ళల్లో లోపల వున్న ఎత్తుడుదొడ్డిలోకి వెనుక తలుపు ద్వారా వెళ్ళి అక్కడ నుంచి ఇనుపరేకు డబ్బాలోకి ఆ పియ్యిపెంటను ఎత్తి తీసుకురావాలి. ముందు చెప్పినట్లుగా ఇళ్ళ లోపలికి వెళ్ళకుండానే వేరేమార్గంలో పియ్యిపెంటను ఎత్తే ఇళ్ళకే మమ్మల్ని తీసుకెళ్ళింది కుసుమి.

అలాంటి ఇళ్ళల్లో ఆ స్థలం ఒక రేకుతో మూసి వుంటుంది. దాన్ని తీసి పియ్యిపెంటను ఎత్తాల్సి వుంటుంది.

కుసుమి ఆ రేకు తీసి, ఒక లోటాతో ఆ పియ్యిపెంటను ఎత్తి తన రేకు డబ్బాలోకి దానిని వేస్తోంది. ఆ పని చేస్తున్నంతసేపూ గణేష్‌రామ్ ఆమె పక్కనే నిలబడి వున్నాడు. ఒక ఇంట్లో కుసుమి పని పూర్తిచేసిన వెంటనే ఆమె భర్త ఆ ప్రదేశాన్ని తన చీపురుతో శుభ్రంచేసి, ఆ తర్వాత ఆ డబ్బాను ఎత్తి ఆమె నెత్తినపెట్టాడు. అక్కడికి దాదాపు ముప్పావు కిలోమీటరు దూరంలో వున్న మురికికాల్వ దగ్గరకు వెళ్ళి ఆ డబ్బాను ఖాళీ చేశారు. తిరిగి వెనక్కి వచ్చేటప్పుడు అక్కడ వున్న చేతి పంపు దగ్గర ఆ రేకు డబ్బాను, చీపురుతో పాటు తమ చేతులను కడుక్కున్నారు.

కిళ్ళీ బయటకు ఊసేసి కుసుమి ఇలా అంది, 'ఇది మాకు రోజు వుండే పనే. ఈ 'టీనా'ను ఎత్తినందుకు ఒక ఇంటి నుంచి మాకు నెలకు ఇరవై రూపాయలు వస్తాయి. వీటితోనే మా ఇల్లు గడవాలి. ప్రత్యామ్నాయ ఏర్పాటు ఏదీ మాకోసం లేకుండా మేం ఈ పనిని వదిలిపెట్టలేము.

మాకు ప్రభుత్వం శాశ్వతమైన ఏర్పాట్లు చేయాలని మీరు రాయండి. అంతేగానీ ఇంతకు ముందు జరిగిన తమాషాలాగా కాదు. ఈ విషయాన్ని గట్టిగా సూటి వాక్యాలతో రాయండి.' అని చెప్తూ కుసుమి, గణేష్‌రామ్, గాంధీ ముగ్గురూ కూడా సాంఘీ మసీదు వరకు నాకు తోడుగా వచ్చారు. నా చేతిలో ఒక కిళ్ళీ పెట్టి 'ఇది పొగాకు లేని కిళ్ళీ' అని చెప్పారు. నా కోసం ఒక ఆటోరిక్షాను పిలిచి, నేను దానిలో కూర్చున్న తర్వాత గాంధీ తన అడ్రసు నా చేతికిచ్చి 'మీరు రాసింది ప్రచురించిన తర్వాత మాకు తప్పకుండా పంపించండి. మేమంతా ఎదురు చూస్తుంటాం. మీరు మా ఫోటోలు అన్నిటికంటే పైనే వేయండి, భయపడేవాళ్ళు ఎవ్వరూ లేరు ఇక్కడ' అన్నాడు.

ఈ చట్టవిరుద్ధమైన పని గురించి సర్వేలు జరిగినా జరగకపోయినా గానీ పాట్నాలోని కొన్ని ప్రాంతాల్లో పాకీపని వాళ్ళు వున్నారని నేను తెలుసుకున్నాను. నిదాన్ స్వచ్ఛంద సంస్థ నుంచి రంజన్, దళిత్‌వాచ్ నుంచి గజేంద్ర మహ్‌జి నాకు ఈ సమాచారం అందించారు. 2002లో పాకీ పనివారల గురించి చివరి సర్వే జరిగిందని చెప్పారు. అప్పటి నుంచి ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఈ సర్వేకోసం పనిచేసిన రంజన్ పాట్నాలోని తన ఆఫీసులో దీనికి సంబంధించిన లావుపాటి ఫైళ్లను, ఫోటోగ్రాఫులను,

ఇతర సర్వే డాక్యుమెంట్లను నాకు చూపించాడు. 'ఎన్నో సంవత్సరాలు తీవ్రమైన ప్రయత్నం చేసినప్పటికీ ఫలితమేమి లేదు. ఇప్పుడు వెళ్ళి వాళ్ళను కలవాలంటే నాకు చాలా సిగ్గుగా అనిపిస్తోంది. ఆ మొహల్లాలకు మేము వెళ్ళినపుడు, ప్రతి ఒక్కళ్ళూ మా చుట్టూ చేరి "ఏం జరిగింది? ఎవ్వరూ ఎందుకు రావటం లేదు?" అని అడిగారు. ఈ సర్వే ప్రభుత్వాన్ని ఏ మాత్రం కదిలించలేకపోయింది. మేం సర్వే చేస్తున్నపుడు తాము ఈ మురికి పని నుంచి విముక్తమవుతామని వీళ్ళు నిజంగా నమ్మారు.

సర్వే క్రమంలో మొత్తం అందరూ మాకు సహాయపడ్డారు. వాళ్ళని మేమే మరింత సమస్యల్లోకి నెట్టేశామని, తప్పంతా మాదేనని ఇప్పుడనిపిస్తోంది అని అతను నిరుత్సాహంగా అన్నాడు.

అనేక అంశాల్లో పాట్నా నగరం ఎంతో పురోగమించింది. ఈ విషయంలో చూస్తే పాకీపని కూడా చాలా ఆధునికమైయింది. ఈ అమానవీయమైన పని ఇప్పుడు ప్రచ్ఛన్నంగా కొనసాగుతూ, వాస్తవానికి ఇంతకు ముందుకంటే ఎక్కువగా దోపిడీకి గురవుతోంది. దీని మీద ఒక పదునైన దృష్టికోణం లేకపోతే, ఏఏ ప్రాంతాల్లో ఈ పాకీపని ఇంకా కొనసాగుతుందో గుర్తించటం ఎంతో కష్టం. కాకపోతే ఈ పని చీకట్లో రాత్రిపూట సాగుతోంది. నేను అతికష్టం మీద ఈ దృశ్యాన్ని రాజేంద్రనగర్‌కి దగ్గరలో వున్న పత్తర్‌కి మసీద్, డా.అంబేద్కర్‌నగర్ కాలనీలో చూడగలిగాను. ఇక్కడి ఇళ్ళల్లో ఫ్లష్ టాయిలెట్లు వున్నాయి. అయితే ఇవేవీ కూడా మురుగు నీటి వ్యవస్థతో అనుసంధానమై లేవు. అసలు నగరంలోని అనేక పాంతాలలో అసలు ఈ మురుగు నీటికాల్వలు నిర్మించనే లేదు. వీటికి బదులుగా ట్యాంకులను నిర్మించారు. మోసపోకండి. ఇవి సెప్టిక్ ట్యాంకులు కాదు. (సెప్టిక్ టాంకులను చేతులతో శుభ్రం చేయాల్సిన అవసరం లేదు. అందులోకి చేరే విసర్జితాలు భూమి లోపలికి సహజంగా ఇంకిపోతాయి. ఇదంతా జరగటానికి చాలా సమయం పడుతుంది. కానీ, దీనిలోకి మనుషులెవరూ దిగి శుభ్రం చేయాల్సిన అవసరమైతే వుండదు). చేతులతో ఈ పని చేయటానికి పాకీ పనివాళ్ళని నియమిస్తారు. ఈ పని పూర్తి చేయటానికి పట్టే సమయం దాని వైశాల్యంతో పాటు, ఎంతమంది దానిని వాడుతున్నారు అనే దాని మీద ఆధారపడి వుంటుంది. సాధారణంగా ఒక ట్యాంకును శుభ్రం చేయటానికి నాలుగురు లేక ఐదుగురు అవసరమవుతారు. ఒక ట్యాంకు శుభ్రం చేసినందుకు రూ॥ 500 నుంచి 800 రూపాయల వరకు వీళ్ళకు లభిస్తాయి. ఆ మొత్తాన్ని వాళ్ళు పంచుకోవాలి. అంటే ఒక్కొక్కరికీ రూ. 100 లేదా రూ. 150 ల వరకూ వస్తాయి. మగవాళ్ళు కూడా ఈ పని చేస్తారు.

రాజకుమారి, ఇంకా చాలా మంది స్త్రీల అభిప్రాయం ప్రకారం ఈ ట్యాంకులను శుభ్రపరచటం అనేది ప్రమాదకరమైన ఎంతో క్లిష్టమైన పని. వీరిలో చాలా మంది ఇప్పుడు నిటారుగా నిలబడను కూడా నిలబడలేకపోతున్నారు. షివాన్ వాస్తవ్యురాలు, నలుగురు

పిల్లల తల్లయిన రాజకుమారి గత 15 సంవత్సరాలుగా ఈ పని చేయటంవల్ల తన ఆరోగ్యాన్నే బలిపెట్టుకుంది. ఆమె తల ఆగకుండా ఊగుతూనే ఉంటుంది. తాను కళ్ళు పైకెత్తి చూడలేకపోతున్నానని కూడా ఆమె ఫిర్యాదుచేసింది. ఆమె మెడ కొద్దిగా వంకరతిరిగిపోయింది. తన పరిస్థితి గురించి మాట్లాడుతూ రాజకుమారి తమ ప్రాంతంలోని మసీదు దగ్గరవున్న ట్యాంకును శుభ్రం చేసినప్పుడు ఏం జరిగిందో చెప్పింది. 'ప్రతిసారీ ఆ పియ్యిపెంటను పారేయటానికి చాలా దూరం వెళ్ళాల్సి వచ్చేది. అది నా ఆరోగ్యాన్ని మరింత పాడుచేసింది.' ఇతరులతో కలిసి ఆ రాత్రంతా బకెట్ నిండావున్న పియ్యిపెంటను, ట్యాంక్ దగ్గర నుండి తీసుకెళ్ళి దాదాపు మూడు కిలోమీటర్లు నడిచి అక్కడవున్న మురికి కాల్వలోకి వేసి మళ్ళీ వెనక్కి రావల్సి వచ్చేది. ఈ పని కేవలం రాత్రిపూటే చేయాలి. ఎందుకంటే ఉదయం పూట చేస్తే ఆ వాసన భరించలేక పక్క ప్రాంతాల్లో వున్న వారందరూ ఫిర్యాదు చేసే అవకాశం వుంటుంది.

రాజకుమారి పరిస్థితే బాలేదనుకుంటే, షీలా మరింత దారుణమైన పరిస్థితిలో వుంది. ఆర్థికంగా అస్సలు బాలేనప్పటికీ నాలుగునెలల గర్భిణి కావడంతో, ఆమె తాను చేస్తున్న టీనా పనిలో డబ్బులు తగ్గించుకోవాల్సి వచ్చింది. వాస్తవానికి ఆమె తన ఇంటిని ఆ కొద్ది మొత్తంతో నెట్టుకురాలేక ఆమె పనినే పూర్తిగా మానుకోవాల్సివచ్చింది. తల మీదకి చీర కొంగును లాక్కుంటూ దిగులు గొంతుతో షీలా ఇలా అంది. 'నా భర్తకు కూడా పనేమీ లేదు. పరిస్థితులు పూర్తిగా బాలేకపోవటంతో నేను ఈ టీనా పని కోసం వెళ్ళి దానిని ఎత్తాల్సి వచ్చింది.' కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా షీలా మళ్ళీ ఇలా అంది. 'ఈ మురికి పెంట పనిని ఎవరు మాత్రం చేయాలనుకుంటారు? కానీ పొట్టకూటి కోసమే ఎవరైనా ఏ పనైనా చేయాల్సి వస్తుంది. నేను వయసులోనే వున్నాను కాబట్టి ఈ పని చేస్తున్నాను.

ఇప్పుడు నాకు నాలుగోనెల గర్భం. ఈ పని చేస్తున్నపుడు దారుణమైన వికారం కలుగుతుంది. మరోవైపు ఏదైనా ప్రమాదం జరుగుతుందనే భయం లోపల వుంటుంది. కానీ ఏం చేయగలుగుతాం? నాకు ఇంకోపని దొరకదు. నేను పాకీ కులంలో పుట్టాను, నేను అలానే చావాలని నాకు రాసిపెట్టి వుంది. ఇప్పుడు పుట్టే బిడ్డ కూడా దీనిలోనే పుడుతుంది.....ఓరి దేవుడో' అంటూ చీరకొంగుతో మొహం కప్పుకుని షీలా కింద కూలబడి ఏడుస్తూ ఉండిపోయింది.

పక్కనే నిలబడివున్న అనిత, రాధాదేవి ఆమెను ఓదారుస్తున్నారు. 'చెల్లీ మేం కూడా పిల్లలను ఇలానే కన్నాం, పెంచుతున్నాం కూడా. నువ్వు కూడా అలానే చేయగలుగుతావులే' అని వారిద్దరూ సముదాయించారు. ఆ తర్వాత అనిత నాతో ఇలా అంది. 'తను ఎందుకిలా భయపడుతోందంటే, ఆమెకు మొదటి బిడ్డ సమయంలో గర్భస్రావం అయింది. దానితో ఈ బిడ్డ విషయంలో ఏ ప్రమాదమూ జరగకూడదని కోరుకుంటోంది. దానితో పాటు రక్తం కూడా సరిగా లేదు...'

అనిత ఏడవ తరగతి వరకూ చదువుకుంది. నలుగురు పిల్లలు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా పాకీపని చేస్తోంది. తన పిల్లలెవరూ ఈ పని చేయటానికి ఆమె ఒప్పుకో లేదు. అలానే ఇదేపని చేస్తున్న కుటుంబాల వాళ్ళతో తన కూతుర్ల పెళ్ళి చేయటానికి కూడా సిద్ధంగాలేదు.

దళిత సంఘాలు, దళిత ఆలోచనలు, ప్రచారాల్లో పాకీపని వాళ్ళ బాధలు, ఫిర్యాదులు భాగం కాలేకపోయాయి. కనీసం బీహార్‌లోని పాట్నా నగరంలో సగం ప్రాంతానికి మురుగునీటి వ్యవస్థలేదని గజేంద్ర మహ్‌జీ అన్నాడు. ఫ్లష్ టాయిలెట్లు కూడా ఈ ట్యాంకులకు అనుసంధానించి వుంటాయి. వాటిని పూర్తిగా చేతులతోనే శుభ్రం చేయాలి. కొంత మంది సెప్టిక్ ట్యాంకులను కట్టించుకున్నారు. కానీ అలా ఆలోచించగలిగిన వారి సంఖ్య చాలా తక్కువ.

ఈ విషయమై రాజకీయ పార్టీల వైఖరి చెప్పుకోదగింది. పరిస్థితి ఎంత దారుణంగా వుందంటే, బీహార్ విధానసభ చైర్మన్ జబీర్ హుస్సేన్‌కు పాకీపని వారికి సంబంధించి జరిగిన ఈ సర్వే రిపోర్టును ఇచ్చే వరకూ కూడా రాష్ట్రంలో ఇంత మంది పాకీపనివాళ్ళు ఈనాటికీ ఇలాంటి పనిచేస్తున్నారన్న విషయమే తెలియదు. 2002లో జబీర్ హుస్సేన్ జోక్యంతోనే దాదాపు 22,000 కుటుంబాలు ఈ పాకీ పనిలో వున్నారని లెక్కలు తేల్చారు. ఈ సర్వే ఆధారంగానే ఆయా కుటుంబాలకు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేశారు. వారందరి ఫోటోలు తీసుకున్నారు. అయితే తర్వాత ప్రభుత్వం ఈ విషయాలన్నిటినీ మర్చిపోయింది.


ఎవ్వరూ ఏమీ చేయలేదు. ఎందుకంటే ఎవరికీ ఏమీ చేయాలనిపించదు కాబట్టి. ఈ అమానవీయమైన పనిని శాశ్వతంగా నిర్మూలించాలని ఎవరిమీదా ఏ రాజకీయ ఒత్తిడీ లేదు. అందుకే అప్పటి నితీష్ ప్రభుత్వంలోని పట్టణాభివృద్ధి మంత్రి అశ్విన్‌కుమార్ చౌబే కూడా వివిధ రకాల కుంటిసాకులను చెప్పుకుంటూ వచ్చారు. 2007 నాటికల్లా ఈ పనిని శాశ్వతంగా నిర్మూలించాలనుకుంటున్నామని, దానికోసం సర్వేలు కూడా నిర్వహించామని ఆయన నాతో స్వయంగా చెప్పిన సంగతి. ఈ విషయం గురించి నేను ఆయన్ని అడిగి నప్పుడు సర్వేల్లో వచ్చిన ఫలితాల వల్ల తనకు పూర్తి సంతృప్తిలేదని, అందుకని తిరిగి సర్వే నిర్వహించటానికి టెండర్లను పిలుస్తున్నామని ఏవేవో కారణాలు చెప్పాడు. ఆ తర్వాత ఒకింత గర్వంతో ఎవరైనా నెత్తిమీద ఈ పియ్యిపెంటను మోస్తూ కనిపించి నట్లయితే ఆ ప్రాంత జిల్లా అధికారికి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌కి నోటీసులు జారీచేసి శిక్షిస్తామని ఉత్తర్వులిచ్చినట్టు చెప్పాడు. ఈ ఉత్తర్వుల ఉద్దేశం కేవలం పాకీపని ఎవరికంటా పడకుండా వుండటం, దాని గురించి ఎక్కడా నమోదు కాకుండా వుండటమే అనిపించింది. అన్నింటికన్న ముఖ్యాంశం ఏమిటంటే అధికార యంత్రాంగం వీరిని అస్సలు పైకి కనిపించకుండా చెయ్యాలని అనుకుంటోంది. ఈ పని చేసేవారికి ఉద్యోగాలు లేదా రుణాల ప్రసక్తి వచ్చేటప్పటికి మంత్రిగారు 'ఇక్కడ చాలా ఉద్యోగాలేం లేవు. రుణాలే ఎక్కువ ఉపశమనాన్ని ఇస్తాయని' స్పష్టంగా చెప్పేశారు.

ఒక విషయమైతే స్పష్టం. మంత్రి గారి లాంటి మనుషులు దీని తీవ్రతను అర్థం చేసుకోవటానికి, అంగీకరించటానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. మరోమాటలో చెప్పాలంటే ఇలా పియ్యిపెంటను మోసే మనుషులు ఎవరికంటా పడకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక సమస్య. ఉద్యోగాలనివ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. రుణాలను తీర్చగల ధైర్యం ఈ జనానికి లేదు. అందుకే చట్ట విరుద్ధమైనప్పటికీ, పాకీపని చేస్తున్నందుకు ఒక ఇంటి నుంచి నెలకు ఇరవై రూపాయలే వస్తున్నప్పటికీ, ఆ కొంచెం మొత్తమే వారికి కనీసం అర్థాకలిని అయినా తీర్చగలుగుతోంది.

ఈలోపల, ఆ మురికి పని కొనసాగుతూనే వుంది– కిళ్ళీ వేసుకున్న తర్వాతే కుసుమి ఈ పనిచేస్తుంది; ఆమె భర్త గణేష్ రామ్ పూర్తిగా తాగిన తర్వాతే పనిచేయ గలుగుతాడు; మెడ నరాలు పట్టుతప్పిపోయినా గానీ రాజకుమారి చేస్తూనే వుంటుంది; ఇంకా పుట్టని తన బిడ్డకోసం షీలా బాధపడుతూనే వుంటుంది. మీరు, నేను, ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎవ్వరు కూడా ఈ పనిని చూడాలనుకోవటం లేదు. ఎన్నో సంవత్సరాలుగా నాగరీక సమాజం తన కళ్ళు మూసేసుకుంది. చేతి రుమాలుని ముక్కుకి అడ్డంగా పెట్టుకుని కనిపించని ఈ భారతదేశాన్ని కుళ్ళికంపు కొడుతున్న పియ్యిపెంటను దాటుకుంటూ వెళ్ళిపోతూ వుంటుంది.

(2006లో పాట్నా నగరాన్ని, బీహార్ షరీఫ్ ప్రాంతాల్ని సందర్శించిన వెంటనే రాసిన వ్యాసం ఇది.)

# పశ్చిమ బెంగాల్




## 'ఎక్కువ డబ్బులిస్తే మీరు ఈ పని చేస్తారా?'

నేను ఎన్నిసార్లు చెప్పినప్పటికీ దేబషిష్ నాతో కార్లో కూర్చోవడానికి ఇష్టపడలేదు. 'నేను నా సైకిల్ మీదే వస్తాను, అని చాలా మామూలుగా చెప్పాడు.

భాట్‌పరలో ముందే అనుకున్న ప్రదేశంలో మేము దేబషిష్‌ని కలిశాం. భాట్‌పర సబ్ డివిజన్‌లోని 24 పరగణాల జిల్లాలో ఎత్తుడు దొడ్ల(డ్రై టాయిలెట్ల)ను ఖాటా–పైఖానా అని పిలుస్తారు. వీటిలో పనిచేసే ఆడవాళ్ళను కలవటానికి మేము కోల్‌కతా నుండి ప్రయాణం చేసి వచ్చాం. దేబషిష్ మాముందు సైకిల్ తొక్కుతూ వెళుతూనే వున్నాడు. 'దేబషిష్ సైకిల్ విడిచి వుండగా ఎప్పుడూ చూడలేదు. జూట్‌మిల్‌కి వెళ్ళినా, స్కూళ్ళకు పిల్లల్ని తీసుకెళ్తున్నా లేదా ఇంకెక్కడికి వెళ్ళినా గానీ అతనెప్పుడూ దానిమీదే వుంటాడు' అని అతని స్నేహితుడన్నాడు. తెల్లవారుఝాము 5.30 గంటలయింది. ఆ పట్టణం

ఇంకా నిద్రపోతోంది. కానీ వీళ్ళు మాత్రం మేలుకుని వున్నారు. మేము కలుసుకోవాలనుకున్న ప్రదేశానికి వచ్చాక దేబషిష్ తన సైకిల్‌ని అక్కడ వుంచాడు. అక్కడ్నుంచి మేమందరం కాలినడకన ఒక సందులోకి వెళ్ళాం.

భాట్‌పరలోని 6, 7 వార్డులు అవి. రోడ్డు పక్కన ఒకామె బొగ్గుల కుంపటి మీద పూరీలు వేయిస్తోంది. దాని పక్కనే టీ కూడా మరుగుతోంది. అక్కడ అనేక సందుల్లో రోడ్ల పక్కన అలాంటి పలు టీ స్టాళ్లను చూశాను. ఈ స్టాల్ చుట్టూ ఎంతో వుత్సాహంగా వున్న ఒక స్త్రీల గుంపు వుంది. వాళ్ళందరూ బిగ్గరగా నవ్వుతున్నారు. తమ సంతోషాలను, బాధలను వేడివేడి పూరీలు తింటూ, టీ తాగుతూ పంచుకుంటున్నారు. హోటల్ నుంచి ఉదయమే ఏమీ తినకుండానే బయలుదేరటంతో నాకు కూడా ఏమన్నా తినాలనిపించింది. అయితే అప్పటికే దేబషిష్ టీ తీసుకుని వచ్చాడు. కానీ నాకు పూరీలు కావాలని అడగాలంటే మొహమాటంగా వుంది. టీ తయారు చేసే ఆమె హఠాత్తుగా 'ఇదే సమయం' అంది. వెంటనే ఒక్కసారిగా ప్రతి ఒక్కరూ లేచి నిలబడ్డారు.

మేము అడిగినప్పుడు 'అవును మేమందరమూ పివి పనిచేస్తాము' అన్నారు. పివి అంటే ఏమిటని నేను అడిగితే వెంటనే 'దానర్థం ఖాటా-పైఖానా, ఇంకేముంటుంది? ఈ పని భాట్‌పర మొత్తం జరుగుతూనే వుంది. అధికారులేమో ఈ పాకీదొడ్లు మూసేశామని చెప్తున్నారు గానీ, అలా మూసేసినవి కేవలం కొన్ని మాత్రమే.' అని చెప్పారు. ఈ బృందంలో ముప్పై నుంచి అరవైల వయసున్న స్త్రీలున్నారు.

వాళ్ళు నన్ను తమతో తీసుకెళ్ళటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. కానీ నేను తీసుకెళ్ళమని చాలా బతిమిలాడాను. చివరికి వాళ్ళు ఒప్పుకున్నారు. కానీ అక్కడ చూసేందుకేమీ వుండదని నాకు ముందు నుంచే సూచిస్తువచ్చారు. 'మీరు రావాలనుకుంటే రండి. కానీ ఈరోజు ఇక తిండి తినటం, పడుకోవటం కష్టమైన పనవుతుంది మీకు. కనీసం మీరు ఇప్పుడు పూరీలు కూడా తినలేదు. రోజంతా మాతోపాటు ఏమీ తినకుండానే వుండాల్సివస్తుంది. అనేక సంవత్సరాలుగా ఇలానే నడుస్తోంది. కానీ మేము 'దబ్బు'ని ఎత్తేముందే మా కడుపులు నింపేసుకుంటాం. 'పివి' అయిన తర్వాత తినటం అంటే మాకు సాధ్యంకాదు' అని లక్ష్మనీయ హోరి చెప్పింది.

వెళ్ళేదారిలో ఒక ప్రాంతం నుంచి వాళ్ళ బక్కెట్లను, 'హథాదబ్బు'లను తీసుకున్నారు. బక్కెట్లు మున్సిపాలిటీ వాళ్ళు ఇచ్చారని, 'హథాదబ్బు'లను మాత్రం మార్కెట్లో తామే కొనుక్కోవాలని ఆ ఆడవాళ్ళందరూ నాకు, దేబషిష్‌కు చెప్పారు. 'హథాదబ్బు'ల మీద నా దృష్టి నిలిచిపోయింది. పెద్దకాడ వున్న గరిటలాగా వుంది అది. మనుషుల పియ్యిపెంటను ఎత్తిపోయటానికి ప్రత్యేకంగా ఒక పరికరం తయారయి, మార్కెట్లో అమ్మకానికి కూడా వుంటుందని దీన్ని చూసేవరకు నాకస్సలు తెలియనే తెలియదు. ఇంతకుముందు నేను వెళ్ళిన ఏ ప్రదేశంలోనూ ఇలాంటి పరికరాన్ని చూడలేదు. దానితో ఈ ఆడవాళ్ళు ఎలా

పనిచేస్తారో తలుచుకుంటేనే నా గుండె పగిలిపోయింది. సాధారణమైన విషయంలాగ వారి పరికరాలను తీసుకుని, ఆడవాళ్ళందరూ పాకీదొడ్ల వైపు నడవసాగారు. తాము చేయబోతున్న భయంకరమైన పనిని మరపుకుతెచ్చుకుందామన్నట్లు అంతసేపూ ఏదో ఒకటి మాట్లాడుతూనే వున్నారు. తను పదహారు సంవత్సరాల వయసు నుంచీ ఈ పని చేస్తూనే వున్నానని, అప్పుడు రోజుకు ఐదు రూపాయిలు వచ్చేవని లక్ష్మనీయ హారి ఆ తర్వాత మాకు చెప్పింది. ఇప్పుడు ఆమెకు దగ్గర దగ్గర యాభై ఏళ్ళు. ఇరవై సంవత్సరాల క్రితం ఆమె పనిని శాశ్వత ప్రాతిపదికన మార్చారు. అంటే ఆమె మున్సిపాలిటీ శాశ్వత ఉద్యోగిని. పెళ్ళయిన తర్వాత తన అత్త స్థానంలో ఆమె ఈ పని చేపట్టింది. అప్పటి నుంచీ చేస్తూనే వుంది. రోజూ ఉదయాన్నే ఆరు గంటల నుంచి 10.30 వరకూ ఈ ఖాటా–పైఖానా పని చేస్తోంది. ఆమె కొడుకుల్లో ఒకతను కూడా మున్సిపాలిటీలోనే పనిచేస్తాడు. ఇతరులు పియ్యిపెంటను తీసుకెళ్ళటానికి వచ్చే ట్రాక్టరు దగ్గర పనిచేస్తుండగా, ఇతను చెత్తను ఒకచోటికి జమచేస్తాడు. ఆమె పక్కనే నడుస్తున్న శకుంతలకు కూడా దాదాపు యాభై ఏళ్ళ వయసుంటుంది. తన భర్త చనిపోయిన తర్వాత ఈ పని ప్రారంభించానని ఆమె చెప్పింది. అంతకు ముందు ఆమె కేవలం ఊడ్చేపని మాత్రమే చేసేది. ఇంతలో ఖాటా–పైఖానా రావటంతో మా సంభాషణ ఆగిపోయింది. తాము పనిచేసేచోట వచ్చే దారుణమైన దుర్గంధాన్ని తట్టుకోవడం కోసం ప్రతి ఒక్కరూ తమ నోళ్ళల్లో జరదా కిళ్ళీలను పెట్టుకున్నారు.

ఇవన్నీ ఎత్తుడుదొడ్లు, కొంచెం భిన్నంగా కట్టివున్నాయి. చాలా కుటుంబాలు వీటిని సామూహికంగా ఉపయోగిస్తారు. ఇళ్ళ వెనుక వుండే ఈ పాకీదొడ్డి కిందుగా ఒక దారి వుంది. ప్రతి పాకీదొడ్డిలో కొంచెం లోతుగా వుండే గంప వంటిది నేల మీద వుంచుతారు. పైనుంచీ పియ్యిపెంట అంతా దీనిలోకి పడుతూ వుంటుంది. ఆడవాళ్ళు అట్లాంటి ఒక గంప దగ్గరకి వెళ్ళారు. అది అంచుల వరకు పూర్తిగా నిండిపోయి, చుట్టుపక్కల కూడా అసహ్యంగా, మురికిగా రోతగా తయారయి వుంది. ఆడవాళ్ళందరూ తమ దగ్గర వున్న హాథాదబ్బులతో ఆ గంపలను శుభ్రం చేయటం మొదలుపెట్టారు. అందరూ చీరలు పైకి ఎగదోపి కొంగుని ముక్కు చుట్టూ కప్పుకుని పనిచేస్తున్నారు. ఒక చేత్తో హాథాదబ్బుతో ఆ పెంటనంతా తోడి మరో చేతిలో వున్న బక్కెట్‌లోకి వేస్తున్నారు. తర్వాత ఆ బక్కెట్లను ఎత్తి నెత్తి మీద పెట్టుకుని దాదాపు ఒకటి లేదా రెండు కిలోమీటర్లు నడిచి అక్కడ ఆగి వున్న మున్సిపాలిటీ ట్యాంకర్‌లోకి వేస్తున్నారు.

నెత్తి మీద పియ్యిపెంటతో నిండి బరువుగా వున్న బక్కెట్‌ను మోయడమనేది తేలికైన విషయమేమీ కాదు.

ఈ పని చేసే క్రమంలో ఈ ఆడవాళ్ళు తప్పనిసరిగా ఎండలో చాలాసేపు నిల్చోవాల్సి రావటమనేది అదనపు భారం. ఇంకో నమ్మలేని విషయమేమంటే ట్యాంకర్ నిలిచి వుండే

స్థలం స్కూలుకి దగ్గరగా వుండటంతో, వీళ్ళు అక్కడ ఎక్కువసేపు వేచిఉండటానికి లేదు. కంపు వ్యాపించిందంటే చుట్టుపక్కల వుండే వారు ఫిర్యాదులు చేస్తారు. అయితే అప్పటికీ ఇంకా ట్యాంకర్ వచ్చిన ఊసైతే లేదు.

మున్సిపాలిటీకి నేనొస్తున్నాననే విషయం తెలిసి వుంటుందని మాలా మెహత్రానీ (ప్రభుత్వ గుర్తింపు కార్డులో ఈమె పేరు ఇలా నమోదై వుంది) అంది. 'అందుకే వాళ్ళు ట్యాంకర్‌ను పంపించలేదని' కూడా ఆమె అంది. ఇక చేయగలిగిందల్లా ట్యాంకర్ రాని రోజుల్లో ఈ పెంటంతా వేయటానికి కొద్ది దూరంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన మురికి కాల్వ దగ్గరకు ఈ బక్కెట్లను మోసుకుంటూ వెళ్ళి అక్కడ వేసిరావటమే. దానితో మళ్ళీ బక్కెట్లను నెత్తిమీద కెక్కించుకుని ఇంకో అరకిలో మీటరు నడిచి తమ బక్కెట్లతో తెచ్చిన ఆ కుళ్ళి మురిగిపోయిన పియ్యిపెంటనంతా ఆ మురికి కాల్వలో పారబోశారు.

ఆ మురికి కాల్వ దగ్గర వున్న పరిస్థితి వర్ణించటానికి వీల్లేనంత దుర్భరంగా వుంది. ఆ చుట్టుపక్కల ప్రదేశమంతా పియ్యిపెంటతో నిండిపోయి వుంది. ఓహ్! కడుపులో వికారం తిప్పేస్తోంది. ఆ పియ్యిపెంటనంతా దాటుకుంటూ వెళ్ళి కాల్వమీద వేసివున్న ఇనుపరేకులపై నుంచి ఆడవాళ్లందరూ తమ బక్కెట్లను ఒంపారు. ద్రవంగా వున్నదంతా ఆ ఇనపజాలీ లోనుంచి కిందకి జారిపోయింది. మిగతా పెంటంతా దాని మీదే వుండిపోయింది. నేను ఒక ఫోటో కోసం కెమెరాని క్లిక్‌మనిపించాలని చూస్తుండగానే, నా కాలు ఒక చిన్న రాయి మీద పడి తొట్రుపాటుతో దాదాపు పియ్యిపెంటతో, దుర్గంధంతో వున్న ఆ కాల్వలోకి పడిపోబోయాను. అదృష్టవశాత్తూ నా వెనుకే వున్న దేబషిష్ నన్ను సమయానికి పట్టుకుని ఆపాడు. కడుపులో నుంచి తన్నుకొస్తున్న వాంతిని ఆపుకోవటం కోసం ఎంతో ఉగ్గబట్టుకో వలసి వచ్చింది. నా గొంతులో నుంచి ఎగదున్నుకురావడం తెలుస్తూనే వుంది. కానీ ప్రతిరోజు ఈ క్షోభను భరించే ఆడవాళ్ళ ముందు నా భయాన్ని ప్రదర్శించలేదు. ఏది ఏమయినా, వాళ్ళతో వస్తానని బలవంత పెట్టింది నేనే కదా.

నా ఇబ్బంది బయటకు కనిపించే వుంటుంది. ముప్పై ఐదేళ్ళ మున్నారి వాస్ఫో తన హోథాదబ్బుని బక్కెట్లో పెట్టి కొంచెం హాస్యంగానే నాతో 'నీ కెమెరాని జాగ్రత్తగా చూసుకో. ఒక చుక్క కూడ దాని మీద చిందకుండా చూసుకో! కింద కూర్చుని ఫోటో తీయాలని చూడకు, మరీ ముందుకు రాకు. లేకపోతే నువ్వు ఇంకెప్పటికీ పప్పు కూరలు తినలేవు. ఎప్పటికీ కూడా' అని అంది. అది వింటూనే నా కడుపులో తిప్పేసింది. వాంతి చేసుకుంటేనే బాగుండనిపించింది.

ఈ ఆడవాళ్ళందరూ ఈ పనిని అలవాటుకొద్దీ చేసేస్తున్నారు. ఒట్టిచేతులతో ఆ పియ్యిపెంట డబ్బాలను ఎత్తుకుని, తమ బట్టలు పాడవకుండా జాగ్రత్తపడుతూ తీసుకెళ్తున్నారు. ఈ దుర్మార్గమైన పనిని ఒక వెట్టిలాగా సంవత్సరాల తరబడి అలా చేయగలగటం, తరతరాలుగా ఒక శిక్షలాగా అసహ్యకరమైన ఈ పనిలో కొనసాగటం

అనేది కేవలం ఆ కులంలో పుట్టటం వల్ల మాత్రమే సంక్రమించినట్టుంది. ఈ ఆడవాళ్ళు పని చేయటం నేను గమనిస్తున్నపుడు, నా కెమెరా నిజంగానే నా చేతి నుంచి పట్టుతప్పి జారింది. నేను చటుక్కున దాన్ని పట్టుకోగలిగాను. కానీ ఆ షాక్‌తో నాకు తల పగిలి నట్లయింది. కంపు గొడుతున్న కులవ్యవస్థ మీద పిచ్చిపిచ్చిగా అరవాలని బలంగా అనిపించింది. అప్పుడు చూశాను, నా ఎదురుగా నిలబడి వున్న శకుంతల తన బక్కెట్‌ని కడుగుతూ వుండటం. తన ఇంట్లో వుండే వంటపాత్రలను ఎంత శుభ్రంగా కడుగుతుందో అంతే జాగ్రత్తగా వాటిని కూడా తోముతోంది ఆమె. ఆడవాళ్ళందరూ వచ్చేదాకా నేను రోడ్డు పక్కన నిలబడి వారితో కలిసి వెనక్కి వచ్చాను.

మేం తిరిగొచ్చేసరికి అక్కడి దృశ్యం పూర్తిగా మారిపోయింది. అప్పటికి పట్టణం పూర్తి మెలకువతో వుంది. 'దబ్బు స్త్రీలని' చూసిన వెంటనే జనమంతా పూర్తిగా పక్కకు జరిగి వారికి దారిఇస్తున్నారు; ఎవరూ కూడా తమ నీడ కూడా వారి మీద పడటానికి ఇష్టపడటం లేదు. చూడటానికి ఈ ఆడవాళ్ళకేదో ఆ రోడ్డు మీద అధికారం వున్నట్లు అనిపిస్తోంది గానీ, ఒక నిశ్శబ్దం కూడా అక్కడ వుంది. ఎవ్వరూ ఏమీ అనటం లేదు. అందరూ తమ బక్కెట్లనీ, దబ్బాలనీ నిర్ణీత ప్రదేశాల్లో వుంచి, ఇంతకు ముందు టీస్టాల్ వున్న ప్రదేశానికి వచ్చారు. కానీ ఇప్పుడక్కడ దాని జాడే లేదు. ఎక్కడో రోడ్డు పక్క దాచుకున్న తమ సబ్బులని తీసుకొచ్చి నీళ్ళ పంపు దగ్గర కాళ్ళు, చేతులూ, మొహం కడుక్కున్నారు. ఆ తర్వాత 'ఇప్పుడే నువ్వు మాట్లాడతావా. లేక నీ ధైర్యం పూర్తిగా అడుగంటిపోయిందా?' అని మెహ్రాత్రానీ అడిగింది.

దేబషిష్ మధ్యలో అడ్డుకుని, మేము కాసేపయిన తర్వాత మీ ఇళ్ళకే వస్తామని చెప్పాడు. దేబషీష్ అలా చెప్పటంతో నేను కొంచెం ఊపిరి పీల్చుకున్నాను. అక్కడ నేను చూసినది, విన్నది నాకు కలిగిన భావాలు ఏవయినా రాయటం అసాధ్యం. ఈ స్త్రీలు ఇలాంటి అమానవీయ పనిని నిర్బంధంగా చేస్తున్నారని, అది కూడా కమ్యూనిస్టు ప్రభుత్వం పరిపాలిస్తున్న రాష్ట్రంలో జరుగుతోంది అంటే ఊహకి కూడా అందే విషయం కాదు. నిజానికి, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ సామాజిక అసమానతలను, వివక్షలను అంత మొందిస్తామని చాలా గట్టిగా చెబుతుంది. మరీ ముఖ్యంగా ఒక మనిషి ఇంకో మనిషిపై చేసే పెత్తనాన్ని, దోపిడీని, అన్యాయాన్ని తుడిచి పెట్టేయాలని చెబుతుంది. 2006 నాటికి పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఇరవై తొమ్మిదేళ్ళయింది. పాకీ పనివాళ్ళ జీవితం గురించి వీళ్ళెట్లా మరిచిపోగలిగారు? ఒక్క భాట్‌పర మున్సిపాలిటీలోనే 122 మంది స్త్రీలు ఈ పాకీపని చేస్తున్నారు. వారిలో 52 మంది శాశ్వత ఉద్యోగులు కూడా. ఇక్కడ మొత్తం 487ఎత్తుడుదొడ్లు వున్నాయి. పాకీపని వున్న మిగతా రాష్ట్రాలతో పోలిస్తే పశ్చిమ బెంగాల్‌లో ఈ ఆడవాళ్ళ ఆర్థిక పరిస్థితి మరీ అంత దారుణంగా లేదు. తాత్కాలిక పనివాళ్ళకి రోజుకి 85 రూపాయలు వస్తాయి. అదే శాశ్వత ఉద్యోగులకు నెలకు రూ. 5,000/-; రూ. 6,000/- వస్తాయి. అదే ఇతర రాష్ట్రాల్లో రోజుకి రూ. 10 నుంచి

రూ. 12 వరకూ, నెలకు రూ. 500; రూ. 600 వరకే వస్తాయి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 'బాల్టీవాలీస్'కు ఒక్కో ఇంటి నుంచి కేవలం ఇరవై రూపాయలే వస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో వీరంతా తాత్కాలిక లేదా శాశ్వత ప్రాతిపదికన చేస్తున్నా గానీ ప్రభుత్వ లెక్కల ప్రకారమే వేతనం వస్తుంది.

ఆ సాయంత్రం నేను దేబషిష్ కలిసి వాళ్ళు నివశించే ప్రాంతానికి వెళ్ళాం. ఒక రావిచెట్టు కింద నవారు మంచం, నాలుగైదు కుర్చీల్లో కొంత మంది కూర్చుని వున్నారు. వారి పిల్లలు మా చుట్టూ మూగారు. ఆడవాళ్ళు ముందుగా మాకు మంచినీళ్లు, బిస్కట్లు ఇచ్చారు. బిస్కట్ పాకెట్‌ను మా ముందే చింపారు. మంచినీళ్ళు పసుపు పచ్చగా కనిపిస్తున్నాయి, కానీ వాటిని కనీసం ఒక్క గుక్కెనా తప్పనిసరిగా తాగాలని నాకు తెలుసు. అలా తాగకపోతే వారిని అవమానించినట్లే. కులాన్ని, అంటరానితనాన్ని నేను నమ్మనని, మా మధ్య అలాంటి అడ్డుగోడలు, వివక్ష లేవని నేను వారికి చెప్పాలనుకున్నాను. ఇది నన్ను వారి పద్ధతిలో పరీక్షించటం. వేరే ప్రాంతాల్లో కూడా నాకు ఈ పరీక్షలు ఎదురయ్యాయి. తమ ఉనికి గురించి వుండే నమ్మకం, ఆత్మగౌరవం ఎన్ని విధాలుగా వ్యక్తమవుతాయనేది ఇంట్లోనో లేదా ఆఫీసులోనో కూర్చుని అర్థం చేసుకోవటం అసాధ్యం.

కాలనీకి వచ్చిన వెంటనే మా సంభాషణను తిరిగి ప్రారంభించాం. ఇతర రాష్ట్రాలలో కంటే ఇక్కడి వారి పరిస్థితి కొంత మెరుగ్గా వుందని, మరీ ముఖ్యంగా ప్రభుత్వం వారికి ఇస్తున్న వేతనాలు కాస్త ఎక్కువగా ఉన్నాయని నేను వారికి చెప్పాను. దానికి ప్రతిస్పందనగా డెబ్బయ్యేళ్ళ రాధాదేవి చెప్పిన విషయం అస్సలు నా ఊహకు తట్టలేదు. 'ఐదువేలో ఆరువేలో కాదు, మేము పదివేలు ఇస్తాము. వేరే కులం నుంచి ఏ స్త్రీ అయినా వచ్చి ఈ పని చేస్తుందా? ఎక్కువ డబ్బులు వస్తే ఈ పని నువ్వు చేస్తావా? పియ్యిపెంటను ఎత్తటంలో వున్న కష్టాన్ని, బాధను కేవలం డబ్బుతో ముడిపెట్టి చూడలేం. నెత్తి మీద పియ్యిపెంట బక్కెట్లను మోసే స్త్రీకి జీవితాంతం ఆ కుళ్ళుకంపు వెంటాడుతూనే వుంటుంది. బిడ్డకు జన్మనిచ్చే సమయంలో కూడా ఆ కుళ్లుకంపు వదిలిపోదు. ఈ విషయం మీకెట్లా అర్థమవుతుంది?'

నేను తిరిగి సమాధానం ఇవ్వకపోయినప్పటికీ, ఆమె మాట్లాడినదంతా వాస్తవమని అంగీకరించాను.

మాకు చేప, గుడ్డుతో చేసిన బజ్జీలు, టీ అందించారు. నేను చేప తిననని వాళ్ళకు చెబితే చింతావాస్ఫో ఇలా అంది.'ఇది రోహు, మంచినీళ్ళ చేప. దీన్ని కేవలం మీ కోసమే తీసుకువచ్చాం. బాగా శుభ్రం చేసిన తర్వాతే దాన్ని వండాం. సబ్బుతో స్నానం చేయకుండా మేము కనీసం మా ఇళ్ళల్లోకి కూడా వెళ్ళం. మీరు ఎలా పిల్లల్ని పెంచుతారో మేం కూడా పిల్లల్ని అలానే పెంచుతాం'. ఆమె గొంతులో ఒకవిధమైన కసివల్ల మాట్లాడుతుంటే వణుకు కనిపించింది. అంతలోనే ఆమె కోడలు మీనా 'ఏం ఫర్వాలేదు, మీరు మాట్లాడుతూ వుండండి. నేను మీకోసం ఉల్లిపాయ బజ్జీలు తయారుచేస్తాను. సరేనా?' అంది.

నేను అంగీకారంగా తలవూపాను. అప్పుడు చింతా మళ్ళీ తన బాధాకరమైన కథను మొదలుపెట్టింది. నోట్లో కిళ్ళీ పెట్టుకుని 'మా అమ్మతో కలిసి నేను పనికి వెళ్ళటం మొదలుపెట్టినప్పుడు నాకు కేవలం ఎనిమిదేళ్ళు. మొదట్లో నేను ఖాళీ బక్కెట్‌ను పట్టుకుని వెళ్ళేదాన్ని. మా ఇద్దరు తమ్ముళ్ళు పుట్టిన తర్వాత మా అమ్మ ఆరోగ్యం పూర్తిగా పాడయింది. నాకప్పుడు పన్నెండు పదమూడు సంవత్సరాలు వుంటాయి. శుభ్రం చేయటానికి నాలుగైదు ఖాటా–పైఖనాలను నాకు అప్పగించారు. అప్పటి నుంచి మీనా ఈ ఇంట్లో అడుగుపెట్టేంత వరకూ ఆ పని కొనసాగింది. వానాకాలంలో పాయిఖానాలు శుభ్రం చేయడం కష్టసాధ్యంగా వుంటుంది. ఇంటికి వచ్చిన తర్వాత నోటికి తిండి ఎక్కదు. భగవంతుడికే తెలియాలి మేమెందుకు ఈ కులంలో పుట్టామనేది. మేం ఏం పాపం చేశాం?' అని ప్రశ్నించింది.

మీరెందుకు ఈ పని వదిలిపెట్టటం లేదు?

నేను ఈ ప్రశ్న అడిగిన వెంటనే చింతా కొద్దిసేపు కలవరపడింది. 'ఎందుకు? పిల్లల్ని, భర్తని ఎవరు పోషిస్తారు?... నా కుటుంబాన్ని ఎలా గట్టెక్కించగలను? మీ పెద్దకులపోళ్ళు ఈ పద్ధతిని మామీద రుద్దారు. చెప్పులు కుట్టేవాళ్ళ పిల్లలు చెప్పులు కుట్టాలని, 'దబ్బు–వాలా'ల పిల్లలు ... ఇది చెప్తూ, ఆమె ముక్కు చీదుకుంటూ గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.

మా చుట్టూ నిశ్శబ్దం ఆవరించింది. ఆమెకు మద్ధతుగా మీనా మాట్లాడుతూ 'నా కొడుకుగానీ, కూతురుగానీ ఆ బక్కెట్లను తాకటానికి కూడా ఇప్పుడు నేను ఒప్పుకోను. వాళ్ళు చదువుకుంటున్నారు' అంటూనే ఒకపక్క తన చూపు బజ్జీల ప్లేటు మీద వుంచి అందరూ వాటిని పూర్తి చేస్తున్నారో లేదో గమనిస్తోంది.

ఆ తర్వాత, చాలా మంది ఆడవాళ్ళు తమ కథలను కూడా చెప్పుకొచ్చారు. కొంత మంది పెళ్ళయినతర్వాత అత్తగారింట్లో ఈ పని చేయటం మొదలుపెడితే, మరికొంత మంది తమ తల్లిదండ్రుల ఇంట్లో ఈ పని మొదలుపెట్టి ఇక్కడా ఆ వారసత్వం కొన సాగిస్తున్నారు. ఆ కాలనీలో వున్న ఒక్కామె కూడా తన పిల్లలు ఈ పని చేయటానికి ఇష్టపడలేదు. ఇది దేశవ్యాపితంగా కనిపించిన అంశం; కానీ ఒక చేదు నిజమేమిటంటే, ఏ పోటీలేని వందశాతం రిజర్వేషన్ ఈ వృత్తిలోనే వీరి పిల్లలకు కేటాయించి వుంచటం.

నేను నా పుస్తకంలో అలా రాసుకుంటూనే వున్నాను. ఒకళ్ళ తర్వాత ఒకరు తమ బాధని పంచుకొంటున్నారు. నాకు వాళ్ళ పేర్లు చెబుతూ తమ బాధలను వల్లెవేస్తూ వున్నారు. చరిత్ర పుటల్లో తమ కష్టాలు నిక్షిప్తమై వున్నాయన్నట్లు ఒకే విధమైన గాఢతతో చెప్తూనే వున్నారు. కుళ్ళి కంపు గొడుతున్న కులవ్యవస్థ అసలు స్వరూపాన్ని, పాకీపని చరిత్రను బయటకు తీయటానికే ఈ ఆడవాళ్ళు వున్నట్లుగా నాకనిపించింది. అప్పుడే పోరాటానికి ఉపయోగపడే ఇంధనం దొరుకుతుంది. రాబోయే తరాలకు చరిత్ర నిక్షిప్తమౌతుంది.

1981 నుంచీ పాకీదొడ్లను శుభ్రం చేస్తున్నానని మీనా హరిజన్ చెప్పింది. ఆమె పనిచేసే పదో వార్డులోకి ట్యాంకర్ రాదు. దానితో ఆమె ఆ పియ్యిపెంటనంతా తీసుకెళ్ళి

దూరాన వున్న మురుగుకాల్వలో పోసి రావాలి. ఆమె పని మొదలుపెట్టిన కొత్తలో రోజుకి ఏడు రూపాయలు వచ్చేవి. ఇప్పుడు ఆమెకు నెలకు రూ. 5,000/-, 6,000/- వరకూ వస్తాయి. మీనా చెప్పటం ఇంకా పూర్తికాకుండానే, ముప్పయి రెండేళ్ళ రూపా తన గుర్తింపు కార్డుని చూపిస్తూ, 1999 నుంచి తాను శాశ్వత కార్మికురాలిగా వున్నానని చెప్పింది. జగ్దల్‌లోని పదహారవ వార్డులో ప్రతిరోజు ఎనిమిది నుంచి పది వరకూ పాకీదొడ్లను శుభ్రం చేస్తానని చెప్పిందామె. ఇంతలో మాయాహారి మాకు తన కార్డుని చూపిస్తూ గత పదేళ్ళుగా ఈ మురికి పనే చేస్తున్నానని చెప్పింది. ఇంతకు ముందు తమకు 'హాథాదబ్బు'లని అందజేసేవారని, ఇప్పుడు ఇవ్వట్లేదని చెప్పింది. దీనికి కొనసాగింపుగా చేతులకు వేసుకునే తొడుగులు (గ్లోవ్స్) అందుబాటులోకి వస్తే తమ చేతులకు కొంత రక్షణ ఉంటుందని మీనా, మాయ ఇద్దరూ చెప్పారు. అక్కడ వున్న ఆడవాళ్ళందరూ తమ చేతులను ముందుకు చాపి చూపించారు. దాదాపు అందరి వేళ్ళు మచ్చలతో వంకర తిరిగిపోయి వున్నాయి. గోళ్ళరంగు మారిపోయి, విరిగిపోయి వున్నాయి. దాదాపు ఈ ఆడవాళ్ళందరూ రక్తహీనత, ఎలర్జీ, శ్వాససంబంధ సమస్యలు, తరచూ గర్భస్రావాలతో బాధపడుతున్నవారే. ప్రభుత్వం చేతి తొడుగుల్ని, బూట్లని, దబ్బాలని ఇవ్వాలని కోరుకుంటున్నట్టు మిగతావారు కూడా చెప్పారు. ఇవి తమకు ఎంతో సహాయపడతాయని వారు భావిస్తున్నారు. ఇది ఇప్పుడున్న స్థితిని కొంచెమైనా మెరుగుపరిచేందుకు చేసే ఆలోచనగానే కనిపిస్తోంది. ఎప్పటికీ ఒట్టిచేతులతో పియ్యిపెంటను శుభ్రం చేయటం అనేదాన్ని అంగీకరించలేకపోతున్నారు గానీ, పూర్తిగా ఈ నరకకూపం నుంచి విముక్తమవటం అనే అంశం వారి ఊహలోకి కూడా ఇంకా రావటం లేదు.

ఒకటో నంబర్ లైన్‌లో ఆరు ఎత్తుడుదొడ్లను శుభ్రపరిచిన గీత, పాకీపనివాళ్ళ విముక్తి కోసం ఒక పథకం వున్నట్లు తనెప్పుడూ వినలేదని సాదాసీదా మాటల్లో మాకు చెప్పింది. ఈ ఖాటా-పైఖానా పని వదిలేయాల్సివస్తే తనకు వేరే ఏదన్నా ప్రభుత్వ ఉద్యోగం వస్తుందా అని అడిగింది. చిన్న వయసులో వున్న మాలతిదోమ్ పని మరీ భిన్నంగా వుండటమే కాదు హింసాత్మకంగా కూడా వుంది. చీకట్లు ముసురుకుంటున్నపుడు దగ్గరలోవున్న మురుగుకాల్వ దగ్గరికి ఆమె నన్ను చేయి పట్టుకుని తీసుకుని వెళ్ళింది. కాల్వలో పెరుగుతున్న గడ్డి, పిచ్చి మొక్కలను ఏరి దాన్ని కూడా శుభ్రంచేయటం, అక్కడ వుండే పెంటంతా ప్రవాహంతో కొట్టుకుపోయేలా కర్రతో నెట్టడం ఆమె పని. ముందు ఈ పని చేయటానికి ఆమె ఒప్పుకున్న వెంటనే మున్సిపాలిటీ ఆమెకు ఉద్యోగం ఇచ్చేసింది. ఈ మురికి పనిచేయటానికి అవసరమైన బట్టలేవీ మున్సిపాలిటీ తనకు ఇవ్వలేదని మాలతికి చాలా బాధగా వుంది. ఎంతో కష్టంతో ఆమె ఈ పని చేస్తూవుంది. చీర కట్టుకుని చేయడం మరీ కష్టం. చీరని పైకికట్టి తాను కాల్వలో ఆ పని ఎలా చేస్తుందో నాకు చూపించటం మొదలుపెట్టింది మాలతి. కానీ నేను ఆమెను వద్దని వారించాను. 'ఖాటా-పైఖానాలను మూసివేయాలనే డిమాండ్ గత కొన్ని సంవత్సరాలుగా గట్టిగానే వినిపిస్తోందనీ, ఎన్నికలు

దగ్గర పడుతుండటంతో అధికార యంత్రాంగం చాలా పాకీదొడ్లను మూసివేయడం జరిగింది' అని ఆ ప్రాంతంలో చురుగ్గా వుండే విప్లవ్‌మాలో చెప్పాడు. దీనికి సంబంధించిన వివరాలన్నీ కోర్టు వరకూ తీసుకెళ్ళడం, చర్చలను నిర్వహించటానికి సంబంధించి ముఖ్యంగా దేబషిష్ కృషినే చెప్పుకోవాలి. కోలకత్తా హైకోర్టులో ఈ ఎత్తుడు దొడ్లను పూర్తిగా ధ్వంసం చేయాలని ప్రజాప్రయోజనాల వాజ్యాన్ని వేసింది ఇతనే. దీనికి సంబంధించిన చిన్నవార్త పత్రికలలో రావటం వల్ల పశ్చిమబెంగాల్ బయట వుంటున్న మాలాంటి అనేకమందికి ఇలాంటి చట్టవిరుద్ధమైన అమానవీయమైన పని ఇక్కడ ఇంకా కొనసాగుతోందనే విషయం తెల్సింది.

జౌళి కార్మికుల పోరాటాలతో పాటుగా పాకీపని అనే హింసాత్మక వృత్తి నుంచి బయటపడటం కోసం దేబషిష్ ఒక రాజకీయ అవగాహనతో తన పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగిస్తున్నాడు. సైకిల్ మీదే అన్ని మొహల్లాలు, ప్రతి వార్డు, ప్రతి లైను అనేకసార్లు తిరిగి రావటం జరిగింది. అన్ని మొహల్లాల్లోని జనాల్ని కలుస్తూ ఈ నరకం నుంచి విముక్తం కావాలనే ఆలోచనను, కోరికనూ రేకెత్తిస్తూ వారిని సంఘటిత పరచటానికి ప్రయత్నిస్తున్నాడు. దేబషిష్ సహాయం లేకుండా పశ్చిమ బెంగాల్‌లోని ఈ వాస్తవాన్ని చూడగలగటం అనేది నాకు సాధ్యమయ్యేది కాదు. తరాల నాటి ఫ్యూడల్ భావజాలమే దీని వెనుక వున్న కారణమని దేబషిష్ బలంగా నమ్ముతాడు. దీనిలో, ఎత్తుడుదొడ్లు వున్న ప్రజలు, దానిలో పనిచేస్తున్న పాకీ పనివారు ఇద్దరూ ఈ కోవలోకి వస్తారు. ఈ వరుసన చూస్తే ఈ ఇద్దరిలో ఎవరికి వారికి ఏదో సాగిపోతోందిలే అన్నట్టుగా ఉంటుంది. ఈ పరిస్థితి దళిత అస్థిత్వంలో లేదా మానవ గౌరవంలో లేదా మానవహక్కుల ప్రశ్నల్లో ఈ అంశం ఎందుకు భాగం కాలేకపోయిందన్నదాన్ని వివరిస్తుంది.

ముప్ఫైఏళ్ళుగా భాట్‌పర జిల్లాలో క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ గోలక్‌నాథ్ ఛటర్జీకి ఈ పాకీపని చేసే ఆడవారితో చాలాకాలంగా పరిచయం వుంది. ఈ ప్రాంతంలో అప్పు మీద వారికి చికిత్సఅందించే డాక్టరు ఈయనొక్కడే. మీనా, మాలతి, సరస్వతి దోమ్, పార్వతి హాడి, గాతా హాడి, ఆఫా హాడి, రామ్‌వటి, పార్వతి బాస్ఫోర్, శకుంతల మొదలైన స్త్రీలంతా ఎలాంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారో డాక్టర్ ముఖర్జీ నాతో వివరంగా చెప్పారు. అత్యంత పేదరికంతో వుండే ఈ స్త్రీలు వైద్యానికయ్యే ఖర్చులను భరించే స్థాయిలో వుండరని, అప్పటికీ తాను ఐదు, పది రూపాయలలోపే వారికి మందులను అందించే ప్రయత్నం చేస్తానని, వారి పరిస్థితి ఏమాత్రం బాలేదని మా దగ్గర ఉద్వేగభరితంతో కూడిన విచారాన్ని వ్యక్తంచేశారు డాక్టర్ ముఖర్జీ. చర్మ సంబంధమైన వ్యాధులు, ఊపిరి తిత్తుల సమస్యలు, క్షయ, న్యూమోనియ, తీవ్ర రక్తహీనత, గర్భస్రావాలు వంటివి ఈ ఆడవాళ్ళందరిలో సాధారణ సమస్యలు. నిజానికి వారికి అత్యవసరంగా వైద్యచికిత్స అవసరమయినప్పటికీ తమ కోసం కాకుండా తమ భర్త పిల్లలను చికిత్స కోసం తీసుకు వస్తారు.

ఈ ఎత్తుడుదొడ్లను నిర్మూలించటం ఎలా అని భాట్‌పరలోని అనేక మందితో మాట్లాడుతున్న క్రమంలో మరొక అంశం వెలుగులోకి వచ్చింది. అది కూడ దుష్ట సమూహం చేత ఒక మహమ్మారిలా అల్లుకుపోయి వుంది. దీనితో ఖాటా–పైఖానాలన్నీ రెండు అడుగుల లోతు గుంటల పాకీదొడ్లుగా మార్చటం జరిగింది. ఒక్కో పాకీదొడ్డికి రూ. 10,080/–లు ఖర్చువుతుంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. దీనికోసం నాలుగు చదరపు గజాల వైశాల్యంలో లోతుగా ఒక గుంటను తవ్వాల్సి వుంటుంది. నిజానికి కావల్సిన మొత్తం స్థలం పది చదరపు గజాలు. ఈ జిల్లాలో ఆ మాత్రం స్థలం కలిగి వుండేవాళ్ళు తక్కువ మందే వుంటారు. భాట్‌పర లాగానే దేశంలోని ఇతర ప్రాంతాలలో ఎక్కడైతే పాకీపని అమలవుతోందో అక్కడ ఈ ఎత్తుడుదొడ్లను ఉపయోగిస్తున్న వారందరూ కూడా పేదవర్గాల ప్రజలే. ఇంకోవిధంగా చెప్పాలంటే సమాజం అట్టడుగునవున్న ప్రజానీకం.

ఈ రెండు గుంటల మరుగుదొడ్లలో వున్న మరో అంశమేమంటే, ఇవి నిండిపోయినప్పుడు వాటిని ఖాళీ చేయటానికి మళ్ళీ చేతులనే ఉపయోగించాల్సి వస్తుంది. దీనర్థం ఏమిటంటే తోటి మనుషుల విసర్జితాలను చేతులతో శుభ్రంచేసే పాకీ పని కొనసాగుతూనే వుంటుంది. అయితే ఇది రోజువారీ వ్యవహారంలాగా కాకుండా, నెలకో రెండు నెలలకో చేసే పనిగా మారుతుంది. కొత్త తరహాలో కడుతున్న ఈ పాకీదొడ్లలో పదిహేను రోజులకొకసారి చుట్టూవున్న మట్టి అంతా మురికిగా మారుతుంది. ఎందుకంటే వీటికి సెప్టిక్ ట్యాంకులు వుండవు కాబట్టి. నేను అలాంటి ఒక కొత్త తరహా టాయిలెట్ చూడటానికి వెళ్ళి, దాని యజమాని సుధామ చౌధురితో మాట్లాడాను. ఈ పాకీదొడ్డి వలన తమ ఇంటి చుట్టుపక్కల వున్న బావుల్లోని నీరు, చేతి పంపుల నుంచి వచ్చే నీరు వాసన వస్తోందని ఆయన ఫిర్యాదు చేశాడు. ఈ సమస్యతో జనం చాలా బెంబేలెత్తిపోయారు. దానికితోడు, డ్రైలెట్రిన్ కోసం తవ్విన గుంట చాలా చిన్నదిగా కూడా వుంది. మట్టి చెమ్మగాఉండి, అది నీళ్ళను ఎక్కువ పీల్చుకోలేకపోవటంతో తొందరగానే ఆ గుంట నిండి పొర్లిపారుతోంది. అంటే, తక్కువ సమయంలోనే ఆ గుంటను శుభ్రంచేయాల్సి ఉంటుందనేది దీనర్థం. పదిహేడో నెంబరు వార్డులో నివాసముంటున్న గోపాల్ ప్రసాద్ చౌధురి ఇంట్లో ఇట్లాంటి పాకీదొడ్డి ఒకటి కట్టారు. తాము కేవలం నెలరోజుల నుంచే దానిని వాడుతున్నామని, ఇప్పటికే అది నీటితో నిండిపోయి బయటకు పొర్లుతోందని ఆయన మాకు చెప్పాడు. ఇట్లాంటి అనేక ఫిర్యాదులు కొత్త పాకీదొడ్లు కట్టించుకున్న వారందరికీ వున్నాయి. నిజంగా ప్రభుత్వానికి పాకీ పనిని నిషేధించాలన్న చిత్తశుద్ధే వుంటే తాత్కాలికమైన ఏర్పాట్లతో కన్నా శాశ్వతంగా ఉపయోగపడే మురుగునీటి పంపులను ఏర్పాటు చేయాలి. అప్పుడే జనం ఈ మురికి జీవితం నుంచి, అవమానకరమైన ఈ వృత్తి నుంచి విముక్తం కాగలుగుతారు.

ఈ అంశంపై స్థానిక రాజకీయ వాతావరణం భగ్గుమంది. రాష్ట్రంలోని అన్నిచోట్లా ఉన్న పరిస్థితిలాగే ఇక్కడ కూడా సిపిఐ(ఎమ్), తృణమూల్ కాంగ్రెస్–ఇద్దరూ ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకున్నారు. భాట్‌పరలోని ఈ అమానవీయమైన పని లేనేలేదని సిపిఐ(ఎమ్) అంటే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక శాసనసభ్యుడు అర్జున్ సింగ్ మొత్తం తప్పంతా సిపిఐ(ఎమ్)దే అన్నారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్మన్ మాట్లాడిన తీరు చూసిన తర్వాత, కుళ్ళికంపు కొడుతున్న ఈ వృత్తి నుంచి జనాన్ని బయటకు తీసుకువచ్చి గౌరవప్రదమైన పునరావాసం కల్పించాలనే రాజకీయ చిత్తశుద్ధి ఎవరికీ  లేదని స్పష్టంగా అర్థమయింది.

అర్జున్‌సింగ్ ఆఫీసుకు కొన్ని గజాల దూరంలోనే ఎక్కువ సంఖ్యలో ఈ ఖాటా–పైఖానాలు, తెరిచివున్న మురుగుకాల్వలు చెత్త, పెంటలతో నిండివున్నాయి. వాటి నుంచి నిరంతరం వచ్చే దుర్గంధాన్నిబట్టి దూరం నుంచి కూడా ఈ ప్రదేశాన్ని గుర్తుపట్టవచ్చు. ఆసక్తికరమైన విషయమేమంటే, అర్జున్‌సింగ్ తానుండే ప్రాంతానికి మూసివుండే మురుగుకాల్వ వ్యవస్థను ఏర్పాటుచేయించుకోగలిగాడు గానీ, తన పక్క కాలనీలో మాత్రం అదేవిధంగా చేయటానికి కుదరదని తన అశక్తతను వ్యక్తంచేశాడు.

స్థానిక శాసనసభ్యుల ప్రాంత అభివృద్ధికి సంబంధించిన నిధి గురించి నేను అడిగినప్పుడు, పశ్చిమ బెంగాల్‌లో కేవలం రూ. 1.25 కోట్లే దీని కింద తాము పొందగలుగుతామని, ఆ మొత్తంతో ఏ పనినీ పూర్తిగా చేయడం అసాధ్యమని తన అసంతృప్తిని వ్యక్తంచేశాడు. వాస్తవానికి ఇదంతా కేవలం డబ్బుతోనే సాధ్యమవుతుందన్నట్లు! ఈ మొత్తం సారాంశమేమంటే, ఒక శాసనసభ్యుడు తన ప్రాంతంలో కుళ్ళికంపు కొడుతున్న మురుక్కాలవలను  బాగుచేయటానికి, మానవ విసర్జిత పియ్యిపెంటను నెత్తిమీద మోస్తూ, చట్టవిరుద్ధమైన పనిచేస్తున్న వారి జీవితాలను బాగుచేయటానికి తన ఆధ్యర్యంలో వున్న రూ. 1.25 కోట్ల పరిమితమైన నిధులతో ఏ రకమైన చొరవ తీసుకోలేదు.  కనీసం ఆ ప్రయత్నం చేయలేదు.

పదిహేడో నెంబరు వార్డు  కౌన్సిలర్  సుమిత్రాదేవి కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. ఆమె కూడా తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు. గత పదిహేనేళ్ళుగా ఈ వార్డు కౌన్సిలర్‌గా వుంది. మిగతా అన్ని వార్డుల కంటే ఇదే చాలా మురికిగా, అధ్వాన్నంగా వుంటుంది. పట్టణాభివృద్ధి  శాఖమంత్రి అశోక్ భట్టాచార్యకైతే ఈ విషయం పట్ల కనీసపాటి సానుభూతి లేకపోగా 'పశ్చిమ బెంగాల్‌లో పాకీపని అనేది అస్సలు లేనేలేదు. ఎక్కడో ఒకటీ అరా ఉదాహరణగా వున్నాగానీ, వాటి గురించి మేం జాగ్రత్త తీసుకుంటాం' అని నిస్సిగ్గుగా, నిర్లజ్జగా మాట్లాడాడు. ఈ అంశాల పట్ల వాస్తవాలను అంగీకరించలేని వారి అయిష్టతకు ఇలాంటి వ్యాఖ్యలు అద్దం పడతాయి. వీటన్నింటినీ గమనిస్తే, ఈ వృత్తి  ఇంకా ఎందుకు కొనసాగుతోందో ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. ఇంకొంచెం వివరాల్లోకివెళితే  అమానవీయమైన ఈ వృత్తిని నిర్మూలించటానికి రాష్ట్రాలన్నీ

వరుస క్రమంలో తీసుకోవాల్సిన విధివిధానాలను సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఈ విషయంపై దీనికి ప్రధాన బాధ్యత వహించాల్సిన మంత్రికి ఏమాత్రం అవగాహన లేదు. ఈ ప్రాంతంలో ఎన్ని ఎత్తుడుదొడ్లు వున్నాయో కూడా అతనికి తెలియదు. ఇదంతా కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి దీనికోసం వేలాది రూపాయాలు ఖర్చుచేసిన తర్వాత పరిస్థితి. రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు సమీపిస్తుండటంతో పాకీపని అనేది ఎన్నికల్లో ఒక సవాలుగా మారవచ్చునని సిపిఐ(ఎమ్) చాలా ఆందోళనతో వుంది. భాట్‌పర మున్సిపల్ బోర్డు ఛైర్మన్ ప్రదీప్ భట్టాచార్య ఆఫీసుకు నేను వెళ్ళకముందే, ఈ అంశం మీద మేము తృణమూల్‌తో కలిసి పనిచేస్తున్నామని అతనికి తెలిసింది. అతని గదిలోకి వెళ్ళటానికి నేను చాలాసేపు వేచి వుండాల్సి వచ్చింది. అతన్ని నేను ఏమి అడగకముందే అతనే 'మీ సందర్శన ముగిసిందా? తృణమూల్ వాళ్ళు మీకు చాలా సహాయం చేస్తున్నట్టున్నారు! వాళ్ళే మిమ్మల్ని నా ఆఫీసుకు తీసుకువచ్చారని కూడా నాకు తెలుసు' అని నన్నే ప్రశ్నించాడు.

అతను ఏం సూచిస్తున్నాడో నాకు అర్థమయింది. 'వాళ్ళు జూట్‌మిల్లులో పనిచేస్తున్న కార్యకర్తలు. అలాగే అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ (ఎపిడిఆర్) అనే మానవ హక్కుల సంస్థకు సంబంధించిన వాళ్ళు' అని చెప్పాను.

నా మాటలకు అడ్డువస్తూ అతను 'కాదు, వాళ్ళు తృణమూల్ మనుషులు' అన్నాడు.

'ఆ విషయాన్ని వదిలిపెట్టండి–ముందు, మీ మున్సిపాలిటీలో చాలామంది స్త్రీలు ఎత్తుడుదొడ్లను ఎందుకు శుభ్రం చేస్తున్నారు? ఇది చట్టవిరుద్ధమైన పని అని మీకు తెలుసా?' అని అడిగాను.

'మేము 200 ఖాటా–పైఖానాలను తొలగించాము. మీరు చూసిన కొన్నింటిని కూడా తొందర్లోనే తొలగిస్తాం. అక్కడ ఎక్కువేమీ లేవు. ఎవరైతే ఆడవాళ్ళు వాటిని శుభ్రం చేస్తున్నారో వారికి చాలా మంచి వేతనాలు ఇస్తున్నాం. కానీ మీరు అలాంటి అంశాలేవీ మీ దృష్టిలోకి తీసుకోవట్లేదు' అని కోపం నిండిన స్వరంతో సమాధానం ఇచ్చాడు.

ప్రతి సమాధానంగా నేను నవ్వాను. ఎత్తుడుదొడ్లను తొలగించటం అనేపని మొదలు పెట్టటానికి పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు ప్రభుత్వానికి 29 సంవత్సరాలు పట్టింది. పైగా వాస్తవాలను వక్రీకరించటానికి ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. అందుకే అత్యంత అమానవీయంగా కులంతో ముడిపడి వున్న వివక్ష, దోపిడి ఇంకా సజీవంగా వుండటమే కాదు పైకి తన్నుకుంటూ వుంది. ప్రజల పక్షపాతిగా చెప్పుకునే అప్పటి లెఫ్టిస్ట్ ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు కాదా?

(పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాను 2006లో మొదటిసారి సందర్శించిన వాస్తవాల ఆధారంగా 2006లోనే రాసిన వ్యాసమిది. ఆ సమయంలో వచ్చిన రిపోర్టుల ఆధారంగా, భాట్‌పరా జిల్లాలో ఇప్పుడు పూర్తిగా పాకీపని నిర్మూలించబడింది. ఎత్తుడు దొడ్లను పూర్తిగా తొలగించారు.)

# హర్యానా




1. పంచ్‌కుల 2.) అంబాలా 3.) యమునా నగర్ 4.) కురుక్షేత్ర 5) ఖైతాల్ 6.) జింద్ 7.) ఫతేహబాద్ 8.) పానిపట్

(హర్యానా లోని చాలా జిల్లాల్లో ఇప్పుడు పాకీ పని లేదు)

**'సంవత్సరం క్రితమే నేను ఈ పనిని వదిలేశాను, కానీ ఆ కంపు మాత్రం నన్నొదిలి పోలేదు.'**

వంకరగా వున్న ఆ ఇరుకిరుకు సందుల్లో ఆమె అమిత వేగంగా నడుస్తూవుంది. సల్వార్ కమీజ్ వేసుకుని దుపట్టాతో తలమీద కప్పుకుంది. ఆమె ఎక్కడ కనిపించకుండా పోతుందోనని నేను భయపడుతూ వున్నాను. నేను వేరే వాళ్ళని వదిలి వచ్చిన ప్రాంతం పేరు గానీ, అడ్రసు గానీ ఏదీ నాకు తెలియదు. నా అంతట నేను వెనక్కి వెళ్ళిపోగల అవకాశం లేదు. దీనితో కుషాల్‌ని దగ్గరగా అనుసరించటం తప్ప నాకు వేరే మార్గమే లేదు. హఠాత్తుగా నా పాదం ఒక రాయికి కొట్టుకోవటంతో నేను తుళ్ళి పడిపోబోయాను. నా కెమెరా కింద పడిపోకుండా కాపాడుకునే ప్రయత్నంలో కుషాల్ నా దృష్టి పథం

నుంచి కనుమరుగైపోయింది. నేను చాలా కంగారు పడిపోయాను. నా భయమే నిజమయిందని అర్థమయింది. ఆమె హఠాత్తుగా మళ్ళీ కనిపించేవరకూ కూడా నేను ఒంటరిగా అలానే నిలబడిపోయాను. నన్ను తీసుకువెళ్ళటానికి ఆమె వెనక్కి తిరిగి వచ్చింది. దానితో నేను కొంచెం ఊపిరి పీల్చుకోగలిగాను.

కుషాల్‌కు దగ్గర దగ్గర యాభై ఏళ్ళు వుంటాయి. హర్యానాలోని అంబాలా నగరంలో రెండు మట్టి గోడల ఇళ్ళల్లో ఎత్తుడుదొడ్లను శుభ్రంచేస్తోంది. రెండు మట్టి ఇళ్ళల్లో, 15 పక్కా ఇళ్ళల్లో పని చేస్తున్నట్లు నాకు కుషాల్ చెప్పింది. అయితే ఇది ఆమె కుటుంబ పోషణకు సరిపోదు. మట్టి ఇళ్ళల్లో ఎత్తుడుదొడ్లను శుభ్రం చేసినందుకు నెలకు రూ. 50/–;రూ. 100/ వస్తాయి. పక్కా ఇళ్ళల్లో ఫ్లష్ టాయిలెట్లు శుభ్రం చేసినందుకు నెలకు ఇంటికి పాతిక రూపాయల చొప్పున ఆమెకు వస్తాయి. దారిలో మాట్లాడిన కొద్దిసేపటిలోనే తన జీవితమంతా దుర్భరమైన దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతోందని, కుటుంబంలో సరిగ్గా సంపాదించేవారు ఎవరూ లేరని, తన భర్త మేస్త్రీగా పనిచేస్తున్నా గానీ సంపాదనంతా తాగుడికే తగలేస్తాడని, ఇంటి కోసం ఏమీ మిగల్చడని, దీనితో పిల్లల్ని పెంచి పోషించే బాధ్యత తనదేనని ఆమె పదేపదే చెప్పుకొచ్చింది.

'మా జీవితాల్లో మాకంటూ ఒక రోజు కూడా వుండదు. మా పెళ్ళయిన నెలరోజులకే మా అత్త  చీపురు చేతికిచ్చి ఇళ్ళల్లో ఈ పని చేయటానికి పంపించింది. అప్పటికింకా నా చేతులకున్న గోరింటాకు కూడా పోలేదు. "నీ చేతులకు పండిన గోరింటాకు ఇంకా ఎర్రగానే వుంది. నువ్వెందుకు ఇలా రావటానికి ఒప్పుకున్నావు" అని జనం నాతో వ్యంగ్యంగా అంటుండే వారు. ఆ మాటలు వింటుంటే నా గుండె మండిపోయేది. కానీ, నేను నిశ్శబ్దంగానే వుండిపోయేదాన్ని. బతుకు తెరువుకు నాకంటూ సంపాదన వుండటం మంచిదని నాకు నేనే నచ్చ చెప్పుకునేదాన్ని. ఆ తర్వాత మురికి పని చేస్తూనే మా మామ చనిపోయాడు. మా అత్త జబ్బుపడింది; అప్పటి నుంచీ అంతంలేకుండా ఈ పని కొనసాగుతూనే వుంది...

ఇదే మా ప్రపంచం. పొద్దు ఎప్పుడు పొడుస్తోందో, రాత్రెప్పుడవుతుందో మాకేమీ తెలియదు....

ఆమె చెప్తున్న మాటల్ని అర్థం చేసుకోవటానికి నేను చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది. కుషాల్ మొహం బాగా పాలిపోయి వుంది. ఆపకుండా కదులుతున్న పెదాలు, గుంటలు పడి లోతుకుపోయిన కళ్ళు నన్ను పైనుంచి కింది వరకు తేరిపార చూస్తున్నట్లుగా అనిపించింది.

ఒక ఇంటి గుమ్మం ముందు ఆగి తలుపుకొట్టిందామె. తలుపు తెరుచుకున్న వెంటనే అక్కడ నిలబడిన ఆమెకు నన్ను పరిచయం చేస్తూ 'ఈమె పాకీదొడ్డి చూడటానికి వచ్చింది. మీకు నాకు కూడా సహాయపడొచ్చు' అని చెప్పింది. ఆ ఇంటామె  పిల్లలిద్దరూ నావంక

కుతూహలంగా చూస్తున్నారు. అది సగం పూరిల్లు, సగం సిమెంటు గోడలతో వున్న ఇల్లు. మొదటి అంతస్తులో వున్న పాకీదొడ్డిని చేరుకున్న వెంటనే కుషాల్ పక్కనే వున్న ఒక చీపురును, రెండు రేకు ముక్కలను తీసుకుని శుభ్రం చేయటం మొదలుపెట్టింది. ఈ ఎత్తుడుదొడ్లలో రెండు ఇటుక రాళ్ళ మీద పాదాలు పెట్టి కూర్చోవటానికి వీలుగా చేశారు. ఆ రెండు రాళ్ళ మీద ఎవరైనా దొడ్డికి కూర్చోగానే మధ్యనున్న కంతలోంచి పియ్యిపెంట కిందకి పడిపోతుంది. అక్కడంతా అది జమ అవుతూ వుంటుంది. నా ఎదురుగానే కుషాల్ దానిని శుభ్రంచేస్తోంది. పాకీదొడ్డిలోకి వెళ్ళటానికి ముందే ఆమె తన దుపట్టాతో ముక్కు, నోరూ కప్పుకుంది. దాదాపు ఆ పని పూర్తిచేయటానికి ఐదు నుంచి పది నిమిషాల సమయం పట్టింది. ఆ తర్వాత మేము మెట్లు దిగి కిందికి వచ్చాం.

అప్పటివరకూ ఆ ఇంటామె చాలా ఆందోళన పడుతున్నట్లుగా నేను గమనించాను. 'మీరు ఫోటోలు తీస్తున్నారు, ఇది మాకేమీ సమస్య కాదు కదా?' అని కొంచెం భయం భయంగా అడిగిందామె.

'మీరెందుకు ఈ ఎత్తుడుదొడ్డిని పగులగొట్టి ఫ్లష్ టాయిలెట్ కట్టుకోరు? ఇది మీకూ మీ పిల్లలకు కూడా చాలా ప్రమాదం' అని సమాధానంగా అన్నాను. దీనికి అంగీకారంగా తలవూపుతూ 'మీరు చెప్తున్నది సరయినదే కానీ మా దగ్గర డబ్బులేదు' అని బదులిచ్చింది.

ఫ్లష్ టాయిలెట్ల కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందించే పథకం గురించి మీకేమన్నా తెలుసా అని అడిగాను. ఆమె ప్రతిస్పందిస్తూ, 'ఒకసారి ఓ అధికారి వచ్చి దీన్ని మార్చమని మాకు చెప్పాడు కానీ ఆ తర్వాత దానికి సంబంధించి ఏ పని జరగలేదు. నా భర్త వికలాంగుడు. కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక ప్రమాదంతో కాలు తీసేయాల్సి వచ్చింది. ఆ పరిస్థితి నుంచి కుదుటపడటానికే మేం చాలా ప్రయత్నం చేయాల్సివస్తోంది. ఇప్పుడైతే మాదగ్గర డబ్బేమీ లేదు. అది కట్టిచ్చేటట్లుగా మీరు మాకు సాయం చేయొచ్చు కదా? మాకైతే ఈ పాకీదొడ్డిని ఉపయోగించటం ఇష్టం లేదు' అందామె. ఈ మాటలు చెప్తున్నంతసేపూ ఆమె పిల్లలు ఆమె వెనుక నుంచి తొంగిచూస్తూనే వున్నారు. కుషాల్‌తో తిరిగి వెళ్ళేటప్పుడు నేను ఆ ఇంటి అడ్రసు రాసుకున్నాను.

ఎత్తిన ఆ పియ్యిపెంటనంతా అక్కడికి అర్ధకిలో మీటరు దూరంలో వున్న మురికి కాల్వలో పారేసి వచ్చి దగ్గరలో వున్న మున్సిపాలిటీ నీళ్ళపంపు దగ్గర కాళ్ళూ చేతులూ సబ్బుతో శుభ్రంగా కడుక్కుంది కుషాల్. అక్కడవున్న రాయి కింద ఒక ప్లాస్టిక్ కవర్లో చిన్న సబ్బుముక్కను ఎప్పుడూ దాచి వుంచుతుంది ఆమె. దానిని వాడిన తర్వాత మళ్ళీ జాగ్రత్తగా అక్కడే దాచిపెట్టింది. 'ఈ పని మానేయాలని నాకు బలంగా అనిపిస్తుంది. కానీ, వేరే పని ఏదీ దొరకటం లేదు. ఇక్కడ పేదరికానికి లోటు లేదు. పనేమి లేకుండా నేనూ,నా పిల్లలు బతకటం కష్టం. మొత్తం బాధ్యతంతా నా మీదే వుంది. ఎవరు మాత్రం

ఈ పని చేయటానికి ఇష్టపడతారు? దీనినసలు పని అనగలుగుతామా? కొంచెం ఆలోచించండి. ప్రభుత్వం నాటకాలు వేస్తోంది. ఫ్లష్ టాయిలెట్లను కట్టించదు. మాకు వేరే పనులు ఏమీ కల్పించదు. విషయమేమంటే, ఈ పాకీదొడ్లు కూలగొట్టేసినా గానీ, మేము వేరే రకమైన దొడ్లను శుభ్రం చేయటానికే వెళతామనేది వాస్తవం. ఈ నాటకం ఇలా కొనసాగుతూనే వుంటుంది' అని కుషాల్ విడమరిచి చెప్పింది.

మేము త్వరత్వరగా ఆ ఇరుకు సందుల్లో నుంచి బయటకు వచ్చి, అంబాలాలోని వేరే ప్రాంతాల్లో పాకీపని చేస్తున్న ఇతర ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళాం. వాళ్ళు మాకోసం ఎదురు చూస్తున్నారు. అది అంబాలాలోని వాల్మీకులు వుండే మాజ్రి మొహల్లా. ఈ ప్రాంత లోక్‌సభ సభ్యురాలు, ఈ నగర ప్రతినిధి ఫైర్‌బ్రాండ్‌గా పేరుపొందిన దళిత నాయకురాలు షెల్జాకుమారి.

నేను ఢిల్లీ నుంచి ఫోన్ చేసినపుడు మొట్టమొదట మాట్లాడిన వ్యక్తి సీమ. ఆమే ఈ సమావేశాన్ని మా కోసం ఏర్పాటుచేసింది. అంబాలాలోని ఈ స్త్రీలతో గత నాలుగైదు సంవత్సరాల నుంచి సీమా ఎంతో చురుకుగా పనిచేస్తోంది. స్థానిక ప్రభుత్వ యంత్రాంగం మీద ఈ స్త్రీల పునరావాసం కోసం ఒత్తిడి పెడుతున్న వ్యక్తి. ఒక ఇంట్లోని వరండాలో రగ్గు మీద దాదాపు ఇరవైమంది స్త్రీలు కూర్చుని వున్నారు. పైన ఫ్యాన్ చప్పుడుచేస్తూ తిరుగుతూ వుంది. వారి మధ్య మాటలు మొదలయ్యాయి. మేము వరండాలోకి రావటం చూస్తూనే వాళ్ళు మా దగ్గరికి పరిగెత్తుకుని వచ్చారు. ఒకరి నొకరు పలకరించుకుంటూ, చేతులు కలుపుకుంటూ, గొంతెత్తి అందరూ 'జై భీమ్'లు చెప్పుకున్నారు. ఆ తర్వాత వారి నాయకురాలు సరోజ్ సమావేశాన్ని ప్రారంభించింది. రెండేళ్ళ క్రితమే ఈ మురికిపని వదిలేశానని సరోజ్ మాతో చెప్పింది. తన దుపట్టాను తల మీది నుంచి నుదిటి మీదికి లాక్కుంటూ, 'మేమంతా చాలా సంతోషంగా వున్నాం. ఈ పని వదిలేయటమంటే నరకం నుంచి తప్పించుకున్నట్లుగా వుంది నాకు. ఏం జరిగినా సరే, మేం మళ్ళీ ఈ పనిలోకి మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ వెళ్ళం' అని సూటిగా చెప్పిందామె. మిగతా స్త్రీలు ఆమె చెప్పిన దానిని అంగీకరించారు.

ఎప్పటి నుంచి మీరు 'జై భీమ్' అంటున్నారని సరోజ్ పక్కన కూర్చుని వున్న షీలాని అడిగాను. 'ఈ మధ్యనే, రెండేళ్ళ నుంచీ' అని సమాధానమిచ్చిందామే.

అంబేద్కర్ గురించి విన్నారా అన్న నా రెండో ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వలేకపోయింది. కానీ తలపూపింది. దీనితో వీళ్ళు ఎక్కడి నుంచి జై భీమ్ అన్న సంబోధన నేర్చుకుని వుంటారా? అన్న కుతూహలం నాలో రేకెత్తింది.

వాళ్ళు చెప్పిన సమాధానం కొంచెం అస్పష్టంగా అనిపించింది. 'కొన్ని సంవత్సరాల క్రితం సీమా తన స్నేహితులతో కలిసివచ్చి ఈ పని వదిలేయాలని చెప్పినపుడు.... అంతకు ముందు మేము "రామ్ రామ్" అనే వాళ్ళం.'

భీమ్ అనేది దేనికి సంకేతం?

'అతను మా నాయకుడు, నిజానికి మాకు లభించిన ఈ గుర్తింపు అతని వల్లనే. అందుకే దళితులందరూ "జై భీమ్" అంటారు.

మనకి స్వాతంత్ర్యం వచ్చి అరవయ్యేళ్ళు దాటింది. అయినా తన జీవితమంతా దళితుల కోసం ధారపోసిన వ్యక్తి, వారి అభ్యున్నతికి బాటలు వేసిన వ్యక్తి పేరు ఇంతవరకూ వీరిని చేరకపోవటం అనేది నాకు ఆశ్చర్యమనిపించింది. ఈ రోజున నరకం లాంటి ఈ పని నుంచి విముక్తమవ్వాలనే కోరికే వారికి ఈ పేరుని పరిచయం చేసింది.

ఈ లోపల ఆమె పక్కనే కూర్చుని వున్న యాభైయేళ్ళ తారో ముందుకి వంగి 'ఇది చాలా కష్టం. ప్రభుత్వం పదేపదే అబద్ధాలు చెబుతోంది. ఇక్కడ 160 మంది స్త్రీలు ఈ మురికిపని వదిలేశారు. మా బుట్టలను మేం తగలబెట్టేశాం. అందరికీ పని దొరుకుతుందని జిల్లా కమీషనరు భారీ భారీ వాగ్ధానాలు చేశాడు. కొంత మందికి పని కల్పించారు. మిగిలిన వారికి తొందరలోనే ఏదో ఒక పని ఇప్పిస్తామని అంటున్నాడు. కానీ అది జరగలేదు. సంవత్సరం తిరిగేసరికి తొలుత ఉద్యోగాలు ఇప్పించిన వాళ్ళను కూడా ఈ ఆడవాళ్ళకు పనిచేయటం ఇష్టంలేదని, బద్ధకస్తులని ముద్రవేసి ఆ పనుల నుంచి కూడా తొలగించారు. ఇప్పుడు ఇక్కడున్న అందరమూ పని లేకుండా వున్నవాళ్ళమే. కొంత మందికి ఒక్కదఫా కూడా పని దొరకలేదు. వాళ్ళ నుంచి ఏదైనా సహాయం కోసం వెళితే, "మీరు మీ సొంత నిర్ణయంతో ఆ పని నుంచి బయటకొచ్చేశారు. ఇప్పుడు వెళ్ళి మళ్ళీ అదే పని చేయండి" అంటున్నారు. మేము మా కుటుంబాలను పోషించుకోవాలనుకుంటున్నాం. కానీ ప్రభుత్వం ఆ పియ్యి బుట్టలను మళ్ళీ మా కంటగట్టాలని కోరుకుంటోంది.'

'మీరు మా పేర్లు కూడా రాయండి. మాకెలాగూ ఏ పనీదొరకదు. పైగా ప్రభుత్వం అబద్దపు అఫిడవిట్ ఇచ్చింది. మేము ఎక్కడికి వెళ్ళాలి? ఇంట్లో ప్రతి ఒక్కళ్ళం కూడా ఏ పనిలేకుండా ఖాళీగా కూర్చుని వున్నవాళ్ళమే. మా ఇళ్ళను ఎట్లా నడుపుకోవాలో మీరే చెప్పండి?' అని అక్కడ కూర్చున్న మిగతా ఆడవాళ్ళందరూ ఏక కంఠంతో అడిగారు.

అన్నిచోట్లా పరిస్థితి అటూ ఇటూగా ఒక్కలానే వుంది. ఎక్కడైతే ఆడవాళ్ళు ఈ నరకం లాంటి పని నుంచి బయటపడాలని ప్రయత్నం చేసారో, అక్కడి ప్రభుత్వ యంత్రాంగం వాళ్ళని మళ్ళీ దానిలోకే తోసెయ్యటానికి కంకణం కట్టుకుంది. కాలక్రమంలో ఎస్‌కెఏ లాంటి సంస్థలు చేసిన ప్రయత్నాలతో పాకీ పనినుంచి స్వేచ్ఛ ఇస్తున్నాం అని ప్రభుత్వం చేసిన అసత్యపు వాగ్ధానాలన్నీ బట్టబయలు కావడం మొదలయ్యింది.

'ఏం జరిగినా గానీ, మేం మాత్రం మళ్ళీ ఆ పనిలోకి మాత్రం వెళ్ళం' అని మళ్ళీ మళ్ళీ చెప్పారు.

ఈ సమావేశంలో సరోజ్ అన్న పేరుకలిగిన ముగ్గురు ఆడవాళ్ళున్నారు. ఒకరు నాయకురాలుగా తెలిసిన సరోజ్. రెండో ఆమె ఉపనాయకురాలు. మూడో ఆమె ఒట్టి

సరోజ్ మాత్రమే. ఒకసారి పరిచయాలు అయిపోయాక. తమ చిన్నతనం, తల్లిదండ్రుల ఇంట్లో గడిపిన జీవితం, ఈ మురికి పనిలోకి తాము ఎలా వచ్చామో అనే అంశాల గురించి మాట్లాడటం మొదలుపెట్టారు.

ఊహ తెలిసిన దగ్గరన్నుంచీ ఈ పని చేస్తున్నానని అందరిలోకి పెద్దదయిన నీరా చెప్పింది. వాళ్ళ అమ్మానాన్న ఇంట్లో ఐదారేళ్ళ వయసు వున్నప్పుడు తల్లితో కలిసి బుట్ట పట్టుకుని వెళ్ళేది. ఆ రోజుల్లో ఎత్తుడుదొడ్లును శుభ్రం చేసి వెనక్కి వచ్చేటపుడు కేవలం ఒక రొట్టెముక్కే వారికి దొరికేది. ఎవరెక్కువ రొట్టెలు ఇస్తారో ఆ ఇల్లు గలవాళ్ళు గొప్పవాళ్ళని అర్థమయ్యేది. 'నా జీవితమంతా ఇలానే గడిపాను. నేను ఇప్పుడు అమ్మమ్మను కూడా అయ్యాను. నాకొచ్చే కలల్లో కూడా మా చేతికి ధరించే తొడుగులు అందుకున్నామని, మురికికాల్వలు లేకుండా రోడ్డు చాలా శుభ్రంగా వుందని, ప్లాస్టిక్ కవర్ కప్పిన మా బుట్టలను ఖాళీచేయటానికి ఒక ట్యాంకర్ వుందని, చేతులు కడుక్కోవటానికి ఒక మంచి సబ్బు, అలాగే సీసాలో వుండే నీళ్ళ సబ్బు...' నీరా ఇలా అనేకాంశాలు వల్లిస్తూ పోయింది.

మిగతా ఆడవాళ్ళు నవ్వటం మొదలుపెట్టారు. 'హాయ్ రామ్, కనీసం కల్లో కూడా నెత్తి మీది బుట్టను వదిలిపెట్టవా!' అని ఆమెను ఎగతాళి చేశారు. దానితో నీరా ఒకింత సిగ్గుపడి కొద్దిసేపు మౌనంగా వుండిపోయి నెమ్మదిగా గొణుగుతున్నట్లుగా 'నా బుర్ర, గుండె దీన్ని దాటి బయటకు పోలేవు' అంటూ తన సల్వార్‌ని కొద్దిగా పైకిలేపి చూపుతూ 'ఆ పియ్యిని ఎత్తటం వల్ల నా కాలివేళ్ళు ఎలా పాడయిపోయాయో చూడు' అంది. నీరా వేళ్ళు వంకరగా అయిపోయి దాదాపు సగం చర్మం తెల్లగా పాలిపోయి వుంది. అక్కడ కూర్చున్న ఆడవాళ్ళందరి పరిస్థితి దాదాపు అలానే వుంది. రక్తపోటు, ఆస్మా, కళ్ళ మంటలు, రక్తహీనత – ఇలా అనేక రకాల శారీరక సమస్యలను భరిస్తూనే వారు జీవనపోరాటాన్ని సాగిస్తున్నారు.

ఆ తర్వాత వివక్ష గురించి ప్రస్తావన వచ్చింది, ఈ ఆడవాళ్ళు నెమరువేస్తున్న భయంకరమైన అనుభవాలను వింటుంటే, అరవై సంవత్సరాల స్వాతంత్ర్యం, అభివృద్ధి పేరిట జరిగే ఆర్భాటాల్లో ఇంకా కుళ్ళి కంపు కొడుతున్న కులతత్వం ఎలా బతికి వుందో కళ్ళకు కట్టినట్లుగా అర్థమవుతోంది. విపరీతమైన కోపంతో నాయకురాలైన సరోజ్ ఇలా అంది. 'నా పదమూడేళ్ళ వయసు నుంచీ ఈ పాకీపని చేయటం మొదలుపెట్టాను. మాది రేవారి. నేను మా అమ్మతో వెళ్ళేదాన్ని. నాకు ఏడుగురు అన్న దమ్ములు, అక్క చెల్లెళ్ళు వున్నారు. అందరూ ఈ పాకీపని చేశారు. ప్రతిరోజూ ఏ ఇంటికి వెళితే ఆ ఇంటి నుంచి మాకు రొట్టెలు ఇచ్చేవాళ్ళు. ఆ రొట్టెలను దూరం నుంచి మా మీదికి విసిరేసేవారు. అయినా గానీ ఆ తర్వాత తమ చేతులను కడుక్కునే వారు. అదే వేళ్ళూనికుని పోయిన అంటరానితనం. ఆ తర్వాత నాకు పెళ్ళయింది. నా మెట్టింట్లో కూడా ఇదే పని కొన సాగించాను. ఆ రోజుల్లో ఈ ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటానికి ఇంటి వెనుక వైపునించే

వెళ్ళాల్సి వచ్చేది. ముందువేపు నుంచి మేము రావటానికి వీల్లేదు. ఒకసారి పాకీదొడ్డి శుభ్రం చేశాక, ఆ ఇంటి యజమానురాలు దూరంగా నిలబడి పైనుంచి నీళ్ళు పోస్తుంటే చేతులు కడుక్కుంటున్నాను. నేనప్పుడు ఎనిమిదో నెల కడుపుతో వున్నాను. హఠాత్తుగా నా పాదం జారటంతో నేను పొట్ట మీదే పడిపోయాను. భయంతో గట్టిగా అరిచా. ఇది జరిగి ఇరవైయ్యయిదేళ్ళు అయినప్పటికీ, ఇప్పటికీ గుర్తు చేసుకున్నప్పుడల్లా నా కడుపులో ఏదో బాధ. నన్ను లేపటానికి ఆమె కనీసం ఒక అడుగు కూడా ముందుకు వేయలేదు. కేవలం అక్కడ పడివున్న ఒక కర్ర ముక్కను నావైపు తోసింది.

కొద్ది సేపటి తర్వాత నా అంతట నేనే కొంచెం శక్తి కూడదీసుకుని, ఆ కర్ర పట్టుకుని పైకి లేచి అతికష్టం మీద నిలబడ్డాను. అప్పుడు పెద్దదెబ్బే తగిలింది. ఆ నొప్పి నా కింకా వున్నట్లే అనిపిస్తుంది. నేను కిందికి దిగివెళ్ళిన మరుక్షణం ఆమె గంగాజలాన్ని ఆ మెట్లమీద జల్లి శుద్ధిచేయటం ప్రారంభించింది. ఆమె ప్రతిరోజూ అలా జల్లుతూనే వుంటుంది కానీ, ఆ రోజు నేను పడిపోయాను కాబట్టి మరింత ఎక్కువగా జల్లింది. నాకైతే ఆ నీళ్ళు కాకుండా పెట్రోలు జల్లి ఆ మెట్లను బొగ్గును కాల్చినట్లు కాల్చేయాలని దానితో పాటు ఈ పనిని కూడా కాల్చేయాలనిపించింది! ఇది జరిగి అనేక ఏళ్ళు గడిచినప్పటికీ నా కడుపులో ఆ మంట ఇంకా రగులుతూనే వుంది. 'నీకు ఇంకా ఏం చెప్పాలి నేను? మేం ఏం ఎదుర్కొన్నామనేనా...... మేం కనీసం కూరగాయల బండి దగ్గర కూరగాయలు కూడా కొనకూడదు. అయితే ఇప్పుడు అలా ఏమి జరగటం లేదు. అంటే అంటరానితనం కొంచెం తక్కువ స్థాయిలో వుంది. అయితే ఆ భావం మాత్రం ఇప్పటికీ అలానే మిగిలివుంది. వేరేవిధంగా ఆలోచిస్తే: దేశంలో చాలా మార్పులు వచ్చాయి– విమానాలు, రైళ్ళు, ప్రతి ఇంట్లో ఫోన్లు–కానీ ప్రభుత్వం ఇప్పటికీ మురికికాల్వలు కట్టించదు. మా నెత్తి మీది నుంచి పియ్యిపెంటను మాత్రం తొలగించదు. ఇది ఎందుకు, ఎలా జరుగుతోందని ఎవరైనా ఆలోచిస్తున్నారా? ఈ రోజుకీ కూడా మా అంతట మేము ప్రభుత్వ సహాయం లేకుండ ఈ పనిని వదిలేశాం. ఆ బుట్టలను తగలబెట్టాం. ఎత్తుడుదొడ్లను కూలగొట్టాం. ఈ నరకంలోకి నా కూతురిని మాత్రం పంపించనని నేను ఒట్టు కూడా పెట్టుకున్నాను. ఆ రోజు పడిపోయి నా కడుపుకు దెబ్బ తగిలించుకున్నప్పుడే ఇది నేను నిర్ణయించుకున్నాను. నా కూతురు బ్యూటీపార్లర్ కోర్సు చదివేలా చేశాను'.

సరోజ్ ఇంకా పూర్తిగా చెప్పటం అవకుండానే సహనం కోల్పోయిన కమలేష్ మాట్లాడటం ప్రారంభించింది. 'నేను ఉపవాసాలు చేసేటప్పుడు కూడా, "దేవుడా, ఈ కంపు నుంచి నన్ను బయటకు లాగు అని ఒక్కటే ప్రార్థిస్తాను.' పెళ్ళయిన తర్వాత కంటోన్‌మెంట్‌కు వచ్చానని కమలేష్ మాతో చెప్పింది. అక్కడ కూడా ఆమె శుభ్రం చేయటానికి ఎత్తుడుదొడ్లు వున్నాయి.

ఒకచోట నెలకు రూ.120/–వస్తే ఇంకోచోట రూ. 250/– వచ్చేవామెకు. ఎంతమంది పాకీదొడ్డిని ఉపయోగించారనే దాన్నిబట్టి అంత మొత్తం డబ్బులు వచ్చేవి.

వర్షాకాలంలో ఈ పని చాలా కష్టంగా వుంటుంది. నెత్తిమీద పెట్టుకున్న బుట్టలో నుంచి పియ్యిపెంట కారుతూ వళ్ళంతా చిందుతుంది. ఆ కంపు ఎంత భరించలేనిదిగా వుండేదంటే, ఆమె తనను తాను కత్తితో చెక్కుకుంటు శుభ్రం చేసుకోవాలనుకునేది. ఎంత శుభ్రం చేసుకున్నా గానీ ఆ వాసన నుంచి తప్పించుకోలేకపోయేది. దీనితో వర్షాకాలంలో ఆమెకు ఆకలి పూర్తిగా చచ్చిపోయేది. జుట్టు విప్పి మళ్ళీ ముడివేసుకుంటూ, 'ఈరోజుకీ ఆ కంపు ఇంకా నా జుట్టుని వదిలిపోలేదని నాకనిపిస్తుంది' అంది.

బహుశా ఇందుకే గావొచ్చు ఈ పనిచేసే ఆడవాళ్ళందరూ కూడా తలకు గాఢంగా సువాసన వచ్చే నూనెలను దట్టంగా పట్టిస్తారు. అలాగే సువాసనభరితమైన కిళ్ళీలను తింటారు. కమలేష్ లేచి నిలబడి చేయి వూపుతూ 'ఒక ఏడాది క్రితం నేను ఈ పని వదిలేశాను. కానీ ఆ కంపు మాత్రం ఇప్పటికీ నన్నొదిలి పోలేదు' అని చెప్పింది. యాభైఏళ్ళ తారో పుట్టిల్లు పానిపట్‌లో వుంది. తన పదేళ్ళ వయస్సులో బలవంతం మీద ఈ పని ప్రారంభించింది. గత నలభై ఏళ్ళుగా ఆమె పాకీపని చేస్తూనే వుంది. సంవత్సరం క్రితం సఫాయి కర్మచారి ఆందోళన పరిచయంతో అసహ్యం కలిగించే ఈ పని నుంచి బయటపడగలిగింది. ఈ విషయంలో ఎస్‌కెఏ చాలా మంది ఆడవాళ్ళకి సహాయం చేసింది. ఈ సంస్థ పరిచయం కాక ముందు ఈ అనాగరికమైన పనిని ఆపేయగలుగుతామని గానీ, ఈ సంకెళ్ళ నుంచీ బయటపడగలుగుతామని గానీ ఈ ఆడవాళ్ళెవ్వరూ కనీసంగా ఊహించలేదు. దీని గురించి తారో మాట్లాడుతూ చాలా చిన్న వయస్సులోనే ఈ బుట్టల్ని నెత్తిన మోసిన తనలాంటి ఆడవాళ్ళకి తాము వేరే పని ఏదైనా చేయగలుగుతామన్న ఆలోచనే రాదని చెప్పింది. అంతే కాకుండా ఈ పని వదిలేయమని సలహా చెప్పేవాళ్ళు కూడా చుట్టుపక్కల ఎవ్వరూ వుండరు. 'ఇదే మా జీవితం అనుకుంటూ రాత్రీ పగలూ అనే భేదం లేకుండా మేము ఈ పాకీపని చేస్తూనే వుండేవాళ్ళం. మేము ఈ పని చేయటానికే పుట్టామని మా అమ్మలు మాకు చెప్పారు.

'కుళ్ళికంపు కొడుతున్న ఈ తలరాతను ఎవరికి వాళ్ళమే మార్చుకోగలుగుతామని ఇప్పుడు భావించకూడదు.' ఆసక్తికరమైన ఒక విషయంతో తారో దానిని కలిపింది. 'నాపెళ్ళి కుదిరినప్పుడు, మా అమ్మ పెండ్లి పిల్లగాడు వాళ్ళను అడిగింది "మీరెన్ని ఇళ్ళు చేస్తారని"? లెక్కలు సూటిగానే వుంటాయి. ఎన్ని ఇళ్ళు ఎక్కువుంటే అన్ని రొట్టెలు ఎక్కువ వస్తాయి. కనీసం తమ కూతురు ఆకలితో చచ్చిపోకుండా వుంటుంది.' అందుకే, ఆడపిల్ల పెళ్ళి కుదర్చక ముందే పిల్లగాడు ఎన్ని ఇళ్ళ నుంచి సంపాదిస్తున్నాడనేది ఎంతో జాగ్రత్తగా లెక్కలు వేసుకునేవారు. అంటే పిల్లగాడి కుటుంబం ఎన్ని ఎత్తుడుదొడ్లను శుభ్రంచేస్తున్నదనే ఆ లెక్క. అవి శుభ్రం చేసినందుకుగానూ పిల్లగాడి కుటుంబానికి ప్రతిరోజూ కొన్ని రొట్టెలతో పాటు నెల చివర కొంత డబ్బు కూడా వస్తుంది. ఇదే వారి సంపాదన, పిల్లగాడి హోదాను కూడా నిర్ణయిస్తారు. దాని తర్వాతే తారో లాంటి అమ్మాయిల పెండ్లి నిర్ణయ

మౌతుంది. ఇంతకు ముందు లాగా పరిస్థితులు లేవని, చాలా వరకూ మెరుగైందని తారో ఒకింత గొప్పగానే మాకు చెప్పింది.

తారో లాగానే అక్కడ వున్న ఆడవాళ్ళందరు వాళ్ళ జీవితాల్లో ఒక మంచి మార్పు తీసుకురావటం కోసం కష్టపడుతున్నారు. వాళ్ళు ఇంకా పూర్తిగా ఈ నరకం నుంచి బయటపడలేదు. కానీ తమ భవిష్యత్ జీవితం ఏవిధమైన అవమానాలకు గురికాకూడదనే నిర్ణయంతో వున్నారు. తమ పిల్లలను చదివించటం కోసం రాత్రీ పగలూ కష్టపడుతున్నారు. తమ కూతుర్లు ఈ పనిలోకి రాకూడదనే ఉద్దేశంతో తమ శక్తికి మించి శ్రమిస్తున్నారు. తమదైనా ఆత్మగౌరవంతో వారంతా ఈ మాట చెప్పారు.

మీ ఇంటికొచ్చే కోడళ్ళ పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నతో వారందరి మధ్యా కాసేపు నిశ్శబ్దం నెలకొంది. ఉపనాయకురాలైన రెండో సరోజ్ కొంచెం ధైర్యం కూడదీసుకుని, 'నిజం చెప్పాలంటే నా కోడలు ఈ పని చేస్తోంది. కానీ నా కూతురు చేయటం లేదు' అని చెప్పింది.

మీ కోడలు పేరేమిటి?

'బీనా. ఆమెకు ముగ్గురు పిల్లలు.'

బీనా ఈ పని ఎందుకు చేయాల్సి వచ్చింది?

'ఏం! మేం అనేక ఏళ్ళ పాటు మా అత్తమామల కోసం ఈ పని చేయలేదా? నేనొక్కదాన్నే కాదు– చాలామంది కోడళ్ళు ఇదేపని చేస్తున్నారు. ఇల్లు గడవటం కోసం వాళ్ళు ఈ పని చేయవలసిందే, మా పొట్టకింత తిండికోసం. విముక్తి అంత తేలిగ్గా రాదు. దానికి ఎన్నో ప్రయత్నాలు అవసరం. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు కల్పించాలని తప్పకుండా రాయండి. ఆ తర్వాత చూడండి. ఎవ్వరూ ఈ కంపుగొట్టే బుట్టలను ముట్టుకోను కూడా ముట్టుకోరు.'

ఇదంతా జరుగుతుండగానే వరండాలోని ఆడవాళ్ళ సంఖ్య నలభైకి పెరిగింది. ప్రతి ఒక్కరికీ బాధల్ని దించుకోవటానికి, చెప్పుకోటానికి చాలా విషయాలున్నాయి. ఒక్కొక్కళ్ళు చెప్పే విధానమే వేరు గానీ ప్రతి ఒక్కరూ ఒకే రకమైన అవమానాల్ని, కోపాల్ని పంచుకుంటున్నారు. వారి మొదటి శత్రువు పియ్యితో నిండిపోయే బుట్ట; రెండో శత్రువు భర్తల, ఇంట్లో ఇతర మగవాళ్ళ తాగుడు వ్యవహారం; మూడోది. పిల్లలు విపరీతంగా మత్తు పదార్థాలకు అలవాటు పడటం.

ఈ అంశాలు ప్రస్తావనకు వచ్చేటప్పటికి, అప్పటివరకూ పెద్దగా సంభాషణలోకి రాని కోడళ్ళు మాట్లాడటం మొదలుపెట్టారు. 'ఇప్పటివరకూ కేవలం మేం ఈ పాకీ పని భారంతోనే వున్నాం. కానీ ఇప్పుడు ప్రతి గల్లీలో, వీధిలో ఈ మత్తుపదార్థాలు ఉపయోగించే వారితో చాలా నాశనమైపోతున్నాం' అని బీనా చెప్పింది. ఆ తర్వాత ఆమె నా చేయి పట్టుకుని బయటకు తీసుకెళ్ళి వీధి మలుపు వైపు చూపించింది. అక్కడ పిల్లలు మత్తుగా

పడుకుని జోగుతున్నారు. మేం తిరిగి వరండాలోకి తిరిగి వచ్చిన తర్వాత ఈ అలవాటువల్ల కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతున్నాయో ప్రతి ఒక్కరూ చెప్పారు. 'ఆ మత్తు మందులు కొనటం కోసం వాళ్ళు ఇళ్ళల్లో గిన్నెలు దొంగతనం కూడా చేస్తున్నారు. గ్రిల్‌లో పెట్టివున్న కూలర్లకు కూడా రక్షణ వుండదు. ఈ పరిస్థితిలో మేం ఏం చెయ్యగలుగుతాం? సారాతో భర్తలు, మత్తుమందులతో పిల్లలు....' తలమీద చెయ్యి పెట్టుకుని విచారంగా చెప్పింది బీనా.

అంతలో నాయకురాలు సరోజ్ ఇంటినుండి టీ, బిస్కట్లు వచ్చాయి. ఆ తర్వాత సీమా నాకో డాక్యుమెంట్ చూపించింది. గత కొన్ని సంవత్సరాలుగా మొత్తం అంబాలాలో దాదాపు 1100 మంది పాకీపని వదిలేశారని, కానీ అరవై నాలుగు మందికే కొత్త ఉద్యోగాలు వచ్చాయని దానిలో రాసి వుంది. కొంత మందికి ప్రభుత్వం రుణాలు ఇచ్చినట్లుగా కూడా వుంది. అయితే కొత్తగా ఉద్యోగాలు వచ్చిన అరవైనాలుగు మంది ఆడవాళ్ళలో, చాలమంది బద్ధకస్తులనే పేరుతో ఉద్యోగాల నుంచి తీసివేయబడ్డారు. ఇప్పుడు దాదాపు వాళ్ళందరూ ఖాళీగానే వున్నారు.

'మరి మీరంతా ఏం చేస్తారు' నేను ప్రశ్నించాను. 'వేరే ఏ పనైనా మేము చేస్తాము గానీ, తిరిగి ఆ నరకంలోకి మాత్రం వెళ్ళం' అని అందరూ ముక్తకంఠంతో అన్నారు.

సమావేశం అయిన తర్వాత నాయకురాలు సరోజ్ తన ఇంటికి నన్ను తీసుకువెళ్ళింది. భోజనం తయారయి వుంది. లోగొంతుకతో తినటానికేమైనా అభ్యంతరం వుందా అని నన్ను అడిగిందామె. నేను చిర్నవ్వు నవ్వాను. ఇప్పటివరకూ నా కొచ్చిన అనుభవం మేరకు టీ గానీ, భోజనం గానీ వద్దని చెప్పటం అనేది ఇక్కడ కుదరదు. భోజనం సాదాసీదాగా వుంది–పప్పుకూర, వేడి అన్నం, రొట్టెలు, కూరగాయల సాలడ్ కూడా వుంది. అన్నింటినీ సరోజ్ వాళ్ళ అమ్మాయి తయారు చేసింది. తను బ్యూటీ పార్లర్ కోర్సు పూర్తిచేసి ఇప్పుడు ఇంట్లోనే దానిని నడుపుకుంటోంది.

మరోవైపు నుంచి వచ్చిన తారో తాను కూరగాయలు, శెనగపిండి కలిపి కూరచేశానంటూ, 'ఇది బాగా కుదిరింది. మిరపకాయలు బాగా కారంగా వున్నాయని' చెప్పింది. కళ్ళు మూసి తెరిచేంతలోనే పక్కింటి నుంచీ కూర వచ్చేసింది. అది నిజంగా చాలా బాగుంది. దాన్ని ఎలా తయారుచేయాలో ఆమె నాకు ఒక వృత్తి నిపుణురాలివలె విపులంగా వివరించింది. మిరపకాయలు నిజంగా కారంగా వున్నాయి. 'సరోజ్ నీకు మామూలు భోజనమే తయారుచేస్తానని చెప్పింది కానీ నేను ఒప్పుకోలేదు. భోజనంలో ఉప్పు, కారం మంచిగా లేకపోతే ఇంకేముంటుంది దాంట్లో? జీవితం నిస్సారంగా వున్నట్లే' అని తారో అంది.

నేను తిరిగి వచ్చేస్తుంటే, ఈ మురికికూపం నుంచీ విముక్తి సాధ్యమవుతుందని, తాము విజయం సాధిస్తామని నేను నమ్ముతున్నానా అని అడిగారు. వారితో మేము చేతులు

కలిపి, 'తప్పకుండా అవుతుంది' అని చెప్పాం. తర్వాత తారో, కుషాల్ ఇద్దరూ కూడా 'మాకింకో దారి లేదు. మేం గెలిచి తీరాలి' అని చెప్పారు.

(ఆగస్టు 2010లో హర్యానాలోని అంబాలాకు వెళ్ళి వచ్చిన తర్వాత రాసిన వ్యాసం ఇది. పాకీవృత్తిలో వున్న ఆడవారి పునరావాసం కోసం అక్కడ ఇంకా ప్రయత్నిస్తూనే వున్నారు.)

# ఉత్తరప్రదేశ్




1. సహరాన్‌పూర్
2. ముజఫర్‌నగం
3. బిజ్‌నూం
4. బాగ్‌పట్
5. మీరట్
6. ఘజియాబాద్
7. జ్యోతిబాపూలేనగర్
8. మొరాదాబాద్
9. రామ్‌పూర్
10. బులంద్‌షహన్
11. బదౌన్
12. బరైలీ
13. పిలిభిత్
14. లఖిమ్‌మూర్ ఖేరి
15. అలీఘుర్
16. కస్‌గంజ్
17. షాజహాన్‌పూర్
18. సీతాపూర్
19. హత్రాస్
20. ఎధా
21. ఫర్రూఖాబాద్
22. హర్దోయ్
23. బారాబంకి
24. ఫిరోజాబాద్
25. మెయిన్‌పురి
26. కన్నౌజ్
27. లక్నో
28. ఫైజాబాద్
29. ఎత్వాహ్
30. కాన్పూర్ దేహత్
31. కాన్పూర్ నగర్
32. ఉన్నావో
33. గోరఖ్‌పూర్
34. జలౌన్
35. ఫతేపూర్
36. మాయు
37. బల్లియ
38. ఘూజిపూర్
39. అలహాబాద్
40. బందా
41. హమీర్‌పూర్
42. ఝూన్సీ

ఉత్తరప్రదేశ్‌లోని దాదాపు సగం జిల్లాలలో ఇప్పటికీ పాకీ పని కొనసాగుతోంది.

**ఉత్తరప్రదేశ్**

**'తప్పంతా ప్రభుత్వానిదే. ఒకపక్క మురుక్కాలువలూ (సివర్స్) ఏర్పాటు చేయదు. ఇంకోపక్క మాకు ఏవిధమైన పునరావాసం కల్పించదు'**

ప్రతి ప్రాంతంలోనూ ఈ పనికి ఒక ప్రత్యేకమైన పేరు వుంటుంది. ఈ పదాల అర్ధాలన్నీ ఆయా సమూహాల సాంస్కృతిక నేపథ్యంతో ముడిపడి ఉంటాయి. ఆ నేపథ్యం తెలుసుకోకుండా అవి ఏమి సూచిస్తున్నాయో అర్ధం చేసుకోవటం అంత సులభం కాదు. అలాంటి రెండు పదాలను నేను కాన్పూర్‌లో విన్నాను. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వాణిజ్య నగరం కాన్పూర్. ఒకప్పుడది ఆసియా ఖండానికి మాంచెస్టర్‌గా పేరు పొందింది. కాన్పూర్‌లో ఎత్తుడుదొడ్ల (డ్రై లెట్రిన్ల)ను 'కమామ్–వాలీ లెట్రిన్' లేదా సంపాదన ఇచ్చే పాకీదొడ్లు అంటారు. వీటిని శుభ్రంచేసే ఆడవారిని 'బాల్టీ–వాలీస్' లేదా బక్కెట్ ఆడ వాళ్ళు అంటారు. ఈ పదాలను అర్ధం చేసుకునే క్రమంలో నా తలలో ఒక తుఫానే చెలరేగింది. అధికార పరిభాషలో 'స్వచ్ఛకార్' లేదా శుభ్రం చేసే వాళ్ళు అని అంటారు. మనుషుల పియ్యిపెంటని చేతులతో ఎత్తి శుభ్రం చేస్తూ, ఈ మధ్యయుగాలనాటి అమానవీయమైన పనిని నిర్బంధంగా కొనసాగిస్తున్న ఈ వృత్తి స్వభావాన్ని తేలికపరిచి చూపించాలని చేసే ప్రయత్నంలో భాగమే ఈ పవిత్రమైన పేరు. ఈ పని స్వభావంలోనే ఇమిడివున్న అన్యాయాన్ని, చేదు వాస్తవాన్ని దాచివుంచే ప్రయత్నాలే ఈ అర్ధాలంకారాలు. వాస్తవంగా చెప్పాలంటే సమస్య తీవ్రతను గుర్తించ నిరాకరించే ప్రయత్నం. కానీ ఇది సంవత్సరాల తరబడి కొనసాగుతున్న చేదు నిజం.

కాన్పూర్‌లో ముస్లిం మతస్తులు నివసించే సుజత్‌గంజ్ ప్రాంతంలో నేను 'బాల్టీ–వాలీ' శాంతిని కలిశాను. కాన్పూర్‌లో బాగా వెనుకబడిన ప్రాంతాలు ఇవి. ఇక్కడే ఎత్తుడుదొడ్లు చాలా వున్నాయి. అభివృద్ధి ఛాయలుగా చెప్పుకునే రోడ్లుగానీ, డ్రైనేజి వ్యవస్థగానీ ఇక్కడలేవు. ఆధునికతకు సూచికలుగా కనిపించేవి కేవలం టెలివిజన్లు, పెప్సీ సీసాలు. నిజానికి 60 శాతం కాన్పూర్ నగరానికి మురుగునీటి సరఫరా వ్యవస్థ లేదు. రెండు మూడు కాలనీల్లో దాదాపు నిష్ప్రయోజనకరమైన మూడు నాలుగు గంటల వెతుకులాట తర్వాత నేను శాంతిని కలుసుకోగలిగాను. ఆ ప్రాంతంలో దీనికి సంబంధించి ఉపయోగించే పదజాలం నాకు తెలియకపోవటంతో నేను పాకీ పనివారి గురించి వాకబుచేయడం సమస్య అయింది. నిజానికి కాన్పూర్‌కి వచ్చిన తర్వాతే నేను ఒక విలువైన పాఠాన్ని నేర్చుకున్నాను. స్థానిక పదాలు, భాష గురించి అవగాహన లేకపోతే మనకున్న పుస్తక జ్ఞానం ఎందుకూ కొరగాకపోవటమే గాక, నిజానికి అది ప్రతికులంగా కూడా పనిచేస్తుంది. చాలా మొహల్లాలలో, టీ దుకాణాల్లో, ఢాబాల్లో, ఇళ్ళల్లో, వీధుల్లో – నేను ఎత్తుడుదొడ్ల గురించి, పాకీ పనివారి గురించి, రేకుడబ్బాలను మోసే జనం గురించి అడిగినప్పుడు ప్రతి ఒక్కరూ తెలియదని తలవూపుతూ నేను అడుగుతున్నదేమిటో తెలియట్లేదన్నారు. 2003లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ తన రిపోర్టులో ప్రస్థావించిన అన్ని ప్రాంతాలలో నేను ఒక రోజంతా తిరిగినా గానీ నాకు కనీసపాటి సమాచారం లభించలేదు. బాగా అలసటతో పాటు నాకు కొంచెం ఆందోళన కూడా కలిగింది.

అప్పుడు వాల్మీకి కాలనీలో వుండే ఒక ముసలామె, 'చేతులతో శుభ్రం చేసేవారి గురించా నువ్వు వెతుకుతున్నావు?' అని అడిగింది. అవునని చెప్పాను. కానీ ఆ ముసలామె వెంటనే ఏమి తిరుగు సమాధానం ఇవ్వలేదు.

'నేను వారిని ఎక్కడ కలుసుకోగలుగుతానో చెప్పండి' అని మళ్ళీ మళ్ళీ అడిగాను.

'ఎందుకు? నువ్వెందుకు వారిని కలవాలనుకుంటున్నావు? వాళ్ళేమీ నీకు దూరపు బంధువుల్లాగా అనిపించట్లేదే, మరి ఎందుకు ....? నువ్వు వారి గురించి ఒక కేసు తయారుచేస్తావు. దానిని నమోదుచేసి ఢిల్లీలో మీ ఆఫీసులో చూపిస్తావు. అంతేనా? మేమేమీ జంతువులం కాదు!' అని చెప్పింది.

నేనేమీ మాట్లాడలేకపోయాను. ఇంతకుముందు కూడా నా కులం గురించి ప్రశ్నలు, నా ఉద్దేశాల గురించి అనుమానాలు వ్యక్తమైన సందర్భాలున్నాయి. వాటిని ఒక రకంగా అర్థంచేసుకోవచ్చు కానీ ఈ ముసలామె అడిగిన ప్రశ్న నా అస్థిత్వాన్నే యాసిడ్‌లాగా మండించింది. దీనికి సమాధానంగా నేను చెప్పగలిగిందొక్కటే 'మీరు చెప్తున్నదంతా సరైందే. కానీ నేను ఇక్కడికి నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాలేదు. నేను ఒక జర్నలిస్టును. ఈ విషయం గురించి పని చేస్తున్నాను. అందుకే వీరిని కలవాలనుకుంటున్నాను' అన్నాను.

ఆ ముసలామె కిళ్ళీ నములుతూ, 'నువ్వు కొంచెం వేరుగా వున్నావు అని నాక్కూడా అనిపించింది; లేకపోతే నీ తరపున వేరేవాళ్ళు వచ్చి వుండేవాళ్ళు తప్పించి, నువ్వే వచ్చి వీధుల్లో తిరగాల్సిన అవసరం లేదు కదా. వారి గురించి వెతికే ముందు నాదో మాట చెప్తాను. ఇక్కడ వారినేమంటారో ముందు తెలుసుకో. నువ్వు వెతుకుతున్న దానిని ఇక్కడ "కమాయి–వాలీ పాయిఖానా" అంటారు. వాటిని శుభ్రం చేసేవారిని "బాల్టీ–వాలీస్" అంటారు. నువ్వు పాకీపని వాళ్ళ గురించి వెతుకుతున్నట్టున్నావు. ఇంగీషులో వారి గురించి చదివి వుంటావు' అంటూనే ఆమె పగలబడి నవ్వింది. నేను కూడా ఆమెతో కలిసి నవ్వసాగాను. ఆ తర్వాత ఆమె తన కొడుకు రాజుని పిలిచి శాంతి దగ్గరికి తీసుకుపొమ్మని చెప్పింది.

నిండిన బక్కెట్ అప్పటికే కాలవ మీద వుంది. చీపురును పక్కనపెట్టి, కిళ్ళీ నములుతూ శాంతి, 'నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచీ ఇదే పని చేస్తున్నాను. నాకిప్పుడు యాభై ఐదేళ్ళు. బహుశా మొదటిసారి బకెట్టు, చీపురు పట్టుకునేటప్పటికీ నాకు ఐదేళ్ళు ఉంటాయి. మా దాంట్లో ప్రతి ఒక్కళ్ళూ ఇదే పని చేస్తారు. కానీ నేను నా కూతుర్ని ఈ మురికి పని చేయనివ్వను. తను చదువుకుంటోంది' అని చెప్పింది.

'ఎంత సంపాదిస్తావు' అని అడిగానామెను.

'రోజూ ముప్ఫై– ముప్ఫై ఐదు ఇళ్ళల్లో వున్న ఈ పాకీదొడ్లను శుభ్రం చేస్తాను. నెలకు రూ. 1500/– దాకా సంపాదిస్తాను. ప్రతి ఇంటి నుంచీ ముప్ఫై లేదా నలభై వస్తాయి. చాలా సార్లు అప్పు మీద కూడా పని చేస్తాను.'

'అప్పా?' నేను ఆశ్చర్యపోయాను.

ఆ ప్రాంతంలో నివసించే వారందరూ పేదరికంతో ఇబ్బంది పడుతున్న వారే అని శాంతి వివరించింది. చాలామంది ఉద్యోగాలు పోగొట్టుకొని ఖాళీగా ఇళ్ళల్లో వుంటున్నారు. కొంత మందికి తినటానికి కూడా సరిగ్గాలేదు. 'ఇలాంటి పరిస్థితుల్లో నేను కొన్ని ఇళ్ళనుంచే ప్రతి నెలా డబ్బు అందుకో గలుగుతాను. మిగిలిన వాళ్ళు కొంచెం ఆర్థికంగా కుదుటపడ్డాక అప్పటిదాకా నాకివ్వాల్సింది ఇచ్చేస్తారు' అని చెప్పింది. ఈ అంశంతో నాకొక కొత్త కోణం కనిపించింది. నేను వెళ్ళిన ఇతర ప్రాంతాలలో పాకీపని చేసే ఆడవాళ్ళకి తాము ఎవరి ఇళ్ళలోనయితే పాకీదొడ్లు శుభ్రం చేస్తున్నారో ఆ ఇళ్ళలోని వారితో ఒక ఘర్షణ పూర్వక సంబంధం వుండేది. కానీ నేను శాంతితో కలిసి మొహల్లాలోని ఇళ్ళకు ఒకదాని తర్వాత ఇంకోదానికి వెళ్ళినప్పుడు, ఆమె సంపాదనకు ఆలంబనగాఉన్న పాకీదొడ్లు వున్న ఇళ్ళలోని బుర్ఖా స్త్రీలు ఆమెతో చాలా స్నేహపూరితంగా, దాదాపు తమ సమానస్తురాలుగా పరిగణించటాన్ని గమనించాను. వారి సంభాషణంతా కూడా ఒకరి క్షేమ సమాచారాలు ఒకరు తెలుసుకోవటం లేదా ఎవరి పిల్లలు ఎక్కడ చదువుకుంటున్నారో తెలుసుకోవటంగా వుండేది. ఇది గమనంలోకి రావడంతో నేను ఆశ్చర్యపోయాను.

'వీళ్ళపట్ల నీకు కోపంగా అనిపించదా?' అని నేను అడిగాను

'వాళ్ళే పలు సమస్యల్లో వున్నారు. వాళ్ళు పేదవాళ్ళు – వాళ్ళకి డబ్బులేదు ఫ్లష్ టాయిలెట్ కట్టించుకునే స్తోమతా లేదు. ఆ ఇళ్ళన్నీ చాలా చిన్నవి. **తప్పంతా ప్రభుత్వానిదే. ఒకపక్క మురుక్కాల్వలూ (సివర్స్) ఏర్పాటుచేయదు. ఇంకోపక్క మాకు ఏవిధమైన పునరావాసం కల్పించదు'** అని శాంతి చెప్పింది.

ఆమె ఎదుర్కొంటున్న వివక్ష గురించి అడిగాను.

దానికి పదునైన గొంతుతో శాంతి సమాధానం ఇచ్చింది. 'దీని గురించి కూడా అడగాలా! జనం మమ్మల్ని చూసిన మరుక్షణం "పక్కకు జరగండి! దారి ఇవ్వండి" అంటారు. సూటిగా చెప్తాను వినండి – మేము ఈ చెత్త పాకీపని చేస్తాము. ఎవరు మాకు దగ్గరగా రావాలనుకుంటారు? నేను నా జీవితమంతా ఈ పాకీ పనిలోనే గడిపాను. నాకు ఈ రోజుకి కూడా ఈ పనంటే అసహ్యమే. ఈ పని చేస్తున్నప్పుడు నాకు వికారంగా వాంతి వస్తున్నట్లుగా వుంటుంది. మా చర్మం మొత్తం వలిచేసుకోవాలని తరచూ అనిపిస్తుంటుంది' అన్ని చెప్తున్నప్పుడు శాంతి కళ్ళు తడిబారాయి.

అప్పటికి మేము మొహల్లా చివరికి వచ్చాము. అక్కడే ఈ బాల్టీ–వాలీలు తమ బుట్టల్లోని ఆ పియ్యిపెంటంతా పారబోసి తమ చేతులు, కాళ్ళను కుడుక్కుంటున్నారు. మొహల్లాలో పనిచేసే ఇతర బాల్టీ–వాలీలను నేను అక్కడే కలుసుకున్నాను. రాణి, కళావతి, లాల్టీ, కేసర్. ఆ రోజుకి ఇంకా ముప్పై–ముప్పైఐదు ఇళ్ళు ఇంకా మిగిలి వున్నాయని వాళ్ళు చెప్పారు. నలభై ఐదేళ్ళ లాల్టీ ఇప్పుడు తమకు ఎక్కువ పని వుండటం లేదని చెప్పింది. ఈ వెసులుబాటు ప్రభుత్వం కల్పించిన ఏ పథకం వల్లో జరిగింది అనుకుంటే

పొరపాటే. నిజానికి ఇక్కడ ప్రజల పేదరికం ఏ స్థాయికి పెరిగిపోయిందంటే, వాళ్ళు తమ మరుగుదొడ్లు శుభ్రం చేయించుకోవటానికి నెలకు రూ.30–35లు ఇచ్చుకోలేని పరిస్థితిలో వున్నారు. టాయిలెట్ పలకలను పెట్టించుకుని నేరుగా వాటిని బయటవున్న మురుగుకాల్వలకు కలిపేస్తున్నారు. అయితే దీనివల్ల మరిన్ని సమస్యలు వస్తున్నాయి. ఎందుకంటే ఈ పియ్యిపెంటంతా వీధుల్లో ప్రవహిస్తూ వుండి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయటం సమస్యగా మారుతోంది.

ముందుగా నేను ఊహించిన దానికి విరుద్ధంగా ఈ బాల్టీ–వాలీలు తమ బాధను, కోపాన్ని గొంతు విప్పి వివరించి చెప్తున్నారు. ఏ రకమైన జంకూ లేకుండా మధ్య మధ్యలో నవ్వుతూ వాళ్ళు మాట్లాడారు. నిజానికి తమ జీవితమంతా ఈ నరకంలోనే వున్నామనే బాధని ఎక్కడా కనపడనీయలేదు.

ప్రతి రాష్ట్రంలోనూ ఈ పాకీదొడ్లు భిన్నంగా వున్నాయి. అలాగే ఈ ఆడవాళ్ళు పనిచేసే విధానం కూడా. కాన్పూర్‌లో బాల్టీ–వాలీలు తమ బక్కెట్లలో బూడిదను తీసుకెళతారు. దానిని పియ్యిపెంట మీద జల్లి, ఆ తర్వాతే రెండు రేకు ముక్కల సాయంతో దానిని బక్కెట్లలోకి ఎత్తుతారు. ఈ పనంతా చేసేటప్పుడు తమ చీరకొంగుతో ముఖం చుట్టూ కట్టుకుంటారు. అలాగే చీరలుపాడయి పోకుండా వుండటానికి చాలాపైకి కట్టు కుంటారు.

ఇక్కడ ఎత్తుడుదొడ్లను 'కమాయీవాలీ పాయిఖానా' అని ఎందుకంటారని వారిని అడిగాను. కొద్ది నిమిషాలు దీని గురించి ఆలోచించిన తర్వాత అందరూ దాదాపు ఒకే రకమైన సమాధానం ఇచ్చారు. 'అదే, మాకు వీటిని శుభ్రం చేసినందుకు డబ్బులు వస్తాయి కదా? ఫ్లష్ టాయిలెట్లను వాళ్ళే కడుక్కుంటారు.'

'అయితే ఈ పదం పాతది కాదన్న మాట?' అని ప్రశ్నించాను.

'అదంతా మాకు తెలియదు. మేము ఈ పని మొదలు పెట్టిందగ్గర్నుంచీ వీటిని 'కమాయి–వాలీ పాయిఖానా' లనే అంటున్నారు. మా అమ్మలు కూడా ఇదే పదం వాడేవారు. అంతకు ముందు వీటిని ఏమనేవారో మీకు బాగా తెలిసే వుండాలి.'

'కేవలం ఆడవాళ్ళే ఈ పాకీపని ఎందుకు చేస్తారు?,

'ఈ ప్రాంతంలో వున్న ఆడవాళ్ళు కచ్చితంగా పర్దా పాటిస్తారు. పియ్యిపెంటని ఎత్తివేయటానికి కూడా మగవాళ్ళని ఇళ్ళలోకి రానియ్యరు. దాంతో దానిని శుభ్రం చేయటం మా పని అయింది.'

బకార్‌మండి, చామన్‌గంజ్, కంఘి మొహల్లా, బాన్ నుండి, మురాదన్ కా హాటా, మైసియా హాటా, తుక్‌నియా పూర్వ, బాకోన్‌గంజ్, హడ్డి గుంజామ్, గ్వాల్‌టోలి, షీషామవ్, బేగంపూర్వ, కాపర్‌గంజ్, ప్రేమ్‌నగర్ ఇలా కాన్పూర్‌లో ముస్లింలు అధికంగా వున్న ప్రాంతాలలో ఈ పరిస్థితి సర్వసాధారణం. ఈ ప్రాంతాలలో ఎత్తుడుదొడ్లు వారి జీవితాల్లో

భాగం. అంతకుముందు నేను వెళ్ళినప్పుడు కన్నా ఇక్కడ వాటి సంఖ్య ఎక్కువగా కనిపించింది.

ఈ ప్రాంతాలలో నివశించే పలువురు స్త్రీలతో నేను మాట్లాడాను. సుజత్‌గంజ్‌కి చెందిన షీనా కావొచ్చు లేదా మురాదన్ కా హాటా నుంచి వచ్చిన ఫాతిమా కావొచ్చు. ఎవరైనా కానీ వుండేది ఒక చిన్న గదిలోనే. అది కూడా ఎవరైనా దాన్ని గది అనాలనిపిస్తేనే. అలాంటి వాటిలో ఎంతో మంది వుండటమనేది నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. వీరి ఇళ్ళలో పాకీదొడ్డి అనేది ఒక కర్టెన్‌తో మూసి వుంటుంది. సరిగ్గా కూర్చోవడానికి తగిన స్థలం కూడా వుండదు అక్కడ. ప్రకృతి సహజమైన అవసరం కోసం కాళ్ళు పెట్టుకుని కూర్చోవడానికి వీలుగా ఆ పాకీదొడ్డిలో రెండు రాళ్ళు తప్పనిసరిగా వుంటాయి. అదే గదిలో కొంత భాగాన్ని కర్టెన్‌తో వేరు చేసి వంటగదిగా వాడతారు. షీనా వాళ్ళింట్లోని ఎత్తుడుదొడిని చూపిస్తూ, 'జనాలు కూడా ఈ పాకీదొడ్లను ఉపయోగించటానికి అలవాటు పడిపోయారు' అని బాల్టీ–వాలీ గీత చెప్పింది.

స్థలం పరిమితితో పాటు ఇళ్ళు చాలా ఇరుకుగా వుండటంతో ఇక్కడ ప్రభుత్వ పథకాల ద్వారా ఇంకుడు గుంతల్ని కానీ ఫ్లష్ టాయిలెట్లను కానీ కట్టటమనేది జరగలేదు. నేను షీనాతో మాట్లాడినప్పుడు తమ కుటుంబం కొత్త పాకీదొడ్డి కట్టించటానికి రూ. 3,000/– ఇవ్వాలన్నారని, కానీ ప్రభుత్వం కేవలం రూ. 2,340/–లే ఇస్తోందని ఆమె చెప్పింది. ఆమె కుటుంబం ఆర్థిక పరిస్థితి గానీ, చుట్టుపక్కల వారి ఆర్థిక పరిస్థితి గానీ ఒకేసారి రూ. 3,000/–లు భరించగలిగిన స్థాయిలో లేదు. ఇలాంటి స్థితిలో కూర్చోవడానికి ఒక పీట లాంటిది ఏర్పాటు చేసుకుని, విసర్జన అంతా మురుక్కాలవకు కలిసేలా ఏర్పాటు చేయగలగటమే మార్గమేమో అనిపిస్తుంది. నిజానికి ఇలాంటి పీటలు అన్ని ఇళ్ళల్లోనూ వున్నాయి. ఎక్కడా ఎత్తుడుదొడ్లు లేనే లేవు.

ఈ ఇళ్ళను ఒకసారి పరిశీలిస్తే గుండె బరువెక్కుతుంది. ఇలాంటి అసహ్యకరమైన విధానం ఇప్పటికీ అమలవటానికి కేవలం కులపరమైన వివక్షే కాకుండా, ఆర్థికపరమైన వ్యత్యాసాలు, అభివృద్ధి పేరుతో చేపట్టిన తప్పుడు విధానాలే కారణం. వాస్తవానికి నేను ఈ నగరంలో కలిసిన బాల్టీ–వాలీ లెవరికీ కూడా ప్రభుత్వం తమ పునరావాసం కోసం ఒక పథకాన్ని ప్రవేశపెట్టినట్టు గానీ, దాని ద్వారా తాము రుణం తీసుకోవడానికి అవకాశం వుందని కూడా తెలియదు.కొద్దిమందికి మాత్రం వారి కుటుంబంలోని మగవారి వల్ల తెలిసింది. కాన్పూర్‌లో 2006 వరకు రూ.227.80 లక్షలకు పైగా సొమ్మును పాకీ పనివారి పునరావాసం కోసం, ఎత్తుడుదొడ్లను తీసివేయడం కోసం ఖర్చుపెట్టినట్టు ప్రభుత్వ అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. అయినా గానీ వీరికి ఏ మాత్రం ఆ విషయం గురించి తెలియకపోవటాన్ని గమనంలోకి తీసుకోవాలి.

ఈ సందర్భంగా సఫాయి కర్మచారి ఆయోగ్ మాజీ ఛైర్‌పర్సన్ పన్నాలాల్ తాంబేను కలవటం బాగా ఉపయోగపడింది. ఇతని హయాంలో సఫాయి కర్మచారి ఆయోగ్ పాకీపనివారి సవివరమైన గణాంకాలను సేకరించి ఒక నివేదికను తయారు చేశారు. పన్నాలాల్ తన కుటుంబంతో సహా వాల్మీకినగర్‌లోనే నివసించేవాడు. అతని ప్రభావం ఆ కాలనీఅంతా బాగా కనిపిస్తుంది. ఎక్కడా తెరిచివుండే మురుక్కాలవలు గానీ, ఎత్తుడుదొడ్లు గానీ కనిపించలేదు. తన మనమడు సోనీతో కలిసి కూర్చుని వున్న ఆయన మాట్లాడటం మొదలుపెట్టి, 'ఈ మురికిని అంతమొందించగలిగినప్పుడే ఎత్తుడుదొడ్లను రూపుమాపగలుగుతాం. ఎందుకని దీనికోసం ప్రభుత్వం ఏమీ చేయదు? నిజానికి సర్కారుకి ఈ పనిచేయటం ఇష్టం లేదు. అందుకే అది నిర్మూలన కావటం లేదు. ఈ ఆటవిక స్థితిని రూపుమాపటానికి మొత్తం వ్యవస్థ ఏ మాత్రం ప్రయత్నం చేయటం లేదు. స్వతంత్రం వచ్చిన తర్వాత దేశంలో పరిస్థితులు మారాయి. కానీ, జంతువులకంటే హీనంగా మనుషులను పరిగణించే ఈ అమానవీయమైన వృత్తి ఇంకా కొనసాగుతోంది. దీని వెనుక ఎన్ని కారణాలు వున్నా ఒక ప్రధాన కారణం మాత్రం కులవ్యవస్థ. ప్రణాళికా విధానంలో కూడా కులపరమైన ఆలోచనలు కొనసాగుతున్నాయి. అందుకే లక్షలాది మంది మహిళలు ఇప్పటికీ తమ తలలమీద పియ్యిపెంటతో నిండివున్న బక్కెట్లను మోస్తూనే వున్నారు. లేకపోతే.......' అంటూ పన్నాలాల్ గట్టిగా ఊపిరి పీల్చుకుని ఒక చిన్నవిరామం ఇచ్చాడు. తర్వాత కొనసాగిస్తూ, 'జాతీయ సఫాయి కర్మచారి ఆయోగ్ కూడా ఇతర ప్రభుత్వ విభాగాల్లాగానే అంత క్రియాశీలకంగా లేదు. దీని కోసం కోట్లాది రూపాయలు మంజూరవుతున్నాయి. కానీ, పాకీ పనివారు మాత్రం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను పొందలేక పోతున్నారు. బాల్టీ-వాలీలందరూ ఈ నరకం నుంచి పూర్తిగా విముక్తమయ్యేంత వరకూ అభివృద్ధి పేరుతో చెప్తున్నవన్నీ శుద్ధ అబద్ధాలుగానే మిగిలిపోతాయి' అన్నాడు. ఈ అంశం మీద పన్నాలాల్‌కు అపారమైన పరిజ్ఞానం వుంది. తన దగ్గరన్న ఫైళ్ళను ఒకదాని తర్వాత ఒకటి చూపిస్తూ అవసరమైన వివరాలను చెప్తూ వచ్చాడు. 'నా మనుషులు' అంటూ ప్రేమగా సంబోధిస్తున్న అతని మాటల్లో వీరిపట్ల వున్న సానుభూతి, బాధ గాఢంగా వ్యక్తమయ్యాయి.

ఇతర రాష్ట్రాలలో లాగానే సుప్రీంకోర్టులో వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సమాధానంగా ఒక తప్పుడు నివేదికను స్థానిక ప్రభుత్వ యంత్రాంగం సమర్పించింది. కాన్పూర్ మున్సిపల్ కమీషనర్ అరవింద్ సింగ్ అక్టోబరు 31, 2005 నాడు ఈ కింది విధంగా అఫిడవిట్‌ను సమర్పించాడు: 'మున్సిపల్ కౌన్సిల్ పనిచేస్తున్న ప్రాంతాలలో పాకీపని పూర్తిగా నిర్మూలించబడింది. ఈ విధానం ఇంక ఎంత మాత్రమూ అమలులో లేనందున ఈ విషయమై ఏవిధమైన చలాన్ (అపరాధం) కట్టవలసిన అవసరం లేదు.'

వాస్తవమేమంటే, ఎలాగైతేనేం అప్పటివరకూ 115 ఎత్తుడుదొడ్లను కాన్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ధ్వంసం చేయగలిగింది. అలాగే 164 కేసులను పెట్టి కొంతమంది మనుషులను జైలుకి కూడా పంపించింది. ఈ విషయాలన్నీ కూడా మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా నగరాభివృద్ధి యంత్రాంగం (డియుడిఎ) కాగితాల్లో నమోదు అయివున్నాయి. అందుకే సుప్రీంకోర్టు ఈ తప్పుడు నివేదికలను ఆమోదించకపోగా మార్చి 2006 లోగా సమగ్ర సర్వేరిపోర్టును పంపించాలని ఆర్డర్ పంపింది. ఇది అధికార యంత్రాంగంలో కొంత గాభరాను పుట్టించింది. దాని తర్వాతే 11 జనవరి కల్లా సర్వే ఆధారిత రిపోర్టును ఇవ్వాలని డియుడిఏను అడగటం జరిగింది.

ఈ అంశంమీద ఎవరు ఎంత పనిచేశారో తెలియదు గానీ, వాస్తవానికి ఈ పాకీపని నిర్మూలన కోసం ఉద్దేశించబడిన పథకాలు ఈ బాల్టీ–వాలీలకు అందటం గానీ, కుళ్ళికంపు గొడుతున్న ఈ నరకం నుంచి వాళ్ళు విముక్తమవటం అనే సూచనలు గానీ ఏమీ కనిపించలేదు. బాల్టీ–వాలీలెవరూ కూడా వాళ్ళ పిల్లలు ఈ దుర్మార్గమైన పనిలోకి దిగటానికి ఇష్టపడటం లేదు. అలావారు రాకుండా వుండటంకోసం మరింత కష్టపడుతున్నారు. కానీ ఇది ఒక క్లిష్టమైన పరిస్థితి. ఎందుకంటే వారి పిల్లలను బడికి పంపించటానికి డబ్బు ఎక్కువ సంపాదించాలి. దీనికోసం 'ఈ కమాయి–వాలీ పాయిఖానా'లను శుభ్రం చేస్తూనే వుండాలి. ఇంతకుమించి వీరికి వేరే ప్రత్యామ్నాయం అంటూ ఏదీ అందుబాటులో లేదు మరి.

(ఈ వ్యాసం 2005లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కి వెళ్ళినపుడు చూసిన వాస్తవాల ఆధారంగా రాసింది. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో కొంత మార్పు వచ్చినప్పటికీ, కాన్పూర్‌లో పాకీ పని మాత్రం కొనసాగుతూనే వుంది.)

# గుజరాత్




1. అహమ్మదాబాద్ 2. సబర్‌కాంత

గుజరాత్ రాజధాని గాంధీనగర్‌తో పాటు అహమ్మదాబాద్ నగరం చుట్టుపక్కల కూడా పాకీ పని కొనసాగుతోంది.

## గుజరాత్

**'అరవయ్యేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా పాఠశాలల్లో పాకీదొడ్లు కడగమని ఇంకా మమ్మల్ని అంటూనే వున్నారు.'**

మహాత్మాగాంధీ పుట్టిన రాష్ట్రం ఇప్పుడు ఒక 'నిర్మల్‌ప్రదేశ్'–ఒక పవిత్రమైన రాజ్యమని, అక్కడ పాకీపని కొనసాగటం లేదని గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడి (ఇది 2006 నాటి సంగతి, ప్రస్తుతం ఆయన భారత ప్రధానమంత్రి) అతని ప్రభుత్వం సుప్రీంకోర్టు సహా ప్రతిచోటా చెప్పుకుంటున్నారు. పాకీపనిపై సుప్రీంకోర్టులో వేసిన ప్రజాహిత వ్యాజ్యానికి (పిల్) సమాధానంగా 'నగర ప్రాంతాలలో ఎక్కడా గానీ ఈ ఎత్తుడుదొడ్లు లేవు కాబట్టి, ఈ పని విధానం ఏ రూపంలో కూడా ఈ రాష్ట్రంలో కొనసాగటం లేదు' అని 2004లో గుజరాత్ ప్రభుత్వం చెప్పింది. భారత ప్రభుత్వం ఈ మాటని విశ్వసించి ఈ రాష్ట్రాన్ని పాకీ పని కొనసాగని రాష్ట్రంగా ప్రకటించింది.

కానీ 2006–2009 మధ్యలో ప్రభుత్వం చెప్పిన ఈ అంశాల మీద పరిశోధన చేస్తే భిన్నమైన వాస్తవం వెలుగులోకి వచ్చింది. అది అభివృద్ధి జపం పాటిస్తున్న గుజరాత్ నిజస్వరూపాన్ని చూపిస్తుంది.

ఈ కింది రెండు పరిస్థితులను గమనంలోకి తీసుకుందాం;

**దృశ్యం ఒకటి :**

2007 ఆగస్టు 15. కొంతమంది పిల్లలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నారు. కానీ స్వాతంత్ర్యం అనే అర్థం గానీ, వేడుకలు అనే దాని పరమార్థం కానీ ఈ పిల్లలకు వర్తించదు. కేవలం ఈ పిల్లలు మాత్రమే కాదు. అహమ్మదాబాద్‌కి రెండు గంటల ప్రయాణ దూరంలో (దగ్గర దగ్గర 120 కిలోమీటర్లు) వున్న రాణ్‌పూర్ వీధుల్లో రాష్ట్రంలోని ఒక ప్రత్యేకమైన సమూహంలో అలజడి నెలకొని వుంది. పిల్లలు, ఆడవాళ్ళు, మగవాళ్ళు తమ చేతులకు, తలలకు నల్ల బ్యాడ్జీలు కట్టుకుని, చేతుల్లో పోస్టర్లు పట్టుకుని వున్నారు. ఆ బ్యాడ్జీలన్నిటి మీదా పాకీపని నుంచి స్వాతంత్ర్యం కావాల్సిన రోజు అని రాసి వుంది: అలాగే ఆ పోస్టర్లలో 'శుభ్ర గుజరాత్ వాస్తవ రూపం పాకీపని' అని, 'పాకీ పని గుజరాజ్ కి సిగ్గు సిగ్గు' అని సందేశాలు రాసి వున్నాయి. ఒక భిన్నమైన స్వాతంత్ర్యం కోసం ఈ ప్రజలు వీధుల్లోకి గుంపుగా వచ్చారు. గుజరాత్‌లో పాకీపని నిర్మూలనలో డొల్ల ప్రకటనలను బట్టబయట చేసే క్రమంలో ఈ ఊరేగింపుని నవ్‌సర్జన్ ట్రస్టు నిర్వహించింది.

**దృశ్యం రెండు :**

పలియాడ్ గ్రామంలో ఒళ్ళో నెలన్నర పాపాయిని పడుకోబెట్టుకుని, జారిపోతున్న కొంగుని తలమీదికి లాక్కుంటూ పల్లవిబెన్ కొంచెం బిడియంగా, ఇబ్బందిగా కూర్చుని వుంది. 'నాకు చాలా బాధ అనిపించింది. అందుకే మళ్ళీ ఇలా జరుగుతోంది' అని అన్నది. మాట్లాడుతున్నప్పుడు కారుతున్న కన్నీళ్ళని చీర కొంగుతో తుడుచుకుంటోంది. దగ్గరలో నిలబడి వున్న ఆడవాళ్ళ వైపు చూపిస్తూ, 'నిజంగా, నేను వాస్తవమే చెప్తున్నాను. మీరు ఎవరినైనా అడొగొచ్చు. ప్రసవం అయి పది రోజులన్నా కాకుండానే నేను పనిలోకి వెళ్ళాల్సి వచ్చింది. ఈ పని చేయకపోతే నా పిల్లలకు తిండెట్లా పెట్టగలను? నలుగురు పిల్లలతో నేనెక్కడికి వెళ్ళగలను? నా భర్త పనేమీ చేయడు. తాగి రికామీగా తిరుగుతూ వుంటాడు' అని చెప్పింది. 7వ తరగతి వరకూ చదువుకున్న పల్లవిబెన్ పైనే కుటుంబ భారం మొత్తం వుంది. ఆమెను ఒక బలహీనురాలుగానో లేదా ఏ శక్తీ లేనిదానిగానో అనుకోవటం పొరపాటే అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో దావా వేసిన మహిళల్లో పల్లవిబెన్ కూడా వుంది. తామంతా ఇంకా పాకీ పని చేస్తూనే వున్నామని, తమకు ఈ పని అప్పగించింది పంచాయితీనే అని కూడా దావాలో పేర్కొంది.

ఈ రెండు దృశ్యాల నుంచి మనం ఏం అర్థం చేసుకోగలుగుతాం?

**మొదటి దృశ్యం:** రాణ్‌పూర్‌లో నిర్వహించిన ఊరేగింపు పాకీపని నుంచి విముక్తి దినం కోసం. గుజరాత్‌లోని అన్ని మూలల నుంచి పాకీపని వాళ్ళు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. తమ నెత్తి మీద తోటి మనుషుల పియ్యిపెంటను తీసుకెళ్ళే బుట్ట –ట్రోక్రిని

వదిలి అనేకమంది ఆడవాళ్ళు, మగవాళ్ళు ఈ ఊరేగింపులో పాలుపచుకున్నారు. కానీ దీనిలో పాల్గొన్న అనేకమంది ఇప్పటికీ దీని నుంచి బయటపడేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసి కూడా ఈ అమానవీయమైన జీవితం నుంచి బయటపడలేకపోతున్నారు.

**రెండో దృశ్యం:** పాకీ పని నిర్మూలన కోసం అహమ్మదాబాద్ నగరంలో నిర్వహించిన చరిత్రాత్మకమైన ప్రజాభిప్రాయ సదస్సు. అందులో భాగస్వామి అయిన పల్లవిబెన్ లాంటి ఆడవాళ్ళ బాధలను ఆ సదస్సు వ్యక్తీకరిస్తుంది. వీళ్ళు ధైర్యంగా వేసిన దావాల వల్లనే అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దుర్మార్గమైన ఈ విధానం తమ రాష్ట్రంలో లేనేలేదని ప్రగల్భాలు పలుకుతున్న గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నది అవాస్తవమని వీటివల్లనే వెల్లడి అయ్యాయి. అయితే 2004లో సుప్రీంకోర్టులో ఈ దావా వేసిన తర్వాత ఈ మహిళల జీవితాలు మరిన్ని సమస్యల్లోకి జారుకున్నాయి. కొంతమంది పని పోగొట్టుకుంటే, మరికొంత మంది తక్కువ వేతనాలకే పని చేయవలసివచ్చింది. ఏమైనా గానీ, తమ పిల్లలు మాత్రం ఈ నరకంలోకి అడుగుపెట్టటానికి వీల్లేదనే దృఢ సంకల్పంతో వీళ్ళంతా వున్నారు. ఇతర రాష్ట్రాలలో మాదిరిగానే గుజరాత్ ఆడవాళ్ళలో కూడా ఈ ఆలోచన బలంగా వుంది. ఈ ఒక్క విషయంలో వీరందరికీ ఒకే రకమైన ఆగ్రహావేశాలు, అసంతృప్తి వున్నాయి. అయితే ఇది సున్నితమైన అంశం అనటంలో సందేహం లేదు. తమ పిల్లలు ఈ టోక్రి ఎత్తకుండా చేయగలిగామని అనేకమంది ఆడవాళ్ళు నాతో గర్వంగా చెప్పారు. అయితే ఒక చేదు వాస్తవమేమంటే ఈ పిల్లలెవరికీ కూడా శుభ్రం చేయటమనే పని తప్ప వేరే రకమైన ఉద్యోగావకాశాలు లేవు. **(మరీ ముఖ్యంగా మున్సిపాలిటీ స్థాయిలో? అనేది పూర్తిగా వేరే విషయం).**

పై రెండు దృశ్యాల నుంచీ ఈ సమస్య తీవ్రతను స్పష్టంగానే గమనించవచ్చు. అనేకమంది ఇంకా ఈ దుర్మార్గమైన వెట్టి పనిలో కొనసాగుతూ వుండటమనేదే కాదు– వాళ్ళు చెప్తున్న క్లిష్ట పరిస్థితులను గుర్తించ నిరాకరించే ప్రభుత్వ ధోరణిని కూడా ఎదుర్కోవలసి వుంది.

రాణ్‌పూర్‌లో జరిగిన ఒక సమావేశానికి నేను వెళ్ళాను. అక్కడ పిప్రాలి గ్రామం నుంచి వచ్చిన కాళిబెన్ ఆవేశ పూరితంగా చేసిన ఉపన్యాసాన్ని విన్నాను. ఆమె తన జీవితకాలమంతా చాలా మంది ఠాకూర్ల పాకీదొడ్లను శుభ్రం చేసి, వారి పియ్యిపెంటలను ఎత్తిపోసింది. 'ఈ పియ్యిపెంటలతో నేను అలసిపోయాను, యాష్ట పడ్డాను. కానీ ఇప్పుడింక ఈ పని చేయను గాక చేయను. నాకు వచ్చేదేమి లేదు దీన్నుంచి. ఏమైనా సరే దీన్ని మాత్రం నేను వదిలేయాలనుకుంటున్నాను' అని ముగించిందామె.

వేరేవాళ్ళు కూడా బాగా మాట్లాడారు. రాణ్‌పూర్ నివాసి జీతూబెన్ మాట్లాడుతూ, 'ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది. ఏ ఒక్క పథకమూ మాకు చేరనేలేదు....ఈ పని వదిలేయాలని, వేరే పనులు చేసుకోవాలని మా దగ్గరకు వచ్చి ఎవ్వరూ చెప్పలేదు' అంది.

అంతలోనే ఆగ్రహంతో వున్న ఒక గొంతు వినిపించింది. పడియార్ గ్రామం నుంచి వచ్చిన హీరాబెన్ తాను రెండేళ్ళ క్రితమే ఈ ఘోరమైన పని నుంచి విముక్తమయ్యానని చెప్పింది. 'ఇప్పటికీ నాకు వికారంతో తల తిరుగుతూ వుంటుంది. చాలా సార్లు వాంతి వస్తున్నట్లుగా అనిపిస్తుంది. బుట్టనిండా పియ్యిపెంట రాత్రిపూట నాకలల్లోకి వస్తుంది' అని వివరించింది.

సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన వాళ్ళలో ఒకరైన హంసాబెన్‌ని కోర్టులో అఫిడవిట్ వేసినందుకు పనిలో నుంచి తీసేశారు. ఇదంతా ఆమెకు కష్టకాలమే. అయినప్పటికీ ఆమె వెనుకంజ వేయటంగానీ, కుంగిపోవటం కానీ చేయలేదు. ఇదే పరిస్థితి వితంతువైన జోయాబెన్‌ది కూడా. పాకీ పనిని వదిలేసిన తర్వాత మరే ఇతర ఉపాధి కూడా ఆమెకు దొరకలేదు. నెలకు వెయ్యి రూపాయల వేతనంతో బస్టాండ్ ఊడ్చే పనిచేస్తోంది. అంతకు ముందు ఈ ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటం ద్వారా నెలకు దగ్గర దగ్గర రూ. 3500/- పంచాయితీ నుంచి ఆమెకు వచ్చేవి. తగ్గిన వేతనాలతో బతుకు గడపటం అనేది కష్టంగా మారింది. తన పిల్లలను పోషించుకోవటం కోసం ఆమె రాత్రీ పగలూ అనకుండా శ్రమతో కూడుకున్న అనేక పనుల్ని కూడా చేయటం మొదలుపెట్టింది.

అయితే లాలూబెన్ లాంటి వాళ్ళు ఇంకా ఈ కంపుగొట్టే పని నుంచి బయట పడలేకపోతున్నారు. ఆమె పంచాయితీ కట్టించిన వదాసండాస్ పాకీదొడ్లను శుభ్రంచేస్తోంది. దీనికి గానూ ఆమె నెలకు రూ. 3500/- సంపాదిస్తుంది. వదాసండాస్‌లు ఒక విధమైన సామూహిక పాకీదొడ్లు. ఏదో ఒక ప్రదేశంలో పంచాయితీ నాలుగు గోడలతో వీటిని నిర్మిస్తుంది. వీటిలో స్థానికులు తమ కాలకృత్యాలు తీర్చుకుంటారు. అక్కడ పేరుకుపోయే పియ్యిపెంటల్ని పాకీవాళ్ళు ఎత్తి శుభ్రం చేస్తారు. ఈ పని చేయటానికి పంచాయితీ ఈ ఆడవాళ్ళని నియమించి వారికి జీతాలు కూడా ఇస్తుంది. గుజరాత్‌లో ఇప్పటికీ ఇలాంటి పాకీదొడ్లు అనేకం వున్నాయి. లాలూ బెన్ బాధలో రామూబెన్, బిజుబెన్, జీతూబెన్, రేఖాబెన్, మైనాబెన్, సీతాబెన్ లాంటి అనేక మంది బాధలు కూడా ఇమిడివున్నాయి. రాణ్‌పూర్, కథీ, సురేంద్రనగర్, సారా లాంటి ప్రాంతాల నుంచి వచ్చిన ఈ ఆడవాళ్ళందరికీ పెళ్ళయిన తర్వాతే పాకీపని మొదలయింది. తల్లిదండ్రుల ఇళ్ళలో ఉన్నప్పుడు వీరి తల్లులు వీరిని ఈ పని నుంచి దూరంగా వుంచటమో లేదా దూరంగా వుంచటానికి గట్టి ప్రయత్నాలో చేశారు. తమ తల్లుల కంటే కూడా ఇంకా తీవ్రంగా వీరంతా తమ కూతుర్లను ఈ పని నుంచి దూరంగా వుంచాలని తాపత్రయపడుతున్నారు. ఈ పని నుంచి విముక్తి కోసం సమీకృతమవుతున్న వీరందరినీ చూసిన తరువాత. ఈ ఎత్తుడుదొడ్లువున్న కొంత మంది ఠాకూర్లు తమంతట తాముగానే వాటిని కూలగొట్టేసుకున్నారు. ఇలాంటి ఎన్నో సంఘటనలు రాణ్‌పూర్ లో కూడా జరిగాయని వాళ్ళు మాకు చెప్పారు.

గుజరాత్‌లోని సురేంద్రనగర్ కథ మరొకటి. ఈ నగరానికి నా జీవితంలో ఒక ప్రముఖ స్థానం వుంది. ప్రముఖ హిందీ కవి షంషేర్ బహదూర్‌సింగ్ తన ఆఖరి రోజుల్ని

ఈ నగరంలోనే గడిపారు. ఆయన్ని కలవటం కోసం నేను పలు పర్యాయాలు ఇక్కడికి వచ్చాను. షంషేర్ నానాకు ఈ నగరం చివరి వీడ్కోలు పలికింది. సురేంద్రనగర్‌లో చాలామంది పాకీ పనివాళ్ళను కలిసి మాట్లాడుతున్నపుడు నేను ఆయన్ని గుర్తుచేసుకున్నాను. వాళ్ళు తమ కథలను వినిపిస్తున్నపుడు షంషేర్ నివసించిన నగరంలో కూడా ఈ దుర్మార్గమైన విధానం వుంది కదా అని నాకు విచారం కలిగింది.

మరోపక్క తమ వ్యతిరేకతను క్రియాశీలకంగా వ్యక్తీకరిస్తూ ఈ మహిళలంతా మరో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. ఈ బాధాకరమైన కథనాలు షంషేర్ దృష్టికి వచ్చి వుండుంటే ఆయన ప్రతిస్పందన ఏమైవుంటుందా అని ఆలోచిస్తున్నాను నేను. ఎవరైనా దీన్ని ఊహించవలసిందే. ఆ సమయంలో ఆయన రాసిన కొన్ని పంక్తులు నా మదిలో స్ఫురించాయి.

*మనుషుల్ని చుట్టుముట్టిన అగ్ని*
*రాజకీయ అధికారాల్ని తుత్తునీయలు చేస్తుంది;*
*మనుషుల మీదే మన ఈ క్రూరత్వం*
*ఎందుకు కొనసాగుతోంది?*

నేను ఈ ఆడవాళ్ళ ముఖం ముడతల్లో దాగిన క్రోధాన్ని చూశాను. కంగుమని మోగుతున్న వారి గొంతుల్లో వ్యక్తం కాకుండా వున్న బాధని, అవమానాన్ని నేను విన్నాను. షంషేర్ కవిత మరోవిధంగా మాకు స్ఫురించింది.

పొగమంచు నిండిన అంధకారంలో ప్రతిఘటన నేపథ్యం

ఈ దినం భారమైన హృదయంతో సందిగ్ధంగా, హీనభావంతో ఉన్నాడు ఆ మనిషి. దీనస్థితిలో మధ్య తరగతి సమాజం. కానీ అటు చూడు, ఆ కార్మికుని చేతిలోని కాగడా దారి చూపిస్తోంది. (వామ్ వామ్ వామ్ దిశ నుంచి)

సీతాబెన్‌కి కేవలం నలభై ఏళ్ళుండవచ్చు. కానీ ఆమె విషాదగాథ విన్న తర్వాత వందేళ్ళుగా ఆమె మనిషి పియ్యిపెంటలతో నిండిపోయి వున్న డబ్బాలను తలమీద మోస్తూనే వుందనిపిస్తుంది. 'పియ్యిల్ని, పీతి ఉచ్చల్ని శుభ్రం చేయటమే నా జీవితం' అని ఆమె చెప్పింది. ఆమె చెప్తున్నదాన్ని మాకు హిందీలోకి అనువాదం చేసి చెప్పాడు విజయ్ అనే యువకుడు. సురేంద్రనగర్‌లో పటేళ్ళు, కడ్బి పటేళ్ళు, ఇంకా ఇతర అగ్రకులాల వారు తమ తమ ఇళ్ళల్లో సెప్టిక్ ట్యాంకులను కట్టించుకున్నారు. రెండు మూడు నెలల కొకసారి ఈ టాంకులను శుభ్రం చేయవలసి వుంటుంది. మిగిలిన సమయాలలో ఈ ఆడవాళ్ళు ఇతర ఇళ్ళల్లోని లెట్రిన్లను, వీధుల్లో వున్న వాటిని శుభ్రం చేస్తుంటారు. ఈ పనిచేయటం ద్వారా ఈ మహిళలు ఒక్కో ఇంటికి రూ. 50/-లు చొప్పున సంపాదిస్తారు. దానితోపాటు ఒక్కోసారి ఆ ఇళ్ళల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు కూడా దొరుకుతాయి.

కాంతిలాల్ వయసు ముప్ఫై ఐదేళ్ళ కంటే ఎక్కువ వుండదు. గత పదిహేనేళ్ళుగా సురేంద్రనగర్‌కి దగ్గరలోని సారాగ్రామం గుడిలో వున్న పద్దెనిమిది ఎత్తుడు దొడ్లను

శుభ్రం చేస్తూనే వున్నాడు. తద్వారా నెలకు రూ. 2,000/- సంపాదిస్తాడు. పండగరోజుల్లో ప్రతిరోజూ మూడు వందల మంది యాత్రికుల పియ్యిపెంటలను ఎత్తిపోయాల్సి వుంటుంది. 'అచూట్' లేదా ఒక అంటరానివాడిగా పరిగణించి అతన్ని గుడిలోకి రానియ్యరు. అందులోకి అడుగుపెట్టాలని అతనికేమీ కోరిక లేదు కూడా. 'నా కష్టాలన్నీ చూస్తూ కూడా దేవుడు ఖాళీగా గుడిలో కూర్చునే వుంటాడు గానీ ఏమీ చేయడు. ఇంక గుడి లోపలికి వెళ్ళటం వల్ల నాకేంటి ఉపయోగం? దేవుడు ప్రతిచోటా వుంటాడని మాకు చెప్పారు. అయితే మంచిదే! పాకీవాళ్ళకు పియ్యిపెంటలతో నిండివున్న ఈ బుట్టలోనే వుంటాడేమో' అని అతనన్నాడు. అతని భార్య గ్రామంలోని పటేళ్ళ ఇండ్లలో ఎత్తుడుదొడ్లను శుభ్రం చేస్తుంది. దీనికి గానూ ఆమె సంపాదించేది నెలకు ఒక్కో ఇంటి నుంచి యాభై రూపాయలు, ముందురోజు మిగిలిపోయిన చద్దికూడు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో వున్నట్లే ఇక్కడ కూడా పాకీపని కుటుంబవృత్తిగానే వుంది. కొంత మంది మూడు తరాల నుంచీ ఈ పనే చేస్తున్నారు. మరికొంత మందికి తమ కుటుంబాలు ఈ కంపుగొట్టే బుట్టను ఎప్పటి నుంచి తమ తలమీద మోస్తూ వస్తున్నాయో గుర్తు కూడా లేదు.

'మీకందరికీ సామాన్యంగా వచ్చే అనారోగ్యం ఏమిటి? అని నేను ఒక పిచ్చి ప్రశ్ననే సంధించా. నా ఉద్దేశం ఏమిటంటే దేశంలోని వివిధ రాష్ట్రాలలో వున్న ఈ స్త్రీలు ఒకే రకమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోంటున్నారా అని తెలుసుకోవటం. ముడతలుపడిన మొహంతో వున్న రాణ్‌పూర్ నివాసి జీతూబెన్ అడిగిన ఎదురు ప్రశ్న నన్ను ఉలిక్కిపడేలా చేసింది. 'నీ నెత్తిమీద ఈ పియ్యిపెంటను ఎత్తి పెట్టుకో, మాకు ఎలాంటి జబ్బులు వస్తాయో అప్పుడు నీకు కూడా తెలుస్తుంది. ఈ పని చేసేవాళ్ళు ఎవరైనా ఆరోగ్యంగా వుంటారా? మేం ఇంతకాలం ఈ మురికి పనిచేస్తున్న తర్వాత కూడా ఇంకా ఎలా బతికి వున్నామో, మేం పిల్లల్ని ఎలా కంటామో? నువ్వు, నీతో పాటు ఇతర సమాజం తెలుసుకోవాలనుకుంటున్నారా? నిజానికి మాకు పిల్లలెందుకు? కొన్నేళ్ళ క్రితం విదేశాల నుంచి ఒక డాక్టరు ఇక్కడికి వచ్చి కన్నీళ్ళు ఒలకపోసి, మేమంతా ఆపరేషన్ చేయించుకుంటే ఇంక మాకు పిల్లలు వుండరని చెప్పాడు. అప్పుడర్థమైంది బయట ప్రపంచం మా గురించి ఏమనుకుంటున్నదంటే వీధికుక్కల్లాగా లేదా పందుల్లాగా మమ్మల్ని బలవంతంగా పట్టుకుని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేసేయొచ్చు అనుకుంటుంది!' అంటూ జీతూబెన్ ఆగ్రహంతో ఒక బూతు మాట అని ఖాండ్రించి నేలమీద ఉమ్మేసింది.

నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు -మొత్తం ఆరుగురు పిల్లల తల్లయిన సీతాబెన్ తన గాథ చెప్పకొస్తూ 'నాకు ఒక్కటంటే ఒక్కసారే గర్భస్రావం అయింది. కానీ మిగతా వాళ్ళకు చాలాసార్లు గర్భస్రావాలయ్యాయి. నిజం - నేను గర్భంతో వున్నప్పుడు నా గర్భసంచి, ఒంటి కండరాలు చాలా నొప్పి అనిపించేవి. ఎనిమిదో నెలలో పని చేయటం కష్టమవటంతో నేను నా కూతుర్ని తోడుగా పనికి తీసుకెళ్ళేదాన్ని. మిగతా పనిచెప్ప కుండా

కేవలం బక్కెట్ ఒక్కటే ఎత్తమని చెప్పేదాన్ని! అని గతాన్ని గుర్తుచేసుకుంది. ఇతర ఆడ వాళ్ళు తాము కడుపుతో వున్నప్పుడు ఎదుర్కొన్న సమస్యలను నాతో చెప్పినట్లుగానే సీతాబెన్ కూడా అన్నీ చాలా గుర్తుపెట్టుకుని అవేవో నిన్న మొన్న జరిగిన సంఘటనల మాదిరిగా చెప్పింది. ప్రతి ఒక్కరూ తాము గర్భందాల్చామని తెలిసినప్పటి నుంచీ తమ పిల్లల్ని ఈ కష్టం నుంచి ఎలా తప్పించాలా అనే ఆలోచనలు వారిలో పురుడుపోసుకున్నాయి.

ఒక్క క్షణం కూడా ఆగకుండా సీతాబెన్ మాట్లాడుతూనే వుంది. తన కథ మొత్తం పూర్తయ్యేంత వరకూ ఆమె ఆపలేదు. తన మూడో కూతురు పుట్టినపుడు ఆమెని చూసుకోవటానికి ఇంట్లో ఎవరూ లేరు. 'ఆమెను నాతోపాటే తీసుకెళ్ళి ఆ బుట్ట పక్కనే పడుకోపెట్టే దానిని. ముసిరిన ఈగలతో ఆ పియ్యంతా దాని వంటికి అంటుకొనిపోయి అలానే వుండేది – ఆ దేవుడికే తెలుసు అలా ఎన్నిసార్లు జరిగిందో! అందుకే నాలాంటి దురదృష్టం నా కూతురికి రాకూడదని నేను అనాడే పట్టుదలగా అనుకున్నాను' అంటూ నవ్వుతూ 'నా జీవితంలో నేను సాధించింది ఏమైనా వుంటే ఇదొక్కటే. నా కూతురి జీవితం నుంచి ఈ పియ్యిపెంట పనిని లేకుండాచేశాను. ఆమె ఇప్పుడు చదువుకుంటోంది. ఈ పని చేయని కుటుంబంలోని వ్యక్తితోనే ఆమె పెళ్ళి జరిపిస్తాను' అని నిశ్చయంగా చెప్పింది. ఆమె చుట్టూవున్న అందరూ కళ్ళు మెరుస్తుండగా, 'ఇప్పుడు మా పిల్లల జీవితాలు ఈ పియ్యిపెంటలో పొర్లటానికి మేం ఒప్పుకోం. ఇది మా వాగ్దానం' అని ముక్త కంఠంతో చెప్పారు.

ఆ తర్వాత మేము రాణ్‌పూర్ గ్రామ సర్పంచ్ గీతాబెన్‌ను కలిశాము. గుజరాత్ దళిత కుల సమూహంలో ఒక భాగమైన వాంకుర్ సాధు కులానికి సంబంధించిన వ్యక్తి గీతాబెన్. ఈ కుల సమూహం పాకీపని చేయదు. అందుకే మిగతావారితో పోలిస్తే రాజకీయంగా, ఆర్థికంగా కొంత ఉన్నతస్థితిలోనే వుంది. తన పంచాయితీ పరిధిలో పాకీపని జరుగుతోందనే విషయాన్ని మొదట ఆమె అస్సలు ఒప్పుకోలేదు. కానీ స్థానిక మహిళలంతా గట్టిగా నిలదీసిన తర్వాత అక్కడ ఆ పని జరుగుతోందనీ, పంచాయితీనే వాళ్ళను ఈ పనిలోకి పెట్టుకుందనే విషయాన్ని ఆమె మా దగ్గర అంగీకరించక తప్పలేదు. కొంచెం చిరాకుగానే గీతాబెన్ దానిని సమర్థించుకునే ప్రయత్నంచేస్తూ, 'ఈ పనిని నిర్మూలించటానికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఎందుకో ఒక వ్యతిరేకత, అయిష్టత వున్నాయి. ప్రభుత్వం దగ్గర లోటు లేనంత డబ్బు ఉంది. కానీ, ఈ పనిని నిర్మూలించటం కోసం దానిని వెచ్చించడం వారికి ఇష్టం లేదు' అని చెప్పుకొచ్చింది.

అయితే అక్కడ జమ కూడిన ఆడవాళ్ళెవరూ ఆమె చెప్పిన సమాధానానికి సంతృప్తి చెందలేదు. నిజానికి అన్నిచోట్లా ప్రభుత్వం తీరు ఒక్కటే కదా! ముందు ఆమె చేయాల్సిన పని చక్కగా చేస్తే మంచిదని చాలా మంది అన్నారు. ఆ తర్వాత ప్రతి ఒక్కరూ పిడికిళ్ళు బిగించి చేతులు పైకెత్తి ఇంక ఈ అమానవీయమైన పనిని తామెవరమూ చేయమని, వేరే వాళ్ళను కూడా చేయనివ్వబోమని ప్రతిజ్ఞచేశారు.

అయితే దురదృష్టవశాత్తు నేను కలిసిన అందరూ ఈ రకమైన పట్టుదలతో తమ అనుభవాల్ని పంచుకోలేకపోయారు. 2006 సెప్టెంబరు 23వ తేదీన గాంధీనగర్‌కు 60 కిలోమీటర్ల దూరంలో నేను పద్ధెనిమిదేళ్ళ కమలను (పేరు మార్చాం) కలిశాను. 'ఈ పాకీదొడ్లను శుభ్రంచేయటమే మా కుటుంబమంతటి పని. మా చేతులతోనే ఈ పియ్యపెంటంతా ఎత్తి మోస్తాం. నేను 6వ తరగతి వరకూ చదువుకున్నాను. ఇంకా చదువుకోవాలనుకున్నాను. ఇంతకు ముందు నేను ఈ పని గురించి పెద్దగా ఆలోచించక పోయేది. బాధపడకపోయేది. కానీ రోజులు గడిచే కొద్దీ మేమేమిటి అనే విషయం నాకు అర్ధమవుతూ వచ్చింది. జీవితాంతం మేము ఇదే పని చేయాలి; దీని నుంచి తప్పించుకునే మార్గం లేదు. ఇది నాకు చాలా కష్టంగా అనిపిస్తోంది అని నాతో చెప్పిందామె. ఆమె మాటల్లో ధ్వనించిన నిస్సహాయతను గమనిస్తే గుండె పగిలిపోతుంది.

గుజరాత్‌లో ఈ అమానవీయమైన పని నిర్మూలనకోసం పెరుగుతున్న ఒత్తిడి ఒకవైపు వుంటే, మరోవైపు పాకీపని చేస్తున్న వాళ్ళల్లో పెరుగుతున్న అనిశ్చితి, ఆందోళన, ఆగ్రహం కూడుకొని వున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొనసాగుతున్న ఈ పాకీ వృత్తి మీద ఒక నివేదికను ఇవ్వవలసిందిగా టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) వారిని నరేంద్రమోడి ప్రభుత్వం 2006లో అడిగింది. సెప్టెంబరు 30, 2006న టిస్ ఒక నివేదికను మోడీ ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదికను అంగీకరించటము లేదా దాన్ని బహిర్గతపరచటం వంటి పనులేవీ ప్రభుత్వం చేయలేదు. ఎంతో అన్వేషణ తర్వాత ఈ రిపోర్టు దొరికింది. 10,000 జనాభా దాటిన జిల్లాలు, గ్రామాలను మాత్రమే ప్రాతిపదిక చేసుకున్నారని ఆ నివేదిక చూస్తే అర్ధమైంది. చిన్న గ్రామాలు, జిల్లాలలో ఎక్కడైతే పాకీవృత్తి కొనసాగుతోందో వాటిని సర్వే పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా ఈ రిపోర్టులో వాస్తవ గణాంకాలు చోటుచేసుకోలేదు. ఈ రిపోర్టు ప్రకారం 2006 వరకూ కేవలం 2,456 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిలో కొనసాగుతున్నాయి. స్వల్ప వ్యవధిలో రూపొందిన ఈ నివేదికపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. దళిత సంఘాలు చెప్తున్న దాని ప్రకారం గుజరాత్‌లో 18,500 గ్రామాలుంటే అందులో 12,500 గ్రామాల్లో దళితులు నివసిస్తున్నారు. ఈ గ్రామాలను, చిన్న పట్టణాలను ఈ సర్వేలో పొందుపరచకపోతే వాస్తవ పరిస్థితి ఎంతమాత్రమూ వెల్లడికాదు. హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ గుజరాత్ ప్రభుత్వం సమర్పిస్తున్న అవాస్తవిక నివేదికలను ధైర్యంగా ఎదుర్కొన్న సంస్థ నవసర్జన్ ట్రస్టు. ఈ సంస్థ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం – దాదాపు 55,000 మంది పాకీ పనివాళ్ళు గుజరాత్‌లో వున్నారు.

టిస్ (టిఐఎస్ఎస్) రిపోర్టులో ఎన్ని పొరపాట్లు ఉన్నప్పటికి ఈ సమస్యను సవివరంగా వెలుగులోకి తెచ్చిందని చెప్పక తప్పదు. నిజానికి చట్టవిరుద్ధంగా పాకీపనిని చేయించటం అనే వాస్తవం కన్నా, రాష్ట్ర ప్రభుత్వం దీనిని నిర్మూలించటానికి ఏ విధమైన చర్యలూ

తీసుకోలేదని ఈ రిపోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా పాకీపని చేస్తున్న ఆడవారి జీవితంలో అనేక రకాల జబ్బులు భాగమై పోయాయని టిస్ రిపోర్టు ప్రత్యేకంగా పేర్కొంది. ఈ ఆడవాళ్ళు నిరంతరం వికారం, వాంతులు, తల తిరగటం, కళ్ళు బైర్లుకమ్మటం, జ్వరం, టైఫాయిడ్, క్షయ, కామెర్లు, దురదలు, ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలు వంటి ఎన్నో రకాల జబ్బులకు గురవుతున్నారు.

టిస్ రిపోర్టును బహిర్గతపర్చకుండా కావాలని మరుగు పరచడంలోనే గుజరాత్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి తేటతెల్లమయింది. ఒకవైపు సుప్రీంకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యానికి (పిల్) సమాధానంగా మోడీ ప్రభుత్వం గుజరాత్‌లో ఒక్కరంటే ఒక్క పాకీ పనివారు కూడా లేని 'స్వచ్ఛమైన' రాష్ట్రంగా ప్రకటించుకుంది. మరోవైపు టిఎస్ ద్వారా తయారుచేయించిన రిపోర్టును అలాగే అణగదొక్కివుంచింది. 2006 సెప్టెంబరులో టిస్ తన నివేదికను సమర్పించింది. అదే సంవత్సరం జూలై నెలలో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (ఎమ్ఐటి) గుజరాత్‌లోని పల్లియడ్ జిల్లాలో ఇప్పటికీ కొనసాగుతున్న ఈ ఫ్యూడల్ విధానంపై ఒక నివేదికను తయారుచేసింది. ఎమ్ఐటి నివేదిక ప్రకారం ఒక్క పల్లియాడ్‌లోనే పాకీ పనిచేసే కుటుంబాలు పదిహేడు వున్నాయి. ఈ కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక వివక్షలను, అసమానతలను వివరంగా ఈ నివేదికలో పొందుపరిచారు.

నవసర్జన్ ట్రస్ట్‌కి చెందిన మంజులా ప్రదీప్ మాట్లాడుతూ, 'పాకీ పనిని నిర్మూలించ టానికి బదులు, గుజరాత్ ప్రభుత్వం దానిని దాచి వుంచటానికే ప్రయత్నిస్తోందనేది స్పష్టం. వీళ్ళు ఈ పని వదిలేయటానికి సిద్ధంగా వున్నారు. కానీ వీరికి వెంటనే ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కావాలి. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వాటి గురించి ఆలోచించ టానికి సిద్ధంగా లేవు. ఇన్నేళ్ల స్వతంత్రం తర్వాత కూడా ఈ పని ఇంకా కొనసాగుతోందంటే ఇంతకన్నా బాధాకరం ఏముంటుంది? నాయకులు, విధాన నిర్ణేతల బుర్రల్లో బలంగా పాతుకుపోయిన భావజాలం ఏమిటంటే పాకీదొడ్లను శుభ్రంచేసే పని ఈ కులసమూహం మాత్రమే చేయాలనేది. వీళ్ళే ఎన్నో తరాలుగా చేస్తూ వస్తున్నారు కాబట్టి ఇప్పుడు కూడా అదే పని చేయవలసిందే. ఇలా ఉంది రాజకీయపరమైన నిర్ణయం. విధాన నిర్ణయాల్లో కులతత్వం ఈ విధంగా స్పష్టమవుతూ వుంటుంది. లేకపోతే అమానవీయమైన ఈ పనిని ఆధునికంగా, గౌరవప్రదంగా మార్చాలని ఎవ్వరూ ఎందుకు ఆలోచించరు?'

ఫ్యూడల్ ఆలోచనా విధానం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కూడా ఈ అనాగరిక పని విధానం అమలులో లేదని బుకాయించటానికే తమ సమయాన్ని వెచ్చిస్తున్నాయి తప్ప, ఈ పనిని నిర్మూలించటానికి ఏమాత్రం ప్రయత్నించడం లేదు. ఈ విషయంలో గుజరాత్ భిన్నంగా ఏమీ లేదు. నిజానికి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమ దగ్గర పాకీపని

కొనసాగడంలేదని నిస్సిగ్గుగా, బహిరంగంగా ప్రకటించుకుంటోంది. 2006 సెప్టెంబరు 24న గాంధీనగర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోడీని కలిసి గుజరాత్‌లో పాకీపని కొనసాగడంలేదని సుప్రీంకోర్టుకి సమర్పించిన అఫిడవిట్ గురించి నేను అడిగినపుడు, 'ఎవరైనా సుప్రీంకోర్టుకి అబద్ధం చెప్తారా? ఈ విధానం మా రాష్ట్రంలో అమలులో లేదు కాబట్టి– ఆ విషయానే  కోర్టులో కూడా చెప్పాం' అని ఆయన సమాధానమిచ్చారు. ఏమైతేనేం, అమానవీయమైన పనిని దాచేయాలని చూసిన మోడీ ప్రయత్నాలన్నీ రాష్ట్రంలో పాకీ పనిచేస్తున్న ఆడవాళ్ళు గళమెత్తటంతో బహిర్గతమయ్యాయి. తమకున్న జీవనాధారం పోతుందని తెలిసి కుడా, తామెదుర్కొంటున్న దుర్భర సమస్యల్ని బహిర్గతం చేయడానికీ తద్వారా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికీ సిద్ధపడి మరీ ఈ మహిళలు కోర్టుకి వాస్తవ స్థితిని విన్నవించారు.

కానీ ఒక గట్టి ఎదురుదెబ్బ నాకోసం కాచుకుని ఉంది. గుజరాత్ పోలీస్ యంత్రాంగం కూడా రాష్ట్రంలోని పాకీపని విధానాల్ని రహస్యంగా వుంచాలని ప్రయత్నిస్తున్నట్టు  నా దృష్టికి వచ్చింది. నేను నవ్‌సర్జన్ ట్రస్టు వాలంటీర్లతో కలిసి 2006 సెప్టెంబరులో అహమ్మదాబాద్‌కి యాభై, అరవై కిలోమీటర్ల దూరంలో వున్న కధికి వెళ్ళినప్పుడు  ఈ ఘటన అనుభవంలోకి వచ్చింది. సుప్రీంకోర్టులో వేసిన 'పిల్' ద్వారా కధిలో పాకీపని విస్తృతంగా సాగుతున్నట్లు నేను తెలుసుకున్నాను. ఒకరోజు పొద్దుటి పూట, ఇంకా ఏడు గంటలు కూడా కాలేదు. ముస్లింలు ఎక్కువగా వుండే ప్రాంతానికి  వెళ్ళాం. ఒక సందు మొత్తం పియ్యిపెంటలతో నిండిపోయి వుంది. కొంత మంది పేదపిల్లలు ఇంకా అక్కడ తమ కాలకృత్యాలు తీర్చుకోవటానికి కూర్చునే వున్నారు. ఇది ఒక్కటే ప్రత్యేకమైన అంశం కాదు. నిజానికి దేశ రాజధాని న్యూఢిల్లీ సహా అనేక ప్రాంతాల్లో ఉదయాన్నే ఇలాంటి దృశ్యాలు  సర్వ సాధారణం. ఆ పియ్యిపెంటనంతా బకెట్లలోకి ఎత్తి దూరంగా పారవేసి శుభ్రం చేయడానికి ఆడవాళ్ళు కొద్దిసేపట్లో అక్కడికి వస్తారని మాకు తెలిసింది. ఇది ప్రతిరోజూ జరిగే వ్యవహారమే. అక్కడ స్థానికులు భరించలేని పియ్యిపెంటల దుర్వాసనతో ఇబ్బంది  పడుతున్నారు.

అక్కడ ఒక గోడ మీద గుజరాతీలో వంకర టింకరగా రాసి వున్న సమాచారాన్ని నాకు చూపించారు. బహిరంగ ప్రదేశాలలో కాలకృత్యాలు తీర్చుకోవటం నేరం కాబట్టి ప్రజలు తమ దగ్గరలో వున్న సులభ్ టాయిలెట్లలో కొద్దిపాటి రుసుము చెల్లించి ఆ కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలన్నది దాని సారాంశం. బక్కచిక్కిన ఒకామె దానిని గట్టిగా బయటికి చదివి, 'ప్రతిరోజూ ఈ పేదవాళ్ళు రోజుకు రెండు నుంచి నాలుగు రూపాయలు దీనికే ఖర్చుచేస్తే, ఇంక వీళ్ళేమి తింటారు? మీకందరికీ వున్నట్టే ఇలాంటి వసతులన్నీ  వీళ్ళకు కూడా ఉచితంగా అందాలి. మరుగుదొడ్డి ఉపయోగించటానికి ఈ కాలనీ వాళ్ళు ప్రతిరోజూ టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు! పేద ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవటం మీద కూడా ప్రభుత్వం డబ్బు  సంపాదించాలా?' అని అడిగింది.

సంభాషణ సాగుతుండగానే శుభ్రం చేసే ఆడవాళ్ళు అక్కడికి వచ్చేలోపే మున్సిపల్ ఇన్స్పెక్టరు నలుగురైదుగురు సిబ్బందితో కలిసి అక్కడికి వచ్చాడు. అందులో నుంచి ఒకతను మా దగ్గరకు వచ్చి మేమక్కడ ఎందుకున్నామని ప్రశ్నించి తర్వాత ఒక అహంకారపూరిత స్వరంతో 'సిస్టర్! మీరు ఇక్కడి నుంచి వెళ్ళిపోండి. మిగిలినదంతా మేము చూసుకుంటాం. ఇంక ఎవ్వరూ ఇక్కడికి రారు' అని చెప్పాడు.

నిమిషాల వ్యవధిలోనే ఇదంతా జరిగిపోయింది. మేము వస్తున్నట్లుగా వారికి ఎవరు చెప్పారో తెలియదు. నేను కారు బయటే నిలబడి వున్నాను. నాతో వచ్చిన మిగిలిన వారందరూ కారులోకి వెళ్ళి కూర్చున్నారు. 'సరే, నువ్వు చెప్పాలనుకున్నది మేము విన్నాం కదా. మా కిష్టమైనప్పుడు మేము వెళ్తాం' అని సమాధానమిచ్చాను. వెంటనే ఇన్స్పెక్టర్‌తో వచ్చిన ఒకబ్బాయి కటువుగా 'సిస్టర్! ఇది ఢిల్లీ కాదు, గుజరాత్. మీరు కారెక్కి ఇక్కడి నుంచి వెళ్ళిపోవటం అందరికీ మంచిది...' అన్నాడు. అతని గొంతులో బెదిరింపు స్పష్టంగా తెలుస్తోంది. మా డ్రైవరు గానీ, మాతో వచ్చినవాళ్ళు గానీ అతని మాటలకు ఎదురు చెప్పాలనుకోలేదు. డ్రైవరు కారు తీయటానికి సిద్ధమయ్యి నన్ను లోపల కూర్చోమన్నట్లుగా చూశాడు. ఆ సూచన పాటించడం తప్ప నాకు గత్యంతరం లేకపోయింది..

నరేంద్ర మోడీ ప్రభుత్వ సందేశం స్పష్టంగానే ఉంది. వాస్తవాన్ని దాచిపెట్టటం. వాళ్ళు ఏం చూపించాలనుకుంటున్నారో దాన్నే ప్రపంచం కూడా చూడటం. పాకీపని చేసే సమూహం నుంచి వచ్చిన గిరీష్ మక్వానా మాతోపాటే అక్కడికి వచ్చాడు. అతని అభిప్రాయం ప్రకారం. మేము వచ్చినట్లు ఆ ప్రాంతమంతా తెలిసిపోయివుంటుంది కాబట్టి, ఇంక ఆరోజు ఎవ్వరూ ఆ పని చేయటానికి రారు. మేము వెనక్కి తిరగటమే మంచిదయింది. గత పదేళ్ళుగా కధిలో గిరీష్ క్రియాశీలంగా పనిచేస్తున్నాడు. ఈ ప్రాంతంలో పదహారు మంది పాకీవాళ్ళు పని చేస్తున్నారని, అందులో ఆరేడుమంది ఆడవాళ్ళుంటారని మాకు చెప్పాడతను. సుప్రీంకోర్టుకి సమర్పించిన పత్రాలలో ఒకరి ఫోటో కూడ జోడించారట. ప్రస్తుత పరిస్థితులపై అసహనంతో పాటు తన వాల్మీకి సమూహంలో వున్న జడత్వం మీద కూడా గిరిష్ అసంతృప్తిగా వున్నాడు. 'ఈ పనే తమ కడుపుల్ని నింపుతోందని, ఇదే జీవితాన్ని ఇస్తోందనే భావన పాకీ పనివాళ్ళ నరనరాల్లో ఇంకి పోయివుంది....ఈ ఆలోచనా ధోరణిని మార్చటం కష్టమైన పని. ఎందుకంటే సమాజంలో మా మీద చాలా ఏహ్యాభావం వుంది. వాళ్ళు మమ్మల్ని, మా పిల్లల్ని అసహ్యించుకుంటారు. మా పిల్లలు బడికి వెళ్ళినప్పుడు ఎన్నో అవమానాలను ఎదుర్కోవలసి వస్తోంది. అందుకే వాళ్ళు బడికి పోవటానికి సిద్ధపడటం లేదు' అని గిరీష్ మాతో చెప్పాడు.

ఇది చాలా సర్వసాధారణమైన ఫిర్యాదు. రాణ్‌పూర్, సురేంద్రనగర్, భావ్‌నగర్ ఇంకా ఇతర జిల్లాలలోని స్త్రీలు, పిల్లలు పదేపదే ఇదే అంశాన్ని మాతో పంచుకున్నారు. తర్వాత నవసర్జన్ ట్రస్ట్ ఒక సమగ్ర సర్వేను నిర్వహించి ఈ మధ్యయుగాల నాటి వివక్షను

సాక్ష్యాలతో సహా బహిర్గతంచేసింది. 'పాకీ పనివాళ్ళ పిల్లల గొంతులు' పేరిట ఈ సర్వేను 2009 జూలై 6 నుంచి ఆగస్ట్ 9 వరకూ నిర్వహించారు. ఇందులో గుజరాత్‌లోని 11 జిల్లాల నుంచి ఆరేళ్ళ నుంచి పదిహేడేళ్ళ వయస్సు వున్న 1,048 మంది పిల్లల సమాచారాన్ని క్రోడీకరించారు. బడిలో లేదా వారు నివసిస్తున్న ప్రాంతంలో – ఉపాధ్యాయుల దగ్గర, స్థానిక ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రజాసమూహాల చేత ప్రతిరోజూ వాళ్ళు ఎదుర్కొంటున్న వివక్షను, ఈ పిల్లలందరూ బలవంతంగా ఈ పనుల్లోకి ఎలా నెట్టివేయ బడుతున్నారనే విషయాన్ని ఈ సర్వే తేట తెల్లంచేసింది.

నవసర్జన్ ట్రస్ట్ నిర్వహించిన ఈ సర్వేతో పాటు అంతకు ముందు జరిగిన పరిశోధనలు రాబర్ట్ ఎఫ్. కెన్నడీ సెంటర్ ఫర్ జస్టిస్ అండ్ హ్యూమన్ రైట్స్‌వారు తయారు చేసిన నివేదిక 'అండర్‌స్టాండింగ్ అన్‌టచబిలిటీ' లో భాగంగా వున్నాయి. ఇది 1589 గ్రామాలను మదింపు చేయటం ద్వారా గుజరాత్ రాష్ట్రంలో విస్తారంగా నెలకొని వున్న అంటరానితనం మీద వచ్చిన పరిశోధనాత్మక నివేదిక. ఈ సర్వేల సారాంశంద్వారా తేలినదేమంటే, కులదోపిడీతో ముడిపడి వున్న ఈ వృత్తిని నిర్మూలించటానికి అటు కేంద్ర ప్రభుత్వం దగ్గర గానీ, మోడీ ప్రభుత్వం వద్ద గానీ (అప్పట్లో సంపద, సమర్థులతో కూడిన గుజరాత్ వారి నినాదం) ఏ విధమైనా ఎజెండా లేదు.

ఈ దళిత విద్యార్థులు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారో దారుణమైన వివక్షకి ఎలాగురవుతున్నారో నవసర్జన్ సర్వే నివేదిక, అండర్‌స్టాండింగ్ అన్‌టచ్‌బిలిటీ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయి. బడుల్లో తమ చేత బలవంతంగా తరగతి గదులను, మరుగుదొడ్లను ఎలా శుభ్రం చేయించేవారో, రోడ్లపై చచ్చిపడివున్న జంతుకళేబరాలను ఎలా తీయించేవారో దుఃఖపూరిత స్వరాలతో ఎంతో మంది పిల్లలు గుర్తుచేసుకున్నారు. వీటితో పాటు ఇంకా ఎన్నో దుర్భర పరిస్థితులను కూడా వీరు ఎదుర్కొన్నారు. ఉదాహరణకు తాము పాకీవాళ్ళ, ఊడ్చేవాళ్ళ పిల్లలమయినందుకు బడిలో వున్న మంచినీరు తాగటానికి అనుమతించేవారు కాదని చాలా మంది చెప్పారు. బడిలో భోజన సమయంలో వీళ్ళని వేరుగా కూర్చోబెట్టటమే కాక, మంచినీళ్ళు తాగాలంటే ఇంటికి వెళ్ళి తాగిరమ్మని పంపించేవారు. అలాగే బడిలో ఇతర కార్యక్రమాల్లో వీరిని పాల్గోనిచ్చేవారు కాదు. ఈ అనుభవాలన్నింటినీ గమనంలోకి తీసుకున్నప్పుడు ఈ పిల్లలకి 'కులం అనేది లేదు. ఈ ఆధునిక యుగంలో ఒక వ్యక్తికి విద్య, అభివృద్ధి వల్లనే గుర్తింపు వస్తుంది' అనే ద్వంద్వపూరిత మాటలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించక మానవు.

'ఒకచేత్తో రాజ్యాంగాన్ని చేత బుచ్చుకుని వున్న అంబేద్కర్ విగ్రహం రెండో చేత్తో మనం సాధించాల్సింది ఇంకా ఎంతో దూరంలో వుందనీ, చట్టాలు తయారు చేయటంతోనే మార్పురాదనీ చెబుతోంది. అరవై సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత మమ్మల్ని ఇంకా బళ్ళల్లో మరుగుదొడ్లు కడగమని అడుగుతున్నారు. చట్టం మా జీవితాల్లో మంచిని ఏం

తీసుకొచ్చినట్లు? పెద్ద కుటుంబాల వారి పిల్లలను బళ్ళో గనుక కొడితే రచ్చరచ్చ అవుతుంది. మేం మరుగుదొడ్లు శుభ్రం చేస్తాం, చచ్చిన పశువులను ఈడ్చేస్తాం......కానీ ఎవరైనా తమ నిద్రలను చెడగొట్టుకున్నారా? లేదు' అని పద్నాలుగు పదిహేనేళ్ళవయసున్న ఒక అబ్బాయి అభిప్రాయపడ్డాడు.

గుండెల్ని సూటిగా తాకే ఈ సాక్ష్యాధారాలను చదువుతుంటే అభివృద్ధి పేరుతో ప్రభుత్వం వల్లిస్తున్నదంతా అబద్ధమని నేను బలంగా నమ్ముతున్నాను. నిజానికి జాతి నిర్వచించే ప్రజాస్వామ్యం కూడా బలహీనపడినట్టే కనిపిస్తోంది. ఒక ప్రత్యేక కులానికి చెందిన తల్లిదండ్రులకు పుట్టినందుకుగానూ ఈ పిల్లలు జీవిత పర్యంతం శిక్షకు గురవుతున్నారు. అంతకంటే ముఖ్యంగా కులసంకెళ్ళ నుంచి విముక్తిదారి చూపించాల్సిన విద్యాలయాల్లో బహిరంగంగానే మీరు ఈ పాకీ కులంలో పుట్టారు కాబట్టి ఎప్పటికీ ఈ భయంకరమైన పనే చేయాలని చెప్తున్నారు.

మేం మాట్లాడిన పిల్లల్లో పదమూడేళ్ళ భావన తన పాఠశాలలో జరిగిన ఒక సంఘటనను వివరించింది. తరగతి గదిలో మహాత్మగాంధీ గురించి పాఠంచెబుతూ కులం రీత్యా ఏ మనిషీ ఎక్కువ తక్కువ కాదనీ, అందరూ సమానులే అన్న విషయాన్ని గట్టిగా చదివి వినిపించింది ఉపాధ్యాయురాలు. దానికి సమాధానంగా భావన వెంటనే 'ఇది అబద్ధం! ఇది అబద్ధం! అలాగైతే నన్నొక్కదాన్నే మరుగుదొడ్డి శుభ్రంచేయటానికి ఎందుకు పంపిస్తున్నారు?' అని అడిగేసింది. ఆమె ఆ మాట అనటంతో దురదృష్టవశాత్తూ పెద్ద శిక్షనే ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆమెను ఎంత దారుణంగా కొట్టారంటే ఆ తర్వాతి రోజు నుంచి ఆమె బడికి వెళ్ళటమే మానేసింది. ఈ దుర్మార్గమైన పనిని నిర్మూలించటం గురించి నేను భావనను అడిగినప్పుడు 'నేను బళ్ళో కూడా మరుగుదొడ్లు కడగాల్సి వచ్చినప్పుడు, మా అమ్మతో కలిసి వెళ్ళి ఈ పనిలో ఆమెకు సహాయపడటంలో తప్పేముంది?' అని ఆమె తిరిగి నాకే ప్రశ్నను సంధించింది.

'సురేంద్రనగర్ జిల్లాలో మా బడి చుట్టూ వుండే పియ్యిపెంటలను నేనే ఎత్తేదాన్ని. వాల్మీకి పిల్లలు కుక్కలు, పిల్లులు ఏరిగిన పెంటను కూడా ఎత్తి పారబోయాలి. బళ్ళో మరుగుదొడ్డి లేదు. దాంతో బడి వెలుపలే ఆ పియ్యిపెంటంతా వుండేది. దీన్నంతా వాల్మీకి పిల్లలే ఎత్తాలి. మరుగులేక మహిళలు కూడా సాయంత్రాలు బడి బయటనే దొడ్డికి పోతారు. దాన్నంతా శుభ్రం చేయమని వాల్మీకి పిల్లలకే చెప్తారు టీచర్లు' అని ఏడేళ్ళ అమ్రిత్ ఈశ్వర్‌భాయ్ ప్రతాదియా చెప్పింది. గాంధీనగర్‌లో కూడా సరిగా ఇలాంటి అనుభవాన్నే పదమూడేళ్ళ ముఖేష్ రాజుభాయ్ పర్మార్ చెప్పాడు. 'రోజూ బళ్ళోని మరుగుదొడ్లను, మూత్రశాలలను, అలానే వారానికి రెండుసార్లు తరగతి గదులను బలవంతంగా శుభ్రం చేయిస్తారు.' 'ప్రతి ఉదయం, ప్రతి రాత్రీ నేను మా అమ్మతో కలిసి చెత్తను వెతకటానికి వెళ్తాను. అలానే కొన్ని ప్రాంతాల్లో చచ్చిపోయిన కుక్కలను, పిల్లులను తీసివేయాల్సి

వుంటుంది. దీనికోసం నాకు పది లేదా పదిహేను రూపాయలు వస్తాయి. ఊరిలోని చెత్తంతా వాల్మీకులుండే ప్రాంతంలోనే వేస్తారు. ఊర్లో అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లుంటాయి కానీ వాల్మీకులుండే ప్రాంతంలో మాత్రం వుండవు. ఈ మురికి, చెత్తల వల్ల వాల్మీకి పిల్లలు తరచూ జబ్బు పడుతుంటారు' అని సురేంద్రనగర్ నుంచే వచ్చిన పదమూడేళ్ళ భవేష్‌భాయ్ రాజేష్‌భాయ్ లాధేర్ చెప్పాడు.

భావ్‌నగర్ జిల్లాలో వుండే పిల్లలు కూడా ఇలాంటి సమస్యలతోనే బాధపడుతున్నారని మేము గమనించాం. 'నేను ప్రభుత్వం నడిపే బడికి వెళ్తాను. కానీ అక్కడ టీచర్లు మాపట్ల వివక్షను చూపిస్తారు. తరగతి గదిలో అందరికంటే వెనుక మమ్మల్ని కూర్చోబెడతారు. మేము నేర్చుకోవటానికి గానీ లేదా మాకు అర్థమయ్యేలా నేర్పించటానికి గానీ టీచర్లు ఏవిధమైన ప్రయత్నమూ చేయరు. బళ్ళో జరిగే ఏ కార్యక్రమాలకు, పోటీలకు మా పేర్లు ఎప్పుడూ ఇవ్వరు. నేను తప్పుతానని నాకు తెలుసు. అందుకే నాకు బడి మానేయాలని వుంది' అని పద్నాలుగేళ్ళ విశాల్‌కుమార్ రమేష్‌భాయ్ వాఘేలా చెప్పాడు.

'నేను మా తరగతి గదంతా ఊడవటంతో పాటు బళ్ళోవున్న చెత్తంతా ఎత్తిపోస్తాను. మా బళ్ళో మరుగుదొడ్లు కడగటానికి స్వీపర్లు వున్నారు కానీ, నేనే వాటిని కడగాలి. ఇది అక్కడి టీచరే నిర్ణయించాడు' అని పన్నెండేళ్ళ రాకేష్‌భాయ్ భానూభాయ్ పర్మార్ వివరించాడు.

నరనరాల్లోకి పాతుకుపోయిన కులవివక్షత భావనగర్‌లోని చిన్న పిల్లల మీద కూడా ప్రభావం చూపించింది. 'ఇతర కులాల నుంచి వచ్చిన ఆడపిల్లలు బళ్ళో మమ్మల్ని తాకను కూడా తాకరు. మా పక్కన కూర్చోరు. మేము ముట్టుకున్న గ్లాసు దగ్గరకు కూడా కనీసం రారు' అని పదేళ్ళ పూజాబెన్ అజిత్ భాయ్ వాఘేలా చెప్పింది.

దీనిని బలపరుస్తూ 'వాఘ్రి, ఠాకూర్, భార్‌వాడ్ ఇంకా ఇతర కులాల నుంచి వచ్చిన వారు బళ్ళో మాకు చాలా యెడంగా కూర్చుంటారు. మధ్యాహ్నం అన్నం తినే సమయంలో వారికి దూరంగా కూర్చోమని కూడా గట్టిగా చెప్తారు' అని లలిత భోపాభాయ్ హరిజన్ వివరించింది. 'మా బళ్ళో దళితులు కాని పిల్లలకే టీచర్లు సహాయం చేస్తారు. మా పట్ల వివక్ష చూపిస్తారు అని పదేళ్ళ హేతల్ కాలూభాయ్ వేగాద్ వివరించింది.

అంతులేని ఈ గాధలను వింటుంటే మహాత్మాగాంధీ గుజరాత్ – నరేంద్రమోడీ 'అభివృద్ధి –సంపదల' గుజరాత్‌గా ఎలా మార్పు తీసుకుందో ఎవరైనా గమనించవచ్చు. నరేంద్రమోడి తన పుస్తకం కర్మయోగ్ (2007, రాష్ట్ర సమాచారశాఖ)లో ఈ శుభ్రం చేయటం అనే పనిని వాల్మీకి కులస్తుల ఆధ్యాత్మిక అనుభవంగా పేర్కొన్నాడు. 'వాళ్ళు (వాల్మీకులు) కేవలం ఈ పనిని తమ కడుపు నింపుకోవటం కోసం మాత్రమే చేస్తున్నారని నేను అస్సలు అనుకోవటం లేదు. అదే నిజమయివుంటే తరతరాల నుంచీ వాళ్ళు ఇదే పనిచేస్తూ రావాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఎప్పుడో ఏదో ఒక ప్రత్యేక కాలంలోనో

ఒకరు తాము ఈ పని చేయటం ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందవచ్చని కనుగొని వుంటారు. అందుకే ఈ శుభ్రంచేయటం అనే పని శతాబ్దాల తరబడి వారి ఆంతరంగిక ఆధ్యాత్మిక కార్యాచరణలో భాగంగా కొనసాగుతోంది. అందుకే ఇది ఒక తరం నుంచీ ఇంకో తరానికి వారసత్వంగా వస్తోంది. వీరి పూర్వీకులకు చేయటానికి వేరే ప్రత్యామ్నాయ మేదీ దొరకలేదంటే  నమ్మడం చాలా అసాధ్యం' అని రాశాడు మోడి.

మోడీకి అత్యంత ఇష్టమైన ప్రభుత్వరంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ ఈ నూటొక్క పేజీల పుస్తకానికి దాత. ఎన్నికల సంఘం కోడ్ అమలులో వుండటంతో ప్రజలకు బహిరంగంగా ఈ 5000 కాపీలను పంపిణీ చేయలేకపోయారు. కానీ అతనిచ్చిన సందేశం మాత్రం విస్తరిస్తూనే వుంది. ఆధ్యాత్మికవాదంతో పాకీ పనిని ముడిపెట్టటాన్ని దళిత సమూహాలు ఘాటుగానే మోడీని విమర్శించాయి. కొంతమందైతే అలాంటి ఆధ్యాత్మిక చింతనను అతను స్వయంగా అనుభవించి తీరాలని సవాలు కూడా విసిరారు.

గుజరాత్ రాష్ట్రంలో దశాబ్దాల తరబడి దళితుల చైతన్యం, సాధికారత కోసం పోరాడుతున్న మానవ హక్కుల కార్యకర్త మార్టిన్ మక్వాన్‌ను నేను ఒకసారి కలిసి ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించాను. ఆయన నవసర్జన్ ట్రస్ట్‌తో పాటు దళిత్ శక్తి కేంద్రానికి కూడా వ్యవస్థాపకుడు .

ఆయనతో మాట్లాడటం వల్ల పాకీపని చుట్టూవున్న సంక్లిష్ట పరిస్థితుల మీద రాజ్యం అవలంభిస్తున్న ధోరణిని అర్థం చేసుకోవటానికి నాకు మార్గందొరికింది. ప్రభుత్వానికి గానీ, అధికార యంత్రాంగానికి గాని దీనిని పూర్తిగా నిర్మూలించాలనే కోరిక ఎప్పుడూ లేదని మార్టిన్ వివరించాడు. 'ఈ పనిని అంతమొందించటానికి రాజకీయ చిత్తశుద్ధి కూడా లేదు. కారణాలు స్పష్టమే. అగ్రకులాలు, అగ్ర వర్గాలు రాజకీయాలను శాసిస్తున్నాయి' అని అన్నాడాయన. ఏదోవిధంగా రాజకీయాల్లో ప్రధానపాత్ర పోషించే వాళ్ళంతా 'దళితుల్లో దళితులు' ఇంకా ఇదే విధంగా కొనసాగాలని ఆశిస్తుంటారు. ఇంకా చెప్పాలంటే. ఇంత మంది ఆడవాళ్ళు ఈ పని చేస్తూవుంటే, ఈ పరిస్థితి మారాలన్న ధ్యాస ఎవరికీ పట్టికపోవడం అంటూ సమస్యలోతుల్ని బాగా వివరించాడాయన.

కుళ్ళికంపు గొడుతూ వృద్ధిచెందుతున్న ఈ మధ్యయుగాల నాటి వాస్తవంతో 'సంపదల' గుజరాత్ ప్రభావితం కాకుండా ఎలా వుండగలిగింది? ఈ ప్రశ్నకు సమాధానంగా మార్టిన్ చెప్పిన అంశాలు నాకు చాలా చాలా ముఖ్యమనిపించాయి. 'సంపదల గుజరాత్ అనే అంశమే అగ్రకులాలకు సంబంధించిన విషయం.  ప్రభుత్వం ఏర్పడింది కూడా ఆ వర్గాల నుంచే. ఆ వర్గాలు పాకీవాళ్ళను కనీసం మనుషులుగా కూడా గుర్తించరు; వీళ్ళను చూడాలని కూడా అనుకోరు.'

గుజరాత్‌లో వున్న పాకీవాళ్ళ దుర్భర పరిస్థితులు దేశమంతటా కూడా వున్నాయన్న మార్టిన్ మాటలు వాస్తవం. పాకీవాళ్ళ ప్రపంచాన్ని కావాలనే ఈ వ్యవస్థ చూడకూడదను కుంటున్నదీ వాస్తవమే. ఈ కనిపించని భారతదేశాన్ని ప్రతిఒక్కరూ ఉద్దేశపూర్వకంగానే అట్టడుగుపొరల్లో దాచేసి వుంచాలని అనుకుంటారు.

తెలివితో చేసే నినాదాలు, ప్రచారాలు అసహ్యమైన వాస్తవాన్ని దాచి వుంచలేవు. (2006 నుంచి 2009వరకూ గుజరాత్ రాష్ట్రానికి వెళ్ళిన అనేక సందర్భాల్లో తీసుకున్న ఇంటర్వ్యూలు ఈ వ్యాసానికి ఆధారం)

# రాజస్థాన్




1. బికనీర్ 2. చురు 3. ఝుంఝును 4. అల్వార్ 5. భరత్‌పూర్ 6. జోధ్‌పూర్ 7. నాగౌర్ 8. సికర్ 9. జైపూర్ 10. కరౌలి 11. ధోల్‌పూర్ 12. బార్మెర్ 13. పాలి 14. అజమీర్ 15. టోంక్ 16. సవాయ్ మధోపూర్ 17. భిల్‌వారా 18. బుండి 19. రాజ్ సమంద్ 20. కోట 21. బరన్ 22. ఝులావర్

రాజస్థాన్‌లోని అనేక జిల్లాల్లో ఆడవాళ్ళు ఇప్పటికీ పాకీపని చేస్తున్నారు.

## రాజస్థాన్

**'నీకు పాకీపని చేయాలని లేకపోతే, మరి ఈ ఇంట్లో నువ్వెందుకుంటున్నట్లు?'**

'నా కోడలెప్పుడూ ఈ పాకీదొడ్లు శుభ్రం చేయటానికి పోలేదు! ఈ పని చేస్తున్నప్పుడు నా రక్తం మరిగిపోతూ వుంటుంది. నాకిది చేయటమంటే చాలా అసహ్యం'...

ఈ మాట చెప్తూనే, వెంటనే ఎత్తుడుదొడ్డిలో ముద్దగా పడివున్న పియ్యిపెంటని రేకుతో ఎత్తి తన డబ్బాలోకి వేసింది. ఆమె మొహం కోపంతో ఎరుపెక్కింది. రాజస్థానీలో తన కోడల్ని 'బీనాని' అని సంబోధించింది. మేము రాజస్థాన్, టోంక్ జిల్లాలోని మల్పుర ప్రాంతం నాలుగో నంబరు వార్డులో వున్నాం. ఎర్రటి ఎండంతా మా మీదే పడుతోంది. మేము ఇందిరతో మాట్లాడుతున్నపుడు, బీదరికంతో వున్న ఆ ప్రాంతవాసులు చాలా మంది కుతూహలంగా చుట్టూ మూగి మమ్మల్ని గమనించసాగారు.

ఎత్తుడుదొడ్డిని శుభ్రంచేసిన తర్వాత కూడా ఇందిర కోపం అంతకంతకు పెరుగుతూనే వుంది. ఆమె గట్టిగానే గొణుగుతూ, 'మేము దీన్నే చేయాలని చెప్పిన ఈ సాంప్రదాయం ఎట్లాంటిది! ఇతరులు ఏరిగిన దాన్ని మేము మా చేతులతో ఎత్తి శుభ్రం చేయాల్సివస్తున్నందుకు, వాటిని ఎత్తి మా తలల మీద మోసి దూరంగా పారేసినందుకు మేము అవమానాల పాలవ్వాలి' అంటూ నా వైపు తిరిగి 'మీ తల తిరుగుతూ వుండి వుంటుంది! మీరు వాంతి చేసుకుంటారు. ఈ కంపు ఊపిరాడనివ్వదు మిమ్మల్ని. మేము ఎట్లాంటి మురికి పని చేస్తున్నామని మీరనుకోవచ్చు. మాకు దగ్గరగా నిలబడకండి....' అంది.

మాల్పుర స్మశానానికి వెళ్ళేదారిలో వున్న ఆ మురికి సందులన్నింటిలోనూ ప్రతి మూలా అత్యంత పేదరికం తాండవిస్తోంది. ఆ ప్రాంతమంతా నిరుపేద ముస్లిమ్‌లతో నిండివుంది. జీవనాధారం కోసం రోజు కూలీలుగా లేదా సాధారణంగా వారి సమూహానికే కేటాయించబడిన చిన్న చిన్న పనులు చేస్తూవుంటారు.

అట్లాంటి ఒక సందులో నేను, ఇందిర నడుస్తూ పూర్తిగా మాటల్లో మునిగిపోయాం. ఈ ప్రాంతంలో ఎత్తుడుదొడ్లు ఇంటి నాలుగ్గోడల అవతల వుంటాయి. ఇంతలో ఒక ఇంటి తలుపు తెరుచుకుంది. ఒక ముసలాయన 'మీరు రాసే రాతలవల్ల ఇదంతా మాయమైపోతుందని ఊహిస్తున్నారా?' అని నన్ను ప్రశ్నించాడు. ఆ ముసలాయన వైపు తిరిగి ఇందిర, 'ఆమె నన్ను కలవటానికి వచ్చింది. మేమంతా ఈ చెత్త మురికిపని ఇంకా ఎందుకు చేస్తున్నామో చూడటానికి వచ్చింది. మేము ఈ పని వదిలిపెట్టేయాలని చెప్పటానికి వచ్చింది. ఇంక మీ ఏర్పాట్లేవో మీరు చూసుకోవచ్చు' అని సమాధానం ఇచ్చింది.

'మీ పేరేంటి?' అని నేను ఆ ముసలాయన్ని అడిగాను.

ఆయన నెమ్మదిగా 'ఇద్రిస్' అని సమాధానమిచ్చాడు. ఫ్లష్ టాయిలెట్ కట్టించుకునే ఆర్థిక స్తోమత ఆయనకు లేదని, ఆయన కూడా ఈ విషయమై బాధపడుతున్నాడని ఆయన మాటల్లోనే అర్థమయింది. ఫ్లష్ టాయిలెట్ నిర్మించుకోవటానికి ప్రభుత్వసాయం వచ్చేలా మేము ఏదో ఒకవిధంగా ఆయనకు సహాయపడాలని పదే పదే మాకు చెప్పాడు. ఇందిర వైపు చూస్తూ ఆయన, 'ఈమె కూడా ఈ పని నుంచి విముక్తమవుతుంది. ఇదంతా చూడటం చాలా కష్టమైన పని. కానీ ఏం చేయగలుగుతాం?' అన్నాడు.

'చాచా! ఇప్పుడు నేను ఈ పని వదిలేయటం ఖాయం. అయితే మీరు వేరే ఏర్పాట్లు చేసుకోగలుగుతారా లేదా? ఎవరైనా ఒక మనిషి చనిపోయినప్పుడు అతని శవాన్ని ఎత్తివేస్తారు కదా! దానికి బట్ట కూడా కప్పుతారు గదా' అని ఇందిర అంది.

'ఇప్పటివరకూ నువ్వెందుకు దీనిని వదిలేయలేదు?' అని నేను అడిగాను. 'నా భర్త, అత్త నాతో ఈ పని చేయిస్తూనే వున్నారు' అని సమాధానమిచ్చింది. 'ఈమె ఇప్పటికీ చేస్తోంది కదా, దీనినే కొనసాగించాలి' అని ఇప్పుడు అందరూ అనుకుంటున్నారు.

వాళ్ళెందుకు నా గురించి ఆలోచిస్తారు లేదా శ్రద్ధ వహిస్తారు? కొద్దిపాటి చదువుతో, బుర్రపెట్టి ఆలోచిస్తే ఈ పనిచేస్తూ నేనెంత నరకప్రాయం లాంటి పరిస్థితిలో వున్నానో నాకే అర్థమయింది. చివరకు నా పిల్లలు కూడా నన్ను అసహ్యించుకుంటారు. మా అమ్మ పాకీ దొడ్లు శుభ్రం చేస్తుందని ఏ పిల్లలు మాత్రమైనా గర్వంగా చెప్పుకోగలుగుతారు, మీరు చెప్పండి నాకు'.

'పది ఇళ్ళల్లో ఈ పనిచేసినందుకు నువ్వెంత సంపాదిస్తావు?'

'రెండు వందల యాభై రూపాయలు' అని సమాధానమిచ్చింది ఇందిర. నేను నిర్ఘాంతపోయాను. 'ఈ కొద్ది మొత్తంతో నువ్వేం చేయగలుగుతావు? నీ ఇంటిని ఎలా గడుపుకుంటావు?'

'ఏం చేయగలుగతాం? మేము దీన్ని తరాల నుంచి తప్పనిసరిగా చేయాల్సివస్తోంది కానీ, మా అంతట మేమే ఈ పనిని ఎంచుకోలేదు. ఈ పని తప్పించి నాకింకో పని కూడా తెలియదు. కుట్లు, ఎంబ్రాయిడరీ కూడా నేర్చుకోలేదు నేను. నాకో కూతురుంది. ఈ నరకం లాంటి పనిలోకి మాత్రం ఆమెను నేను ఎప్పటికీ పంపించను' అని ఇందిర అంది.

'ఆమెకు పెళ్ళిచేసి పంపించిన తర్వాత అక్కడ అత్తమామల ఇంట్లో ఇదే పని చేస్తావుంటే ఏం చేస్తావు?' అని అడిగితే 'ముందు అలాంటి కుటుంబంలోకి ఆమెనిచ్చి పెళ్ళిచేయను. ముందుగా అబ్బాయి కుటుంబీకులు ఏం పని చేస్తున్నారని వాకబు చేస్తాం. ఈ కుళ్ళు మురికి పని చేయటంలేదని మాకు నమ్మకం కుదిరాకే సంబంధం ఖాయం చేసుకోవటానికి అడుగు ముందుకేస్తాం. మా అమ్మాయి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పని చేయకూడదని ముందే చెప్తాం. నిజానికి, ఇప్పుడు నాకొడుక్కి అమ్మాయి దొరకటం కూడా చాలా సమస్యగా వుంది. అమ్మాయి కుటుంబం వాళ్ళు స్పష్టంగా ముందే చెప్పేశారు. వాళ్ళ అమ్మాయి ఈ పాకీపని చెయ్యదని. నా కిద్దరు కొడుకులు. చిన్న కొడుకు సంబంధం కోసం జైపూర్‌లో మాటలు జరుగుతున్నాయి – అక్కడ కూడా మేము ముందు ఈ వాగ్దానం చేయాల్సి వచ్చింది. నా కోడల్ని ఇంతవరకూ నేను ఇక్కడికి ఎప్పుడూ తీసుకుని రానే లేదు. ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వెళ్తున్నానని నేను ఆమెకు ఎప్పుడూ చెప్పను. నాకు చాలా అవమానంగా వుంటుంది. నిశ్శబ్దంగా బయటకు వెళ్ళిపోతాను' అని చెప్పింది.

ప్రత్యేకంగా ఈ ప్రాంతంలో పాకీదొడ్ల యజమానులకు, పాకీపని చేసే స్త్రీలకు మధ్యనున్న సంబంధం చాల ఆసక్తి కలిగించేదిగా వుంది. దీనికో స్పష్టమైన కారణ ముందన్నది కూడా కనిపించింది. పాకీదొడ్లు కలిగి వున్నవాళ్ళు పేదముస్లింలు. ఈ పాకీ దొడ్లను శుభ్రంచేసేవాళ్ళు హిందూమతంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థ అట్టడుగున బీదరికంతో వున్నవాళ్ళు. కేవలం పాకీపని మాత్రమే వారసత్వంగా, వాళ్ళ వృత్తిగా వున్నవాళ్ళు. ఈ

ముస్లింలు, హిందువుల మధ్య సంభాషణ చిల్లరగా ఒకరి మీద ఒకరు పైచేయి ప్రదర్శించు కోవటం కోసం చేస్తున్నట్లుగా వుండటం నేను గమనించాను. అయితే ఒకరిపట్ల మరొకరికి నిజాయితీతో కూడిన సుహృద్భావం కూడా వుంది. ఎప్పుడైనా వచ్చే తేడా పాడాలను పక్కనపెడితే ఇద్దరి మధ్యా ఏవిధమైన శతృత్వమూ లేదు. హిందువుల ప్రాంతాల్లోని పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వెళ్ళినపుడు ఈ హిందూ పాకీ పని వాళ్ళకి ఇదే రకమైన వాతావరణం ఎదురవుతుందా అనేది తెలుసుకోవాలని నేను కొంచెం ఆరాటపడ్డాను. అలాంటి భ్రమ లన్నింటినీ ఇందిర పక్కకు నెట్టేసింది. తన డబ్బా నిండుగా పియ్యిపెంటని మోస్తూ, 'లేదు! అక్కడవున్న ఆ పెద్దపెద్ద ఇళ్ళవాళ్ళు మమ్మల్ని కుక్కల కన్నా హీనంగా చూస్తారు. దూరం నుంచే విదిలించేస్తారు' అని చెప్పింది.

ఆమె ఇంకా ఏదో చెప్పాలని అనుకుంటుండగానే బురఖా వేసుకున్న ఒకామె అటువైపుగా రావటంతో ఇందిర ఆగిపోయింది. ఆమె పేరు నయీమా అని ఆ తర్వాత నాకు తెలిసింది. 'ఈమెకు మా ఇల్లు కూడా చూపించు. నువ్వు ఆమెకు మా డ్రైలెట్రీన్ చూపించకపోవటం భావ్యంకాదు. లేకపోతే మేము కొత్తది కట్టుకోవడానికి లోన్ ఎట్లా వస్తుంది? మేము మీకేమి అపకారం చేయలేదు కదా' అని దాదాపు వేడుకున్నట్లుగా అడిగింది.

ఆమె ఫోటో తీసుకోవటానికి గల ప్రాధాన్యాన్ని ఇందిర వేరేవిధంగా అర్థం చేసుకుంది. 'నేను ఈ ఉదయాన్నే అక్కడ శుభ్రంచేసేశాను గదా. ఇప్పుడేమీ రావాల్సిన అవసరం లేదు. నీ అడ్రసు ఇక్కడ రాయి. నా తల తిరుగుతోంది. ఎండ కూడా చాలా ఎక్కువగా వుంది' అని చెప్పింది. నయీమా ఎంత ఒత్తిడిపెట్టినా గానీ ఇందిర ఆమెని పెద్దగా పట్టించుకోలేదు. అలా అని నయీమా నన్ను అక్కడి నుంచి కదలనీయలేదు. ఆ ఇద్దరి మధ్యా నేను ఇరుక్కుపోయాను. చివరకు నయీమా కూడా మాతో పాటు వచ్చింది.

ఫ్లష్ లెట్రిన్ కట్టించుకోవడం కోసం చాలా సమస్యలను ఎదుర్కొంటున్నామని నయీమా చెప్పింది. 'సందు పక్కనే వున్న ఇళ్ళవాళ్ళు కొంత మంది కాలవలు తవ్వించుకుని వాటిలోకి లెట్రిన్ల గొట్టాలను కలిపేస్తున్నారు. కానీ మిగిలిన చాలా ఇళ్ళవాళ్ళకు అది సాధ్యం కాదు. ముఖ్యంగా సందు మధ్యలో వున్న ఇళ్ళవాళ్ళకు. ఈ ఇళ్ళ కోసం కాలవలు కట్టటం సాధ్యంకాదు. ఎందుకంటే అవి వేరే వాళ్ళ ఇళ్ళల్లో నుంచి కట్టాల్సి వుంటుంది. ఎవరూ కూడా వాళ్ళింట్లో నుంచి ఒక మురుక్కాలువ వెళ్ళటానికి ఒప్పుకోరు' అని ఆమె వివరించింది. అందుకే దీనిమీద ఒక ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రభుత్వం ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపిస్తుందని వాళ్ళు ఎదురు చూస్తున్నారు. ఒక్క ప్రభుత్వం మాత్రమే మురుగునీటి కాలవల వ్యవస్థను ఏర్పాటు చేయగలదు, ఇంకెవ్వరూ కాదు.

ఇంతలోపల ఆ సందు చివర్లో నిలబడివున్న నలుగురైదుగురు ముస్లిం స్త్రీలతో ఇందిర వాదించటం మొదలు పెట్టింది. అది దాదాపు గొడవగా మారింది. అంతకు ముందు కంటే కూడా ఇందిర గొంతులో చాలా ధైర్యం ధ్వనిస్తోంది. 'మీరెందుకు కట్టించుకోరు?

నేనెప్పటికీ వస్తూవుండాలా? నేను ఇప్పుడు ఈ పాకీదొడ్లను శుభ్రం చేయాలని అనుకోవటం లేదు' అని స్థిరంగా అంటోంది. 'ఈ పని మానేస్తే నువ్వేం చేస్తావు? నువ్వు ఏదో ఒక పని చేయవలసిందే కదా?' అని ఎత్తుడుదొడ్డి వున్న స్త్రీలు అడిగారు.

ఇందిర స్వభావంలో ఏ మార్పూ రాలేదు. 'చేయడానికి అనేక పనులున్నాయి. నేనూ తప్పకుండా వేరే ఏదో ఒకటి చేస్తాను కానీ మళ్ళీ ఈ పాకీదొడ్లు మాత్రం శుభ్రం చేయను. ఇప్పటికి చేసింది చాలు. నా గురించేమీ బాధ పడకండి. ప్రభుత్వం మాకు ఏదో ఒక పని కల్పిస్తుంది. మేం పోరాడైనా సరే పని సాధించుకుంటాం. మాకు ప్రభుత్వం ఎందుకు సాయం చేయదు?'

'ఆమెకు మీరెంత ఇస్తారు?' అని ఆ ఆడవాళ్ళను అడిగాను. అక్కడున్న వాళ్ళలో జరీనా అనే ఆమె "పదిరూపాయలు. రొట్టె కూడా ఇస్తాం. లేకపోతే ముప్ఫై రూపాయలు" అని చెప్పింది. ఆమె పక్కనే నుంచున్న నసీమా దానికి ఇంకొంచెం కలుపుతూ "అది నెలకు" అని చెప్పింది.

'ఇంతకన్నా వేరే ఏమన్నా వుంటాయా?' అని నేను అడిగాను.

'అవును!' అని సమాధానం వచ్చింది. 'పెళ్ళిళ్ళ సమయంలో, పండగలప్పుడు, పిల్లలు పుట్టినప్పుడు, ఇలా.' కొద్దిసేపు ఇరువైపులా కూడా ఎవరెంత ఇచ్చారు. ఎవరెంత తీసుకున్నారు అని దానిమీద చిన్నపాటి గొడవ జరిగింది. అయితే కొద్దిసేపట్లోనే మాటల్లో చమత్కారం చోటు చేసుకుని ఎందుకు వాదించుకుంటున్నారో మర్చిపోయి గట్టిగా నవ్వేసుకున్నారు. ఆడవాళ్ళందరూ తమ పనుల్లోకి వెళ్ళిపోయారు. వాళ్ళవి వేరు వేరు ప్రపంచాలన్నది సుస్పష్టం. వారి దారులు వేరు. జజ్‌మని అనే వ్యవస్థ ద్వారా కొనసాగుతున్న ఈ ప్రపంచం నుంచి కొంతమంది (లబ్దిదారులు) బయటకు రావాలి. మరికొంత మంది ఈ వ్యవస్థ కొనసాగటానికి కారణాలేమిటో కనుగొని, దానిలో వచ్చే మార్పులు పరిస్థితిని సమూలంగా ఎలా మార్చేస్తాయో అన్వేషించాలి.

ఈ రెండు ప్రపంచాలు కొద్ది విరామం తర్వాత మళ్ళీ భిన్నమైన నేపథ్యంలో కలుసుకున్నాయి. నాలుగో నంబరు వార్డుకి కిలోమీటరు దూరంలో ఆడవాళ్ళతో కిక్కిరిసి వున్న ఒక చిన్న గదిలో కలుసుకున్నారు. కొద్దిమంది మాత్రం ఇంకా పాకీ పనితోనే బతుకునీడుస్తుండగా, చాలామంది ఈ పనిని పూర్తిగా వదిలిపెట్టేశారు. వాళ్ళతో పాటుగా సఫాయి కర్మచారి ఆందోళనలో క్రియాశీల కార్యకర్తలుగా పనిచేస్తున్న కొంత మంది మగవాళ్ళు, మహిళలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కానీ ఆడవాళ్ళే 'నాయకత్వంలో' వున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమావేశంలో అనేక విషయాలు చర్చించటం జరిగింది. ఎంత మంది పాకీ పనిని ఆపేశారు–ఎంత మంది ఇంకా కొనసాగిస్తున్నారు, మానేసిన ఎంతమందికి ప్రభుత్వం నుంచి సహాయం లభించింది అనే అంశాలు చర్చకు వచ్చాయి. చర్చ ఈ అంశాల నుంచి జీవితంలోని అనేక పార్శ్వాల వైపు మళ్ళింది. గదిలో వున్న ఆడవాళ్ళందరూ కూడా తమ ముఖాలని కొంగుతోనో లేదా

చున్నీతోనో కప్పుకుని వున్నారు. పూర్తిగా కాకపోయినా కొంచెం అయినా కప్పుకున్నారు. ఇందిర కూడా ఈ సమావేశానికి వచ్చింది, కానీ ఆమె ముఖం కొంగుతో పూర్తిగా కప్పుకుని వుండటంతో గుర్తుపట్టడానికి నాకు కొంత సమయం పట్టింది.

'ఈ పని మానేయాలని నేను ఈరోజు నిర్ణయించుకున్నాను' అని చర్చను ఇందిరే మొదలుపెట్టింది.

'ఈరోజు నుంచే ఎందుకు?' అని నేనడిగాను.

'ఎందుకంటే నువ్వు చెప్పావు కాబట్టి' అని తిరుగు సమాధానం ఇచ్చింది. 'మీరు నా చేయి పట్టుకుని అన్నీ చాలా వివరంగా చెప్పారు. ఇంట్లో దీని గురించి నేను కూడా ఆలోచించాను. ఈ పాకీపని చేయడం వల్ల నేను సుఖంగా లేను. పోనీ నా పిల్లలు గానీ, నా కోడలు గానీ నేను ఈ పని చేస్తుండడం వల్ల సుఖంగా ఏమీలేరు. మరి నేను ఎందుకు చేస్తున్నట్లు? ఈ పని నుంచి నాకెంత వస్తుందని మీరు అడిగారు. నేను నిజంగా సంపాదిస్తున్నది ఏమి లేదని నా కనిపించింది. నాకు పని ఇచ్చేవాళ్ళేమీ అంత గొప్పవాళ్ళు కాదు. ఇక్కడున్న ఆడవాళ్ళందరూ కూడా దీనిని వదిలేయాలనుకుంటున్నారు. నేను కూడా అదే మార్గం ఎంచుకోవాలనుకుంటున్నాను. అందరం బాగా అలసిపోయాం. ఇంట్లో పాకీదొడ్లు వున్నవాళ్ళు, వాటిని శుభ్రం చేసే మేము ప్రతి ఒక్కళ్ళం అలసిపోయాం. నయిామా తన ఇల్లు చూపించాలని ఎంత తాపత్రయపడిందో మీరు చూశారు కదా. ఆమేం ఆలోచిస్తున్నదంటే, "ఆ ముసలి మీర్జా ప్రభుత్వం నుంచి మురికికాల్వ కట్టటానికి డబ్బు తెచ్చుకోగలదు గానీ, తనకు చాతకాలేదని" అనుకుంటోంది. వెళ్ళి అందరి ఇళ్ళల్లోనూ అడగండి. ప్రతి ఒక్కళ్ళూ మురికికాల్వ కట్టాలనే అంటారు. దానితో ఈ కుళ్ళి కంపు గొట్టే అవమానాల నుంచి తప్పించుకోవచ్చు. మీరంతా వచ్చి ఈ మొహల్లాలో ఒక చిన్నపాటి కుదుపుని తెచ్చారు. ఇప్పుడన్నా ఏదో ఒకటి జరుగుతుందని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు'.

ఆ తర్వాత ఆమె సరదాతో కూడిన పూర్తి రాజస్థానీ భాషలో మమ్మల్ని మిగిలిన అందరికీ పరిచయం చేసింది. ఆమె మాటల్లో పరిచయం చేసే అంశాలు తక్కువ, నవ్వులు ఎక్కువున్నాయి. ఒకళ్ళ మీద ఒకళ్ళు పడుతూ ప్రతి ఒక్కరూ హాయిగా నవ్వసాగారు. నాగురించి చెప్తున్నవేమీ నేను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. కానీ అక్కడక్కడా దొర్లిన చిన్నచిన్న మాటలు నాకర్థమయ్యాయి. ' .....ఆమె మనం ఈ పని చేయకూడదని చెప్పింది. ఆమె కూడా ఈ కులంలోనే పుట్టింది. ఆమె పూర్వీకులు కూడా పాకీపనే చేసేవారు. ఆమె ఇప్పుడు ఈ పనిని చేసేవాళ్ళు దానిని వదిలేయాలని రాస్తోంది....'

'ఇది చాలా మంచి పని' అందరూ అన్నారు. ఇంకోసారి నవ్వుల వరద అక్కడ ముంచెత్తింది.

ఈ ఆడవాళ్ళందరూ ముఖాలు కప్పుకుని వుండటంతో కొంత వారితో మాట్లాడటం కష్టమయింది. కొంగులు ముఖాలు మీద నుంచి తీసేస్తే బాగుంటుందని నేను వాళ్ళని

పదేపదే అడిగాను. నిజానికి, వాళ్ళందరూ విముక్తి గురించే మాట్లాడుతున్నప్పుడు, ముఖాన కొంగుల నుంచి కూడా స్వేచ్ఛ కోరుకోవాలి కదా? అయితే అందుకు ప్రతిగా వచ్చిన సమాధానం తీవ్ర స్వరంతో వుంది. దాంతో నేను కొంచెం నిర్ఘాంతపోయాను. 'తరాల నుంచి వచ్చిన పియ్యిపెంట బుట్టలను మా తలల మీద నుంచి మేము తోసివేయ గలిగినప్పుడు ఇంక మాముందు వుండే పరదా ఏంటి? ఇది కూడా పోతుంది. దానికి కొంచెం సమయం పడుతుంది. అంతే'.

ఈ మాటలన్నది గీత అనే ఆమె. నాయకత్వ లక్షణాలన్నీ ఆమెలో వున్నాయి. అంతకుమించి, ఆమె ఎనిమిదో తరగతి వరకూ చదువుకుంది. దానితో మిగతా అందరికంటే కూడా ధైర్యంగా వుంది. కానీ అన్ని వయసుల ఆడవాళ్ళూ ఆ గదిలో వుండటంతో ఆమె కొంచెం సంశయంతో సిగ్గుగా వుంది. ముసలివాళ్ళందరూ ఈ పనిని వదిలిపెట్టేశారు. కానీ తమ పడుచు కాలమంతా కూడా ఈ కుళ్ళుకంపులో వృధా అయిపోయిందని ప్రతిఒక్కరూ బాధపడ్డారు. ఈ ప్రాంతంలో మొట్టమొదట తన కోడల్ని ఈ పాకీపని మానిపించానని బాహురీ దేవి మాకు చెప్పింది. ఇదొక సంచలన విషయం. సాధారణంగా అత్తలే కోడల్ని ఈ పనిలోకి దిగమని ఒత్తిడి చేస్తుంటారు. తన తల్లిదండ్రుల ఇంట్లో ఈ పని లేకపోవటంతో, అత్తమామల ఇంట్లో ఈ పనిచేయటానికి మాయా మొదట ఒప్పుకోలేదు. దానితో ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. ఆమె భర్తా, అత్త– ఇద్దరూ కూడా ఆమెని తీవ్రంగా నిందించటంతో పాటు ఈ పని చేస్తేనే తనని ఇంట్లోకి తీసుకొస్తామని బెదిరించారు కూడా. 'నీకు పాకీపని చేయాలని లేకపోతే మరి ఈ ఇంట్లో నువ్వెందుకుంటున్నట్లు' అన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రతి ఒక్కరి మనసుల్ని గాయపర్చాయి. ఆ గదిలో కూర్చున్న అందరూ కూడా ఇలాంటి ఎన్నో ఛీత్కారాల్ని, బెదిరింపుల్నీ చవిచూశారు.

మధ్యలో గీత కలుగజేసుకుని, 'మాకొక్కళ్ళకే కాదు? ఇలాంటివి మీకూ జరుగుతాయి. ఆడవాళ్ళు ఏ కులంలో వున్నాగానీ, వాళ్ళెంత చదువుకున్నా గానీ, ఎంత సంపాదించినాగానీ, ఈ కత్తి ఆమె మెడ మీద వెలాడుతూనే వుంటుంది. అవునా కాదా? నేను నా చిన్నతనం నుంచీ వీటిని చూస్తున్నాను. నా ఎనిమిదేళ్ళప్పటి నుంచీ మా అమ్మతో ఈ పనికి వెళ్ళేదాన్ని. పాకీదొడ్లు వున్న ఎన్నో ఇళ్ళల్లో ఎంత మంది ఆడవాళ్ళు తన్నులు తినేవాళ్ళో, ఎంత మంది ఆడవాళ్ళు ఏడుస్తూ వుండేవారో ఆ దేవుడికే తెలుసు. నేను కొంచెం పెద్దగయినంక మా స్కూల్లో కూడా చూశాను. ఇంట్లో నేను మా అమ్మను చూస్తూనే పెరిగాను. ఆడవాళ్ళ నొసటిరాత అంత తేలిగ్గా మారదని నేను అర్థం చేసుకున్నాను. పైగా వీటన్నింటికీ మించి మనం అందరికంటే ఎంతో తక్కువ...' అని తన భావాలు పంచుకుంది.

గుక్క తిప్పుకోకుండా ఆడవాళ్ళ పరిస్థితుల గురించి గీత సులభంగా వివరించిన తీరు అందరినీ ఆకట్టుకోవడమే కాదు – ఆ అంశాలతో అందరూ ఏకీభవించారు.

సీత, సునీత, ఉగంత, రాజాదేవి, కమల, రామ్‌బాయి, కన్యాకైలాష, గుడ్డి, మీరా, మున్ని, పింకి, రేఖ, మంజు మంజుశంకర్, సోనా, అనిత, షేబా(సోనా వాళ్ళ అత్త), విమల ఇలా ప్రతి ఒక్కరూ తమ కథను చెప్పటానికి ముందుకొచ్చారు. కొంతమంది వాళ్ళ తల్లిదండ్రుల ఇంట్లోనే ఈ పని మొదలుపెడితే, మరికొంత మంది అత్తమామల ఇంట్లో మొదలుపెట్టారు. ప్రతిఒక్కరికీ నెలకు ఒక్కొక్క ఇంటినుంచి పదిరూపాయలు, దానితో పాటు రొట్టె లేదా నెలకు ముప్ఫై రూపాయలు చొప్పున వచ్చేవి. ఇకపై ఈ పని చేయడకూడదని అందరూ గట్టిగా నిశ్చయించుకున్నారు. వాళ్ళ పిల్లల్ని మాత్రం ఈ నరకంలోకి నెట్టకూడదని నిర్ణయించుకున్నారు. అయితే ఇప్పటికే తమను ఈ పనిలోకి దించినందుకు అత్తలపై కోడళ్ళు కోపంగా వున్నారు.

ఇంతలో మక్రానాలోని సఫాయి కర్మచారి ఆందోళన్ నాయకురాలు లక్ష్మీగరు ఇద్దరు ముగ్గురు పాకీపని చేసే ఆడవాళ్ళను వెంటపెట్టుకుని లోపలికి వచ్చింది. లక్ష్మి చాలా సరదా అయిన మనిషి. ఈ మధ్యనే పెళ్ళయింది. సాంప్రదాయబద్ధమైన ముదురురంగు రాజస్థానీ చీరె కట్టుకుంది. దాని కొంగులకి బంగారం రంగు లేసు అందంగా వుంది. చేతులకి గోరింటాకు పెట్టుకుంది. మెడలో రాళ్ళు పొదిగిన నెక్లెస్ వేసుకుంది. ముఖం మీద తేలికపాటి మేకప్ వుంది. ప్రతి ఒక్కరూ ఆమెని అభినందించారు. లక్ష్మి తాను తెచ్చిన స్వీట్లడబ్బాను తెరిచింది. ప్రతి ఒక్కరూ లక్ష్మితో కరచాలనం చేస్తూ అభినందనలు చెప్పటం గమనించాను. బహుశా ఈ రకంగా అభినందించటం కొత్త విషయమే. దీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న స్నేహితుల్లాగా ప్రతి ఒక్కరూ నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు.

నా కుతూహలాన్ని గమనించి, 'నవ్వుకునే పెద్ద విషయమేమీ లేదు. అయినాకానీ మేం నవ్వుకుంటూనే వుంటాం. "ఇంత చెత్త, మురికి పనిచేసే వీళ్ళు ఇంత హాయిగా ఎలా నవ్వుకుంటారు?" అని అందరూ అనుకుంటుండొచ్చు. మేము తరాల నుంచీ ఏడుస్తూనే వున్నాం. కానీ మా రోదన ఎవరికైనా వినిపించిందా? లేదు కదా? మేం కనీసం నవ్వుకోకపోతే జీవించి ఎలా వుండగలుగుతాం? నవ్వటం మాకు ఆక్సిజన్ లాంటిది' అని లక్ష్మి చెప్పింది. అతి త్వరలోనే ఈ ఆడవాళ్ళందరూ ఈ పని వదిలేస్తారని లక్ష్మి మాకు చెప్పింది. ఆ సమయానికి ఆమె మక్రానా, నాగౌర్, బికనీర్‌లోని ఆడవాళ్ళతో కలిసి పనిచేస్తోంది. కానీ ప్రతిచోటా ఒకటే సమస్య – ఈ పని వదిలేస్తున్న ఆడవాళ్ళకి ప్రభుత్వం వైపునుంచి ఏ రకమైన సహాయమూ అందటం లేదు. ఈ సమస్య మాల్పుర నుంచి బికనీర్, ధోల్‌పూర్, శికర్, అజ్మీర్, రాజ్‌సమంద్, బాన్స్‌వాడ, అల్వార్, బార్మెర్, జైసల్మేర్ వరకూ వ్యాపించి వుంది. ఈ పరిస్థితి పట్ల ఆడవాళ్ళ అసంతృప్తిని అర్థం చేసుకోవచ్చు. ఎవ్వరూ కూడా పియ్యిపెంటలతో వుండే బుట్టలను మళ్ళీ పట్టుకోవడానికి సిద్ధంగా లేరు. అలాగని ఖాళీగా కూర్చోవాలని కూడా అనుకోవటం లేదు. గీత సొంతంగా చిన్న వ్యాపారాన్ని మొదలుపెట్టాలని అనుకుంటే, వయసులో పెద్దదయిన భావ్రీదేవి చిన్నపాటి ప్రభుత్వ

ఉద్యోగాన్ని కోరుకుంటోంది. లక్ష్మితో కలిసి టోంక్‌కి వచ్చిన లీలాది బార్మర్. ఆమె ఈ పాకీ పనిని మానేసింది. అంటరానితనం, వివక్షలకు వ్యతిరేకంగా ఒక ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. ఇప్పుడు అతి కష్టం మీద కొంత కుట్టుపని చేయగలుగుతోంది. 'ఎవ్వరూ మాకు సహాయం చేయటానికి సిద్ధంగా లేరు. ప్రతి అడుగులోనూ మేము పోరాడాల్సిందే. ఈ పని చట్టవిరుద్ధమని, తప్పని ఏ ఒక్క ప్రభుత్వ అధికారీ కూడా మాకింతవరకూ చెప్పలేదు. ఈ విషయాన్ని ఎస్‌కెఏ సంస్థ ద్వారా తెలుసుకున్నాం. కేవలం వీరొక్కరి సహాయంతోనే మేము ఈ నరకకూపానికి తలుపులు మూసేయగలిగాం' అని లైలా వివరించింది.

ఆ తర్వాత అందరూ 'జజ్‌మని ' గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. బ్రిటిష్ హయాంలో ప్రారంభమైన ఒక విధానమే 'జజ్‌మని'. రైతుల నుంచి భూమిశిస్తు వసూలు చేయటమే ఈ విధానం. దీనిని అమలుచేయటం కోసం జమీందార్లను నియమించేవారు. ఈ జమీందార్లందరు తిరిగి తమ కింద 'జజ్‌మని' లను నియమించుకునేవారు. ఆర్థిక పరమైన సంక్షోభం వచ్చినపుడు ఈ 'జజ్‌మని'లను ఒక ఆస్తిగా తమ దగ్గర వుంచుకోవటమో లేదా అమ్మేసుకోవడమో చేసేవారు. ఈ 'జజ్‌మని' విధానం పాకీవృత్తిగా ఎలా రూపాంతరం చెందిందో చెబుతుంటే నమ్మశక్యంగా అనిపించదు. కానీ, వాస్తవమేమంటే అదే జరిగింది. జరగటమే కాక ఈ వృత్తిలోనే వాళ్ళను కట్టిపడేయటానికి ఒక వ్యవస్థే తయారయ్యింది.

ఈ విధానానికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను మాకు చూపించాడు ప్యారేలాల్ గోయల్. ఆయన మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పదవీ విరమణచేశాడు. ఆయన తండ్రి మిశ్రీలాల్ వడ్డీకి డబ్బులు అప్పిచ్చేవాడు. ప్యారేలాల్ గోయల్ దగ్గర కాలనీలోని పాకీదొడ్లను తనఖాపెట్టినట్లున్న కాగితాలు చాలా వున్నాయి. ఈ వ్యాపారం అంత లాభసాటిగా లేదని, ఎందుకంటే ఎత్తుడుదొడ్లు వున్న ఇళ్ళు రోజు రోజుకి తగ్గి పోతున్నాయని ఆయన చెప్పాడు. ఈ ఇళ్ళకు ఇప్పుడు జాజ్‌మనీ విధానంగానీ లేదా ఎవరన్నా తాకట్టుపెట్టటం గానీ జరగటం లేదు. ఆయన మాకు చూపించిన ఒక తనఖా డాక్యుమెంటులో ప్రభుజీ అనే అతను ఆ మొత్తం కాలనీని రూ. 10,237లకు తనఖాపెట్టినట్టుగా రాసివుంది. ఇంతలో ఈ వ్యాపారం సన్నగిల్లింది కాబట్టి అతను ఆ డబ్బు తిరిగి చెల్లించడానికి రానేలేదు. ఇంతలో ప్రభుజీ చనిపోయాడు కుడా.

'అంటే మీ నాయన డబ్బు నష్టపోయారా?' అని నేను అడిగాను. 'అవును' 'ఏదో కొంత వడ్డీ వచ్చి వుంటుంది కానీ ఆ తర్వాత అదీ లేదు. వీటిని కొనేవాళ్ళని ఆయన దొరకబుచ్చుకోలేకపోయాడు. ఇంతలో 'జజ్‌మని' విధానమే కనుమరుగైపోయింది. ఇప్పుడు కేవలం కొన్ని ఇళ్ళు మాత్రమే మిగిలివున్నాయి. అవి కూడా చాలా పేదవాళ్ళవి, కాబట్టి వాటినుంచి వచ్చేదేమీ వుండదు. నిజానికి ఇదే మంచిది' అని గోయల్ చెప్పాడు.

దేశంలోని ఇతర ప్రాంతాలలాగే రాజస్థాన్‌లో కూడా ఎత్తుడుదొడ్లను కాల గర్భంలో కలిపేయడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నది వాస్తవం. ఇందుకు చాలా కారణాలున్నాయి. ప్రధాన కారణమేమంటే పాకీపని చేసే ఆడవాళ్ళు ఈ పని చేయటానికి ఇంకెంత మాత్రమూ సిద్ధపడకపోవటమే. కులంతో ముడిపడివున్న ఈ పని వాళ్ళ తలల మీద పియ్యిపెంటల బరువుతో నిండివున్న బుట్టలను పెట్టి అణగదొక్కటాన్ని వాళ్ళింకెంత మాత్రమూ సహించటం లేదు. వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ ఆడవాళ్ళకు ఇది కేవలం పాకీపని వదిలివేయటమే కాదు. ఈ పనిలో ఇమిడివున్న క్రూరత్వాన్ని, తరాలపాటు తామెదుర్కొన్న అవమానాలకు ముగింపు పలికామని దండోరా వేయటం కూడా.

ఇందులో గీత చెప్పిన మాటలకి చాలా ప్రాముఖ్యం వుంది. 'మేము మా తలలు మీద వున్న పియ్యిపెంట బుట్టలనే తోసివేయగలిగినప్పుడు, తలమీద వున్న ముసుగుని తీసేయలేమా? ఈ రెండూ కూడా మా గుండెల మీద చాలా భారాన్ని మోపాయి. ఒకదాని నుంచి విముక్తి దొరికినప్పుడు రెండో దాని నుంచి కూడా విముక్తి వస్తుంది....' ఆమెన్!

(2011లో రాజస్థాన్‌లో టోంక్ జిల్లాలోని మాల్పురాకి వెళ్ళినప్పుడు కలిసిన అనుభవాలు ఈ వ్యాసానికి ఆధారం).

# మధ్యప్రదేశ్




1. ఛతార్‌పూర్ 2. పన్నా 3. దామోహ్ 4. సాగర్ 5. రైసెన్ 6. భోపాల్ 7. గున 8. అశోక్‌నగర్ 9. నిమాచ్ 10. మంద్‌సౌర్ 11. రత్లామ్

మధ్యప్రదేశ్‌లోని ఈ జిల్లాలలో పాకీపనికి వ్యతిరేకంగా ఒక ప్రచారోద్యమం నడుస్తోంది.

**మధ్యప్రదేశ్**

**'వివక్ష ప్రతిచోటా వుంది. మదర్సాలలో, మసీదుల్లో. చివరకు మా స్మశానాలు కూడా వేరుగా వుంటాయి.'**

*వినండి, వినండి, పల్లెల నుంచి వచ్చిన మా అక్కచెల్లెల్లారా*
*ఆపేయండి పాకీ పనిని!*
*కళ్ళు తెరవండి అక్కచెల్లెల్లారా, కళ్ళు తెరుచుకోండి ఇప్పుడు,*
*ఆపేయండి పాకీ పనిని!*
*మీలో మీరు మాట్లాడుకోండి.*
*కమ్లా వచ్చింది. అలాగే కమలా కూడా*
*వాళ్ళు తమతో తస్లీమ్‌ని వెంట తెచ్చారు*
*మీలో మీరు మాట్లాడుకోండి*
*ఆపేయండి పాకీ పనిని!*

*వారి కూతుర్లు, కోడళ్ళు అందరూ దీన్నే కోరుకుంటున్నారు.*
*వారి తోడికోడళ్ళు కూడా*
*వారి అత్తమామలు వేడుకుంటున్నారు*
*ఆపేయండి పాకీ పనిని!*
*తగలబెట్టండి ఈ బుట్టల్ని!*
*ఆపేయండి ఈ పాకీ పనిని!*

ఈ పాటను సొంతంగా వాళ్ళే తయారుచేసుకున్నారు. తమలాంటి ఆడవాళ్ళ కోసం తయారుచేసిన అనేక పాటల్లో ఇది కూడా ఒకటి. ఇందులోని పదాలు అతి సామాన్యంగా కనిపించవచ్చేమో గానీ ఈ ఆడవాళ్ళకు అది ఒక ప్రకటన. ఒక విముక్తి పిలుపు.

మధ్యప్రదేశ్‌లో పాకీదొడ్లను శుభ్రం చేయటాన్ని 'మైలా జాడ్‌నా' అంటారు. ఈ పనిచేసే మహిళలను 'మెహ్‌తర్' లేదా 'భంగి' అని పిలుస్తారు. ఒక విధంగా చెప్పాలంటే ఈ ఆడవాళ్ళంతా జాగీర్ధార్లు. అయితే ఇక్కడ జాగీర్ లేదా జాగీర్దార్ అనే పదాలకున్న అర్థాలు వేరు. మనకు ఇప్పటివరకూ తెలిసిన అర్థాలు వేరు. ఇక్కడ ఒట్టి చేతులతో తోటి మనుషుల పియ్యిపెంటలను శుభ్రంచేసే పనిని సంపదకు సూచికగా వుండే జాగీర్దారి అనే పదంలో చుట్టిపెట్టేసి, శతాబ్దాల తరబడి ఈ దోపిడీని చట్టబద్ధం/సమాజబద్ధం చేసేశారు. కొన్ని తరాలుగా ఈ ఆడవాళ్ళు, వాళ్ళ కుటుంబాలు ఈ జాగిర్దారీల మీద ఆధారపడటమే కాక అప్పుడప్పుడూ వారసత్వంగా లేదా తండ్రి నుంచి వచ్చే జాగిర్దారీగా ఒక తరం నుంచి ఇంకో తరానికి పాకీ పనిని బుట్ట, చీపురు ద్వారా అందించే సగర్వమైన వృత్తిగా భావిస్తారు.

'జాగిర్దారీ' అంటే అసలు అర్థం ఒక ఫ్యూడల్ సంస్థానం. ఈ పదం ప్రపంచంలోనే అత్యంత హేయమైన పనికి పెట్టటం అనేది ఆలోచిస్తే బుర్ర తిరిగిపోతుంది. దానికన్నా మరింత తల తిరిగే అంశమేమంటే ఈ ఆడవాళ్ళు దాన్ని ఒక కులగౌరవంతో ముడిపెట్టి చూడటం. అన్నింటికీ మించి దుర్మార్గమైనది. చాలామంది ఆడవాళ్ళు కుళ్ళి కంపుగొట్టే ఈ పియ్యిపెంటల్ని ఎత్తి పారవేయటాన్ని తిట్టుకుంటూనే, మరోవైపు దాన్ని వదిలేయటానికి మాత్రం సిద్ధపడకపోవడం. వాళ్ళు దాదాపు పోట్లాటకు సిద్ధమై, 'ఇది మా వృత్తి, ప్రపంచానికి మేం ఈ విధంగానే తెలుసు; మా పిల్లల్ని కూడా ఈ పని చేయటం కోసమే మేం పెంచుతున్నాం...' అన్నారు. ఈ స్వభావానికీ పూర్వకాలంలో, రాజుల నుంచి ఫ్యూడల్ సంస్థానాలను బహుమతులుగా అందుకునే పాలేర్ల స్వభావానికీ మధ్య చాలా సారూప్యతలున్నాయి.

పాకీపని జాగిర్దారీని అత్త తన కోడలికి అందజేస్తుంది. ఇది ఎలా జరుగుతుందంటే, ఇంటికి కొత్త కోడలు వచ్చినపుడు అత్త చేసే మొట్టమొదటి పని జాగిర్దారీని పంచటం. ఇద్దరు ముగ్గురు కోడళ్ళకు జాగిర్దారీని పంచటం అన్నది చాలా సమస్యతో కూడుకున్న

పని. ఎక్కువమంది వారసులున్నచోట ఆస్తి పంపకం ఎంత సమస్యో ఇదీ అంతే. పెళ్ళికి ముందే దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరిగిపోతాయి. పెళ్ళి సంబంధం కుదుర్చుకోవటానికి జరిపే మాటల్లోనే, కట్నకానుకల విషయం మాట్లాడేటప్పుడే జాగిర్దారీలో ఎన్ని ఇళ్ళు వున్నాయో కూడా చర్చించుకుంటారు. వీళ్ళు చెప్పినదాన్ని అమ్మాయి కుటుంబం ప్రత్యక్షంగా చూసి నిర్ధారించుకుంటుంది. దీనివలన తమ బిడ్డ తర్వాత ఇబ్బందిపడకుండా వుంటుందన్నది వారి భావం. పెళ్ళయిన రెండు మూడు రోజుల అనంతరం అత్త కోడలికి ఒక కొత్త బుట్ట, కొత్త చీపురు ఇచ్చి ఆమెని తీసుకుని జాగిర్దారీ అంతా తిప్పి తీసుకువస్తుంది. జాగీర్దారీ ఇళ్ళల్లో ముందుగా 'మున్హిడికాయి' వేడుక జరుగుతుంది. అంటే కొత్తగా వచ్చిన కోడలు తన ముఖాన్ని భర్తవైపు బంధువులకు చూపించి కానుకలు లేదా డబ్బు లేదా కొన్ని నగలు ఆశీర్వాదంగా తీసుకోవటం. ఆ తర్వాత ఈ పనిలో ఇమిడివున్న సాధకబాధకాల గురించి అత్త తన కోడలికి విపులంగా వివరిస్తుంది.

తమ తల్లిదండ్రుల ఇంట్లో ఈ పని అలవాటు లేని కొంత మంది కోడళ్ళు మొదట్లో తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఏడుపులు, పెడబొబ్బలతో గొడవచేస్తారు. కానీ ఇలాంటి సంఘటనల్లో భర్తా, అత్తామామలు అందరూ కలిసి ఆమె ఈ పని చేయకపోతే గనుక ఇంటి నుంచి తరిమేస్తామని బెదిరిస్తారు. దురదృష్టవశాత్తూ చాలామంది అమ్మాయిలకు భర్త ఇంటి నుంచి గెంటివేయబడ్డామనే నిందతో పోలిస్తే అవమానకరమైన పాకీపని చేయటమే నయమనిపిస్తుంది. అన్నిచోట్లలాగానే ఇక్కడ కూడా విషపూరితమైన కులవ్యవస్థ కుళ్ళిన మానవ విసర్జితాల్లో మునిగితేలుతూ వర్ధిల్లుతోంది.

పాకీపని, దానికి రక్షణగా వున్న జాగిర్దారీ వ్యవస్థ కేవలం హిందువుల్లో మాత్రమే లేదు. ముస్లింలలో కూడా వుంది. ఈ రెండు మతాల్లోనూ బుట్టనిండుగా పియ్యిపెంటలను మోసుకెళ్ళేది ఆడవాళ్ళు మాత్రమే. వీళ్ళని 'అంటరానివాళ్ళు'గా చూస్తారు. మధ్యప్రదేశ్‌లో భోపాల్‌కి 155 కిలో మీటర్లు, ఉజ్జయినీకి 35 కిలోమీటర్ల దూరంలో వున్న దేవాస్ పట్టణంలో నేను వీరిలో కొంత మంది ఆడవాళ్ళని కలిశాను. గరిమా అభియాన్ అనే సంస్థకు చెందిన చిన్న గదిలో వీళ్ళంతా కూర్చుని వున్నారు. తమకెదురైన ఒక సమస్యను వేరొకరి ఇంట్లో సమస్యను పరిష్కరించినట్లుగా ఎంతో చాకచక్యంగా, నేర్పుగా చర్చించుకోవటం చూసి నేను ఆశ్చర్యపోయాను. రకరకాల రూపాల్లో కులవ్యవస్థ అమలయ్యే కుట్రపూరిత పద్ధతుల గురించి వారు తమ మాటలద్వారా బహిరంగపరుస్తున్నారని బయటనుంచి చూసేవారు ఎంత మాత్రమూ అర్ధంచేసుకోలేరు. ఈ పాకీ పనివాళ్ళు – ఈ మెహత్రానీలు, ఈ భంగీలు – నవ్వులతో, ఎగతాళి మాటలతో, అనాగరికతతో, ఎత్తిపొడుపులతో వాళ్ళలో వున్న బాధను బయటకు చెప్పుకోవటానికి ఆ గదిలో ఒక దగ్గరకు చేరారు.

కొత్త ప్రపంచం ఏదో నా ముందు పరుచుకున్నట్లుగా భావించాను. అసలు విషయమేమంటే ఈ పాకీ పనివాళ్ళు ఈ జాగిర్దారీ వ్యవస్థకి ఎంతగా అలవాటుపడ్డారంటే,

దాన్నుంచి బయటపడటానికి ఏ మాత్రం సిద్ధంగా లేరు. ఈ పని మానేయడానికి ముందుకొచ్చిన వాళ్ళు కూడా ఎన్నో ప్రయత్నాల తర్వాత మాత్రమే అందుకు ఒప్పుకున్నారు. ఆసిఫ్ షైక్ నాయకత్వంలో గరీమా అభియాన్ దుర్మార్గమైన ఈ పనిని అంతమొందించటానికి, దీనిలో చిక్కుకుని వున్న ఆడవాళ్ళకు విముక్తి ప్రసాదించడానికి గట్టి ప్రయత్నాలే చేస్తోంది. నూనెపిండే పనిచేసే ముస్లిం నేత సమూహానికి చెందిన వాడు ఆసిఫ్ షైక్. ఆసిఫ్ అతని సహచరులు పలు ప్రాంతాల్లో క్రూరమైన ఈ జాగిర్దారీ విధానంలో వున్న స్త్రీలను స్వతంత్రులను చేశారు. ఈ ప్రయత్నాల వల్ల ఆ ప్రాంతాలలో పాకీపని పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మధ్యప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ సంస్థ క్రియాశీలకంగా పనిచేస్తోంది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు విస్తరించే ప్రయత్నంలో వుంది. దీనికోసమై గరీమా అభియాన్ పాకీపని వదిలేసిన స్త్రీలతో ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసింది. పాకీపని నుంచి విముక్తి చెందిన ఈ స్త్రీలు పక్క రాష్ట్రాల్లో వున్న తమ బంధువుల ద్వారా అక్కడ ఈ పని ఇంకా కొనసాగుతోందా, కొనసాగుతుంటే ఏఏ ప్రాంతాల్లో జరుగుతోంది వంటి వివరాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత ఆ ప్రాంతాలకు వెళ్ళి ఆ పనిచేస్తున్న వాళ్ళతో మాట్లాడి దానిని వదిలేసేలా నచ్చచెప్తున్నారు. దీనికోసం వాళ్ళు పెళ్ళిళ్ళు, చావులు, పిల్లల పుట్టుక వంటి అనేక క్రతువులను అడ్డంపెట్టుకుని సమాచారాన్ని సేకరిస్తున్నారు.

అరవయ్యేళ్ళ స్వతంత్రం తర్వాత భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆరాధ్య దైవం డా. బాబాసాహెబ్ అంబేద్కర్ పుట్టిన మాహులో ఇప్పటికీ పాకీపని విస్తృతంగా జరుగుతోందని తెలియరావడం అత్యంత బాధాకర సందర్భం. దళితుల అభ్యున్నతికై పని చేస్తున్నామని చెప్పుకునే రాజకీయ పార్టీలకు, సంస్థలకు మాహు ఒక యాత్రాస్థలం అని చెబితే ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. నిజానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న లక్షలాదిమందితో దళితజాతి పునరుజ్జీవనం కోసం ఒక విజయోత్సవంలాగా డాక్టర్ అంబేద్కర్ జయంతిని ధర్నాలు, ఊరేగింపుల రూపంలో నిర్వహిస్తారు. అయితే 2009లో మాహులోని ప్రధాన కంటోన్మెంట్ ప్రాంతంలో 15 మంది స్త్రీలు తమ నెత్తిమీద పియ్యిపెంటలతో నిండివున్న బుట్టలను మోసుకుంటూ వెళ్ళటం గరీమా అభియాన్ కార్యకర్తల కంటపడింది. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం పక్కనే వారు కనిపించటం ఒక విషాద సంఘటన.

కంటోన్మెంటులోని అంబేద్కర్ ఇంటిస్థలంలోనే ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ ఆడవాళ్ళు ఆ కాలనీకి దగ్గరగా వున్న ఇళ్ళలోని పాకీదొడ్లని శుభ్రంచేయటానికి వెళ్తున్నారనేది స్పష్టం. ఈ హేయమైన మురికి పనిని వదిలేయమని చెప్పటానికంటే ముందు సంస్థ కార్యకర్తలు ఆ ఆడవాళ్ళని, వారి కుటుంబ సభ్యులను కలిసి వివరంగా ఎంతోసేపు మాట్లాడారు.

ఆసక్తికరమైన విషయమేమంటే, మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ఒకప్పుడు కేబినెట్ మంత్రిగా వున్న లక్ష్మణ్‌సింగ్ ఘరు పూర్వకాలంలో పాకీపని చేసిన వ్యక్తి అని ఆసిఫ్

ద్వారా నాకు తెలిసింది. అయితే ఘురు ఈ పని వదిలివేసి పోలీస్‌ఫోర్స్‌లో చేరాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చాడు. 1977 లో జెపి (జయప్రకాష్ నారాయణ్) ప్రచారోద్యమం తర్వాత అతను జనతా పార్టీ ప్రభుత్వంలో మంత్రి అయ్యాడు. దేవాస్‌లో అతని కుటుంబ సభ్యులు పాకీపనే చేస్తూవుండేవారు. కానీ మాహులోని తన అమ్మమ్మా తాతయ్యల ఇంట్లో పెరిగాడు. అయితే ఈ సమూహం నుంచి వచ్చిన వ్యక్తి క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చి మంత్రి పదవి అందుకోవటం వల్ల ఈ సమూహానికి ఏవిధమైన ఉపయోగం జరగలేదు. ఆ ప్రాంతం నుంచి ఎత్తుడుదొడ్లు పోవటము లేదా పాకీవాళ్ళు ఆ పని నుంచి విముక్త మవటం అనేది జరగలేదు. పాకీ పనిచేసే ఆడవాళ్ళ రాతలు మార్చటంలో గానీ, వారికి స్వేచ్ఛనందించే విషయంలో గానీ రాజకీయ యంత్రాంగానికి ఏవిధమైన సహానుభూతి లేదు. దళిత నినాదం ఇచ్చే ప్రతి ఒక్కరికీ కూడా ఈ స్త్రీలు ఒక శిక్షగా పాకీవాళ్ళుగా వుండటమే కావాలి.

ఈ దేశంలో కేవలం హిందూస్త్రీలు మాత్రమే మానవ విసర్జిత పియ్యిపెంటలను నెత్తిమీద మోయటం లేదు. ముస్లింస్త్రీలు కూడా తమ తలల మీద కుళ్ళూ, గబ్బుతో వున్న ఈ భారాన్ని మోస్తూవున్నారు. హిందూ దళితస్త్రీల మాదిరే వీళ్ళు కూడా ఆ వివక్షను ఎదుర్కోవలసిందే. మధ్యప్రదేశ్‌లోని ముస్లింలలో పాకీపని భారం హేలా సమూహంలోని స్త్రీల భుజాల మీదే పడింది. ఇస్లాంలో అంటరానితనం లేనప్పటికీ హేలా సమూహంలోని ఈ స్త్రీలూ, వారి పిల్లలూ అంటరానివారిగా పరిగణించబడుతూ, వివిధ స్థాయిల్లో దారుణమైన అవమానాలకు గురవుతున్నారు. ఇది శతాబ్దాల తరబడి ఒక అప్రకటిత విధానంగా సమాజంలో వేళ్ళూనుకుని అమలవుతూ వస్తోంది.

ప్రస్తుత హేలా సమూహం ఎదుర్కొంటున్న ఈ బాధల పొరలను విప్పిచూపిస్తూ తస్లీమ్ ఎంతో విపులంగా ఆ విషయాలను స్థిరస్వరంతో వివరించింది. 25–30 ఏళ్ళపాటు జీవితాన్ని పాకీపనిలో వృథాగా గడిపిన పిదప గరీమా అభియాన్ సంస్థతో అనుబంధంలోకి వచ్చింది. తస్లీమా ఈ పని వదిలేసిన అనంతరం స్థానిక పంచాయితీ ఎన్నికల్లో నిలబడి రెండుసార్లు 'పంచ్'గా ఎన్నికయింది. దీనికన్నా ముఖ్యమైనదేమిటంటే, అన్నేళ్ళపాటు ఎవరింట్లో అయితే పాకీదొడ్లు శుభ్రంచేసిందో ఆ ఠాకూర్ మీదే ఆమె పోటీచేసింది. తస్లీమా తన గురించి తాను మాట్లాడటం కన్నా తనతో వుండే జైతూన్‌బీ గురించి చెప్పటానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. సన్నటి జీరగొంతుతో, గాఢ భావావేశంతో చెప్పే పదాలకు తగ్గట్లుగా ఆకట్టుకునే హావభావాలతో మాట్లాడటంలో ఆమెకో ప్రత్యేక విధానముంది.

'ఉజ్జయిని నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో కాలూహెడ వుంది మీకు తెలుసా? అక్కడినుంచి ప్రతిరోజూ పాకీపని చేయటానికి వచ్చి మళ్ళీ తిరిగి వెళ్ళేది జైతూన్‌బీ. ఈ జాగీర్‌ని రూ. 40,000లకు ఈమె కొనుక్కుంది. మేమిద్దరమూ ఈ పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వచ్చేవాళ్ళం. తర్వాత మేం చాలాదూరం తిరిగి రావాల్సివచ్చేది. ఆమె కొడుకు పోలీసు అని మొదటిసారి తెలిసినపుడు నేను ఎంతో ఆశ్చర్యపోయాను. రోజులు గడిచేకొద్దీ

ఆమె ఆలోచనలు మారాయి – ఈ పనినే అంటిపెట్టుకున్న ఆమె క్రమేపీ దీనిని వదిలివేయడానికి సిద్ధమయింది. ఇప్పుడు ఈ పాకీ పనిని నిర్మూలించే విషయంలో ధైర్యంతో అందరికంటే ముందు నిలబడి పనిచేస్తోంది. తరానా–ఉజ్జయినిలో జైతూన్‌బీ, నేనే ఈ పనిని ముందుగా వదిలేసినవాళ్ళం' అని జైతూన్‌బీ గురించి తస్లీమా చెప్పింది.

'నువ్వు కూడా వివక్షకు గురయ్యావా' అని అడిగాను.

దీనికి సమాధానం ఆసిఫ్ నుంచి వచ్చింది. 'ముస్లింలలో వివక్ష వుండదనుకోవటం పొరపాటు అభిప్రాయం. ఇక్కడా అది వుంది. వివక్ష ప్రతిచోటా వుంది. మదర్సాలలో, మసీదుల్లో, చివరకు మా స్మశానాలు సైతం వేరుగా వుంటాయి'.

ఆ గ్రూపులోనే వున్న అలీహుస్సేన్ దీనికి అనుకూలంగా స్పందిస్తూ 'నేనేం చెప్పాలి? ఇక్కడ వివక్ష కనిపించకుండా వుంటుంది. బయట నుంచి చూస్తే ఏమీ కనిపించదు. పండుగ రోజుల్లో ప్రతి ఒక్కరూ నమాజు ప్రార్ధనల కోసం మసీదుకి వెళతారు. కానీ మామధ్య వుండే దూరం స్పష్టం. రంజాన్ సమయంలో, రోజా–ఇఫ్తార్ విందుల్లో చాలా వివక్ష వుంది. అందరితో పాటు మమ్మల్ని కూర్చోనివ్వరు. హేలా సమూహం నుంచి వచ్చిన వారిని వేరుగా కూర్చోబెడతారు. మా పిల్లల్ని అందరూవాడే కుండల నుంచి నీళ్ళు తీసుకోనివ్వరు. వాళ్ళే చిన్న లోటాల్లో పోసి ఇస్తారు తప్పించి, మా అంతట మేము దానిలో నుంచి ముంచుకుని తాగటానికి వీల్లేదు'.

విషయం ఇంత సున్నితమైనదైనా అలీహుసేన్, తస్లీమా గడగడమని ఒకేరకంగా మాట్లాడుతున్నారు. 'ముందుగా వాళ్ళు మమ్మల్నసలు రోజా–ఇఫ్తార్‌లకు పిలవరు' అని తస్లీమా అంది. 'మేము మా ప్లేటు, గ్లాసు తీసుకుని అక్కడికి వెళ్ళినాగానీ, మాప్లేట్లను ఒక పక్కన వుంచి వాటిల్లో విడిగా వడ్డిస్తారు. అందుకే మాలో చాలా మందిమి వాటికి అస్సలుపోము. వాళ్ళు కూడా పండగలప్పుడయినా మా ఇళ్ళకేమీ రారు. కాబట్టి మమ్మల్ని ఆహ్వానించటం అనే ప్రశ్నే అస్సలు వుండదు. మా ఇళ్ళకు వాళ్ళెందుకు వస్తారు? సమస్యే లేదు. మేము దినమంతా రోజా (ఉపవాసం) వుంటే, ముస్లిమేతరులు మాకు తినడానికి ఏదైనా ఇస్తారు. మా వాళ్ళు మాత్రం మమ్మల్ని పట్టించుకోరు.'

'ఇవన్నీ చూసిన తర్వాత మీరు గానీ మీ కుటుంబ సభ్యులు గానీ మీ అంతట మీరుగా ఈ పనిని వదిలివేయాలని ఎప్పుడైనా అనుకున్నారా?'

'లేదు, అదే అసలు సమస్య!' తమ ముందు వున్న వాస్తవ పరిస్థితిని దుఖ్ఖపూరత స్వరంతో అలీహుస్సేన్ మాకు వివరించాడు. 'మేము జాగీర్దారీలం. మేము ఈ పని చేయవలసిందే.....చిన్నప్పటినుంచీ ఈ మాటలు వింటూనే నేను పెరిగాను. మా అమ్మకి పెళ్ళయి మా ఇంటికి వచ్చినపుడు ఈ విషయమై ఆమెకు, ఆమె అత్తకు అంటే మా నానమ్మకు మధ్య గొడవలు జరిగేవి. మొదట్లో ఈ పని చేయటానికి మా అమ్మ ఇష్టపడలేదు. ఇప్పుడు ఆమెని ఈ పని వదిలేయమంటే అందుకు ఏ మాత్రం సిద్ధంగా లేదు. నేను,

గరీమా అభియాన్‌తో కలిసి తిరుగుతున్నప్పటి నుంచీ ఈ పని వదిలేయమని ఆమెని అడుగుతూనే వున్నాను. ఆమె అంగీకరించడంలేదు. "ఈ పనితోనే నేను కొంత సంపాదిస్తున్నాను. నిన్ను పెంచింది కూడా దీనిలో నుంచే" అని ఆమె అన్నది. ఒకరోజు మొహల్లా నుంచి ఆమె తెచ్చిన రొట్టె, ఇతర తిండి పదార్థాలను నేను బయటికి విసిరికొట్టాను. వాటిని చూస్తుంటే నా రక్తం మరిగిపోయింది. దానితో అమ్మ కోపంతో, బాధతో ఆపకుండా ఎంతో సేపు ఏడుస్తూనే ఉంది. "దౌర్భాగ్యుడా! దీనితోనే నిన్ను పెంచానురా. ఈ రోజు నువ్వు అవమానిస్తున్నావ్" అని తిట్టిపోసింది. ఇదంతా నాకు ఎంతో కష్టంగా, సిగ్గుగా వుంది. నేను గరీమా అభియాన్‌తో పనిచేస్తున్నప్పటికీ నా సొంత ఇంట్లోనే ఈ పనిని ఆపేయించలేకపోతున్నాను. మా అమ్మ ఒక్కటే కాదు. మా అక్క కూడా. మా పెద్దబావకు బస్‌స్టాండుకి దగ్గరలో మంచి టైలరింగ్ షాపు వుంది. ప్రతినెలా రూ. 15,000–20,000 వరకూ సంపాదిస్తాడు. కానీ మా అక్క ఇళ్ళల్లో పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వెళ్తూనే వుంది. ఈ అమానవీయ పని గురించి ఆమెకి అర్థం చేయించటానికి ప్రయత్నించి నేను విసిగిపోయాను. ఆమెతో మాట్లాడటానికి గుజరాత్ నవసర్జన్ ట్రస్టు నుంచి మంజులాబెన్ కూడా వచ్చింది. అయినా ప్రయోజనం లేకపోయింది ఘోరమైన విషయం ఏమిటంటే అమ్మీ కింద వున్న ఇళ్ళల్లోని పాకీదొడ్లు శుభ్రం చేయటానికి ఇంకెవరన్నా కనుక వెళితే పెద్ద గలాటా జరగటం ఖాయం. కొట్టుకోవడాలు, తిట్టుకోవడాలు, పోట్లాటలు, పోలీసులు, కోర్టు – ఒకటేమిటి, ఏదీ వదిలిపెట్టకుండా అన్నీ జరుగుతాయి. తరానా – ఖైతా ప్రాంతంలోని పాత మొహల్లాలలో ఏదన్నా కొత్త ఇల్లు కడుతున్నారంటే అక్కడ సమస్య మొదలవుతుంది. నిజానికి ఏ ఇంట్లో అయినా ఒక్క పాకీదొడ్డే వుంటుంది కదా! ఇక్కడ సమస్యేమిటంటే దాన్ని ఎవరు శుభ్రం చేయాలనేదాని మీద జగడం మొదలవుతుంది. ముందుగా ఆ ప్రాంతం ఎవరి కిందకు వస్తుందో చూసి ఆ తర్వాత సరిహద్దులు నిర్ణయిస్తారు. లేకపోతే కొన్నిసార్లు విషయాన్ని చక్కదిద్దటానికి పోలీసులు కూడా రంగ ప్రవేశం చేస్తారు'.

'మా నాన్న ఒక ప్రభుత్వ ఉద్యోగి – ఉపాధ్యాయుడు' అని అలీహుస్సేన్ వివరంగా చెప్పడం మొదలుపెట్టాడు. 'ఆయన ఈ మధ్యనే పదవీ విరమణచేశాడు. ఆయనకు నెలకు రూ. 15,000 వరకూ జీతంవచ్చేది. అయినా మా అమ్మ ముప్పయి సంవత్సరాలుగా పాకీపని చేస్తూనేవుంది. మా మామ కూడా ప్రభుత్వ ఉద్యోగమే చేస్తూండేవాడు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవాడు. అయినా మా అత్త తన జీవితమంతా ఇదే పనిచేసింది. ఉజ్జయిని జిల్లాలోని తరానాలో మా అమ్మ పనిచేసింది. మా పెద్దమామ కొడుకూ ఉపాధ్యాయుడే కానీ అతని భార్య, అమ్మ ఇద్దరూ ఈ పనే చేస్తున్నారు. మొత్తం కుటుంబం అంతా తరానాలోని ప్రయివేటు ఇళ్ళల్లో ఇప్పటికీ ఈ పనే చేస్తున్నారు. నా సొంత ఇంట్లోనే నేను ఓడిపోయానని అనిపిస్తుంది. ఇక బయట

నేనేం చేయగలుగుతాను? వాళ్ళకి అర్థం చేయించటం అనేది కష్టమైన పని. ఈ పాకీపనిచేయటం కోసమే మేము పుట్టామని, ఇదొక సేవలాంటిదని వాళ్ళల్లో జీర్ణించుకు పోయింది'.

ఈ కథనాలకు అంతమంటూ లేదు. నేను మాట్లాడిన వాళ్ళు తమ సొంత అనుభవాలను గుర్తు తెచ్చుకోవటమే కాక, వాళ్ళ కుటుంబీకులవి, బంధువులవి, పక్కింటివాళ్ళవి, వాళ్ళు కలిసిన వాళ్ళవి కథలు కథలుగా చెప్తూనే వున్నారు. మాటల క్రమంలో ఈ నిషిద్ధపు పనిలో ఇమిడివున్న ఎన్నో సామాజిక– ఆర్థిక కోణాలు మా ముందుకువచ్చాయి. మామూలు చర్చల్లో అయితే ఇలాంటివి తొందరగా వెల్లడికావు. మధ్యప్రదేశ్‌లోని హిందూ, ముస్లిం పాకీవాళ్ళల్లో ఒక ప్రత్యేక వేషధారణను నేను గమనించాను. ఇద్దరూ కూడా ముఖాలను కప్పుకుంటున్నారు. హిందూ స్త్రీలేమో చీర కొంగుతో కప్పుకుంటే, ముస్లిం స్త్రీలేమో పర్దాతో కప్పుకుంటున్నారు. ఇద్దరూ కూడా పనికిపోయే ముందుగా లంగ్డా ధరించి వెళ్తున్నారు. చీరలో నాలుగో భాగం వుండే ఒక గుడ్డముక్కే లంగ్డా. దానిని లోపలి లంగా మీద వేసుకుంటారు. సాధారణంగా హిందూ స్త్రీలు చీర కట్టుకుంటారు. హేలా సమూహం వాళ్ళు సల్వార్ కమీజ్ వేసుకుంటారు. పాకీదొడ్లు శుభ్రం చేయటానికి వెళ్ళేముందు హేలా సమూహం స్త్రీలు తలనిండా ముసుగు ధరిస్తారు. తమ సల్వార్‌లను పైకి లాక్కుని దానిమీద లోపలి లంగా వేసుకుని ఆపై ఈ లంగ్డాలను చుట్టుకుని పైకి చెక్కుకుంటారు. మరోవైపు హిందూ స్త్రీలు చీరకు బదులుగా లంగ్డానే చుట్టుకుంటారు. ఈ వేషధారణ పాకీపని వాళ్ళందరిలోనూ కనిపిస్తుంది. అయితే ఈ పద్ధతి ఎలా సంక్రమించిందో వీరిలో ఎవరికీ తెలియదు. ఆంధ్రప్రదేశ్‌లోని పాకీ పని వాళ్ళు కూడా ఇలాంటి ఒక బట్టనే కట్టుకుంటారు. దానిని 'ముసుగు' అంటారు.

'ముస్లిం సమాజంలో వైరుధ్యాలతో కూడుకునివున్న కొన్ని అంశాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. ఉదాహరణకు పరదా పద్ధతిని మేము కచ్చితంగా పాటిస్తాము. అలానే తమ ఆడవాళ్ళను ఇళ్ళనుంచి బయటకు పంపించం అని కూడా చెప్తారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఇలా చెప్పిన ఈ మనుషులే వారి ఆడవాళ్ళను తెల్లవారు ఝామున 5 గంటలకే రోడ్లను ఊడవటానికి, ఆ తర్వాత పాకీదొడ్లను శుభ్రం చేయడానికి పంపిస్తారు. ఈ పనులన్నీ చేయడానికి వీళ్ళను పంపిస్తున్నందుకు మేమేమీ సిగ్గుపడం! ఆడవాళ్ళందరూ వారు హిందువు అయినా ముస్లిం అయినా, పాకీదొడ్లను శుభ్రం చేసేటప్పుడు వారి ముఖాలను కొంగులతోనో, చున్నీలతోనో పూర్తిగా కప్పుకుంటారు. దీనివలన ఎవరు ఈ పని చేస్తున్నారో ఇతరులు గుర్తుపట్టలేరు. మా అమ్మ కూడా పొడుగాటి కొంగుని తన తలమీదుగా కిందికి కప్పుకుంటుంది. వారి కూతుళ్ళను గానీ కోడళ్ళను గానీ చదువుకోటానికి మదర్సాలకు లేదా పాఠశాలకు పంపించమని అడిగితే గట్టిగా ఎదురుతిరుగుతారు. పైగా మా ఆడవాళ్ళు బయటకు వెళ్ళరు అని వాదిస్తారు. ఎంత

వంచన! వాళ్ళ ఆడవాళ్ళను పాకీదొడ్లు శుభ్రం చేయటానికి పంపించటానికి ఏమాత్రం సిగ్గుపడనివారు మదర్సాలకు పంపించి చదివించటానికి మాత్రం ఎంతో అవమానపడ్డారు. మా కుటుంబంలో మా అమ్మ, మా అక్క, నా భార్య – ఒక్కరు కూడా చదువుకోలేదు. వాళ్ళని ఎక్కడికీ వెళ్ళనీయలేదు. కేవలం మా ఇంట్లోనే కాదు, ఏ ఇంట్లో కూడా ఆడ వాళ్ళు చదువుకోవటానికి అంగీకారం లేదు' అని అలీహుస్సేన్ నాతో చెప్పాడు.

మాటల మధ్యలో స్థానికంగావున్న పలు పోలీస్‌స్టేషన్లలో కూడా ఈ ఎత్తుడుదొడ్లు వున్నాయని మాకు తెలిసింది. గరీమా అభియాన్ కార్యకర్తలు వీటిలో అనేకం కూల్చేశారు. అలాంటి ఒక సంఘటనను ఆసిఫ్ వివరించాడు. 'నరైనాఖైతాలోని పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎత్తుడుదొడ్డి వుంది. ఈ సమూహంలోని కొంత మంది వెళ్ళి దానిని శుభ్రం చేసి వస్తూ వుండేవారు. ఈ విషయం మాకు తెలిసింది. మేము పాకీ పనివాళ్ళను మాతో వెంట పెట్టుకుని వెళ్ళి దాన్ని కూలగొట్టాం. ఈ విషయం మీద చాలా వాదనలు, ఘర్షణలు జరిగాయి. దీనిమీద మేము తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే జనం మాతో వున్నారు. అంతేకాకుండా ఇలాంటి పాకీదొడ్లను కూలగొడుతుంటే చట్టపరంగా మమల్ని ఎవ్వరూ ఆపలేరని మాకు తెలుసు. అందుకే దాన్ని కూలగొట్టి గుణపాఠం నేర్పాం. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో దీని గురించి విస్తృతంగా ప్రచారాన్ని చేశాం.'

ఆ తర్వాత మా చర్చ ఇంకోవైపుకి మళ్ళింది. ఆసిఫ్, అతని బృందంలో వున్న స్త్రీలు ఈ ప్రచారంలో తామెంచుకున్న వివిధ పద్ధతులు, ఎత్తుగడల గురించి మాట్లాడాలను కున్నారు. ఎంతో ప్రయత్నం మీదట పాకీపనిని వదిలి పెట్టటానికి ఒప్పుకున్న ఆడవాళ్ళని తమ నిర్ణయం మీదే నిలబడేలా చేయటమనేది గరీమా అభియాన్ ఎదుర్కొన్న అతి పెద్ద సవాలని నాకు చెప్పారు. ఒకసారి ఎవరైనా ఈ పని వదిలేయటానికి సిద్ధపడితే వాళ్ళ అత్తల నుంచి అభ్యంతరం ఎదురయ్యేది. గరీమా అభియాన్ వెళ్ళినప్పుడు 'కుటుంబం కోసం నా జీవితమంతా ధారపోశాను. నా పరిస్థితేం కావాలి? మీరు ఇప్పుడు వచ్చి ఈ పని తప్పించుకోవటానికి నా కోడలికి సహాయం చేస్తున్నారు. ఇన్ని సంవత్సరాలలో నా గురించెవరూ ఆలోచించలేదు' అని అంటుండేవారు. దాంతో గరీమా అభియాన్ సభ్యులు ఎంతో ఓపికవహించి అత్తలతో మాట్లాడి ఈ పాకీపని నుండి ఎందుకు విముక్తంకావాలో వివరించి, ఆ పనివల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి పదేపదే వివరించేవారు. ఇకనుంచీ తన కోడల్ని పాకీదొడ్లు శుభ్రం చేయటానికి పంపించనని ఒప్పించిన తర్వాత ఆమె అంగీకారంతో ఫొటో ఒకటి తీసేవారు. ఒకవేళ భర్త అడ్డుచెబితే సదురు వ్యక్తికి కూడా కౌన్సిలింగ్ చేసి ఒప్పించి, భార్యాభర్త లిరువుర్నీ పూలదండలు మార్చుకోమని చెప్పేవారు. 'ఈరోజు మీరిద్దరూ మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు' అని చెప్పి ఒక ఫొటో తీసేవారు. ఆ ఫొటోగ్రాఫ్‌కి ఫ్రేమ్ కట్టించి, ఒక స్వీట్‌డబ్బాతో పాటు బహుమతిగా ఇచ్చేవారు. ఇక ఆ రోజు నుంచీ పాకీ పనిని పూర్తిగా వదిలివేస్తున్నట్లుగా సందేశం రాసివున్న ఒక ట్రోఫీని సైతం అందించేవారు.

'ఏదైనా ఒక ముఖ్యమైన అంశం మీద మా ఎత్తుగడను గురిపెట్టేవాళ్ళం. మొదటి అడుగేమిటంటే దుర్భర పరిస్థితిలో నుంచి పాకీ పనివాళ్ళు బయటకు వచ్చేలా సహాయపడటం. రెండోది: దీనిలో నుంచి విముక్తమైన ఆడవాళ్ళ సాయంతో వేరే ప్రాంతాలలో వుంటున్న వాళ్ళని కలిసి వారితో కూడా ఈ పని మానిపించేలా ప్రయత్నించడం. మూడోది: వివక్షను ఎదుర్కోవటం. ఇవీ ఆడవాళ్ళ ముందున్న ప్రధానమైన ఎజండా' అని నాకు చెప్పారు.

వివక్ష గురించి చర్చ వచ్చేసరికి లాలీబాయి తన అనుభవాలు గుర్తుచేసుకుంది. 'మమ్మల్ని పెళ్ళి ఊరేగింపులు కూడా చేసుకోనివ్వరు. మా పెళ్ళి పిల్లగాడు పెళ్ళిగుర్రం మీద కూర్చోవటానికి ఒప్పుకోరు. మేమెందుకు ఈ బాధంతా పడాలి? ఆ మురికి కంపుగొట్టే పని వదిలేసి మేము దర్జాగా బతకాలనుకుంటున్నాం' అంది. లాలీబాయి మంద్‌సౌర్ జిల్లా ధరియాఖేడి అనే గ్రామం నుంచి వచ్చింది. ఇరవయ్యేళ్ళు పాకీపని చేసింది. ఒకే ఒక్క నిర్ణయంతో ఆ పనిని వదిలేసింది. అసలు తాను పాకీ పనిదానిలా వుండాలని ఆమె ఎన్నడూ అనుకోలేదు. కేవలం అత్త బలవంతం వల్లనే ఆమె తప్పనిసరై బక్కెట్‌ను, చీపురునూ పట్టుకోవాల్సి వచ్చింది. ముదురు ఎరుపు, బంగారు వర్ణాల మిశ్రమంతో కూడివున్న చీరె కట్టుకున్న లాలీబాయి తన జీవితంలో సాధించిన పెద్ద విజయాన్ని మాకు వివరించింది. అగ్రకులాల వారు అడ్డుకోవాలని ఎంత ప్రయత్నించినప్పటికీ గానీ తన కొడుకు పెళ్ళికి ఒక పెద్ద వేడుకతో ఊరేగింపు నిర్వహించింది. ఇది ఆమె జీవితంలో కీలకమైన మలుపు. 'ఆరేళ్ళ క్రితం 2005లో. నా కొడుకు పెళ్ళికి బ్యాండుమేళంతో ఊరేగింపు జరపాలని నేను నిర్ణయించుకున్నాను. అందుకు అతను అర్హుడు. దీనికి అవసరమైనంత సొమ్ము కూడబెట్టుకున్నాం. గౌరవంతో బతకటానికి కావలసిన ధైర్యం నాలో నిండుగా వుంది. అందుకే నేను ఈ పాకీపని వదిలేశాను. అయితే ఠాకూర్లు పలు సమస్యల్ని సృష్టించారు. వాళ్ళు నా జీవితాన్ని కష్టాలపాలు చేశారు. నా భర్తని కొట్టారు. మా ఇంటిని కూలగొట్టారు. అయినా భయపడలేదు. నేను ఠాకూర్ ఇంటికి వెళ్ళి "నాకెలా అన్యాయం చేస్తున్నావు? నేను మీ పాకీదొడ్లని సంవత్సరాల తరబడి శుభ్రం చేశాను; ఇప్పుడు నేను దీనినుంచి బయటకు వచ్చేశాను. ఇందుకు నువ్వు నా మీద ప్రతీకారం తీర్చుకోవాలను కుంటున్నావా?" అని సూటిగా అడిగేశాను. ఠాకూర్ ఏమన్నాడంటే నా కొడుకు పెళ్ళికి అవసరమైన ఏర్పాట్లు తనే చేయిస్తానని, అయితే బ్యాండుమేళం మాత్రం వుండదని చెప్పాడు. నా ప్రాణం పోయినా, ఆఖరికి నా భర్తకి హాని తలపెట్టినా గానీ నా కొడుకు పెళ్ళి బ్యాండుమేళం ఊరేగింపుతోనే జరుగుతుందని గట్టిగా సమాధానం చెప్పాను. అంతే మా మీద దాడి చేశారు. మమ్మల్ని బెదిరించారు. కానీ మేము ధైర్యంగానే నిలబడ్డాం. అంతటి శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో ఆ దేవుడికే తెలియాలి. నేను నేరుగా పోలీస్‌స్టేషను కెళ్ళి దళితుల మీద దాడులకి వ్యతిరేకంగా కేసు పెట్టాలనుకుంటున్నానని ఇన్‌స్పెక్టరుకి చెప్పాను. మా

జీవితాలు ప్రమాదంలో వున్నాయి. నాది, నా భర్తది, నా కొడుకుది. దీనికి ఇంకొంచెం జతచేస్తూ, ఇకముందు మా మీద ఏమైనా అనుకోని అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు బాధ్యులు పోలీసులే అవుతారని, ఫలితంగా ఉద్యోగాలు సైతం కోల్పోవలసి వస్తుందని చెప్పాను' అని లాలీబాయి వివరించింది.

'నేను వాళ్ళ మెడల మీద భారం వేసేశాను. అంతే! దానితో పోలీసులే పెళ్ళి ఊరేగింపుకి కాపలాగా నడిచారు. మా ఊర్లో ఇలా జరగటం ఇదే మొట్టమొదటిసారి. జనం దీన్ని స్వీకరింలేకపోయారు. మమ్మల్ని ఎంతో అవమానించారు. తిట్టారు. కానీ నేను ఏం చేయాలనుకున్నానో అదే చేశాను. నేను పాకీబుట్టనే విసిరికొట్టగలిగినప్పుడు ఇంక నేను ఎవరికైనా ఎందుకు భయపడాలి? మీకు తెలుసా? మా మామ చనిపోయే రోజువరకూ ఈ పాకీ పనే చేస్తుండేవాడు. మా ఇంట్లో పదకొండు మందిమి వున్నాం. అందరమూ పాకీ పనివాళ్ళమే. అందరం ఈ పని వదిలేశాం గానీ మా మామ వదిలేయటానికి సిద్ధపడలేదు. చనిపోయే రోజు కూడా ఠాకూర్ల ఇంట్లో పాకీదొడ్డి శుభ్రం చేయటానికి వెళ్ళాడు. నేను ఈ పని మానేసినందుకు ఆయన నాతో మాట్లాడటం ఆపేశాడు. "ఈమె మన కులాన్ని చాలా అవమానించింది. మనకు రోజూ ఇంత ముద్దపెట్టే పనిని వ్యతిరేకించింది." అన్నాడు.

రెండేళ్ళ క్రితం దాదాపు 300 మంది దళితులు స్థానిక మున్సిపల్ ఎన్నికలలో నిలబడ్డారు. అందులో 65 మంది పాకీ పనిచేసే మహిళలు గెలిచారు. టికమ్‌ఘర్ నుంచి మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలిచిన ఈ ఆడవాళ్ళు ఇప్పటికీ తమ సమూహపు అంశాల గురించి మాట్లాడుతూనే వున్నారు. వారందరిలో గుణాత్మకమైన మార్పు చాలా స్పష్టంగానే కనిపిస్తోంది. దీని గురించి తస్లీమ్ మాట్లాడుతూ, 'నేను ఉన్నతమైన భారతదేశాన్ని రూపొందిస్తున్నాను. నేను పంచుగా వున్నప్పుడు సర్పంచ్‌కు ఒక పాఠాన్ని నేర్పించాను. పంచాయితీలో నీటి అవసరాల కోసం ఏర్పాట్లు చేశాను. గ్రామంలో ఒకటే నీళ్ళ పైపు వుంది. అక్కడ నీళ్ళను పట్టుకోవడానికి ఆడవాళ్ళు వెళ్ళినపుడు సర్పంచు వాళ్ళని తూలనాడుతూ అవమానించాడు. నా కోపం నషాళానికంటింది. లమ్డికొడుకు! మా అక్క చెల్లెళ్ళను తక్కువ చేయాలనుకున్నాడు! నేను అతనికి గట్టిగా బుద్ధిచెప్పాను. తాడుతో కట్టేసి వేలాడదీద్దామని అనుకున్నాను. అతని భార్య నా కాళ్ళ మీదపడి ఏడ్వటంతో పోనీలే పాపం అని బతకనిచ్చాను. తరానా కలెక్టరు అక్కడికి వచ్చినపుడు సర్పంచును అరెస్టు చేయించి జైలుకి పంపించాను. ఆ తర్వాతే నేను హాయిగా ఊపిరి పీల్చగలిగాను' అని చెప్పింది.

సమాజంలో అడుగడుగునా ఈ మహిళలు నిందలను ఎదుర్కోవలసిందే. వాల్మీకి సమూహానికి చెందిన ఆడవాళ్ళు జీవితంలో ఏ మాత్రం పైకి ఎదగకూడదనుకుంటారు అగ్రకులాల వారు అని హోలీపూర్ నుంచి వచ్చిన లాడ్కో చెప్పింది. ఆమె కొద్దికాలం

నుంచీ గరీమా అభియాన్‌తో కలిసి పనిచేస్తోంది. చీపురు, బక్కెట్టును వదిలించుకున్నప్పటికీ దానినంటిపెట్టుకుని వున్న వివక్ష అనే కుళ్ళు భావజాలం ఆమెని వెంటాడుతూనే ఉంది. అగ్రకులాల జనం ఆమెలాంటి స్త్రీలను అవమానపరుస్తూ అణిచివేయాలనే చూస్తారు. 'మా ఊర్లో నేను బయటకు వచ్చి కనిపించగానే "లాడ్కో ఇప్పుడు పెద్ద నాయకురాలై పోయింది. ఇంక ఆమె ఎవ్వరి గురించీ ఆలోచించదు. చెప్పులేసుకుని హడావుడిగా అటూఇటూ వెళ్ళిపోతుంది. ఆమె ఎక్కడెక్కడికి వెళుతుందో ఎవరికీ అంతబట్టదు తెలుసా" అని అంటారు. ఒకరోజు నేను ఆఫీసు నుంచి తిరిగి వస్తుంటే "మేడమ్ జీ, నమస్తే" అని వెటకారంగా అన్నారు. అప్పుడు నాకు తట్టుకోలేనంత కోపం వచ్చింది. "మేడమ్ అంటే ఏమన్నా బంగారం, వెండి లేదా వేరే వాటితో చేసిందా చెప్పండి? నేను మీకేంచేశానని ఇలా ఎగతాళిగా, నిందాపూర్వకంగా మాట్లాడుతున్నారు" అని నిలదీశాను. మేము ఆ పియ్యా, మురికి పెంటలను ఎత్తటంకోసమే పుట్టామనుకుంటారు తప్పించి, అంతకు మించి మేము ఎదగటం అనేది వాళ్ళకు కష్టంగా అనిపిస్తుంటుంది. వాళ్ళు దాన్ని కోరుకోలేరు' అని లాడ్కో వివరించింది.

లాడ్కో పక్కనే కూర్చున్న ఆమె తన పేరు లాల్‌కున్వర్ వాల్మీకి చౌహాన్ అని తనను తాను పరిచయం చేసుకుంది. ఆమె పేరు వినగానే నాకు ఆశ్చర్యమనిపించింది. నువ్వు 'చౌహాన్' వా? ఎలా?' అని ఆమెను ప్రశ్నించాను. 'తమ వాస్తవ గుర్తింపును దాచిపెట్టటం కోసం పాకీవాళ్ళే గాక ఇతర వాల్మీకి కులస్థులు తమ ఇంటిపేర్లను సైతం మార్చుకున్నారు. ద్వివేది, బ్రాహ్మణీయ, రాథోడ్, చౌహాన్, శర్మ అని పెట్టుకుంటారు. హేలా సమూహంలో అయితే షేక్ అని లేదా హుస్సేన్ అని రాసుకుంటారు. చాలామంది గాయత్రి పరివారంలో చేరి పురోహితులుగా మారి జంధ్యం కూడా వేసుకుంటున్నారు' అని ఆమె చెప్పుకొచ్చింది.

'వాళ్ళు ఇప్పుడు మాతో చేతులు కలపటం లేదు. తాము పురోహితులుగా మారామని చెప్తున్నారు' అని అసిఫ్ ఆమె చెప్తున్న దానికి ఇంకొంచెం వివరణ జోడించాడు.

పాకీవాళ్ళు బ్రాహ్మణ్యంలోకి వెళ్ళటం అనేది ఆసక్తికరమైన అంశంగా అనిపించింది. నిజానికి ఈ రకమైన మార్పు కేవలం ఈ ఒక్క సమూహానికి మాత్రమే పరిమితమనుకోటానికి లేదు. అన్ని దళితకులాలు ఏదో ఒక విధంగా తమను తాము అగ్రకులాలకు అనుసంధానించుకుంటూనే వున్నారు. ఒక్కోసారి బ్రాహ్మణులతో, ఒక్కోసారి ఠాకూర్లతో – అలావుంటేనే తమ జీవితాలకి గౌరవం లభిస్తుందని అనుకుంటున్నారు. అయితే కులాన్ని సూచించే ఇంటిపేర్లను మార్చుకోవటం ద్వారా లేదా మతాన్ని మార్చుకోవటం ద్వారా వారి దళిత అస్తిత్వాన్ని ఎప్పటికీ చెరిపివేసుకోలేరన్నది వేరే విషయం.

గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో నిశ్శబ్దంగా కుల వివక్ష కొనసాగుతూ వుంటుంది. అగ్రకులాల వారు ఆ ఆయుధాన్ని అంత త్వరగా వదిలిపెట్టరు. ఈ విషయమై ఆసిఫ్

ఆసక్తికరమైన అంశాన్ని చెప్పాడు. 'మేము దియోఘర్ ప్రాంతానికి వెళ్ళాము. అక్కడ ఏడుగురు పాకీపనివాళ్ళు వున్నారు. ఆరుగురు స్త్రీలు, ఒక పురుషుడు. ఒక షరతుపై ఆ సాయంత్రానికల్లా పాకీపని మానేస్తామని చెప్పారు. షరతు ఏమిటంటే ఆ రోజు పూర్తయ్యేసరికి వాళ్ళ జుట్టు కత్తిరించే ఏర్పాటు మేము చేయాలని అడిగారు. ఆ ఊరంతా రాజ్‌పుట్లు అధికంగా వున్నారు. ఐదారు క్షౌరశాలలున్నాయి. జుట్టు కత్తిరించటం సంగతి దేవుడెరుగు, కనీసం ఎవ్వరూ కూడా ఈ పాకీవాళ్ళని తాకటానికి ఇష్టపడలేదు. ఇంకోమార్గం ఏముందంటే పదిహేను కిలోమీటర్ల దూరంలో వున్న మరొక ఊరికి వెళ్ళటం. అయితే అదేమంత సులభమైన విషయం కాదు. అక్కడికి వెళ్ళటానికి ప్రయాణవ్యయంతోపాటు సగం రోజు వేతనం వదులుకోవాల్సివస్తుంది.

వేరే గ్రామాలవాళ్ళని దీని విషయమై కదిపినప్పుడు, "మీరు చెప్పినట్లే మేము ఫ్లష్ టాయిలెట్లు కట్టించుకుంటాం కానీ దయచేసి మా ఆచారాల్లో కల్పించుకోకండి. మా ఊర్లో వీళ్ళు క్షౌరశాలల్లోకి, టీ దుకాణాల్లోకి, బళ్ళోకి అడుగుపెట్టకూడదు. ఈ సంప్రదాయాన్ని మార్చటంగానీ, ఎవరైనా దీనిలో కల్పించుకోవటం గానీ మాకిష్టం లేదు'' అని సమాధానమిచ్చారు. టెంట్లు వేసేవాళ్ళు కూడా ఇదే మాదిరిగా వుంటారు. పాకీ పనివాళ్ళకి దుప్పట్లు, పరుపులు అద్దెకు ఇవ్వరు. వీళ్ళకి ఇస్తే అవి అపవిత్రమైపోయాయని మిగతా వాళ్ళు వాటిని తీసుకోరు. అంతులేని ఈ మూర్ఖత్వాలను చవిచూసిన పాకీ కుటుంబాలు సమాజంలో వేళ్ళూనుకుని వున్న వివక్ష అంతం అయినప్పుడే తాము పాకీ పనిని వదిలేయగలుగుతామని మాకు సాదాసీదా మాటల్లోనే తేల్చి చెప్పారు. "ఈ పాకీ పనిని వదిలిన తర్వాత కూడా మేము అదేవిధమైన అవమానాలను, వివక్షకు ఎదుర్కోవలసివస్తోంది కదా! మరి దీనిని వదిలేయటంలో ఏమన్నా లాభం వుందా?" అని మమ్మల్ని ప్రశ్నించారు.

'దుర్భరమైన ఈ పరిస్థితి నుంచి విముక్తం కావాల్సిన అనివార్యతనీ, అవసరాన్నీ వివరంగా వారికి ఎందుకు బయటకు రావాలో అనేక కారణాలతో తెలియజెప్పాం. చివరాఖరికి వారు ఈ పనిని వదిలేసేలా ఒప్పించగలిగాం. దురదృష్టమేమంటే ఈ నిర్ణయం తీసుకున్నందుకు గ్రామస్తులు వీళ్ళని బహిష్కరించారు– కేవలం ఠాకూర్లే కాదు, ఇతర దళిత సమూహం కూడా. దీనికి వ్యతిరేకంగా ఆందోళన దాదాపు నెలన్నర పాటు సాగింది. చివరికి మేము మళ్ళీ అక్కడికి వెళ్ళి ఈ బహిష్కరణను ఆపకపోతే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని అందరినీ హెచ్చరించాల్సి వచ్చింది. ఈ హెచ్చరికతో పరిస్థితులు చక్కబడ్డాయి. అయితే ఇలాంటి ఆందోళనలు కొనసాగుతూనే వుంటాయి. ఆడవాళ్ళే ఈ మొత్తం ఆందోళనకు నాయకత్వం వహించారు'.

భావ్‌రసా గ్రామంలో మున్నీబాయి పలుకుబడికలిగిన నాయకురాలు. సమావేశాలు, ధర్నాలు, ఊరేగింపులు– ఇలా అన్నింటికీ ఆడవాళ్ళను సమీకరించటంలో ఆమె దిట్ట. సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి జనరల్ క్యాటిగిరీలో పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో

ఓడిపోయింది. ఓడిపోయినందుకు ఆమె పెద్దగా చింతించిందేమీ లేదు. దీనిద్వారా వచ్చిన ఆత్మవిశ్వాసం ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. భావ్‌రసాలో స్థానికుల సహాయంతో గరీమా అభియాన్ నడుపుతున్న చిన్న పాఠశాలలో మేము ఆమెని కలిశాం.

ఇప్పుడు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు (2011 నాటి సంగతి) కూడా మున్నీ పేరు సుపరిచితమని ఆమె పక్కనే కూర్చున్న కిరణ్ చెప్పింది. సమీప గ్రామంలో జరిగిన సభకు ముఖ్యమంత్రి వచ్చారనే విషయం మున్నీకి తెలిసింది. పాకీ పనిని వదిలేసినవారిలో ఏ ఒక్కరికీ పునరావాసం లభించలేదని మున్నీ గ్రామస్తులు అప్పటికి కోపంగా ఉన్నారు. ప్రభుత్వం మాత్రం ఎప్పటిలాగే మాటలతో వంచిస్తోంది. ఈ ఆడవాళ్ళేమో అలుపెరుగకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే వున్నారు. మున్నీతో పాటు ఆడవాళ్ళందరూ కలిసి ఒక టెంపోలో బయలుదేరి ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న ప్రాంగణానికి వెళ్ళారు. అక్కడికివెళ్ళిన తర్వాత ఆమె ఎంతో ధైర్యంగా వేదిక మీదకు వెళ్ళి మైకును అందుకుంది. ఏ రకమైన ఉపోద్ఘాతం లేకుండానే మున్నీ ఊపిరి తీసుకోకుండా ధారాళంగా మాట్లాడింది. తరాల నుంచి మోస్తున్న పియ్యిపెంటలను చౌహాన్ నెత్తిమీద గుమ్మరించినట్లుగా ఆమె ఉపన్యాసం సాగింది. తప్పకుండా సహాయం చేస్తానని ముఖ్యమంత్రి వాగ్ధానం చేసిన తర్వాతే ఆమె ఆ వేదిక నుంచి కిందికి వచ్చింది'. ఇందువల్ల ఏమైనా మార్పు కనిపించిందా అని నేను అడిగాను. నేనడిగినదానికి మున్నీ సమాధానం ఇచ్చేలోపే కిరణ్ అందుకుని, 'ఏదయినా కాకపోయినా మున్నీ మాత్రం నాయకురాలు అయింది. ఆమెకున్న బెరుకు, బిడియం పోయి అధికారులతో వాదించటానికి, పోరాడటానికి చాలా స్థయిర్యాన్ని సాధించింది.మేమంతా ఈ పాకీ పనిని వదిలేశాం. నేను చదువుకున్నాను కానీ వేరే పని ఏదీ దొరకలేదు. పంటపొలాల్లో పని చేయడానికి వెళ్తున్నాం' అని చెప్పింది.

ఈ అంశం మాట్లాడుతున్నప్పుడు వృద్ధురాలైన సజాబాయి ఘట్రోడ్ కోపంతో కూడిన స్వరంతో కల్పించుకుంది. చీరను ముడిపెడ్తూ 'నాయకుడని చెప్పుకునేవాడెవడూ కూడా సహాయంగా రాలేదు. మేము పొలంపనులకు వెళ్ళి పంటలు పండిచ్చాం. జీవితంలో అంతకుముందెప్పుడూ మేము ఈ పని చేయలేదు. మా చేతుల్తో ఎప్పుడూ కొడవలిని పట్టుకోలేదు. దాన్ని ఒడుపుగా పట్టుకోకుండానే కోత కొయ్యటానికి ప్రయత్నించాను. ఊరి జనాలంతా ముఖాలు గాటు పెట్టుకున్నారు కానీ మేము వెనక్కి తిరిగి చూడలేదు. తిరిగి ఆ నరకంలోకి ఎవరు మాత్రం మళ్ళీ వెళతారు?'.

రేఖాబాయి నవ్వుతూ, 'మేం నిజంగా ఎంతో లాభపడ్డాం. చివరికి మా మగవాళ్ళ బానకడుపులు కూడా పూర్తిగా కరిగిపోయాయి' అన్నది. మిగతావారు అంగీకారపూర్వకంగా గట్టిగా నవ్వేసి, తమ మగవాళ్ళు ఇప్పుడు పని చేయటం మొదలుపెట్టారని చెప్పారు. అంతకు ముందు చెట్లకింద, మంచాల మీద బద్ధకంగా, పనీపాటా లేకుండా పడుకుని వుండేవారు.

'ఇంతకు ముందు మంగలి మా జుట్టు కత్తిరించేవాడు కాదు ఇప్పుడు మా ఆందోళన చూసిన తర్వాత, కనీసం మా పిల్లలకు జుట్టు కత్తిరిస్తున్నారు. టెంటువాళ్ళు మాకు సామాన్లు అద్దెకు ఇస్తున్నారు. వాళ్ళ దగ్గర ఇలాంటి అంశాలతోకూడిన పెద్ద పట్టికే వుంది. దాన్ని వల్లిస్తూనేవున్నారు.

తాను ఇప్పుడు అంగన్‌వాడీ బళ్ళో ఆయాగా పని చేస్తున్నానని, భవిష్యత్‌లో మరింత మందికి పని కల్పించడం కోసం చదువును కొనసాగిస్తున్నానని కిరణ్ మాకు చెప్పింది. ఆమె నలుగురు కూతుళ్ళూ చదువుకుంటున్నారు. నలుగురికీ కూడా ఇంతకు ముందు స్కాలర్‌షిప్ వుండేది. కిరణ్ పాకీపని వదిలేయడంతో ఆ స్కాలర్‌షిప్ ఆగిపోయింది. ఎందుకని? ఎందుకంటే ఆ స్కాలర్‌షిప్ అందుకోవాలంటే గత వందరోజులకు పైగా తమ తల్లిదండ్రులు పాకీపని చేస్తున్నారని ధృవీకరిస్తూ ఒక స్టాంప్‌పేపర్ మీద సంబంధిత అధికారి సంతకంతో వాళ్ళు దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా ఈ దరఖాస్తును ఇవ్వలేకపోతే స్కాలర్‌షిప్‌ను ఆపేస్తారు. 'దీని గురించి మేం గట్టిగానే కొట్లాడాం. ఈ విధంగా నేనొక్కదాన్నే ఇబ్బందిపడలేదు. చాలా మందికి ఇలానే జరిగింది. అయితే మా కొట్లాట వల్ల ప్రయోజనం పెద్దగా ఏమీ లేదనే చెప్పాలి. మా ఒక్క అమ్మాయికే తిరిగి స్కాలర్‌షిప్ ఇచ్చారు తప్ప, మిగతా ముగ్గురికీ ఇవ్వలేదు' అని చెప్పింది కిరణ్.

ఈ పరిస్థితి కేవలం మధ్యప్రదేశ్‌కి మాత్రమే పరిమితమైన విషయం కాదని, దేశమంతా ఇలానే వుంది అని అసిఫ్ చెప్పాడు. 2011 ఏప్రిల్ వరకూ 6000 మంది దళిత విద్యార్థులకు ఈ కారణంచేత స్కాలర్‌షిప్‌లు ఆపేశారు. గరీమా అభియాన్ వాళ్ళు కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖామంత్రి ముకుల్‌వాస్నిక్‌ను కూడా కలిశారు. ఎన్నో వాగ్దానాలు లభించాయి కానీ స్కాలర్‌షిప్‌లు మాత్రం లభించలేదు. నిజానికి ఇలాంటి దరఖాస్తులను ఇవ్వాలనడమే అర్ధ రహితం, దిగ్భ్రాంతికరం. మరీ ముఖ్యంగా పాకీపని నిషిద్ధమని చెప్పే చట్టం వుండగా, పాఠశాలలు ఇంకా ఇలాంటి దరఖాస్తులను అంగీకరించటమనేదే భయానకమైన అంశం. ఈ తరహా నేరపూరిత విధానాలపై చట్టపరమైన దావాలు తప్పనిసరిగా వేయాలి. కానీ ఎప్పుడూ ఆ పని జరగలేదు. ఎందుకంటే, ఎవరికీ దీని గురించి సరైన అవగాహన లేకపోవటమే కాదు ఇదొక తీవ్రమైన అంశంగా ఎవరికీ అనిపించకపోవడం కూడా. ఫలితంగా ఈ భయంకరమైన అణిచివేత నిరాటంకంగా కొనసాగుతూ వుంది. చట్టపరంగా తమకున్న హక్కులు, రక్షణల గురించి తెలుసుకున్న తర్వాతే ఈ ఆడవాళ్ళు దుర్మార్గమైన ఈ పనినుంచి విముక్తి కోసం పోరాటాన్ని మొదలు పెట్టారు. వీటి గురించి అవగాహనే లేకపోతే తమ పరిస్థితికి వగస్తూ అలానే చీకట్లో మగ్గిపోయేవారు .

నెలకు వచ్చే అతి కొద్ది మొత్తం డబ్బు కోసం, రోజూ ఒక రొట్టెముక్క కోసం పాకీ దొడ్ల నుంచి పియ్యిపెంటలను ఎవరైనా ఎలా ఎత్తగలుగుతారనేది బయటివాళ్ళకి అంతు

బట్టదు, అర్థంకాదు. ఇక్కడ విషయం కేవలం రోజువారీ తిండి సమస్యకాదు. రోజుకు రూపాయి, ఒక రొట్టి లేదా నెలకు ముప్ఫై నుంచి యాభై రూపాయలను వేరే పనుల ద్వారా కూడా సంపాదించవచ్చు. అయితే ఈ ఆడవాళ్ళు పాకీపని చేయడం అనే మానసిక బానిసత్వంతో ఎలా, ఎందుకు ముడిపడివున్నారన్నది అర్థం చేసుకోవాల్సిన విషయం. వాళ్ళు సమాజాన్ని ఎలా చూస్తారు, అందులో తమ స్థానాన్ని ఎలా భావిస్తారన్నది మనం తెలుసుకోవలసిన అంశం. దీనికి సమాధానం కులం చూపించే ప్రభావంలో దాగి వుంది. దేవస్‌లాంటి ప్రాంతాన్ని సందర్శించినప్పుడు కులతత్వం ఎంత వ్యూహాత్మకంగా పని చేస్తుందో, దాని కోరల్లో చిక్కుకున్న వాళ్ళకి ఆ బాధ ఏమాత్రం తెలియకుండా, కనీసం గ్రహింపులోకి రాకుండా ఎలా వుంటుందో అర్థమవుతుంది. ఉదాహరణకు జాగిర్దారీ అనేది వారసత్వంగా వచ్చిన తమ సొంత ఆస్తిలాగా ఒక హక్కులాగా ఈ ఆడవాళ్ళు భావిస్తున్నారు. అందుకే పాకీపని వదిలిపెట్టడమనే ఆలోచనే వారికి భరించరానిదిగా అనిపిస్తుంటుంది. ఎందుకంటే శతాబ్దాల తరబడి ఇదే వారికి ఆర్థిక ఆధారాన్ని, ఒక గుర్తింపును అందింస్తోందని భావిస్తున్నారు. వారి దృష్టికోణం నుంచీ చూస్తే ఇంకొన్ని విషయాలు అర్థమవుతాయి. జాగీర్ అనే అంశమే దీనిచుట్టూ వుండి వారి పిల్లలకు ఏ సమస్యా లేనట్టుగా అనిపిస్తుంది. ఈ వ్యవస్థలో ప్రతిఒక్కటీ నిర్ణయించబడి వుంటుంది. పిల్లల సంపాదన కోసం తల్లిదండ్రులు స్థిరమైన ఏర్పాట్లుచేసి వుంటారు. 'ఎవరి జాగిర్దారీ వాళ్ళకు వుండటం వల్ల వారివారి భాగాల్ని ఏ పరిస్థితిలోనూ కోల్పోయే అవకాశం లేదు. మాకు ఇవి తప్పించి వేరే ఆస్తులేమున్నాయి? ప్రతి కులంలోనూ రాబోయే తరాల పిల్లల కోసం తల్లిదండ్రులు కొంత ఆస్తిని వుంచుతారు కదా!...నాక్కూడా ఒక జాగీరు వుంది, నేను దాన్ని ఉచితంగానే వదిలేశాను. రూ. 5,000/- కిమ్మతు చేసే ఒక మొహల్లా నాకు వుండేది. తరానా నుంచి స్టాంప్ పేపరు మీద ఒక ఒప్పందం చేశాను. ఇందులో ముఖ్యమైనది పిల్లలు ఏ సమస్యల్లోకి వెళ్ళకుండా జాగ్రత్తగా వుండాలనే' అని తస్లీమ్ చెప్పింది.

ఈ పాకీపని నుంచి చాలా లాభం పొందుతున్నామనీ, కులపరమైన రక్షణ వుంటుందనీ, బట్టలు, కొన్నిసార్లు అప్పులు లాంటివి లభిస్తాయనీ వాళ్ళు తమకు తాము భావించుకునేలా చేస్తుంది ఈ వ్యవస్థ. భవిష్యత్తులో ఎదురయ్యే కష్టసమయాల్లో ఈ కులవ్యవస్థ ఆసరా అవుతుందన్న ఆలోచనే ఆ సంకెళ్ళ నుంచి బయట పడటానికి మొదటి అవరోధంగా వుంటుంది. కొంచెం ఆర్థికంగా బాగున్న కుటుంబాలలోని ఆడవాళ్ళు కూడా తమ జీవితకాలమంతా ఈ పాకీపని చేస్తూనే గడపటం కనిపిస్తుంది. కొడుకు చదువుకుని వేరే వృత్తిలో స్థిరపడినప్పటికీ, తల్లిదండ్రులు మాత్రం కడపటి రోజుల వరకూ పాకీ పనిలోనే కొనసాగిన ఉదంతాలు మనకు వేలల్లో కనిపిస్తాయి.

ఇప్పుడిప్పుడే చిన్నగా నిర్మాణాత్మకమైన మార్పు రావటం నిజంగా అభినందనీయం. అటు ఆడవాళ్ళు, ఇటు మగవాళ్ళు-ఇద్దరూ కూడా ఏమైనా సరే భయంకరమైన ఈ

పనినుంచి విడిపడాలని బలంగా కోరుకుంటున్నారు. నెమ్మదిగా అయితేనేం తమని శాసిస్తున్న భయంకర పీడకలలాంటి పరిస్థితికి చిహ్నమైన చీపురు, బుట్టల్నుంచి బయట పడాలనే తమ ఆకాంక్షలు, ఆశల పట్ల స్పష్టత తెచ్చుకుంటున్నారు. ఈ మొత్తం దోపిడీ, అణిచివేత వ్యవస్థ చక్రబంధంలో ముఖ్యంగా ఆడవాళ్ళు నలిగి నాశనమయిపోతున్నారు. ఆ చక్రాలకున్న పళ్ళు పీకేస్తే ఆ వ్యవస్థ మొత్తంగా కుప్పకూలిపోతుంది. దాని ఆనుపానులను తెలుసుకుంటూ, అది కుప్పకూలటాన్ని గమనించటం అనేది నిజంగా ఒక కొత్త అనుభవమే.

తరానా నుంచి తస్లీమ్ కాని, భవ్‌రసా గ్రామం నుంచి వచ్చిన మున్నీబాయి దుమానే లేదా కిరణ్ ఎవరైనా కావొచ్చు – వీరి విముక్తి గాథలన్నీ రాజకీయాల్లో వాళ్ళ ప్రాతినిధ్యంతో ముడిపడివున్నాయి. అగ్రకులాల అంతర్గత కలహాల వల్ల పంచాయితీ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం తస్లీమాకు వస్తే, జనరల్ టికెట్ మీద నిలబడి పోరాడి మెహత్రానీలు ఎదుర్కొంటున్న కష్టాలను వెలుగులోకి తీసుకువచ్చింది మున్నీ. ఆమె కొద్ది ఓట్ల తేడాతోనే ఓడిపోయినప్పటికీ, ఆమె ఆత్మస్థయిర్యం మాత్రం ఎంతో పెరిగింది. దేవాస్‌లోని ఒక ఊరేగింపులో ప్రసంగించటానికి ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వచ్చిపుడు ఆమె స్టేజి మీదకు దూసుకువెళ్ళి ప్రభుత్వం చెప్పుకుంటున్న వాగ్దాన పత్రాలను చింపేసింది. 'జైన్ సమూహంలో ఒక నాయకుడుండేవాడు. కేతాలోని రావ్లా (హవేలీ) ప్రజలతో ఎప్పుడూ పోట్లాట పెట్టుకునేవాడు. పంచాయితీ ఎన్నికలు జరిగినప్పుడు రావ్లాకి చెందిన వాళ్ళు ఎన్నికల్లో నిలబడ్డారు. నేనే రావ్లా ప్రజల మరుగుదొడ్లు శుభ్రం చేసేదాన్ని. నన్ను ఎన్నికల్లో పాల్గొనమని ఈ జైన్ నాపై ఒత్తిడితెచ్చాడు. నేను గనుక ఓడిపోతే అప్పుడు "ఎవరికి ఎదురెళ్ళి రావ్లా జనం గెలిచారు? వాళ్ళ మెహత్రానీ కా" అని అందరూ అనుకోవాలని, లేదా నేను గెలిస్తే వాళ్ళ గౌరవం శాశ్వతంగా కనుమరుగవుతుందని ఆయననుకున్నాడు. "చూడండి, వాళ్ళ పాకీదొడ్లు శుభ్రం చేసే ఆమె చేతిలోనే ఘోరంగా ఓడిపోయారని" జనం అనుకుంటారు. ఇదీ అతని ఎత్తుగడ. పైగా నేను ఎట్టి పరిస్థితిలోనూ అమ్ముడుపోనని అతనికి బాగా తెలుసు. ఉజ్జయినిలోని మొత్తం హేలా సమూహమంతా ఒక దగ్గరకు వచ్చారు. జైన్లకు, ఠాకూర్ల మధ్య పోరాటం నాకు బాగా లాభించింది. ప్రతిఒక్కరూ నా కోసం ప్రచారం చేశారు. నాకు 300పైగానే ఓట్లు వచ్చాయి. రెండోసారి నా వార్డులో వేరే ఎవ్వరూ  పోటీలోకి రాలేదు. మూడోసారి కూడా నేను నిలబడాల్సి వుండె గానీ ఒక ముఖ్యమైన పని వుండటంతో నిలబడలేకపోయాను' అని తస్లీమ్ చెప్పింది.

నేను తిరిగి వెళ్ళటానికి వీడ్కోలు తీసుకున్నప్పుడు, 'మీరు మా పేర్లు రాస్తారా? పాకీపని వాళ్ళ పునరావాసం కోసం ప్రభుత్వం బృహత్తర ప్రణాళికతో వుందని విన్నాం. కానీ మాకు ప్రభుత్వంనుంచయితే వచ్చిందేమీ లేదు' అని చాలా మంది నన్నడిగారు.

నేను వాళ్ళపేర్లు రాసుకుంటున్నపుడు కులాన్ని సూచించే వివక్షపూరితమైన ఇంటిపేర్లు గమనించాను. మున్నీబాయి దుమానె, రామ్‌దులారి పటౌరె, షాజాబాయి ఫత్రోడ్–ఇలా అత్యంత అవమానకరంగా వుండే ఈ పేర్లు ఈ భయంకరమైన వృత్తికి వున్న వివిధ సామాజిక కోణాల్ని సూచిస్తాయి.

'మీరందరూ చేసేది పాకీపనే కదా. మరి అందరికీ వేర్వేరు ఇంటిపేర్లు ఎందుకున్నాయి' అని నేను వాళ్ళని అడిగాను. అందరూ గడబిడగా ఒకేసారి ఏదో చెప్పబోయారు గానీ మున్నీ మాత్రం తేలిగ్గా ఆ విషయాన్ని వివరించింది. 'నేను దుమానె అయితే, ఆమె ఫత్రోడ్. ఈమె ఫత్రోడ్ అయితే ఏంటి? మేమంతా ఒక్కటే. అందుకే మేమందరం ఆ పాకీ బుట్టల్ని కాల్చేసి ఏం జరిగినా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పని మళ్ళీ చేయమని ఆ మంటల మీద మా చేతులుంచి ప్రమాణం చేశాం. దేవాస్, సెహెూర్, హెూషంగాబాద్, హర్దా, షాజాపూర్, భిండ్‌లలో మేమే స్వతంత్రంగా పాకీ పనిని నిర్మూలించాం. ఏ రాజకీయ నాయకుడూ మాకు సహాయంగా రాలేదు. ఒకప్పుడు గాడిదలకంటే హీనంగా బతికిన వాళ్ళం ఇప్పుడు మనుషులుగా తిరిగి జన్మించాం.' ఆ గదంతా సంతోషపు వేడుకతో మారుమోగింది.

(2011 ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లో దేవాస్ ప్రాంతాన్ని సందర్శించిన అనుభవాలతో ఈ వ్యాసం రాయటం జరిగింది.)

# ఆంధ్రప్రదేశ్




1. శ్రీకాకుళం 2. విజయనగరం 3. విశాఖపట్టణం 4. తూర్పుగోదావరి 5. పశ్చిమ గోదావరి 6. క్రిష్ణా 7. ప్రకాశం 8. నెల్లూరు 9. కడప 10. చిత్తూరు 11. అనంతపూర్ 12. కర్నూలు 13. మహబూబ్‌నగర్ 14. నల్గొండ 15. వరంగల్ 16. కరీంనగర్ 17. నిజామాబాద్ 18. ఆదిలాబాద్.

2008 వరకూ (ఉమ్మడి రాష్ట్రంగా వున్నప్పుడు) ఈ 18 జిల్లాల్లో పాకీపని కొనసాగింది. తర్వాత రాష్ట్రంలో వచ్చిన బలమైన ఉద్యమం ద్వారా తామే ఎత్తుడు దొడ్లను కూలగొట్టి పాకీపని లేని రాష్ట్రంగా ఈ ఆడవాళ్ళు ప్రకటించారు.

## ఆంధ్రప్రదేశ్

**'వారంతా నాకు బాగా తెలుసు. అందుకే నా అంటరానితనాన్నే ఆయుధంగా మలుచుకుని వారికి సవాలు విసిరాను'.**

ఊరేగింపు ముందు భాగాన ఆమె నడుస్తోంది. ఆమె మెడలో నిండుగా పూల దండలున్నాయి. ఆమె తన చేతులతో వాటిని సవరదీసుకుంటోంది. అలా చేసిన ప్రతిసారీ ఆమె మొహంలో ఒక ఉల్లాసభరితమైన నవ్వు. ఊరేగింపు ముందు భాగంలో డప్పుల

దరువు నడుస్తోంది. జనం నినాదాలు ఇస్తున్నారు.'ఇది మా ఐక్యతకి, శ్రమకి లభించిన విజయం. దీన్ని ప్రపంచానికి చాటిచెప్తాం. దేశవ్యాపితంగా ప్రచారం చేస్తాం...'

ఈ దృశ్యం రూపుగట్టింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం అనే చిన్న పట్టణంలో. పాకీ పని బంధనాల నుంచి విముక్తమయిన కొంత మంది ఆడవాళ్ళు విజయోత్సాహంతో తీస్తున్న ఊరేగింపు అది. గత మూడు సంవత్సరాల నుంచీ వారు ఇదేవిధంగా తమ విజయాన్ని ఉత్సవంలా చేసుకుంటున్నారు. గత అరవై సంవత్సరాలుగా స్వతంత్ర భారతదేశంలో ఏ ప్రభుత్వమూ చేయలేని పనిని – లేదా చేయటానికి చిత్తశుద్ధి ప్రదర్శించని పనిని ఈ ఆడవాళ్ళు చేసి చూపించారు. వారి మొహాల్లో లేశమాత్రమైనా ఇంపుదనం లేదు. అయితేనేం వెలుగులు చిమ్ముతున్న ఆత్మ విశ్వాసం వుంది. భారత కులవ్యవస్థ మీద వారి ఆగ్రహం ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతుంది. ఎన్ని శతాబ్దాల క్రితం ఈ కులవ్యవస్థ వారి తలల మీద తోటి మనుషుల పియ్యిపెంటలతో నిండివున్న బుట్టలు వుంచిందో ఈ మహిళలకు తెలియకపోవచ్చు కూడా. కానీ వారి జీవితకాలమంతా దుర్మార్గమైన ఈ కబంధహస్తాల్లోనే నలిగిపోయింది. పుట్టినప్పటి నుంచీ ఈ నరకానికి ప్రత్యక్ష సాక్షులుగానే వున్నారు. ఎలాగైతేనేం, చివరాఖరికి ఈ దుర్మార్గపు పని నుంచి విముక్తమయ్యే పోరాటంలో నిర్ణయాత్మక దశకు చేరుకున్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తిగా పాకీ పనినుంచి విముక్తిపొందిన ప్రాంతంగా వుందంటే అది వీరి ధృఢచిత్తానికి తార్కాణమే కానీ మరోటికాదు.

ఈ చారిత్రాత్మక దశకు ప్రాణంపోసిన బృందంలో చెరుకుతోట నారాయణమ్మ కూడా ఒకరు. చెరుకుతోట ఆమె ఇంటిపేరని నేను తెలుసుకున్నాను. అందరు ఆమెని నారాయణమ్మ అనే పిలుస్తారు. ఆమె ఈ ఊరేగింపు ముందు భాగాన నడిచింది. 2009లో అనంతపురంలో జరిగిన అలాంటి ఒక ఊరేగింపులో నేను ఆమెని మొదటిసారి చూశాను. అయితే ఆమెని కలవటం మొదటిసారని నాకనిపించలేదు. ఆమె గురించి నేను చాలా చదివాను, చాలా విన్నాను కూడా! అందుకే ఆమెని మరుక్షణం పోల్చుకోగలిగాను. ఆమెలో చిరపరిచితమైంది ఆ నవ్వు. ఆమె నన్ను చూసిన మరుక్షణమే నేను ఆమెకు ఎప్పటినుంచో తెలుసన్నట్లుగా నన్ను దగ్గరకు తీసుకుని హత్తుకుని తెలుగులో 'బాగున్నారా'? అని అడిగింది. తలనిండా నూనె పెట్టుకుని నున్నగా దువ్విన ఆమె తలకట్టును ఒక బన్నుతో ముడివేసింది. సువాసన వెదజల్లుతున్న మల్లెలు, కనకాంబరాల మాల ఆ ముడి చుట్టూ వుంది. చూడగానే దక్షిణ భారతదేశ ఆచారం ప్రతిఫలిస్తోంది. ఆమె జుట్టు నుంచి వస్తున్న సువాసన కూడా ఆమె విముక్త కథను వినిపిస్తోంది. నేను ఆమె పూలను పట్టిపట్టి చూడటం గమనించిన నారాయణమ్మ 'ఆ పని వదిలేసిన దగ్గర్నుంచీ నేను వీటిని పెట్టుకుంటున్నాను. అప్పటికిగానీ నేను కూడా ఒక మనిషినే అని నన్ను నేను నమ్మలేకపోయాను. ఇప్పుడు నేను సంతోషంగా వున్నాను. ఇక్కడ నాతో వున్న ఆడవాళ్ళు కూడా ఎంతో సంతోషంగా వున్నారు. స్వేచ్ఛ అనేది అంత తేలిగ్గా మా దరికి రాలేదు. దీని కోసం మేం ఎన్నో ఏళ్ళ పాటు పోరాటం

చేశాం, ఎంతో కష్టపడ్డాం. ఏ దేవుడూ మాకోసం అవతారమెత్తి సహాయం చేయలేదు' అంది.

తన జీవితకథ చెప్పటం ఇష్టం లేదని నారాయణమ్మ నాతో అన్నది. 'ఆ రోజుల్ని తలుచుకుంటేనే నా కడుపులో తిప్పుతుంది. కోపం నషాళానికెక్కుతుంది. నా జీవితమంతా ఈ పాకీపనిలో వున్నందుకు నా మీద నాకే చాలా కోపం అనిపిస్తుంది. వెనక్కి తిరిగి వెళ్ళటం అనేది జరగదు. అలా అని వేరేపని చేయగలుగుతానని కూడా లేదు' అందామె.

'ఎందుకని?' అడిగాను నేను. నారాయణమ్మకు వయస్సు పైబడింది. నా ప్రశ్నకు ఆమె కళ్ళలో నీళ్ళు నిండిపోయాయి. ఊపిరి ఎగబీలుస్తూ, తన చీర కొంగుని లాక్కుని కళ్ళు తుడుచుకుని చెప్పింది. 'బిడ్డా! నాతోటి పిల్లలు ఇంకా ఆడుకుంటున్న వయసులోనే నా చేతికి ఈ పాకీబుట్ట వచ్చింది. నేను వయసులో వున్నప్పుడు ఈ పనితోనే నలిగిపోయాను. ఈ ఘోరమైన పని ఆలోచించటానికి గానీ, ప్రశ్నలడిగే బలాన్ని గానీ నాకు ఏ మాత్రం ఇవ్వలేదు. అదే నాకు బాధగా అనిపిస్తుంది. ఎన్నో తరాల తరబడి పాకీపని మేము మాత్రమే తప్పనిసరిగా చేయాల్సిన బాధ్యత అని అనుకుంటూ వస్తున్నాం. అది ఒక అలవాటుగా చేసేస్తున్నాం. మాతో పాకీదొడ్లు శుభ్రం చేయించుకునే వాళ్ళు సైతం మేము కేవలం ఈ పని చేయటానికే పుట్టామన్నట్లుగా వుంటారు. మమ్మల్ని మనుషులుగా ఎవ్వరూ అనుకోరు, మేం కూడా అలానే ఆలోచిస్తాం. నిజానికి వాళ్ళెందుకు ఆలోచించాలి?' కోపంతో నారాయణమ్మ ముక్కుపుటాలు అదురుతున్నాయి. అలానే కొనసాగిస్తూ. 'పియ్యి పెంట మీద నిలబడి వున్న మీ కులవ్యవస్థ మా గౌరవాన్ని వేరుకుదుళ్ళ నుంచీ నాశనం చేసి పారేసింది' అని అంది.

మేము మాట్లాడుకుంటూ నడుస్తుండగానే అంబేద్కర్ నగర్‌లోని నారాయణమ్మ ఇంటికి జేరాం. నారాయణమ్మ కుటుంబం, బంధువులందరకూ ఆమెకు ఆహ్వానం పలకటానికి అక్కడే వున్నారు. హైదరాబాద్ నుంచి ఎనిమిది గంటల ప్రయాణదూరంలో వుంది అనంతపురం. ఎండ ఎంత ఎక్కువగా వుందంటే నేను చమటతో తడిసి ముద్దయిపోయాను. కానీ నిశ్శబ్దంగా వున్న ఈ ఇంటికి రావటం నాకు ఊరటగా అనిపించింది. టీ తాగుతున్నప్పుడు, పొరలుపొరలుగా చేదునిజాలు బయటకు రావటం మొదలుపెట్టాయి. ఆ జ్ఞాపకాలు దట్టంగా ముసురుకున్న కారు మేఘాల్లా వున్నాయి. అయితే మేఘావృత ఆకాశంలో మెరిసే మెరుపుల్లాగా వస్తున్న మంచి మార్పులు అక్కడవున్న వారందరి ముఖాల్లోనూ ప్రతిబింబిస్తున్నాయి.

సహజంగానే అక్కడ సంభాషణంతా తెలుగులోనే సాగుతోంది. సఫాయి కర్మచారి ఆందోళనకు సంబంధించిన బెజవాడ విల్సన్, అనూరాధ ఇద్దరూ ఒక్కమాట కూడా పొల్లుపోకుండా ఇంగ్లీషులోకి అనువాదం చేస్తూనే వున్నారు. నారాయణమ్మ ఊపిరి కూడా తీసుకోకుండా ఎంత ధారాళంగా మాట్లాడుతోందంటే అనువాదం చేసేవాళ్ళకే

కాదు, విని అర్థం చేసుకోవటానికి కూడా కష్టమైపోతోంది. మా ఇబ్బందిని గమనించిన ఆమె, 'నా కథ, నా బాధ- అది చాలా పెద్దది. రాత్రంతా ఆగకుండా ఇలా చెప్తూనే వుండగలను. అయినప్పటికీ అది పూర్తవ్వదు. ఎందుకంటే ఇది కేవలం నా ఒక్కదాని కథ లేదా బాధ కాదు. అందరికీ సంబంధించింది. అది రామక్క కావొచ్చు, లక్ష్మీ కావొచ్చు... అందుకే మాలో ఒకరు మాట్లాడుతుంటే మిగతావాళ్ళ కళ్ళల్లో కన్నీళ్ళు నిండుతాయి. ఇది ఇప్పటి బాధ కాదు. జన్మజన్మల తరబడి వుంది. తల్లి నుంచి కూతురుకి, అత్త నుంచి కోడలికి అది వారసత్వంగా సంక్రమిస్తూనే వుంది. బుట్ట ఒకటే అయి వుండవచ్చుకానీ దాన్ని మోసే భుజాలు మారుతూ వస్తున్నాయి' అని చెప్పింది.

మాట్లాడుతున్నప్పుడు మధ్య మధ్యలో నారాయణమ్మ ఒక విధమైన తాత్వికతలోకి వెళ్ళిపోతోంది. ఆమె భర్త చెరుకుతోట కుళ్ళాయప్ప లేచివెళ్ళి గది మూలన వున్న పెట్టెలో నుంచి ఒక పోస్టరు తీసి మాకు చూపించాడు. అది 2001-02లో ఆంధ్రప్రదేశ్‌లో వేసిన మొట్టమొదటి పోస్టరు. దానిలో పాకీ పనిని తుదముట్టించటానికి పోరాటం చేయాలన్న విజ్ఞప్తివుంది. పోస్టరు మధ్యలో నారాయణమ్మ ఎత్తుడుదొడ్డిని శుభ్రం చేస్తూ వున్న ఫొటో వుంది. భారతదేశంలోని నాగరికసమాజంలో మరుగున వున్న జనాలు చేస్తున్న మొట్టమొదటి పోరాటం ఇది. 'ఈ ఉద్యమానికి ఈమె కథానాయకురాలు' అని కుళ్ళాయప్ప చెప్తూ ఆ పోస్టర్‌ని గుండెలకి హత్తుకున్నాడు. ఈ ఉద్యమానికి సంబంధించిన అన్ని ముఖ్యమైన పేపర్లను ఈ పెట్టేలోనే వుంచానని అతను మాకు చెప్పాడు. దానికి ఒక తాళం కూడా వేశాడు. ఎందుకంటే అవి అతని దృష్టిలో అతి ముఖ్యమైన సేకరణ.

పని నుంచి విజయోత్సాహపు స్వేచ్ఛ వరకూ నారాయణమ్మ చేసిన ప్రయాణంలో అనేక దశల గురించి మేము దఫదఫాలుగా మాట్లాడుతూనే వున్నాం. అటువంటి జీవితం గురించి తెలుసుకోవటం, అర్థం చేసుకోవటం అనేది మాకే కాదు నారాయణమ్మకు కూడా కష్టమైన విషయమే. తన పద్నాలుగేళ్ళ వయస్సులో అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఆడవాళ్ళు ఉపయోగించే సామూహిక ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటం మొదలుపెట్టింది నారాయణమ్మ. ఈ ఎత్తుడుదొడ్డిలో 600 దొడ్డికి కూర్చునే పీటలున్నాయి. ఉదయం ఆరుగంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ అక్కడి పియ్యాపెంటలను చేతులతో ఎత్తిపోస్తూ నారాయణమ్మ శుభ్రం చేయాలి. నారాయణమ్మ పెద్దక్క కూడా ఇదే పని చేసేది. ఆమెకు తీవ్రమైన జబ్బు చేయటంతో ఆ స్థానంలో చిన్నవయసులోనే నారాయణమ్మ ఈ పనిలోకి దిగాల్సివచ్చింది. కుటుంబ సభ్యుల ఒత్తిడితో నారాయణమ్మ ఆ వయసులోనే తన అక్క భర్తను పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. అలా ఆమె అక్క చేసే పనిని చేపట్టి కుటుంబాన్ని నడిపించాలన్నది పెద్దవాళ్ళ ఆలోచన. అంతకు ముందు కూడా ఆమె అప్పుడప్పుడూ తల్లితో కలిసి పుట్టింట్లో ఈ పని చేసేది. చాలా సంవత్సరాల పాటు తన పెద్దక్కకు ఈ పాకీ పనిలో సహాయం చేసింది. అనంతరం 1979లో మున్సిపల్ కార్పొరేషన్‌లో

శాశ్వత ఉద్యోగిగా మారింది. తదుపరి 21 సంవత్సరాల పాటు ఒక ప్రాంతంలోని ఎత్తుడుదొడ్లను శుభ్రం చేయటానికి ఆమెను నియమించారు.

మొట్టమొదటిసారి ఈ పని చేయటానికి వెళ్ళినపుడు కాలకృత్యాలు తీర్చుకోటానికి అధిక సంఖ్యలో ఆడవాళ్ళు రావటాన్ని చూసి నారాయణమ్మ స్పృహతప్పి పడిపోయింది. అంత మంది జనం ఏరిగిన పియ్యిపెంటను ఎలా శుభ్రం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. ఆ ఎత్తుడుదొడ్డి కేవలం ఆడవాళ్ళకు మాత్రమే ఉపయోగించేది కావడంతో, దానిని శుభ్రం చేసే పనిని కూడా ఆడవాళ్ళకే ఇస్తారు. దాన్నంతటినీ నారాయణమ్మే శుభ్రంచేయాలి. ఈ దొడ్డిలోనే 600 కూర్చునే పీటలున్నాయి. ఆ దృశ్యాన్ని మాకు పోస్టర్‌లో చూపించింది. ప్రతి ఒక్కపీట దగ్గరకు వెళ్ళి అక్కడ ఏరిగిన పియ్యిపెంటని చీపురు, రేకుముక్కతో ఎత్తి బుట్టలో వేయాలి. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నుంచి ఈ పాకీదొడ్డిని ఉపయోగించటానికి ఆడవాళ్ళు వచ్చేవారు. చాలా మంది జనం రావటం, అక్కడి పరిస్థితిని చూసి మూర్ఛపోవటం తరచూ జరుగుతుండేది. అంటరానితనం ఎంత వేళ్ళూనుకుని పోయిందో, ఆ కష్టం ఎంత దారుణంగా వుంటుందో నారాయణమ్మ బాధతో చెప్పుకొచ్చింది. ఉదాహరణకు ఈ 600 పీటలున్న పాకీదొడ్డిని శుభ్రం చేస్తున్నపుడు ఆమెకు గనుక దాహం వేస్తే మంచి నీళ్ళు మాత్రం ఎక్కడా దొరికేవి కాదు. ఒక్క గుక్కెడు నీళ్ళకోసం ఇంటివరకూ నడిచివెళ్ళి తాగిరావాల్సి వచ్చేది.

నారాయణమ్మ ఒక అర్ధ కిలోమీటరు దూరంలో నిలిపివుంచే మున్సిపాలిటీ ట్రాక్టరు దగ్గరకు పియ్యాపెంటలతో నిండుగా వున్న బుట్టని రోజులో ఎన్ని సార్లు నెత్తిమీద పెట్టుకుని వెళ్ళి వచ్చేదో లెక్కేలేదు. ట్రాక్టరు దగ్గరి నుంచి తిరిగి వచ్చేటప్పటికీ మరింత మంది ఆడవాళ్ళు పాకీదొడ్డి దగ్గర కాచుకొని వుండటమనేది తరచూ జరిగే తతంగమే. ఆ పీటలను మళ్ళీ శుభ్రం చేసి వెళ్ళమని వాళ్ళు ఆమెని పిలుస్తూనే వుండేవారు. 'తోటెమ్మే లేదా తొట్టెమ్మా' ఇది వాళ్ళు ఆమెని పిలిచే పిలుపు. (అంటే పాకీపనామె అని అర్థం). 'ఓ తొట్టెమ్మా! తొందరగా ఊడువ్, మేం ఎక్కువసేపు వుండలేం' అనేవాళ్ళు. ఆ మాట వినిపించగానే ఆమెకు కుంచించుకుపోయినట్టు అయ్యేది. ఇలా ముప్పై ఏళ్ళపాటు ఆమె ఆ పాకీదొడ్లని శుభ్రం చేస్తూ గడిపింది. ఈ క్రమంలో అసహ్యకరమైన ఆ 'తోటెమ్మే' పిలుపే తప్పించి తన అసలు పేరుని కూడా ఆమె గుర్తుంచుకునే పరిస్థితి లేకుండాపోయింది. ఎంత తినకపోతే వాళ్ళు ఆ మరుగుదొడ్లు వాడటానికి వస్తారని అన్ని సార్లు తనని పిలిచే ఆడవాళ్ళని ఉద్దేశించి లోలోపల చాలా తిట్టుకునేది. అయినప్పటికీ అసహ్యకరమైన ఆ పనిని పూర్తిచేయటానికి ఒక యంత్రంలాగా నిశ్శబ్దంగా పని చేసుకుపోయేది.

ఆ పియ్యిపెంట నెత్తిమీద చిందకుండా వుండటానికి బుట్ట అడుగుభాగంలో ఎండిన ఆకుల్ని పరిచేది ఆమె. ఆ పాకీదొడ్లు శుభ్రం చేసిన తర్వాత రోడ్లు వూడ్చే క్రమంలో ఆ ఆకుల్ని జమచేసుకునేది. ఈ పనిలో ఆమెకు పిల్లలు కూడా సహాయపడేవారు. 'మీకు,

మీ సినిమాలకు వానాకాలమంటే చాలా ఇష్టం'. తీవ్రమైన తిరస్కారం ధ్వనిస్తున్న గొంతుతో అన్నదామె.

'అవును, ప్రతి రాష్ట్రంలోనూ ఆడవాళ్ళు ఇదే చెప్పారు' అని నేనన్నాను.

నన్ను మధ్యలోనే ఆపి, 'ప్రతిచోటా ఈ పియ్యిపెంటని నెత్తిమీదే మోస్తారు. ఆ వాననీళ్ళతో మీ కుళ్ళు –మురికి పెంటంతా మా శరీరాలమీద పడుతుంది. ప్రపంచంలో ఏ తల్లైనా తన బిడ్డ మలినాల్ని శరీరం మీద వుంచుకోగలుగుతుందా? నేను గాంధీని ఈ విషయం అడగాలనుకుంటున్నాను. అతను మా గురించి అలా ఎలా చెప్పగలిగాడని! నేను చాలా మంది పిల్లల్ని కన్నాను. వారి ఉచ్చ, దొడ్డిల్ని కడిగాను. కానీ ఈ పనినీ, శతాబ్దాలుగా బుట్టనిండావున్న మనుషుల పియ్యిపెంటను మాతో బలవంతంగా మోయిస్తున్న పనినీ ఎప్పటికీ సరిపోల్చలేరు. అలా సరిపోల్చేవాళ్ళు వాళ్ళ నిజజీవితంలో ఒక్కసారైనా పాకీవాళ్ళు మోసే బుట్టను కనీసం తాకను కూడా తాకి వుండరు. ఎవరి సొంత పాకీదొడ్డిని వారు శుభ్రం చేసుకోవటం అనేది, ఇంకొకరు ఏరిగిన పియ్యిపెంటను చేతులతో ఎత్తి మోయటం అనేది పూర్తిగా వేరు వేరు అంశాలు.... అలాంటి మాటలు మా గుండెల్ని మరింత మండిస్తాయి. మాకు ఈ పనికన్నా తుచ్ఛమైనది, హేయమైనది ఇంకోటి లేదు.

నారాయణమ్మ మాట్లాడుతుంటే నా మనస్సులో మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ చెప్పిన మాటలు మారుమోగాయి. ఆయన 1936లో ఒక వ్యాసంరాస్తూ 'ఒక తల్లి తన బిడ్డ కోసం ఎలా అయితే చేస్తుందో "భంగీలు" కూడా సమాజంకోసం అదే చేస్తారు. తల్లి తన బిడ్డ మలమూత్రాలను శుభ్రం చేసేది అతని ఆరోగ్యం కోసమే. అదేవిధంగా "భంగీలు" కూడా సమాజ ఆరోగ్యం కోసం స్వచ్ఛందంగా శుభ్రం చేస్తారు...' అని పేర్కొన్నాడు. గాంధీకి సమాధానంగా తార్కికంగా ఒక సరైన పద్ధతిలో నారాయణమ్మ చేసిన వాదనతో నాకు ఇంక మాటలు పెగల్లేదు. అరవైయేళ్ళ స్వతంత్రం తర్వాత గాంధీకి వ్యతిరేకంగా నారాయణమ్మ ఈ మాటలు చెప్పటం అంటే నిజానికి చరిత్రను తిరగ రాయటమే.

అయితే అడగాల్సిన ప్రశ్నలు ఇంకా అనేకం మిగిలిపోయాయి. 'కేవలం ఆడవాళ్ళే ఎందుకు ఈ పాకీపని చేస్తారు?' అని నేను అడిగాను.

దానికి సమాధానంగా, 'ఎందుకంటే ఈ ఎత్తుడుదొడ్లు కేవలం ఆడవాళ్ళకోసమే కాబట్టి' అని చెప్పిందామె. 'మరి వేరే ప్రాంతాల్లో వున్న పాకీదొడ్ల మాటేమిటి?'

'ఆడవాళ్ళు తప్పించి ఈ పని వేరేవాళ్ళు చేయటమనేది చాలాకష్టం' అని విడమర్చి చెబుతూ 'ఈ పని తీవ్రంగా బాధిస్తుంది. ఆడవాళ్ళ నెత్తిన ఈ బుట్ట పెట్టిన తర్వాత మగవాడు ఇంక ఏ బాధ్యతా లేకుండా అయిపోతాడు. అగ్రకులాల వాళ్ళు కూడా ఆడవాళ్ళని ఒత్తిడిపెట్టి పని చేయించుకోవటం సులభమనుకుంటారు. మా ఆడవాళ్ళేమీ పెద్ద ఇదేం కాదు. మేము మా కొడుకులను ఈ మురికి కూపంలోకి వెళ్ళమని చెప్పలేం. నేను తరచూ జబ్బుపడేదాన్ని. అప్పుడు ఈ కుళ్ళుపని చేయమని నా కూతుర్నే పంపించేదాన్ని. కేవలం కూతుళ్ళే మా బాధల్ని, సంతోషాల్ని అర్థంచేసుకోగలరు. వాళ్ళే అమ్మ నాయనల

మాట వింటారు, కొడుకులు అసలు వినరు. వాళ్ళు కుటుంబానికి గర్వకారణమనుకుంటాం. నిజానికి కూతురే కష్టకాలాల్లో కుటుంబానికి అండగా వున్నప్పటికీ మీకు మల్లేనే మేము సైతం కొడుకులు కుటుంబానికి...' అని అర్థోక్తిగా ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొనసాగించింది.

'మేము ఇలా చేయటం ఏ మాత్రం మంచి పనికాదు. మేమే కాదు, ప్రపంచమంతా కూతుళ్ళ మంచితనాన్ని తమ అవసరాలకు ఉపయోగించుకుంటుంది. దీనికి తప్పుబట్ట వలసింది మమ్మల్నే. మన కన్నీళ్ళతో మన కూతుళ్ళని మనమున్న నరకంలోకి లాగేస్తాం. మనకు తెలుసు వాళ్ళు మనల్ని వ్యతిరేకించరని. మన అమ్మాయిలు దుర్మార్గమైన ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే మనమే దానికి బాధ్యత వహించటం అనేది అత్యంత ప్రధానమైన విషయం'.

ముందు తమ సొంత విముక్తి కోసం పోరాడటంకన్నా తమ పిల్లలు, ముఖ్యంగా కూతుళ్ళు ఈ నరకంలోకి రాకూడదనే పూచీని దేశంలోని ఈ ఆడవాళ్ళందరూ కోరు కుంటున్నారని నాకు తెలుసు. తన తెల్ల జుట్టును సవరదీసుకుంటూ నారాయణమ్మ గట్టిగా నవ్వి 'ఇది వీళ్ళంటున్నారు, నేను కాదు. ఆడవాళ్ళు ఏ ప్రాంతంలో వున్నవాళ్ళమైనా సరే, పాకీబుట్ట మా నెత్తిమీద పెట్టినప్పుడు మా గుండెలు ఒకేలాగా రోదిస్తాయి. మా గొంతులు, బుర్ర అంతా ఒకేలాగా ఆలోచిస్తుంది. మా తర్వాతితరం ఈ పనిలోకి రాకూడదనేదే మాకొచ్చే మొదటి ఆలోచన. మా పిల్లల్ని రక్షించుకోవటం అనే కర్తవ్యదీక్ష చేపట్టటానికి ప్రయత్నిస్తున్నాం. కొద్ది రోజుల్లో ఈ నరకాన్ని కేవలం కెమెరాల్లోనే చూస్తారు. చూస్తూ వుండండి....'

నాలో నేను నిశ్శబ్దంగా 'ఆమెన్!' అనుకున్నాను. ఆ గదిలో కూర్చున్న మిగతా వాళ్ళు అలా అనుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళు చేస్తున్న ప్రయత్నాల మీద వాళ్ళకు గొప్ప నమ్మకం వుంది.

మొదటి నుంచీ నా బుర్రలో సుడి తిరుగుతున్న ఓ ముఖ్యమైన ప్రశ్న చప్పున గుర్తొచ్చింది. మాటల్లో పడి మళ్ళీ మర్చిపోకముందే దాన్ని ఇప్పుడే ప్రస్తావించడం మంచిదనుకున్నాను. 'పాకీ పనిని వదిలేయాలని మీరు ఎప్పుడనుకున్నారు?' అని అడిగాను. '1995–1996 నుంచీ దీని గురించి ఆలోచిస్తున్నప్పటికీ, 2000 సంవత్సరంలో ఈ పని పూర్తిగా మానేశాను.'

1995 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది ఆడవాళ్ళు పాకీపని చేసేవారని, ఆ విషయం గురించి ఎవ్వరూ ప్రశ్నించలేదని సఫాయి కర్మచారి ఆందోళన్ నాయకుడు బెజవాడ విల్సన్ వివరించాడు. మొట్టమొదట ఈ నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టింది నారాయణమ్మే. పాకీపని నిర్మూలన కోసం ఆ సమూహం నుంచే మొట్టమొదటిసారిగా నిర్మాణాత్మకమైన ఉద్యమం ప్రారంభమయింది. ఈ ఉద్యమంలో భాగంగానే బెజవాడ విల్సన్ నారాయణమ్మను కలుసుకున్నాడు. ఆ కలయిక వాళ్ళిద్దరి జీవితాలనూ మార్చేసింది. తన జీవితమంతా

పాకీ పనిలో గడిపిన నారాయణమ్మ విముక్తికి చిహ్నంలా మారింది. బెజవాడ విల్సన్ ఉద్యమానికి సైతం బలమైన మద్ధతు లభించింది. ఆ తర్వాత తాను ఒక్కర్తే కాకుండా తనతో పాటు ఈ అమానవీయమైన పనిలో వున్న తోటి అక్కచెల్లెళ్ళను కూడా విముక్తి కావించాలని నారాయణమ్మ సంకల్పించింది. ఆ సమయంలో అధికారులు ఆమెని బెదిరింపులకు గురిచేశారు. 'మీరెవరైనా వింటారా మాగోడు?' అనే వాక్యం ధర్నాల సమయంలో పాకీ ఆడవాళ్ళ గొంతుల్లో పదే పదే మార్మోగిపోయింది. అధికారుల మీద ఈ ఒత్తిడి పనిచేయలేదు. దానితో నారాయణమ్మ, సఫాయి కర్మచారి ఆందోళన్ చరిత్రను తామే తిరగరాయాలనే గట్టి నిశ్చయానికొచ్చారు.

అందరూ కలిసికట్టుగా బుడప్పనగర్ సామూహిక మరుగుదొడ్లను కూల్చాలని నిర్ణయించుకున్నప్పుడు వాటిని ఉపయోగిస్తున్న వారందరూ వీరికి వ్యతిరేకమయ్యారు. ఈ విషయాన్ని చెప్తున్నప్పుడు నారాయణమ్మ చాలా కోపంతో లేచి నిలబడింది. 'మాకు మద్ధతుగా వచ్చిన వాళ్ళను ఆపివేసి వాళ్ళపై అరవటం మొదలుపెట్టారు. నేను వాళ్ళ చేతుల్లోంచి ఇనుపరాడ్‌ని లాక్కుని పాకీదొడ్డి గోడను కూలగొట్టటం మొదలుపెట్టాను. నా జీవితమంతా వీళ్ళు ఏరిగిన పియ్యిపెంటను ఎత్తాను. వాళ్ళు నన్ను ముట్టుకోవటం లేదా నా చేత తిట్లూ, అవమానాలు పడాలనీ అనుకోరు. ఈ రోజు ఆ ఘటనను తల్చుకుంటుంటే నాకు చాలా నవ్వొస్తోంది. అక్కడివాళ్ళంతా నాకు బాగా తెలిసినవాళ్ళే. నా అంటరానితనాన్నే నా ఆయుధంగా మలచుకుని వాళ్ళకు సవాలు విసిరాను. నేను ఊహించింది సరైందే! ఎందుకంటే ఎవ్వరూ నా చేయి పట్టుకుని ఆపటం గానీ నాతో ఘర్షణకు గానీ రాలేదు. సంవత్సరాల తరబడి నాలోనే అణిచిపెట్టుకుని వున్న కోపం బద్దలయ్యి ఎగిసిపడింది. నా గుండె తీవ్రమైన ఆగ్రహంతో రగిలిపోయింది. ఈ నిర్మాణం వుండటం వల్లే కదా నా పరిస్థితి ఇలా వుందన్న ఆలోచన నా మనసులోకి ప్రవేశించి దాన్ని ఎలాగైనా నేలమట్టం చేయాలని నిర్ణయించుకున్నాను. భూమి మీద దాని ఆనవాలే లేకుండా పోవాలి. మనమంతా కలిసి నేలమట్టం చేయాలి. కూల్చేయాలి, కూల్చేయాలి అని నేను గట్టిగా అరుస్తూ, నినాదాలు ఇస్తూనే వున్నాను. మా పిల్లల దగ్గరకు ఈ పీడ రాకూడదు'.

ఈ విధంగా నారాయణమ్మ, సంస్థలో ఆమె తోటివారు ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారి ఎత్తుడుదొడ్డిని కూల్చేశారు. ఈ చర్య అందరికీ మార్గదర్శకంగా మారి దేశంలోని అనేక ప్రాంతాలకు ఈ చైతన్యం విస్తరించింది. కొన్ని ప్రాంతాల్లో ఆ పియ్యిపెంటలను ఎత్తే బుట్టలను కాల్చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పైన చెప్పిన విధంగానే ఎత్తుడుదొడ్లను కూల్చేశారు.

'ఈ రోజు నేను చాలా సంతోషంగా వున్నాను. నాతో పాటు ఇక్కడున్న ఆడవాళ్ళందరూ సంతోషంగా వున్నారు. నా ఆరోగ్యం బాగుంది. నేను ఇప్పుడు ప్రతి ఒక్కటీ తినాలనుకుంటున్నాను. ఇంతకు పూర్వం ఏది తినాలన్నా ఇబ్బందిగా వుండేది. ప్రతిక్షణం కడుపులో

తెములుతున్నట్టే వికారం కలిగేది. మా ఆడవాళ్ళం పప్పు వైపు కనీసం చూడను కూడా చూసేవాళ్ళం కాదు. ఆ వంక చూస్తేనే మాకు కడుపులో భరించరానిదిగా వుండేది. నా పెద్దకొడుకు పెన్నోబులేసు అప్పటికి చాలా చిన్నవాడు. అయినా నాతో కలిసి పనికి వచ్చేవాడు. ఫలితంగా వాడికి ఇన్‌ఫెక్షన్ సోకి జబ్బు చేసి, చచ్చిపోయినంత పనయ్యింది. ఈ రోజు నా కొడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ పోరాటానికి నాయకుడు. పాకీపని నిర్మూలన కోసం మాతో కలిసి ముందు వరుసలో నడుస్తున్నాడు. ఇది నాకు చాలా గర్వంగా వుంది. ఈ పని వదిలేసిన దగ్గర్నుంచి నా జీవితం అలాగే నా బంధువుల జీవితాలు ఎంతో మారాయి. నా తర్వాత నా తమ్ముడు, మరదలు ఇదే బాటన నడిచారు. ప్రస్తుతం వాళ్ళు ఒక ఆస్పత్రిలో పని చేస్తున్నారు.'

'ఆ తర్వాత, నాకు చెప్పు వాళ్ళు ఏం పని చేస్తారు?' అని ప్రశ్నార్థకంగా అడిగిన నారాయణమ్మ గట్టిగా నవ్వుతూ మళ్ళీ తనే చెప్పింది. 'వాళ్ళు ఊడ్చేపని చేయరు. వాళ్ళు స్వీపర్లు కాదు. ఆఫీసులో ఫైళ్ళతో పనిచేస్తారు.' అని చెప్పింది.ఆ మాట చెప్తున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఒక మెరుపు మెరిసింది. 'ఈ పని వదిలేయటం వల్ల మా జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందో మీకు అర్థం కాదు. మొట్టమొదటిసారిగా గౌరవం అనేది ఎలా వుంటుందో మేము అర్థం చేసుకున్నాం.'

'కానీ దీనితో కులవ్యవస్థ పోతుందా?' అని నేను అడిగాను.

'పోనేపోదు. కులవ్యవస్థ తాలూకు శక్తివంతమైన పీడన అలానే వుంటుంది.రాజకీయ నాయకులు మాత్రం కులాలకతీతంగా పని చేస్తామని పైకి చెబుతూ, కులం పునాది మీదే ఎక్కువ ఓట్లు రాబట్టటానికి చూస్తారు. ఈ కులవ్యవస్థతో లాభపడేది రాజకీయనాయకులూ, డబ్బులున్నోళ్ళు. కులం అనేది దైవదత్తమైన అంశం అని చెప్పి చదువుకున్నవాళ్ళు మమ్మల్ని నమ్మించటానికి చూస్తారు. కులాల్ని సృష్టించింది దేవుడు కాదని, ఆయనేమీ తన కోసం మమ్మల్ని ఈ నరకంలోకి తోయలేదనే విషయం ఇప్పుడు నాకు బాగా తెలుసు–' అని నారాయణమ్మ ఒక తాత్విక ధోరణితో ఆ వివరాలన్నీ చెప్పుకొచ్చింది. మేం మధ్యలో ఎక్కడ వెళ్ళిపోతామో అన్న తొందరతో గబగబా మాట్లాడేసింది.

జరిగిన అన్యాయానికి, ఆ అసహ్యకరమైన పనికి వ్యతిరేకంగా పోరాడే శక్తి ఆమెలో అంత బలంగా ఎలా వచ్చిందో తెలుసుకోవాలనే కుతూహలం నాకు కలిగింది. వెంటనే ఆమె పనిచేసిన ప్రాంతానికి వెళ్ళి చూశాను. మమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళే ఏర్పాటు నారాయణమ్మే చేసింది. అక్కడి పరిస్థితులు ఎలా నాటకీయంగా మారాయో మా అంతట మమ్మల్నే చూడమని చెప్పింది. అనంతపురంలోని గలాంవీధిలో, ఇంతకు ముందు ఎత్తుడుదొడ్లు వుండే ప్రదేశంలో ఇప్పుడు పెద్ద పాఠశాల వుంది. అక్కడ ఐదో తరగతి వరకూ పిల్లలు చదువుకోవచ్చు. 2003లో ఆ ఎత్తుడుదొడ్లను కూలగొట్టారు. 2007 ఆగస్టు 15న పాఠశాల భవన నిర్మాణాన్ని మొదలుపెట్టారు.

అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడినప్పుడు తమ కళ్ళముందే ఇలాంటి క్రూరమైన, హేయమైన విధానం కొనసాగినందుకు తామెంత సిగ్గుపడుతున్నామో వివరించారు. పార్వతి, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, పి.స్వామివిల్లి– వీళ్ళందరూ కూడా నారాయణమ్మ తన జీవితంలో అనుభవించిన కష్టాలకు ప్రత్యక్ష సాక్షులు.

చిన్నప్పటి నుంచి అక్కడే నివసిస్తున్న పార్వతి మాతో ఇలా చెప్పింది. 'ఇదంతా చూస్తే బుర్ర పాడయిపోతుంది. మన సొంత బిడ్డ పియ్యి కడగటం అనేది కూడా అంత సులభమైనదేమీ కాదు. అలాంటిది అంత మంది పియ్యిపెంటలను ఆమె ఎలా ఎత్తగలిగింది? చిన్నప్పటి నుంచీ నా మనసులో ఆమెకి సంబంధించిన రూపం ముద్రపడిపోయింది. తలమీద బుట్ట, చేతిలో చీపురు, ముఖం చుట్టూ కప్పుకున్న చీరకొంగు లేదా రుమాలు. కోపంతో ఎప్పుడూ ఏదో గొణుగుతూ వుండేది. ఆమె వస్తుందంటేనే ఆమె మోస్తున్న ఆ పియ్యిపెంట డబ్బాకు ఎంత వీలైతే అంత దూరంగా మేము అక్కడ్నుంచి పక్కకు పారిపోయే వాళ్ళం. ఈ పాకీదొడ్లను కూలగొట్టిన తర్వాత ఆ వార్త పేపర్లలో ఆమె ఫోటోతో సహా వచ్చిన తర్వాతే తన పేరు మాకు తెలిసింది. నిజానికి మేమెవ్వరమూ ఈ పాకీ పనివాళ్ళని మనుషులుగా కూడా గుర్తించలేదు.'

ఆమె పక్కనే నిలబడి వున్న లక్ష్మి అందుకుని 'వాళ్ళని మాబోటి మనుషులుగా గుర్తించి వుంటే పురుగులతో లుకలుకలాడే ఈ నరకంలోకి ఎందుకు తోసివేస్తాం?' అన్నది.

పియ్యిపెంట వుండటం వల్ల చిన్నచిన్న పురుగులు అక్కడ్నుంచి ఎలా పాక్కుంటూ బయటకు వచ్చేవో పవన్ అనే పిల్లవాడు ఆ పాఠశాల భవనంలోకి పరిగెత్తుకెళ్ళి మాకు చెప్పటం మొదలుపెట్టాడు.

ఆ పురుగులని చూసి పిల్లలు భయపడేవారని, ఆడపిల్లలు దొడ్డికి వెళ్ళినప్పుడు ఊపిరి బిగపట్టి కూర్చునేవారని చెప్పాడు. 'ఆమె (నారాయణమ్మ) చాలా మురికిది కాబట్టే ఆ పురుగులు అక్కడ అలా వున్నాయని మాకు చెప్పేవారు. పెద్దయిన తర్వాత మేము అసలు విషయం గ్రహించాం అవి మానుంచి వచ్చే పురుగులేనని, వాటిని ఈమె బలవంతంచేత శుభ్రం చేయాల్సివస్తోందని తెలుసుకుని సిగ్గుపడ్డాం. వేసవికాలంలో ఈ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయి, ఇక్కడ నివసించడం అనేది దుర్లభంగా వుండేది.'

ఈ పాకీదొడ్లు కూల్చేసిన తర్వాత ఏమన్నా ఉపశమనంగా వుందా? అన్న ప్రశ్నకు అందరూ ఒకేసారి, 'అవును– మేము కూడా ఈ ఘోరమైన అపరాధం నుంచి బయటపడ్డాం' అని చెప్పారు.

నేను అందుకుని మీకందరికీ ఆ పాకీదొడ్లు ఇక్కడుండటం అనేది తలనొప్పిగా, అసౌకర్యంగా అనిపించినప్పుడు వాటిని కూలగొట్టాలని ఎందుకు తోచలేదు? అని అడిగాను. ఆ ప్రాంత వాసులందరికీ ఇదొక కష్టమైన ప్రశ్నే.

'మేము పుట్టిన దగ్గర్నుంచీ ఈ పాకీదొడ్లను చూస్తునే వున్నాం. వీటికి ఇంకో ప్రత్యామ్నాయం వుంటుందని మాకెప్పుడూ తోచలేదు. అదీకాకుండా హిందూధర్మంలో

పాకీదొడ్డి అనేది అపవిత్రమైన ప్రదేశంగా, అది ఇంట్లో వుండకూడదని అంటారు. అందుకే వాటిని కూలగొట్టిన తర్వాతే మేము వేరే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించటం మొదలుపెట్టాం' అని లక్ష్మి చెప్పింది.

ఈ మార్పు తీసుకొచ్చినందుకు వాళ్ళంతా నారాయణమ్మ పట్ల ఎంతో గౌరవభావంతో వున్నారు. నరకం నుంచి ఆ ప్రాంతాన్ని విముక్తం చేయడంలో ఆమె ముఖ్యమైన పాత్రధారి అని వాళ్ళు భావిస్తున్నారు. మేము అక్కడ్నుంచి వచ్చేస్తుంటే పార్వతి వ్యంగ్యంగా కులవ్యవస్థ గురించి ఇలా వ్యాఖ్యానించింది. 'పాకీదొడ్డి ఉపయోగించే వ్యక్తి కులం ఏమిటని ఎవరూ చూడరు. దాదాపు అందరూ ఉపయోగిస్తారు. కానీ ఎవరైతే దాన్ని శుభ్రంచేస్తారో– ఆ పియ్యిపెంటలను నెత్తిమీద మోసుకెళ్ళే పరిస్థితి ఎవరికైతే వుంటుందో – వాళ్ళు మాత్రం కులవివక్షకు గురవుతారు. బుడప్పనగర్‌లో ఒక బడి వుందంటే, దాంట్లో మా పిల్లలు చదువుకుంటున్నారంటే కేవలం అది నారాయణమ్మ వల్లే. కంపుగొట్టే, అసహ్యకరమైన ఆ మురికి గతాన్ని మన మెదళ్ళల్లోంచి తీసేయ్యాలంటే ఇంతకంటే గొప్ప ప్రయత్నం మరొకటి వుండదు!'.

అక్కడ్నుంచీ వచ్చే ముందు మరొక్కసారి ఆ బడి వంక చూశాం. క్రూరమైన విధానానికి, మురికిపెంటలకు ఆలవాలమైన ఆ ప్రదేశంలో ఏర్పాటైన ఆ బడి ఒక నూతన శకానికి దిక్సూచిగా వుంటుందనటంలో సందేహం లేదు. ఈ నేతాజీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల పునాది రాయిని వేసింది స్థానిక శాసనసభ్యుడే.

ఆ ప్రాంతం నుంచి తిరిగి అంబేద్కర్ నగర్‌కు వెళ్ళాం. భోజనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాతో మాట్లాడటానికి ఇంకా ఎంతోమంది ఆడవాళ్ళు అక్కడికి వచ్చి ఎదురుచూస్తూ వున్నారు. వారందరిదీ ఒకే విధమైన కథ అయినప్పటికీ పోరాటపంథా గురించి వారికి స్పష్టమైన ప్రణాళిక వుంది. ప్రతి ఒక్కరికీ పంచుకోవల్సిన కష్టసుఖాల చరిత్ర ఒక్కటే అయినా, ఏళ్ళ తరబడి సాగిన ఈ పోరాటంలో భాగమవటం ద్వారా వారి మధ్య బంధం మరింత బలపడింది. పండు ముదుసలి అయినప్పటికీ రామక్క తన చిన్న కూతురు తిప్పమ్మ కంటే కూడా ఎంతో ధైర్యవంతురాలు. పాకీపనామె కూతురిగా పుట్టడంవల్ల ఇప్పటికీ ఎన్ని కష్టాలను భరించాల్సివస్తోందో ఇరవై ఏడేళ్ళ తిప్పమ్మ కన్నీళ్ళే చెబుతున్నాయి. బళ్ళో టీచర్లతో పాటు పిల్లలు కూడా ఆమెని తొట్టీ (పాకీ) అని పిలవటం వల్ల ఆమె చదువు కొనసాగించలేకపోయింది. ఆ ఎగతాళి, అవమానాలను భరించలేక అసలు బడికి వెళ్ళటమే మానేసింది తిప్పమ్మ.

'నా జీవితం నాశనమయింది, మా అమ్మ....' అని చెబుతూనే ఆమె మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది. తను ఏడవటం చూసి మరొకామె కోపం తెచ్చుకుంది. రామక్క కూతురిగా ఎంతో గర్వపడాలని, పదేళ్ళ క్రితం ఈ ఘోరమైన విధానానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించినామె కూతురుగా వున్నందుకు తలెత్తుకు బతకాలనీ అందరూ ఆమెకు

నచ్చచెప్పారు. అత్యంత పేదరికంలో వుండి కూడా పాకీ పనికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు నడిపినందుకు రామక్క అంటే ఆ సమూహంలో అందరికీ అలవిమాలిన గౌరవం. పోరాటాన్ని ఆపివేయాలనే ప్రభుత్వ అధికారుల బెదిరింపులకు ఏ మాత్రం బెదరనందుకు అందరూ ఆమెని చూసి ముచ్చపడతారు.

రామక్క లాగానే, కూనూరు నుంచి వచ్చిన దానమ్మకు కూడా తన తలమీద ఎన్ని సంవత్సరాల క్రితం ఆ బుట్టను పెట్టారో గుర్తులేదు. 'చెడ్డామె', 'మురికామె', 'కంపుగొట్టే తొట్టీ' అనే మాటలు వినీవినీ ఆమె విసిగి వేసారిపోయింది. తనకు గుర్తున్నంత వరకూ ఈ విషపు మాటలే తమ జీవితాలను నాశనం చేశాయని రామక్క చెప్పింది. 'నేను వయసులోకి రాకముందే, ఈ మాటలు నా బతుకులోని సంతోషాన్నంతా కొల్లగొట్టాయి. అందుకే ఈ అమానవీయ పని నుంచి బయటపడటానికి ఒక దారి వుందని తెలిశాక, దానిపై నాకు గురికుదిరాక ఇంక వెనక్కి తిరిగి చూడలేదు. మరో ఆసక్తికరమైన విషయమేమంటే మా మధ్యవున్న అక్కాచెల్లెళ్ళలాంటి బంధం నిజంగా నమ్మశక్యం కానిది. ఈ నరకంలో వుండటం వల్లే మేము కలిసి జీవించాం. కష్టాలున్నప్పుడు ఒకరికొకరు తోడుగా వున్నాం. ఇప్పుడు కలిసే ఈ కుళ్ళుపెంట నుంచి బయటకువచ్చాం. ఒకళ్ళు విముక్తమయ్యి ఇంకొకళ్ళని వెనకే వదిలివేయడమనేది ఎప్పుడూ జరగదు. కూనూరులో నాతో పాటు యాభైమంది ఆడవాళ్ళు ఈ నరకం నుంచి విముక్తమయ్యారు. పదేళ్ళ క్రితం రామక్క ఈ పనిని వదిలేస్తే, దానమ్మ ఎనిమిదేళ్ళ క్రితం వదిలేసింది.

స్ట్రగుల్ అన్న పదానికి తెలుగులో పోరాటం అనే దాన్ని సమానార్థకంగా వాడతారు. ఈ ఆడవాళ్ళకు దానిమీద సంపూర్ణమైన విశ్వాసం వుంది. పోరాటమొక్కటే మార్గం అని పదేపదే వారు చెప్పారు. అప్పుడే లోకసభ, శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని తమ పునరావాసం విషయాన్ని రాజకీయ అంశంగా మార్చాలని అనుకుంటున్నారు. వీరి ఓట్లు సంఖ్యాపరంగా ఎక్కువ లేనప్పటికీ ఈ ప్రజాస్వామ్య ప్రక్రియని ఉపయోగించుకోలేని వాళ్ళుగా వుండదల్చుకోలేదు.

'మేము ఎలాగూ ఓటువేయాలి. ఈ సమయంలో మాకు కావలసిన అంశాలు గురించి నాయకులపై ఎందుకు ఒత్తిడి తేకూడదు? ప్రభుత్వాలు మాకు చేసిందేమీ లేదు. అయినప్పటికీ మాకు రాజకీయంగా రావలసిన వాటిని మేము వదలదలుచుకోలేదు' అని వారు స్పష్టంగా చెప్పారు.

'ఇప్పుడు కాకపోయినా వచ్చే ఎన్నికల్లో నేను కూడా పోటీచేస్తాను. ఎన్నికల్లో నిలబడాలన్న కోరిక నాకు బలంగా వుంది. ఆ వేదిక మీద నిలబడి ఈరోజు ఒక "తొట్టీ" మహిళ మీ ముందు నిలబడి ఓట్లేయమని మిమ్మల్ని అడుగుతోంది. నేను నా చేతులతో నా పాకీబుట్టను విసిరివేశాను, ఎత్తుడుదొడ్లను కూలగొట్టాను, కుల ఆధిపత్యాన్ని కూలగొట్టటానికి మీ ముందుకి వచ్చాను... మీరు నాకు ఓటువేస్తారా? అని అడుగుతాను'

అని చెప్తూ నారాయణమ్మ గట్టిగా నవ్వి, 'నా మాటలు వినేవాళ్ళ ముఖాలు ఎర్రగా మారిపోవటం ఖాయం. కానీ నేను ఆ వేదిక  మీద నుంచి ఈ మాటలు కచ్చితంగా చెప్తాను. ఇది జరగకుండా చదువుకున్న సమాజానికి ఒక 'తొట్టీ' మహిళ బాధ ఇసుమంతైనా తెలియదు. ఈ గోడ దానంతట అది పడిపోలేదు...దాన్ని పలుగు, పారలతో కూల గొట్టాల్సిందే'. అని నారాయణమ్మ ముగించింది.

(2009లో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం పట్టణాన్ని సందర్శించినపుడు రాసింది.)

# కర్నాటక




1. బీదర్ 2. గుల్బర్గా 3. బీజాపూర్ 4. బాగల్‌కోట్ 5. రాయిచూర్ 6. గడగ్ 7. బెళ్ళారి 8. చిత్రదుర్గ 9. చిక్‌మగళూర్ 10. తూమ్‌కూర్ 11. చిక్కబల్లాపూర్ 12. కోలార్ 13. మైసూర్.

పైన చెప్పిన అన్ని ప్రాంతాలలోనూ 2008 వరకూ పాకీపని కొనసాగుతూవుండేది. దీని నిర్మూలనకి సంబంధించిన పోరాటం కోలార్ బంగారు గనుల ప్రాంతం నుంచి మొదలయింది.

## కర్నాటక

**'నరకం కూడా దీనికన్నా ఘోరంగా వుండి వుండదు. నేను బతుకుతున్నందుకు సిగ్గుపడుతున్నాను.'**

చాలాకాలంగా కర్నాటకలోని కోలార్ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందింది. పట్టు, పాలు, బంగారు గనులు వున్నందువల్ల ప్రజలకు కోలార్ గురించి పూర్తిగా తెలుసు.

నాతోపాటు మరికొంత మందికి కోలార్ వేరే కారణంగా తెలుసు. అది కుళ్ళికంపుగొట్టే ఒక అంశం. మరుగు మీద చేస్తున్న ముఖ్యమైన పోరాటం. బంగారు గనుల పక్కనే ఘోరమైన పాకీ పని కూడా సాగుతుందంటే ఊహకు సైతం అందని విషయం. బంగారం మెరుపుల కావల దాగివున్న పాకీ పని అనే అణిచివేత వైపు ఎవరు దృష్టి సారించగలరు? ఎవ్వరూ వుండరు. కొన్ని తరాల నుంచీ దళితులు కనీసపాటి ఆత్మగౌరవం కూడా లేకుండా దోపిడీకి గురవ్వుతూ, నిర్బంధపూరితంగా నెత్తిమీద తోటి మనుషుల పియ్యిపెంటలను మోస్తూ జీవిస్తున్నారు కాబట్టే ఈ గనులు 116 సంవత్సరాల నుంచి బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. పైకి కనిపించే బంగారపు జిలుగు వెలుగుల కారణంగా ఈ దుర్భరమైన జీవితాలు ఏనాడూ బహిర్గతం కాలేదు.

అసహ్యకరమైన పాకీ పనిలో కోలార్ ఈవిధంగా భాగంపంచుకుంది. ఇక్కడ ఈ పనిని ఎక్కువ శాతం దళిత క్రిష్టియన్లు చేస్తారు. దేశంలోని ఇతర ప్రాంతాల మాదిరిగా దళితులకి వేరే గుడులు, మసీదులు, గురుద్వారాలు వున్నట్లే ఈ సమూహానికి వేరే చర్చి వుంది.

కోలారు గనుల ప్రాంతం అంటే కోలార్ గోల్ట్ ఫీల్డ్ (కెజిఎఫ్) లో అట్లాంటి ఒక చర్చి నుంచి నా ప్రయాణం మొదలయింది. కెజిఎఫ్‌లోని మరికుప్పం అనే ప్రాంతంలో వున్న తెలుగుచర్చికి నేను చేరుకునే సరికి ఆ ప్రాంతంలో పాకీపని చేసే కుటుంబాలన్నీ (వాళ్ళు కచ్చితంగా దళితులే) అక్కడికి చేరుకున్నాయి. చట్టపరమైన నిర్వచనం ప్రకారం ఆ సమయంలో వాళ్ళెవ్వరూ పాకీపని చేయటం లేదు. కానీ అందులో చాలా మంది ఇప్పటికీ సెప్టిక్ ట్యాంకులను, మురుక్కాలవలను శుభ్రం చేస్తూనే వున్నారు. మిగిలిన వాళ్ళ మరుగుదొడ్లను శుభ్రం చేయటం లేదా రోడ్లను ఊడుస్తూ వున్నారు. అందులో కొందరు చదువుకుని ఉపాధ్యాయులు అయ్యారు. మరి కొంత మంది ఆటోరిక్షాలను నడుపుతున్నారు. కెజిఎఫ్‌లో వున్న చాలా మంది పాకీవాళ్ళు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినవాళ్ళని, అందుకే వాళ్ళకి ప్రత్యేకమైన తెలుగుచర్చి వుందని ఆ చర్చి ఫాదర్ మాకు చెప్పాడు. కానీ అది తోట్టీ చర్చి. అంటే కేవలం తోట్టీల కోసం మాత్రమే కట్టిన చర్చి. మొదట్లో తోట్టీ అనేది కులం కాదు. అది ఒక వృత్తి; తదనంతర కాలంలో అదొక కులంగా మారిపోయింది. బ్రిటిష్ హయాంలో కట్టించిన ఈ పట్టణంలో నివసించేవాళ్ళకి 2002 నుంచి శాశ్వత ఉద్యోగాలేవీ లేవు. దీనికి కారణం భారత్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని బంగారు గనులు మూసివేయటమే. ఫలితంగా అందులో పనిచేసే కార్మికులు ఉపాధి పూర్తిగా కోల్పోయారు. దానితో ప్రతిరోజూ వేలాది మంది ఉపాధి కోసం బెంగుళూరు నగరానికి వెళ్తుంటారు. ఈ పట్టణం ఎవరి ఆధ్వర్యంలో వుండాలనేది కూడా అనిశ్చితిగా వుంది. సాంకేతికంగా అయితే మున్సిపల్ కమిటీ నిర్వహించాలి. కానీ ఇందుకవసరమైన ఆదాయం ఇక్కడ నుంచి రాదు. కనీస వసతులైన నీరు, కరెంటు, మురుగుకాల్వల నిర్వహణ–

ఇవన్నీ దేవుడి మీద భారం వేసి చేపట్టాల్సిందే. కొన్ని ప్రాంతాల్లో, అయితే జీసస్ క్రైస్ట్ దయవల్ల.

ఈ పట్టణాన్ని కట్టించిన బ్రిటిష్‌వాళ్ళు అన్నింటికీ పకడ్బందీ నిర్మాణాలే ఏర్పాటుచేశారు. పాకీదొడ్లు కట్టించారు. అయితే అవి ఫ్లష్ టాయిలెట్లు కాదు, ఎత్తుడు దొడ్లు! వాటిని శుభ్రంచేయటం కోసం మనుషులను తీసుకొచ్చి ఇక్కడ వారిని స్థిరపర్చారు. వీళ్ళకోసం అన్ని వసతులతో వుండే క్వార్టర్స్ కట్టించారు. అవి ఇప్పటికీ అలా నిలిచే వున్నాయి. వాటిల్లో మానవమాత్రులెవరూ నిటారుగా నిలబడటం అనేది అసాధ్యం. చాలా మంది పాకీపనివాళ్ళు ఆంధ్రప్రదేశ్ నుంచి కర్నాటకకు వచ్చారు. వాళ్ళు ఇక్కడే స్థిరపడిపోయారు.

ఎన్నో ఏళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి కెజిఎఫ్‌కు అలా వలస వచ్చిన ఒక కుటుంబంలోని వ్యక్తి నర్సిగాడు. ఆ కుటుంబంలో మూడోతరానికి చెందిన బెజవాడ విల్సన్ కెజిఎఫ్ కేంద్రంగా పాకీపని నిర్మూలన కోసం ఉద్యమ స్థాయిలో పని మొదలుపెట్టిన వ్యక్తి. కెజిఎఫ్‌లో విల్సన్ కుటుంబం మొత్తం పాకీపని వాళ్ళుగానే బతికారు. వాళ్ళ నాన్న యాకోబ్ తన జీవితమంతా బంగారు గనుల్లో ఎత్తుడుదొడ్లు శుభ్రంచేసే శాశ్వత ఉద్యోగిగా పని చేశాడు. విల్సన్ పెద్దన్న సైతం ఇదేపని చేశాడు. మొదట్లో ఈ అసహ్యాకరమైన ప్రపంచం నుంచి విల్సన్‌ను దూరంగా వుంచారు. కోలార్‌లో ఈ సమూహం నుంచి ఉన్నత విద్య అభ్యసించిన మొదటివ్యక్తి విల్సన్. పదహారు పదిహేడేళ్ళ వయసులో చదువు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన క్రమంలో ఇతను మొట్టమొదటిసారి తనవాళ్ళు సామూహిక పాకీదొడ్లను శుభ్రం చేయడాన్ని చూశాడు. ఈ దుర్భరమైన పనిలో తనవాళ్ళు వుండటం, వారి చేతులు పియ్యిపెంటలతో నిండివుండటం అనే దృశ్యాలు విల్సన్ జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. చర్చి ఫాదర్ కావాలని ఆశించిన అతను సఫాయి కర్మచారి ఆందోళనను ప్రారంభించాడు. ఇదే ఆ తర్వాతి కాలంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ఎదిగింది. ఈ రోజు దేశమంతటా కులం పేరుతో జరుగుతున్న మధ్యయుగాలనాటి ఒక అమానవీయ వికృతాన్ని తుదముట్టించేందుకు నిర్ణయాత్మక పోరాటాన్ని కొనసాగిస్తోంది.

బెజవాడ విల్సన్ దగ్గరి బంధువైన నర్సిగాడు తను ఎలా వలసవచ్చాడో అతనికి విపులంగా వివరించాడు. తరతరాల నుంచి పియ్యిపెంటలతో నిండిన బుట్టను ఎలా మోస్తూవస్తున్నామో తన కుటుంబంలోని తర్వాతి తరానికి విడమరిచి చెప్పాడు. 'నేను సిగ్గులేకుండా మాట్లాడుతున్నానంటే ఆకలి అనేది నన్ను ఇక్కడి వరకూ తరుముతూ వచ్చింది. ఖాళీగా వున్న కడుపుని నింపుకోవటం అనివార్యమైంది. స్థిరమైన పని అంటూ ఒకటి ఇక్కడ దొరికాక, నేను మా వూరికి వెళ్ళి వేరేవాళ్ళని కూడా ఇక్కడికి తీసుకొచ్చాను. నెమ్మదిగా ఒక సమూహమే ఇక్కడ తయారయింది." కెజిఎఫ్‌లో నలభైమూడు సంవత్సరాలపాటు పాకీ పనివాడుగా నర్సిగాడు పని చేశాడు. పియ్యిపెంటలతో నిండిన

వేలాది బక్కెట్లను మోశాడు. తన తర్వాత కొడుకుకి, కోడలికి వారసత్వంగా ఈ పనిని అందించి ఈ లోకం నుంచి నిష్క్రమించాడు. ఇలాంటి కథలెన్నో కెజిఎఫ్‌లోని దళిత కాలనీలో ప్రతి ఇంట్లోనూ మనకు వినిపిస్తాయి.

ఈ నేపథ్యంలో గుండెని బరువెక్కించే హేయమైన చరిత్రతో కుళ్ళిన అమానవీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక ధిక్కారస్వరం నిప్పురవ్వలా వెలిగింది. 1986–87 మధ్య ఈ నిప్పురవ్వ రగులుకున్నప్పుడు, ఆ సమూహంలోని వారెవ్వరూ ఆ పరిణామ ప్రభావాలను ఊహామాత్రంగా కూడా అంచనా వేయలేకపోయారు. మనుషుల పియ్యిపెంటను ఎత్తటమనే పని తప్పించి తమకింకో జీవితం వుంటుందనే విషయాన్ని వాళ్ళెప్పుడూ ఊహించను కూడా లేదు. అందుకే పాకీ పనికి, ఎత్తుడుదొడ్లకు వ్యతిరేకంగా మొదలయిన పోరాటం నిప్పురవ్వ దశ నుంచి ఒక అగ్నిజ్వాలగా మారటానికి ఎంతో సమయం పట్టింది. కానీ ఒకసారి అది జ్వాలగా మారిన తర్వాత అనేక ఎత్తుడుదొడ్లను కూల్చేదాకా అది మండుతూనే వుంది. 1993–94 మధ్య కాలంలో ఒకవైపు పాకీ పని వాళ్ళకి పునరావాసం సాధించడం, మరోవైపు ఎత్తుడుదొడ్లను నేలమట్టం చేయటం అనే కర్తవ్యదీక్షతో కొంత ఫలితం వచ్చింది. నిర్మాణాత్మకమైన ఉద్యమం ద్వారా కేవలం ఎత్తుడుదొడ్లను కూల్చేయటమే కాక ఆ పనిచేసేవాళ్ళకు పునరావాసం కూడా లభించటం అనే మార్పు దేశం మొత్తం మీద మొట్టమొదటిసారి కోలార్‌లోనే జరిగింది. అణిచివేతకు గురయిన సమూహం నుంచే ఈ రకమైన పోరాటం మొదలవటం బహుశా ఇదే మొదటిసారి అయివుండొచ్చు.

కోలార్‌గడ్డ మీద నిలబడి ఆనాటి పోరాటం మొదటిదశ విజయాన్ని చూడటం అనేది ప్రత్యేకమైన అనుభవమే అని చెప్పాలి. కోలారు బంగారు గనుల్లోని వివిధ కాలనీల్లో తిరుగుతూ చాలామంది స్థానికుల్ని నేను కలిశాను. 1993–94 నుంచి 2011వరకూ జరిగిన ఈ విముక్తి పోరాట ప్రస్థానం మీద నా మెదడులో ఎన్నో రకాల ప్రశ్నలు సుడి తిరుగుతూ వున్నాయి. ఉదాహరణకు ప్రజల జీవితాన్ని, గౌరవాన్ని ఈ పోరాటం ఏ విధంగా ప్రభావితం చేసింది? ఇప్పటికీ దీనిలో వున్న లొసుగులేమిటి?

కోలార్‌లోని ఛాంపియన్ రీఫ్ రెసిడెన్షియల్ కమ్యూనిటీ నుంచి వచ్చిన మూర్తిని కలిశాను. 1997 నుంచి అతను పాకీ పనిని వదిలేసి ఆటోరిక్షా నడుపుతున్నాడు. మమ్మల్ని తన ఆటోలో కూర్చోబెట్టుకుని నగరమంతా చూపించాలని అతను ఉత్సాహపడ్డాడు. ఈ క్రమంలో 1977నుంచి తన జీవితంలో వచ్చిన ముఖ్యమైన మార్పుల గురించి చెప్పుకొచ్చాడు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఆ అమానవీయమైన పనిని వదిలేయగలిగినందుకు అతని ముఖంలో ఒక విధమైన సంతోషం, మెరుపు తళుక్కుమని మెరిశాయి. అతని కుటుంబ పరిస్థితి ఎంతో మెరుగుపడింది. మూర్తి మాటల్లోనే చెప్పాలంటే – వాళ్ళు మనుషులుగా జీవించటం అనేది ఆతర్వాతే మొదలైంది. శుభ్రమైన బట్టలు వేసుకోవటమనే ఆనందాన్ని ఇప్పుడే అనుభవిస్తున్నారు. తమ ఆటోలో కూర్చున్న వారితో సమానమైన వ్యక్తులమని అనుకుంటున్నారు. తొమ్మిది మంది సభ్యులున్న కుటుంబాన్ని

పోషించటం మూర్తికి కొంచెం కష్టమవుతున్నప్పటికీ, పాకీ పని నుంచి విముక్తమవటం కన్నా తన జీవితంలో మరేదీ ముఖ్యంకాదని భావిస్తున్నాడు. మూర్తితో పాటు అనేక మంది ఆటోవాళ్ళు ఇదేరకమైన జీవితానుభవంతో వున్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కావాలని కోరుకుంటున్నారు.

కోలార్‌లో పాకీ పనికి వ్యతిరేకంగా ఉద్యమం మొదలైన తొలిదినాల నుంచి ఇందులో మమేకమైనవాడు బాబూలాల్. 2007-08 ప్రాంతంలో సఫాయి కర్మచారీ ఆందోళన్ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కలిసి సంయుక్తంగా ఒక సర్వేను నిర్వహించగా అందులో 450 మంది పాకీ పనివాళ్ళని గుర్తించినట్టు అతను చెప్పాడు. ఇది వాళ్ళ పునరావాసానికి ఎంతో సహాయపడింది.

ఏదేమైనా కోలార్‌లో పాకీపని పూర్తిగా నిర్మూలించటం జరిగిందా అనే ప్రశ్న రాక మానదు. మనుషుల చేతులు ఇంకా ఈ పియ్యిపెంటలను శుభ్రం చేయకుండా వుండే పరిస్థితి నిజమైతే బావుండునని నాకు చాలా అనిపించింది. లేకపోతే ఈ దుర్మార్గమైన విధానం ఒక కొత్తరూపు తీసుకుని కులంతో ముడిపడి వున్న వివక్షను మరోవిధమైన రూపాల్లో కొనసాగిస్తోందా? 1993లో వచ్చిన మాన్యువల్ స్కావెంజర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ డ్రై లాట్రిన్స్ (ప్రొహిబిషన్) యాక్ట్ ప్రకారం చూస్తే కోలార్‌లో ఎత్తుడుదొడ్లు లేవు కాబట్టి అక్కడ ఏవిధమైన పాకీ పనివారు లేరు. అయితే కొన్ని నిర్దిష్టమైన అనుమానాలు నా లోలోపల తొలిచేస్తున్నాయి. నేను వాటిని సమూలంగా నివృత్తి చేసుకోవాలనుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నేను తెలుగు నుంచి ఆంగ్లానువాదం కోసం ప్రియాంక అనే యువతి సహాయం తీసుకున్నాను. ఇదే సమూహం నుంచే వచ్చిన ఇంగ్లీష్ టీచర్ ఆమె. నా కోసం ఎంతో ఉత్సాహంగా కాలేజీలో సగం రోజు శెలవు తీసుకుని వచ్చింది.

మేము చాంపియన్ రీఫ్ సామూహిక పాకీదొడ్ల వద్దకు వెళ్ళిన తరువాత నా అనుమానం మరింత ధృవపడింది. ఎత్తుడుదొడ్లకు బదులు అక్కడ సామూహిక 'ఫ్లష్ టాయిలెట్లు' వున్నాయి. అవి మూతకలిగిన గుంటలతో కలిపి వున్నాయి. ఎత్తుడుదొడ్లను ఎట్లా అయితే శుభ్రంచేస్తారో అలానే ఈ గుంటలను కూడా చేతులతోనే శుభ్రం చేయాలి. ఎటొచ్చీ తేడా ఏమిటంటే ఈ గుంటలను ప్రతిరోజూ శుభ్రం చేయనవసరం లేదు. కొన్ని నెలలకొకసారి లేదా ఇంకా తక్కువ వ్యవధిలోనో శుభ్రం చేయాల్సి వుంటుంది. ఆ టాయిలెట్లను ఉపయోగించే మనుషులు, ఆ గుంటల విస్తీర్ణాన్ని బట్టి అది ఆధారపడి వుంటుంది.

ఇళ్ళల్లో కట్టించుకున్న టాయిలెట్ల పరిస్థితి కూడా దాదాపు ఇలాగే వుంటుంది. వాటిని కూడా ఈ విధంగానే శుభ్రం చేయాలి. ఇతర నగరాలలో మాదిరిగానే కెజిఎఫ్‌లో కూడా భూగర్భ మురుక్కాల్వలకు ఇవి అనుసంధానించివుండవు. ఈ గుంటలు లేకుండా వీటిని నిర్మించటం అసాధ్యం. మిషన్ల ద్వారా గుంటల్లోని ఈ పియ్యిపెంటంతా తోడెయ్యటం

అనేది మంచి పద్ధతి. అయితే అటువంటి పరికరాలు అందుబాటులో లేవు. మనుషులు చేస్తే ఈ పనికి అతి తక్కువ వేతనం ఇవ్వటం జరుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం దీనికోసం ఎందుకు ఎక్కువ ఖర్చుపెట్టదు? కనీసం కొద్దిపాటి సహానుభూతిని కూడా ప్రదర్శించలేదా?

ఎవరైనా ఈ సామూహిక పాకీదొడ్ల లోపలికి వెళ్ళి చూస్తే గానీ అక్కడి దారుణస్థితి ఏమిటనేది అర్థంకాదు. ఎత్తుడుదొడ్ల కంటే అవి ఏ మాత్రం మెరుగ్గా వుండవు. ఉద్యమ కారులను శాంతింపచేయడం కోసం, చట్టరీత్యా ఇచ్చిన ఆదేశాలను కొంతమేరకు అమలు చేసినట్లు చూపించటడానికే ఈ దొడ్లను కట్టించారు. అంతే తప్ప ఈ పని చేయటంలో ఏ మాత్రం చిత్తశుద్ధి లేదనేది ఎవ్వరికైనా అర్థమైపోతుంది. ఉదాహరణకు మరుగుదొడ్లలో నీళ్ళ సౌకర్యం అనేదే లేదు. మరీ ముఖ్యంగా లోపలంతా ఘోరంగా పియ్యిపెంటలతో మురికికుప్పగా వుంది. ఈ దొడ్లను కూడా ఇంతకు ముందు పాకీ పనిచేసిన వారితోనే శుభ్రం చేయిస్తున్నారు. అంటే పాకీ పనివారి పరిస్థితులు ఏమాత్రం మారలేదని అర్థమౌతుంది. చట్టం ప్రకారం చూస్తే పాకీ పనివారి ఉనికి మాత్రం ఎక్కడా లేదు. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు పూర్తి విరుద్ధంగా వున్నాయి.

చాంపియన్ రీఫ్‌లోని పాకీదొడ్లలో శుభ్రం చేయటమనే హింసాత్మక అనుభవాలను చెబుతున్నప్పుడు యాభై సంవత్సరాల మౌలీప్రకాష్ గొంతు దు:ఖంతో పూడుకుపోయింది. పద్నాలుగు పదిహేనేళ్ళ వయసప్పటి నుంచీ తల్లిదండ్రులతో కలిసి పాకీపని చేయటం మొదలుపెట్టాడు మౌలీ ప్రకాష్. ఆ తర్వాత ఏళ్ళ తరబడి పియ్యిపెంటలతో వున్న దొడ్లను శుభ్రంచేస్తూ వచ్చాడు. ఈ దొడ్లను శుభ్రం చేయటమనేది ఎంతో భారమైన పనని అతను మాతో చెప్పాడు. ఆ పని రాత్రీ పగలూ కొనసాగుతూనే వుంటుంది. అంతం అనేది లేకుండా బక్కెట్లకొద్దీ పెయ్యిపెంటలను మోస్తూనే వుండాలి. వాటిని దూరంగా ఎక్కడో పారవేసిరావాలి. నరకం కూడా ఇంతకంటే ఘోరంగా వుండదని మాత్రం నేను నమ్ముతాను. నేను బతుకుతున్నందుకు సిగ్గుపడుతున్నాను అని మౌలీ అన్నాడు. ఈ మాటలు చెప్తున్నప్పుడు అతని గొంతు దు:ఖంతో పూడుకుపోయి మాటరావటమే కష్టమయింది. కన్నీళ్ళతో కళ్ళు నిండి పోయాయి. దీనిని అనువాదం చేసి చెప్తున్నపుడు ప్రియాంక గొంతు కూడా వణికింది. ఆమె తిరిగి మౌలీతో మాట్లాడటం మొదలుపెట్టింది. నిజానికి నాకు తెలుగు ఒక్కముక్క కూడా రాక పోయినప్పటికీ, మౌలీ చెప్పిన దానిని ప్రియాంక ఎంత గాఢమైన సహానుభూతితో గ్రహించిందో అర్థం చేసుకోగలిగాను.

తర్వాత మౌలీతో పాటు అక్కడున్న అందరికీ వాళ్ళ పునరావాసం కోసం మళ్ళీ ప్రయత్నంచేస్తామని బెజవాడ విల్సన్, అతని సహాధ్యాయులు చెప్పారు. అక్కడ్నుంచీ పోరాటంలో మరో అధ్యాయం మొదలయింది.

అనేక విషయాలు ఒక దానితో ఒకటి ఎలా అనుసంధానమై వున్నాయో, పాకీ పనిలో వున్న కులఐక్యత అనేక ప్రయోగాలకు ఎలా మూలమైందో గమనించటం నిజంగానే

అసక్తికరంగా అనిపించింది. ఇది కెజిఎఫ్‌లో ఎంతో స్పష్టంగా కనిపించింది. కెజిఎఫ్‌లో జరిగిన ఒక సమావేశంలో బక్క పలుచటి యువకుడు రత్నాన్ని నేను కలిశాను. అతని జీవితకథ చాలా ఆసక్తికరంగా వుంది. అతను తనను తాను పరిచయం చేసుకుంటూ, 'నేను కంప్యూటర్ సైన్స్‌లో లెక్చరర్‌ని. కెజిఎఫ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో గత ఆరేళ్ళుగా పాఠాలు చెప్తున్నాను. నేను పాకీ కుటుంబం నుంచి వచ్చాను. అదే మా జీవనాధారం. ఎస్‌కెఏ ప్రారంభించిన స్టడీ సెంటర్‌కి వెళ్ళిన దగ్గర్నుంచీ నా జీవితంలో మార్పురావడం మొదలయ్యింది. అక్కడ్నుంచీ నా ప్రయాణం కొనసాగి కంప్యూటర్ సైన్స్‌లో లెక్చరర్‌గా ఇక్కడి దాకా తీసుకువచ్చింది. ఈరోజు నా జాతి పిల్లల కోసం అలాంటి సెంటర్ ఒకటి ప్రారంభించాలనుకుంటున్నాను' అని చెప్పాడు.

రత్నం లేదా ప్రియాంక ఎవరైనా కావొచ్చు, అనేక మంది యువతీ యువకులు పాకీపని అనే కుళ్ళిపోయిన చరిత్రకి చరమగీతం పాడి ఒక నూతన అధ్యాయాన్ని రాస్తున్నారు. ఆ అమానవీయమైన పనినుంచి విముక్తమయిన వీరంతా తమ జాతి ఎదుర్కొన్న బాధ, వివక్ష, అణచివేతల గురించి గొంతెత్తి చెబుతూనే వున్నారు. ఇది ఎంతో ముఖ్యమని నాకు బలంగా అనిపించింది. ఇలాంటి అంశాలే ఉద్యమం మరింత ముందుకువెళ్ళటానికి, మరెంతో మందికి విశ్వాసం కలిగించటానికి ప్రేరణగా వుంటాయి.

మరి కుప్పం ప్రాంతంలో తోట్టిసందు అని ఒక కాలనీ వుంది. ఇది ప్రభుత్వ దస్త్రాల్లో స్వీపర్స్ కాలనీగా నమోదు అయివుంది. ఇక్కడ దాదాపు 118 ఇళ్ళు వున్నాయి. దాదాపు ప్రతి ఒక్కరూ ఇదే కోవలోకి వస్తారు. అయితే వీరందరూ పాకీపని అనే నరకం నుంచి విముక్తమయిపోయారు. మేము ఆ ప్రాంతానికి చేరేటప్పటికీ దాదాపు చీకటిపడి పోయింది. సందు మలుపులోనే ఒకామె చిన్న స్టవ్ మీద పకోడీలు వేయిస్తోంది. అవి మేక మాంసంతో చేసిన పకోడీలు. అక్కడ గుంపులుగా మూగిన జనాల్ని బట్టి వాటికి ఎంత గిరాకీ వుందో అంచనా వేయటానికి ప్రయత్నించాను. ఈ సందులో నుంచే పాకీ పనికి వ్యతిరేకంగా మొదట పోరాటం మొదలయింది. అందుకే నేను విల్సన్‌తో కలిసి అక్కడికి వెళ్ళిన వెంటనే జనమందరూ మా చుట్టూ మూగారు. ఆడవాళ్ళు ఎక్కువ సంఖ్యలో వచ్చారు. అందరూ పాకీ పని చేసిన కుటుంబాల నుంచి వచ్చిన వారే. ఏదో ఒక విధంగా పునరావాసం పొందారు. అయితే వాళ్ళ ఆర్థిక పరిస్థితులు మాత్రం ఏమంత మెరుగ్గా మారలేదు. పునరావాసంపేరిట తాత్కాలిక ఏర్పాట్లు, ఆర్థిక సహాయమే కాకుండా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని వాళ్ళందరూ కోరారు..

అక్కడే మేము డేవిడ్‌ని కలిశాం. పునరావాస చర్యలలో భాగంగా అతనికి కిరోసిన్ డీలర్‌షిప్ వచ్చింది. అతని వ్యాపారం బాగా జరుగుతోంది. తనకు డీలర్‌షిప్ వచ్చినపుడు దాన్ని అమ్మేయమని జనమంతా తనపై వత్తిడి తీసుకువచ్చారనీ, దానికి తాను తలొగ్గలేదనీ డేవిడ్ మాతో చెప్పాడు. మమ్మల్ని తీసుకుని వెళ్ళి తన దుకాణం చూపించాడు. సరైన

సమయం, అవకాశం వచ్చినపుడు కులపరమైన వివక్షకు వ్యతిరేకంగా ఆప్రాంతంలోని ఆడవాళ్ళందరితో కలిసి ఒక ప్రచారోద్యమాన్ని మొదలుపెట్టడానికి దేవిడ్ తయారుగా వున్నాడు. ఈ ప్రాంతంలో పాకీ పనిని నిర్మూలించిన తర్వాత కూడా తమ వీధిని తోట్టీవీధిగా ఇంకా పిలవటం అతన్ని ఎంతగానో బాధిస్తోంది. పాఠశాలల్లో ఈ వీధి పిల్లల్ని ఇంకా తోట్టీలుగానే గుర్తిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వివక్షపై పోరాటం, మరోవైపు కుల–మతాలను అడ్డంపెట్టుకొని సృష్టించబడిన ఈ వ్యవస్థను నిర్మూలించటం– ఈ రెండు అంశాల రీత్యా ఇది ఒక సుదీర్ఘపోరాటమని స్పష్టమవుతోంది.

కెజిఎఫ్‌లో నేను ఒక ఆసక్తి కలిగించే విషయాన్ని గమనించాను. దేశంలోని మిగతా ప్రాంతాలలో దళితులు నివాసముండే ప్రదేశాలలో అంబేద్కర్ విగ్రహాలు వుండటం, ఆయన గురించిన నినాదాలు వినిపించడం వంటివి చూశాను. కానీ కెజిఎఫ్‌లో సిమెంటు, మట్టిగోడల మీద మార్క్సిస్టు సిద్ధాంతానికి ఆద్యులైన కారల్‌మార్క్సు; ఎంగెల్స్ చిత్రాలు చూశాను. రష్యన్ విప్లవసారథి లెనిన్ కూడా ఈ చిత్రాలలో వున్నారు. ఎంతో చక్కగా పెయింట్ వేసిన ఈ చిత్రాలు తోట్టీ వీధి పక్కనే వున్న మరొక వీధి నుంచి ప్రారంభమయ్యాయి. అవి ఎంత ఆకర్షణీయంగా వున్నాయంటే ఎవరైనా సరే ఆగి వాటి వంక చూడాల్సిందే. వీటి గురించి నేను అడిగితే కెజిఎఫ్ ప్రాంతమంతా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) అనుబంధ సంస్థ సిఐటియు (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ప్రభావం వుంటుందని విల్సన్ చెప్పాడు. ఒకప్పుడు సిపియం అత్యంత శక్తివంతమైన పార్టీ కూడా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొరుగునే వుండటంతో పార్టీ ప్రభావశక్తులు కోలార్‌కి కూడా విస్తరించాయి. నిజానికి ఈ రకమైన సమరశీల కార్యాచరణ దక్షిణ భారతదేశంలో దళిత ఉద్యమాన్ని ఎంతో ప్రభావితం చేసింది. కెజిఎఫ్‌లో పాకీపని నిర్మూలనలో వీటి ప్రభావం కూడా వుందనేది వాస్తవం.

(ఈ వ్యాసం 2011లో కోలార్‌ని సందర్శించిన సందర్భంగా రాసింది.)

# తమిళనాడు

పాకీ గుంటల్లో హత్యలు! అసలు నేరస్థులు ఎవరు?

ఒకచేత్తో ప్లాస్టిక్‌సంచిని మోస్తూ, రెండోచేత్తో తన పదేళ్ళ కొడుకు చేతిని గట్టిగా పట్టుకుని వుందామె. ఆ అబ్బాయి తల పూర్తి గుండుగా వుంది. మేం మాట్లాడుతున్నంతసేపు ముఖంలో ఏ రకమైన హావభావాలు లేకుండా ఆ పిల్లవాడు అలా ఆకాశం వైపు చూస్తూనే వున్నాడు. పేరు శంకర్, అతని తల్లి పెంచలమ్మ. ఆమె కూడా తన ఉద్వేగాన్ని చాలా నిబాయించుకుంది. ఆమె గొంతు ఒక విధమైన గంభీరత్వంతో వుండి, నాకు ఎంతో భయమనిపించింది.

పెంచలమ్మ చాలా సూటిమనిషి. ఆమె భర్త మాలకొండయ్య. 2014 జూలై 16వ తేదీన స్టాన్లీ హాస్పిటల్ ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా చనిపోయాడు. అప్పుడు అతని వయస్సు 48 సంవత్సరాలు. “ఈ సమాజం మమ్మల్ని మనుషులుగానే భావించదు” అని తలబాదుకుంటూ, “ఈ పియ్యిపెంట శుభ్రం చేయమని మమ్మల్ని ఈ మురుక్కుంటల్లోకి తోసేస్తుంది. నా భర్త చనిపోయాడు. దానికి బాధ్యత మీ అందరిదీ. ఎవరు చంపారతన్ని? అతను ఏ జబ్బుతోనూ చనిపోలేదు. ఏ యాక్సిడెంటులోనూ చనిపోలేదు. హత్య చేశారతన్ని” అంటూ ఒక్క క్షణం ఊపిరితీసుకోడానికి ఆగిందామె. తన సంచిలో నుంచి నీళ్ళసీసా తీసుకుని కొంచెం నీళ్ళు తాగి మళ్ళీ మొదలుపెట్టిందామె. “ఇది కచ్చితంగా హత్యే. నేరస్తులు చాలా స్వేచ్ఛగా తిరుగుతున్నారు....మళ్ళీ ఇంకొకర్ని ఈ పాకీ గుంటల్లోకి తోసి చంపేస్తారు. ఈ చావులు ఆగేవి కావు. నేరస్తులు ఎప్పటికీ పట్టుబడేదీ లేదు.” ఆమె గొంతులో బాధగానీ దు:ఖంగానీ లేవు. నేను ఆమె ముఖకవళికల్ని చాలా దగ్గరగా పరిశీలిస్తూ వున్నాను. నిర్వికారంగా వుంది. ఆమె తమిళంలో మాట్లాడుతుంటే సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్‌కెఏ) కార్యకర్తలు నాకు అనువాదం చేసి చెప్తున్నారు. తన లోపల వున్న అంత దుఃఖాన్ని ఆమె సావధానంగా చెప్తుంటే నాకు లోలోపల ఎంతో కష్టంగా అనిపించింది! “చాలా కాలం క్రితమే వాళ్ళు తమ సెప్టిక్ ట్యాంకుని శుభ్రం చేయించుకోవడానికి రమ్మనమని నా భర్తని బలవంతం చేశారు. ఆ రోజు నా భర్త పని నుండి వస్తుంటే దారికాపు కాచి అతన్ని నిలవేశారు. అక్కడ్నుంచే అతన్ని వాళ్ళతో తీసుకెళ్ళిపోయారు. నేను నా పనిలో వుండటంతో అతను ఎక్కడున్నాడనేది నాకసలేం తెలియదు. నేను ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు, దారిలో జనం మూగి వుండటం గమనించాను. వాళ్ళు గట్టిగా అరుస్తున్నారు. అంత మంది జనాన్ని చూడంగానే ఏం జరిగిందో తెలుసుకోవాలని నేను ఆగాను.... ఓరి దేవుడో! అతను నా మొగుడు. ఇంకా ఊపిరి తీస్తున్నాడు గానీ, ఆ తర్వాత ఇంక కళ్ళుతెరవలేదు. పోలీసులు వచ్చి ఏం జరిగిందని అడుగుతున్నారు. ఇతను బాగా తాగేసి వచ్చి పని కావాలని అడిగాడని, ఆ ట్యాంకు

శుభ్రం చేసేపని తనకే ఇవ్వాలని ఒత్తిడిపెట్టాడని, అతనికి సాయం చేయాలని పని ఇచ్చామని....చివరికి ఇలా జరిగిందని ఆ ఇంటి యజమాని చెప్తున్నాడు. నా భర్త వాళ్ళ ఇంటి సెప్టిక్ ట్యాంకులో వుండే విషవాయువు వల్ల చనిపోతే సిగ్గులేకుండా ఎలా మాట్లాడారో చూడండి. వాళ్ళు ఇన్నాళ్ళూ ఏరిగిన పియ్యిపెంటల్లోకి అతన్ని తోసేసి, అతని ఆఖరి ఊపిరి ఆగకముందే అతనిమీదే ఎలా నెపం నెట్టేశారో చూడండి!"

"నేనేం చేయాలి? ఎవర్ని నేను పట్టుకోవాలి? ఇంట్లో 'మగమనిషి' అనేవాడు మిగలలేదని పెద్దవాళ్ళు అంటున్నారు. మేం ఎలా బతకాలి? ఇది కేవలం నష్టపరిహారానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. నా పిల్లల తండ్రిని బతికించి తీసుకురావడానికి ఒక కోటి రూపాయలైనా సరిపోతాయా? నా భర్త కొద్ది రోజుల క్రితమే చనిపోయాడు. అప్పటి నుంచి నేను ఇదే మొదటిసారి బయటకు రావటం. ఇక్కడికి వచ్చింది కూడా ఇకనుంచీ ఈ చావులు ఆగిపోవాలని చెప్పటం కోసమే."

పెంచలమ్మ కొద్దిసేపు మాట్లాడటం ఆపేసి ఎదురుగా వున్న గోడవైపు చూస్తూ వుండిపోయింది. అకస్మాత్తుగా వచ్చిన ఈ విపత్తు, మొత్తం కుటుంబభారమంతా ఒక్కసారిగా మీదపడటం–ఇదంతా ఆమె మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది. 2014 ఆగస్టులో చెన్నైలో జరిగిన ఒక సభలో నేను ఆమెను కలిశాను. ఆమె భర్త చనిపోయి అప్పటికి పదిహేను రోజులయింది. సెప్టిక్ ట్యాంకులు, మురుగునీటి కాల్వల్లో పనిచేసే సఫాయి కార్మికుల కోసం ఈ సమావేశాన్ని ఎస్‌కెఏ నిర్వహించింది. సెప్టిక్ ట్యాంకులను మనుషులతో నిర్బంధంగా శుభ్రం చేయించే ఈ విధానానికి వ్యతిరేకంగా ఆ పని చేసేవారిని సమీకరించడం ఈ సమావేశం ప్రాథమిక ఉద్దేశం. అలాగే 1993 నుంచీ సెప్టిక్‌ట్యాంకులను, భూగర్భ మురుగు నీటి కాల్వల్లో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు పదిలక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని వివరించి చెప్పటం. పెంచలమ్మ తిరిగి తన పనిలోకి వెళ్ళాల్సిందే. తన ఇంటికి దగ్గర్లో వున్న ఒక బడిని శుభ్రం చేయటమే ఆమెకు జీవనాధారం. తిరిగి వెళ్ళిపోతూ చెప్పాల్సింది ఏదో గుర్తొచ్చి ఆమె వెనుదిరిగి వచ్చింది. తన సంచిలోంచి కొన్ని పేపర్లు బయటకు తీసింది. అవి తన భర్త చావుకి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ, దినపత్రికల్లో వచ్చిన రిపోర్టులు. ఒకదాని తర్వాత ఒకటి జాగ్రత్తగా తీసి నాకు చూపించింది. పత్రికలో రిపోర్టుతో పాటు తన భర్త ఫొటో వేయనందుకు కొంత బాధపడినా, కనీసం వార్త అయినా వచ్చిందని ఊరటపడింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సంగతి, పదిలక్షల రూపాయల నష్టపరిహారం గురించి తెలుసా అని అడిగితే ఎస్‌కెఏ వాళ్ళవేపు చూపించి వాళ్ళు చెప్పారని అన్నది. చాలా లోగొంతుకతో 'నేను ఇక్కడకు నష్టపరిహారం గురించి రాలేదు. నా భర్తను చంపిన వాళ్ళను పట్టించాలని వచ్చాను' అని చెప్పింది. ఎడారి ఇసుకలాగా ఆమె కళ్ళు పొడిబారిపోయివున్నాయి. కొడుకు చేతిని గట్టిగా పట్టుకుని మెట్లు దిగి కిందికి వెళ్ళిపోయింది. భూగర్భ మురికి కాల్వల్లో

గానీ లేదా సెప్టిక్‌ట్యాంకుల్లో గానీ చనిపోయినవారి భార్యల్ని ఎవర్ని ఎప్పుడు కలిసినా నిస్తేజమైన చూపుల్తో, గుండెల్లోతుల్లో వున్న బాధను నిర్వికారమైన హావభావాల్తో వారు తమ గాథలు చెప్పుకునే విధానం నాకు చాలా బాధ కలిగించింది. సమాజం ఈ మనుషుల పట్ల చూపిస్తున్న క్రూరత్వానికి, కర్కశత్వానికి అలా నిస్తేజంగా మారిపోయారనిపిస్తోంది. మరోవైపు అమ్మలు, అక్కచెల్లెళ్ళు నిండా కన్నీళ్ళతో వుంటున్నారు.

చెన్నైలోని తాంబరం ఇరుకు సందుల్లోంచి నడిచివెళ్ళి ఒక చిన్న ఇంటికి చేరుకున్నాం. ఆ ఇంటి మొదటి అంతస్తులో ఒక చిన్నగదిలో తన ఇద్దరు కూతుళ్ళతో వుంటోంది నాగమ్మ. శుభ్రం చేసే పనితో తన ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. పెద్దమ్మాయి షైలా 11వ తరగతి చదువుతోంది. ఆమె డాక్టరు చదవాలనుకుంటోంది. అందుకు అవసరమైన స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నం చేస్తోంది. తను డాక్టరు అయినతర్వాత పేదప్రజలకు సేవ చేయాలని, ముఖ్యంగా తన సమూహం కోసం పని చేయాలని అనుకుంటోంది. ఇద్దరు పిల్లలకీ తమ తండ్రి మొహం గుర్తులేదు. చిన్నపాప ఆనంది 9వ తరగతి చదువుతోంది. ఆమె టీచర్ కావాలనుకుంటోంది. అదే ఎందుకు చదవాలనుకుంటున్నావు అని ప్రశ్నిస్తే, లోగొంతుతో 'మా నాన్న బతికుంటే వేరేదాని గురించి ఆలోచించేదాన్ని. ఇప్పుడైతే అందరూ అక్క డాక్టరు కావాలని కోరుకుంటున్నారు' అని సమాధానమిచ్చింది. ఈమెకైతే అస్సలు తండ్రి గురించి జ్ఞాపకాలేమీ లేవు. పెద్దపాపకి లీలగా తండ్రి ప్రేమ, అభిమానం గుర్తున్నాయి. నాగమ్మ భర్త కన్నయ్య 2007లో సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా చనిపోయాడు. అతనితో పాటు మరోఇద్దరు కూడా చనిపోయారు. ఇతను మామూలుగా అయితే మేస్త్రీ పని చేసేవాడు. ఒకరోజు పని నుండి ఇంటికి వచ్చేసరికి అతని బట్టలు పీతికంపుకొట్టటంతో నాగమ్మ చాలా కలవరపడింది. "నువ్వు ఆ పాకీపని చేసొస్తున్నావా?" అని అడిగింది. దానికి అతను "అవును" అని సమాధానమిచ్చాడు. "సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేయటానికి వెళ్ళావా?" అని నాగమ్మ మళ్ళీ అడిగింది. "అవును" అని తిరిగి సమాధానమిచ్చాడతను.

"నేను ఎంతో బాధపడ్డాను. ఈ పనంటే నాకు చాలా అసహ్యం. కోపంతో, బాధతో ఆ రోజు నేను వంట చేయలేదు. ఏమీ తినకుండానే అందరూ పడుకున్నారు. అయితే అతను రహస్యంగా ఈ పని చేస్తూనే వున్నాడు. నాకస్సలు ఇష్టం లేదు. అప్పటి నుంచి అతనితో బయటకు వెళ్ళటం మానేశాను. ఒకరోజు ఒక ఇల్లు కట్టే పనివుందని, మామయ్య పిలిస్తే వెళుతున్నానని నాతో చెప్పాడు. చీకటిపడినా గానీ ఇంటికి రాలేదు. నాకు కొంచెం ఆందోళనగా అనిపించింది. ఆ రోజుల్లో మా దగ్గర సెల్‌ఫోను లేదు. ఒకసారి మగమనిషి పనిమీద బయటకు వెళితే తిరిగి వెనక్కి వచ్చేవరకూ ఏమీ తెలిసే అవకాశం లేదు. మర్నాడు పొద్దున నా భర్త చనిపోయాడని మా పక్కింటి వాళ్ళు చెప్పారు. ముందు నేను నమ్మలేదు. ఆ షాక్‌తో స్పృహకోల్పోయాను. ఆ సంఘటనలో మరో ఇద్దరు కూడా చనిపోయారు. మర్నాడు వార్తా పత్రికల్లో ఈ ముగ్గురి ఫొటోలతో సహా వార్త వేశారు. నా

జీవితంలో ఊహించని ఈ మార్పుతో ఏంచేయాలో నాకేం తోచలేదు. అయోమయంగా అయిపోయాను. నేను పిచ్చిదాన్ని అయిపోయానని నా భర్త బంధువులు అనుకున్నారు. నన్ను మా అమ్మావాళ్ళింటికి పంపించేశారు. మామూలుగా ఎవరైనా చనిపోతే పదిహేను రోజుల తర్వాత దినాలు చేస్తారు. అప్పటికి నేను కొంచెం మనుషుల్లో పడటం మొదలయింది. ప్రతిఒక్కళ్ళూ కూడా అతని చావుకి నేనే కారణమన్నారు. అతన్ని నేను సరిగా పట్టించుకోకబట్టే అలా అయిందని ఆడిపోసుకోవడం మొదలుపెట్టారు. ఒకపక్క అతని చావు, మరోపక్క అర్థం పర్థంలేని ఈ మాటలతో నేను చాలా ఏడ్చాను. నా భర్త శవాన్ని కూడా నేను చూడలేదు. నా భర్త చనిపోయాడని నమ్మటం నాకు ఎంతో కష్టమయింది. ఏదో ఒకరోజు అతనొచ్చి నా తలుపు తడతాడని నాకనిపిస్తూవుంటుంది. నాకేం పిచ్చి పట్టలేదు. నాకంత అదృష్టం లేదు. నా కూతుర్లిద్దరినీ పెంచుకోవాలి. ఒక ప్రయివేటు కంపెనీలో శుభ్రం చేసేపని చేస్తున్నాను. చావు పుటకలు దేవుడి చేతిలో వుంటాయని అందరూ నాకు అర్థం చేయించటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఏ ఒక్కరూ కూడా ఈ కుళ్ళు మురికిగుంటల్లో కేవలం మా కులపోళ్ళే ఎందుకు చనిపోతున్నారో చెప్పటం లేదు. ఈ సివరేజిలో, సెప్టిక్ ట్యాంకుల్లో వేరే ఎవరూ చనిపోవటం లేదే. ఇది మా నుదిటి మీద రాసివుందని సమాజం మమ్మల్ని నమ్మించాలని చూస్తోందా? అలాంటి హంతక విధానాలను నేను ఒప్పుకునేది లేదు. ఈ సమాజం ఏరిగిన పియ్యిపెంటలను శుభ్రం చేస్తూ మా మనిషి చనిపోయాడు. నేను ఇంక జీవితాంతం వితంతువుగానే బతకాలి. పిల్లల్ని పెంచే క్రమంలో అష్టకష్టాలూ పడాలి......ఎందుకు? మేం చేసిన నేరమేంటి? ఈ కులంలో పుట్టడమేనా మేం చేసిన నేరం? సమాజంలోని ప్రతి సంప్రదాయం, ప్రభుత్వ చట్టాలు మా మీద ఈ కుళ్ళు, పియ్యిపెంటలను విసిరేశాయి. అందర్నీ కాల్చిబూడిద చేయాలనిపిస్తోంది నాకు" అని ఆగ్రహంతో చెప్పుకొచ్చింది.

నాగమ్మను ఆపటం కష్టమయిపోయింది. ఆమె అసహ్యంతో కాండ్రించి ఊసి చీరకొంగుతో పెదాలు, కళ్ళు తుడుచుకుని మళ్ళీ మొదలుపెట్టింది.

"సెప్టిక్ ట్యాంకులు, ఈ మురుగుకాల్వలు ప్రమాదకర విషపూరిత వాయువులతో నిండివుంటాయని మీకు తెలుసేవుంటుంది. ఈ విషయం ప్రభుత్వానికి కూడా తెలుసు. మరి, ఎవరూ కూడా దీనికి ప్రత్యామ్నాయం ఎందుకు వెతకరు? ఎందుకంటే మేం చచ్చినా గానీ అది మీకు అసలు విషయమే కాదు కాబట్టి. మా మనిషి ఈ పియ్యిపెంటను శుభ్రం చేయటానికి బాగా తాగేసి దాంట్లోకి దిగాలి. మిగతా సమాజమంతా ముక్కు మూసుకుని పక్కకు వెళ్ళిపోతుందే తప్పించి ఈ విషయం గురించి కనీసం ఆలోచించను కూడా ఆలోచించదు. ఎందుకని? ఈ పనిచేయటానికే ఈ కులం వుంది అని ప్రతిఒక్కరూ అనుకోవటమే దీనికి కారణం. దాంట్లోకి దిగినప్పుడు మీ మనిషి బాగా తాగేసివున్నాడు అని ప్రతివాళ్ళూ అంటారు. అట్లాంటి సెప్టిక్ ట్యాంకుల్లోకీ, మురుగు కాల్వల్లోకీ ఒంటి

మీద స్పృహతో వీళ్ళెవరైనా దిగగలుగుతారా అని నేను వీళ్ళ కాలర్ పుచ్చుకుని అడగాలనుకుంటున్నాను. మనిషనేవాడెవడూ ఆ పని చేయనప్పుడు మేమెందుకు చేయాలి? ఎవరైనా ఒక్కసారి ఆ పనిచేశారంటే, ఆ తర్వాత ఆ మనిషి తనను తాను మనిషని అనుకోలేడు. ఒక ఆత్మన్యూనతాభావంలోకి, మానసిక క్షోభలోకి, కోపంలోకి కూరుకుపోతాడు. ఆ పరిస్థితిలో తన కుటుంబాన్నే బలిపశువును చేస్తాడు. మా జీవితాలు నిరంతరం కొట్లాటలతో చెల్లాచెదురౌతాయి. అతను అనుకోని పరిస్థితుల్లో చనిపోతే కనీసం అతని శవాన్ని కూడా ఆ సెప్టిక్‌ట్యాంకు నుంచి బయటకు తెచ్చేవాళ్ళు వుండరు. వాళ్ళు మమ్మల్ని, మా కులాన్ని అసహ్యించుకుంటారు. బయటకు ఎవరు చెప్పినా చెప్పకపోయినా గానీ నేను మాత్రం ఈ విషయాన్ని చెప్పే తీరతాను. అందుకే మమ్మల్ని ఎప్పటికీ ఈ పియ్యిపెంటలతో కంపుగొడుతూ వుండాలని అనుకుంటారు. ఇది కులం పేరుతో నడిచే వికృతమైన క్రీడ. కొంత మంది మునిగితేనే మరికొంత మంది పైన వుండగలుగుతారు. నా భర్త చనిపోయాడా లేదా వేరేవాళ్ళు చనిపోయారా అనేది వాళ్ళకు అసలు విషయమే కాదు...దీన్ని చావు అని ఎందుకనాలి–ఇది హత్య. ఇది హత్య అని స్పష్టంగా రాయండి!'

ఇంకా నాగమ్మ చెప్తూవుండగానే అప్పటివరకూ అక్కడే నిశ్శబ్దంగా కూర్చుని వున్న ఒక యువకుడు మధ్యలో కల్పించుకుని–"ఈ మాట నిజం, ఎవ్వరూ ఈ పని చేయరు" అన్నాడు. అతని పేరు ప్రభాకర్. అతని తండ్రి కూడా కన్నయ్యతో పాటు సెప్టిక్ ట్యాంకులో మునిగి చనిపోయాడు. ఆ సంఘటనకు ఇతను ప్రత్యక్షసాక్షి. అంతకుముందెప్పుడూ కూడా దీని గురించి ఎక్కడా మాట్లాడలేదతను. సంవత్సరాల తరబడి గడ్డకట్టుకుపోయిన దు:ఖం నెమ్మదిగా బయటకు రావటం మొదలయింది. అప్పుడు అతనికి 22 సంవత్సరాల వయస్సు. తండ్రికి సాయంగా అక్కడికి వెళ్ళాడు.

"వాళ్ళు ముగ్గురూ ఆ సెప్టిక్ ట్యాంకుని తెరిచారు. నేను కూడా వాళ్ళకి సహాయం చేశాను. ఆ పని పూర్తిచేయడానికి చాలా సేపు పడుతుందని అంచనా వేశారు. ముందు ఏదన్నా తినాలని వెళ్ళి ఆ పని కానిచ్చాం. తిన్న తర్వాత నిద్ర రావటంతో నేను పడుకుండిపోయాను. గట్టిగా అరుపులు వినిపించటంతో నేను ఉలిక్కిపడి నిద్రలేచాను. వాళ్ళు ఒకరి తర్వాత ఒకరు లోపలికి వెళ్ళటం కనిపించింది. సహాయం కోసం గట్టిగా అరుస్తున్నారు. కొన్ని క్షణాల్లోనే అంతా అయిపోయింది. నేను చాలా గాభరాపడిపోయాను. అసలేం జరిగిందో ఏమీ అర్థం కాలేదు. నేను ఏడుపు లంకించుకున్నాను. నా కళ్ళముందు ఎవరైనా చనిపోవటాన్ని నేనెప్పుడూ చూడలేదు. ఆ సంఘటనతో నేను కదిలిపోయాను. అది నా జీవితాన్నే పూర్తిగా మార్చేసింది. మా నాయన కంటోన్మెంట్ బోర్డులో పని చేసేవాడు. ఆయన చనిపోయిన తర్వాత ఆ ఉద్యోగం నాకిచ్చారు. నేను కూడా శుభ్రం చేసే పని చేస్తాను కానీ మురుగుకాల్వల్లోకి, సెప్టిక్ ట్యాంకుల్లోకి దిగను. ఈ పనంటే నాకు చాలా అసహ్యం. ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఈ పని చేయకూడదని నేననుకుంటున్నాను" అని ప్రభాకర్ చెప్పాడు.

ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్‌కెఏ నాయకుడు బెజవాడ విల్సన్ వైపు చూపిస్తూ, ఈయన గనుక సెప్టిక్ ట్యాంకులు, మురుగుకాల్వలను మనుషులతో శుభ్రం చేయించే పనికి వ్యతిరేకంగా ప్రచారోద్యమాన్ని మొదలుపెడితే తాను కూడా అందులో భాగమవుతానని చెప్పాడు. అవకాశం వస్తే కులవివక్షతో కూడిన దుర్మార్గమైన, అమానవీయమైన ఈ పనివిధానానికి వ్యతిరేకంగా పనిచేయడానికి ఇక్కడి సఫాయి కార్మికులు గట్టి పట్టుదలతో వున్నారు. ఈ క్రమంలో ఈ బంధనాల నుంచి బయటపడటానికి ఎంతదూరమైనా వెళ్ళడానికి  సిద్ధంగా వున్నారు.

చెన్నైలో మేము 35 ఏళ్ళ వెంకట్‌రాజ్‌ని కూడా కలిశాం. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఇతను తన పద్నాలుగో సంవత్సరం నుంచీ సెప్టిక్ ట్యాంకులను శుభ్ర పరిచే పనిచేస్తున్నాడు. అతను తనగురించి, తన బలహీనతల గురించి ముక్కుసూటిగా మాట్లాడటం చూస్తే నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. చిన్నప్పటి నుంచి అతనికి చదువుపై శ్రద్ధ లేదు. బడి ఎగ్గొట్టి సినిమాలు చూసేవాడు. ఎలాగోలా 6వ తరగతి వరకూ పూర్తిచేశాడు. తండ్రి జూదరి. తల్లి నిస్సహాయురాలు. కంట్రాక్ట్ పద్ధతిలో పాకీపని చేసేది. దానితో ఇతన్ని అదుపులో పెట్టేవాళ్ళు ఎవరూ లేకపోయారు. చిన్నవయసు నుంచే డబ్బు అవసరమైనప్పుడు తప్పనిసరై సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయటానికి వెళ్ళేవాడు. అయినాగానీ వయస్సులోకి వచ్చేకొద్దీ ఫ్యాషన్ల పట్ల తన మక్కువను పోగొట్టుకోలేదు. ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆమె అతని కులం అమ్మాయి కాదు. దానితో ముందు కొంత వ్యతిరేకత వచ్చింది గానీ ఆ తర్వాత అంతా సద్దుమణిగింది. అతనికి ఇద్దరు అందమైన పిల్లలున్నారు. అయితే తాగుడు వ్యసనం అతని జీవితాన్ని నాశనం చేసింది. తన కుటుంబానికి సరైన న్యాయం చేయలేకపోయానని అతను ఇప్పుడు చాలా బాధపడుతున్నాడు. కానీ, మద్యం తాగకుండా ఒంటి మీద పూర్తి స్పృహ వుండి సెప్టిక్ ట్యాంకును గానీ మురుగుకాల్వలను కానీ శుభ్రం చేయలేమని అతను చెప్పాడు. దీనివలన సంపాదించిన దాంట్లో సగానికి పైగా తాగుడికే ఖర్చయిపోతుంది. అది ఇళ్ళల్లో గొడవలకు కారణమవుతుంది.

"నేను చాలా చెడ్డవాడిని" అని చెప్తూ ఏడవటం మొదలుపెట్టాడు వెంకట్‌రాజ్. ఈ పని ఎందుకు వదిలేయటం లేదు అని అడిగితే "ఇది తప్పించి నేనేం చేయగలుగుతానో నాకు తెలియదు. ఈ పనిలోనే నేను కళ్ళు తెరిచాను. నాక్కూడా ఈ పని చేయటం ఇష్టం లేదు; ఈ నరకం నుంచి బయటకు రావాలని బలంగా వుంది. నాకు డ్రైవింగ్ తెలుసు. నేను డ్రైవర్ ఉద్యోగం చేయగలితే, ఈ కుళ్ళు నుంచి నా జీవితాన్ని నా చేతుల్లోకి తెచ్చుకో గలుగుతాను" అని మళ్ళీ ఏడుపులోకి జారుకున్నాడు.

రవణయ్యది కూడా ఇదే కథ. ఇంతకు ముందు రిక్షా నడిపేవాడు. ఆ డబ్బు సరిపోకపోవటంతో ఈ మురుగుకాల్వల పనిలోకి నెట్టబడ్డాడు. నెమ్మదిగా సెప్టిక్

ట్యాంకులను కూడా శుభ్రం చేయటం మొదలుపెట్టాడు. అతనికి ఇతర పనుల్లో కన్నా ఈ పనిలో ఒకేసారి ఎక్కువ డబ్బు చేతికి రావటం జరిగేది. అలాగే అతనికి బాగా అప్పులు కూడా వున్నాయి. ఇంక వేరేపని దొరకకపోవటంతో అతను ఈ పనినే చేస్తూవున్నాడు. గౌరవప్రదమైన ఇంకేదైనా పనికి అవకాశం లభిస్తే అదే చేయటానికి అతను సిద్ధంగా వున్నాడు. "ఈ ప్రపంచంలో ఈ పని చేయటానికి ఎవరికి ఇష్టం వుంటుంది? ఎవరికీ వుండదు. ఒకసారి సెప్టిక్ ట్యాంకు లోపలికి దిగిన తర్వాత ఇంక మమ్మల్ని మేము మనుషులమనే అనుకోము. మా మీద మాకే చాలా అసహ్యం వేస్తుంది. ఈ ట్యాంకుల్లో మునిగి ఎంతోమంది చనిపోవటం నేను చూశాను. ఆ తర్వాత వాళ్ళ కుటుంబం పరిస్థితి ఏమిటి? నిరంతరం ఏడుపుతో వాళ్ళ జీవితం దుర్భరమైపోతుంది. వయసు రాకుండానే వారి భార్యలు ముసలివాళ్ళయిపోతారు. చుట్టూవున్న వాళ్ళు వీళ్ళని రాబందుల్లాగా పీక్కుని తింటారు. ఇంతకంటే ఏం చెప్పాలి నేను....."

"ఈ విధానం పూర్తిగా ఆగిపోవాలి. తరాలనుంచీ మా కులం ఈ అన్యాయాన్ని భరిస్తూనే వుంది. ఇంకా ఎంతకాలం ఇలా?"

సెప్టిక్ ట్యాంకుల్లో, మురుగుకాల్వల్లో తమ దగ్గరివాళ్ళను పోగొట్టుకున్న ఆడవాళ్ళందరిలోనూ ఇదే భావం స్పష్టంగా కనిపిస్తోంది. మన కాళ్ళకింద మన నుంచి వచ్చే ఈ దుర్గంధంలో పడి లెక్కలేనంత మంది తమ ప్రాణాలను కోల్పోయారు. అలా పనిచేస్తున్న ఎంతో మందిని మేం కలుసుకుని మమ్మల్ని మేం పరిచయం చేసుకున్నాం. అరవై సంవత్సరాల స్వతంత్రం తర్వాత కూడా భారతదేశాన్ని శుభ్రపరిచే భారం కేవలం ఒక కులం భుజస్కంధాలమీదే వున్నాగానీ, మన ఆలోచనాధోరణిలో ఏ మాత్రం మార్పు రాలేదు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వీరిని పలుపేర్లతో పిలుస్తూ వుండివుండవచ్చు గానీ వీరందరూ ఒకే సమూహానికి చెందిన వారు. తమిళనాడులో ఈ పాకీపని చేసేది ప్రధానంగా మాదిగలు, చక్కిలియార్‌లు, అరుంధతియార్‌లు, ఎస్‌టి కట్టు నాయకర్‌లు.... ఇంకా కొంతమంది.

చెన్నైలో జరిగిన సమావేశానికి తన చిన్నకొడుకుతో వచ్చిన షంగూగన్‌ని కూడా మేము కలిశాం. తర్వాత ఏమి చేయాలనేదానిపై వాళ్ళకి కనీస అవగాహన లేదు. ఆమె భర్త ఆదల్ ఆటో నడిపించేవాడు. వాళ్ళు మాదిగలవటంతో జనం వీళ్ళ ఇంటికి వచ్చి సెప్టిక్‌ట్యాంకులను శుభ్రంచేయించటానికి తీసుకెళ్ళేవారు. "ఈ ట్యాంకులను శుభ్రం చేయటానికి కాంట్రాక్టులు తీసుకుని మాలాంటి నిస్సహాయులతో పని చేయించుకుని కొందరు డబ్బులు బాగా సంపాదించేవాళ్ళు. అదే మాదిరిగా వాళ్ళు 2014 మే 24న మా ఇంటికి వచ్చి వారివెంట నా భర్తను తీసుకెళ్ళారు. వాళ్ళే నా భర్తను సెప్టిక్ ట్యాంకులోకి దించటంతో అతను చనిపోయాడు. నా జీవితం, నా పిల్లల జీవితం నాశనమయిపోయింది. నా పిల్లలు చదువుకుంటున్నారు. అతను చనిపోయి రెండు నెలలయింది. ఇప్పటికీ నా జీవితం ఎలా నడపాలో నాకు మార్గం దొరకటం లేదు. నేనెట్లా బతకాలి?"

రెండు సార్లు జిల్లా మేజిస్ట్రేటుని కలిశామని ఆమె కొడుకు శంకర్ చెప్పాడు. "ఆయన సహాయం చేస్తానని ఉత్తుత్తి వాగ్ధానమయితే చేశాడు కానీ ఏమీ చేయలేదు. సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ చనిపోతే ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని సుప్రీంకోర్టు తీర్పు వుందన్న విషయం ఇప్పటివరకూ మాకు ఏ ప్రభుత్వ అధికారీ చెప్పలేదు." ఇంతలో షంగూగన్ మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టింది. "చూడండి! వాళ్ళు ముందు మా కులంవాళ్ళు ఇదే పనిచేయాలని చెప్పి ఆ సెప్టిక్ ట్యాంకుల్లోకి తోస్తారు. దాంట్లో పడి మా మగవాళ్ళు చనిపోతే, దిగితే చనిపోతాడని తెలియదా అని మళ్ళీ మమ్మల్నే ప్రశ్నిస్తారు. మా ఆయన తన ఇష్టప్రకారమే వెళ్ళాడు. కానీ తన చావుకి తానే బాధ్యులని ఎవరు మాత్రం అనుకుంటారు. ఈ చావుతో సమాజానికేమీ బాధ్యత లేనట్టు! ఈ కంపుగొట్టే జాతి (నేషన్) తానేరిగిన పియ్యిపెంటను శుభ్రం చేయమని ఒక మనిషిని నిర్బంధిస్తుంది, అతన్ని చంపుతుంది. అయినా గానీ తనను తాను చాలా గొప్పగా చెప్పుకుంటుంది. ఇలాంటి జాతిమీద నేను కాండ్రించి థూ.....నీ....అని ఊస్తాను. అంతకంటే నేనేం చేయగలను? ఇది ఎక్కడో ఒకచోట ఆగిపోవాల్సిందే" షంగూగన్ మాటల్లో ఆగ్రహం వెల్లువెత్తింది.

ఈ అసంతృప్తి, అసహాయత అన్నిచోట్లా అధికంగానే వుంది. రాష్ట్ర రాజధాని చెన్నైకి దాదాపు 500 కిలోమీటర్ల దూరంలో వున్న కోయంబత్తూరు చాలా ప్రశాంతంగా వున్నట్లు కనిపిస్తుంది. అక్కడ ఎంతో మంది ఈ పని చేసేవాళ్ళని మున్సిపాలిటీ యూనిఫారాల్లో చూశాం. అలానే ఈ సెప్టిక్ ట్యాంకుల్లో పడి తమ కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న ఎంతోమంది ఆడవాళ్ళని కూడా చూశాం.

నలభైయ్యేళ్ళ సెల్వరాణి ఎంతో నెమ్మదిగా వుండి మెత్తగా మాట్లాడింది. ఆమె కంటే ఆమె కొడుకు మురళీధర్ ఒక అడుగు ఎత్తుగా వున్నాడు. తన పెళ్ళయిన రెండు సంవత్సరాలకు 1998 జనవరి 5న ఆమె తన భర్త ఎ. శివాను కోల్పోయింది. శివా చనిపోయిన తర్వాత తనకి ఎదురైన కష్టాల గురించి మాట్లాడటం ఆమెకు ఇష్టం లేదు. ఆ దుర్ఘటన జరిగిన తర్వాత ఇదే ఆమె మొట్టమొదటిసారి బయటకు వచ్చి ఇంకెవరూ ఇలాంటి చావులకు గురికాకూడదని చెప్పటం. భర్త చనిపోయిన తర్వాత అతను ఎలా చనిపోయాడని గానీ, దానికి కారణమెవరని గానీ ఆమె అతని స్నేహితులను సైతం విచారించలేదు. ఆ సంఘటన గుర్తుకువచ్చినప్పుడల్లా ఆమెను తీవ్రమైన బాధ కలచివేస్తుంది. "నేను ఇక్కడకు డబ్బు (నష్టపరిహారం) గురించి రాలేదు" అని సెల్వరాణి చెప్పింది.

తల్లి మాట్లాడుతుంటే మురళీధర్ మధ్యలోనే ఆపి, "దాన్ని గుర్తు తెచ్చుకోకమ్మా. నువ్వు బాధపడటం మళ్ళీ మళ్ళీ చూడలేను" అని అన్నాడు.

"ఇది మామూలు విషయం. మేము అరుంధతియార్ కులంలో పుట్టామని, అందుకే మురుగుకాల్వల లోపలికి మా నాయన వెళ్ళేవాడని నేను చిన్నప్పటి నుంచి వింటున్నాను.

ఇప్పటికీ జనం ఇలా ఎందుకు ఆలోచిస్తారా అని నాకు ఆశ్చర్యం వేస్తుంటుంది. మా నాయన సెప్టిక్‌ట్యాంకులోకి దిగిన వెంటనే విషపూరితవాయువు పీల్చాడని, వెంటనే బయటకు రావాలని ప్రయత్నించాడని, అయితే అప్పటికే రెండో వ్యక్తి కూడా లోపలికి దిగి సరిగ్గా మా నాన్న గుండెలమీద కాలువేయడంతో బయటకు రాలేకపోయాడని మా నాయన స్నేహితులు చెప్పారు నాకు. ఆ సెప్టిక్ ట్యాంకు మా నాన్న జీవితాన్నే కాదు–నా జీవితాన్ని కూడా మింగేసింది. వార్తా పత్రికలేవీ ఈ సంఘటన గురించి రాయలేదు. ఇది కూడా మా అమ్మను ఎంతో బాధపెట్టింది. విషపూరితమైన వాయువుల వల్ల ఎ.శివా చనిపోయినట్లు ఎఫ్ఐఆర్ అయితే నమోదు అయింది" అని మురళీధర్ చెప్తూవున్నాడు.

కొడుకు మాటలను సెల్వరాణి కళ్ళు మూసుకునే వింటూవుంది. మధ్యలో ఆపి, "నాకొక్కటే కోరిక. నా బిడ్డ ఈ కుళ్ళు మురికి పెంటపనిలోకి వెళ్ళకూడదని. కేవలం నా కొడుకే ఎందుకు, అసలు మరెవరి బిడ్డ కూడా ఈ నరకంలోకి వెళ్ళకూడదు" అని స్థిరమైన స్వరంతో చెప్పింది.

మురళీధర్ మళ్ళీ కొనసాగిస్తూ, "10వ తరగతి పూర్తయిన వెంటనే నాకు ఐటిఐలో సీటు వచ్చింది. నేను ఒక గౌరవప్రదమైన ఉద్యోగం చేయాలనుకున్నాను" అని చెప్పాడు. సెప్టిక్‌ట్యాంకులు, మురుగుకాల్వల్లోకి మనుషులను తోసి ముంచేసే దుర్మార్గమైన విధానానికి వ్యతిరేకంగా సభ్యసమాజం ముందు, ప్రభుత్వాధికారుల ముందు తమ గళం విప్పాలన్న బలమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే తల్లీకొడుకులిద్దరూ అక్కడి నుంచి బయలుదేరి వెళ్ళారు. 'నేను ఇప్పుడు సెలవు తీసుకుని వచ్చాను. ఇకనుంచి ప్రతిసారీ ఇలానే వస్తాను, ఇంక వెనుదిరిగే ముచ్చటే లేదు' అని సెల్వరాణి వెళ్తూ చెప్పింది.

ఈ దాగుడుమూతల ప్రపంచంలో సఫాయి కార్మికుల కుటుంబాల్లోని వ్యక్తులు కేవలం ఈ విషపూరిత వాయువుల్లో మునిగి చనిపోతున్నారు. సెప్టిక్ ట్యాంకుల్లో, మురుగు కాల్వల్లో ఏదైనా అడ్డుపడినప్పుడు అక్కడ వెలువడే వాయువు మరింత విషపూరితంగా మారి అక్కడే కమ్ముకుని వుంటుంది. ఇది మిథేన్ వాయువు, అత్యంత ప్రమాదకరమైనది. ఈ వాయువుని ఎవరైనా పీలిస్తే ప్రాణాలతో బయటపడటం అసాధ్యం. దాన్నుంచి తప్పించుకోవటం కోసం అశాస్త్రీయమైన పద్ధతుల్నే పాటించడం జరుగుతుంది. సెప్టిక్ ట్యాంకులు, భూగర్భ మురుగుకాల్వల మూత తీసివుంచటం లేదా అగ్గిపుల్ల వెలిగించి ఆ వాయువును మండేలా చేయటం వంటివి చేస్తారు. కానీ ఈ పద్ధతుల వల్ల లోపల కమ్ముకుని వున్న వాయువు పూర్తిగా బయటకు వెళ్ళదు. ఈ వాయువుకి అడ్డంకిగా వున్నదాన్ని ఈ పనివారు తొలగించగానే అదంతా ఒకేసారి తీవ్రమైన ఒత్తిడితో బయటకు విడుదల అవుతుంది. ఇది ప్రమాదకరం. ఈ ప్రమాదం నుంచి మనుషులను కాపాడాలంటే ఒకటే మార్గం వుంది. అది సెప్టిక్ ట్యాంకులు, భూగర్భ మురుగుకాల్వల్లోకి మనుషులు ఎవరినీ దిగకుండా చేయడమే! మనుషుల ప్రమేయం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్ని

ఉపయోగించి ఈ పని చేయించాలి. ఈ విధానాలనే మిగతా ప్రపంచమంతా పాటిస్తోంది. కానీ భారతదేశంలో ఈ వైపుగా ఏ రకమైన చర్యలూ ఇంతవరకూ చేపట్టలేదు. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమం కూడా ఈ అంశాన్ని విస్మరించింది.

ఎస్‌కెఏ నాయకుడు బెజవాడ విల్సన్ చేసే వాదన సరైనదే. భారతదేశంలో పారిశుద్ధ్యపని మధ్యయుగాల ఆటవిక కుల క్రూరత్వానికి ప్రతిరూపమే అని అతను బలంగా వాదిస్తాడు.

"ఈ సమాజం ఒక సమూహాన్ని తరాల తరబడి ఈ నరకంలోనే వుంచుతోంది. ఎందుకంటే ఈ మనుషులు పుట్టిందే ఈ పని చేయడం కోసమని ఈ సమాజం ప్రగాఢంగా విశ్వసిస్తోంది. కులవ్యవస్థ అనే చట్రంలో అణచివేయబడటం వల్ల మాత్రమే ఈ సమూహం ఎప్పటికీ కూడా ఈ పియ్యిపెంటలోనే బతుకుతూ అగౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతుంది. అంతరిక్షంలోకి శాటిలైట్లను పంపించి నగరాలను మరింత ఆధునీకరించిన ఈ దేశం, తన దేశ పారిశుద్ధ్య వ్యవస్థను ఆధునీకరించుకోడానికి ఒక్క పైసాకూడా ఖర్చుపెట్టనిది ఈ కారణం చేతనే. భూగర్భ మురుగుకాల్వలను ఆధునీకరించటం, సెప్టిక్ ట్యాంకుల వ్యవస్థను ఆపేయటం అనే పనులు అసలు వీరి ఎజెండాలోనే లేవు. భారతీయ రైల్వేవ్యవస్థే రైలు కట్టల మీదపడే పియ్యిపెంటను శుభ్రం చేయటానికి ఈ సమూహం నుంచే మనుషులను పనిలోకి పెట్టుకుంటుంటే ఇంకేం చెప్తాం? ఇది చట్టవిరుద్ధమయినప్పటికీ, ప్రభుత్వరంగంలో దీని రద్దు గురించి ఆలోచించగలిగేవారు ఒక్కరూ  లేరు. ప్రభుత్వాన్ని బాధ్యత పడేలా చేయకుండా మనం దీన్ని ఆపలేం. సెప్టిక్ ట్యాంకుల్లో, మురుగుకాల్వల్లో పడి చనిపోతున్న ప్రతిఒక్కరి చావుని మనం పట్టించుకుని తీరాలి. ఈ చావులకు బాధ్యత పరిపాలనా వ్యవస్థ తీసుకోవాలి. లేకపోతే ఏ విషయంలోనూ మార్పు జరగదు. ఇదొక్కటే మార్గం. కొన్ని సమయాల్లో ఈ విషపూరిత వాయువులు మన ప్రాణాలను హరిస్తుంటే, ఈ సమూహాన్ని ఈ దిశగా నడవమని చెప్పటం పెద్ద సవాలే."

'ముగ్గురి ప్రాణాలను మింగిన విషపూరిత వాయువులు'- దినపత్రికల్లో వచ్చిన ఈ వార్త ముగ్గురు ఆడవాళ్ళను ఒకదగ్గరికి చేర్చింది. వీళ్ళు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు కాదు. కనీసం బంధుత్వం కూడా లేదు. కానీ వాళ్ళు తామనుభవిస్తున్న బాధ కారణంగా ఐక్యమయ్యారు. ఒకే రోజు ఒకే సమయాన అదే సంఘటనలో ఈ ముగ్గురూ తమ ఆత్మీయ బంధువులను శాశ్వతంగా కోల్పోయారు. 2011 నవంబరు 22వ తేదీన కోయంబత్తూరు టెన్నిస్‌క్లబ్ దగ్గరలోని సెప్టిక్‌ట్యాంకు శుభ్రం చేస్తుండగా వీళ్ళు చనిపోయారు.

ఆ ముగ్గురిలో బాగా మాట్లాడుతోంది 50 ఏళ్ళ జయ. మాతో మాట్లాడుతున్నప్పుడు కన్నీళ్ళను ఆపుకోవటం ఆమెకు సాధ్యమే కాలేదు. సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా

ఆమె 22 ఏళ్ళ కొడుకు అశోక్‌కుమార్ చనిపోయాడు. అప్పటివరకూ అతను ఆ పని చేస్తున్నట్లుగా ఈమెకు తెలియను కూడా తెలియదు. మాట్లాడుతున్నంతసేపూ పేపర్లో వచ్చిన కొడుకు ఫొటోను వేలితో చూపిస్తూనే వుంది. క్రితిక కూడా తన అన్న కార్తీక్ ఫోటో చూస్తూ చాలా ఏడ్చింది. ఇతనిదీ జయ కొడుకుదీ ఒకటే కథ. కార్తీక్ వయస్సు 23 ఏళ్ళు. కుటుంబానికి ఇతను ఈ పెంటపని చేస్తున్నట్లు కూడా తెలియదు.

మూడో బాధితురాలు ఆనంద్ భార్య కవిత. ఏం చెప్పాలో, ఏం చెప్పకూడదో అన్నట్లు సంశయంగా చూస్తూ కూర్చుంది. ఆమె కళ్ళలో వున్న వేదన భరించరానిదిగా వుంది. వాళ్ళు ఏదో చెప్పాలనుకుంటున్నారు గానీ ఏదో సంశయం పీడిస్తోందని నాకనిపించింది. బహుశా భాషాపరమైన ఇబ్బంది కూడా కావొచ్చు. అదేకాకుండా తెలియని కొత్తవారి ముందు తమ బాధను చెప్పుకోవటం అంత సులభం కాదనేది ఆమె ముఖ కవళికల్లోనే నాకు తెలుస్తోంది. ఆమెకు పెళ్ళయి ఏడు సంవత్సరాలు. భర్త చనిపోయినప్పుడు కొడుకుకి ఐదు సంవత్సరాలు. కూతురు ఇంకా కడుపులోనే వుంది. కొద్దిసేపైన తర్వాత గొంతు పెగుల్చుకుని మాతో మాట్లాడటం మొదలుపెట్టింది.

"ఆయన మామూలుగా కరెంటు పని చేసేవాడు. డబ్బు అవసరమైనప్పుడు సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయటానికి వెళ్ళేవాడు."

"నువ్వెందుకు అతన్ని ఆపలేదు?"

"నాకు తెలిసినప్పుడల్లా నేను ఆపటానికి ప్రయత్నించాను. కానీ చాలా సార్లు అతను ఈ పని కోసం వెళ్ళినట్లుగా అస్సలు తెలిసేది కాదు. అయినా మా మాట ఎవరు వింటారు?" భర్త చనిపోయిన తర్వాత కవిత పిల్లల్ని తీసుకుని తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇప్పుడు ప్లాస్టిక్ బ్యాగులు తయారుచేసే కంపెనీలో పనిచేస్తోంది. నెలకు ఆరువేల రూపాయలు ఇస్తారు కానీ ఒక్కరోజు కూడా సెలవు వుండదు. ఏదన్నా తప్పనిసరి పరిస్థితిలో సెలవు పెట్టాల్సి వస్తే ఆ రోజు జీతం కత్తిరిస్తారు. టెన్నిస్‌క్లబ్ ప్రతి కుటుంబానికి లక్షరూపాయల చొప్పున నష్టపరిహారం ఇచ్చింది. ప్రభుత్వం కూడా సాయం చేస్తామని వాగ్దానం చేసింది కానీ ఇప్పటి వరకూ ఏమీ ఇవ్వలేదు. ఎఫ్ఐఆర్ లో పాకీపని, డ్రైలెట్రిన్ల నిర్మాణం, 1993 చట్టం కింద ఈ మూడు మరణాలను నమోదు చేశారు.

ఈ మరణాలు ఎంత బాధాకరమైనప్పటికీ, ఆయా ఘటనలపై దినపత్రికలలో వార్తలు రావటం ఈ కుటుంబాలకు ఎంతో ప్రధానాంశంగా మారింది. అపురూపమైన నిధిలాగా సంవత్సరాల తరబడి ఆ పేపర్లను దాచుకున్న సన్నివేశం మీడియా మిత్రులకు కళ్ళు తెరిపించేదిగా వుంది. మీడియా దృష్టిలో పెద్దగా 'ప్రాముఖ్యం' లేని కొన్ని విషయాలు అనేక మంది జీవితాల్లో అత్యంత ప్రధానమైనవి. తమవారి చావు గురించి చెప్పటానికి ఏ ఆధారం లేకపోవటమనేది ఎంత బాధగా వుంటుందో అది వారి కళ్ళల్లో ప్రతిఫలించటం చూశాను నేను. పత్రికల్లో వార్త వచ్చి ఫొటో రాకపోయినా గానీ వారు అంతే

బాధపడుతున్నారు. అసలు ఏ వార్తా రాకపోతే మాత్రం వారి జీవితానికి సంబంధించి చాలా కోల్పోయినట్లే. ఆ బాధ సంవత్సరాల తరబడి వారివెన్నంటే వుంటోంది. పేపర్లో వార్త గనుక వస్తే వాటిని కాపీ చేయించి, లామినేట్ చేయించి పెట్టుకుంటున్నారు. తమ బాధను ఎవరికన్నా చెప్పాల్సివచ్చినప్పుడు ముందు వాటిని బయటికి తీసి చూపిస్తున్నారు. తర్వాత ఎఫ్ఐఆర్ కాపీలను చూపిస్తున్నారు. ఆ వార్తా పత్రికల కథనాలే వారితో సంవత్సరాలపాటు జీవిస్తున్నాయి.

ఒకటికి మించి ఎక్కువ ప్రమాదాలు జరిగినప్పుడే మీడియా ఆ అంశానికి ప్రాధాన్యమిస్తుంది.అయినా, ఈ వార్తలన్నీ 'ఎప్పుడూ జరిగేవి' గానే వుంటాయి. కానీ వాటిని హెడ్‌లైన్లలో చూపించే పరిస్థితి వుండదు. అందుకే వీటికి సంబంధించి తదనంతర పరిణామాలను తెలియజేసే కథనాలు నేను సంపాదించలేకపోయాను. స్థానిక నాయకులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఈ కుటుంబాలకు న్యాయం జరగటానికి ఏ ప్రయత్నమూ చేసినట్టుగా కనిపించలేదు. బాధితులకు ఈ విషయంలో ఏం న్యాయం చేశారని ఆ నాయకులను మీడియా ప్రశ్నించటం లాంటివి కూడా జరగలేదు. అందుకే ఈ సమూహపు దుర్భర పరిస్థితులు, కష్టాలు మిగతా ప్రపంచం దృష్టిలోకి రాకుండా మరుగున పడిపోయాయి. కాదు, కావాలనే ఈ అంశాలను అంధకారంలోనే దాచిపెట్టి దేశాన్ని కనిపించని భారతంగా మార్చేశారు.

తమిళనాడులో ఇలాంటి ఎన్నో పైకి కనిపించని కథలు వున్నాయి. కేవలం తమిళనాడు అనేకాదు, ఈ సమూహంలో జరుగుతున్న చావులు, వారిపట్ల వున్న వివక్ష దేశమంతటా కొనసాగటం ఒక సర్వసాధారణమైన అంశం. ఈ చావులు ఎక్కడా నమోదు కాకపోవడంతో వాటికి సంబంధించిన వాస్తవ గణాంకాలు సైతం మనకు అందుబాటులో లేవు. మామూలుగా అయితే మనం చాలా రకాల చావుల్ని పట్టించుకుంటాం. సరిహద్దుల్లో విధుల్లో ఉండగా జరిగేవి, నక్సలైట్ల హింసతో జరిగేవి, రోడ్లపై యాక్సిడెంట్లలో సంభవించేవి, ఆత్మహత్యలు ఇలా అన్నింటినీ పట్టించుకుంటాం. కానీ పరిశుభ్రత కోసం మురుగుకాల్వల్లో, సెప్టిక్ ట్యాంకుల్లో మునిగి చనిపోయేవారి సమాచారం మాత్రం మనదగ్గర వుండదు. ఎంతమంది పౌరులు ఈ విధంగా విషవాయువుల్తో నిండిన సెప్టిక్ ట్యాంకుల్లో, మురుగు కాల్వల్లో పడి చనిపోతున్నారనే పట్టింపు దేశానికి ఉండదు. దీనిమీద మునుముందు ఏమి చేయాలనే అంశంపై మనకు ఏ ఆలోచనా వుండదు. కోట్లాది రూపాయలు స్వచ్ఛభారత్ పేరిట ఖర్చు పెడుతున్న మనం, ఈ మురుగుకాల్వలను శుభ్రపరటానికి చేపట్టవలసిన యాంత్రీకరణ గురించి కానీ, మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునీకరించటం గురించి కానీ ఎక్కడా మాట్లాడం.

దేశంలోని ప్రతి మున్సిపాలిటీ కూడా మురుగుకాల్వలు, మ్యాన్‌హోల్స్, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయటానికి నేరుగా ఉద్యోగాల్లోకో లేదా కాంట్రాక్ట్ పద్ధతిలోనో

సఫాయి(పాకీ)పనివాళ్ళను నియమిస్తుంది. కానీ, కాంట్రాక్ట్ నిబంధనలలో ఈ పనివాళ్ళ భద్రత గురించి కాంట్రాక్టరుకు ఏరకమైన షరతులైనా పెడుతున్నారా? ఈ సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేసే పనివాళ్ళను వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. తమిళనాడులో వీళ్ళని భూగర్భ ఈతగాళ్ళు (పదల సక్కది ఊయర్) అని పిలుస్తారు. వీళ్ళ కథలో రెండు భాగాలుంటాయి. మొదటిది: ఈ ఈతగాళ్ళ పని పరిస్థితులు. రెండోది: వీళ్ళు గనుక ఆ దుర్గంధంలోపడి చనిపోతే ఆ కుటుంబం ఎదుర్కొనే దుర్భరమైన చిక్కులు!

కోయంబత్తూరులో ఎస్‌కెపి ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చిన అలాంటి కొంత మంది ఈతగాళ్ళను కలిశాం మేం. అందులో చాలా మంది తమ మున్సిపల్ యూనిఫారాల్లోనే వచ్చారు. వారితో మాట్లాడిన కొద్దిసేపటిలోనే నేను కూడా ఆ మురుగుప్రపంచంలోకి దూకి ఈతకొట్టినట్టే అనిపించింది. దుర్భరమైన వారి జీవితాల గురించీ–వారింకా ఎలా బతికివున్నారో చెప్పటానికి ప్రతి ఒక్కళ్ళ దగ్గరా ఒక్కో కథ వుంది. మేం కలిసిన వాళ్ళల్లో మణికి ఈ విషయంలో అనుభవం ఎక్కువ. ముప్ఫై సంవత్సరాల నుంచీ ఈ మురుగు కాల్వల్లోకి దూకుతూ ఎంతో అనుభవం గడించాడు. ఒక అంశాన్ని శాస్త్రవేత్త ఎలా విశ్లేషిస్తాడో, కంప్యూటర్ నిపుణుడు ఇప్పుడు కొత్తగా వస్తున్న సాంకేతిక అంశాల గురించి ఎలా వివరించి చెప్తాడో మణి కూడా తాను చేసే పని గురించి అంతే లోతుగా వివరంగా చెప్పాడు. ఒక మ్యాన్‌హోల్‌ని ఏ విధంగా శుభ్రం చేస్తారో అనే విధానం గురించి అతను మాకు వివరించి చెప్పిన పద్ధతి చూస్తే తన పని పట్ల ఎంత నిబద్ధతగా వున్నాడో మాకు అర్థమయింది.

మ్యాన్‌హోల్‌ని శుభ్రం చేసేముందు బిగిసిపోయిన దాని మూతను ముందుగా తీస్తారు. ఆ పని చాలాకష్టమని మణి మాకు వివరించాడు. దానిని బయటివైపు నుంచి పదేపదే గట్టిగా కొడుతూ వదులు చేయాల్సివుంటుంది. ఆ తర్వాత దాని ఇనుపకమ్మీకి తాళ్ళు లేదా బట్ట కట్టి పైకి లేపాల్సి వుంటుంది. ఒకసారి మూతను తీసిన తర్వాత దాన్ని పక్కన పెట్టి కొంతసేపు వేచివుండాలి. ఆ సమయంలో లోపల వున్న విషపూరిత వాయువులు బయటికి వెళ్ళిపోతాయి. అలానే లోపలవున్న బొద్దింకలు, ఇతర పురుగులు కూడా వెలుపలికి వస్తాయి. ఈ లోగా ఈతగాళ్ళు కొద్దిసేపు విరామం తీసుకుని, ఒక కప్పు టీ తాగి ఏమి చేయాలనే దాని గురించి ఆలోచించుకుంటారు.

"మేము శరీరం మీద లంగోట లేదా డ్రాయర్ తప్పించి వేరే ఇంక ఏమీ ధరించ కుండా మ్యాన్‌హోల్‌లోకి దిగుతాం. బావిలోకి మునకవేసినట్లే వుంటుంది. గట్టిగా ఊపిరి పీల్చుకుని లోపలికి మునుగుతాం. ఊపిరి బిగపట్టి లోపల అడ్డుకున్న తావుల్ని గుర్తిస్తాం. మా పని వాటిని గుర్తించి అడ్డుతొలగించి బయటకు రావటం. సరిగ్గా అక్కడే మా ప్రాణాలకు ప్రమాదం పొంచి వుంటుంది. ఎంత అనుభవమున్నాగానీ ఏదో ఒక చెడ్డరోజు మాకోసం కాపుకాసి వుంటుంది. ఇక్కడే మనకు ఆధునిక సాంకేతిక పద్ధతులు కావాలి. కానీ ఈ

అంశం గురించి కనీసం ఆలోచించేవారే లేరు. స్వచ్ఛభారత్ పేరుతో చీపురు పట్టి ఊడ్చిన రోడ్లనే ఊడ్వటం ఒక ఫ్యాషన్‌గా మారింది. నిజానికి ఇది మేం చేస్తున్న ప్రమాదకరమైన పనిమీద జరుగుతున్న అపహాస్యం. ఇలాంటి నాటకీయమైన ప్రజాకర్షక ప్రచారాల కోసం కోట్లు ఖర్చుపెడుతున్నారు. మా జీవితాల్ని మార్చటానికి మాత్రం డబ్బులేదు. భూగర్భ మురుగువ్యవస్థలోకి మనుషులు దిగకుండా చేసే పద్ధతుల గురించి, అందుకు అవసరమైన దీనికి పరిష్కార మార్గాల గురించి ఎవ్వరూ మాట్లాడటం లేదు. మేం చనిపోతునే వున్నాం, కానీ ఎవ్వరూ పట్టించుకోరు."

కొద్దిసేపు ఆగి ఊపిరిపీల్చి మణి మళ్ళీ కొనసాగించాడు. "మా పని పూర్తయిన తర్వాతే మేము బయటకు వస్తాం. మా సూపర్‌వైజర్లు చాలా తెలివికలవాళ్ళు. ఎలాగైనా సరే పనిపూర్తిచేయమని మాకు పురమాయిస్తారు. దానర్ధం మాకు తెలుసు, వాళ్ళకూ తెలుసు. కానీ ఎవ్వరూ ఇంకో మాట మాట్లాడరు. అసలు విషయం ఏమిటంటే, మా ప్రాణాలను పణంగా పెట్టైనా సరే అక్కడ పని మాత్రం పూర్తిచేయాలి."

మణి పక్కనే గణేశన్ నిలబడివున్నాడు. అతని తండ్రి కుమారస్వామి 1980 ఫిబ్రవరి 2న ఇలా మురుగుకాల్వను శుభ్రం చేస్తూనే చనిపోయాడు. తండ్రి చనిపోయేనాటికి గణేశన్‌కు 15 సంవత్సరాలు. విషవాయువుతో తండ్రి శరీరం నల్లగా కమిలిపోవడం అతను చూశాడు. ఆ షాక్ అతనికి చాలా కాలం వుంది. చనిపోయేనాటికి కుమారస్వామికి 40 సంవత్సరాలు కూడా లేవు. దీనితో కుటుంబ బాధ్యతలన్నీ గణేశన్‌వే అయ్యాయి. తండ్రి మరణంతో వచ్చిన భయాన్ని లోలోపల అదిమిపెట్టుకుని కుటుంబాన్ని పోషించటం కోసం తాను కూడా అదే పనిలోకి దిగాడు. ఇప్పటికీ, మురుగుకాల్వ లోపల దిగి పని చేస్తున్నప్పుడు అందులో అవరోధాలను తొలగిస్తున్న క్రమంలో తండ్రి ముఖం గుర్తుకు వచ్చి వణికిపోతుంటాడు. అలాంటప్పుడు ఒక్కోసారి అదుపుతప్పే పరిస్థితి కూడా వుంటుంది.

"మా నాన్న చనిపోయినప్పుడు కనీసం ఎఫ్ఐఆర్ కూడా రాయలేదు. ఆ సంగతి ఎవరూ ఆలోచించలేదు. ఇప్పుడు నేను గనుక చనిపోతే కచ్చితంగా ఎఫ్ఐఆర్ రాయటమే కాదు, అధికారులను శిక్షించేలా చేయాలి. ఇంకో విషయం కూడా స్పష్టమే; నా కొడుకు మాత్రం ఈ మురికిపెంటలోకి దిగడు కాక దిగడు. నా పిల్లలు చదువుకుంటున్నారు. ఎవ్వరూ కూడా ఈ మురికిపని ఇకపై చెయ్యరు. చీపుర్లు పట్టుకోవడం వేరేవాళ్ళకు ఫ్యాషన్ కావొచ్చు. కానీ మాకు మాత్రం కులపరమైన అవమానం. నరకకూపానికి ముఖద్వారం" అని గణేశన్ అన్నాడు.

గణేశన్ తన మాటలు ముగించగానే మిగిలిన వాళ్ళందరూ కూడా తమ పిల్లలు ఏం చేస్తున్నారో చెప్పటం మొదలుపెట్టారు. ఒకళ్ళ కూతురు ఎమ్‌సిఏ (మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్) చదువుతుంటే, ఇంకొకరి కొడుకు ఐఐటిలో సివిల్ ఇంజనీరింగ్ చేస్తున్నాడు. ఇప్పటివరకూ తమ జీవితాలలో జరుగుతున్న దారుణం తమ పిల్లలకు మాత్రం

జరగకూడదని అందరూ ఏకగ్రీవంగా ఓ తీర్మానానికొచ్చారు. వారి పిల్లలు ఈ మురికికూపం నుంచి దూరంగా గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలి. ఈ ధృడమైన అభిప్రాయానికి ఎలా వచ్చారో స్పష్టతలేదు కానీ వారి మనసుల్లో ఈ కోరిక మాత్రం చాలా బలంగా వుంది.

ఒక రోజులో ఎన్నింటిని శుభ్రం చేస్తారని అడిగినప్పుడు మణి ఇలా చెప్పుకొచ్చాడు. "సిటీలోని ప్రతి ప్రాంతంలోనూ మేము పనిచేస్తాము. రోజుకి కనీసం ఎనిమిదిచోట్ల ఈ విధమైన అడ్డంకులను తొలగిస్తాం. పొద్దున్నే 7.30కు మస్టర్‌రోల్‌లో సంతకం పెడితే పని ముగించేసరికి ఎంత సమయం అవుతుందనేది మాకు తెలియదు." అతని సహోద్యోగి రవి మాట్లాడుతూ "మొబైల్ ఫోన్లు వచ్చిన తర్వాత మా బతుకులు మరింత దుర్భరమై పోయాయి. ఏ సమయంలోనైనా మమ్మల్ని పనికి పిలవొచ్చు. సెలవులేమీ లేవు. ఇప్పుడు కూడా మేము మా ఫోన్లను స్విచ్ఆఫ్ చేసి కూర్చున్నాం. లేకపోతే ఇప్పటికే చాలా ఫోన్లు వచ్చుండేవి" అన్నాడు. ఆ మాటలకి మేం నవ్వకుండా వుండలేకపోయాం.

ఏఏ ప్రదేశాలు శుభ్రంచేస్తారని అడిగినప్పుడు, "జిల్లా కలెక్టరు బంగళా మొదలు జడ్జీల ఇళ్ళు, పోలీస్ కమీషనర్ ఇల్లు, జిల్లా కోర్టు, ఆర్ట్స్ కాలేజీ ఇలా సిటీ అంతా చేస్తాం" అని సమాధానమిచ్చారు.

"మీరు ఈ పని ఎలా చేస్తారన్నది జిల్లా కలెక్టరుకు తెలుసా?"

"లేదు! పాయిఖానాలు ఎలా శుభ్రం చేస్తారన్నది కలెక్టరుకు తెలియదు."

"అతనెప్పుడన్నా బంగళాలోని కిటికీ దగ్గరకు వచ్చి చూస్తే కదా మేము కనిపించేది. బహుశా ఆ సమయంలో అతను మంచిభావంతో వుండుంటే మాకు స్నానం చేయటానికి సబ్బు ముక్క ఇమ్మని, తాగటానికి టీ ఇమ్మని చెప్పేవాడేమో. అతని పాయిఖానాల నుంచి ప్రవహించే మురుగులో అడ్డుకున్నవాటిని తొలగించే క్రమంలో మేం చచ్చిపోయినా సరే, అట్లాంటి ఆలోచనలు అతనికెప్పుడూ రావు" అని డ్రైవర్ వీరాస్వామి వ్యంగ్యంగా అన్నాడు.

"మనుషులు ఈ భూగర్భ మురుక్కాలవల్లోకి దిగి వాటిని శుభ్రం చేయటాన్ని ఈ సంవత్సరం సుప్రీంకోర్టు నిషేధించిందనే విషయం ఈ అధికారులెవరికీ తెలియను కూడా తెలియదని నేను కచ్చితంగా చెప్పగలను" అని ఎస్‌కేఏ కోయంబత్తూరు బాధ్యుడు మురుగేశన్ అన్నాడు. కోర్టు ఉత్తర్వును అమలు చేయించటం కోసం ఎస్‌కేఏ ఒక సర్వేను చేపట్టిందని అతను మాకు చెప్పాడు. సమస్యేమిటంటే ఈ సమూహానికి తప్పించి మిగతా సమాజానికి ఈ కోర్టు ఉత్తర్వులపై ఏమాత్రం అవగాహన లేదు.

ఎస్‌కేఏ తమిళనాడు బాధ్యురాలు శామ్యూల్ వేలాంగని తన బృందంతో కలిసి రాష్ట్రమంతా తిరిగి ఈ కోర్టు ఉత్తర్వుల గురించి కార్మికులకు చెప్పి చైతన్యపరుస్తోంది. 1993 నుంచీ జరిగిన ఈ మరణాల పూర్తి గణాంకాలను సేకరిస్తున్నారు. ఫలితంగా ఆ కుటుంబాలు పదిలక్షల నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. చెన్నై నుంచి

కోయంబత్తూరు వరకూ కూడా జరిగిన ఈ చర్చలు, కథనాలన్నిటినీ తమిళం నుంచి ఇంగ్లీషులోకి ఎస్‌కేఏ జాతీయ కార్యవర్గ సభ్యురాలు దీప్తి సుకుమార్ అనువదించి చెప్పింది. ప్రభుత్వం ఈ అంశం పట్ల కనీసం దృష్టి సారించటం లేదని దీప్తి చెప్పింది. స్వచ్ఛత, పరిశుభ్రత పేరుమీద కోట్లాది రూపాయల ఖర్చుచేస్తున్న వారికి భూగర్భ మురుగుకాల్వల్లో మనుషులు దిగి శుభ్రం చేసే విధానాన్ని ఎలా ఆపాలో అన్నదానిపై కనీస అవగాహన లేదు. 2013లో దీనికి సంబంధించి ఒక కొత్త చట్టం వచ్చినప్పటికీ, సుప్రీంకోర్టు ఉత్తర్వులు వచ్చి ఆరు నెలలు గడిచిపోయినప్పటికీ భూగర్భ మురుగుకాల్వలను శుభ్రం చేసేందుకు చేపట్టాల్సిన ఆధునిక పద్ధతుల్లో యాంత్రీకరణ కోసం ఇప్పటివరకూ దేశంలో ఎక్కడా ఏ రకమైన ప్రయత్నాలూ జరగలేదు.

ఈ సఫాయి కార్మికుల ప్రపంచం చాలా విచిత్రమైన కలయికల్తో వుంది. ఒకవైపు మురుగుకాల్వల్లో తమ ఆత్మీయులను కోల్పోయి తీవ్రమైన బాధతోవున్న కుటుంబాలు, మరోవైపు ఈ నాగరీక ప్రపంచం ఏరిగిన పియ్యిపెంటలను ఎత్తివేయటానికి బలవంతంగా వెళుతున్నవారు. స్పృహలోవుంటే ఈ పని చేయలేమని వారికి తెలుసు. అందుకే ఒళ్ళు మరిచేంతవరకూ మద్యం తాగి ఆ తరువాత ఈ మురుక్కాలవల్లోకి దూకుతారు. అంతకంటే మించి, తాము ఈ పని చేస్తున్నామని తమ కుటుంబ సభ్యులకు కూడా కొంత మంది తెలియనీయరు. తాము చేసే పనిని గోప్యంగా ఉంచుతున్నా గానీ వీళ్ళు ఈ పియ్యిపెంటలను శుభ్రం చేస్తారని అందరికీ తెలుసు.

కరుణమూర్తి మాటలు చాలా కాలం పాటు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూ వుండిపోయాయి. “మేం మంచిగా బట్టలు కట్టుకున్నప్పటికీ మా ముఖాలు చూసి జనం దూరంగా జరిగిపోతారు. ఈ రకమైన ఏహ్యత నన్ను కత్తిపెట్టి చీరుస్తున్నట్లుగా వుంటుంది. మేమేమన్నా అసహ్యకరమైన పశువులమా? మా నుంచి పియ్యిపెంట వాసన వస్తుందా? ఈ ఆలోచనే మా ఆత్మలను చంపేయడంతో మేమూ మనుషులమేననే ఆత్మస్థయిర్యం ఇంకెప్పటికీ మాకుండదు. సారామత్తుతో పాటు పియ్యిపెంట కూడా మా కళ్ళలోని జీవాన్ని హరించి వేస్తుంది. అన్ని రకాల జబ్బులకీ మేం తేలిగ్గా గురవుతాం.”

వాస్తవానికి వీరు ఒకపక్క ప్రమాదభరిత విషవాయువుల భయంతో పాటు, ప్రమాదకరమైన జబ్బులతో కూడా బాధపడుతున్నారు. ఆస్మా, చర్మవ్యాధులు, క్షయ, కలరా, దృష్టి కోల్పోవటం, న్యుమోనియా, కామెర్లు, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్–ఇంకా అనేక జబ్బులు ఈ సమూహంలో సర్వసాధారణంగా కనిపిస్తాయి.

ఈ నరకంలోకి తాము అడుగుపెట్టకూడదని కొత్తతరం బలంగా కోరుకుంటోంది. ఈ పని తప్ప మరే పని చేయటానికైనా వారు సిద్ధం. అలాగే ఈ కులవివక్ష సంకెళ్ళను కూడా బద్దలుకొట్టాలనే కోరికతో వారున్నారు. ఏ ప్రభుత్వం కూడా ఎంత మంది చని పోయారో నమోదు చేయలేదు. వారిని మనం లెక్కపెట్టలేం. శతాబ్దాల తరబడి ఈ సమూహాలు

ఆటవిక కులవివక్ష అత్యాచారాలకు బలయిపోతూవస్తున్నాయి. ఎంతో అభివృద్ధి చెందు తున్నామని చెప్పుకుంటున్నాం గానీ ఈ సమూహాలు ఇప్పటికీ అదే పనిచేయాల్సి వస్తోంది. స్వచ్ఛభారత్ పేరుతో నడుస్తున్న హంగామా వెనుక కూడా బలవంతంగా వీరు సెప్టిక్ ట్యాంకుల్లోకి, భూగర్భ మురుగుకాల్వల్లోకి నెట్టబడి విషవాయువుల బారినపడి చనిపోతున్న కోణాలే దాగి వున్నాయి. ఇప్పటికీ వీటినీ సహజమైన చావులుగానే పరిగణిస్తామా? లేదు. ఇవన్నీ కూడా పైకి కనిపించకుండా జరుగుతున్న హత్యలే. తమ పియ్యిపెంటల మురుగులోకి ఏ సమాజమైతే వీరిని తోస్తోందో వారికి తెలుసు వీరు చనిపోయేది కేవలం అందువల్లేనని. దుర్మార్గం ఏమిటంటే, ఎవ్వరూ కూడా ఈ చావులకు బాధ్యత వహించకపోవడం.

బహుశా ఇదే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ వాస్తవరూపం అయివుంటుంది. అందుకే దీనిని కనపడనివ్వకుండా చేయటానికి అనేక ప్రయత్నాలు జరుగుతూ వుంటాయి.

(2014లో ఈ ప్రాంతాలను సందర్శించినప్పుడు వచ్చిన అనుభవాల ఆధారంగా రాసిన వ్యాసం)

## రెండో భాగం

### అధికారం తలుపుల్ని తట్టడం

# గడప వరకూ వచ్చిన పాదాలు

పదకొండు సంవత్సరాల పాటు వారు దేశ సర్వోన్నత న్యాయస్థానం చుట్టూ గిరికీలు కొట్టారు. ఇన్ని సంవత్సరాలలో తమ బాధాకరమైన కథని ఇద్దరు సర్వోన్నత న్యాయమూర్తుల ముందు, పదహారు మంది న్యాయమూర్తుల ముందు అన్ని వివరాలతో సహా వెల్లడించారు. వాళ్ళకి చెప్పడానికి ముందే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగా అబద్ధాలు వల్లించాయో తెలియజెప్పే తిరుగులేని సాక్ష్యాధారాలను సమర్పించారు. డాక్యుమెంట్లు, ఫొటోలతో కూడిన ఆధారాలు పద్నాలుగు రాష్ట్రాలలో చట్టవిరుద్ధమైన, అమానవీయమైన ఈ పాకీ పని ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశాయి.

అయితే ఫలితం ఏమిటి? ఏమీలేదు!

ఇన్ని సాక్ష్యాధారాలను సమర్పించిన తర్వాత కూడా సర్వోన్నత న్యాయస్థానం ఈ చట్టవిరుద్ధమైన పనిని పూర్తిగా నిర్మూలించటంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆగ్రహావేశాలతో కూడిన తీర్పు చెప్పాల్సింది పోయి, నత్తనడక నడుస్తున్న ప్రభుత్వ యంత్రాంగం తీరుని నిరసించి, చట్టాన్ని ఉల్లంఘించిన వారి మీద చర్య తీసుకోవాల్సింది పోయి, న్యాయం కోసం ఎదురుచూస్తున్న పాకీపనివారిని 23 రాష్ట్రాల్లోని హైకోర్టులకు వెళ్ళి తమ పరిస్థితిని నివేదించుకోమని చెప్పింది.

ఏ సంస్థకైనా లాయర్లను పెట్టుకుని వివిధ హైకోర్టుల చుట్టూ తిరగటమనేది ఎంత కష్టతరమైన పనో అర్థం చేసుకోవచ్చు. అదీకాకుండా ఆరేడేళ్ళ పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందన్న ఆశతో వేచి చూసిన తర్వాత.

2011 జనవరి 12న సుప్రీంకోర్టు చేసిన ఈ తాజా నిర్దేశనం తర్వాత 23 రాష్ట్రాల హైకోర్టుల్లో ఈ అంశం వినాల్సివుంది. ప్రతి సందర్భంలోనూ తాను ఇచ్చిన నిర్దేశాలను గుర్తుపెట్టుకుని ఈ కేసును పరిశీలించాలని సుప్రీంకోర్టు హైకోర్టులకు సూచనచేసింది. నిజానికి ఇది ఎంతో సంక్లిష్టమైన అంశమే. తొలుత ఈ పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు ఇందులో వివిధ రకాల విజ్ఞాపనలు వున్నాయని చెప్పింది. దశాబ్దం పాటు ఈ కేసుని పరిశీలించిన క్రమంలో స్పష్టమైన పలు నిర్దేశాలను సుప్రీంకోర్టు చేసింది. అవి ఇప్పుడు అమలుకావాలి అంటే వివిధ రాష్ట్రాలలోని హైకోర్టులకు వెళ్ళటం తప్పనిసరయింది.

అయితే సుప్రీంకోర్టు ఈ రకమైన నిర్దేశాన్ని చేయవచ్చునా అని ప్రశ్నించుకోవడం ఇక్కడ తప్పని సరి? నిజానికి పాకీ పనివాళ్ళ ప్రతినిధిగా సఫాయి కర్మచారి ఆందోళన్

(ఎస్‌కెఏ) సుప్రీంకోర్టు నుంచి ఏమి ఆశించింది? పాకీపని చేయించటం, ఎత్తుడుదొడ్లను కొనసాగించటం అనేది రాజ్యాంగంలోని 14,17,21,23 నిబంధనలను అతిక్రమించడం అనీ, 1993లో చేసిన చట్టాన్ని ఉల్లంఘించడమేనని చెప్తుందని కదా! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణీత కాలవ్యవధిలో ఈ విధానాన్ని రద్దుచేసి, ఈ పనిచేస్తున్న మనుషులకు గౌరవ ప్రదమైన పునరావాసాన్ని కల్పించటానికి ఏర్పాట్లు చేయాలని కోర్టు ఆదేశిస్తుందని ఎస్‌కెఏ సంస్థ భావించింది.

వాస్తవానికి గత ఇరవై సంవత్సరాలుగా ఈ అంశం పట్ల విధాన నిర్ణేతలు ప్రవర్తించిన తీరు కళ్ళు తెరిపించేదిగా వుంది. శతాబ్దాల తరబడి ఈ అమానవీయమైన పనిని సమాజం ఇంకా ఎందుకు కొనసాగిస్తుందో వారివైఖరితో తేటతెల్లమయిపోయింది. 1993లో వచ్చిన చట్టంలో పొందుపరిచిన అనేక అంశాలను మనం నిశితంగా పరిశీలించినట్లయితే, అలాగే చట్టాలను అమలు పర్చాల్సిన అధికార యంత్రాంగం, దేశ న్యాయవ్యవస్థ– రెండూ కూడా చట్టం రూపకల్పన అయిన తర్వాత అవలంబించిన తీరు, ఇవన్నీ చూస్తే ఎవరికైనా సరే పరిస్థితి పట్ల ఒక అవగాహన వస్తుంది. నిజానికి దేశ విధాననిర్ణేతలు నిర్దుష్టమైన చర్య తీసుకునివుంటే ఈ స్థితి వచ్చివుండేది కాదు. పాకీ పనివాళ్ళు తమ పోరాటాన్ని వదిలి పెట్టకుండా పట్టుదలతో కొనసాగించి కోర్టులు సంధించిన ప్రతి సవాలునీ ఎదుర్కొన్నారు. మరీ ముఖ్యంగా ఈ ప్రజల జీవితాల్లో ఏ రకమైన మార్పూ జరగకుండా చట్ట రూపకర్తలు కల్పించిన అనేక అడ్డంకులను అధిగమించారు.

వీటన్నిటినీ మనం ఒక క్రమానుగతమైన పద్ధతిలో అర్థం చేసుకోవాల్సివుంటుంది.

అనేక లోటుపాట్లతో వున్నప్పటికీ, పాకీ పనివాళ్ళకు విముక్తి వైపుగా ఒక దారి చూపించిన ఈ చట్టాన్ని ముందుగా పరిశీలిద్దాం. 1990లో మొట్టమొదటి సారిగా బాబా సాహెబ్ అంబేద్కర్ శతజయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం దళిత అజెండాను నిశిత దృష్టితో పరిశీలించటమే కాకుండా దానికొక నిర్మాణాత్మకమైన రూపుని ఇచ్చే ప్రక్రియను కూడా మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాల ఫలితంగా 1993లో పాకీపని, ఎత్తుడు దొడ్ల నిర్మాణ నిషేధ చట్టం (ది ఎంప్లాయిమెంట్ అండ్ మాన్యువల్ స్కావెంజర్స్ & కన్‌స్ట్రక్షన్ ఆఫ్ డ్రై లెట్రిన్స్ (ప్రొహిబిషన్) యాక్ట్, 1993) వచ్చింది. చట్ట రూపకల్పన కోసం వేసిన తొలి అడుగు వాస్తవానికి ప్రతికూల అంశంగా మారింది. శుభ్రత, ఆరోగ్యం అనే అంశాలు ఉమ్మడి జాబితాలోవి కావటంతో ఈ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 252 కిందకు వచ్చింది.

ఏదైతేనేం, కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆమోదిస్తూ దీన్ని రాష్ట్రాల శాసనసభలు కూడా ఈ ఉమ్మడి జాబితాలను దృష్టిలో పెట్టుకుని తాము ఆమోదించిన తర్వాతే అమలుచేయొచ్చని పేర్కొన్నది. అందుకే ఈ చట్టం లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు కేవలం ఐదు రాష్ట్రాలే ముందస్తు ఆమోదాన్ని తెలియచేశాయి.

ఇప్పుడు చట్ట రూపకర్తల చిత్తశుద్ధి ఏ స్థాయిలో వుందో పరిశీలిద్దాం. ఈ చట్టం 1993లో లోక్‌సభ ఆమోదంపొంది, నాలుగు సంవత్సరాల తర్వాత – అంటే 1997 జనవరి 24న రాష్ట్రపతి భవన్‌కు చేరింది. తర్వాత కూడా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని ఆమోదించటానికి ఏ మాత్రం చొరవను చూపించలేదు. నిజానికి 2005 వరకు ఏ రాష్ట్రం కూడా ఈ దిశగా కనీసం ఒక్క అడుగైనా ముందుకు వేయలేదు. ఎస్‌కెఏ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం, తదుపరి ఆయా రాష్ట్రాలకు నోటీసులు అందిన తర్వాతే కదలిక వచ్చింది. అయినప్పటికీ దేశరాజధాని న్యూఢిల్లీ సహా ఆరు రాష్ట్రాలు అసలు దీనిని 2010 వరకూ అంగీకరించను కూడా అంగీకరించలేదు. తప్పనిసరి స్థితిలో 2010 చివరిలో ఈ చట్టాన్ని ఆమోదించాయి. 1993లో లోక్‌సభ ఆమోదం పొందిన ఒక చట్టం దేశమంతా ఆమోదించబడటానికి అనేక సంవత్సరాలు పట్టిన వ్యదార్ధ చిత్రానికి ఈ ప్రక్రియ దర్పణం పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే మేలుకున్నాయన్నది వాస్తవం. ఈ వత్తిడి ఫలితంగానే చట్టాన్ని అమలు చేయించటానికి అవి అధికారులను నియమించాల్సివచ్చింది.

ముందుగా చట్టం కల్పించిన అవకాశాలేమిటో, చట్టం ప్రాథమికంగా ఉద్దేశించ బడిన అంశాలకు అడ్డుపడుతున్నవి ఏమిటో పరిశీలిద్దాం. మొదటిది: ఈ చట్టంలో శుభ్రం చేసే పాకీపని వారి గురించిన నిర్వచనం అసమగ్రంగా వుంది. కేవలం ఎత్తుడు దొడ్లను శుభ్రం చేసేవారికే పరిమితమైంది తప్ప రైలు కట్టలు, మ్యాన్‌హోల్స్, మురుగునీటి కాల్వలు, సెప్టిక్ ట్యాంకులు, బహిరంగ పాకీదొడ్లు మొదలయిన వాటిని ఈ పనిలో భాగమని గుర్తించలేదు. నిజానికి ఈ పనులన్నీ కూడా అమానవీయమైన, ఘోరమైన పద్ధతిలోనే వుంటాయి. ఈ కారణంగానే ఎక్కువశాతం మంది పాకీ పనివాళ్ళు ఈ చట్ట పరిధిలోకి రాకుండా మిగిలిపోయారు.

రెండోది: ఈ చట్టంలోని ఆర్టికల్ 3(1)లో పేర్కొన్న ప్రకారం చూస్తే రాష్ట్రాలు దీనిని ఆమోదించిన తర్వాత కూడా ఈ ప్రత్యేక చట్టం దానంతట అది వెంటనే రాష్ట్రమంతటా అమలుకాదు. రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా ఒక ప్రకటనను ఇచ్చి ఏ జిల్లాలలో, ఏఏ ప్రాంతాల్లో ఈ పనివిధానం ఎక్కువగా అమల్లో వుందో గుర్తించాలి. అంతేకాదు ఆయా ప్రాంతాల్లో ఈ చట్టం అమలుచేయటానికి స్థానిక యంత్రాంగాలకు తొంభైరోజుల సమయాన్ని గడువుగా ఇవ్వాలి. ఇదంతా సరిపోదన్నట్టు ఆర్టికల్ 3(2)లో ఈ పాకీ వ్యవస్థని పూర్తిగా నిర్మూలించటమనే అంశానికి అడ్డుపడే అనేక లొసుగులు వున్నాయి. ఆర్టికల్ 3(2)(2) ప్రకారం ఈ చట్టం అమలుచేయాలంటే ఫ్లష్ టాయిలెట్లు వున్న ప్రాంతంలో తగినంత నీటి సౌకర్యం తప్పనిసరిగా వుండాలన్న నిబంధన పెట్టారు. ఇదేమాదిరిగా ఆర్టికల్ 3(2)(3)లో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ అనే ముసుగులో మరో అడ్డంకిని పెట్టారు. దీనిపరమార్థమేమంటే, ఏ స్థానిక అధికారైనా ఈ

చట్టాన్ని అమలు చేయకూడదని అనుకుంటే నీళ్ళ సదుపాయం లేదనో, లేదా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదం అన్న సాకుతో నిరభ్యంతరంగా తిరస్కరించవచ్చు. మొత్తంగా చూస్తే ఆర్టికల్ 3(2) అనేది ఈ చట్టం ఉద్దేశించబడిన ప్రాథమిక అంశానికి వ్యతిరేకమయినదనిపిస్తుంది. ఇది మీకు ఆశ్చర్యాన్ని కలిగించి వుంటే, మరోటి కూడా వినటానికి వేచి వుండండి! చట్టం అమలు నుంచి తప్పించుకోవడానికి పైన కల్పించిన అవకాశాలు సరిపోవన్నట్లు చట్టంలోని ఆర్టికల్ 4లో రాష్ట్ర ప్రభుత్వాలకు అపరిమితమైన స్వేచ్ఛ దాఖలుపరిచారు. ఈ చట్ట పరిధి నుంచి కొన్ని వర్గాల వ్యక్తులను లేదా కొన్ని రకాల భవనాలను మినహాయించవచ్చు అనేది మరొక మెలిక. దీనికి కారణాలు వుండొచ్చు, వుండకపోవచ్చు; రాష్ట్ర ప్రభుత్వానికి ఈ పిచ్చి ఆలోచన వుంటే సరిపోతుంది. ఇలాంటి వెసులుబాటులు అనేకం ఇచ్చిన తర్వాత, అసలు ఈ చట్టం చేయడం వల్ల ఏమైనా ఉపయోగముందా?

విధాన నిర్ణేతల మదిలో ఏముందో స్పష్టంగానే తెలుస్తోంది. వ్యవస్థ ఎలా వున్నది అలానే వుండాలి. అందులో ఏ కొంచెమైనా వెసులుబాటు వుంటే అది పాకీవాళ్ళకు ఇవ్వాలనుకుంటే ఇస్తారు. తరాల తరబడి దళిత కులాలకు అన్ని రకాల అవకాశాలను, సదుపాయాలను దూరంచేసి గ్రామాలకు, పట్టణాలకు దూరంగా నెట్టేసిన మనస్తత్వం, ఇప్పుడు ఔదార్యం ప్రదర్శిస్తున్నట్టుగా కనిపిస్తున్న ధోరణి– రెండూ దాదాపు ఒకటే. భారత రాజ్యాంగంలోని ఉపోద్ఘాతంలో రాసుకున్నట్లు మనుషుల గౌరవాలను నిలబెడతామని ఇచ్చిన హామీలకు ఏ మేరకైనా న్యాయం చేశారా అని వారిని ప్రశ్నించాల్సి వుంది. 1993 చట్టంలో పాకీ పనివారి పునరావాసం కోసం ఎంతవరకూ సాధ్యమైతే అంతవరకూ చేయూతనందించాలని వుంది – అంటే దానర్థం ప్రత్యేక అవకాశాలు ఏవీ ఇక్కడ లేవని. చట్టాన్ని అనేక వెసులుబాట్లతో తయారు చేశారు. పైగా దీనిని తప్పనిసరిగా అమలు పర్చాల్సిన అధికార యంత్రాంగం నత్తనడక నడవటమే కాకుండా వ్యతిరేక భావజాలంతో వుంటుంది. ఇట్లాంటి వాటివల్ల వ్యవస్థ మీద నమ్మకంపోతే అందుకు ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు. చట్టం ఎంత హాస్యాస్పదమైనదో చెప్పడానికి అంబాలా ఉదాహరణ ఒక సాక్ష్యం. ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎక్కువ కాలం సాగదీయలేనని గుర్తించిన అక్కడి మున్సిపల్ కమిషనర్ తన ప్రాంతంలో ఎత్తుడు దొడ్లను శుభ్రం చేసే మనుషులు వున్నప్పటికినీ, వారెవరూ తమ నెత్తి మీద తోటి మనుషుల పియ్యిపెంటలను ఎత్తి తీసుకెళ్ళటం లేదని జిల్లా కలెక్టర్‌కు రాశాడు. ఈ చట్టం పరిధిలోకి తన ప్రాంతంలోని పాకీ పనివారు రారని చెప్పటానికి అతనెంచుకున్న పద్ధతి ఇది.

ఇక శిక్షల విషయానికి వస్తే, చట్టంలోని 4వ అధ్యాయంలోని ఆర్టికల్ 14లో వీటి గురించి ప్రస్తావించారు. కానీ పాకీపని చేసేవాళ్ళని శిక్షించాలా లేక వారిని పనిలోకి పెట్టుకున్న వారిని శిక్షించాలా అనే అంశంపై స్పష్టత లేదు. ఇది కేవలం పేద, అసహాయ

పాకీ పనివాళ్ళ మీద జులుం చలాయించడానికి, వాళ్ళని శిక్షించడానికి అధికారులకు అపరిమితమైన అధికారాన్నిస్తుందే తప్పించి, వారిని పనిలోకి పెట్టుకున్న వ్యక్తులకు గానీ, ఎత్తుడుదొడ్లను తమ ఇళ్ళల్లో నిర్మించుకున్న వారికి గానీ ఏవిధమైన శిక్షా వుండదు. రాజస్థాన్, తమిళనాడుల్లో ఇలాంటి ఘటనలకు సంబంధించిన అనేక సాక్ష్యాధారాలున్నాయి. 2009 జూలైలో రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ పట్టణ కౌన్సిల్ 12 మంది పాకీపని వారికి నోటీసులు ఇచ్చింది. అలాగే తమిళనాడులోని నాగపట్టినమ్‌లో కూడా 8 మంది పాకీ పనివాళ్ళు నోటీసులు అందుకున్నారు. పైగా చట్టం నాలుగో అధ్యాయంలోని ఆర్టికల్ 17లో ఎవరైనా పాకీ పనిచేసే వ్యక్తి ఈ చట్టం పరిధిలో కేసులు రిజిస్టర్ చేయాలనుకుంటే, పర్యవేక్షణ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి వుంటుందని పేర్కొన్నారు. ఇక్కడ గమనించాల్సిన అంశమేమంటే, ఈ చట్టాన్ని అమలు చేయటం కోసమే పర్యవేక్షణ అధికారులను నియమించారు. కానీ ఈ వెసులుబాటుకు అర్థం ఏమిటంటే, ఈ పర్యవేక్షణ అధికారులు ఏ పరిస్థితుల్లోనయినా ఈ చట్టాన్ని అమలు చేయలేకపోతే, అందుకు వ్యతిరేకంగా ఎవరైనా ఫిర్యాదు చేయదలుచుకుంటే వారిదగ్గరే ముందస్తు అనుమతి తీసుకోవాల్సిరావడం. ఎంత తల్లకిందుల వ్యవహారమో చూడండి!

దేశంలో వెనుకబడిన జాతుల్లోనే అత్యంత వెనకబడిన జాతిని ఉద్ధరించడం కోసం మన లోక్‌సభ ఇలాంటి చట్టాన్ని తయారుచేసి పెట్టింది. అయితే ఈ చట్టంలో ఎన్ని లొసుగులు వున్నప్పటికీ పాకీ పనివారల సమూహం దీనినే బలంగా మార్చుకుని తమ పోరాటాన్ని ప్రారంభించారు. 2003లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలతో మొదలైన ఈ పోరాటం దేశంలోని వివిధ కోర్టుల్లో, రాజకీయాంశాలలో ఇప్పటికీ కొనసాగుతోంది. మొక్కవోని ఈ పోరాటం వల్లనే ప్రభుత్వం ఈ పద్ధెనిమిది సంవత్సరాల చట్టంలో మార్పులు తీసుకురావటానికి అంగీకరించింది. అయితే కార్యరూపం దాల్చలేదు. ఇందులో వైరుధ్యం ఏమిటంటే సాంకేతికంగా చట్టంలో మార్పులు ప్రతిపాదించవలసినది న్యాయశాఖ లేదా సామాజిక న్యాయం, సాధికారతల మంత్రిత్వశాఖలయితే దాన్ని తీసుకెళ్ళి గృహ మరియు శుభ్రతా మంత్రిత్వశాఖకు అప్పగించటం! అంటే ప్రభుత్వం ఇప్పటికీ ఈ అంశాన్ని ఇళ్ళ నిర్మాణం లేదా శుభ్రతకి సంబంధించిన అంశంగానే పరిగణిస్తోంది తప్పించి కుల వివక్ష, అణిచివేతలకు సంబంధించినదిగా చూడటం లేదు. సమస్యను పరిష్కరించటానికి ఈ రకమైన విధానాలు ఎంతమాత్రం సహకరించకపోగా అసలు సమస్యనే తక్కువ చేసి చూసేవిగా వుంటాయనేది స్పష్టమవుతోంది.

చట్టం వచ్చిన తర్వాత కూడా పాకీపనివాళ్ళ పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని, 2003లో ఆరు సంస్థలు (ఎస్‌కెఏ సహా), ఏడుగురు పాకీ పనివాళ్ళు కలిపి సుప్రీంకోర్టులో ఒక ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని (లిటిగేషన్ నెం.583) ఆర్టికల్ 32 కింద 1993 చట్టాన్ని అమలు చేయమని కోరుతూ దాఖలు చేశారు. ప్రస్తుత ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి,

ఒకప్పటి న్యాయవాది అయిన ఎస్.మురళీధర్ వ్యాజ్యదారుల తరఫున వకాల్తా తీసుకున్నారు. జనవరి 8, 2004న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యం మీద కేంద్ర ప్రభుత్వానికి, సామాజిక మంత్రిత్వశాఖకు, రైల్వేమంత్రిత్వశాఖకు, రక్షణ మంత్రిత్వశాఖకు, పరిశ్రమలశాఖకు, జాతీయ సఫాయి కర్మచారి ఆయోగ్‌తో పాటు 28 రాష్ట్రాలకు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు పంపించింది. 2004 ఆగస్టు 9లోగా సమాధానాలు పంపించాలని గడువు విధించింది. అయితే గోవా, త్రిపుర రాష్ట్రాలు మాత్రమే తమ సమాధానాలను గడువు లోపు కోర్టుకు సమర్పించాయి. దానితో మిగతా రాష్ట్రాలకు తిరిగి నాలుగు వారాల గడువును పెంచి ఆ లోపు సమాధానాలు పంపించాలని సుప్రీం ఉత్తర్వులిచ్చింది. తదనంతరం సెప్టెంబరు 13, 2004న ఆరు రాష్ట్ర ప్రభుత్వాలు (అసోం, జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌ఘడ్, మణిపూర్, ఉత్తరాఖండ్, గుజరాత్) రెండు కేంద్రపాలిత ప్రాంతాల (దాద్రా-నాగర్‌హవేలి, ఢిల్లీ) ప్రధాన కార్యదర్శులను తమముందు హాజరుకావల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది.

2004 నుంచీ 2007 వరకూ కోర్టు ఈ పిటిషన్ మీద దాదాపు ఇరవైసార్లు విచారణ జరిపింది. కోర్టు ఆదేశాలతో, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల్లో పాకీ పనివారి స్థితిగతుల గురించి అఫిడవిట్లు సమర్పించాయి. వేలాది పత్రాలను సమాధానాలుగా పంపించారు. దాదాపు అన్ని రాష్ట్ర పభుత్వాలు కూడా తమ తమ రాష్ట్రాల్లో పాకీపని విధానం అమల్లో లేదని గట్టిగానే నొక్కి వక్కాణించాయి. ఇందులో మనం పెద్దగా ఆశ్చర్యపడాల్సిందేమి లేదు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో సైతం అబద్ధాలు చెప్పటానికి రాష్ట్ర ప్రభుత్వాలు కొంచెం కూడా సంశయించలేదన్నది స్పష్టం. కానీ ఇక్కడ విషయం కేవలం అబద్ధం చెప్పటమే కాదు, కోర్టులను అపహాస్యం చేయటం కూడా. ఉదాహరణకు సుప్రీంకోర్టు ఇంతకు ముందు కూడా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి సమాధానం కోరుతూ నోటీసులు పంపించింది. నేషనల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అన్ని డాక్‌యార్డ్ కార్పొరేషన్లు, జింక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు నిజానికి వాటికి ఈ అంశంతో ఏమాత్రం సంబంధం లేకపోయినప్పటికీ కోర్టు నోటీసులకు సమాధానాలు ఇచ్చాయి.తప్పని సరిగా సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత తమపై వున్నప్పటికి కనీసం ఒక్కటంటే ఒక్క మున్సిపల్ కార్పోరేషన్ కూడా నోటీసుకు తిరుగుటపా కూడా పంపించలేదు.

కోర్టులో విచారణలు జరుగుతున్నంత కాలం మన అధికార యంత్రాంగం ఏ మాత్రం సిగ్గులేకుండా ఈ బాధ్యత నుంచి తప్పించుకొనటానికి చాలా ఉదాహరణలనే ప్రస్తావించింది. పాకీ పనివాళ్ళ నెత్తిమీద నుంచి నిజంగా పియ్యిపెంటల బుట్ట తీసివేయబడిందా లేదా అనేది వాళ్ళకు సంబంధించిన అంశంగా భావించటం లేదనేది సుస్పష్టం. 2004 ప్రారంభంలో నాలుగైదు రాష్ట్రాల్లో పాకీపని ఏవిధంగా కొనసాగుతోందో

తెలియజెప్పే స్పష్టమైన సాక్ష్యాధారాలను వ్యాజ్యదారులు సమర్పించారు. దీనికి సమాధానంగా దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల్లో అటువంటివేమీ జరగడం లేవని తేల్చి చెప్పేశాయి నిజానికి. నోటీసులకు సమాధానం చెప్పవలసిన కాలంలో ఎత్తుడుదొడ్లను ధ్వంసంచేశారు. వ్యాజ్యదారులే కోర్టుకి తప్పుడు సమాచారం ఇచ్చారని బుకాయించారు పైగా సిగ్గులేకుండా వ్యాజ్యదారుల మీద చర్య తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు! అనంతరం 2008 ఆగస్ట్ 5న దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఇంకా పాకీపని కొనసాగుతోందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు వ్యాజ్యదారుల్ని కోరింది. ఈ పని చేయటానికి కేవలం ఎనిమిది వారాల గడువును మాత్రమే ఇచ్చింది. ఏ వ్యాజ్యదారునికైనా లేదా ఏ సంస్థకైనా సరే దేశవ్యాప్తంగా ఒక సర్వేచేసి ఎనిమిది వారాల్లో దాన్ని సమర్పించటం అనేది అసాధ్యమైన విషయమే. చూడబోతే న్యాయాన్ని కోరినందుకు ఇది వారికి వేసిన శిక్షలానే అనిపిస్తుంది. దేశ అధికార యంత్రాంగం చేయవలసిన పనిభారాన్ని వీళ్ళ నెత్తిమీద పెట్టింది సుప్రీంకోర్టు. ఈ సమయంలో నిజాన్ని ఒప్పుకునేలా రాష్ట్రాల మీద ఒత్తిడి తీసుకొచ్చి అసహాయులకు సహాయం అందించేలా సుప్రీంకోర్టు జోక్యం వుండాలని ఎవరైనా ఆశిస్తారు. కానీ న్యాయాన్ని అందించటమూ లేదా అసహాయులైన వ్యాజ్యదారునికి న్యాయం అందే మార్గాన్ని కానీ చూపించకుండా, దేశంలోని అనేక ప్రాంతాల్లో పాకీపని ఇంకా విస్తృతంగా కొనసాగుతూనే వుందన్న నిజాన్ని తమ సొంత బాధ్యతతో రుజువుచేయాలని వ్యాజ్యదారుల్నే ఆదేశించింది సుప్రీంకోర్టు. రాష్ట్రాలు చెబుతున్న అబద్ధాలను విశ్వసించకుండా, వ్యవస్థాగతంగా బాధ్యత తీసుకోవాల్సిందిపోయి, అసాధ్యమైన ఈ భారాన్ని పేద, బలహీన వ్యాజ్యదారుల భుజస్కంధాల మీదే మోపింది న్యాయస్థానం.

అయినప్పటికీ తమ ఈ అస్థిత్వ పోరాటంలో భాగంగా ఎస్‌కెఏ సంస్థ దీన్ని ఒక సవాలుగా స్వీకరించింది. 1260 మంది కార్యకర్తల సహాయంతో 18 రాష్ట్రాల్లో, 274 జిల్లాల్లో ఒక నమూనా సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పాకీ పనివారి పూర్తి వివరాలు నమోదయి వున్నాయి. ఈ సర్వే వలన 14 రాష్ట్రాల్లో పాకీపని కొనసాగుతున్నట్టు రుజువులతో సహా వెల్లడయింది. ఎట్లాంటి వివరాలు బయటకు వచ్చాయంటే ఈ 60 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వమూ తమ దగ్గర విస్తృత వనరులు వుండి కూడా ఈ వివరాలను నమోదు చేయలేకపోయింది. కేంద్రంలోనూ అలాగే రాష్ట్రాల్లో వున్న అనేక ప్రభుత్వాలు తమ రాజకీయ అధికారంతో కుట్రలు చేసి పాకీపనిని కనిపించనీయకుండా మరుగున దాచారు. అయినప్పటికీ అట్టడుగున వున్న ఈ సమూహం తనంతట తానుగానే సమష్టిశక్తిగా మారి ప్రభుత్వాల ద్వంద్వ నీతి ముసుగుని చింపేసే తెగువను ప్రదర్శించింది. 2009 మార్చి 4న ఎస్‌కెఏ సంస్థ అన్ని గణాంకాలను సుప్రీంకోర్టుకి సమర్పించింది. రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున పాకీ పనివాళ్ళు వున్నట్లు ఈ నివేదిక

ద్వారా స్పష్టమయింది. దీనికి రుజువులు చూపించాలని కోర్టు అడిగినప్పుడు సంబంధిత ఆధారాలు కూడా సమర్పించటం జరిగింది. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత 2009 ఏప్రిల్ 30న, రాజస్థాన్‌లో 9 జిల్లాలు, హర్యానాలో 7 జిల్లాలు, పంజాబ్‌లోని 8 జిల్లాలలో పాకీపని కొనసాగుతున్నట్లుగా సుప్రీంకోర్టు ప్రకటించింది. అక్కడ చట్టాన్ని ఎందుకు అమలుపర్చటం లేదో వివరించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు తాకీదులు పంపింది. తదుపరి విచారణ ఒక వారం తర్వాత జరిగింది. 2009 మే 8న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా నోటీసులు జారీ చేసింది. దానికి ఢిల్లీ ప్రభుత్వం సమాధానమిస్తూ తామింకా ఈ చట్టాన్ని ఆమోదించలేదని, దీనికి సంబంధించి ఏ విచారణాధికారినీ లేదా ఇన్‌స్పెక్టర్‌ను నియమించలేదనీ, కాబట్టి తాము దీని పరిధిలోకి రామని వివరణ ఇచ్చింది. దేశరాజధాని ఢిల్లీ నగరంలో 5గురు పాకీ పనివాళ్ళు, 15 ఎత్తుడుదొడ్ల సమాచారం తమ దగ్గర వుందని సుప్రీంకోర్టుకి వ్యాజ్యంవేసిన సంస్థలు తెలిపాయి. ఈ వివరాలన్నిటినీ వారు సుప్రీంకి సమర్పించటంతో కోర్టు దానిని అధికారికంగా గుర్తించవలసి వచ్చింది. ఆ తదుపరి అంటే మే 10న ఢిల్లీ పోలీసులు వెళ్ళి ఆ మరుగుదొడ్లను ధ్వంసం చేశారు. తద్వారా మరిన్ని బుకాయిపులు తమ వాదనకు జోడించడం జరిగింది.

2008 ఆగస్ట్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ తానే స్వయంగా ఈ కేసుని విచారణ చేపట్టారని ఇక్కడ తప్పకుండా చెప్పితీరాలి. వ్యాజ్యదారులు ఎనిమిది వారాల్లోపు దేశవ్యాప్తంగా వున్న పాకీ పనివారి వివరాలను ఇవ్వవలసిందిగా కోరింది ఆయనే. 2009లో ఎస్‌కెఏ సంస్థ పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరా ఖండ్ రాష్ట్రాలకు సంబంధించిన సమాచారాన్ని కోర్టుకి సమర్పించింది. 2010 అక్టోబరు నాటికి దేశంలోని మిగతా ప్రాంతాల సమాచారాన్ని కూడా సమర్పించటం జరిగింది. ఎన్నో క్లిష్టమైన పరిస్థితుల్లో ఎంతో శ్రమపడి అన్ని గణాంకాలను సేకరించినా గానీ ఫలితం శూన్యం. ఈ సమాచారం అంతటినీ పరిశీలించటానికి తనకు సమయంలేదని సుప్రీంకోర్టు తేల్చేసింది. దానితో ఏ నిర్ణయాన్నీ దీనిమీద ప్రకటించలేదు. విచారణ 2003 నుంచి 2010 వరకూ సాగదీయబడింది. ఈ మధ్యకాలంలో ఈ కేసు 37సార్లు కోర్టు ఎజెండా మీదికి వచ్చినప్పటికీ, కేవలం 22సార్లే విచారణ సాగింది. ఈ అంశాన్ని పరిశీలించటానికి దేశవ్యాప్త సమాచారం కావాలని ఆజ్ఞాపించిన సుప్రీంకోర్టే చివరికి ఆ గణాంకాల సమాచారం చూడటానికి తనకు సమయం లేదన్నది. వ్యాజ్యదారులు 23 రాష్ట్రాల హైకోర్టుల్లో ఈ విషయాన్ని తేల్చుకోవాలని చివరకు సుప్రీంకోర్టు చెప్పింది. తరతరాలుగా కొనసాగుతున్న ఒక అమానవీయమైన విధానానికి ఈ తీర్పు ఒక ప్రతిబింబంగా నిలుస్తుంది.

నిజానికి ఈ విధానం చట్టవిరుద్ధమైనదని, అమానవీయమైనదని, దానిని కొనసాగించటం నేరమని కోర్టు తానే సూటిగా ప్రకటించి వుండవచ్చు. ఈ చట్టాన్ని

ఉల్లంఘించినట్లు సుప్రీంకోర్టు తీర్పులు, అనేక ఆధారాలున్న తర్వాత కూడా మరి వారిని నేరస్థులుగా ఎందుకని పరిగణించ లేదు? వారినెందుకు ప్రశ్నించటం లేదు? రాజ్యాంగంలోని అంటరానితనాన్ని నిర్మూలించే ఆర్టికల్ 17 ప్రకారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయటం జరిగింది. దేశంలో ప్రబలివున్న కుల అణిచివేతను అంతం చేయటానికి తనకు లభించిన సువర్ణ అవకాశాన్ని సుప్రీంకోర్టు కోల్పోయిందనేది స్పష్టం. ఈ విధానాన్ని అంతంచేసే విధంగా తీర్పు ఇచ్చివుంటే కులవ్యవస్థలో భాగంగా సాగుతున్న జుగుప్సాకరమైన విధానాన్ని అది అంతం చేయగలిగి వుండేది. కానీ అది జరగలేదు.

ఏదేమైనా పాకీ పనివారు తమ పోరాటాన్ని వదిలి పెట్టలేదు. అసాధ్యమయినప్పటికీ తమ లక్ష్యాన్ని చేరు కోవటానికి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటూ కూడా ఎన్నో అడుగులు ముందుకి వేశారు. ఇప్పుడు తిరిగి తమ బలాబలాలను కూడగట్టుకుంటూ దేశంలోని 23 రాష్ట్రాల్లోని అత్యున్నత న్యాయస్థానాల ద్వారాలను తడుతూ చట్టాన్ని అమలు పరచడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల మీద నిరంతరం వత్తిడి పెడుతూనే వున్నారు. ఈ నరకకూపం నుంచి విముక్తమవ్వాలంటే తప్పనిసరిగా పోరాటం చేయాలని, ఎత్తుడుదొడ్లను కూల్చే యాలని, పాకీ బుట్టలను తగులబెట్టాలని, ధర్నాల ద్వారా జిల్లా అధికార యంత్రాంగాల మీద వత్తిడి తీసుకురావాలని ఈ న్యాయపోరాటం ఈ ప్రజలకు పాఠాలు నేర్పించింది. నిరంతరాయమైన పోరాటం తర్వాతే ఈ అంశం మీద అప్పటి వరకూ ఏ మాత్రం బాధ్యత తీసుకోని ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవటం మొదలుపెట్టాయి. అప్పటివరకూ పట్టనట్టున్న రాజకీయాలు ఈ దిశగా చూపు సారించాయి. సంవత్సరాల తరబడి జరిగిన పోరాటంతో ఈ నాటికి వీరి గొంతులను పట్టించుకోవలసిన అనివార్య స్థితి ఏర్పడింది.

అంతర్జాతీయ న్యాయనిపుణుడు మార్క్ గాలంటర్ భారతీయ న్యాయవ్యవస్థ గురించి ఇలా అంటారు: అది ఎవరికైనా వందరూపాయల నోటు ఇవ్వాల్సివస్తే, ముందుగా దాన్ని రెండు ముక్కలుగా చింపి ఒక ముక్కను ఇస్తుంది. అంతటితో సగం న్యాయం చేశానని భావిస్తుంది. నిజానికి రెండవ ముక్క లేకుండా, సగం చించి ఇచ్చిన నోటుకి ఏ విలువా ఉండదని గుర్తించడం లేదు. ఇదే అత్యంత విషాదకరం. సమాజంలో అట్టడుగు వర్గాలకు న్యాయం అందించాల్సిన ప్రతిసారీ జరుగుతున్న తంతు ఇదే!

## భారతీయ రైల్వేలు - పాకీపని

### రైలుకట్టల మీద మురికి పియ్యిపెంటలు, మురికి హృదయాలు

దేశరాజధాని న్యూఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారమ్ దగ్గర్లో వున్న రైలుకట్టల మీద ఒక యువకుడు నిలబడి వున్నాడు. అతని చేతిలో చీపురు వుంది. అతనికి చేరువలో మరో యువకుడు పైపు పట్టుకుని నిలబడి వున్నాడు. సచిన్, రెహాన్ అనే ఈ ఇద్దరూ కూడా ఉత్తరభారతదేశ రాష్ట్రమైన బీహార్ నుంచి వచ్చారు. రైలు వచ్చిన

వెంటనే ఫ్లాట్‌ఫారమ్‌ల మీద పడే మనుషుల పియ్యిపెంటలను ఎత్తి శుభ్రం చేసే పని చేస్తున్నారు. అదీ కాంట్రాక్టు విధానంలో. ఇదొక్కటే కాకుండా చెత్త ఏరటం, ఊడ్చటం వంటి ఇతర పనులు కూడా చేస్తారు. ఢిల్లీకి చెందిన ఓ కాంట్రాక్టరు ఈ రైల్వేస్టేషను శుభ్రం చేసే బాధ్యత తీసుకున్నాడు. అతని దగ్గర వీళ్ళిద్దరూ పని చేస్తున్నారు. సచిన్, రెహాన్ లాంటి యువకులెందరో ఈ కాంట్రాక్టర్ దగ్గర పని చేస్తున్నారు. వీరి సంఖ్య సందర్భాన్ని బట్టి పెరుగుతూ వుంటుంది. కొన్నిసార్లు తగ్గుతూ వుంటుంది. వీళ్ళు ప్రసిద్ధిగాంచిన భారత రైల్వేల కోసం నిరంతరం పనిచేసే పాకీ పనివాళ్ళు. అయితే ఇప్పటికీ వీళ్ళ ఉనికికి బయటెక్కడా గుర్తింపు వుండదు. ఏ భారతీయ పేరుతో పిలిచినా పలుకుతారు. ఏ రాష్ట్రం నుంచయినా వచ్చుండొచ్చు. దేశంలోని ఏ రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫారమ్ అయినా అయివుండొచ్చు. ఈ దృశ్యం మాత్రం సర్వవ్యాపితం. కదులుతున్న లేదా ఆగివున్న రైళ్ళనుంచి కిందపడే మనుషుల పియ్యిపెంటలను ఎత్తివేయటానికి మనుషులను ఉపయోగించటం తప్ప ఇప్పటివరకూ వేరే ప్రత్యామ్నాయమేదీ లేదు.

మన కళ్ళముందు నిరంతరం కనిపించే ఈ చేదునిజాన్ని ఎవరూ కాదనలేరు. ప్రతి రోజు 2.3 కోట్లమందిని గమ్యస్థానాలకు చేర్చే రైళ్ళలో రోజువారీ కనిపించే దృశ్యమిది. (ఆధారం: రైల్వేబడ్జెట్ 2012-13). ఇంత కఠోర వాస్తవం కళ్ళెదురుగా వున్నాగానీ సుప్రీంకోర్టులోనూ, ఢిల్లీ హైకోర్టులోనూ నడుస్తున్న ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సమాధానంగా రైల్వేశాఖ తాము పాకీవాళ్ళను పనిలోకి తీసుకోవటంలేదని, గత పది సంవత్సరాలుగా (2003) తన అఫిడవిట్‌లో చెబుతూనే వుంది. ఒకేఒక్కసారి 2005లో పాకీ పనివాళ్ళ ఉనికి వుందని రైల్వేశాఖ ఒప్పుకోవలసి వచ్చింది. అయితే ఆ వెంటనే మాట మార్చేసింది. అధికార యంత్రాంగం తనకున్న విస్తృతఅధికారాలను ఉపయోగించి పాకీపని నిర్మూలనకు కృషి చేయాల్సింది పోయి, అసలు దాని ఉనికే లేదని బుకాయించ డానికి తన శక్తియుక్తులు ఉపయోగించింది. వాస్తవమేమంటే రైల్వేశాఖ పారిశుద్ధ్య కార్మికులు లేదా పాకీవాళ్ళని నేరుగా పనిలోకి తీసుకోదు- వాళ్ళు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తారు. అందుకే వాళ్ళ ఉనికి ఏ రిజిష్టరులోనూ నమోదు కాదు. ఈ పద్ధతినే వాళ్ళు రక్షణ కవచంగా ఉపయోగించుకుంటున్నారు.

ఈ తప్పుడు ధోరణితో రైల్వే వ్యవస్థ తమ దగ్గరవున్న కార్మికులలో అస్సలు పాకీ పనివాళ్ళు లేనేలేరని నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతూ వస్తోంది. నిజానికి చాలా ప్రాంతాల్లో కొంతమంది రైల్వే ఉద్యోగులు పాకీపనే చేస్తారు. వారిని అధికారికంగా సఫాయివాలీలుగానే పిలుస్తారు. రైల్వేశాఖ నియమించుకున్న సఫాయివాలీలు రైల్వేకట్టల మీదపడే పియ్యి పెంటలను ఎత్తిపోస్తూ వుండగా-పంజాబ్‌లోని లూధియానా, జలంధర్, రాజస్థాన్‌లోని అజ్మీర్, నసీరాబాద్, హర్యానాలోని అంబాలా, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, తెలంగాణ ప్రాంతంలోని సికింద్రాబాద్, కర్నాటకలోని గుల్బర్గాలలో నేను ప్రత్యక్షంగా చూశాను.

ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సాగుతున్న కాలంలో సఫాయి కర్మచారి ఆందోళన్ ఇలాంటి ఎంతో మంది సఫాయివాలీలతో తాము రైల్వేల కోసం పాకీపని చేస్తున్నామన్న వాంగ్మూలాలను నమోదుచేసి కోర్టుకి సమర్పించింది. రైల్వేల కోసం వీళ్ళు చేసే పాకీపని కాంట్రాక్టు పద్ధతిలోనా లేక శాశ్వత ప్రాతిపదికనా అనేది ఇక్కడ ప్రధానం కాదు. వాళ్ళు ఎవరైనా గానీ రైల్వేకట్టల మీద నుంచి మనుషుల పియ్యిపెంటలను చేతులతో ఎత్తి శుభ్రంచేస్తున్నారా లేదా అనేదే అసలు ప్రశ్న! 1993లో పాకీ పనిని నిర్మూలించటానికి రూపొందించిన చట్టం కాంట్రాక్టు పనివారికీ, రోజు కూలీలకూ, శాశ్వత ఉద్యోగులకు మధ్య ఏ విధమైన భేదాన్ని చూపించలేదు. చట్టవిరుద్ధమైన ఈ పాకీ పనిని ఎవరైనా ఆచరిస్తున్నారా లేదా అనేదే ప్రధానం. అంతేకాకుండా పాకీపని చేసిన వాళ్ళకు ఆత్మగౌరవంతో కూడిన ప్రత్యామ్నాయ పునరావాసాలు కల్పించటం కూడా రాజ్యవ్యవస్థ బాధ్యత అని కోర్టు స్పష్టంగా పేర్కొంది. మామూలు మాటల్లో చెప్పాలంటే రైల్వేశాఖ ఈ అంశం నుంచి తప్పించుకోవాలనుకోవటమో లేదా ఇందులో తన బాధ్యతేమీ లేదని చేతులు దులిపేసుకోటమో కుదిరే పని కాదు. రైల్వేకట్టల మీది నుంచి పియ్యిపెంటను యాంత్రిక పద్ధతిలో ఎత్తిపోసే విధానాన్ని రూపొందించుకోవలసిందే. రైల్వేశాఖలో ఈ దారుణ పనికి సంబంధించిన గణాంకాలు తెలుసుకుంటే తల తిరిగిపోతుంది. దేశ వ్యాప్తంగా రోజు 12,000 రైళ్ళు వివిధ స్టేషన్‌లలో ఆగుతూ ప్రయాణిస్తూ వుంటాయి. బోగీలలో వుండే పాకీదొడ్లు నిరంతరం వాడుకలో వుంటూ, విసర్జిత పియ్యిపెంటలన్నీ రైలుకట్టల మీదే పడుతుంటాయి. ఈ మురికినంతా మనుషులు శుభ్రం చేయకపోతే, ఎవరు చేస్తున్నట్టు? ఈ పియ్యిపెంటను ఎత్తివేసే విధానానికి ప్రత్యామ్నాయం ఏమిటన్న ప్రశ్నకు భారత రైల్వేశాఖ సరైన సమాధానం ఇవ్వలేకపోయింది. పోనీ, యాంత్రిక పద్ధతిని ప్రవేశపెట్టే విషయంలో ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

కనీసం రైళ్ళలో బయోటాయిలెట్ల నిర్మాణం కూడా చేపట్టలేదు. మరలాంటప్పుడు వీటిని ఎవరు శుభ్రం చేస్తున్నట్లు? అసలు వాస్తవాన్ని మరుగుపరిచి సంవత్సరాల తరబడి ఒకే విషయం మీద ఎలా రొడ్డకొట్టుడు వ్యవహారం నడపొచ్చో, ప్రజాస్వామ్యంలో ఏ విషయాన్నైనా ఎలా ముసుగులో కొనసాగించవచ్చో రైల్వేలో పాకీపని కథతో మనకు అర్థమైపోతుంది. చివరాఖరికి విషయం ఇంతవరకూ వచ్చినా ఫలితం శూన్యం. కుళ్ళి కంపుకొట్టే రైల్వేల ఈ మురికి కథతో నెమ్మదిగా గతంలోకి ప్రయాణిద్దాం.

2012లో ఢిల్లీ హైకోర్టులో భారతరైల్వేలు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, దేశంలోని 9 రైళ్ళలో 504 బయో టాయిలెట్లను అమర్చారు. అంటే కేవలం 9 రైళ్ళ నుంచే మురికి పియ్యిపెంట ఏదీ రైల్వేకట్టల మీద పడటంలేదు. అయితే, మరి ఎన్ని రైళ్ళు ఈ కట్టల మీద పియ్యి పెంటలను వదులుతున్నట్లు? 19,000 రైళ్ళు ప్రతిరోజూ ప్రయాణిస్తుంటాయి. ఇందులో ప్రయాణికులతో తిరిగేవి 12,000. ఎంత లేదన్నా 59,279

ప్రయాణీకుల బోగీలు (ఆధారం: రైల్వేబడ్జెట్ 2011-12) ప్రతిరోజూ పట్టాల మీద వుంటాయి. వీటిలో కేవలం 504 బోగీలు మాత్రమే పట్టాల మీదికి ఏ మురికినీ వదలటం లేదు, కానీ 58,775 బోగీల నుంచి మాత్రం విసర్జన జరుగుతూనే వుంది. దీనిని ఆధునీకరించుకోవటానికి రైల్వేల దగ్గర ఏ విధమైన ప్రణాళికా లేదు. 1853లో మొదటిసారి ముంబాయి-థానే మార్గంలో బ్రిటిష్ వారు నడిపించిన రైలు మొదలుకుని నేటి వరకూ కూడా చెప్పుకోదగిన మార్పు లెన్నో భారతీయ రైల్వేలలో వచ్చింది. మీటర్‌గేజ్ బ్రాడ్ గేజ్‌గా మారింది. బొగ్గుతో నడిచే ఇంజన్ల స్థానే డీజిల్‌తో నడిచే ఇంజిన్లు, ఆ పిమ్మట కరెంటుతో నడిచేవి వచ్చాయి. గంటకు 40 కి.మీ వేగం నుంచీ గంటకు 150 కిలోమీటర్ల వరకు వేగం పెరిగింది. కానీ ఇన్నేళ్ళలో మారనివి పాకీదొడ్లే. ఇలా ఎందుకు జరిగిందని విశ్లేషించటం చాలా ముఖ్యం. 1993 చట్టం (పాకీ పని కోసం మనుషులను పనిలో పెట్టుకోవటం, డ్రైలెట్రిన్ల నిర్మాణ నిషేధం) ప్రకారం చూస్తే అతిపెద్ద ఉల్లంఘునదారులు భారతీయ రైల్వేలే. ఈ విషయాన్ని గుర్తించటం చాలా ముఖ్యం. ఎందుకంటే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద రైల్వే వ్యవస్థ మనది. 14 లక్షల మంది ఇందులో పని చేస్తున్నారు. 8025 రైల్వే స్టేషన్లు వున్నాయి. 1,31,205 రైల్వే బ్రిడ్జిలున్నాయి - ఘనమైన ఈ వివరాలన్నీ చాటి చెప్పుకోవటానికి రైల్వేశాఖకు అలసటరాదు. (శామ్ పెట్రోడా సారధ్యంలో రైల్వే ఆధునికీకరణకు వేసిన నిపుణుల కమిటీ రిపోర్టు, మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, ఢిల్లీ, 25 ఫిబ్రవరి 2012). పాకీపని అనేది రైల్వే ఫ్లాట్‌ఫారమ్‌ల మీద, రైలు కట్టల మీదే బహిరంగంగా కనిపిస్తున్నప్పటికీ మిరుమిట్లుగొలిపే భారతీయ రైల్వేల అద్వితీయ ప్రస్థానంలో దాని ప్రస్తావనే రాకుండా మరుగుపరచబడింది. అయిన మిరుమిట్లు గొలిపే కాంతిని పియ్యిపెంట అనేదానితో పులమటానికి, తదనంతర పరిణామాలను ఎదుర్కోవటానికి ఎవరు సాహసిస్తారు? ఎవరైనా చేయగలిగితే పాకీ పని ఉనికిని అసలు గుర్తించకుండా తిరిగి తమ అందమైన పట్టుగూడులోకి వెళ్ళి పోవటమైనా చేయాలి. లేదా ఆ దారుణాన్ని ఆపేందుకు చర్యలు తీసుకోవటమైనా చేయాలి. ఇది కేవలం ప్రాధాన్యతలకు సంబంధించిన అంశమే. తమ వ్యవస్థలో పాకీపనిని నిర్మూలించటం అనేది భారతీయ రైల్వేలకు అప్రధాన విషయమని రుజువయిపోయింది. అయితే ఆ శాఖ తనను తాను ఒక సామాన్యమైన ప్రశ్న వేసుకోవాలి. ప్రతిరోజూ రైలు బోగీల నుంచి రైలు కట్టల మీదకి పడుతున్న మానవ విసర్జితాలను శుభ్రం చేయటానికి మనుషులతో బలవంతంగా పని చేయించకుండా మరే విధంగా చేయగలుగుతాం అని?

ఈ తప్పుడు విధానాన్ని సరిచేసే క్రమంలో మొత్తం దృష్టి అంతా బయోటాయిలెట్ల నిర్మాణంపై రైల్వే వ్యవస్థ పెట్టింది. రైల్వేలకు ప్రతి సంవత్సరం 4500 రైలు బోగీలు అవసరమవుతాయని ఒక అంచనా. అవి తయారు చేయటానికి కేవలం రెండే రెండు ఫ్యాక్టరీలు వున్నాయి. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సిఎఫ్) కపుర్తలా, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ

(ఐసిఎఫ్), చెన్నై. ఈ రెండూ కూడా ఆధునిక రైలుపెట్టెలను బయోటాయిలెట్లతో నిర్మిస్తున్నాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) అందిస్తోంది. ఈ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ కింద పనిచేస్తుంది. ఇంతకు ముందు సియాచిన్ ఔట్‌పోస్టుల దగ్గర బయోటాయిలెట్లను ఉపయోగించేవాళ్ళు. ఇప్పుడు రైలు పెట్టెల తయారీలో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. వీటి సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 2016-17 నాటికి రైల్వే వ్యవస్థ 4000 బోగీల రూపకల్పనను లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రకారం చూస్తే రైల్వేశాఖ ఉపయోగించే రైలు బోగీలన్నీ బయోటాయిలెట్లు కలిగిన బోగీలుగా మార్చాలంటే ఎంతకాలం పడుతుందనేది మరీ ఎక్కువగా ఆలోచించాల్సిన చిక్కులెక్కేంకాదు. 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయగలుగుతామని రైల్వేశాఖ ధీమాగా వుంది కానీ అనుకున్నంత వేగంగా పనులు జరుగుతాయనే భరోసా ఏమాత్రం లేదని పరిస్థితులు స్పష్టంచేస్తున్నాయి. ఈ భయానికి హేతుబద్ధమైన కారణాలు కనిపిస్తున్నాయి. వాదన కోసమే అనుకున్నా గానీ, 2025 వరకూ రైల్వేల్లో పాకీపని కొనసాగుతూ వుంటుందనేది మాత్రం స్పష్టమవుతూనే వుంది. అయితే ప్రధాని మన్మోహన్‌సింగ్ 2012 నాటికల్లా పాకీ పనిని పూర్తిగా నిరోధిస్తామన్నట్టుగా ప్రకటించటం గమనార్హం.

రైల్వేశాఖ ఏమి చెప్తున్నప్పటికీ పాకీ పనివాళ్ళను ఆ పని నుంచి బయటపడేయడానికి ఆ శాఖకు ఏమాత్రం తొందరలేదని అర్థమైపోతూనే వుంది. దశాబ్ద కాలంసాగే ప్రణాళికలు రచించిన ఆ శాఖ ఉదాశీన వైఖరితోనే ఇది స్పష్టంగా బయటపడింది. (బహుశా ఆచరణలో ఇది దశాబ్దం కంటే ఎక్కువ కూడా పట్టొచ్చు). అయినప్పటికీ కోర్టు ముందు సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం అసలు తన వ్యవస్థలోనే పాకీ పనివాళ్ళు లేనేలేరని చెప్తూనే వుంటుంది. 1993 చట్టం అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో వేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్) విచారణలో భారతీయ రైల్వేలను కూడా ప్రతివాదులుగా చేర్చారు. ఈ వాజ్యం 2003లో దాఖలుచేయటం జరిగింది. ఆ తర్వాత ఇదే అంశం మీద భారతీయ రైల్వేల మీద వేసిన కేసు ఢిల్లీ హైకోర్టులో 2011 నుంచి సాగుతూనే వుంది. ఇన్ని సంవత్సరాలుగా భారతీయ రైల్వేల వైఖరిలో ఏ రకంగానూ గుణాత్మకమైన మార్పు రాలేదు. ప్రతిసారీ ఆధునీకరణ వైపుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి, తొందరలోనే పాకీపనిని రూపుమాపుతాం అనే ఒకేరకమైన కథనం వినిపిస్తూవుంటుంది. 2013 సంవత్సరంలో మనుషులతో కాకుండా యాంత్రీకరణతో రైల్వే కట్టల మీది నుంచి మానవ విసర్జితాలను శుభ్రంచేస్తున్నామని ఏ ఒక్క రైల్వే స్టేషనూ ప్రకటించలేదు.

## మారుతున్న ప్రకటనలు

రైల్వే బోగిలలోని పాకీదొడ్ల నుంచి పడే మానవ విసర్జితాలను ఆపగలిగే పరిజ్ఞానం ఇప్పటివరకూ తమ దగ్గర లేదని భారతీయ రైల్వేశాఖ 2005లో చెప్పింది. సాధారణంగా

రైల్వే స్టేషన్ల దగ్గర వుండే కట్టలు కంకరరాళ్ళతో నిండివుంటాయి కనుక కేవలం పాకీ పనివాళ్ళు మాత్రమే చేతులతో అక్కడ శుభ్రం చేయగలుగుతారనీ, ఇకపై ఆ స్థానంలో సిమెంటుతో దిమ్మెలు చేయిస్తామనీ చెప్పింది. కంకరరాళ్ళకు బదులు సిమెంటు దిమ్మెలు చేయిస్తే, ఒక రైలు వెళ్ళిన తర్వాత అక్కడ వున్న విసర్జితాల మీద నీటి జెట్‌పంపులను ఉపయోగించి దాన్ని తొలగిస్తామనీ, ఇక అప్పుడు మనుషులు చేతులు ఉపయోగించి ఎత్తివేసే అవసరమే వుండదని చెప్పింది. అలానే పాకీ పనివాళ్ళ కాళ్ళకు గమ్ బూట్లు, చేతులకు గ్లోవ్స్ (తొడుగులు) సమకూరుస్తామనే మాటలు కూడా వినిపించాయి. ఇక్కడ గమనించతగ్గ ముఖ్య విషయమేమంటే, 1963లోనే అంటే యాభై సంవత్సరాల క్రితం మల్కాని మరియు బార్వే కమిటీలు పాకీ పనివాళ్ళకు చేతితొడుగులు, గమ్ బూట్లు ఇవ్వాలని సిఫార్సులు చేశాయి. 2005 లో కూడా రైల్వేశాఖ మళ్ళీ ఇదేమాట చెప్తోంది. అంటే దీనర్థం 1963 నుంచి 2003 వరకూ ఈ దిశగా ఏ ప్రయత్నమూ జరగలేదు. ఈ సమస్యకు రైల్వేశాఖ దగ్గర ఏ పరిష్కారమూ లేదు. ఎందుకంటే అసలు ముందుగా దీన్నొక తీవ్రమైన సమస్యగా ఇది పరిగణించటం లేదు కాబట్టి. తన శక్తులను ఉపయోగించి ఈ మురికినంతా చాపకింద దాచేసే ప్రయత్నమే చేస్తోందే తప్పించి దీన్ని పూర్తిగా నిర్మూలించటానికి చిత్తశుద్ధి చూపడంలేదు.

2007 గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 8025 రైల్వే స్టేషన్లు వున్నాయి. 2005-06 సంవత్సరానికి 50 కోట్ల రూపాయల ఖర్చుతో 46 రైల్వే స్టేషన్‌లలో, 2006-07 సంవత్సరంలో 22.3 కోట్ల రూపాయలతో వ్యయంతో 21 రైల్వే స్టేషన్లలో సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేస్తానని కోర్టు ముందు సమర్పించిన అఫిడవిట్‌లో రైల్వేశాఖ పేర్కొంది. దీనికి కొనసాగింపుగా 2012-13 సంవత్సరానికి 538 ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేస్తామని చెప్పుకుంది.

ఇప్పుడు అసలు గణాంకాలను చూద్దాం. తాను సమర్పించిన అఫిడవిట్ ప్రకారమే 538 రైల్వేస్టేషన్లలో 2012-13 సంవత్సరానికి సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేసి వుండాలి. మొత్తం రైల్వేస్టేషన్ల సంఖ్య 8025. ఈ పనిని 2005-06 నుంచి ప్రారంభిస్తే కేవలం 538 స్టేషన్లలో ఈ ఏడేళ్ళ కాలంలో మార్పు జరిగింది. ఈ లెక్కన చూస్తే 8025 రైల్వేస్టేషన్లను మార్చటానికి రైల్వేశాఖ ఎంత సమయం తీసుకుంటుంది? లెక్క చాలా సులభం-తొంభై ఎనిమిది సంవత్సరాలు. అంటే ఈ విషయాన్ని రైల్వేలకే వదిలేస్తే ఇంకో వంద సంవత్సరాల పాటు కొంత మంది మనుషుల చేతులు రైల్వే కట్టల మీద పడే మురికి, కుళ్ళు విసర్జితాలను శుభ్రం చేస్తూనే వుంటాయి. పాకీ పనిని నిషేధించిన చట్టం అనేది రైల్వేశాఖ దృష్టిలో చాలా చిన్న అంశం. అది ఆ వ్యవస్థ మీద ఏ మాత్రం ప్రభావం చూపలేదు. ఇది పచ్చి వాస్తవం. కేవలం రైల్వేలకే కాదు ప్రభుత్వానికి కూడా.

ఇప్పుడు సిమెంట్ దిమ్మెలను ఏర్పాటుచేసిన రైల్వే స్టేషన్ల విషయానికి వద్దాం. ఎక్కడో దూరాన వున్న ఉత్తరప్రదేశ్, బీహార్, చెన్నై, తమిళనాడు, పంజాబ్, హర్యానా

లాంటి వాటి దగ్గర్నుంచి ఎందుకు మొదలుపెట్టాలి? దేశ రాజధానిలోనే అనేక రైల్వేస్టేషన్లలో సిమెంటు దిమ్మెల ఏర్పాటులో లొసుగుల్ని బయట పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. క్షేత్రస్థాయిలో వాస్తవమేమిటంటే... నిజానికి ఈ అధ్యాయం ప్రారంభంలోనే చెప్పినట్లు ఈ అనుమానాలన్నీ నివృత్తి చేయటానికి అనేక ఫొటోలు వున్నాయి. ఆనంద్ విహార్ రైల్వేస్టేషన్ కావొచ్చు లేదా న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ కావొచ్చు. పాకీ పనివాళ్ళు చీపుర్లతో రైలు కట్టలను శుభ్రం చేయటం ప్రతిచోటా కనిపిస్తూనే వుంటుంది. జెట్ పంపులను ఎందుకు ఉపయోగించటం లేదని వారిని అడిగితే, నీళ్ళ పంపులతో పియ్యిపెంటనంతా శుభ్రం చేయటం కుదరదని, చీపురు ఉపయోగించవలసిందేననీ సునీల్ చెప్పాడు. ఈ పియ్యిపెంట, నీళ్ళు ప్రవహించడానికి ఏర్పాటు చేసిన డ్రైనేజీలు రైల్వే కట్టల పక్కనే ఇరుకుగా సన్నగా వుంటాయి. అవి తరచూ నిండిపోయి మొత్తం ఎక్కడికక్కడ నిలిచిపోతాయి. నీళ్ళ పైపుల సంగతి పక్కనపెడితే, ఈ కాల్వలను చీపుర్లతో శుభ్రం చేయటమనేది అసాధ్యం. చెన్నై ఎగ్మోర్ రైల్వేస్టేషన్‌లో పెద్దసంఖ్యలో ఆడవాళ్ళు రైలుకట్టలను శుభ్రం చేస్తూండటాన్ని మనం చూడొచ్చు. ఒకామె ప్లాస్టిక్ బిందెతో నీళ్ళు తెచ్చి పోస్తుంటే, ఇంకొకామె చీపురుతో ఆ పియ్యిపెంటను మురికి కాల్వలోకి ఊడ్చేస్తూ వుంటుంది. ఎంతో గొప్పగా చెప్పుకున్న సిమెంటు దిమ్మెల ఏర్పాటు తర్వాత కనిపించిన చేదు వాస్తవమిది. ప్రస్తుతం రైల్వేశాఖ ఈ సిమెంట్ దిమ్మెల గురించి మర్చిపోయి ఇప్పుడు కనీసం వాటి ఊసు కూడా ఎత్తటం లేదు. వీటి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టిన తర్వాత ఈ విధానం వల్ల ఏ ప్రయోజనం లేదనే విషయాన్ని గ్రహించింది. ఇన్ని రకాల ప్రయోగాల నేపథ్యంలో దేశమంతటా వున్న రైల్వే కట్టల మీద నిరాటంకంగా పాకీపని ఇంకా కొనసాగుతూనే వుంది.

2006లో సుప్రీంకోర్టుకి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్న ఖరీదైన సిమెంట్ దిమ్మెల ప్రయోగం విఫలమైన తర్వాత రైల్వేశాఖ ప్రస్తుతం 'నియంత్రణ పాకీదొడ్ల వ్యవస్థ' (కంట్రోల్డ్ డిశ్చార్జ్ టాయిలెట్ సిస్టమ్– సిడిటిఎస్) గురించి మాట్లాడుతోంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం రైలుపెట్టెల్లో వుండే పాకీదొడ్లలో విసర్జించే పియ్యిపెంటలను రైలుకట్టల మీద పడేటట్లుగా కాకుండా బోగీల కింది భాగంలో వుండే ట్యాంకుల్లోకి జమచేస్తారు. రైల్వేస్టేషను దాటిన తర్వాత రైలు గంటకు 60 కి.మీ. వేగం పుంజుకున్న సమయంలో డ్రైవర్లు ఆ ట్యాంకులను తెరుస్తారు. ప్రతి బోగీకి జతచేసి వుండే ఈ ట్యాంకులన్నీ తెరుచుకుని వాటిలో వుండే మురుగు పదార్థమంతా రైలుకట్టల మీదకి పడిపోతుంది. రైల్వేస్టేషన్లకు దూరంగా రైలుకట్టల మీదికి ఈ పెంటనంతా పడేస్తే, అది అక్కడే ఎండిపోయి ఇక శుభ్రంచేసే పని వుండదనేది రైల్వేశాఖ ఆలోచన. ప్రతి సంవత్సరం 1000 బోగీల్లోని పాకీదొడ్లను 20 కోట్ల ఖర్చుతో ఈ సిడిటిఎస్‌లోకి మారుస్తామని ఆ అఫిడవిట్‌లో రైల్వేశాఖ పేర్కొన్నది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ సిడిటిఎస్‌లు పర్యావరణానికి హానికరమని రైల్వేశాఖే తన అఫిడవిట్‌లో పేర్కొనటం!

ఎక్కడా ప్రయోగించిచూడని, కనీసం పరీక్షించని ఆలోచనలను రైల్వేశాఖ ఒకదాని తర్వాత ఒకటి ముందుకు తేవటం అనేది అత్యంత దురదృష్టకరమైన విషయం. ఎక్కడైతే సిడిటిఎస్‌లు అమర్చారో, వాటినుంచి బయటకు వచ్చే విసర్జితాలు రైలుపెట్టెల అడుగు భాగానికి అంటుకుపోవటం, గాలివాటు వల్ల రైలుపెట్టెల మధ్యకు, ఒక్కోసారి రైలుపెట్టెల లోపలికి కూడా చొచ్చుకురావడం దృష్టికి వచ్చిన విషయం. దీని అంతటి వల్ల స్పష్టమవుతున్న దేమంటే రైల్వే వ్యవస్థ పాకీపని అనే సమస్యను పరిష్కరించకపోగా ఆ విసర్జితాలను మరింత వెదజల్లుతోంది. ఆ కంపుని ఇంకా ఇంకా విస్తరిస్తూపోతోంది. మరో ముఖ్యమైన విషయం రైలు కట్టల వెంబడి వుండే ప్రాంతాల ప్రజలకు ఇదొక నరకంగా పరిణమించడం. ఇంకా కంపుగొట్టే వాస్తవమేమంటే రైల్వేశాఖ ఈ కుళ్ళు–మురికి పియ్యిపెంటను చాలా ప్రాంతాల్లో మరింతగా పెంచుకుంటూ పోతోంది.

రైల్వేశాఖకు గానీ, ప్రభుత్వానికి గానీ ఈ విషయాలు తెలియవనుకోవడానికి లేదు. ఇలా వెదజల్లుతున్న మానవ మురికి విసర్జితాల వల్ల రైలుకట్టలు పాడవుతున్నాయని, ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా ఇప్పుడున్న పాకీదొడ్ల స్థానంలో ఆధునిక, సురక్షిత బయోటాయిలెట్లను నిర్మించాలని రైల్వేశాఖ నియమించిన అనేక కమిటీలు చెప్పాయి. సురక్షిత రైల్వేల కోసం నియమించిన అత్యున్నత అనిల్ కకోద్కర్ కమిటీ తన రిపోర్టులో ఈ అంశంపై స్పష్టమైన సిఫార్సు చేసింది. 2012 ఫిబ్రవరిలో ఇచ్చిన తన రిపోర్టులో (పే.117 నెం.9.6) 'వచ్చే ఐదు సంవత్సరాలలో మొత్తంగా వున్న 43,000 రైలు బోగీలలోని పాకీదొడ్ల నుంచి విసర్జితాలు అసలు బయటకు రానివిధంగానో లేదా నిరపాయకరంగా విసర్జితాలు వుండటమో జరగాలి' అని ఆ కమిటీ పేర్కొంది. 2011 లో ప్రధానికి సాంకేతిక సలహాదారైన సామ్ పిట్రోడా నేతృత్వంలో మరొక కమిటీని ఏర్పాటు చేశారు అప్పటి రైల్వేశాఖ మంత్రి దినేష్ త్రివేది. రైల్వేలను ఎలా ఆధునీకరించాలనే సిఫార్సులను చెప్పే బాధ్యత ఈ కమిటీకి అప్పగించారు. ఈ కమిటీ తన రిపోర్టును 2012 ఫిబ్రవరి 25న రైల్వేశాఖ మంత్రికి అందజేసింది. ఈ కమిటీ కూడా వెంటనే బయో–టాయిలెట్ల నిర్మాణం అత్యంత ఆవశ్యకం అని చెప్పింది. అప్పటినుంచీ ఈ రిపోర్టును తొక్కిపెట్టి వుంచారు. ఈ రోజుకి కూడా రైలు బోగీలలోని పాకీదొడ్ల స్థానంలో బయో టాయిలెట్లను ఎప్పుడు ఎలా అమర్చుతారనే అంశంపై రైల్వేశాఖకు ఏ విధమైన ప్రణాళికా లేదు.

ఈ రిపోర్టు అనంతరం రైల్వేశాఖ తమ దృష్టి మొత్తాన్ని బయోటాయిలెట్ల వైపు తిప్పింది. బయోటాయిలెట్ అంటే రైలుపెట్టెలో వున్న పాకీదొడ్డికి ఒక ట్యాంక్‌ని జత చేస్తారు. దానిలో కొన్ని ఎంజైములను, బాక్టీరియాను వుంచుతారు. అవి ఆ ట్యాంకులో పడే విసర్జితాలను అవిశిపోయేట్లు చేస్తాయి. అయితే రైల్వేశాఖ ఇప్పటివరకూ ఈ అవిశిపోయిన చెత్తను ఏ విధంగా తొలగిస్తుందనే అంశంపై ప్రజలకు సమాచారం అయితే

ఇవ్వలేదు. ఈ బయోటాయిలెట్లు ఎలా పనిచేస్తాయనే దానిపై పలు సందేహాలు వ్యక్తమయినప్పుడు ఢిల్లీ హైకోర్టు ఈ విషయం మీద విచారణకు ఇద్దరు సీనియర్ అటార్నీలు రాజీవ్‌నందా, పి.ఎస్.నర్సింహలను అమికస్ క్యూరీలుగా నియమించింది. రేవా ఎక్స్‌ప్రెస్‌లో పెట్టిన బయోటాయిలెట్లు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించటంతో పాటు, ముందుగా వీటిని ఎందుకు ఏర్పాటు చేశారో ఆ ప్రయోజనం నెరవేరిందో లేదో కూడా విచారించాలి. అయితే, రైలును అసలు చూడకుండానే అమికస్ క్యూరీ తమ మొదటి రిపోర్టును సమర్పించారు. దానితో కోర్టు వారిని ఆ రైలులో ప్రయాణించిన తర్వాతే రిపోర్టును సమర్పించాలని ఆదేశించవలసి వచ్చింది. వాళ్ళు ఇచ్చిన తుది రిపోర్టులో ఈ బయో టాయిలెట్‌లో రాళ్ళు గానీ, బట్టలు గానీ పడేస్తే అది ఇంక పనిచేయదని తేల్చి చెప్పారు. అంతే కాకుండా, వీటిలో ఏదో ఒకటి అవరోధంగా మారే అవకాశాలే ఎక్కువ. అలా ఏదైనా అడ్డుపడినప్పుడు, సదరు టాయిలెట్ మనుషుల ప్రమేయం లేకుండా తెరుచుకోవటం అసాధ్యం. దీనర్థం ఏమిటంటే బయోటాయిలెట్లు అనేవి మరీ అంత సాంకేతికసమన్వితంగా, సున్నితంగా ఏమీ పనిచేయవు. ఇలాంటి ప్రశ్నలు ఉన్నప్పటికీ రైల్వేశాఖ బయోటాయిలెట్ల నిర్మాణం వైపు నెమ్మదిగా కదులుతోంది. అమిత వేగంగా నడిచే రాజధాని లాంటి రైళ్ళలోనే ప్రస్తుతం ఈ సౌకర్యం అందుబాటులోవుంది. ఈ అంశంపై కోర్టులో విచారణ జరుగు తుండగానే, రైల్వేకట్టల మీద ఎంత దూరంవరకూ ఈ పాకీ పనివాళ్ళు శుభ్రం చేస్తున్నారు? ఏఏ పరికరాలు వారి రక్షణ కోసం ఇవ్వబడ్డాయి? ఎంత జీతం వారికి వస్తోంది? (నిజానికి చాలా మంది కాంట్రాక్ట్ పద్ధతిలోనే చేస్తున్నారు) - వంటి అనేక అంశాలను ముందుకు తేవడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించడానికి రైల్వేశాఖ ప్రయత్నించింది. ఇవన్నీ కూడా అసలు సమస్యకి ఆవల వుండేవే. వాస్తవానికి రైల్వేశాఖ బాధ్యతేమిటంటే పార్లమెంటుచే ఆమోదించబడిన 1993 పాకీపని నిషేధ చట్టాన్ని అమలుచేయడం. ఈ చట్టం ప్రకారం పాకీపని చేయటం కోసం ఎవరినైనా పనిలో పెట్టుకోవడమనేది నేరం. చేసిన తప్పును సమర్థించు కోవాలనుకోవటం అసలు నేరం కన్నా ఇంకా తీవ్రం.

దేశ నాయకత్వం అమానవీయమైన ఈ పాకీ పనిని ఇంకా కొనసాగించే విషయంలో ఎంత దృఢచిత్తంతో వుందో తెలుసుకోవాలంటే ఢిల్లీ హైకోర్టులో రైల్వేశాఖ సమర్పించిన అఫిడవిట్లను చదివితీరాలి. నవంబరు 2012లో రైల్వేశాఖ సమర్పించిన అఫిడవిట్‌లోని కొన్ని భాగాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను:

## 2.1 (ఎ) 2012-13 మధ్యలో...

2012-13 మధ్య కాలంలో 2500 రైలుపెట్టెల్లో బయో-టాయిలెట్లను అమర్చాలని భారతీయ రైల్వే ప్రణాళికలో వుంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి అవసరమైన కొత్త రైలుపెట్టెలు ఆర్‌సిఎఫ్, ఐసిఎఫ్, బిఇఎమ్ఎల్‌లలో తయారవుతాయి. వీటిలో బయో

టాయిలెట్లను అమర్చుతారు. ఏ అడ్డంకులూ ఎదురుకాకపోతే ప్రస్తుతమున్న అన్ని రైలు బోగీలలో కూడా బయోటాయిలెట్లను అమర్చుతారు.

**(బి) దీర్ఘకాలికం:**

2016–17 నుంచి తయారయ్యే అన్ని కొత్త బోగీల్లోనూ బయోటాయిలెట్లు వుండేలా ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఏ అడ్డంకులూ ఎదురుకాని పక్షంలో 2021–22 నాటికి రైల్వేశాఖ తన లక్ష్యాన్ని చేరుకోవటానికి అంగీకరించినట్లు మనం ఇక్కడ గమనించవచ్చు. అయితే తర్వాతేం చెబుతున్నారో చూడండి:

2.3 ఇతర రైల్వే వ్యవస్థలు అనుసరిస్తున్న అత్యంతాధునిక సాంకేతిక పద్ధతులను భారతీయ రైల్వే స్వీకరిస్తోంది. ఉదాహరణకు కంట్రోల్డ్ డిశార్జ్ టాయిలెట్ సిస్టమ్ – అయితే ఇది పాక్షికంగానే విజయవంతమైంది. బయోటాయిలెట్లకు సంబంధించిన వస్తువులు దొంగతనానికి గురికావటం, పెద్ద స్టేషన్లను సమీపించే ముందు నెమ్మదిగా ఎక్కువసేపు వెళ్ళాల్సిరావటం వల్ల టాయిలెట్ల వాడకానికి అవరోధాలు ఏర్పడటం, ఈ కంట్రోల్డ్ డిశ్చార్జ్ టాయిలెట్ సిస్టమ్‌లో మానవ విసర్జితాల వల్ల ట్యాంకు నిండిపోతే దాని నిర్వహణలో సమస్యలు తలెత్తటం వంటి అంశాలను కూడా రైల్వేశాఖ ప్రస్తావించింది.

అఫిడవిట్‌లో ఆ తర్వాతి మూడు అంశాలలో భారతీయ రైల్వే ఈ సమస్యను ప్రయాణీకుల పైకి నెట్టేసింది. బయో–టాయిలెట్లను ఎలా వాడాలో ప్రయాణీకులు నేర్చుకోవాలని చెప్పింది. ఈ నాటకమంతా దేనికోసమూ అంటే అసలు విషయంలోకి రావడానికే.

2.7 ఈ బయో–టాయిలెట్ కోసం ప్రతి రైలుపెట్టె కింది భాగంలో 500 కేజీల బరువు వుండే ట్యాంకులను అమర్చాలి. అంతకంటే ముందు ఆయా రైలుపెట్టెల నమూనా కాలపరిమితిని దృష్టిలో పెట్టుకుని మార్పులు చేర్పులు చేపట్టాల్సి వుంటుంది. ఇందుకోసం అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణులు కావాల్సి వుంటుంది.

2.8 ఇప్పటికే వినియోగంలో వున్న రైలుపెట్టెల్లో బయో–టాయిలెట్ ట్యాంకులను అమర్చాలంటే ముందుగా వాటి కాలపరిమితిని సమీక్షించాల్సివుంటుంది.

ఈ విషయాలపట్ల ఎన్నో అనుమానాలు వుండటంతో రైల్వేమంత్రి గానీ, రైల్వేబోర్డు గానీ లేదా కోర్టులో అఫిడవిట్లు సమర్పిస్తున్న అధికారులు గానీ ఈ ప్రయోగం ఎంతవరకూ విజయవంతమౌతుందనే అంశమై ఏ రకంగాను పూచీపడే పరిస్థితిలో లేరు. ఈ బయోటాయిలెట్ల ప్రయోగం విఫలమైతే లేదా ఆచరణలో సాధ్యం కాకపోతే రైల్వేశాఖ గానీ, ప్రభుత్వం గానీ ఏవిధంగా ఆ నింద తమపై పడకుండా ఎలా తప్పించుకుంటారన్న దానికి ఈ అఫిడవిట్‌లోని ప్రతి పదం అద్దంపడుతుంది. వాళ్ళు కేవలం తమ గురించి మాత్రమే ఆలోచించుకుంటున్నారు తప్పించి, ఈ మొత్తం సమస్య పట్ల ఏవిధమైన ఆసక్తి గానీ, సహానుభూతి గానీ వారికి లేదు. ఈ అఫిడవిట్ వల్ల భవిష్యత్‌లో తమకు ఏ

సమస్యా రాకుండా మాత్రం జాగ్రత్తపడ్డారు. గత పది సంవత్సరాలుగా పాకీపని నిషేధ చట్టం గురించి సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా అందులో ప్రతివాదులుగా వున్న రైల్వేశాఖ నుంచి ఎదురైన స్పందన ఇది. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా రైల్వేకట్టల మీద మానవ విసర్జితాలు పడకుండా చూసే ఒక నమూనా కానీ, సాంకేతిక పరిజ్ఞానం గానీ రైల్వేశాఖ సంతరించుకోలేదు. కోర్టులో సమర్పించిన అఫిడవిట్లను నిశితంగా పరిశీలిస్తే రైల్వేశాఖలోని ఈ వైరుధ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

2004లో సుప్రీంకోర్టుకి సమర్పించిన అఫిడవిట్‌లో 'పాకీపనిని పూర్తిగా నిర్మూలించడమనేది అసాధ్యమని' (పే.783) రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. 2005 ఏప్రిల్– నవంబర్‌లలో, 2006 మార్చి–జూలై నెలల్లో అఫిడవిట్లు సమర్పించమని భారతీయ రైల్వేశాఖను సుప్రీం కోర్టు ఆదేశించింది. దానికి సమాధానంగా రెండు అఫిడవిట్లను 2006 మార్చి, ఆగస్టు నెలల్లో సమర్పించారు. ఒకపక్క పాకీపనిని పూర్తిగా నిరోధించటం తమకు సాధ్యం కాదంటూనే, మరోపక్క అసలు తన వ్యవస్థలో ఈ విధానం కొనసాగుతుందన్న వాదనను తీవ్రంగా నిరాకరించింది. "రైల్వే మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని వ్యవస్థల్లో ఎక్కడా పాకీపని అనేది లేదు" అని ప్రకటించింది. ఇదే నిరాకరణ ఈ రోజుకీ నడుస్తోంది. 2012 సెప్టెంబరు 17న ఢిల్లీ హైకోర్టుకి సమర్పించిన మరో అఫిడవిట్‌లో '12)... భారతీయ రైల్వేలో ఎక్కడా పాకీపని అనేది లేదు. యాంత్రీకరణతో శుభ్రం చేయటం కోసం ప్రయివేటు ఏజన్సీలకు కాంట్రాక్టులు ఇవ్వటం జరిగింది. వారు నియమించిన కార్మికులు శాశ్వత ఉద్యోగులు కాదు. ఈ విషయమై వారికి సంబంధించిన రికార్డులేవీ ప్రాంతీయ రైల్వేలు నిర్వహించవు' అని పేర్కొన్నది.

ఈ స్థితిని మార్చటానికి రైల్వేలు ఏ ఒక్క దారినీ తెరిచివుంచలేదు. ఏడేళ్ళ క్రితం పాకీ పనివాళ్ళు అదే పనిచేస్తూ కూడా ఏ విధంగా మరుగున వుండిపోయారో ఇప్పటికీ అదేవిధంగా వున్నారు. ఈ విషయం మీద సఫాయి కర్మచారి ఆందోళన లాంటి సంస్థలు తీసుకువచ్చిన సమష్టి వత్తిడితో పాటు, కోర్టుల్లో వేసిన కేసుల ఫలితంగా రైల్వేశాఖలో ఈ మాత్రపు కనీస కదలిక వచ్చింది. రైలుకట్టల మీదకు మురికి పియ్యిపెంటలను వదిలే బోగీలలోని పాకీదొడ్లలో మార్పుకు శ్రీకారంచుట్టింది. ఈ లక్ష్యం ఎప్పటికి పూర్తవుతుందో, ఈ లోపల సమస్య ఎన్ని మలుపులు తీసుకుంటుందో ఎవ్వరికీ తెలియదు. రైల్వేల రక్షణ అనే అంశాన్ని ఒక కవచంగా ఉపయోగించుకుంటూ దాని నీడలో మనుషులతో పాకీపని చేయించటానికి ఆ శాఖ ప్రయత్నిస్తూ వుంటుంది. అంతేకాకుండా ఈ రకమైన పనులు చేయటానికి కొన్ని వర్గాల మనుషులను కులవ్యవస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా వుంచుతూనే వుంటుంది. కనుక దీని గురించి ఎవరూ రెండో ఆలోచన చేయరు. భారతీయ రైల్వేశాఖ రైలుకట్టలు పాడవుతాయని ఆలోచిస్తుంది తప్పించి, ఈ దేశపౌరుల ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడాలని మాత్రం అనుకోదు. దీని గురించి ఎవరూ గొడవచేయరు. వాళ్ళనసలు మనుషులుగానే గుర్తించరు. కాబట్టే వారితో బలవంతంగా పాకీపని చేయిస్తారు.

ఈ రైల్వేల కోసం పనిచేసే పాకీ కార్మికులకు విముక్తి అనేది ఎప్పటికీ సాధ్యపడే విషయంగా కనిపించటం లేదు. వాళ్ళ ఉనికినే గుర్తించకుండా, రైల్వేశాఖ ఈ అమానవీయమైన పద్ధతిని కొనసాగిస్తోంది. దీన్నిబట్టి చూస్తే ఈ దేశానికి ఎప్పటికీ పాకీ పని నుంచి పూర్తి విముక్తి వుండదేమో!

## ప్రభుత్వం చెప్పే అసత్యాలను బహిర్గతం చేయటం

"ఈ విషయానికి నా మనసులో సన్నిహిత స్థానం వుంది. స్వాతంత్ర్యానంతరం ఇన్నేళ్ళ తరువాత కూడా మనుషులు ఇప్పటికీ ఈ పని చేస్తున్నారనే ఆలోచనే నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. ఈ పాకీ పనిని అంతం చేయటానికి మీకు మీరుగా ముందుకు రావలసిందే గానీ, మీకు సహాయపడటానికి ఎవరూ రారు. అసలెవరైనా సహాయానికి వస్తారని మీరెలా ఆశిస్తున్నారు?' ఈ మాటలన్నది ఏ రాజకీయ విజయాన్నీ అందుకోని, అధికారానికి ఆవల వుండే ఏ సామాన్యవ్యక్తో కాదు. సాక్షాత్తు లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో లోక్‌సభ స్పీకర్‌గా ఎంపికైన మొట్టమొదటి దళిత మహిళ ఆమె. పార్లమెంటరీ రాజకీయాల గురించి సంపూర్ణ అవగాహన వున్న వ్యక్తి. పాకీపని నిర్మూలన విషయమై ఆమెను సంప్రదించడానికి వెళ్ళినప్పుడు తమ తరపున మీరాకుమార్ నిలబడతారని, ప్రధానమంత్రి మీద, సంబంధిత మంత్రి మీద ఏ కొద్ది మాత్రమైనా వత్తిడిని పెట్టగలుగుతారనీ, తద్వారా 1993 చట్టాన్ని కఠినంగా అమలుచేయించటానికి ప్రయత్నిస్తారనీ ఈ ప్రతినిధి బృందం ఆశించింది. అయితే అది మాత్రం జరగలేదు.

సఫాయి కర్మచారి ఆందోళన్ ప్రతినిధి బృందాన్ని లోక్‌సభలోని తన గదినుంచి సాగనంపుతూ ఆమె తనదైన శైలిలో చాలా నెమ్మదిగా, 'భగవంతుడు మీకు సహాయం చేయాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. నిస్సహాయంగా ఆమె చెప్పిన మాటలు నాకు లోలోపల వణుకు తెప్పించాయి. ఆమె అత్యున్నత అధికార వ్యవస్థలో వుంది. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో విజయాన్ని సాధిస్తూ, దళిత సమూహం పక్షాన ముందుకు వెళుతున్న నాయకురాలు ఆమె. వాస్తవానికి దళితుల్లో కూడా అత్యంత వెనుకబడిన వర్గానికి ఈ వ్యవస్థలో ఎవరి వైపునుంచీ సహాయం అందదని ఆమె చెబుతోంది. రాజకీయాల్లో ఎంతో అనుభవం గడించిన మీరాకుమార్ ఈ విధంగా చెప్పటం అసంబద్ధమేమీ కాకపోవచ్చు. ఈ రోజుకీ భారతదేశంలో వేలాది మంది ఆడవాళ్ళు తమ నెత్తిమీద పీతి కంపుగొట్టే బుట్టలను మోస్తూనే వున్నారన్నది మన కళ్ళముందున్న వాస్తవం. కులవ్యవస్థ తనకున్న అపరిమితమైన అధికార బలంతో శతాబ్దాల తరబడి ఒక సమూహాన్ని అమానవీయంగా జీవించేట్లు చేస్తోంది. ఖాళీగా వున్న లోక్‌సభ వరండాల్లోంచి వెనక్కి తిరిగి వచ్చేస్తున్నప్పుడు 'మీరు ఇప్పుడేం చేస్తారు?' అని నేను ప్రతినిధి బృందం సభ్యులను అడిగాను. ప్రతి ఒక్కరూ కూడా పేలవమైన నవ్వుతో ఇక్కడ ఇంతకంటే ఎక్కువేమీ

ఆశించలేదని సమాధానం ఇచ్చారు. అధికారం చేతిలో వున్నవాళ్ళే 'మేమేం చేయ గలుగుతాం? మా చేతుల్లో ఏమీ అధికారం లేదు' అంటున్నారు. లోక్‌సభ స్పీకర్‌కే అధికారం లేకపోతే ఇంక ఎవరికి వున్నట్టు? సిపిఐ రాజ్యసభ సభ్యుడు డి. రాజా కూడా మాతో అక్కడ వున్నారు. ఆయన సహాయంతోనే పాకీ పనివాళ్ళ ప్రతినిధి బృందం మీరాకుమార్‌ను కలవటానికి అనుమతి తీసుకోగలిగారు. మీరాకుమార్ చొరవతో ఈ విషయం పిటిషన్స్ కమిటీ వరకూ వెళ్తుందని, ఆ తర్వాత దీనిపై కూలంకషమైన చర్చ జరిగి, ఆ వత్తిడి ఫలితంగా ప్రభుత్వం సమగ్రమైన సమాధానాన్ని ఇస్తుందని డి.రాజా ఆశించారు. రాజకీయవర్గాల్లో ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల్లో ఈ అంశం పట్ల ఎంతో ఉదాశీనత వుంది. కేవలం వామపక్ష పార్టీలే లోక్‌సభ లోపలా బయటా కూడా ఈ అంశాల గురించి మాట్లాడుతున్నాయి. పాకీపని గురించి కావొచ్చు లేదా దళితుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధుల్లో జరిగిన కుంభకోణాల గురించైనా కావచ్చు.

ఇది కుల, వర్గ ఐక్యతకు సూచిక అవుతుందా? సిపిఐ నాయకుడు డి.రాజా అభిప్రాయం ప్రకారం దళితులు, వామపక్షవాదులు ఒక దగ్గరకు రావటమనేది సహజమైన విషయం. కొన్ని ప్రాంతాల్లో ఈ ఐక్యతకు డి.రాజా కీలకం అయితే, మరోచోట సిపిఐ(ఎమ్ఎల్) లిబరేషన్ నాయకురాలు, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలత స్వామినాథన్ క్రియాశీల పాత్రధారి. ఆమె రాజస్థాన్‌లోని ఝుంఝునులో పాకీపని చేసే ఆడవాళ్ళ కష్టాలను వెలుగులోకి తెచ్చారు. మొత్తంగా ఏ ప్రధాన రాజకీయ పార్టీ కూడా ఈ అంశం మీద అర్థవంతంగా పని చేయలేదనేది సూక్ష్మంగా పరిశీలిస్తే ఎవ్వరికైనా అర్థమైపోతుంది.

ప్రతినిధి బృందంలో భాగంగా వున్న అనూరాధ తన కోపాన్ని అణచుకోలేకపోతోంది. మూసివున్న అధికార కోటల దర్వాజాలను ఎంతో కాలంగా తడుతూవున్నప్పటికీ ఏ ఫలితం రాకపోవటం ఆమె ముఖంలో కనిపిస్తున్న అసహనానికి కారణం. చుట్టూవున్న పరిసరాలను పట్టించుకోకుండా ఆమె మాట్లాడుతూనే వుంది. "ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, దాని మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అబద్ధాలు చెబుతూనే వుంటాయి; మరోవైపు దేశనాయకులు ఈ పరిస్థితి పట్ల తమ నిస్సహాయతను ప్రదర్శిస్తుంటారు. పాకీపని నిర్మూలన విషయం వచ్చేసరికి తమకే మాత్రం అధికారం లేదని అంటారు. ప్రజాసామ్యంలో ప్రజలు నాయకులకు అధికారాన్ని కట్టబెట్టటం అనేది విచిత్రమైన విషయం. అదే ప్రజలు ఈ నాయకుల దగ్గరికి వెళ్ళినపుడు వాళ్ళు తమకేమీ అధికారం లేదంటారు. ఏళ్ళ తరబడి ఈ పరిస్థితిని భరిస్తూనే వున్నాం, ఇప్పుడిక సాధ్యంకాదు..." ఆమె అలా మాట్లాడుతూనేవుంది. ఆమె మాటలు వింటూ లోక్‌సభ వరండాలను దాటుకుంటూ వచ్చి, మేము ఆరుబయట ఆకాశం కింద వున్నామని గుర్తించాం.

అధికారంలో వున్న దళిత నాయకుల వైఖరిని గమనిస్తే, ఈ విధానం ఇంకా కొనసాగటానికి రాజకీయాంశాల బాధ్యత మునుముందు కూడా ఎంత వుంటుందో మనం

అవగతం చేసుకోవచ్చు. విధాన రూపకల్పనలో దళిత నాయకత్వ పాత్ర అతి తక్కువే. అంతేగాక ప్రాథమికంగా దోపిడీ స్వభావంతో కూడుకొని వున్న వ్యవస్థలో కనీసంగా మార్పులు తీసుకురావటం అనేది వారి ప్రాధాన్యతాంశం ఎంత మాత్రం కాదు. దళితుల ఆరాధ్య దైవంగా చెప్పుకునే స్త్రీమూర్తి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన మాయావతి ఈ అంశం మీద ఎప్పుడూ ఏమీ మాట్లాడలేదు. దీన్ని బట్టి స్పష్టమవుతున్నదేమంటే, పాకీపని నిర్మూలన అనే అంశం దళిత అజెండాలోనే లేదని. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడయిన మరో ఆసక్తికరమైన విషయమేమంటే, ఉత్తరప్రదేశ్‌లోనే పెద్ద సంఖ్యలో పాకీ పనివాళ్ళు వున్నారు.

ఇలాంటి అసహ్యకరమైన రొంపిలో బతుకుతుండటంతో ఈ సమూహం మొత్తం నిరంతరం ఆత్మన్యూనతలో కొట్టుమిట్టాడే పరిస్థితులు వున్నాయి. దీనిపై తిరుగుబాటుకాదు కదా, కనీసం అందరూ ఒకచోట చేరి గొంతులు విప్పటానికి కూడా ధైర్యం చాలటం లేదు. భారత ప్రజాస్వామ్యం గురించి ఒక విషయం మాత్రం స్పష్టం. అంచులకు నెట్టివేయబడిన అణగారిన ప్రజలందరూ కలిసి తమ గుర్తింపు, గౌరవాల కోసం పెద్దఎత్తున పోరాటం చేయకపోతే మాత్రం, వారి సమస్యల గురించి ఎవరూ పట్టించుకోరు. కేవలం ఈ సమూహం కలిసికట్టుగా గొంతు విప్పినపుడే, పాకీబుట్టలను తగలబెట్టి, ఊరేగింపులు, ధర్నాలు చేసిన తర్వాతే సమాజంలో అగ్రభాగాన కూర్చున్న వారు కనీసం సమస్యను గుర్తించటం మొదలుపెట్టారు. మంత్రులు, అధికారులు తమతమ ప్రాంతాల్లో కొంతైనా పనిచేయటం ప్రారంభించారు.

సామాజిక న్యాయం-సాధికారతా మంత్రి అయిన ముకుల్ వాస్నిక్ ఈ అంశం మీద ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయమై ఎంతో పని చేస్తోందని, ఎటొచ్చీ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిరంతరం అసత్యాలు వల్లిస్తూ, క్షేత్రస్థాయిలో దీనికి సంబంధించిన కార్యక్రమాలను అమలుచేయటం లేదని చెప్పాడు. పాకీపని పూర్తిగా నిర్మూలించే విషయంలో రాజకీయ చిత్తశుద్ధి కొరవడటం గురించి నేను అతన్ని ప్రశ్నించినపుడు, దానికి అతను నవ్వి 'చాలా పని జరుగుతోంది. అయితే ఈ పనులకు ఎంతో సమయం పడుతుంది' అని చెప్పాడు.

వెనువెంటనే తన పదవీకాలంలో జరిగిన ప్రయత్నాలన్నిటినీ అతను గుర్తు తెచ్చుకుంటూ చెప్పసాగాడు. అతన్ని మధ్యలో ఆపి, వాస్తవానికి దళితులు ఇప్పటికీ పాకీ బుట్టలను తమ నెత్తిమీద పెట్టుకుని మోస్తూనే వున్నారని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి ఒక సూచిక అని నేను చెప్పాను. 'కులవ్యవస్థ చూపించే అణిచివేతకు రాజకీయ వ్యవస్థ అందించే మద్దతుకు ఇది ఒక సాక్షీభూతమే కదా?' అని అడిగాను. దీనికి అతని దగ్గర సమాధానం లేదు. ఏదో ఒక సమాధానం ఇవ్వాలని కూడా అతను ప్రయత్నించలేదు. పాకీ పనివాళ్ళ విముక్తి కోసం ప్రత్యేకమైన ప్యాకేజీని డిమాండ్ చేస్తూ ఎస్‌కెఏ ఒక ప్రతిపాదన పెట్టినపుడు,

దీన్ని అమలుచేయటం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యంకాదని, పునరావాసం కోసం 5 లక్షల రూపాయలు ఇవ్వటం కుదరదని, ఒక్క క్షణంలో దాన్ని తిరస్కరించింది ఈ మంత్రే. ఏదయితేనేం – ఆ తర్వాత మాత్రం అతను పాకీపని నిర్మూలన కోసం, వారి పునరావాసం కోసం పనిచేయటం మొదలుపెట్టాడు.

కేంద్ర ప్రభుత్వంలో దళితుల కోసం పనిచేస్తున్న ఇంకో వ్యక్తి వున్నారు. ఆవిడే పట్టణ పేదరిక నిర్మూలన, గృహ నిర్మాణశాఖ మాజీమంత్రి సెల్జాకుమారి. ఆవిడ అంబాలా నగరం నుంచి ఎన్నికయిన లోక్‌సభ సభ్యురాలు. లోక్‌సభలోని తన కార్యాలయంలోనే ఆమెని కలిసి, కొనసాగుతున్న ఈ అమానవీయమైన పని విధానం గురించి వివరించాం. మేము చెప్పినదాన్ని సానుభూతితో విని తన మద్ధతును, సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే కార్యాచరణ విషయం వచ్చేసరికి ఆమె కూడా తన అశక్తతను వెల్లడించారు. పాకీపని నుంచి ఈ సమూహాన్ని విముక్తి చేసే మార్గంలో ఇలాంటి ఎన్నో అవరోధాలు అడుగడుగునా ఎదురవుతూనే వున్నాయి. వీటి వెనకున్న కారణమేంటి?

బహుశా ఈ కారణాన్ని అన్వేషించగలిగితే, భారత రాజకీయాల్ని లోలోపలి నుంచి ఉతికి ఆరేసే అవకాశం ఎవరికైనా వస్తుంది. హరిజన సంస్కరణ అనీ, దళిత సాధికారత అని రాజకీయ శక్తులు ఒకపక్క నినాదాలు గట్టిగానే ఇస్తాయి. మరోపక్క వారి కనుసన్నలలోనే ఇలాంటి అమానవీయమైన పద్ధతులు కొనసాగుతున్నా వాటిని ఏ మాత్రం ప్రశ్నించరు! ఇప్పటికిప్పుడు ఈ పనిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు క్రియాశీలకంగా పనిచేయవలసిన అవసరం వారికేం పట్టింది? పాకీపని నుంచి ఈ సమూహం విముక్తం కావాలనే రాజకీయ నాయకత్వ అంగీకారంతోనే ఇప్పుడు అకస్మాత్తుగా ఒక కదలిక వచ్చింది.

పార్లమెంటులో ఆమోదించిన చట్టాన్ని అమలుచేయమని రాజకీయ యంత్రాంగాన్ని ఎంతో కాలంగా ప్రాధేయపడుతూ వచ్చారు పాకీ పనివాళ్ళు. కానీ ప్రతిసారీ వాళ్ళు ఒక తీవ్రమైన వ్యతిరేకతను, ఏకాకితనాన్ని ఎదుర్కొన్నారు. వారి విజ్ఞాపనలేవీ మూసివున్న రాజకీయనాయకుల, అధికారుల కోటల తలుపులను దాటి లోపలికి వెళ్ళలేదు. కేంద్ర మంత్రిత్వశాఖలు గానీ, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ ఒక్కరంటే ఒక్కరు కూడా వారి ప్రాంతాల్లో ఈ అమానవీయమైన విధానం ఇంకా కొనసాగుతూనే వుందని ఒప్పుకోవటానికి సిద్ధపడలేదు. అయితే రాజకీయ అంగీకారాలు ఎప్పుడైతే ముఖ్యపాత్ర పోషించాయో అప్పుడు మొత్తం వ్యవస్థ అంతా కూడా ఎంతో ఉత్సాహంగా కదలటము లేదా తాను ఈ అంశంపై చురుకుగానే వున్నానని నిరూపించుకోవటానికి శతధా ప్రయత్నించింది.

ఎప్పుడైతే సోనియాగాంధీ అధ్యక్షులుగా వున్న జాతీయ సలహా మండలి (నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్) (ఎన్ఏసి) ఈ అమానవీయ పని విధానాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యాన్ని పెట్టుకుందో అప్పటినుంచీ ఈ కార్యాచరణ వేగం పుంజుకుంది. దీని ఆధారంగా

ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో సంక్లిష్టమైన అంశాలు ఎలా పనిచేయడం మొదలవుతాయనే దాన్ని ఎవరైనా అర్థంచేసుకోవచ్చు.

ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కూడా హడావుడిగా దీని గురించి ఒక ప్రకటన చేశారు. అయితే ప్రధానమంత్రి ఇచ్చిన ఈ ప్రకటనే ప్రభుత్వం గతంలో ఈ అంశంపై ఎలాంటి విధానాన్ని అవలంబించిందో తెలియజేస్తుంది. నిజానికి మన్మోహన్ నాయకత్వం లోనే కాంగ్రెస్ సారథ్యంలోని యూపిఏ ప్రభుత్వం చాలా సంవత్సరాలుగా పాకీపని ఇంకా కొనసాగుతూనే వుందన్న వాదనను ఖండిస్తూ వచ్చింది. ఇదే ప్రభుత్వం 2012 మార్చిలో పాకీపని నిర్మూలనతో పాటు ఆ పనిచేసే వాళ్ళ పునరావాసం కూడా పూర్తయిందని ప్రకటించింది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతల మంత్రిత్వశాఖ అయితే ఇంక ఈ వైపుగా ఆలోచించవలసింది గానీ చేయవలసింది గానీ ఏమీలేదని, అందుకే ఇందుకోసం కేటాయించిన డబ్బుని కూడా ఖర్చు చేయలేదని చేతులు దులిపేసుకుంది. తర్వాత ఇదే మంత్రిత్వశాఖ పాకీ పనివాళ్ళు ఇంకా వున్నారనే విషయాన్ని అంగీకరించవలసి వచ్చింది. ఈ సమూహానికి చెందిన ప్రజలను గుర్తించటానికి ఒక సర్వే నిర్వహించాలని కూడా ఈ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఇప్పుడు. మళ్ళీ ప్రభుత్వం ఈ విషయమై 33 కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని అనుకుంటోంది. ఈ సర్వే 5000కు పైగా జనాభా వున్న అన్ని పట్టణ, పల్లె ప్రాంతాల్లో, 640 జిల్లాల్లో జరుగుతుంది.

ఒక్క ఏడాది వ్యవధిలోపే ప్రభుత్వంలో వచ్చిన ఈ నాటకీయ మార్పుని చూసి ఎవరైనా ఆశ్చర్యపడవలసిందే. ఏదైనా ఒక రాజకీయ నిర్ణయం జరిగిన తర్వాతే ప్రభుత్వం ఈ విషయమై ఒక చురుకును ప్రదర్శించింది. అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ దళిత ఎజెండా వెనుక పనిచేసిన కారణాలేమిటనేది స్పష్టమే. తాము సాధించిన విజయాల చిట్టాలో ఇంకొక అంశాన్ని చేర్చటమే. అయితే వీటన్నింటికన్నా కూడా నిలువ రించలేని ఒక శక్తి పనిచేసింది. అదే, కుళ్ళికంపు కొడుతున్న ఈ అమానవీయ వ్యవస్థను కూలదోయాలనే నిబద్ధతతో ఈ సమూహం నుంచే పోరాటపథాన్ని చేపట్టిన స్త్రీలు.

ఇంతకాలం మరుగున దాచేసిన ఈ సమూహపు అశాంతిని జాతీయ సలహామండలి గుర్తించింది. అనంతరం దేశానికి సిగ్గుచేటైన ఈ విధానాన్ని తక్షణం నిర్మూలించాలనీ ఇందుకు తగిన విధానాలు, కార్యాచరణ వుండాలని 2010 అక్టోబరు 23వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కులపరమైన వివక్షలోనే అత్యంత హీనమైనది, అమానవీయమైనది పాకీపని అని, తక్షణమే దీనిని ఆపవలసిన అవసరం వుందని చెప్పింది. పదకొండో పంచవర్ష ప్రణాళిక నాటికల్లా ఈ చట్టవిరుద్ధమైన పని అంతమవ్వాలని కూడా ఎన్ఏసి నిర్దేశించింది. ఎన్ఏసి అధ్యక్షురాలు సోనియాగాంధీ. ఆమె చేతిలోనే కేంద్ర ప్రభుత్వ పగ్గాలు కూడా వున్నాయి. ఈ సిఫారసు వెళ్ళిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం ఈ

అంశం మీద చురుకుగా మారింది. అలాగే చాలా మంది మంత్రులు కూడా కాంగ్రెస్ అధ్యక్షురాలిని ప్రసన్నం చేసుకోవటం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒకటి మాత్రం స్పష్టం– రాజకీయ చిత్తశుద్ధి వుంటే ఏ నిర్ణయమైన సరే పకడ్బందీగా అమలుల్లోకి వస్తుంది. దానికి సంబంధించిన చర్చలు కూడా వాస్తవరూపం దాలుస్తాయి. ఇంతకు ముందు ఈ చిత్తశుద్ధి ఎప్పుడూ లేదు. ఏ రకమైన నిర్మాణాత్మకమైన చర్యలూ ఈ దిశగా చేపట్టింది లేదు.

వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఎన్నో అసత్యాలతో కూడిన అఫిడవిట్లు దాఖలుచేశాయి. దీనిమీద ఎవరికీ ఏ శిక్షా పడలేదు. రైల్వే మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖ ఈమధ్య కాలం వరకూ కూడా తాము పాకీ పనివాళ్ళను ఉద్యోగాల్లోకి తీసుకోనేలేదని బుకాయిస్తూనే వున్నాయి. అన్నిటికన్నా సిగ్గుచేటయిన విషయమేమంటే, గుజరాత్ ప్రభుత్వం కేంద్రం నుంచి పాకీ పనివాళ్ళ పునరావాసం కోసం కోట్లాది రూపాయల గ్రాంటు తీసుకుంది. అయినాగానీ, గాంధీ పుట్టిన ప్రదేశంలో పాకీపని అనేది బతికి లేదని సుప్రీంకోర్టులో చెప్పుకొచ్చింది. మిగతా అన్ని రాష్ట్రాలు కూడా అటూఇటూగా ఇదే వైఖరిని అవలంబించాయి. కొన్న రాష్ట్రాలు పాకీ పనివాళ్ళ సంఖ్యను చూపించాయి. మరికొన్ని రాష్ట్రాలు సందిగ్ధంగా సమాధానం చెప్పాయి. మధ్యప్రదేశ్ లాంటి పలు రాష్ట్రాలు తాము ఎంత మందికి పునరావాసం కల్పించామో చెప్పటానికి ఉత్సాహం ప్రదర్శించాయి. అయితే ఈ ఫిర్యాదు కేవలం రాష్ట్రాల గురించే కాదు; ఈ రకమైన తప్పుడు గణాంకాలు, నివేదికలూ కేంద్రం నుంచే మొదలయ్యాయి. దేశానికి ప్రధాన మంత్రులుగా పనిచేసిన వాళ్ళే ఎన్నో సార్లు ఈ విధానాన్ని నిర్మూలించామని ప్రకటించటం జరిగింది. కానీ ప్రతిసారీ ఈ వృత్తిని నిర్మూలించే ఈ నిర్ణీత గడువు 2007 నుంచీ 2008, 2009, 2010– ఇలా వాయిదా పడుతూనే వుంది. సిగ్గుమరిచి మరీ గుడువును జరిపేస్తూ వుంటారు. కానీ ఈ సంగతి ఎప్పుడూ వార్తల్లో చోటుచేసుకోదు. ఇప్పుడు మళ్ళీ కిందిస్థాయి నుంచీ కొత్త సర్వే చేస్తామనే మాటలు వినిపిస్తున్నారు. ఈ లోపల పునరావాసం పేరుతో కోట్లాది రూపాయలు ప్రభుత్వం ఖర్చుచేస్తూనే వుంటుంది. వాస్తవానికి ఇందులో పాకీ పనివాళ్ళకు అందేది చాలా చాలా స్వల్ప మొత్తం. రుణాలు అందిస్తామనే పేరుతో భారీ కుంభకోణం జరుగుతూ వస్తోంది! పాకీపని నిర్మూలన గురించి అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న గరీమా అభియాన్ సంస్థ నాలుగు రాష్ట్రాల్లో పరిశోధించినప్పుడు ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ఈ పరిశోధన చేస్తున్నప్పుడు మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో కేవలం 30 శాతం మంది పాకీ పనివాళ్ళకి లేదా వారిమీద ఆధారపడిన వారికి మాత్రమే పునరావాస పథకం కింద రుణాలు ఇచ్చారు. మరి మిగతా రుణాలు పొందినదెవరు? మధ్యదళారులా లేక పాకీపని చేయని ఇతర సఫాయి పనివారా?

పాకీపనిని 2010 మార్చి నాటికి సంపూర్ణ నిర్మూలన జరుగుతుందని ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, ఆయన సారథ్యంలోని ప్రభుత్వం ఒకేదఫా ప్రకటించటం

గమనార్హం. ఆ పని చేశామని చెప్పటానికి వివిధ మంత్రిత్వ శాఖల్లో విపరీతమైన పేపర్ వర్క్ జరిగింది. తత్ఫలితంగా ఆ ఏడాది మార్చి నాటికి దేశంలోని పాకీపని కార్మికులందరూ దాదాపు పునరావాసం పొందినట్టుగా ప్రకటించారు. పాకీ పనివాళ్ళు అధిక సంఖ్యలో వున్నప్పటికీ ప్రతిఒక్కరికీ పునరావాసం కోసం రుణాలు అందజేశామని దానర్థం. నిజానికి వాస్తవ పరిస్థితి ఏమిటంటే, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కూడా ప్రభుత్వం ఖర్చు పెట్టలేకపోయింది. దీనికి వారు చెప్పే కారణం, ప్రభుత్వ అంచనాల ప్రకారం ఇంక పాకీ పనివాళ్ళు అంటూ ఎవ్వరూ లేరని. ఫలితంగా 2010లో కేవలం పది లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు అయ్యాయి. ఒక సంవత్సరంలోపు ఇదే ప్రభుత్వం దేశంలో ఇప్పటికీ పాకీ పనివాళ్ళు వున్నారని అంగీకరిస్తూ వారిని గుర్తించటం కోసం జాతీయస్థాయి సర్వే చేపట్టాలని సంకల్పించింది. అంటే తన అబద్ధాన్ని తానే ప్రభుత్వం బయట పెట్టుకుందన్న మాట! వాస్తవం ఇప్పుడు ప్రతి ఒక్కరి ముందూ వుంది. ఇప్పటికీ దేశంలో పాకీ పని వాళ్ళు వున్నారు. ప్రభుత్వంగానీ దాని ప్రణాళికలు గానీ వీరిలో అత్యధికులకు చేరుకోనేలేదు. ఎవరైతే తమ తలమీద పియ్యిపెంటల బుట్టలను మోస్తూ వున్నారో వారు ప్రభుత్వ సహాయం లేకుండానే తమంతట తామే ఈ రొంపి నుంచి బయటకు వచ్చారనేది కటిక నిజం.

ఒక సంవత్సరం క్రితం అబద్ధాల కోరుగా నిరూపణ అయినప్పటికీ, 2011 జూన్ 17న మన్మోహన్‌సింగ్ వచ్చే ఆరునెలల్లో పాకీ పనిని దేశమంతటా సంపూర్ణంగా నిర్మూలిస్తామనీ, ఎత్తుడు దొడ్లను కూడా పూర్తిగా ధ్వంసం చేస్తామనీ మళ్ళీ ఒక ప్రకటన జారీచేశారు. కానీ గతంలో జరిగిన పొరపాట్ల నుంచి గుణపాఠాలు ఏమీ నేర్చుకోకపోవడం వల్ల, ఈ మొత్తం వ్యవహారం ఒక పన్నాగం గానే మారింది. అది కూడా చాలా వివాదస్పద మైనది. పాకీ పనివాళ్ళ పునరావాస స్వయంఉపాధి పథకం (సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ రిహాబిలిటేషన్ ఆఫ్ మాన్యువల్ స్కావెంజర్స్ (ఎస్ఆర్ఎమ్ఎస్) కింద ప్రభుత్వం రుణాలు మంజూరుచేస్తుంది. దీనిపై పాకీ పనిచేసే స్త్రీలలో చాలా వ్యతిరేకత వుంది. ఎందుకంటే వాళ్ళు కోరుకుంటున్నది రుణాలు కాదు. వాళ్ళు ఉద్యోగాలను కోరుకుంటున్నారు. పాకీపనివాళ్ళను ఈ రొంపి నుంచి బయటపడటానికి బదులుగా రుణాలు ఇచ్చి తన బాధ్యతను వదిలించుకోవాలని రాజకీయ వ్యవస్థ భావిస్తోంది. అయితే పాకీ పనివాళ్ళు మాత్రం ఒక మనిషి అస్థిత్వాన్ని ధ్వంసంచేస్తూ, మనిషి మనస్తత్వాన్ని బానిసతనంలోకి నెట్టే కులవివక్షతో ముడిపడివున్న ఈ విధానానికి బదులుగా గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారు. అయినా ఒక మనిషి పూర్తి చేతనావస్థలో వుండి ఇంకో మనిషి పియ్యిపెంటలను ఎత్తటానికి ఎలా అంగీకరించగలుగుతారు? ఇలా చెప్పడం అంటే ప్రభుత్వం, నాయకులు, అధికారులు ఈ వ్యవస్థని పెంచిపోషిస్తున్న నేరంతో ప్రమేయం లేదని కాదు. ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ వారు పూర్తిగా ఈ పన్నాగానికే

నిబద్ధులయ్యారు. తత్ఫలితంగా పాకీపని చేసే సమూహాన్ని ఎల్లప్పటికీ ఈ నరకంలోనే వుంచుతారు. ఇన్నేళ్ళుగా ఇంత సుదీర్ఘ పోరాటం తర్వాత కూడా ప్రభుత్వం జారీచేసే ఈ ప్రకటనలు, వాగ్ధానాలపై ఈ సమూహంలోంచి వచ్చిన నాయకులకు పెద్దగా ఆశలేమీ లేవు.

అనేక సంవత్సరాలుగా భారత రాజకీయ చిత్రపటం మీద పాకీ పనివాళ్ళు కనిపించకుండానే వుండి పోయారన్నది బాధాకరమైన వాస్తవం. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పాఠాలు బోధించే ఇమ్రానాఖదీర్ ప్రజారోగ్య అంశాల్లో నిష్ణాతురాలు. ఆమె చెప్పిన మాటలు వాస్తవం: పాకీపనివాళ్ళు వుండటం అనేది వ్యవస్థలో వున్న ఎవ్వరికీ సమస్య కానప్పుడు, ఎవ్వరూ వారి విముక్తి  గురించి ఆలోచన చెయ్యరు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు జాతీయస్థాయి పార్టీ కావొచ్చు లేదా ప్రాంతీయ పార్టీ కావొచ్చు- ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా వీరి గురించి ఆలోచించలేదు. వీరి ఉనికిని ఎవ్వరూ అధికారికంగా గుర్తించలేదు. పాకీ పనివాళ్ళు సంఖ్య రీత్యా పరిమితంగా ఉండి, చెల్లాచెదురుగా వుండటంతో వాళ్ళు భారత రాజకీయ చిత్రపటంలో బలమైన ఓటుబ్యాంకుగా రూపొందలేదు. ఈ సమస్య మరుగున వుండిపోవటానికి ఇదొక ప్రధాన కారణం.వాళ్ళు కనీసం ఒక దళిత సమూహంగా కూడా సమీకృతమవలేదు. తాము ఎదుర్కొంటున్న కులపరమైన అణిచివేతకు వ్యతిరేకంగా ఈ సమూహం అనేక ఏళ్ళుపాటు ఎదురు తిరగలేక పోయింది. ఇక్కడ మరొకటి గమనంలో పెట్టుకోవాలి. తక్కువ కులాలవారు ఎప్పటికీ అంటరానివారుగా పడివుండాలనే భావజాలాన్ని నరనరానా జీర్ణించుకుని, అంటరానితనం అనే విధానాన్ని నిరంతరం పెంచిపోషించే రాజకీయ పార్టీల, ప్రభుత్వాల, అధికారుల అహంకారపూరిత ధోరణిని ఎవ్వరూ విస్మరించతగదు.

ఇవాల్టికీ కూడా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో పాకీపనిని నిర్మూలిస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. ఇది ఎలక్షన్ ఎజెండాగా మారలేదు. కొంత మంది వామపక్ష నాయకులను మినహాయిస్తే, ఈ విషయమై ఏ ఒక్కరూ రాజకీయపరమైన నిర్ణయం తీసుకోలేదు. కొంత మంది రాజకీయ నాయకులు అక్కడా ఇక్కడా కొన్ని ప్రకటనలు ఇచ్చినప్పటికీ, ఆ దిశగా ఎక్కడ సంపూర్ణమైన చర్చ అయితే జరగలేదు. దళిత సామాజిక వర్గంలో పాకీ పనివారు ఎలా కింద మెట్టు మీదకి నెట్టివేయబడ్డారో అర్థం చేసుకోవాలి. ఈ అంశం ఏ ఒక్క దళిత రాజకీయ నాయకుడికి గానీ, లేదా దళిత హక్కుల కోసం పోరాడుతున్న ఏ పార్టీకి గానీ ఎజెండాగా మారలేదు. కనీసం ఒక విశ్వాసంతో అయినా సరే పార్లమెంటులో దళిత సభ్యులు ఈ విషయాన్ని భుజానికెత్తుకోలేదు. నిజం చెప్పాలంటే పాకీ పనివాళ్ళ సమూహానికి జాతీయస్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యమే లేదు. రాష్ట్రాలలో ప్రభావితం చేయగలిగే స్థాయికి ఎదిగిన వాళ్ళు కూడా లేరు. దీనికంతటికీ కారణం గత అరవై ఏళ్ళలో అమానవీయమైన, కుళ్ళికంపుకొడుతున్న ఈ మురికి విధానాన్ని

నిర్మూలించటానికి ఒక పకడ్బందీ దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించటంలో రాజకీయ పార్టీలు ఏమాత్రం బాధ్యత తీసుకోకపోవటమే. ప్రతిసారీ పాకీ పనివాళ్ళు, సఫాయి కార్మికుల మీద కొద్దిపాటి సానుభూతి కురిపించినా గానీ, అంతర్గత ఆలోచనల్లో మాత్రం సమాజం శుభ్రంగా వుండాలంటే వీరు ఈ పనిని కొనసాగించి తీరాలనే వుంటుంది. ఈ సమూహానికి చెందినవారు ఈ దేశ పౌరులుగా కానీ కనీసం తమని తాము మనుషులుగా కానీ గుర్తించటం లేదని భావిస్తున్నారంటే అందులో ఎంతో నిజం వుంది.

ఇతర దళిత గ్రూపుల కంటే కూడా ఈ సమూహం ఎంచుకున్న కార్యాచరణ ఎంతో విభిన్నమైనది. వీళ్ళెవ్వరికీ ఏ రాజకీయ దేవుడూ లేడు. తమ విముక్తి ప్రయాణాన్ని వారే నిర్దేశించుకున్నారు. రాళ్ళురప్పలతో నిండిన గతుకుల రోడ్ల మీద నడిచారు. కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు. విపరీతమైన కష్టనష్టాలను భరించారు. అయినప్పటికీ ఎవ్వరూ వీరి గొంతులను వినలేదు. ఈ ఎదురుదెబ్బలేవీ వారిలో ఏ విధమైన మార్పుని తీసుకు రాలేకపోయాయి. ఎందుకంటే వాళ్ళు విజయం రుచిని అసలు ఎరుగనే లేదు. మూసివున్న రాజకీయసౌధాల తలుపులను తట్టే విషయంలో వారిలో మరింత ధైర్యాన్ని, అంతులేని నిబద్ధతను పెంచాయి. లక్ష్యంనుంచి వెనక్కి మరలడం అంటే ఏ కుళ్ళు, మురికి నుంచయితే విముక్తి కోరుకుంటున్నారో మళ్ళీ అందులోకే కూరుకుపోతామని వారికి బాగా తెలుసు.

ఈ విముక్తి పథంలో పాకీ సమూహపు ఆడవాళ్ళు, వారి సహచరులు మూసివున్న అధికారసౌధాల తలుపుల్ని బలంగానే తట్టారు. తమ జీవనోపాధి కోల్పోయే ప్రమాదం వుందని తెలిసినా గానీ, ప్రభుత్వం చెప్తున్న అబద్ధాల ముసుగుని తొలగించి నిజాన్ని ప్రపంచం ముందు ఉంచడానికి తమ శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో వాళ్ళు అన్ని సందుగొందుల్లోకీ, ప్రతి ప్రాంతానికీ వెళ్ళారు. పాకీ బుట్టలను తగలబెట్టారు. ఎత్తుడుదొడ్లను కూలగొట్టారు. దేశవ్యాప్తంగా 300లకు పైగా జిల్లా కలెక్టర్లను పదేపదే కలిసి తాము ఇంతమంది పాకీ పనివాళ్ళం ఈ ఈ ప్రాంతాల్లో వున్నామని విజ్ఞాపనా పత్రాలను సమర్పించారు. ఒక్క ఉత్తర భారతదేశంలోనే సఫాయి కర్మచారి ఆందోళన్ నాయకత్వంలో 162 మంది జిల్లా కలెక్టర్లకు ఇటువంటి విజ్ఞాపనా ప్రతాలను ఇచ్చి చట్టాన్ని సక్రమంగా అమలుచేయమని కోరారు. కొన్ని ప్రాంతాల్లోనయితే ఇదే రకమైనా విజ్ఞాపనలను కనీసం ముప్పైసార్లకు పైగా ఇచ్చారు. కులం అనే బలమైన గోడను కూల గొట్టటం అంత సులభమైన పనికాదని వారికి బాగానే తెలుసు. అవహేళనలను, బాధలను ఇంక ఎంత మాత్రం సహించలేని పరిస్థితుల్లో తమ హక్కుల కోసం ఉద్యమించాలని వారు గట్టిగా నిశ్చయించుకున్నారు.

ఈ చైతన్యం దక్షిణాదిన ప్రారంభమై క్రమేపీ దేశమంతటా విస్తరించింది. ఉత్తర భారతదేశంలోని ఆడవాళ్ళు 'మేం తక్కువైనా తిని వుంటాంగానీ, పాకీపని మాత్రం చేయం.

పాకీపని ఆగిపోవాలి, పాకీపని ఆగిపోవాలి' అంటూ నినదించారు. గుజరాత్‌లో ముఖ్యమంత్రి నరేంద్రమోడి కోర్టుకి సమర్పించిన అవాస్తవాలతో కూడిన అఫిడవిట్‌ను సవాలుచేస్తూ రోడ్ల మీదకు వచ్చారు. కరపత్రాలు, పోస్టర్లు పంచారు. వాటిలో 'పాకీపని గుజరాత్‌కు అవమానం, "స్వచ్ఛ గుజరాత్" వాస్తవరూపం నెత్తిమీద పియ్యిపెంటలు వుండటం' అని రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో 'స్వతంత్ర భారతదేశంలో ఇంకా పాకీపనా, సిగ్గు సిగ్గు!' అని అన్నారు. కర్ణాటకలో 'పాకీపని విధానాన్ని ఆపండి' అని చెప్పారు. తమిళనాడులో 'మేం ఇంక మనుషుల పియ్యిపెంటలను ఎత్తం. ఎత్తంగాక ఎత్తం' 'మేమేమో మనుషుల పియ్యిపెంటలను ఎత్తటానికి వున్నామా? మీరేమో గుడిగంటలు కొట్టటానికి వున్నారా? ఇకపై ఇది చెల్లదు కాక చెల్లదు!' అని రాశారు. ఇలా వివిధ రాష్ట్రాల్లోని ఆడవాళ్ళు ఈ అమానవీయ విధానానికి చెల్లుచీటీ ప్రకటించారు. హర్యానా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో స్త్రీలు తమ సంఘటితశక్తితో పాకీపని లేని రాష్ట్రాలుగా వాటిని తమంతట తామే ప్రకటించుకున్నారు.

వాస్తవం చెప్పాలంటే వాళ్ళు తమని తామే విముక్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ తమ రాష్ట్రాన్ని పాకీపని లేని రాష్ట్రంగా మార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ రోజుకి కూడా వాళ్ళ ప్రయత్నాలకు ఎలాంటి రాజకీయమద్ధతూ లభించనప్పటికీ, వాళ్ళు తమ విముక్తికి తమదైన పద్ధతిలో మార్గనిర్దేశం చేసుకుంటున్నారు. ఈ ప్రయత్నమంతా ఎంతో నెమ్మదిగా అనేక హెచ్చుతగ్గులతో కూడుకొనివుంది. వాస్తవ పరిస్థితి ప్రభుత్వానికి అర్థమయ్యేసరికే పాకీపనిలో వున్న అనేక మంది ఆడవాళ్ళు, మగవాళ్ళ ఆ కుళ్ళు కంపుకొట్టే నరకం నుంచి బయటపడటానికి ఎన్నో అడుగులు ముందుకువేశారు.

## పేరులో ఏముంది!

'దబ్బు-వాలీ' (బెంగాల్), 'బాల్టీ-వాలీ'(కాన్పూర్), 'టీనా-వాలీ' (బీహార్), 'కమాయి' పనిచేసేటోళ్ళు (లక్నో & ఉత్తర భారతదేశం), 'టోక్రి-వాలీ' (హర్యానా, పంజాబ్), 'తొట్టికార్' (చెత్తడబ్బా అని అర్థం-కర్నాటక), 'పాకీ లేదా పీతి' (అర్థం 'పియ్యి పెంట',-ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా), 'వాతల్' (కశ్మీర్) - ఎన్ని ప్రాంతాలున్నాయో అన్ని పేర్లు.

ఈ పేర్లన్నీ వాళ్ళు చేస్తున్న పనినుంచే పుట్టుకొచ్చాయి. ఇవి కులాల పేర్లు కావు; వీళ్ళు పాకీపని చేసే దళితులు. మనుషులు ఏరిగిన పియ్యిపెంటలను చేతులతో ఎత్తిపోస్తారు. ఆ పని చేయడానికి ఉపయోగించే పనిముట్ల పేర్లే వీళ్ళ నామవాచకాలుగా మారాయి. కేవలం ఈ పేర్లు వినిపిస్తే చాలు-నాగరీక సమాజం ముఖాల్లో తీవ్రమైన అసహ్యం వ్యక్తమవుతుంది. కానీ ఈ పేర్లు రక్తమాంసాలతో బతికి వున్న కొంత మంది స్త్రీలకు, పురుషులకు అంటిపెట్టుకుని వున్నాయి. ఈ పదాలే వాళ్ళ అస్తిత్వంగా మారిపోయి వారు తమ సొంత పేర్లను మర్చిపోయే పరిస్థితి నెలకొంది. వీళ్ళు తమ జీవితాంతం ఏ ఇళ్ళల్లో

అయితే పని చేస్తారో ఆ ఇళ్ళ యజమానులకు వీళ్ళ అసలు పేర్లు తెలియదు; వీళ్ళ తలల పైనుంచి మాత్రమే చూసి వీళ్ళని గుర్తిస్తారు అంతే! ఏదన్నా పనిబడి ఈ ఆడవాళ్ళతో మాట్లాడవలసివస్తే ఆయా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ఉపయోగించే పదంతోనే పిలుస్తారు. అది 'తొట్టెమ్మా కావచ్చు లేదా 'బాల్టీ–వాలీ' కావొచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో అరవైయ్యేళ్ళ సి.నారాయణమ్మ తన అసలు పేరుని తన యాభయ్యవ ఏట నుంచే వినటం మొదలుపెట్టింది. తనకి పద్నాలుగు లేదా పదిహేనేళ్ళు వున్నప్పుడు ఆమెని అందరూ 'తొట్టమ్మే' (పాకీ పనిది) అనే పిలిచేవారు. తన దైనందిన పనిలో భాగంగా ఆమె వేకువ ఝామున నుంచి మధ్యాహ్నం వరకూ సామూహిక ఎత్తుడుదొడ్లను శుభ్రం చేస్తూనే వుండేది. అప్పుడు ఆమె ప్రతి నిమిషం 'ఏయ్ తొట్టమ్మే, ఇక్కడ శుభ్రం చేయి తొందరగా' అనే పిలుపునే వింటూ వుండేది. ఆమె జీవితంలో అనేక సంవత్సరాలు పేరులేని వ్యక్తిగానే మిగిలిపోయింది. సఫాయి కర్మచారీ ఆందోళన సంస్థ నుంచి వచ్చినవారు తనని సొంత పేరుతోనే పిలవటం మొదలు పెట్టినపుడు దానికి అలవాటుపడటానికి ఆమెకు చాలా సమయమే పట్టింది. ఎన్నో ఏళ్ళ పాటు ఆమె పని చేస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలోని వారికి 2010 వరకూ ఆమె పేరేమిటో కూడా తెలియదంటే ఆశ్చర్యపోవాల్సినదేం లేదు. నారాయణమ్మ నాయకత్వంలోనే అక్కడి ఎత్తుడుదొడ్లను కూలగొట్టటం జరిగింది. అంత పెద్ద గొడవ, హంగామా తర్వాత కూడా ఎవ్వరికీ ఆమే నారాయణమ్మ అని తెలియదు. ఆమె పేరు తెలుసుకోవాలని ఎన్నడూ ఎందుకనుకోలేదని స్థానికులను అడిగినప్పుడు, అక్కడి పాకీదొడ్డిని ఉపయోగించిన సావిత్రి అనే మహిళ 'పేరులో ఏముంది? ఆమె చేసే పని మాకు తెలుసుకదా! తెలియకపోతే కదా అనుకోవాలి' అని జవాబిచ్చింది.

నిజానికి ఒక పేరులో ఏముంది? వాళ్ళు బాల్టీ–వాలీలుగా, దబ్బు–వాలీలుగా, టోక్రి–వాలీలుగా మాత్రమే అందరికీ తెలుసు. కాన్పూర్ నుంచి వచ్చిన శాంతి ఆ ప్రాంతం మొత్తానికి బాల్టీ–వాలీగానే తెలుసు. కోల్‌కత్తాలోని 24 పరగణాల జిల్లాలో పనిచేసిన హీరాని ఆమె జీవితమంతా అందరూ దబ్బు–వాలీ అనే పిలిచారు. రాజస్థాన్‌లోని టోంక్ నుంచి వచ్చిన ఇందిరను ఎప్పుడూ టోక్రి–వాలీగానే గుర్తుంచుకుంటారు. దేశం నలుమూలలా ఈ స్త్రీలకు వున్న గుర్తింపు తక్కువతనాన్ని సూచించే ఆ పేర్లతో ముడిపడి వుంది. అదృశ్య భారతదేశానికి ప్రతినిధులుగా వున్న వీరందరూ సొంత పేరంటూ లేని స్థితిలోకి నెట్టివేయబడ్డారు.

కొన్ని ప్రాంతాల్లో పాకీపని వాళ్ళల్లో 95% మంది స్త్రీలే వుంటే, మరికొన్ని ప్రాంతాల్లో వీరి సంఖ్య 98% శాతంవరకూ వుంది. ఈ మహిళలంతా కూడా కులరక్కసి అణిచివేత తాలూకు కోరల్లో, లింగ వివక్షలో, ఆర్థిక అసమానతల్లో చిక్కుబడి వున్నారు. ఎన్ని విషయాలలో వీరి పట్ల జరుగుతున్న ఉల్లంఘనలు జరుగుతున్నాయో అంచనా వేయడం

అసాధ్యం. పాకీ పనిచేస్తున్న వీళ్ళకు తాము ఎందుకు, ఎలా ఈ పనిలోకి లాగబడ్డామో, ఈ దారుణం నుంచి బయటపడటానికి ఏం చేయాలో అన్న అంశాలపై కనీస అవగాహన లేదు. భర్త, అత్తమామల తీవ్రమైన వత్తిడితో తరతరాలుగా తమ నెత్తి మీదికెక్కుతున్న పాకీ బుట్టలను వదిలించు కోవడమన్నది ఈ ఆడవాళ్ళకు పెద్ద సవాలు. భాష వేరుకావచ్చు, ఆచారాలు వేరు కావొచ్చు- కానీ ఆ బాధ, ఆ అవమానం మాత్రం ఎప్పుడైనా ఎక్కడైనా ఒకటే. భర్త పనిచేయడు. పైగా విపరీతంగా తాగుతూ భార్యను నిర్ధాక్షిణ్యంగా తంతూ వుంటాడు – ప్రతిచోటా ఇదే కథ. 'మేం పాకీపని చేయటం వల్లనే ఇల్లు గడుస్తోంది. కానీ ఇంత తక్కువ సంపాదనతో ఇంటిల్లిపాదిమీ ఎలా జీవించగలుగుతాం' ఇదీ ఆ మహిళల ప్రశ్న.

నిజానికి పాకీపని తరతరాలుగా కొనసాగడానికి కులవ్యవస్థ ఒక ప్రత్యేకమైన పద్ధతిని అభివృద్ధి పరిచింది. ఈ పని చేసే ఆడవాళ్ళకు ఒక రొట్టె, స్వల్పమొత్తం వేతనం లభిస్తాయి. దీనికి అదనంగా వేరే పనుల ద్వారా అంటే చనిపోయిన పశువుల కళేబరాల్ని తీసివేయడం, పెళ్ళిళ్ళు, పుట్టుకలు, చావులు వంటి క్రతువులు, ఎవరి ఇళ్ళకయినా బంధువులు వస్తే వారి ఇళ్ళలో చాకిరీ చేయడం వంటి పనుల ద్వారా అదనంగా మరికొంత సంపాదిస్తారు. పెళ్ళిళ్ళ సమయంలో వీరికి పాత బట్టలు ఇస్తారు. దీనర్థం ఏమిటంటే ఇలాంటి మద్ధతు వల్లే ఈ ఆడవాళ్ళు ఇళ్ళని గడుపుకోగలుగుతున్నారని భావన కలిగించడం.

కష్టకాలాల్లో ఏదో ఒక విధంగా సహాయపడటానికి సామాజికమైన మద్ధతు ఎంతో అవసరమని అప్పుడూ ఇప్పుడూ కూడా అనిపిస్తూ వుంటుంది. ఇల్లు నడపటం అనే బాధ్యతని ఈ మహిళలు తలకెత్తుకుంటారు. కనుక సహజంగానే వీరు ఈ ఉచ్చు (ట్రాప్)లోకి పడిపోతారు. ఎందుకంటే ఏదైనా అత్యవసరం పడినప్పుడు ఈ మద్ధతు వ్యవస్థలనేవి ఆమెకి ఆట విడుపుగా వుంటాయనే ఆశని కలిగిస్తాయి. అందుకే ఇంకా దేశంలో చాలా మంది ఆడవాళ్ళు పాకీపని వదిలిపెట్టడానికి సిద్ధంగా లేరు. ఎవరైతే ఈ విధానం కొనసాగాలనుకుంటున్నారో వారికి ఈ లోతైన వాస్తవం బాగా తెలుసు; ఇదే ట్రాప్‌ని శతాబ్దాల తరబడి ప్రయోగిస్తూ ఇప్పటికీ దానినే అమలుచేస్తూ వున్నారు. ఇదే ఈ మహిళలను దుర్మార్గపు ఉచ్చులో వుంచి, వారిలో బానిస మనస్తత్వం పాతుకునేలా చేస్తోంది. ఫలితంగానే పాకీపని ఏ అడ్డంకులూ లేకుండా కొనసాగుతోంది!

ఉజ్జయినిలో తన తల్లి, అక్కలతో పాకీపని మాన్పించే క్రమంలో అలీ మహమ్మద్ గట్టి వ్యతిరేకతనే ఎదుర్కొన్నాడు. ఈ కుటుంబమంతా ఈ వృత్తితోనే జీవించిందని, దీని ఆధారంగానే అందరూ పెరిగారని, ఈ వృత్తిని వదిలేయటం సరికాదని వృద్ధురాలయిన అతని తల్లి గొడవపడింది. నిజానికి ఇదొక పెద్ద నిందారోపణ. లక్నోలోని ఛార్‌భాగ్‌లో గత 25 సంవత్సరాలుగా 'కమాయి-వాలీ-లెట్రిన్'లను శుభ్రం చేస్తున్న విమల ఈ పని వదిలేయటానికి సిద్ధంగా లేదు. కాళ్ళకు మందపాటి కడియాలు, కాలివేళ్ళకు మట్టెలు,

ముత్యాలతో కూడిన పెద్ద ముక్కుపుడక పెట్టుకుంటుంది విమల. ఆమెకు నగలంటే ఎంతో ఇష్టం. ఈ అమానవీయమైన పనిలోనే జీవిస్తోంది. ఈ పనిచేస్తూనే పిల్లల్ని పెంచి పెద్దచేశానని ఆమె భావిస్తుంది. ఎవరిళ్ళల్లో అయితే పనిచేస్తుందో, వారి సహాయంతోనే కూతురికి పెళ్ళిచేసి పంపించింది. 'నాకింక ఇప్పుడు ఎంత జీవితం వుంది? అన్ని కష్టకాలాల్లోనూ ఈ పనే కదా నన్ను బతికి వుండేలా చేసింది. లేకపోతే తాగుబోతు, జూదరి అయిన నా భర్త నన్ను ఎప్పుడో తరిమేసేవాడు' అని చెప్పిందామె. గంటపాటు జరిగిన సమావేశంలో 1985 లో తన నగలన్నీ అమ్మేసి 25 ఇళ్ళ జాజ్‌మనీని కొనుగోలు చేశానని ఆమె కనీసం నాలుగు సార్లు నాతో చెప్పింది. పేదవాళ్ళయిన ముస్లింల ఇళ్ళలోని మరుగుదొడ్లను ఆమె శుభ్రం చేస్తుంది. జీవితంలో ఎన్నో సంవత్సరాల పాటు ఇదే పాకీపని చేస్తుండిన విమల దీన్ని మురికి, కుళ్ళికంపు కొట్టే పనిగా భావించదు. ఈ వయసులో ఇప్పుడింక వేరే పని చేయలేనని ఆమె భావిస్తోంది. అంతకంటే మించి ఆమెకు వేరే ఏ పని కూడా దొరకదు. ఎందుకంటే ఆమె ఇప్పటివరకూ చేసిందే 'మురికి' పని.

మానసిక వెట్టి అనే జైల్లో బతుకుతూవున్న అనేకమంది ఆడవాళ్ళు మనచుట్టూ కనిపించకుండా వున్నారు. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా మున్సిపాలిటీలలో పాకీపని అనేది సాధారణంగా ఆడవాళ్ళకిస్తే, మగవాళ్ళకు ఊడ్వటం, తుడవటం వంటి పనులను కేటాయిస్తారు. ఇంత ఘోరమైన పనిని ఆడవాళ్ళతో చేయించటానికి వెనుక ఎన్నో ఆర్థికాంశాలు ముడిపడివున్నాయి. ఆడవాళ్ళు ఇళ్ళల్లోనూ, సామూహిక పాకీదొడ్లలోనూ పనిచేసి సంపాదించే దానికన్నా మున్సిపాలిటీ వారి పనిలో జీతాలు ఎక్కువగా వుంటాయి. ఇళ్ళలో పాకీపని చేస్తే ఆడవాళ్ళకు తక్కువ పైకమే ముడుతుంది. అయినప్పటికీ ఎక్కువస్థాయిలో ఆడవాళ్ళు ఈ పనిలో ఎందుకని వున్నారు? దీనికి సమాధానం కొంచెం తేడాపాడాలతో ఒకేలాగా వస్తుంది. సఫాయికర్మచారి ఆందోళన నాయకుడు బెజవాడ విల్సన్, నవ్‌సర్జన్ కార్యకర్త మంజులా ప్రదీప్, సిపిఐ నాయకుడు డి.రాజా ఎవరయినా కావచ్చు జావాబు ఒక్కటే! కఠినంగా అనిపించినప్పటికీ ఇదొక కఠోర వాస్తవం: దళితుల్లో దళితులు ఆడవాళ్ళు. అందుకే కులవ్యవస్థ వారినే ఈ కుళ్ళి కంపుకొట్టే నరకంలోకి తోసేస్తుంది. మగవాళ్ళు ఈ పని చేయడానికి నిరాకరించడమో లేదా జాగిర్దారీ, జాజ్‌మనీ అనే ఈ పాకీపనిని తమ ఆడవాళ్ళకు అప్పచెప్పేస్తారు. జాగిర్దారీ లేదా యాజమాన్య హక్కువున్న ఏ పనినీ ఆడవాళ్ళకు అప్పగించడం అనేది ఏ ఇతర కులాలు లేదా వర్గాల్లో కనిపించదు. అసలు అలాంటిది జరగదనే చెప్పాలి!

దేశం మొత్తం మీద ఈ పాకీపనిచేసే సమూహం వివిధ కులాలుగా, మతాలుగా విడిపోయి వుంది. తమ స్వీయ అస్థిత్వం కాపాడుకునే క్రమంలో ప్రతి ఒక్కరూ రకరకాల బాధల్ని భరిస్తుంటారు. దాదాపు అత్యధికులు దళిత కులాలకే చెందినప్పటికీ, ఇతరులకంటే తమస్థాయి కొంచెం ఎక్కువ అని నిరూపించుకునే పరుగులో పడిపోయారు. మనుధర్మం

సమాజంలో ఎంత లోతుగా పాతుకుపోయిందో ఈ సంక్లిష్టమైన పరిస్థితి నుంచి సులువుగా అర్థం చేసుకోవచ్చు.

దేశమంతటా పాకీపని చేస్తున్న కులాల వివరాలను సంక్షిప్తంగా ఇక్కడ ఇస్తున్నాను.

**లాల్‌బేగి**

మెహతర్ ఇల్యాజ్ అనుచరులుగా వీళ్ళని భావిస్తారు. నిజానికి ఆ తర్వాత వచ్చిన సంత్ లాల్‌బేగ్ పేరు మీద లాల్‌బేగీ అని ఈ సమూహాన్ని పిలుస్తారు. బీహార్, జార్ఖండ్‌లలో వున్న లాల్‌బేగీలు తమ మూలాలు వాల్మీకుల్లో వున్నాయని, తమ స్వస్థలం రాజస్థాన్ అని చెప్తారు. లాల్‌బేగీలు పాకీ పనివారు, ఊడ్చే పనివారు అనే రెండు రకాలుగా వుంటారు. వీరిలో ఎక్కువ మంది మున్సిపాలిటీలలో, ఆసుపత్రుల్లో ఊడ్చేపని చేస్తుంటారు. కొంత మంది దినసరి కూలీలుగా పనిచేస్తారు. ఈ సమూహం సమష్టిగా లేదు. హిందూ, ముస్లిం అనే రెండు గ్రూపులుగా చీలిపోయివుంది. ఈ గ్రూపుల మధ్య అడ్డుగోడలు రోజు రోజుకూ ఇంకా పెరుగుతున్నాయి. ఇంతకు ముందు ఈ రెండు గ్రూపుల మధ్య పెళ్ళిళ్ళు జరిగేవి కానీ, ఇప్పుడు ఆ సంబంధ బాంధవ్యాలు లేవు. హిందూగ్రూపుని వాల్మీకులుగా పిలుస్తారు. వీరికి షెడ్యూలు కులాల గుర్తింపు వుంది. అయితే వీరు ఏ మతానికి చెందుతారనేది వివాదాస్పదం. కొంత మంది హిందూ పేర్లను పెట్టుకున్నప్పటికీ, ఎక్కువ ముస్లింలుగానే వున్నారు. వీరిలో కొందరు హిందువులుగా మారినప్పటికీ ముస్లిం పేర్లే వుంటాయి. ఈ సమూహానికి తమకంటూ ఓ స్వస్థలం వుంది. దాని పేరు హస్‌నటి బిరాదరి. బీహార్‌లోని ఈ సమూహానికి ఎన్నో ఉపకులాలు వున్నాయి. భీవల్, పండిట్, చమారియా మొదలైనవి. స్థానిక భాషలోనే వారు మాట్లాడుకుంటారు. ఎవ్వరికీ ఉర్దూ రాదు. బీహార్‌లోనే కాకుండా అసోం, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, మేఘాలయ, మిజోరం, ఉత్తరప్రదేశ్, ఉత్తరా ఖండ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్‌లలో కూడా లాల్‌బేగీలు వున్నారు.

**హలాల్‌ఖోర్**

ఇదొక దళిత ముస్లిం సమూహం. వీరందరూ షియావర్గానికి చెందినవారు. ప్రధానంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో నివసిస్తారు. బీహార్‌లో వీరిని షేక్రా లేదా షహాని అనీ, ఉత్తరప్రదేశ్‌లో మెహతర్ లేదా ముస్లింభంగి అనీ పిలుస్తారు. హలాల్‌ఖోర్ అనే పదానికి అర్థం హలాల్ తినేవారు అని. సంప్రదాయికంగా ఈ సమూహం ఊడ్వటం, పాకీపని వంటివి చేస్తూ వుంటుంది. వీరు తొలుత హిందూభంగీ సమూహంలో వున్నారని ఆ తర్వాత ఇస్లాంలోకి మతం మార్చుకున్నారని అంటారు. కంపు, షైకాడ అనే రెండు ఉపకులాలుగా వీరు విడిపోయారు. హలాల్‌ఖోర్‌లు ఉత్తరప్రదేశ్ అంతటా కనిపిస్తారు. స్థానిక భాషనే మాట్లాడతారు. బీహార్‌లో హలాల్‌ఖోర్లు ఊడ్చేపనివారుగా వున్నారు. మెహతర్లుగా, భంగీలుగా, హలాల్‌బేగీలుగా అందరికీ తెలుసు. ఇక్కడ వీరు షియా, సున్నీ అనే శాఖలుగా విడిపోయారు. ఈ శాఖాభేదం ఎంత బలమైనదంటే వీరి మధ్య వివాహ

సంబంధాలు కూడా లేవు. ఇతర ముస్లిం వర్గాల నుంచి హలాల్‌ఖోర్లు తరచూ వివక్షను ఎదుర్కొంటారు. అందుకే ముస్లిం సామాజిక వర్గం వీరిని అత్యంత హీనస్థితిలో వున్న వారిగా పరిగణిస్తారు. ఇతర సమూహాల్లాగే బిరాదరీ పంచాయిత్ అని వీరికి కుల నియంత్రణా వ్యవస్థ వుంది.

## హేలా

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లలో వుండే హిందూ షెడ్యూలు కులం ఇది. వీళ్ళని మెహతర్ లేదా మేస్తర్ అని పిలుస్తారు. ఉత్తర భారతదేశంలోని భంగీ సమూహంలో ఒక భాగంగా వీరిని చెప్పుకోవచ్చు. వారణాశి, ఘజిపూర్, మీర్జాపూర్‌లలో హేలా సమూహాన్ని చూస్తాం. వీరిలో ఐదు ఉపకులాలు వున్నాయి. అవి సూపాభగత్, బాల్మీకి, నౌర్‌ఛిన్‌వా, లాల్‌బేగి, షేక్-హేలా. ఈ హేలా సమూహంలో హిందూ, ముస్లిం సంప్రదాయపు ఆనవాళ్ళు కనిపిస్తాయి. అయితే ఇప్పుడు వారు ఇస్లామిక్ సంప్రదాయాన్ని వదిలిపెట్టి పూర్తిగా హిందూ సంప్రదాయ పద్ధతులనే పాటిస్తున్నారు. ఒకప్పుడు వీరిలో వర్గవిభజన కూడా వుండేది. వీరిలో సూపాభగత్‌లు తాము మిగిలిన వారికన్నా అధికులమని భావించేవారు. హేలా సమూహం పూర్వం వ్యవసాయ కూలీలుగా వుంటూ గ్రామంలో ఊడ్చేపని చేసేవారు.

## షా ఖేల్

ఒకప్పుడు స్మశానాల్లో సమాధులు తవ్వటం, ఊడ్వటం వంటి పనులు ఈ సమూహం వృత్తిగా వుండేది. పంజాబ్ రాష్ట్రం అంతటా, ఒకప్పటి ఉత్తర-పశ్చిమ ఫ్రాంటియర్ ప్రావిన్స్ ప్రాంతమంతటా వీరు జీవిస్తున్నారు. 'పాష్తో' మాట్లాడే సమూహం నుంచి ఈ షా ఖేల్‌లు వచ్చారు. కానీ ఇతర ఫక్తూన్ ఆదివాసీలు వీరిని తమ వారుగా అస్సలు గుర్తించరు. వీళ్ళు ప్రసుత్తం ఎక్కడ జీవిస్తున్నారో అక్కడి భాషనే మాట్లాడుతున్నారు.

## భంగి

భారతదేశంలో అంటరానివారుగా ముద్రపడ్డ అతి పెద్ద కుల సమూహమే 'భంగి'! చారిత్రికంగా చూస్తే వీరికి మూడు పనులను అంటగట్టారు - పాకీ దొడ్లను శుభ్రం చేయటం, ఊడ్వటం, చేతులతో పియ్యిపెంటలను ఎత్తిపోయటం (జంతుకళేబరాలను, శవాలను ఎత్తివేయటం కూడా వీరి పనే). కానీ ఇప్పుడు తమని వాల్మీకులుగా పిలవాలని కోరు కుంటున్నారు. తరతరాలుగా వీరు పాకీదొడ్లను శుభ్రం చేస్తూ వున్నారు కాబట్టి జనం వీరిని వృత్తి సంబంధమైన పేరుతోనే పిలుస్తూ వుంటారు. మనుషుల పియ్యిపెంటలను బక్కెట్లోకి ఎత్తి, వాటిని నెత్తిమీద మోసుకుంటూ వెళ్ళి పారబోయటం భంగీల పని. భారత సామాజిక వ్యవస్థలో ఒక వృత్తిని ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించడం అనేది రివాజు. అందుకే భంగీ కుటుంబంలో పుట్టిన వ్యక్తి ఆర్థిక, కుల కారణాలరీత్యా

తప్పనిసరిగా అదే వృత్తిని వారసత్వంగా చేయవల్సివుంటుంది. పాకీదొడ్లు ఆధునికంగా మారినప్పటికీ ఎత్తుడు దొడ్లను, పాకీపనిని నిషేధించే చట్టం వున్నప్పటికీ సమాజంలో భంగీలు నేటికీ ఆదే సంప్రదాయ వృత్తిని కొనసాగించే పరిస్థితులే వున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే వీరింకా సామాజిక కట్టుబాట్ల అణిచివేతకు, దోపిడీ వ్యవస్థకు బాధితులుగానే వున్నారు. భంగీ సమూహంలో ఉపకులాలు అనేకం. ధోబీస్, చమరార్ కులాలు దళితుల్లోనే బాగా కింది స్థాయిలో వున్నాయనుకుంటే వారికంటే అధమస్థాయిలో భంగీలు వుంటారు. సమాజంలో అట్టడుగున వున్న వారు కూడా భంగీలను అంటరానివారుగా పరిగణిస్తారు. భంగీలతో వారు ఏ విధమైన సంబంధాన్నీ కలుపుకోరు. భంగీలు హిందువులుగానే పరిగణించబడినప్పటికీ, కుల అణిచివేత నుంచి విముక్తి కావడం కోసం ఈ మధ్య కాలంలో కొందరు క్రిస్టియానిటీలోకి మారటం జరిగింది. హిందూ సామాజిక వ్యవస్థలో భంగీలు అట్టడుగు మెట్టులో వున్నారు. కొంత మంది భంగీలు సన్యాసులుగా కూడా మారారు. ఉదాహరణకు మహర్షి నావల్ రామ్, అతని కొడుకు దయారామ్ మహారాజ్, రామ్‌భక్ష్ మహారాజ్, భద్రిరామ్ మహారాజ్, సంత్ ఉమేద్‌రామ్ మహారాజ్ అతని వారసుడు సుఖరామ్ మహారాజ్, దీపామ్ మహారాజ్, మంగేశ్వర్ రామ్ మహారాజ్. భంగీ సమూహానికి చెందినవారు అరుణాచల్‌ప్రదేశ్, అసోం, బీహార్, చండీఘడ్, ఛత్తీస్‌ఘడ్, దాద్రా - నాగర్‌హవేలీ, దామన్–దయ్యూ, ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, ఒడిస్సా, పంజాబ్, రాజస్థాన్‌లలో విస్తరించి వున్నారు.

## వాతల్

బార్‌వల, బాసిత్, బాత్‌వల్, ఛూడా, ఛమార్, రామ్‌దసియా, ధ్యార్, డూమ్, మహష, గర్ది, జులాహ, మేఘ్, కబీర్ పంతి, రాతల్, సర్యారా, వాతల్–ఇవన్నీ కూడా జమ్మూకశ్మీర్‌లో అధికారికంగా గుర్తించబడిన షెడ్యూలు కులాలు. రాష్ట్రంలో దళిత జనాభా మొత్తం జమ్మూ ప్రాంతంలోనే వుంటుంది. కశ్మీర్ లోయలోని దళితుల్లో రాతల్, వాతల్ కులాలే కనిపిస్తాయి. రాష్ట్రంలో హిందువులుగా వున్న దళిత సమూహాలను వదిలి పెడితే, అధికులు సిక్కు, క్రిస్టియన్, ఇస్లాంలలోకి మతాంతీకరణ చెందారు.

### బాస్‌ఫోర్

వీరిని బాసోర్, బాన్‌సోర్, బాన్‌సోడి, బస్కర్, బరుడ్ అని కూడా పిలుస్తారు. అయితే వీరందరూ తమని తాము దోమ్ సమూహానికి చెందిన ఉపకులాలుగా చెప్పుకుంటారు. బాస్‌ఫోర్ అనే పదానికి 'చీలిన వెదురు' అనే పదబంధం మూలం. సుపత్ భగత్ వారసులైన బెన్‌రాజా, మరికొంతమందికి అనుచరులుగా వీరు తమని తాము భావించుకుంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ సమూహం అజంఘర్, గోరఖ్‌పూర్, బల్లియ, వారణాసి, అలహాబాద్ జిల్లాల్లో స్థిర నివాసం ఏర్పరచుకుంది. మధ్యప్రదేశ్‌లో సాగర్,

దామోహ్, రేవా, సత్నా, జబల్‌పూర్ జిల్లాలలోనూ వీరు నివసిస్తున్నారు. మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలో కూడా వీళ్ళు కనిపిస్తారు. ఈ సమూహం రాజస్థాన్, అసోం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరంలలో సైతం శుభ్రం చేసే పని చేస్తున్నారు.

**అరుంధతియార్**

తమిళనాడులోని చెక్కిలియాన్ సమూహాన్నే అరుంధతియార్ అని పిలుస్తారు. చెక్కిలియాన్ అన్న సంబోధనకన్నా అరుంధతియార్ అన్న పేరు కొంత గౌరవప్రదంగా వుండటమే దీనికి కారణం. కొన్ని సమయాల్లో మాదిగ సమూహం కూడా తమని తాము అరుంధతియార్ లేదా అరుంధతీయులుగా చెప్పుకుంటారు. పురాణాల్లోని అరుంధతి నుంచి ఈ పేరు వచ్చింది. అరుంధతిని వశిష్ఠముని భార్యగా చెప్తారు. అరుంధతి శూద్రకులానికి చెందిన స్త్రీ. ఆమె తండ్రి కర్దామ్ (అర్థం 'మట్టి'). ప్రచారంలో వున్న కథ ప్రకారం అరుంధతి తండ్రి కర్దామ్‌కి ఆనాటి సమాజంలో ఉన్నతమైన స్థానం వుండేది. ఫలితంగా ఆయన శూద్రుడు అనే విషయం మరుగున వుండిపోయింది. తమిళనాడుసహా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళలలో కూడా అరుంధతీయులు కనిపిస్తారు.

**మాదిగ**

ఈ పేరుకి ప్రత్యేకమైన అర్థమేమీ ఇప్పటివరకూ లేదు. కొందరి అభిప్రాయం ప్రకారం వీళ్ళు మాతంగి, జాంబవ వారసులు. సంప్రదాయికంగా మాదిగలు తోళ్ళపని చేస్తూవుండేవారు. చెప్పులు కుట్టేపనితో పాటు పాకీపని కూడా వీళ్ళ వృత్తిగానే వుండేది. మాదిగ సమూహం మూలాలు గురించి రకరకాల నమ్మకాలు వున్నాయి. మాదిగలు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలలో వున్నారు.

**రెల్లి**

ఈ సమూహానికి చెందిన వారిని సచ్చారి, చచ్చాతి, రెల్లి చచ్చాతి అని కూడా పిలుస్తారు. వీళ్ళు మాత్రం తమని సప్రి లేదా సప్రు అని పిలవటానికే ఇష్టపడతారు. ఆంధ్రప్రదేశ్‌లోని పది జిల్లాలలో వీరు నివసిస్తారు. తెలుగులో రెల్లి అంటే ఒక రకమైన గడ్డి. పూర్వం ఈ సమూహానికి చెందినవారు కొండల మీద జీవిస్తూ గడ్డి అమ్మటమే వృత్తిగా జీవించేవారు. ఆ అందుకే వీరికి ఆ పేరు వచ్చింది. కాలానుగుణంగా రెల్లి, చచ్చాతి సమూహం తమ గడ్డి అమ్ముకోవటం అనే వృత్తిని వదిలిపెటి పండ్లు అమ్మటం మొదలు పెట్టారు. ఇప్పటికీ వీరు పండ్లు, విత్తనాలను అమ్ముతుంటారు. వీరిలో కొంత మంది శుభ్రం చేసే పనిని ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఒడిస్సాలో కూడా రెల్లీలు వున్నారు.

**మెహతర్**

ఈ పదానికి అసలు అర్థం మహారాజు లేదా నాయకుడు. విషాదం ఏమిటంటే ఈ పేరుని సంప్రదాయికంగా కొనసాగుతున్న పాకీపనికి, శుభ్రం చేసే వారికి పెట్టటం!

దేశంలోని వివిధ ప్రాంతాల్లో మెహతర్‌లకు వేరే పేర్లు వున్నాయి. భంగి, లాల్‌బేగీ మొదలైనవి. సంత్ లాల్‌బేగీ అనుచరులు మెహ్‌తర్ లాల్‌బేగీగా సుపరిచితులు. వీరిలో హిందువులు వున్నారు. అలాగే ముస్లిములు కూడా వున్నారు. పాకీపని వీళ్ళ సంప్రదాయ వృత్తి. మెహతర్లు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, బీహార్, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, జార్ఖండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, ఒడిస్సా, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో నివసిస్తున్నారు.

**వాల్మీకి**

షెడ్యూలు కులాల్లో ఇప్పుడు వాల్మీకులదే పెద్ద సంఖ్య. భంగి, మెహతర్, లాల్‌బేగి, చూడా–ఇంకా అనేక ఇతర పాకీ పనిచేసే కులాలు ఈ సమూహంలో అంతర్భాగం. ఇప్పుడు ఇదే అతి పెద్ద సమూహంగా గుర్తించబడుతోంది. వాల్మీకి మునిని వీరు తమ పూర్వీకుడుగా భావిస్తారు. వాల్మీకుల ప్రధాన వృత్తి పాకీపని. మున్సిపాలిటీలలో శుభ్రం చేసే వారిలో అత్యధికులు వీరే! చండీఘడ్, ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ, ఒడిస్సా, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో వీరు కనిపిస్తారు.

**పాకీ**

వీళ్ళని తోటి లేదా మోటీ అని కూడా పిలుస్తారు. పాకీ అనే పదం ఒక పక్షి నుంచి వచ్చింది. సంప్రదాయికంగా వీరి వృత్తి పాకీపని, మున్సిపాలిటీలలో ఊడ్చేపని. గ్రామాల్లో పాకీ పనివారుగా వుంటూనే, వ్యవసాయపు పనులు కూడా చేస్తుంటారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్నారు.

**తోట్టీ**

గ్రామీణ ప్రాంతాల్లో పాలేర్లుగా వుండే సమూహం ఇది. వీరి పేరు బహుశా తొండు (ఈ పదానికి అర్థం–తవ్వటం) అనే పదం నుంచీ లేదా తోట్ (అర్థం: అన్ని వైపులకు వెళ్ళటం) అనే పదం నుంచిగానీ వచ్చివుంటుంది. తోట్టీవారు ప్రజలకు గ్రామసభలు ఇచ్చే సమన్లు అందివ్వడం కోసం, ఏదైనా సమాచారాన్ని అందజేయటం కోసం అన్ని దిక్కులకు ప్రయాణించేవారు. తోట్టీ కుటుంబాల్లో తరతరాలుగా సంక్రమిస్తున్న పాకీపని, ఊడ్చేపని ద్వారా ఆడవాళ్ళు సంపాదిస్తారు. దాదాపు తోట్టీలందరూ కూడా భూమి లేనివారే. గ్రామీణ సమాజానికి సేవకులుగా పనిచేస్తారు. దండోర ద్వారా సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తారు. ఇప్పుడు ఎక్కువ మంది పాకీపని చేయటంతో పాటు మున్సిపాలిటీలలో, నగర కార్పొరేషన్‌లలో, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన వాటిలో చెత్త ఏరటం, ఊడ్చేపని చేస్తున్నారు. ఈ కులసమూహానికి చెందిన వారు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడుల్లో జీవిస్తున్నారు.

## ధనుక్

ధనుక్ లేదా ధనక్ ఒక అణగారినకులం. పెళ్ళిళ్ళలో బాజాలు వాయించటం, నీళ్ళు అందించటం వీళ్ళ వృత్తి. ఆడవాళ్ళు మంత్రసాని పని చేస్తారు. ధనక్ అనే పదానికి చాలా మూలాలు వున్నాయి. ధనుష్ (విల్లు) అనే పదం నుంచి వచ్చిందని కొందరు, ధాన్ (వరి) అనే పదంనుంచి వచ్చిందని కొందరు చెప్తారు. ధనక్‌ముని అనుచరులు కాబట్టి తమ సమూహానికి ధనక్ అని పేరు వచ్చిందని మరికొంత మంది చెప్తారు. వీరు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, చండీఘడ్ రాష్ట్రాల్లో నివసిస్తున్నారు.

## జత పరిచినవి

## పాకీ పనికి ఇచ్చే నిర్వచనం

పాకీపని అంటే అర్థం మనుషులు ఏరిగిన పియ్యిపెంటని మరో మనిషి (అతడు లేదా ఆమె) చేతులతో ఎత్తి పారబోసి, శుభ్రం చేయటం. ఈ పని వ్యక్తిగత పాకీదొడ్లలోనూ, ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సామూహిక పాకీదొడ్లలోనూ జరుగుతుంది. సాధారణంగా ఈ పని రెండు విధాలుగా జరుగుతుంది. మొదటిది: ఎత్తుడుదొడ్లలో పాకీ వ్యక్తి ఒక బక్కెట్‌లోనో లేదా ఏదైనా బుట్టలోనో మనుషులు ఏరిగిన పియ్యిపెంటను ఎత్తి దూరంగా నిర్దేశించిన ప్రాంతానికి వెళ్ళి పారవేయటం. రెండోది: వ్యక్తిగత ఇళ్ళల్లోనూ లేదా మున్సిపాలిటీలలో సెప్టిక్ ట్యాంకులను (లేదా మురుగ్గుంటలను) శుభ్రం చేయటం.

పియ్యిపెంటతో నిండిన సెప్టిక్‌ట్యాంకులను శుభ్రం చేయటం అనేది సాధారణంగా రాత్రిపూట జరుగుతుంది. దీనికి ఎక్కువమంది మనుషులు అవసరమవుతారు. స్త్రీ పురుషులిరువురూ ఈ పనిని కలిసి చేస్తారు. ఇళ్ళల్లోని ఎత్తుడుదొడ్లు, సామూహిక పాకీ దొడ్లను సాధారణంగా ఆడవాళ్ళే శుభ్రం చేస్తారు. దేశంలో ఏ మూలైనా సరే ఇదే పద్ధతి కొనసాగుతోంది. పని చేసే విధానమే కొంత భిన్నంగా వుంటుంది. స్థానిక పద్ధతులు, అవసరాలకనుగుణంగా ఈ పద్ధతులను మార్చుకున్నారు. ఉత్తర భారతదేశంలో సామూహిక పాకీదొడ్లు సాధారణంగా ఎత్తుడుదొడ్లు కాదు. అదే దక్షిణ భారతదేశంలో ఇలాంటి సామూహిక పాకీదొడ్లు పంచాయితీలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో వుంటాయి. కొన్ని రాష్ట్రాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవటమో లేదా నీళ్ళు ఉపయోగించే ఫ్లష్‌టాయిలెట్ల వైపుగా విధాన నిర్ణేతల ఆలోచన సాగకపోవడం వల్లనో దుర్మార్గమైన ఈ ఫ్యూడల్ అణిచివేత కనిపిస్తుంది. చిరు జీతాలతో సతమతమయ్యే ప్రజల్లోనూ, అలానే ముస్లింకాలనీల్లో వుండే ప్రజల్లోనూ ఈ పరిస్థితి ప్రబలంగా కనిపిస్తుంది. ఫ్యూడల్ భావజాలంతో కూడిన అమానవీయమైన పని అమలు జరుగుతున్న ఉదంతాలు వేలల్లో మనం చూడొచ్చు. పంజాబ్, హర్యానాలలో లక్షలాది రూపాయల వ్యయంతో కట్టించిన చాలా భారీ భవంతుల్లో కూడా ఎత్తుడుదొడ్లను కట్టించడం మనం చూడొచ్చు. రాజస్థాన్‌లో ఆడవాళ్ళు పియ్యిపెంటతో వున్న బుట్టలను ఒకదాని మీద ఒకటి పెట్టుకుని మహారాజ

భవంతుల్లోంచి రావటం మనం చూస్తాం. ఈ పని చేసినందుకు వారికి దక్కే ప్రతిఫలం కేవలం పాసిపోయిన రొట్టె, కూలీగా కొద్దిపాటి డబ్బు మాత్రమే. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో, అలాగే కాన్పూర్, అలీఘర్‌లోని పాతబస్తీల్లో ఆడవాళ్ళు అప్పుపద్ధతిలో పేదకుటుంబాల్లో పాకీపని చేస్తూ కనిపిస్తారు. ఈ ప్రాంతాలన్నిటా కూడా పాకీ పనిచేసే ఆడవాళ్ళని ఏహ్య భావంతో చూస్తారు. ఈ ఆడవాళ్ళు, వారి కుటుంబాలు నిర్బంధంగా తమ జీవితకాలమంతా కూడా ఇలానే జీవించేలా నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో వారెప్పుడూ అట్టడుగునే వుండే పరిస్థితులు కల్పించబడ్డాయి.

## కనిపించని పాకీవాళ్ళను గుర్తించటం

దేశంలో పాకీవాళ్ళని వివిధ పేర్లతో పిలుస్తూ వుంటారు. పాకీపని చేసే విధానం, ఉపయోగించే సాధనాలు భిన్నంగా వుంటాయి. అంతేకాదు, ఈ మురికి పెంటపని చేసినందుగాను వారు అందుకునే వేతనాలు కూడా వ్యత్యాసాలతో కూడుకొని వున్నాయి. ఏదేమైనా కులమే వీరిని కలిపి వుంచే ఐక్యతాసూత్రం. తుచ్ఛమైనవారుగా, ఏమాత్రం గౌరవ మర్యాదలకు నోచుకోకుండా నిత్యం అవమానాలకు గురయ్యే వీరు చేసిన నేరం ఏమిటయ్యా అంటే తమ ప్రమేయం లేకుండానే ఈ అట్టడుగుకులంలో పుట్టడం. పాకీ మనుషుల నీడ పడినాగానీ అపవిత్రమైపోతామనే భావనతో ఇతరులు వీరు కనిపిస్తే దూరానికి తొలగిపోతుంటారు. పూర్వపు రోజుల్లో అయితే వీరు తమ కోసం మాత్రమే కేటాయించబడిన మార్గంలో నడవాల్సి వచ్చేది. తాము వచ్చేముందు సంకేతంగా గట్టిగా అరిచి చెప్పాల్సి వచ్చేది. వారి అరుపు వినిపిస్తే ఇతరులు తమ కనుచూపు మేరలో పాకీ మనుషులు కనిపించకుండా తప్పుకునేవారు. వీరి పేర్లు కూడా వీళ్ళు చేసే పనితో తప్పనిసరిగా ముడిపడి వుంటాయి. దేశంలోని కొన్ని ప్రాంతాలలో వీరు తమ వీపు కిందిభాగంలో నడుముకు ఒక చీపురును కట్టుకుని తాము నడిచినంత మేరా ఆ చీపురుతో శుభ్రం చేసుకుంటూ రావాల్సివచ్చేది. ఆధిపత్యకులాల వారి సమీప పరిసరాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్ళకూడదు. ఈ దుస్థితి ఈనాటికీ కూడా మారలేదు. పశువు కూడా ఇంత దారుణమైన పరిస్థితిని ఎదుర్కోదు. పాకీపని, అంటరానితనం చెట్టాపట్టాలు వేసుకుని విజృంభించడమే కులవ్యవస్థ తాలూకు వికృత కృత్యం. పాకీ పనివారు హిందూ సమూహాల్లో, ముస్లిం సమూహాల్లో కూడా వున్నారు.

వివిధ రాష్ట్రాల్లో పాకీ పనివారిని అనేక పేర్లతో పిలుస్తుంటారు.

| రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం | పేరు |
|---|---|
| పశ్చిమ బెంగాల్ | హరి, హాడి, బాఫోద్, దోమ్ |
| ఉత్తరప్రదేశ్ | భంగి, వాల్మీకి, ధనుక్, మెహతర్, దోమ్ |
| మధ్యప్రదేశ్ | మెహతర్, భంగి, హేలా, హలాల్‌ఖోర్, వాల్మీకి, దోమ్ |
| అసోం | మెహతర్, భంగి, బాన్‌ఫార్ |

| | |
|---|---|
| ఒడిస్సా | మెహతర్, భంగి, బాస్ఫోర్ |
| బీహార్ | మెహతర్, హలాల్ఖోర్, దోమ్, దోమార్ |
| తమిళనాడు | తోట్టి, అరుంధతియార్, మాదిగ, కటునాయగర్ (ఆదివాసీ), చెక్కిలయార్ (చెప్పులు కుట్టేవారు) |
| ఆంధ్రప్రదేశ్ | మాదిగ, రెల్లి, యానాది (ఆదివాసీ సంచారజాతి), హలాల్ఖోర్, మెహతర్, లాల్బేగి |
| పంజాబ్ | మీరా, లాల్బేగి, ఛూడ, బాల్షాహి, వాల్మీకి |
| మహారాష్ట్ర | ఘరే, భంగి |
| గుజరాత్ | భంగి, వాల్మీకి, మల్కానీ |
| ఢిల్లీ | భంగి, వాల్మీకి, ఛూడ |
| కర్నాటక | మాదిగ, తోట్టి, మడిగరు, భోవి |
| కేరళ | మాదిగ, అరుంధతియార్ |
| రాజస్థాన్ | భంగి, మెహతర్, ఛూడ, వాల్మీకి |
| జార్ఖండ్ | దోమ్, హాడి, వాల్మీకి |
| జమ్ము కశ్మీర్ | వాతల్, మోచి, షేక్, వాల్మీకి |
| హిమాచల్ప్రదేశ్ | వాల్మీకి, ఛూడ |

## పాకీపనిపై చారిత్రక దృక్పథం

కులవ్యవస్థ ఎప్పుడైతే వేళ్ళూనికుని విస్తరించిందో అప్పటినుంచే ఈ విధానం మొదలై వుంటుందనేది ప్రగాఢమైన నమ్మకం. పలు చారిత్రక సందర్భాలను పరిశీలించినప్పుడు నీళ్ళ సదుపాయంతో కూడిన పాకీదొడ్లు వున్నట్లు సాక్ష్యాధారాలు వున్నాయి. ఉదాహరణకు అహమ్మదాబాద్కు అరవై రెండు కిలోమీటర్ల దూరంలో వున్న లోథల్లో జరిపిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన హరప్పా మొహంజదారో నాగరికత కాలంనాటి (2500 బిసిఇ) ప్రతి ఇల్లు నీటి వసతితో కూడిన పాకీదొడ్లను కలిగివుందని, అవన్నీ కూడా మురుగుకాల్వలకు అనుసంధానించబడి, కాల్చిన ఇటుకలతో వాటి పై భాగాన్ని మూసివుంచారని కనుగొన్నారు.

ఆ తర్వాతి కాలంలో బానిసల ప్రధానమైన వృత్తి పాకీపనే అని ఎన్నో ఆధారాలు చెప్తున్నాయి. కొంత మంది దీనిని మొగల్ మహారాజులు భారతదేశానికి రావటంతో ముడిపెట్టి చూసి, ఆ విధంగా వారి మీద నెపం వేయటానికి చూస్తారు. ఇది బలహీనమైన వాదమే కాక చరిత్రను కాషాయీకరించటానికి చేసే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. హిందూయిజంలోనే కులవ్యవస్థ అంకురించిందనే విషయమూ, ఈ దుర్మార్గమైన వ్యవస్థ దళితుల మీద శతాబ్దాల తరబడి అణిచివేత విధానాలను పాటిస్తూ, అమానవీయమైన పనులను వాళ్ళ నెత్తిమీద రుద్దుతూ వచ్చిందనేది పచ్చి నిజం. పాకీపని అందులో భాగం.

పెరిగిన నగరీకరణలో పాకీపని కూడా అదేస్థాయిలో విస్తృతమవుతూ వచ్చిందనడానికి గత 200 సంవత్సరాల చరిత్రే సాక్ష్యం. బ్రిటిష్ పాలనలో దీనికి ఒక వ్యవస్థీకృత రూపం ఇచ్చారు. ఆర్మీ కంటోన్‌మెంట్ ప్రాంతాల్లో, మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా పాకీపని వారికి ఉద్యోగాలు కల్పించారు. అయితే దీనర్థం బ్రిటిష్ వారు పాకీపనిని మొదలు పెట్టించారని కాదు. ఈ వృత్తిని నిర్మూలించే బదులు దీనికొక వ్యవస్థీకృత రూపం ఏర్పరచి, దేశంలోని ప్రతి మూలకూ ఈ పనిని విస్తరింపచేశారు. ఈ కాలంలోనే పాకీపని వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. సంప్రదాయ కళలు, వృత్తులను ధ్వంసం చేయటంతో పాటు, పెరిగిన కరువు కాటకాలు, వ్యవసాయంపై శిస్తురూపంలో సాగిన దుర్మార్గమైన దోపిడీ విధానం – ఇలాంటి పలు కారణాల రీత్యా లక్షలాది మంది ముఖ్యంగా దళితులు ఈ పనిని బలవంతంగా చేయవలిసి వచ్చింది. దేశ విభజన సమయంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఇతర కులాలకు చెందిన హిందువులను వెనక్కి పంపించివేసింది. సఫాయి కర్మచారీలను (పాకీ పనివారిని) అట్టే పెట్టేసుకుంది. దీని వెనుక వున్న అసలు కారణం సఫాయి కర్మచారీలు కూడా భారతదేశానికి వెళ్ళిపోతే ఇంక అక్కడ ఎవ్వరూ మరుగుదొడ్లను శుభ్రం చేయటానికి వుండరనే భయం! ఇదేవిధంగానే భారత ప్రభుత్వం కూడా స్వదేశానికి తిరిగి వచ్చేసిన, వచ్చేస్తూవున్న హిందువుల గురించే ఆందోళన పడింది. కానీ ఎవ్వరూ కూడా సఫాయి కర్మచారీల గురించి కనీసపాటి ఆలోచన కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం సఫాయి కర్మచారీలను అత్యవసర సేవల కింద పరిగణించి వారిని అక్కడే నిర్బంధంగా వుంచాలనుకోవటం మీద ఆందోళన వ్యక్తం చేస్తూ, భారత ప్రభుత్వం ఈ విషయమై తక్షణం జోక్యం చేసుకోవాలని రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకి ఒక ఉత్తరం కూడా రాశారు. అయితే అంబేద్కర్ విజ్ఞాపనను ఎవ్వరూ పట్టించుకోలేదు. అదే నిర్లక్ష్యం ఇప్పటివరకూ కొనసాగుతూనే వుంది. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత అభివృద్ధి పేరుతో ఎన్నో విషయాలు ముందుకు వస్తున్నప్పటికీ, ఈ అమానవీయమైన విధానం నేటికీ కళ్ళముందు కనిపిస్తూనే వుంది. విధాన నిర్ణేతల్లో నరనరానా జీర్ణించుకుపోయిన కులతత్వ ఫ్యూడల్ ఆలోచనా విధానానికి ఇది అద్దం పడుతుంది.

భారత ఉపఖండంలోని భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలలో ఏదో ఒక రూపంలో ఈ అమానవీయమైన విధానం విస్తృతంగానే కొనసాగుతోంది. దీనికి పునాది కులం లేదా మతం. కొన్ని ప్రాంతాల్లో ఈ రెండూ కూడా.

## ఎత్తుడుదొడ్లు (డ్రై లెట్రిన్లు)

దేశంలో వివిధ రకాలైన ఎత్తుడుదొడ్లను మనం గమనించవచ్చు. పేరు సూచించినట్లుగానే వీటిలో ఏ విధమైన నీటిసౌకర్యం వుండదు. ఆధునిక పాకీదొడ్లకు నీటిని వదిలే సౌకర్యం వుండి అవి పెద్దపెద్ద మురుగు కాల్వలకు లేదా మురుగుగొట్టాలకు

అనుసంధానించి వుంటాయి. ఎత్తుడుదొడ్లలోని పియ్యిపెంట దానంతట అదే ఎండి మట్టిలో కలిసిపోదు. వాటిని ఎవరైనా చేతులతో ఎత్తి పారబోయవలసిందే. ఈ పాకీదొడ్లలో పలు రకాలున్నాయి. వాదా పాకీదొడ్లు, వాదోలియ పాకీదొడ్లు, మోరీలు మొదలైనవి.

వాదా పాకీదొడ్లలో నాలుగ్గోడల మధ్య సిమెంట్ చప్టా మీద లేదా నేల మీద జనం దొడ్డికి కూర్చుంటారు. అనంతరం పాకీపనివాళ్ళు వచ్చి బూడిద, చీపురు, బుట్టలు, రేకుముక్కల సాయంతో ఆ పెంటనంతా ఎత్తుతారు. పియ్యిపెంటతో నిండిన బుట్టలను నెత్తిమీద కానీ భుజం మీద కానీ పెట్టుకుని మోసుకెళ్ళి దీనికోసమే నిర్దేశించిన మురుక్కాలువలోగానీ, నదిలో గానీ లేదా పెద్ద మురుగ్గుంటలో గానీ పారబోస్తారు. ఇవి సామూహిక పాకీదొడ్ల కోవలోకి వస్తాయి. అదే ఇళ్ళల్లో అయితే ఈ ఎత్తుడుదొడ్లు ఇళ్ళ వెనుక తాత్కాలిక లేదా శాశ్వత ప్రాతిపదికన నిర్మించుకుంటారు. చాలా రాష్ట్రాల్లో వున్న పాకీదొడ్డిలో మధ్యలో గుంటపెట్టి కూర్చోవటానికి వీలుగా ఏర్పాటు చేస్తారు. ఆ గుంట కింద బక్కెట్ లేదా బుట్ట పెట్టి దానిలోకి విసర్జితాలు పడేలా అమర్చుతారు. పాకీపని చేసే ఆడవాళ్ళు వచ్చి ఈ బక్కెట్లలో పడే పియ్యిపెంటను తోడి బుట్టల్లోకి ఎత్తి చాలా దూరానికి తీసుకెళ్ళి పారవేస్తారు. పియ్యిపెంటలతో వుండే పీతిగుంటలు బయటికి కనపడకుండా పైపైన కప్పివుంచడంతో అలాంటి పాకీదొడ్డి ఒకటి అక్కడ వుందన్న సంగతి కొత్తవారు కనిపెట్టలేరు.

నిరంతరం నీళ్ళువాడే అవకాశం వున్న పాకీదొడ్లు కనిపిస్తున్నప్పటికీ ఇప్పటికీ వాటిని కూడా పాకీ పనివాళ్ళే శుభ్రం చేస్తున్నారు. చాలా మెట్రోపాలిటన్ నగరాలలో సరైన మురుగునీటి పారుదలకు అవసరమైన కాలవలను నిర్మించకపోవటంతో ఆయాచోట్ల – ఫ్లష్ టాయిలెట్లు వున్నప్పటికినీ వాటిని భూగర్భట్యాంక్‌లకు కలుపుతున్నారు. ఇవి సెప్టిక్ ట్యాంకులు కాదు. ఈ ట్యాంకులలో నిండే మానవ విసర్జితాలు వాటికవే తొలగిపోవు. వాటిని శుభ్రం చేయటానికి మళ్ళీ మనిషి చేతులే అవసరమౌతాయి. ఒకసారి వాటిని తెరిచారో, అందులోంచి వచ్చే దుర్గంధం ఆ ప్రాంతమంతా వ్యాపించి నిలబడనీయకుండా చేస్తుంది. అందుకే వాటిని రాత్రిపూట మాత్రమే శుభ్రం చేయటం జరుగుతుంది. పగటిపూట జనం తిరుగుతున్నప్పుడు భరించలేని ఆ దుర్గంధంతో కూడిన ఆ విసర్జితాలను శుభ్రం చేయటమనేది కష్టతరమైనపని. ఆ ట్యాంకులలోకి దిగి శుభ్రం చేసే వ్యక్తులు కూడా పగటి ఉష్ణోగ్రత వల్ల ఆ పియ్యిపెంటలోనుంచి వచ్చే వేడిని తట్టుకోవడం అసాధ్యం. ఈ ట్యాంకులను స్త్రీ పురుషులిరువురూ శుభ్రం చేస్తారు; కొన్నిసార్లు సంఖ్యపరంగా మగవాళ్ళే ఎక్కువుంటారు. ఏదైనా సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసే పనిని ఒక వ్యక్తి గుత్తకు తీసుకుంటాడు. తదుపరి అతను వేరే వాళ్ళను తనకింద పని చేయటానికి పిలుస్తాడు. అటు ఉత్తర భారతదేశం మొదలు ఇటు సముద్రతీరం వరకూ వ్యాపించి వున్న ఇలాంటి పాకీదొడ్ల సంఖ్య వింటే బుర్ర తిరిగిపోతుంది. వీటిని గుర్తించటం కూడా కష్టం. ఎందుకంటే వీటిని కేవలం రాత్రిపూటే శుభ్రం చేస్తారు.

జైన సన్యాసులు, సన్యాసినులు వాళ్ళ ఆశ్రమాలలో ఎత్తుడుదొడ్లనే ఉపయోగిస్తారు. ఎందుకంటే నీటిని ఫ్లష్ చేస్తే ఆ పియ్యిపెంటలో వున్న సూక్ష్మక్రిములు చనిపోతాయని వాళ్ళ నమ్మకం. అలా చేయడం వారి దృష్టిలో మత విరుద్ధం. అందుకే వారు కూడా పాకీ పనివాళ్ళను పెట్టుకుంటారు.

2001 జనాభా లెక్కల ప్రకారం పాకీపని, శుభ్రం చేసే పనిచేస్తున్న షెడ్యూలు కులాల జనాభా ఈ కింది విధంగా వుంది:

| క్రమ | రాష్ట్రం | కులం | 2001 జనాభా లెక్కల ప్రకారం వున్న జనాభా |
|---|---|---|---|
| 1. | ఆంధ్రప్రదేశ్ | అరుంధతీయార్, చంభార్, ఘూసీ, హాది, రెల్లి, ఛాచండి, మాదిగ, మెహతర్, దాసు, మాష్టిన్, పాకీ, మోటీ, తోటీ | 62,52,198 |
| 2. | అరుణాచల్‌ప్రదేశ్ | బనాస్‌ఫార్, లాల్‌బేగి, మెహతర్, భంగి | 610 |
| 3. | అసోం | బనాస్‌ఫార్, లాల్‌బేగి, మెహతర్, భంగి | 28,027 |
| 4. | బీహార్ | హలాల్‌ఖోర్, హారి, మెహతర్, భంగి, లాల్‌బేగి | 1,86,517 |
| 5. | చండీఘడ్ | వాల్మీకి, ఛూడా, భంగి, ధానక్, మజ్‌హబి | 73,746 |
| 6. | ఛత్తీస్‌ఘడ్ | భంగి, మెహ్‌తర్, వాల్మీకి | 16,534 |
| 7. | దాదర్, నాగర్ హవేలీ | భంగి | 433 |
| 8. | దామన్, దయ్యూ | భంగి, హాది | 1,422 |
| 9. | ఢిల్లీ | భంగి, ఛూడా(వాల్మీకి), లాల్‌బేగి, మజ్‌హబి | 5,14,895 |
| 10. | గోవా | భంగి, హాది, చంభార్ | 7,824 |
| 11. | గుజరాత్ | భంగి, మెహ్‌తర్, ఓల్గానా | 4,07,083 |
| 12. | హర్యానా | వాల్మీకి, ఛూడా లేదా భంగి, మజ్‌హబి | 4,07,083 |
| 13. | జమ్ము, కశ్మీర్ | ఛూడా | 3,855 |
| 14 | జార్ఖండ్ | హాయర్, మెహ్‌తర్, భంగి, హలాల్‌ఖోర్, లాల్‌బేగి | 37,579 |

| క్రమ | రాష్ట్రం | కులం | 2001 జనాభా లెక్కల సంఖ్య ప్రకారం వున్న జనాభా |
|---|---|---|---|
| 15. | కర్నాటక | అరుంధతియార్, భంగి, ఓల్గానా, మెహతర్, ఛండాలా, మాదిగ, తోట్టి | 13,17,656 |
| 16. | కేరళ | అరుంధతియార్, ఛండాలా, తోట్టి | 2,577 |
| 17. | మధ్యప్రదేశ్ | భంగి, మెహ్‌తర్, వాల్మీకి | 3,09,921 |
| 18. | మహారాష్ట్ర | భంగి, మెహ్‌తర్, ఓల్గానా, మాదిగ | 1,93,208 |
| 19. | మేఘాలయ | బనాస్‌ఫోర్, లాల్‌బేగి, మెహ్‌తర్, భంగి | 1,054 |
| 20. | మిజోరం | బనాస్‌ఫోర్, లాల్‌బేగి, మెహ్‌తర్, భంగి | 11 |
| 21. | ఒడిస్సా | ఛండాల, మాదిగ, మెహ్‌తర్, భంగి, రెల్లి, వాల్మీకి | 18,485 |
| 22. | పుదుచ్చేరి | మాదిగ, తోట్టి | 880 |
| 23. | పంజాబ్ | వాల్మీకి, ఛూడా లేదా భంగి, మజ్‌హబి | 5,11,878 |
| 24. | రాజస్థాన్ | బనాస్‌ఫోర్, బాన్స్‌ఫోర్, భంగి, ఛూడ, మెహ్‌తర్, మజ్‌హబి | 5,11,878 |
| 25. | తమిళనాడు | అరుంధతీయార్, ఛండాల, మాదిగ, తోట్టి | 7,80,667 |
| 26. | త్రిపుర | మెహ్‌తర్ | 2,106 |
| 27. | ఉత్తరప్రదేశ్ | వాల్మీకి, బనాస్‌ఫోర్, హేల, లాల్‌బేగి, మజ్‌హబి | 12,68,049 |
| 28. | ఉత్తరాఖండ్ | వాల్మీకి, బనాస్‌ఫోర్, హారి, హేల, లాల్‌బేగి, మజ్‌హబి | 94,975 |
| 29. | పశ్చిమబెంగాల్ | ఘాసీ, హలాల్‌ఖోర్, హారి, మెహ్‌తర్, మెహ్‌టోర్, లాల్‌బేగి, రాజ్‌బన్షి | 37,95,115 |
| | | **మొత్తం** | **1,97,25,376** |

## 2013 నాటికి అశుభ్రమైన వృత్తుల్లో వున్న వ్యక్తుల మొత్తం సంఖ్య

సాక్ష్యాధారాలతో (సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కథనాల సంక్షిప్త పాఠం)

| క్రమ సంఖ్య | రాష్ట్రం | మొత్తం జిల్లాలు సర్వే నిర్వహించినది | పాకీవారి నమోదు | వున్న వ్యక్తులు పాకీపని | సెప్టిక్‌ట్యాంక్ శుభ్రం చేయటం | రైలు కట్టలు శుభ్రం చేయటం | మురుగునీటి కాల్వలను శుభ్రం చేయటం | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | ఉత్తరప్రదేశ్ | 48 | 43 | 5,999 | 399 | 33 | 132 | 6,563 |
| 2. | బీహార్ | 32 | 27 | 995 | 1818 | 61 | 31 | 2,905 |
| 3. | రాజస్థాన్ | 22 | 21 | 806 | 30 | 2 | 21 | 859 |
| 4. | ఉత్తరాఖండ్ | 5 | 4 | 452 | 352 | 19 | 51 | 874 |
| 5. | జమ్మూ,కశ్మీర్ | 9 | 9 | 170 | 40 | 0 | 5 | 215 |
| 6. | ఒడిస్సా | 30 | 10 | 87 | 2,227 | 24 | 233 | 2,571 |
| 7. | పశ్చిమ బెంగాల్ | 12 | 5 | 29 | 50 | 0 | 13 | 92 |
| 8. | హిమాచల్‌ప్రదేశ్ | 9 | 2 | 28 | 101 | 0 | 0 | 129 |

| క్రమ సంఖ్య | రాష్ట్రం | మొత్తం జిల్లాలు సర్వే నిర్వహించినది | పాకీవారి నమోదు | పాకీపని | వున్న వ్యక్తులు సెప్టిక్‌ట్యాంక్ శుభ్రం చేయటం | రైలు కట్టలు శుభ్రం చేయటం | మురుగునీటి కాల్వలను శుభ్రం చేయటం | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| 9. | అసోం | 7 | 1 | 22 | 132 | 18 | 0 | 172 |
| 10. | పంజాబ్ | 8 | 1 | 13 | 0 | 0 | 0 | 13 |
| 11. | జార్ఖండ్ | 3 | 1 | 12 | 40 | 0 | 7 | 59 |
| 12. | మహారాష్ట్ర | 15 | 13 | 70 | 1 | 7 | 4 | 82 |
| 13. | గుజరాత్ | 1 | 1 | 4 | 0 | 0 | 0 | 4 |
| 14. | ఛత్తీస్‌ఘడ్ | 11 | 1 | 1 | 255 | 23 | 1 | 280 |
| 15. | మధ్యప్రదేశ్ | 13 | 10 | 425 | 432 | 14 | 27 | 898 |
| 16. | నాగాలాండ్ | 2 | 0 | 0 | 16 | 0 | 6 | 22 |
| 17. | కర్నాటక | 1 | 0 | 0 | 44 | 0 | 3 | 47 |
| 18. | హర్యానా | 1 | 1 | - | - | 9 | - | - |
| | **మొత్తం** | **229** | **150** | **9,113** | **5,937** | **210** | **534** | **15,794** |

# తెలంగాణ

## పియ్యిపెంటల నరకంలో పడేసి చంపేయాలనే కుట్ర

"మాకు తరచూ వినిపించేది, అనుభవమయ్యేది ఏమిటంటే మనం జీవితకాలంలో ఏదైనా మార్చగలుగుతాం కానీ మన కులాన్ని మాత్రం కాదు. కులం ముద్ర మా పుట్టుకతోనే మొదలయ్యి చచ్చిపోయేంత వరకూ కూడా మా వెన్నంటే వుంటోంది. ఆశ్చర్యమేమంటే, కొత్తగా ఏర్పడిన ఈ తెలంగాణ రాష్ట్రం కూడా మా కులాన్ని ప్రశ్నార్థకం చేయటం ద్వారా మా ప్రాథమిక హక్కులను పక్కకు నెట్టేస్తోంది. ఈ ప్రభుత్వం మా కులాన్ని గుర్తించడానికి సిద్ధంగా లేదు. అలానే మాకు, మా పిల్లలకు, కుటుంబాలకు ఏ రకమైన రిజర్వేషన్లను కూడా కల్పించటం లేదు. ఇది కచ్చితంగా మాకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రే."

"ఈ రాష్ట్రం ఏర్పడటానికి జరిగిన పోరాటాల్లో మేమూ ఎంతో చేశాం. కానీ ఇప్పుడు మమ్మల్ని కనీసం ఇక్కడి పౌరులుగా కూడా గుర్తించటం లేదు. కేవలం మాలాంటి దళితులతోనే వాళ్ళు ఇలా ప్రవర్తిస్తున్నారు. తరాతరాల నుంచి మా జీవితాలు ఈ నగరంలోని పియ్యిపెంటలను ఎత్తిపోయటంలోనే గడిచాయి. ఇప్పుడు మా పిల్లలు ఈ పని నుంచి బయటికి వచ్చి గౌరవప్రదమైన జీవితం కోసం చదువుకోవాలని అనుకుంటున్నప్పుడు ఈ కొత్త ప్రభుత్వం మాకు కనీసం కులం సర్టిఫికెటు ఇవ్వటానికి కూడా సిద్ధంగా లేదు."

"ఏం! మేము ఈ దేశ పౌరులం కాదా? ఈ రాష్ట్ర పౌరులం కాదా? మరి మేమెవరిమి? మేము ఇక్కడివాళ్ళం కాదని, మా పూర్వీకులు ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెనక్కి వెళ్ళిపొమ్మని చెప్పటానికి వీళ్ళెవరసలు?"

ఆగ్రహంతో ప్రశ్నిస్తున్న వీరంతా తెలంగాణలోని పాకీ సమూహానికి చెందిన వారు. హైదరాబాద్‌లో చార్మినార్‌కు దగ్గరలోవున్న సుల్తాన్‌షాహి దళితబస్తీలో వాళ్ళని మేము కలిసి మాట్లాడినప్పుడు వినిపించిన గొంతులు ఇవి. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ రాష్ట్ర పౌరులుగా వీరిని గుర్తించటానికి పుట్టుక గుర్తింపు కార్డులు చూపించాలని అడిగారు. దీనితో వీళ్ళు ఇప్పుడు తమ పుట్టుక గుర్తింపు కోసం అక్కడ ఇక్కడ అనకుండా ఎక్కడికంటే అక్కడికి తిరుగుతున్నారు. వీరంతా ఉత్తరప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిరపడ్డవారు కాబట్టి వాళ్ళు తమ ప్రాంతాలకే వెళ్ళిపోవాలని ప్రభుత్వ అధికారులు ఆజ్ఞాపిస్తున్నారు. తెలంగాణలో వారికి ఇప్పుడు స్థానం లేదు.

ఇంతకంటే తమకు జరిగే అవమానం మరొకటి లేదని శ్యామ్‌లాల్ అంటున్నాడు. ఇతను ఈ సమూహానికి పెద్దమనిషి. "ఇప్పటివరకూ మేమంతా ఈ సఫాయి పనే చేస్తున్నాము. కానీ ఇప్పుడు వాళ్ళంతా కుట్ర పన్ని మమ్మల్ని ఈ రాష్ట్రం నుంచి గెంటేయాలని చూస్తున్నారు. నిజానికి మేము నిజాంల కాలం నుంచీ ఇక్కడే వున్నామని ప్రతిఒక్కరికీ తెలుసు. కానీ యాభై ఏళ్ళ ముందు నుంచీ ఇక్కడే వుంటున్నట్లు ఆధారాలు చూపించ మంటున్నారు. దాన్ని మేమెక్కడి నుంచి తేగలం?" తాతల కాలం నుంచీ ఇక్కడే వుండి ఈ పియ్యిపెంటల పనే చేస్తున్నట్లుగా వారిని రుజువులు తీసుకురమ్మనటం మీద ఊహించినట్లుగానే ఈ సమూహం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది.

ఈ పరిస్థితి వారి పిల్లల భవిష్యత్తును మరింత సందిగ్ధంలోకి నెట్టేస్తోంది. అందుకే వారు దీన్ని సాధ్యమయినంత త్వరగా పరిష్కరించుకోవాలనుకుంటున్నారు. ఈ సమూహంలో వివిధ వయసుల వారు వున్నారు. ప్రతిఒక్కరూ కూడా మోసపోయామన్న భావనలోకి కూరుకుపోయారు. ఇప్పుడు వారి జీవనోపాధే ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం వీళ్ళు తన పౌరులు కాదు అంటోంది. వారి మూల స్థానాలకు వెళ్ళిపొమ్మని చెబుతోంది. వాస్తవానికి నిజాంల కాలం కంటే ముందే ఈ సమూహాన్ని ఇక్కడికి బలవంతంగా తీసుకు వచ్చారు. ఇప్పుడు ఏ రాష్ట్రం కోసమైతే వారు తెగించిపోరాడారో ఆ రాష్ట్రమే వారిని వెనక్కి వెళ్ళిపొమ్మని చెబుతోంది. విప్లవ గాయకుడు గద్దర్ పాడిన పాట 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా, పోరు తెలంగాణమా, రగులుతున్న గానమా'–ఇప్పటికీ వారి చెవుల్లో మారుమోగుతోంది. ఆ బస్తీలోని అనేక మంది యువకులు తెలంగాణ పోరాటంలో ప్రతిరోజూ ఈ పాటలు పాడినవాళ్ళే. కానీ దేశంలోనే కొత్తగా ఏర్పాటయిన ఈ రాష్ట్రంలో అధికారంలో కూర్చున్నవాళ్ళు ఈ విషయాన్ని పూర్తిగా మరిచిపోయినట్లు కనిపిస్తోంది.

ముప్పైఆరేళ్ళ రాకేష్ తన ఇద్దరు పిల్లలకు పాఠశాలలో ప్రవేశాన్ని పొందలేక పోయాడు. ఎందుకంటే స్థానిక ప్రభుత్వాధికారులు వీరికి కుల ధృవీకరణ పత్రం ఇవ్వటానికి సిద్ధంగా లేరు. తన తల్లి ఇక్కడే పని చేస్తుందని, ఆమెకు సంబంధించిన అన్ని పత్రాలను

అధికారులకు చూపించానని, కానీ వాళ్ళు తన తాతకు సంబంధించిన పత్రాలు తీసుకురమ్మని అడుగుతున్నారని రాకేష్ చెప్పాడు.

"యాభై ఏళ్ళ ముందునాటి పత్రాలను మేమెలా తీసుకురాగలుగుతాం? వాటి అవసరం ఇన్నేళ్ళ తర్వాత వుంటుందని ఎవరైనా ఊహించగలరా? మరి మేమెలా ఊహించగలం?"

"మేము గొప్పవాళ్ళ ఇళ్ళల్లో, పెద్ద పెద్ద ఇళ్ళల్లో పుట్టలేదు, ఇన్ని తరాలపాటు మేము ఆ పత్రాలను ఎక్కడని దాచివుంచగలుగుతాం! మేము చదువులేనోళ్ళం. ఈ విషయాలన్నీ మాకెట్లా తెలుస్తాయి?" అని అతని భార్య క్రిష్ణ ఆగ్రహంతో ప్రశ్నించింది. అదీకాకుండా, అందరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో వుండాలనేం వుంది? చాలా మంది తాతముత్తాతలు ప్రభుత్వ ఉద్యోగాల్లో లేరు. మరి వాళ్ళు ఎక్కడి నుంచి ఈ పత్రాలను తీసుకురాగలుగుతారు? ఉప్పల్ మున్సిపాలిటీ పరిధిలో నివశించే శివకుమార్ కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాడు. అతను కాంట్రాక్టు పద్ధతిలో టాయిలెట్లను శుభ్రం చేస్తుంటాడు. "మా పిల్లల కోసం నేను నా కులగుర్తింపు పత్రాన్ని సమర్పించాను. కానీ వాళ్ళు ఇప్పటికీ దాన్ని అంగీకరించటం లేదు. మేము ఈ రాష్ట్రానికి సంబంధించిన వాళ్ళం కాదని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని చూపిస్తున్నారు."

తన భవిష్యత్తంతా ఈ విషయం మీదే ఆధారపడి వుండటంతో ఇరవై ఒక్క సంవత్సరాల శ్రీకాంత్ కోపాన్ని ఆపుకోలేకపోతున్నాడు. ఒకరకమైన దక్కనీ యాసలో మాట్లాడుతూ, "నేను ఇప్పుడు బి.కామ్ చివరి సంవత్సరం చదువుతున్నాను. దాదాపు ఐదుసార్లు నేను కుల గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ నేను పెట్టిన దరఖాస్తు మండలాఫీసులోనే ఆగిపోయింది. నా తాతకు సంబంధించిన గుర్తింపు పత్రాలు తీసుకురావాలని వాళ్ళు అడుగుతున్నారు. ఇదసలు సమంజసమేనా? నేను వాళ్ళముందే నిలబడివున్నాను. మా నాయన కూడా ఆడే వుండె. కానీ వాళ్ళకు మా తాత ఆనుపానులు కావాల్నంట. ఇలాంటి కఠినమైనవన్నీ మాకే ఎందుకు పెడుతున్నారు? ఎందుకంటే మేము గౌరవప్రదమైన జీవితం కోసం కొట్లాడుతున్నాం కనుక" అని అన్నాడు.

కొత్తగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తమ పరిధిలో వున్న పాకీ సమూహాన్ని గుర్తించి వారికి గౌరవప్రదమైన ప్రత్యామ్నాయ జీవనోపాధుల్ని చూపించాల్సిపోయి, తెలంగాణ ప్రభుత్వం వారిని రాష్ట్రం నుంచి తరిమేయాలని చూస్తోంది. ఇది హైదరాబాద్‌లోని మెహతర్ సమూహానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రగా అభిప్రాయపడ్డాడు శ్యామ్‌లాల్.

"మేమంతా ఈ కుళ్ళు కంపు నుంచి బయటపడాలని, కనీసం మా తర్వాతి తరానికైనా మంచి భవిష్యత్తును అందించాలని నిర్ణయించుకున్న తర్వాత, అధికారంలో వున్న అగ్రకులాలు కుల గుర్తింపు కార్డులు ఇచ్చేదగ్గరి నుంచే మమ్మల్ని ఈ మురికిపెంటలోనే వుంచేసే కొత్త సాలెగూడును అల్లుతున్నారు. మా పిల్లలకు కుల గుర్తింపు సర్టిఫికెట్లను

ఇవ్వటం లేదు. దానితో వాళ్ళు స్కూళ్ళలోనూ, కాలేజీల్లోనూ ప్రవేశం పొందలేకపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే, వాళ్ళ భవిష్యత్తు పూర్తిగా నాశనమయిపోతుంది. ఇంకో దారిలేక వారు కూడా మాలానే పియ్యిపెంటలను ఎత్తే సఫాయి పనిలోనే కొనసాగాల్సివుంటుంది."

సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్‌కెఏ) జాతీయ కార్యదర్శి బెజవాడ విల్సన్ మాట్లాడుతూ ఈ విధానానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. ఈ పని నుంచి సమూహానికి విముక్తి కల్పించాల్సింది పోయి వారిని ఇంకా ఈ చీకటిలోనే వుంచేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

తెలంగాణలో సఫాయి కార్మికుల జీవితాలతో ఈ విధంగా ఆడుకోవటం వెనుక అధికార యంత్రాంగపు కులతత్వ స్వభావం ముడిపడివుంది. ఈ అమానవీయమైన పనిని నిర్మూలించాల్సిపోయి, ఆ పనిచేసే మనుషులనే నిర్మూలించేలా ఉంది వీరి ధోరణి. రాత్రికి రాత్రే మేము ఈ రాష్ట్రప్రజలం కాదని ఎలా నిర్ణయిస్తారు? వాళ్ళు వాళ్ళ కులాన్ని వదిలించుకోగలరా?

రెండు విధాలుగా ఈ సమూహం సమస్యలను ఎదుర్కొంటోంది. ఒకవైపు వారు తమ ప్రాథమిక హక్కులు పొందటానికి నిరాకరించబడుతున్నారు, మరోవైపు డ్రైనేజి లైన్లను, గుంటలను శుభ్రం చేస్తూ వాటిలో పడి చనిపోయిన తమ దగ్గరి బంధువులకు రావలసిన నష్టపరిహారం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. తమదగ్గరివారు వీటిలో పడి చనిపోతే ఆ స్త్రీలకు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవటం ఎంత కష్టమవుతోందనేది వారిని కలిసిన తర్వాతే అర్థమయింది. ఆశ్చర్యకరమైనదేమంటే ఈ చావులకు ఎవర్నీ బాధ్యుల్ని చేయటం లేదు. దీనికి సంబంధించి ఎవరికీ శిక్షలు పడవు. ఇవి కేవలం ఏవో కొన్ని దుర్ఘటనలు కాదు. ప్రభుత్వ యంత్రాంగం చేసే వ్యవస్థీకృత హత్యలు. వీరిని ఈ డ్రైనేజీల్లోకి దించే వ్యవస్థకు తెలుసు అలా దిగితే వారు చనిపోవచ్చుని. బతికి బయటపడితే అది వాళ్ళ అదృష్టం–లేకపోతే అది వాళ్ళ తలరాత అనుకునేలా చేస్తారు. డ్రైనేజీల్లో విషవాయువులు ఎక్కడ దాగివుంటయో చెప్పటం అంత సులభం కాదు.

ఒక చిన్నగుడిశె ముందు తన ఇద్దరు పిల్లలతో కూర్చున్న ఆమె ఏ ప్రభుత్వ పథకాన్ని పొందగల పరిస్థితిలో లేదు. ఆమె పేరు శ్రీలత. ఆమె పెద్దకూతురి వయసు ఏడేళ్ళు. "నేను హౌస్‌కీపింగ్ పని చేస్తాను. అంతకు ముందు చెత్తను ఏరేదాన్ని. కానీ, నా కూతురు తరచూ జబ్బు పడుతుండటంతో ఆ పని మానేసి వేరే పని ఇమ్మని అడిగాను. వాళ్ళు నాకు నెలకు రూ. 7300 ఇస్తారు. నాకు అటెండర్ గా పని ఇచ్చారు. ఇది నాకు చాలా ఉపయోగంగా వుంది. నా భర్త పేరు వి. చంద్రశేఖర్. డ్రైనేజీలను శుభ్రం చేసేవాడు. 2013 జూన్ 21న అతను ప్రమాదంలో చిక్కుకున్నాడు. మామూలుగా అయితే అతను బండి మీదే వుండేవాడు. నిజానికి ఇది మా మామయ్య పని. ఆయన మానసిక పరిస్థితి బాలేకపోతే ఆ పని మా ఆయనకు ఇచ్చారు. ఆరేళ్ళ క్రితం నుంచి నా భర్త ఈ డ్రైనేజీ పనిచేస్తూ

వచ్చాడు. అప్పుడు నా కొడుకుకి ఎనిమిది నెలలు. అతను వారానికి ఒకసారి చెత్త ఎత్తే మెషీన్ పనికి వెళ్ళేవాడు. నిజానికి ఆరోజు అతను వెళ్ళాల్సిన పని కూడా లేదు. మా దురదృష్టం. ఈ రోజు వరకూ కూడా ఆ డ్రైవర్ మా ఆయన్ని ఎందుకు తీసుకెళ్ళాడో నాకెవ్వరూ చెప్పను కూడా చెప్పలేదు. ఆ రోజు ప్రమాదం జరిగినట్టు కూడా నాకు తెలియదు. ఒక పోలీసాయన నా దగ్గరకు వచ్చి టీవీలో నా భర్తను చూపిస్తున్నారని చెప్పాడు. నేను పరిగెత్తుకుంటూ హాస్పిటల్‌కు వెళ్ళాను. కానీ నన్ను లోపలికి పోనీయలేదు. ఆ రోజంతా నేను మా ఆయన్ని చూడలేకపోయాను. ప్రమాదం జరిగిన చోటు నుంచి ఇద్దరు వ్యక్తులను హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. అందులో ఒకవ్యక్తి చనిపోతే పెద్దగొడవే జరిగింది. నన్ను సాయంత్రం వరకూ మా ఆయన్ని చూడనివ్వలేదు. అప్పటివరకు అతను బతికే వున్నాడు. ఒక కాలు, ఒక చెయ్యి పని చెయ్యడం లేదు. గుండె కొట్టుకుంటోంది. మాట్లాడలేకపోతున్నాడు. వేరే హాస్పిటల్‌కి వెళదామని, లేవమని చెప్పాను. కానీ అతను కన్నీళ్ళు పెట్టుకున్నాడు.” తల్లి ఏడుస్తూ ఈ విషయం చెబుతుంటే ఆమె ఇద్దరు పిల్లలు కన్నార్పకుండా ఆమెనే చూస్తూవున్నారు.

“ఆ రోజు జూన్ 21. మా పాప పుట్టిన రోజు” కూతుర్ని చూపిస్తూ చెప్పింది శ్రీలత. “ దాని కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం కానీ...ఆయనే మమ్మల్ని శాశ్వతంగా వదిలేసి వెళ్ళిపోయాడు.”

పెద్దపాప గ్రీష్మ మాట్లాడుతూ, “నేను నా పుట్టిన రోజు గౌనుని దాచుకున్నాను. దాన్ని నేను ఎవ్వరికీ ఇవ్వను” అంది.

పెద్దయిన తర్వాత నువ్వేం కావాలనుకుంటున్నావు అని నేను అడిగితే, “డాక్టర్” అని చెప్పింది వెంటనే.

“ఎందుకు?”

“అక్కడ డాక్టర్లెవరూ మా నాన్నని పట్టించుకోలేదు. ఆయన ఒళ్ళంతా ఆ పియ్యిమురికంతా వుంది. ఆయన్ని కనీసం ఎవరూ ముట్టుకోను కూడా ముట్టుకోలేదు. డాక్టర్లు సమయానికి వైద్యం చేసివుంటే ఆయన బతికేవాడు....కానీ ఇప్పుడు మాకు ఆయన లేడు.” ఆ అమ్మాయి నిశ్శబ్దంగా పరదా తొలగించి లోపలికి వెళ్ళి అల్మరా లోనుంచి తన తండ్రి ఫోటోను చేతిలోకి తీసుకుని బయటకు వచ్చింది. ఆ ఫోటోను గుండెలకు హత్తుకుని నెమ్మదిగా....“నాన్న!” అంది. ఆ తర్వాత గోడకు ఆనుకుని నిశ్శబ్దంగా వుండిపోయింది. తన తండ్రిలాగా ఈ విధంగా ఎవ్వరూ చనిపోకూడదని, తనలాగా వేరేపిల్లలు అనాథలవ కూడదని తనబిడ్డ డాక్టరవ్వాలనుకుంటోందని శ్రీలత మళ్ళీ చెప్పింది.

2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తన భర్త మరణానికి నష్టపరిహారంగా శ్రీలతకి పదిలక్షలు రావాల్సి వుంది. కానీ ఇప్పటివరకూ ఆమెకి ఒక్కపైసా కూడా రాలేదు. సఫాయి కర్మచారి ఆందోళన్ వారితో కలిసి పోరాడటానికి శ్రీలత సిద్ధంగా వుంది. ఆమె

ఇప్పుడు ఒంటరి కాదు. ఆమెతో పాటుగా వందలాది మంది మహిళలు కేవలం నష్ట పరిహారం కోసమే కాకుండా ఇలాంటి చావులకి వ్యతిరేకంగా మళ్ళీ మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే ధృడనిశ్చయంతో ముందుకి వస్తున్నారు. ప్రస్తుతానికి వారి గోడును ఎవ్వరూ వినిపించుకోవడం లేదనేది వాస్తవమే అయినప్పటికీ– వారి ఆగ్రహం, దుఃఖం, కొన్నిసార్లు నిరాశ...అయినప్పటికీ వారి పోరాటం ఆగేది ఎంత మాత్రం కాదు. ఇప్పుడు ప్రతి ఒక్కచావు గురించిన వివరాలు, అవసరమైన ఆధారాలు సేకరించడం, వాటిని న్యాయబద్ధంగా నిరూపించటమనేది వారిముందున్న పెద్ద సవాలు. అధికార యంత్రాంగం ఈ మరణాలకు నష్టపరిహారాన్ని చెల్లించాలనుకోవటం లేదు. అలాగే ఇలాంటి సంఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవటానికి కూడా సిద్ధంగా లేరు. డ్రైనేజీలను, సెప్టిక్‌టాంక్‌లను శుభ్రపరచడమనేది మనుషులతో కాకుండా ఆధునిక యంత్రాలను ఉపయోగించి చేయించాల్సిన అవసరం వున్నప్పటికీ మన రాజకీయ వ్యవస్థకు, అధికార యంత్రాంగానికి ఆ వైపుగా ముందడుగు వేసే చిత్తశుద్ధి లేదు.

శ్రీలత దుఃఖం మన కళ్ళముందున్న ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఎన్నో దు:ఖపూరితమైన వాస్తవ గాథలు మనచుట్టూ అనేకం వున్నాయి. గ్రీష్మ లాంటి పాపాయిలు కన్నీళ్ళతో తమ తండ్రుల గురించి చెప్పే వాస్తవాలను వినడానికి మనం సిద్ధంగా వున్నామా? ఈరోజు దేశవ్యాప్తంగా లక్షలాది మంది సఫాయి కార్మికుల జీవితాలు కులం పేరుతో ఈ పనికి నిర్బంధంగా ఎందుకు ముడివేయబడివున్నాయో ప్రశ్నించటానికి మనం సిద్ధంగా వున్నామా?

దేశంలో నూతన రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ సఫాయి కార్మికులను తమ రాష్ట్ర పౌరులుగా గుర్తిచటానికి నిరాకరిస్తోంది. కులగుర్తింపు కార్డులను ఇవ్వటానికి సిద్ధంగా లేదు. పైగా రాష్ట్రం నుంచి తరిమెయ్యాలని చూస్తోంది. కానీ తన సొంత ప్రజల పట్ల ఈ రకమైన నిర్లక్ష్యం చూపించడం ఏ రకమైన రాజకీయ పోరాటమవుతుంది? ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలిచ్చేవారే లేరు.

సమాజం వీటిని నిలదీసేంతవరకూ శ్రీలత లాంటి ఆడవాళ్ళు చికాకు పెట్టే ఈ ప్రశ్నల్ని మళ్ళీమళ్ళీ అడుగుతూనే వుంటారు. ఇతర సమూహాల్లోని ఆడవాళ్ళకు కానీ కుటుంబాలకు కానీ ఈ విధంగా జరిగితే ఇలాంటి నిశ్శబ్దమే వుంటుందా? గ్రీష్మ లాంటి పిల్లలు తమ తండ్రులు కొనిచ్చిన బహుమతులను గుండెలకు హత్తుకుని, డాక్టరు కావాలనే ఆశను పెంచుకోవటం ద్వారా కులపరమైన యేహ్యతను అంతం చేయగలుగుతారా? ఇది ఎప్పటివరకూ......

(2015 జూన్ జులై నెలల్లో తెలంగాణ రాష్ట్రం లోని హైదరాబాద్ నగరంలో పర్యటించి సేకరించిన అనుభవాల ఆధారంగా)

# ఈ పుస్తకం గురించిన ప్రశంసలు

## కళ్ళు తెరిపించే పుస్తకం-జాన్ డ్రీజ్

'అనేక గణాంకాల కంటే కూడా అతి సామాన్యమైన పదాలతో **భాషా సింగ్** భారతదేశ పాకీస్త్రీల కడగండ్లను, అలాగే వారి సామర్థ్యాలను శక్తివంతంగా ఈ పుస్తకంలో వివరించారు. ఎంతో సున్నితత్వంతో వారి జీవితాల్లోని అనేక బాధాకరమైన కోణాలను ఆవిష్కరించారు. అది వర్షాకాలంలో పనిలో వారుపడే దుర్భర పరిస్థితి కావొచ్చు లేదా వారిలో కొంత మంది తమ పనినే "వ్యాపారం"గా ఎలా మార్చుకున్నారో కావొచ్చు. వీటన్నిటికంటే కూడా క్రూరమైన కులవ్యవస్థలో వారి జీవితాలు ఎలా బందీ అయ్యాయో ఈ కథనాలు సూటిగా వివరిస్తాయి. మనమిప్పటివరకూ వినని, కనని, ఆలోచించని భారతదేశపు మరో పార్శ్వాన్ని మనముందుకు తీసుకువచ్చి మన కళ్ళు తెరిపిస్తుంది ఈ పుస్తకం'

***–జాన్ డ్రీజ్, ప్రముఖ అంతర్జాతీయ ఆర్థికవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌తో కలిసి ఎన్నో పుస్తకాలు రాశారు.***

'మనం సగర్వ భారతీయులం అని చెప్పుకోవటం అంటేనే, అత్యంత అవమానకరమైన పరిస్థితుల్లో మన ప్రజలు అమానవీయమైన పాకీపని చేస్తూ తమ చేతులతో తోటిమనుషుల పియ్యిపెంటలను ఎత్తుతున్నారనే వాస్తవాన్ని గుర్తించ నిరాకరించటమే. ఒకపక్కన చంద్రయానాలు చేస్తూ, మరోపక్కన ఐటి రంగంలో దూసుకెళ్తున్న తరుణంలో ఇది కొనసాగటం దిగ్భ్రాంతికరమైన విషయం. ఈ పుస్తకం అనేక గొంతులను ముందుకి తీసుకువచ్చింది. వీటిని మనం తప్పనిసరిగా విని సహానుభూతిని ప్రకటించాలి. తద్వారా ఈ అమానవీయమైన విధానాన్ని మన గత చరిత్రగా మార్చివేయాలి'

***–మల్లికా సారాభాయ్, ప్రముఖ నాట్యకళాకారిణి, సామాజిక కార్యకర్త.***

'నిజానికి ఎవ్వరూ కూడా ఈ బాధాకరమైన వాస్తవాన్ని అర్థంచేసుకోరు. తరతరాలనుంచే కాక ఇప్పటికీ ఈ నరకప్రాయమైన పరిస్థితులను భరిస్తూనే వున్నాం. వివిధ రాష్ట్రాల్లో వున్న ఈ ప్రజలను కలవటం ద్వారా వారి బాధలను భాషాసింగ్ శక్తివంతంగా తన రచనల్లో ప్రతిఫలించారు. పాకీపనిలో కునారిల్లిపోతున్న వారి కథనాలు ఇవి. నా ముందు తరాలవాళ్ళు అనుభవించిన అనేక కష్టాలను ఇది నాకు గుర్తుకుతెచ్చి, నన్ను మరింత బాధకు గురిచేసింది'

***–సుషీలా తక్భోరే, ప్రముఖ దళిత రచయిత***

'అంటరానితనం రాజ్యాంగ విరుద్ధమని ఆర్టికల్ 17 స్పష్టం చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత 1993లో లోక్‌సభ పాకీపనిని కొనసాగించటం చట్టవిరుద్ధమని గుర్తించి నిర్మూలించి తీరాలని ఒక చట్టాన్ని చేసింది. ఆ తర్వాత పదేళ్ళకి మరుగున

పడిన ఆ చట్టాన్ని వెలుగులోకి తెచ్చి కోర్టు దృష్టికి తీసుకువచ్చి దానికి జీవం పోయాల్సి వచ్చింది. ఇంకో దశాబ్దం కూడా గతంలోకి వెళ్ళిపోయింది. కానీ వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ఇంకా కొనసాగుతూనే వుంది. అంటరానితనాన్ని పాటిస్తూ కొన్ని తరాలను అమానవీయ విధానంలోనే బతికేలా చేస్తున్న విధానాలపై ఆ సమూహపు ప్రజల ఆగ్రహాన్ని, పోరాటాలను భాషా కథనాలు కళ్ళకుకట్టేలా చూపించాయి'

***–డాక్టర్  ఉషా రామనాథన్, అంతర్జాతీయ గుర్తింపు పొందిన న్యాయనిపుణురాలు.***

'కేవలం పుట్టుక ద్వారా తోటి మనుషుల పియ్యిపెంటలను ఎత్తి పారబోసే పాకీ పనిచేసే వ్యక్తుల, సమూహాల వాస్తవ పరిస్థితిని బయటపెట్టింది అన్‌సీన్ పుస్తకం. ఈ పనిని చాలా మంది ఊహించటానికి కూడా ఇష్టపడరు. రాసిన విధానంలో సహానుభూతి, లోతైన పరిశీలన, హాస్యం, మానవత్వం కలగలసి కనిపిస్తాయి ఈ పుస్తకంలో. పాఠకులు సాధారణంగా పియ్యిపెంటల మీద వుండే ఒక అసహ్యంలోకి వెళ్ళి, ఈనాటికీ ఈ దుర్మార్గమైన విధానాన్ని అమలుపరుస్తున్న వికృత సామాజిక వ్యవస్థల మీద ఆగ్రహాన్ని వ్యక్తంచేయక తప్పని పరిస్థితిని ఈ కల్పిస్తుంది ఈ పుస్తకం'

***–ఎమ్.వి.రమణ, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఫిజిసిస్ట్. 'ద పవర్ ఆఫ్ ప్రామిస్:ఎగ్జామినింగ్ న్యూక్లియర్ ఎనర్జీ ఇన్ ఇండియా' పుస్తక రచయిత.***

'విషపూరితమైన భారతదేశ కులవ్యవస్థతో ముడిపడివున్న అమానవీయమైన పాకీపనిని చాలా స్పష్టంగా బహిర్గతపరిచింది ఈ పుస్తకం. దీనిని ప్రతిఒక్కరూ చదివి తీరాలి. మరీముఖ్యంగా కులం ఉనికినే గుర్తించకుండా వాదించేవారు.'

***–డాక్టర్ ఆనంద్ తేల్‌తుంబ్డే, రచయిత, పౌరహక్కుల కార్యకర్త.***

'మానవత్వానికి ఏ అర్థంలో ఈ మనుషులు మనం ఏరిగిన పియ్యిపెంటలను ఎత్తుతున్నారు? స్వతంత్ర భారతదేశంలో పాకీ పనిచేసే పౌరుల తరుపు నుంచి ఈ ప్రశ్నను సూటిగా సంధిస్తోంది ఈ పుస్తకం'

***–మైత్రేయి పుష్ప, ప్రముఖ హిందీ రచయిత***

**పెంగ్విన్ బుక్స్ అన్‌సీన్**

జర్నలిస్టు, సామాజిక కార్యకర్త, రచయిత అయిన **భాషాసింగ్** పుట్టింది న్యూఢిల్లీలో. పెరిగింది లక్నోలో. లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఏ; ఎల్.ఎల్.బి పట్టాపొందారు. పాత్రికేయ వృత్తిలో భాగంగా 1996లో ఆమె తిరిగి ఢిల్లీ వచ్చారు. అప్పటికే ఆమె అమర్ ఉజాలా కరోబార్, అమర్ ఉజాలా, నవభారత్ టైమ్స్, ఔట్‌లుక్ వీక్లీ, నయా దునియాలలో పనిచేసి మళ్ళీ ఔట్‌లుక్‌కు వచ్చారు. ఉత్తర భారతదేశంలో పాకీపని గురించి, రైతుల ఆత్మహత్యల గురించి విస్తృతంగా రాశారు. పాకీపని గురించి పరిశోధించటానికి 2005లో ప్రభాదత్ ఫెలోషిప్ ఆమెకి లభించింది. కాన్పూర్‌లోని బాల్టీ–వాలీ, పశ్చిమబెంగాల్ లోని దబ్బు–వాలీ పాకీ స్త్రీల మీద రాసిన కథనాలకు 2007లో ఉత్తమ హిందీ జర్నలిస్టుగా రామ్‌నాథ్ గోయంకా పురస్కారం అందుకున్నారు. 2008లో పాకీ స్త్రీల ఆరోగ్యం గురించి పరిశోధనకు గానూ పానోస్ నుంచి ఫెలోషిప్ అందుకున్నారు. 2006–07 సంవత్సరాలలో ది నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐ) సంస్థ ఉత్తర భారతదేశంలో రైతుల ఆత్మహత్యలపై పరిశోధనకు ఫెలోషిప్ అందజేసింది. హిందీలో కథలు, కవితలు కూడా రాస్తారు. వీటిలో కొన్ని ప్రచురణ అయ్యాయి. ప్రస్తుతం ఆమె హిందీ ఔట్‌లుక్ పత్రికకు అసిస్టెంట్ ఎడిటర్‌గా వున్నారు.

రచయిత, అనువాదకురాలు రీనా తల్వార్ చండీఘర్‌లో నివసిస్తారు. ప్రముఖ హిందీ సాహిత్య పత్రికలలో ఆమె రచనలు ప్రచురితమయ్యాయి. ఆమె రచనల గురించి తెలుసుకోవాలనుకునేవారు www.anoodit.blogspot.in సందర్శించండి.

**కనపడనిది భారతదేశ పాకీవారి గురించిన వాస్తవాలు**

**భాషాసింగ్**

**హిందీ నుంచి అనువాదం రీనా తల్వార్**

అమానవీయమైన కులవ్యవస్థకు వ్యతిరేకంగా చారిత్రాత్మకమైన పోరాటాన్ని ప్రారంభించిన ఈ మహిళలకు, వారి సహచరులకు; తరాల తరబడి నెత్తిమీద పియ్యిపెంటల భారాన్ని నిర్బంధంగా మోస్తూ, నాగరీక సమాజం ముఖం మీదకి ఈ బుట్టలను విసిరేయాలనే బలీయమైన కోరిక మనసులో వున్నప్పటికీ అలా చేయలేని స్థితిలోవున్న స్త్రీలందరికీ....

**సజయ** – గత మూడు దశాబ్దాలుగా విద్యార్థి, మహిళా, దళిత, మైనారిటీ, ఆదివాసీ, ఇతర సామాజిక ఉద్యమాలతో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. స్వతంత్ర జర్నలిస్టుగా, డాక్యుమెంటరీ ఫిల్మ్ డైరెక్టర్‌గా, అనువాదకురాలిగా, సంపాదకురాలిగా, పబ్లిషర్‌గా, ఉద్యమనాయకురాలిగా బహుముఖంగా కృషిచేస్తున్న వ్యక్తి. స్త్రీల భూమి హక్కులపై చేసిన పరిశోధనాత్మక వ్యాసాల పరంపరకు ప్రతిష్టాత్మక నేషనల్ మీడియా ఫెలోషిప్

అవార్డు(2000), ఆకలిచావులు, రైతు ఆత్మహత్యలపై తీసిన డాక్యుమెంటరీకి యూనిసెఫ్ అవార్డు(2012), రైతు ఆత్మహత్యల తరువాత ఆ కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక సంక్షోభం పై రాసిన వ్యాసాలకు లాడ్లీ మీడియా అవార్డు(2015)అందుకున్నారు. కె.లలితతో కలిసి "సవాలక్ష సందేహాలు-స్త్రీల ఆరోగ్యం, సంస్కృతి, రాజకీయాలు", ప్రొఫెసర్ రమామెల్కోటెతో కలిసి "స్త్రీవాద రాజకీయాలు-వర్తమాన చర్చలు" సంకలనాలకు సంపాదకత్వం వహించారు. వార్త దినపత్రికలో స్త్రీల దైనందిన జీవిత రాజకీయాల గురించి రాసిన వ్యాసాలను 'ప్రవాహం' పేరుతో పుస్తకరూపంలో ప్రచురించారు. భూమిక పత్రిక వ్యవస్థాపకులలో ముఖ్యులుగా ఎనిమిది సంవత్సరాల పాటు(1992-1999) ప్రధాన బాధ్యతల్లో వున్నారు. ప్రస్తుతం కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ తరఫున రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల హక్కుల కోసం, వారి పిల్లల చదువులు కొనసాగేలా సామాజిక మద్దతు కూడగడుతూ, మహిళా రైతుల హక్కుల కోసం విధానపరమైన మార్పులకోసం కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సుస్థిర, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు ప్రత్యక్ష అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వ్యవసాయ విధానాలను విశ్లేషిస్తూ 'తొలిపొద్దు' పేరుతో 'నవతెలంగాణ' దినపత్రికలో కాలమ్ నిర్వహిస్తున్నారు. 1999లోనే పాకీ పనివారి జీవితాలపై 'ఎన్నాళ్ళీ అమానవీయం' పేరుతో వార్త దినపత్రికలో వ్యాసాన్ని రాశారు. అన్వేషి రిసెర్చి సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ సంస్థ ఉపాధ్యక్షురాలిగా, నివాసహక్కుల ఉద్యమవేదిక 'ఛత్రి' కు సలహాదారుగా వున్నారు.

## కళ్ళు తెరిపించే పుస్తకం ఇది

“ అనేక గణాంకాల కంటే కూడా అతి సామాన్యమైన పదాలతో భాషా సింగ్ భారతదేశ పాకీ పనివారి కడగండ్లను, అలాగే వారి సామర్థ్యాలను శక్తివంతంగా ఈ పుస్తకంలో వివరించారు. ఎంతో సున్నితత్వంతో వారి జీవితాల్లోని అనేక బాధాకరమైన కోణాలను ఆవిష్కరించారు. అది వర్షాకాలంలో పనిలో వారుపడే దుర్భర పరిస్థితి కావొచ్చు లేదా వారిలో కొంత మంది తమ పనినే “వ్యాపారం”గా ఎలా మార్చుకున్నారో కావొచ్చు. వీటిన్నిటికంటే కూడా క్రూరమైన కులవ్యవస్థలో వారి జీవితాలు ఎలా బందీ అయ్యాయో ఈ కథనాలు సూటిగా వివరిస్తాయి. మనమిప్పటివరకూ వినని, కనని, ఆలోచించని భారతదేశపు మరో పార్శ్వాన్ని మనముందుకు తీసుకువచ్చి మన కళ్ళు తెరిపిస్తుంది ఈ పుస్తకం.

**– జాన్ డ్రెజ్**

ప్రముఖ అంతర్జాతీయ ఆర్థికవేత్త,
నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌తో కలిసి ఎన్నో పుస్తకాలు రాశారు.

“ మనం సగర్వ భారతీయులం అని చెప్పుకోవటం అంటేనే, అత్యంత అవమానకరమైన పరిస్థితుల్లో మన ప్రజలు అమానవీయమైన పాకీపని చేస్తూ తమ చేతులతో తోటిమనుషుల పెంటలను ఎత్తతున్నారనే వాస్తవాన్ని గుర్తించ నిరాకరించటమే. ఒక పక్కన చంద్రయానాలు చేస్తూ, మరోపక్కన ఐటి రంగంలో దూసుకెళ్తున్న తరుణంలో ఇది కొనసాగటం దిగ్భ్రాంతికరమైన విషయం. ఈ పుస్తకం అనేక గొంతులను ముందుకు తీసుకువచ్చింది. వీటిని మనం తప్పనిసరిగా విని సహానుభూతిని ప్రకటించాలి. తద్వారా ఈ అమానవీయమైన విధానాన్ని మన గత చరిత్రగా మార్చివేయాలి'

**– మల్లికా సారాభాయ్**

ప్రముఖ నాట్యకళాకారిణి, సామాజిక కార్యకర్త.

“ కేవలం పుట్టుక ద్వారా తోటి మనుషుల పియ్యిపెంటలను ఎత్తి పారబోసే పాకీ పనిచేసే వ్యక్తుల, సమూహాల వాస్తవ పరిస్థితి బయటపెట్టింది అన్‌సీన్ పుస్తకం. ఈ పనిని చాలా మంది ఊహించటానికి కూడా ఇష్టపడరు.

**– ఎమ్.వి. రమణ**

ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఫిజిసిస్ట్.
'ద పవర్ ఆఫ్ ప్రామిస్: ఎగ్జామినింగ్ న్యూక్లియర్ ఎనర్జీ ఇన్ ఇండియా' పుస్తక రచయిత